# కథ 2021

ముల్కనూరు సాహితీ పీఠం - నమస్తే తెలంగాణ

కథల పోటీ 2021

# కథ 2021

ముల్కనూరు సాహితీ పీఠం – నమస్తే తెలంగాణ
కథల పోటీ 2021

# Katha 2021

Mulkanooru Sahithi Peetam- Namaste Telangana
Kathala poti

Print Year 2022
Copies 1000

**Cover Page Art :**

**Mallibhat Vasu**

Cell :8555905965

Book Design : vinoo

**Price : Rs. 350**

For Copies :
Pramodh Reddy:
94416270804
&

**Amazon.in**

# అక్షయం.. అక్షరం!



**తిగుళ్ల కృష్ణమూర్తి**
**ఎడిటర్, నమస్తే తెలంగాణ**

***వార్త.. నిజాలను చెబుతుంది.***
***పాఠకుడిని ఆలోచింపజేస్తుంది.***
***కథ.. అవే నిజాలకు***
***నాటకీయతను అద్దుతుంది.***
***పాఠకుడిని కదిలిస్తుంది.***
***పెనునిద్దుర వదిలిస్తుంది.***
***.. వార్త అనే చేదుమాత్ర మీద పూసిన చక్కెరపాకమే కథ.***

రెండు ప్రక్రియల లక్ష్యం ఒక్కటే.. మంచి సమాజం.

రెండు ప్రక్రియల మాధ్యమం ఒక్కటే.. అక్షరం.

కాకపోతే, వార్త మెదడులో ప్రాసెస్ అవుతుంది. కథ హృదయంలో ప్రాసెస్ అవుతుంది.

అవినీతి, స్వార్థం, విలువల పతనం, బీటలువారుతున్న బంధాలు..

పత్రికలో వచ్చే ప్రతి కథనం ఓ మంచికథకు ముడిసరుకే.

సాధారణ పాఠకుడితో పోలిస్తే, పత్రికా పాఠకుడిలో సామాజిక స్పృహ ఎక్కువ.

రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక పరిణామాలను బేరీజు వేయడంలో నేర్పరి కూడా.

ఆ పాఠక దేవుళ్ల దృష్టికోణం నుంచే 'బతుకమ్మ' కథల వేట, ఎంపిక ఉంటుంది.

ముల్కనూరు సాహితి పీఠం భాగస్వామ్యంలో.. ఆ అన్వేషణ సులభతరమైంది. ఏడాది తిరిగేసరికి.. గుట్టలకొద్దీ కొత్త కథలు మా ఇన్‌బాక్స్‌లో పడిపోతున్నాయి. దేనికదే అత్యుత్తమం. ఆ రచనలు అన్ని తరాలకూ, అన్ని స్వరాలకూ ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. నమస్తే తెలంగాణ– ముల్కనూరు సాహితీ పీఠం అక్షర బంధం.. పత్రికకు మంచి కథలను ప్రోత్సహించే వేదికగా నిలుస్తున్నది. పాఠకులకు ఉత్తమ సాహిత్యాన్ని అందిస్తున్నది. తెలుగు సాహితీ సరస్వతికి ఏటా ఓ సంకలనాన్ని మహా నైవేద్యంగా సమర్పిస్తున్నది. అక్షయమైనది ఈ అక్షర సేవ. నమస్తే తెలంగాణ– ముల్కనూరు సాహితి పీఠం కథామైత్రి.. ఇంతే ప్రగాఢంగా కొనసాగాలని కోరుకుంటూ..

# మేము సైతం



**వేముల శ్రీనివాసులు**
**ముఖ్య సలహాదారులు,**
**ముల్కనూరు సాహితీ పీఠం**

"యద్భావం తద్భవతి" అనే మాట ముల్కనూరు ప్రజా గ్రంథాలయం - నమస్తే తెలంగాణ సంయుక్తంగా నిర్వహిస్తున్న కథల పోటీకి సంబంధించి అక్షర సత్యం. తెలుగు కథ సాహిత్య ఉన్నతికి మన వంతు కృషి చేద్దాం అన్న సంకల్పం తీసుకున్న నాటి నుండి నేటి వరకు మా ప్రయత్నాలు మంచి ఫలితాన్నిచ్చాయి. కథా-2021 ముచ్చటగా మూడో కథల పండుగ. 2019, 2020 ల మాదిరిగానే విశేష స్పందన వచ్చింది. ఈ కథల పోటీకి జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతి రావడం మా మీద మరింత బాధ్యత పెరిగింది.

పోటీకి వచ్చిన వందల కథల్లో మంచి కథలను గుర్తించి ఆరుగురు న్యాయ నిర్ణేతలకు కథ రచయితల పేర్లు లేకుండా.. కథలను పంపించాం. వారి నిర్ణయానికి అనుగుణంగా ఫలితాలను ప్రకటించడం మేము చాలా పవిత్రంగా చేస్తున్న యాగం.

కథ వస్తువును, శిల్పంను చక్కగా మలిచి రచయితలు ఎన్నో మంచి కథలను పోటీకి పంపారు. సంచార జాతులు జానపద కళారూపాలు పొట్టకూటికి ఇబ్బంది పడుతున్న స్థితిని 'డిమ్కీ' కథలో యువ రచయిత్రి స్ఫూర్తి కందివనం పాఠకుల్ని వారి జీవితాల్లోకి తీసుకెళ్లి ఆ బాధలో సహానుభూతి పొందేలా చెప్పిన తీరు ఈ సంవత్సరపు అగ్ర తాంబూలానికి అర్హత పొందింది. నెల్లుట్ల రమాదేవి గారి 'పొద్దు గూకకముందే' కథ చక్కని మాండలికంలో తల్లికి బిడ్డల మీద ప్రేమ మాత్రమే కాదు, ప్రపంచీకరణ నేపథ్యంలో వస్తువే ఆర్థిక సామాజిక మార్పులను తట్టుకుని ఎలా నిలబడాలో తెలిసిన మేధావిగా చూసిన తీరు గొప్పగా ఉంది.

చందు తులసి తన మోదుగు పువ్వు కథలో అమ్మాయి పుట్టగానే తండ్రి తనకు ఆపద వచ్చిందనే మనస్తత్వం నుండి కొడుకయితే చేతికి అందిస్తాడనే పిచ్చి ఆలోచన నుండి బిడ్డకు పెట్టిన కష్టాలు, తర్వాత ఆ బిడ్డ గొంగళి పురుగు సీతాకోకచిలుకగా మారిన చందాన అన్ని పరీక్షలు నెగ్గి నిజాయితీగా నిలవడం.. మోదుగు విత్తనం కొన్ని సంవత్సరాల తర్వాత అనుకూలత ఏర్పడగానే మొలకెత్తి జీవ చైతన్యాన్ని చాటినట్లు.. ఎవరైనా కష్టాలుంటే పారిపోవద్దని బతికి కొట్లాడాలని చూపిన మంచి కథ.

నస్రీన్ ఖాన్ 'దిశ మార్చుకున్న గాలి' తో బిడ్డ విడాకుల విషయంలో మధ్య తరగతి ముస్లిం కుటుంబపు సంఘర్షణను సాక్షాత్కరించారు. పొసగని భయంకరమైన సంసారంలో బాధితురాలిగా ఉన్న స్త్రీ వివాహ బంధం నుండి బయటకు రావడానికి ఎంత కష్టమో. మధ్యతరగతి మనస్తత్వంలో తమ తల్లిదండ్రులు సమాజం ఏమనుకుంటుందో అనే బాధలో ఉన్నారే తప్ప, బిడ్డ పడుతున్న కష్టాల గురించి ఆలోచించకపోవడం, త్వరగా అక్క జీవితం నేర్చుకున్న పాఠాల నుండి చెల్లి ఏ విధంగా తన దిశను మార్చుకుందో చక్కగా చెప్పిన కథ. కాటుక కన్నుల సాక్షిగా కథలో వేణు మారేడు ప్రతి పాఠకున్ని బాల్యంలోకి, కౌమారంలోకి సుకెళ్ళాడు.అలా ఒక్కో కథలో ఒక్కో వైవిధ్యం, వైవిధ్యతా కనిపిస్తుంది. వేటికవే గొప్ప సామాజిక సందేశాన్నిస్తాయి. ఇలాంటి ఎన్నో మంచి కథలకు ముల్కనూర్ పెద్దపీట వేయడం, ఆధునిక కాలంలో జరుగుతున్న ఈ సాహిత్య సేవ మేము అదృష్టంగా భావిస్తున్నాం.

ముల్కనూర్ సాహితీ పీఠం ద్వారా మహాయజ్ఞంలాంటి కార్యక్రమాల విజయవంతానికి ముల్కనూరు మిత్రబృందం కృషి ఎనలేనిది. వారికి ప్రత్యేక ధన్యవాదాలు. కార్యవర్గ సభ్యులందరి ఉమ్మడి కార్యచరణ, కృషితో ఏటా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఈ ఏడాది సరస్వతీ మాత ఆలయ నిర్మాణానికి విజయవంతమైంది. పిల్లల కోసం క్విజ్, వ్యక్తిత్వ, వ్యాస రచన, ఆటల పోటీలు నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. ముల్కనూర్ సాహితీ పీఠం చేస్తున్నా ఈ సాహితీ సేవకు దేవుని కృప, తెలుగు పాఠకుల, సాహితీ ప్రేమికుల ఆరాధన ఎప్పుడూ ఉండాలని ఆశిస్తున్నాను.

# కృతజ్ఞతలు

కథ 2021 విజయవంతం కావడానికి ఆర్థిక సాయం చేసిన మహా కవి శ్రీ గింజల నరసింహ రెడ్డి గారికి, సహృదయులు శ్రీ మల్రాజు జనార్ధన్ రావు గారికి, సహృదయులు శ్రీ మాడుగుల రంగా రావు గారికి, ధన్యవాదాలు, కృతజ్ఞతలు.

వందల కథలను చదివి ఉత్తమ కథలను ఎంపిక చేసిన జడ్జిలకు, ఎంపికైన ప్రతి కథను వారం వారం ప్రచురించిన నమస్తే తెలంగాణ బతుకమ్మకు, ఈ విశిష్ఠ కార్యంలో పాలుపంచుకున్న యాజమాన్యానికి ఎడిటర్ కృష్ణ మూర్తి గారికి, ఫీచర్స్ ఎడిటర్ కరణం జనార్ధన్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు. ప్రతి ఏటా సంకలానికి తన సృజనాత్మకతకు పదును పెట్టి ముఖచిత్రం వేస్తున్న మల్లిభట్ వాసు గారికి ఎంతో ధన్యవాదాలు.

పోటీకి వచ్చిన వందల కథలను చదివి, మంచి కథలను గుర్తించిన

# ఆరుగురు న్యాయ నిర్ణేతలు



పెద్దింటి అశోక్



గింజల మధుసుధన్



విష్ణు వర్ధన్ రాజు



అనంత కుమార్



కోడూరి విజయ్ కుమార్



గోగు శ్యామల

## నమస్తే తెలంగాణ - ముల్కనూరు ప్రజా గ్రంథాలయం

# కథల పోటీ - 2021 విజేతల వివరాలు

| క్ర.సం. | కథ పేరు | రచయిత పేరు |
|---|---|---|
| **మొదటి బహుమతి (1) :** | | |
| 1 | డిమ్మి | స్ఫూర్తి కందివనం |
| **ద్వితీయ బహుమతులు (2) :** | | |
| 2 | మోదుగు పువ్వు | చందు తులసి |
| 3 | దిశ మార్చుకున్న గాలి | నస్రీన్ ఖాన్ |
| **తృతీయ బహుమతులు (3) :** | | |
| 4 | పొద్దు గుంకక ముందే | నెల్లుట్ల రమాదేవి |
| 5 | కాటుక కన్నుల సాక్షిగా | వేణు మరీదు |
| 6 | బోగ్గిరి టూ లష్కర్ | డా.ప్రభాకర్ జైనీ |
| **ప్రత్యేక బహుమతులు (10) :** | | |
| 7 | కీడు గుడిసె | బొడ్డేడ బలరామ స్వామి |
| 8 | విష వలయం | అనిశెట్టి శ్రీధర్ |
| 9 | ఉల్టా బాజా | సయ్యద్ గఫార్ |
| 10 | పడగ నీడ | సలీం |
| 11 | తండ్లాట | అరుణ్ కుమార్ ఆలూరి |
| 12 | అద్దంలో మూట | త్రివిక్రమ్ |
| 13 | వ్యత్యాసం | నామని సుజనా దేవి |
| 14 | అంబేద్కర్ మనవాడు | మంచికంటి |
| 15 | జీవిత పాఠం | భాస్కరా చారి కశిపొజ్జల |
| 16 | వారసత్వం | రాజ మోహన్ |
| **రూ.5వేల బహుమతి కథలు (6) :** | | |
| 17 | సహన శీలి | ఎం.టి. స్వర్ణలత |
| 18 | బతుకమ్మ | డాక్టర్. శ్రీదేవి శ్రీకాంత్ |
| 19 | అర్ధనారి | మండ శ్రీకర్ |
| 20 | ప్రేమంటే ఏమిటి? | బలభద్రపాత్రుని ఉదయ శంకర్ |
| 21 | శర్వమ్మ మరణం | జయంతి వాసరచెట్ల |
| 22 | ధీర వనిత | ఎనుగంటి వేణుగోపాల్ |

## రూ.2వేల బహుమతి కథలు (10) :

| | | |
|---|---|---|
| 23 | విశ్వాసపాత్రుడు | వై.ఎల్.వి. ప్రసాద్ |
| 24 | అపరంజి | తులసి బాలకృష్ణ |
| 25 | ఇంకా తెలవారదేమీ! | ఉమా మహేశ్ ఆచళ్ల |
| 26 | భద్రత | కె.విజయేంద్ర ప్రసాద్ |
| 27 | కాముని కంత | హుమాయూన్ సంఘీర్ |
| 28 | బుడ్డ శనగ | మ్యాకం రవి కుమార్ |
| 29 | అప్పుడు | కటుకోజ్వల మనోహరా చారి |
| 30 | మట్టి పరిమళం | బి.వి.రమణ మూర్తి |
| 31 | అయినా మనిషి మారలేదు! | సంగనపట్ల నర్సయ్య |
| 32 | నాటు పడింది | వివేకానంద రెడ్డి లోమటి |

## రూ.వెయ్యి బహుమతి కథలు (28) :

| | | |
|---|---|---|
| 33 | రోహిణీ ఐపిఎస్ | తటవర్తి నాగేశ్వరి |
| 34 | బతుకు బొమ్మ | హైమావతి కలివే |
| 35 | అస్థిత్వం | గాగోజు నాగభూషణం |
| 36 | నిషేధిత స్వప్నం | కడెం లక్ష్మీ ప్రశాంతి |
| 37 | సెల్యూట్ | శ్రీ సుధామయి |
| 38 | ఆడ పులి | పుట్టగంటి గోపీకృష్ణ |
| 39 | బోగం ఎంకటి | చిప్పబత్తు శ్రీనివాస్ |
| 40 | నేరము - శిక్ష | ఇంద్రగంటి నరసింహ మూర్తి |
| 41 | మళ్లీ విత్తనంలోకి | సింహ ప్రసాద్ |
| 42 | ఫుట్‌బాల్ | కె.వి.ఎస్.వర్మ |
| 43 | ఆకలి | దాసరి వెంకట రమణ |
| 44 | మొట్టమొదటి కడపటి వాడు | డా.కె.ఎల్.సుధాకర్ |
| 45 | పావురాలు | కె.వరలక్ష్మి |
| 46 | ఫుట్‌బాల్ | టి. సంపత్ కుమార్ |
| 47 | బోగన్విలియా | అమృత లత |
| 48 | స్వాతంత్ర్యం | చింతకింది శివశంకర్ |
| 49 | వస్తు మారకం | డాక్టర్ ఎం.సుగుణ రావు |
| 50 | ది అన్‌టోల్డ్ స్టోరీస్ ఆఫ్ ఉమెన్ సప్రెషన్ | పద్మజా బొలిశెట్టి |
| 51 | గడువు | రావుల పుల్లాచారి |
| 52 | నిరుపేద | ఎం.సూర్య ప్రసాద రావు |
| 53 | జీవన తీరాలు | బద్రి నర్సన్ |
| 54 | వడ్లు | రాయపాటి హైమావతి |
| 55 | బతుకే ఓ కయ్యం | డాక్టర్ జనపాల శంకరయ్య |
| 56 | మూడు దావల దిష్టి | పాలగిరి విశ్వ ప్రసాద్ |
| 57 | యోగక్షేమం వహామ్యహమ్ | బి.లక్ష్మీ గాయత్రి |
| 58 | వెనుకకు నడుస్తున్న మనిషి | బి.మురళీధర్ |
| 59 | నీవు పాడే పాట | ఎం.రామలక్ష్మి |
| 60 | కాకతీయ కేతనం | మత్తి భానుమూర్తి |

## విశిష్ట బహుమతులు (4) :

| | | |
|---|---|---|
| 61 | కొలిమి | రామా చంద్రమౌళి |
| 62 | సాధనా శూరత్వము | ఐతా చంద్రయ్య |
| 63 | మట్టి బంధం | ఎ.ఎం. అయోధ్య రెడ్డి |
| 64 | ఆకాశం | గుమ్మడి రవీంద్రనాథ్ |

# డిమ్కి



స్ఫూర్తి కందివనం

**'దైవాన దైవానందాన..**
**నేనెల్లిపోతా భాగమంతా.. దైవాన దైవానందాన..**
**ధనముందీ భాగ్యముందీ శంకరా.. దైవాన దైవానందాన..**
**కడుపూ.. లోపటా సంతూ బలమూ లేదయ్యా.. దైవాన దైవానందాన!'**

తెల్ల నిలువుటంగీ తొడుక్కొని, తలకు గులాబీ రంగు తలపాగా చుట్టుకొని, భుజానికి జోలె, ఆనిగెపుకాయ బుర్ర (తంబూర) తగిలిచ్చుకొని, ఎడమ చేతి వేళ్లకున్న అందెలను తంబూరకు తట్టుతూ, కుడి చేతి వేళ్లతోని తంబూర తీగలను లయబద్ధంగా మీటుకుంటూ ఓ ఇంటి గేటు ముందర నిలవడి పాడుతున్నడు శంకరయ్య. అతని కండ్లు ఎంత తూడ్సుకున్నా తడి తడిగనే ఉంటున్నయ్. పాడుతుంటే నడ్మ నడ్మల గొంతు బొంగురువోతున్నది. గుండెలున్న బాధ సముద్రపు అలల్లాగ ఉప్పొంగుకొస్తుంటే.. ఆ బాధను దిగమింగుకుంట అట్లే పాడుతున్నడు.

కొద్దిసేపటికి ఒకాయన బయటికొచ్చి..

'మొన్న గుడ్క నీవే గదా వొచ్చింది. మొన్న రెండ్రూపాలిస్తిగద! మల్లొచ్చినవా? అందుకే ఇయ్యగూడదు. ఒక్కసారిస్తే మల్ల మల్లొస్తరు. పో.. పో.. ఇప్పుడేం లేవు పో!' అని కసిరిండు.

'అయ్యా.. సారూ! కాల్మొక్త బాంచన్! ఎంతో అంత ఇయ్యి సారూ! పున్యముంటది!' దీనంగ బతిమ్లాడిండు శంకరయ్య.

'అరే.. పొయిరా పోయ్యా.. ఇప్పుడేం లేవంటున్న గద' చెప్పి ఎల్లిపోయిండతను.

తంబూరను మల్ల వాయించుకుంట ఇంగో ఇంటి ముందుకు వొయి పాడుతున్నడు శంకరయ్య.

'బిడ్డె బలమూ దీసుకోని యెల్లిపోరాదా..

అయ్యో రామా.. దేవా రామా!

దేవా రామో.. దైవ రామా..

యేమే వో బాల నాగు బిడ్డె బలమూ నీవద్దకొస్తది..

బిడ్డ బలమూ ఇత్త నీకు.. తీసుకోని యెల్లిపోరాదా!'.

ఓ పోరగాడు గుమ్మం బయిటికొచ్చి రెండు చెవులల్లున్న ఇయర్ ఫోన్లు బయిటికి దీసి..

'పొద్దున్పొద్దున్నే యేమ్ లొల్లి వెట్టినవయ్యా..! పోయిరాపో..' అని గదిరిచ్చి, మల్ల చెవులల్ల ఇయర్ ఫోన్లు కుక్కుకొని ఇంట్లకు వోయిండు.

ఇసొంటి అగుమానాలు కొత్తేమి కాకున్నా, ఇయ్యాల ఆ మాటలకు గుండెల కలుక్కుమంటున్నది శంకరయ్యకు.

చిన్నగ ముందుకు నడిచిండు. ఆ గల్లిపొంటి వర్సగ ఒక్కో ఇంటి ముంగట నిలవడి పాడిండు. అదే అగుమానం మల్లమల్ల ఎదురయ్యింది.

ఆఖరుకు ఆ గల్లీ చివరి ఇంట్లకెల్లి ఓ ముసలామె బయిటికొచ్చింది. ఆశగ ఆమె చేతుల దిక్కే జూసిండు. ఆమె చేతిలున్న గిన్నె జూసి ఆమె తెచ్చేది పైసలు గాదు.. సద్ది బువ్వనో, ఎండిన రొట్టె ముక్కలో, నూకలో అయ్యుంటయని అర్థమయ్యింది శంకరయ్యకు.

నిరాశగ నిట్టూర్చిండు.

జోలెల ఇన్ని నూకలు వోషి పోయిందామె. అండ్ల అక్కడక్కడ నల్లరాళ్లతోపాటు పురుగులు గూడ ఉన్నయి.

'నాయిన! ఇయాలనన్న నూకలన్నం వొండుకుందమే. మూడ్రోజులకేంచి బిస్కోట్లే తింటున్నం. మొకం గొట్టినట్టయ్యింది. కడుపుల బాగ నొప్పి గుడంగ లేస్తున్నది'.. ఇంటినుంచి వొచ్చేటప్పుడు చిన్న బిడ్డన్న మాటలు యాదికొచ్చినయ్. జోలెను సర్దుకొని మల్ల ఇంకో గల్లీకి వోయిండు. ఆడ కొన్ని ఇండ్లు తిరిగినాక ఓ ఇంటామొచ్చి రెండు రూపాయి బిళ్లలిచ్చింది.

‘గీ రెండ్రూపాలకేమొస్తయమ్మ..! కాల్మొక్త తల్లి.. జెర సూశియ్ తల్లి...’ అన్నడు.

‘అగనే..! పాపం గదా అంటాని పాత సీరిస్తే, గోడ సాటుకుబోయి మూరేసుకొని పైట కొంగు సాలదని పంచాయితీకొచ్చిందంట ఎన్కటికి నీ అసొంటిదే! ఎంతనో అంత ఇస్తి గద.. పోయిరాపో ఇగ’ కసిరి లోపలికెళ్లిపోయిందామె. మొకమంత చిన్నగ జేస్కొని అక్కడి నుంచి కదిలిండు శంకరయ్య.

‘భలె భలె రామన్నా రాయుడా..

అయ్యో.. భలె భలె రామా రాయుడు.. రాయుడు!

భలె భలె రామా రాయుడా.. రాయుడా..

రాయుడు కొండలరాయుడే.. రాయుడు!

రాయుడు ఏడుకొండల రాయుడే.. రాయుడు..’

సందులల్ల గొందులల్ల ఇల్లిల్లు దిరిగిండు. ఊరంత దిరిగిండు. గొంతెండుకపోయినా పాడిండు. కానీ, అంతగలిపి వంద రూపాలు గుడ్క పోగు గాలేదు.

‘పొద్దట్సంది దిరుగుతుంటే ఇవిన్నే వొచ్చినయ్. గిప్పుడెట్ల! యేమ్ జేతు.. యాడికి వోదు..’ తనలో తానే రందివడ్డడు.

‘థు.. నీయవ్వ! యేమ్ బత్కులో ఏమో. ఊర్లపొంటి దిరుగుడు, గుడిసెలేసుకొనుడు, కథలు జెప్పుడు, పాటలు వాడుడు. అడుక్కదినుడు! గింతేనా మా బత్కులు! గీ ఉరుకులాట ఉత్తచాటనేనా? యేమ్ రాత రాశినవయ్యా మాకు. గిదేం జీవితమిచ్చినవ్ మాకు! గీ అడుక్కునే పని మాకప్పజెప్తివి.. నీ గుడిల మన్నువొయ్య! రూపాయికి.. ఆతానకు.. శారడు గింజలకు యేమ్ దిరుగుల్లివి’.. గుండెలున్న ఆవేదనంతా యెల్లగక్కిండు. లొట్టలు వడ్డ చెంపల గుంతలకెల్లి కండ్ల నీళ్లు గారి కిందకు జరజరా రాలిపడుతున్నయ్.

సూర్యుడు నడినెత్తి మీదికొచ్చిండు. చెమట వట్టిన మొకాన్ని తుండు గుడ్డతోని తూడ్సుకుంట నడుస్తున్నడు.

అతని పొట్ట ఎముకలకు అంటుకపోయింది. అయినా ఓపికదెచ్చుకొని అడుగులేస్తున్నడు. ఎటు జూసినా కండ్ల ముంగట సుక్కమ్మనే మెదులుతున్నది.

***

తెలంజామున.. కూచున్నచోటనే కునికిపాట్లు పడుతున్న శంకరయ్యకు సడన్ల ఎవరో వొచ్చి గట్టిగ నూకినట్టనిపిచ్చెటాలకు ఉలికిపడి కండ్లు దెరిసి జూసిండు. నిన్నటిసంది మూసిన కన్ను తెరవలేకుండున్న తన పెండ్లాం సుక్కమ్మ చేయి వట్టుకొని, రాత్రంత ఆమె పక్కన్నే కూచున్నడు. ఎప్పుడు నిద్రవోయిండో అతనికే తెల్వదు. రాత్రంత వెచ్చగనే ఉన్న సుక్కమ్మ చేయి.. పొద్దటికి సల్లగనిపిచ్చింది. బెదురుబెదురుగా

ఆమె మొకంలకు తొంగి జూసిండు. ప్రశాంతంగ నిద్రవోతున్నది. కాదు.. నిద్రవోతున్నట్టు ఉంది.

చూస్తుండంగనే పొద్దు పొడుచుకొచ్చింది. సుక్కమ్మ నిద్రలనే అస్తమించిందని అర్థమయిన శంకరయ్యకు ఒక్కసారిగా గుండెలు లబలబమన్నయ్. మొదటిసారి ఆమె చేయి పట్టుకుంటే శంకరయ్యకు చెయ్యి వొణికింది. నెత్తి దిమ్మన్నది. ఉలుకూపలుకూ లేకుండ అట్లే ఉండిపోయిండు. కొద్దిసేపటివరకు మైండు పన్జేయలేదు.

'నన్నిట్ల ఆగం జేసి పోతవనుకోలేదు సుక్కమ్మ!'..

తన కండ్ల నీళ్లు తన మాట వినలేదు. పిల్లలు ఎక్కడ నిద్ర లేస్తరో, తల్లి ఊపిరిడిసిందని దెలుస్తే యాడ గుండెవల్గుతరోనని ఏడుపు బిగవట్టుకున్నడు.

అంతలనే ఏదో మతికొచ్చినోడిలాగ తన అంగి జేబుల చేయి వెట్టి జూస్కున్నడు. ఎంత దేవులాడినా ఓ పది రూపాల నోటు, నాలుగు రూపాయి బిళ్లలు తప్ప ఇంకేం దొరికిలేవు.

'సుక్కమ్మను సాగనంపేదెట్లా..! గీ శిల్లర తప్ప నాతాన ఇంగేం లేవు. కనీస్రం పాడెగట్టనీకె గుడంగ పైసల్ లేవు. థు.. బత్కుల మన్నువడా!'. శంకరయ్య కండ్లపొంటి బిరబిరా నీళ్లు గారినయ్. పానమంత కశిబిశయ్యింది. యెక్కడ దోస్తలేదు.

'నాయిన.. ఏంటికే గంతగానం ఫికర్జేస్తున్నవ్! ఏం గాదులే. అమ్మకు మంచిగయితది గాని'.

అప్పుడే నిద్ర లేసొచ్చిన తన పన్నెండేండ్ల కొడుకు మొకం జూడంగనే ఇంగింత యేడ్పొచ్చింది శంకరయ్యకు.

చేతిలున్న చిల్లర పైసల దిక్కు జూసిండు. సుక్కమ్మకు పానం బాగలేనప్పట్సంది ఎప్పుడన్నిట్ల పదో పరకో ఉన్ననాడు పొద్దుగాల్నే ఇంత నీళ్ల చాయ్ వెట్టి, పక్క గల్లీలున్న మల్లయ్య దుకునం కాడికి వొయి ఆమె కోస్రం డబల్ రొట్టె దెచ్చెటోడు. సుక్కమ్మకు చాయ్ల డబల్ రొట్టె అద్దుకొని తినడమంటే చానిష్టం. పోయిన వారం ఆమెకు మందులు కొనంగ మిగిలిన చిల్లరతోని తెచ్చిండు.

డబల్ రొట్టె తెచ్చిన్నాడు తృప్తిగ తిని గోలీలేసుకునేది. లేకుంటే వట్టి చాయ్ తాగి ఏసుకునేది. చాపత్త లేన్నాడు వట్టిగనే ఏసుకొని కడుపునిండ నీళ్లు తాగేది.

వందల రూపాలు వెట్టి గోలీలు దెచ్చుకునే సొక్రం లేక ఈ మధ్య అయి గుడ్క లేకుండయినయ్. వట్టి నీళ్లే తాగుతున్నది.

'ఇగిప్పుడు మల్లయ్య దుకునం కాడికి వొయ్యే పన్లేదు' మనసులనే అనుకొని, గుడ్లనిండ నీళ్లు వెట్టుకున్నడు.

'గీ.. పై.. సలు కొండవోయి నీకు, తమ్ముడికి, శెల్లెల్లిద్దరికి బిస్కోట్లు దెచ్చుకొని తినుండ్రి' అన్నడు. గొంతులో ఎక్కడలేని తత్తరపాటు.

'వొద్దులే నాయిన! అమ్మకు డబల్ రొట్టంటే ఇష్టం. ఇయి అమ్మ కోసమని తీష్పెట్నం గద. మేము సద్ది బువ్వ అడుక్కొచ్చుకుంటంలే! ఎవలన్న వెడ్తే తెచ్చుకొని తింటంగాని. నీవేమ్ ఫికర్జేయకు. ఇయాలనన్న అమ్మ లేషి గింత ఎంగిలివడ్తే మంచిగుండు'.. అంటున్న కొడుకు కండ్లల్లోకి సూటిగ జూడలేకపోయిండు.

'ఇగ మీయమ్మ కోసం పైసలు దీష్పెట్టే అవ్సరం లేదు బిడ్డా!'.. పైకి అనే ధైర్నం రాక, మనసులనే అనుకున్నడు.

'తల్లి గురించి గిప్పుడే దెలుస్తే నేనొచ్చేటాలకు పిల్లలెంత బుగుల్వట్కుంటరో. గందికే గిప్పుడు జెప్పకపోవుడే మంచిది' అనుకున్నడు.

'ఇవి నీతాననే ఉంచు బిడ్డా! నేనట్ల ఊర్లక్వోయొస్త!'. కొడుకు చేతికి పైసలిచ్చి నెత్తికి తలపాగా చుట్టుకొని, ఎడమ భుజానికి జోలె తగిలిచ్చుకున్నడు. గుడిసెకు మూలపక్కకు ఆనిచ్చున్న ఆనిగెపుకాయ బుర్రను భుజమ్మీదికెత్తుకొని, ఎడమ చేతి వేళ్లకు అందెలు తొడుక్కున్నడు. అదే మూలపక్కకున్న డిమ్కి దిక్కు జూషిండు. అది రెండు వారాలకేంచి ఆడ్నే ఉంది.

'దాన్ని మల్ల సుక్కమ్మ చేతిల ఎన్నడు జూస్తనా' అని ఎదురుజూడని దినం లేదు శంకరయ్యకు. ఇంకిప్పుడు ఆ అవ్సరం లేదని గుర్తుకొచ్చి లోపలోపల్నే కుమిలిపోయిండు.

ఆమెకొచ్చింది ఏ కాన్సర్ రోగమో, గుండె జబ్బో లేక ప్రపంచాన్నే వణికించిన కరోనానో కాదు. అంతకంటే పెద్దరోగం.. పేదోళ్ల రోగం.. ఆకలి రోగం! అవును ఆకలి రోగం.. ఈ భూమ్మీద అన్ని రోగాలకంటే భయంకరమైన రోగం.

***

శంకరయ్య, సుక్కమ్మ ఊరూరు తిరుక్కుంట బుర్ర కథలు, భాగవతం చెప్తుంటరు. వాళ్లకు నలుగురు పిల్లలు. వాళ్లకంటూ ఓ ఇల్లు లేదు, జాగ లేదు. ఊర్లపొంటి తిరగడం, ఎక్కడికి వోతే అక్కడ పొయ్యి వెట్టుకోడం, గుడిసెలు ఏసుకోనుండటం, ఇంటింటికి వోయి అడుక్కోడం.. ఇదే వాళ్ల బతుకు చిత్రం.

యాడాది క్రితమే ఇదివరకుంటున్న ఊరి నుంచి మరో ఊరికొచ్చిన్రు ఈ సంచార జీవులు. ఊరి బయటనే మూడు వంకర్ల గుడిసేసుకొని ఉంటున్నరు. అప్పటికే ఒకసారి కరోనా మహమ్మారి వీళ్ల కడుపులు గొట్టింది. యెట్లనో ఇకమతులు వడి అప్పుడప్పుడే ఆ పరిస్థితుల నుంచి జెర కోలుకుంటున్నరనంగ మల్ల రెండోసారొచ్చి వీళ్ల బతుకులను ఇంగింత ఆగం జేశింది.

కొత్త ఊరికొచ్చినాక కుటుంబమంతా కడుపునిండ తిని కొన్ని నెలలైతున్నది. ఆలుమగలిద్దరు రోజంతా ఊర్ల ఇంటింటికి వోయి బుర్ర కథలు జెప్పుకుంట యాచన చేసొస్తేనే కశికిన్ని నూకలు, చిల్లర పైసలొచ్చేవి. ఎవలన్న సద్ది బువ్వనో, ఎండిన రొట్టె

ముక్కలో ఇస్తే.. ఇగ ఆ పూటకు అయి తిని, ఆపత్కాలంల పనికొస్తయని నూకలు తీసిపెట్టేది సుక్కమ్మ.

బుర్ర కథలు చెప్పని టైంల తాటాకులు దెచ్చి అవిటిని ఎండవెట్టి చాపలు, బుట్టలు అల్లి ఊర్లకు వోయి అమ్ముకొచ్చేది. కుదార్థంగ ఓ తాన ఉండలేని బతుకులు గావట్టి, పిల్లలను సదివియ్యనీకె గుడంగ లేకపాయే. అంతేగాకుండా.. పెద్ద కొడుకును బడికి పంపుదమని చూస్తే ఓ తాన కులం సర్టిఫికెట్ లేదని, ఇంకోతాన అంటరానోళ్లని బల్లెకు రానియ్యలేదు. ఇగ అట్ల పెద్దోడికి సదువు లేకపాయే. గసొంటి అగుమానాలు వడలేక తక్కిన పిల్లలను గూడ బళ్లెకు పంపే ధైర్నం జేయలేదు.

ఇగ బతుకుదెరువు కోసం, ఎట్లనో ఓలాగ బతుకీడ్వాలె గావట్టి వాళ్లు గుడ్క తలా ఒక పని జేస్కుంట అమ్మ నాయినకు ఆసరయ్యేది.

పెద్ద కొడుకు రబ్బరు బిందెలమ్మితే, మిగతా ముగ్గురు చుట్టుపక్కల పాత బట్టలు అమ్ముకొచ్చేటోళ్లు. దమ్మిడి ఆదాయం లేకున్నా గడియ తీరిక లేకపోతుండే. కుటుంబమంత కష్టపడితే వొచ్చే పైసలతోని అట్లిట్ల ఆ దినం గడిచిపోయేది.

కానీ, కరోన వొచ్చినంక వాళ్ల బతుకులు పూర అద్వానమైనయ్. ఇల్లిల్లు దిరిగి అడుక్కుంటెనే వాళ్లకు బతుకెల్లేది. కానీ, ఊర్లపొంటి తిరుగుతుంటరని వాళ్లను ఇండ్ల ముంగటికి గుడంగ రానిచ్చేటోళ్లు గాదు. పూట గడువడం గూడ కష్టమైపోయింది. చేతికి పనిలేదు.. కడుపుకు ఆసర లేదన్నట్లయ్యింది.

అసలే ప్రతి ఒక్కరి చేతులల్ల సెల్ ఫోన్లుంటున్న ఈ రోజుల్లో వీళ్లను పిలిసి కథలు చెప్పించుకునేటోళ్లే కరువయ్యిన్రంటే.. ఇగ కరోనా వొచ్చేటాలకు వాల్ల జీవనాధారమే ప్రశ్నార్థకమయ్యింది.

దినాము దొరికే సద్ది బువ్వ గుడ్క లేకపాయే. ఇదివరకు వాళ్లూ వీళ్లూ ఇచ్చిన నూకలను రోజుకొక్క పూటనే.. అదీ పిల్లల వరకే కొన్ని వోషి వండేది సుక్కమ్మ. వండిన ఆ పిడికెడు నూకలన్నంతోని నలుగురు పిల్లల కడుపులు పూర్తిగ నింపలేకపోయినా వాళ్ల ఆకలిని కొంతవరకు తీర్చగలిగేది. ఎప్పుడన్న అవి గుడంగ కరువైనప్పుడు చిల్లర పైసలేమన్నుంటె బిస్కెట్లు తెచ్చుకొని నీళ్లల్లద్దుకొని తిని ఆకలి తీర్చుకునేది పిల్లలు.

కానీ.. కడుపుల పేగులూకుంటయా! అవి వెట్టే తిప్పలకు శంకరయ్య అట్లిట్ల తట్టుకోనుంటున్నడేమో గానీ సుక్కమ్మ కొన్ని రోజులకు తట్టుకోలేకపోయింది. రాత్రిపూట కడుపుల నొప్పిలేషి గిలగిల కొట్టుకలాడేది. ఆయిమెనట్ల జూషినప్పుడల్ల శంకరయ్య పానం తన్నుకలాడేది. ఉన్న ఆయిన్ని నూకలు వండుకుంటే రేపట్నాడు పిల్లలు ఆకలికి నకనకలాడాల్సొస్తది. అందుకే ఇగ కడుపు నింపుకోమని గిలాసడు నీళ్లు తెచ్చియ్యడం తప్ప ఇంకేం చెయ్యలేని పరిస్థితి శంకరయ్యది.

ఓనాడిట్లే తాటాకులు దెచ్చుకోనీకె వోతుంటే నడ్మలనే చెక్కరొచ్చి పడిపోయింది

సుక్కమ్మ. వాళ్ల కాళ్లూ వీళ్ల కాళ్లూ పట్టుకొని శంకరయ్య ఎట్లనో ఓలాగ ఆమెను దవాఖానకు దోల్కవోతే కడుపునిండ తినమన్నడు డాక్టర్ సాబ్.

తిన్నది.. కడుపునిండ ఆకలిని తిని గోలీలేసుకుంది.. నాలుగైదు రోజుల కింద అవి గుడ్క అయిపోయినయ్. అందుకే హాయిగ, శాశ్వతంగ నిద్రవోయిందియ్యాల.

'తమ్ముడు, శెల్లెల్లు భద్రం! నేనొచ్చిందాంక మీయమ్మను లేపకుండ్రి. పాపం దినాము కడుపుల నొప్పిలేషి తన్లాడుకుంట నిద్రవోకుంటుండే. ఇయ్యాల నొప్పి లేనట్టుంది. మంచిగ నిద్రవట్టినట్టుందేమో పండుకుంది. నేను వొయ్యొస్త!'..

కొడుక్కు జెప్పి కండ్లల్లకెళ్లి దుంకుతున్న నీళ్లను అంగీతోని వొత్తుకొని, కొంచెం ముందరికి వొంగి గుడిసె బయటికి నడిచిండు.

'దినాము పొట్టకూటి కోస్రం కథలు జెప్పిన. ఇయ్యాల నీ కోస్రం జెప్త సుక్కమ్మ! పెండ్లినాడు నా ఎంబడేసిన ఏడడుగులతోని మొదలువెట్టి, నా ఎంబడి వంత పాడుకుంట, డిమ్కి వాయించుకుంట ఊరూరు, ఇల్లిల్లు తిరిగి తిరిగి ఇయ్యాల అల్షిపోయి పండుకున్నవ్. యేనాడూ నీకోస్రం ఏమీ అడగని నీవు.. ఆ నాడు మొదట్సారి నోరు దెరిషి 'గీ గాజులేపిచ్చుకొని రెండేండ్లయితుంది. పండ్గకు కొత్త గాజులేపిస్తవాయ్యా..!' అంటాని అడిగితివి. గాయింత ముచ్చట గుడ్క దీర్చలేకపోతి. కనీస్రం సావులనన్న యేమ్ లోటు లేకుండ నిన్ను సాగనంపనీకే జెప్త'.. సుక్కమ్మ యాదులన్ని ఒక్కోటి కండ్ల ముందుకొచ్చి కదలాడేటాలకు గుండె వాగయ్యింది శంకరయ్యకు. చిన్నగ ఊరి బాట వట్టిండు.

***

వొచ్చిన ఆ కొన్ని పైసలను జేబులేస్కొని బుగులు బుగులుగ నడుస్తున్నడు శంకరయ్య.

'ఓ జంగమయ్యా! ఇగో నిన్నే!' ఎన్కనుంచి ఎవరో పిల్షిండ్రు. కండ్లు తూడ్సుకొని తిరిగి చూసిండు. దూరంకెల్లే ఒకాయన రమ్మని సైగ జేస్తున్నడు. శంకరయ్యకు మనసుల ఎదో ఆశ చిగురించింది. జెప్పజెప్ప నడ్సుకుంట వోయిండు.

'మా తాత సచ్చిపోయిండు. ఇయ్యాల దినాలున్నయ్. పొద్దట్సంది ఎవలన్న కథ జెప్పేటోళ్లు గనవడ్తరేమో అంటాని సూస్తుంటే నీవ్ గనవడ్తివి. వొస్తవా మా ఇంటికి!' అతనన్న మాటలకు శంకరయ్యకు పానం లేసొచ్చినట్టయ్యింది.

'శంకరా! గీ శంకరయ్య తిప్పలు సూడలేక ఆదుకోనీకొస్తివా'.. మనసులనే శివయ్యకు దండం బెట్టుకొని, ఊపిరి పీల్చుకున్నడు. ఇంకేం ఆలోచించకుండా వెంటనే..

'అట్లనే సారు!' అన్నడు.

'అవ్.. వంతెగాల్లెవ్వరు లేరా? నీవొక్కనివే పాడ్తవా?' అడిగిండతను.

‘మా ఇంటాయిమెకు జెర సుస్తయ్యి రాలేదు సారు. నేనే వాడ్త బాంచెన్!’ అన్నడు శంకరయ్య.

***

‘ఇంటో రాజుబాబు.. ఇంట రాజుబాబు.. బాల!

హయ్యో రామ రామా.. బాల!

నీ తాత రంగరాజే.. బాల!

నువు సిన్నగున్నాడు.. బాల!

సంకల్ల యెత్తుకోని.. బాల!’

ఓ పక్క సుక్కమ్మను సాగనంపనీకె పైసలొస్తయన్న సంతోషం.. మరో పక్క తన సుక్కమ్మ ఇంక లేదన్న దుఃఖం.. రెండూ కలిపి గుండెలను మెలితిప్పుతున్నా దిగమింగుకొని పాడుతున్నడు.

శంకరయ్య పాడుతుంటే పెద్దాయనను తల్సుకొని ఆ ఇంటిల్లపాది కండ్లు తడయినయ్. అక్కడున్నవాళ్లల్ల మరో ఇద్దరు గూడ వాళ్ల ఇంట్లోవాళ్ల పేరు మీద కతలు చెప్పించుకున్నరు.

శంకరయ్య ఆపకుండ పాడ్తనే ఉన్నడు. మాపట్దాంక పాడ్తనే ఉన్నడు. అందరు తలా కొన్ని పైసలిచ్చిన్రు. సద్ది బువ్వ వెట్టిన్రు. అప్పటివరకు ఖాళీగున్న శంకరయ్య జేబు, జోలె రెండు ఒకేసారి నిండినయ్. ఇగ సంతోషంగ ఇంటిబాట వట్టిండు. పోత పోత సంతల సుక్కమ్మ కోస్రం గాజులు కొన్నడు.

***

గుడిసె బయట బిక్కుబిక్కుమంటూ కూచున్న పిల్లల మొకాలు జూస్తెనే అర్థమయ్యింది.. తల్లి ఇగ నిద్రలేవదని వాళ్లకు గుడంగ తెలిసిపోయినట్టుందని. వాళ్ల చెంపల నిండా కన్నీటి చారలే కనపడుతున్నయ్.

‘నాయిన! నాకు నూకలన్నమొద్దు. అమ్మ గావాలే’ వెక్కి వెక్కి ఏడుస్తున్న చిన్న బిడ్డను జూడంగనే పొద్దట్సంది తన గుండెల్లోనే దాచుకున్న దుఃఖమంతా ఒక్కసారిగ బయిటికి తన్నుకొచ్చింది. పిల్లలను ఎదకు బిగ్గిత అదుముకొని బోరుమన్నడు. దాచుకున్న కన్నీళ్లన్నీ ఇంకిపోయేవరకు యేడ్సిండు.

తర్వాత గుడిసెలోపలికి పోయిండు. తన భుజమ్మీదున్న తుండు గుడ్డను దీసి సుక్కమ్మ సుట్టే తిరుగుతున్న ఈగలను తోలిండు. ఆమె పక్కన్నే కూసోని ఆమెకోస్రం తెచ్చిన మట్టి గాజులు ఆమె చేతులకు తొడిగిండు.

‘నీ పాటంటే నాకు పానం. రేపట్నాడు ఒకాల నాకేమన్నయితే నీవే పాడాలె!’ మూడ్రోజుల కింద సుక్కమ్మ అన్న మాట యాదికొచ్చింది. తంబూరను అందుకున్నడు...

'నేనెళ్లిపోత కొడకా.. బాల!

నా యిల్లిడిసి నేనువోతా.. బాల!

జాగిడిసి నేనువోతా.. బాల!'

గొంతు పూడుకుపోతున్నా అక్షరం అక్షరం కూడబలుక్కొని పాడుతున్నడు. తంబూరతోపాటు మూలకున్న డిమ్కి సప్పుడు గూడ ఇనవడ్తుంది శంకరయ్యకు. సుక్కమ్మ కొత్త గాజులు గలగలమంటున్నట్లే ఉంది.

'చెట్టోలె రాలిపాయే.. బాల!

పాడెమీద వండవెట్టి.. బాల!

ఎత్తుకుందురు నలుగురేమో.. బాల!

కుమ్మరింటి కుండతోటి.. బాల!

మాయడప్పులతోటి.. బాల!

సాగనాంప పదిమందీ.. బాల!'..

పొద్దు పొడిచేవరకు అస్తమించిన తన సుక్కమ్మ కోస్రం పాడ్తనే ఉన్నడు.

***

## స్ఫూర్తి కందివనం

స్ఫూర్తి కందివనం  స్వస్థలం మహబూబ్ నగర్. ప్రస్తుతం హైదరాబాద్ లో ఉంటున్నారు. బయోటెక్నాలజీలో పీజీ చేసిన స్ఫూర్తి, కొన్నాళ్లపాటు సైంటిఫిక్ ఈ జర్నల్స్ పబ్లిషింగ్ సంస్థలో మేనేజింగ్  ఎడిటర్ గా  పని చేశారు. సాహిత్యం పట్ల ఆసక్తితో 2019 నుంచి రచనలు చేస్తున్నారు. ఇప్పటి వరకు ఇంగ్లిష్ లో 12 కథలు, తెలుగులో 36 కథలు, 3 నవలలు రాశారు.

# మోదుగు పువ్వు!



పి.చంద్రశేఖర్
(చందు తులసి)

ఆ రోజు ఇక నేను ఎలాగైనా సరే.. చనిపోవాల్సిందేనని నిర్ణయించుకున్నాను. నిజం.. 'ఇక నేను బతకడం దండగ' అనిపించింది. అందుకే ఈ నిర్ణయం! ఈ ప్రపంచంలో ఉన్న దారులన్నీ మూసుకొని పోయి.. బతకడం కంటే చావడం మేలు అనుకునే క్షణం.. జీవితంలో ఎంతమందికి వస్తుందో తెలీదు కానీ, ఒంటరి ఆడపిల్లనైన నాకు ఇరవై ఏళ్లు నిండకుండానే వచ్చింది.

***

నాపేరు సైది. దేవరకొండ తాలూకాలో అడివికి దగ్గర ఉన్న మారుమూల లంబాడా తండా మాది. నేను పుట్టక ముందే మా అమ్మ – నాయినకు నలుగురు ఆడ పిల్లలు పుట్టినరట. మగ పిల్లగాడు కావాలని వరుసగా కంటనే పోయినరు. నాకు ఊహ తెలిసేటప్పటికే పెద్ద అక్కకు పెండ్లి అయిపోయింది. పెద్ద అక్క తర్వాత పుట్టిన ఇద్దరు పిల్లలు పురిట్లోనే పోయినరట. నాలుగో అక్కను.. అందంగా ఉందని పుట్టిన ఏడాదికే, ఎవరో హైదరాబాద్‌లో ఉండేటోళ్లు కొనుక్కొని పోయినరట. పిల్లలను కనడమే తప్ప సాకలేని నాయిన ఐదువేలకు బిడ్డను అమ్మినడు. ఆ తర్వాత రెండేళ్లకు నేను పుట్టిన్నంట. ఇయ్యన్నీ మా అమ్మ చెప్పిన ముచ్చట్లు.

మా దేవరకొండ లంబాడా తండాల్లో కొడుకు పుడితే బాగా సంబరం చేసుకుంటరు. పదేళ్లు సాకితే ఏ ఆసామి దగ్గర జీతానికి పెట్టినా డబ్బులు వస్తాయని. అదే ఆడపిల్ల పుడితే ఎవలకో ఒకలకు అమ్ముతరు. మా తండాలో

కొంతమంది ఏజెంట్లు ఉంటరు. పురిట్ల పాప నుంచి, నలబై ఏండ్ల నడికారు మనిషి దాంక ఎవరినైనా అమ్మిపెడతారు. చానామంది ఆడబిడ్డలు పుట్టేది మా తండా మట్టిల.. కానీ, కలిసేది మాత్రం ఏ బొంబాయి, పూనా మట్టిలోనో!

ఇరవై ముప్పై ఏళ్ల కిందట మా తండాలు ఇప్పటిలా ఉండేయి కాదు. ఎంత పిలిచినా చుక్క వాన వచ్చేది కాదు. కానీ, పిలవకుండానే కరువు వచ్చేది. అప్పట్లో వరుసగా ఏటా కరువులే. తాగడానికే గుక్కెడు నీళ్లు దొరికేయి కాదు. బుక్కెడు బువ్వ దొరక్క.. కళ్లు లోపలికి గుంజుకపోయి, బొక్కలు తేలిపోయి.. మడుసులు నడిచే అస్థిపంజరాల మాదిరి ఉండేవారు. తల్లికే తిండిలేకపోతే ఇంగ పసిపిల్లలకు పాలు ఏడికెల్లి వస్తయి. పిల్లలను సంపుకుని బొందల గడ్డ సమాధి చేసే కంటే.. అమ్ముకోవడం మేలు అనుకునేటోళ్లు. కన్నపేగును కూడా దూరం చేసుకునేంత కటిక పేదరికం ఆ రోజుల్లో ఉండేది.

నేను మా నాయిన పోలికతోని నల్లగా పుట్టిన. కాకి నలుపు. అందుకే నన్ను ఎవలూ కొనుక్కోలేదు. నా వల్ల డబ్బులు రాలేదని నాయినకు కోపం. నా పోలిక ఆయనదే ఐనా కాలీ చ్వారీ (నల్ల పోరీ) అని తిట్టేవాడు. రోజూ సాయంత్రం తాగి వచ్చి అమ్మను, నన్ను బాగా కొట్టేవాడు. నన్ను 'ఎటైనా వెళ్లిపో' అని.. 'ఏ చెరువులోనో దూకి సచ్చిపో' అని గొడ్డును బాదినట్టు బాదేవాడు. సాయంత్రం అవుతుంటే నా గుండెల నిండా చీకటి కమ్ముకునేది. భయం, భయంగా నిద్రపోయినట్లు కళ్లు మూసుకొని పడుకునేదాన్ని. తాగడం మర్చిపోని నాయిన.. నన్ను కొట్టడం కూడా మర్చిపోయేటోడు కాదు. అన్ని చిత్రహింసలు పడ్డ రోజు కూడా నేను చచ్చిపోవాలని అనుకోలేదు. కానీ, ఈరోజు అలాంటి పరిస్థితి వచ్చింది.

***

నా చిన్నపుడు అమ్మతోపాటే అడివిలోకి పోయేదాన్ని. పొయిలకు కట్టెలో, తునికి పండ్లో.. ఏవి దొరికితే అవి తెచ్చుకునేటోళ్లం. అమ్మ మోదుగు చెట్టును చూపించి ఒక ముచ్చట చెప్పేది.

మోదుగు విత్తనం నేల మీద పడితే చాలు. యాభై ఏండ్ల పాటు వర్షాలు కురవకపోయినా సరే.. ఆ గింజ తట్టుకొని నిలబడతదంట. వానలు పడి తడి తగలగానే, మళ్లీ మొలక వస్తుందట. మెల్లగ మొక్కై పెరిగి, పెద్ద చెట్టై.. వేయి పూలై విరబూస్తుందట. మనిషి కూడా తన కష్టకాలంలో పానం నిలుపుకోవాలని.. ఆపదలు తట్టుకొని నిలబడాలని చెప్పేది.

మా తండా పక్కన పెద్ద తండాల స్కూలు ఉంది. అది ఆడపిల్లల స్కూలు, హాస్టల్ కూడా ఉంది. ఆ సార్లు మా తండాలో పిల్లల సర్వే కోసం వచ్చినపుడు నన్ను హాస్టల్ల జాయిన్ చేయమని అమ్మకు చెప్పినరు. అట్ల తిండి కోసం నేను హాస్టల్ల జాయిన్ అయిన. మా అమ్మను వదిలిపెట్టి ఉండలేను కానీ.. హాస్టల్లో నాయిన ఉండడు, కొట్టడు కద. అందుకని హాస్టల్‌కి పోయిన. బడి నడిచినన్ని రోజులు బానే ఉండేది. కానీ, దసరాకు, ఎండాకాలానికి సెలవులు వచ్చినయంటే గుబులు. ఇంటికి పోవాలంటే రంది. ఇంటికి పోతే నాయిన కొడుతడు. సంపుతడేమో అన్న భయం. అందుకే మా ఇంటికి పోయినా.. రాత్రి నాయినకు కనపడకుండా

మా అమ్మమ్మ ఇంటికో, వేరే వాళ్ల ఇంటిదగ్గరో పడుకునేదాన్ని. అట్ల స్కూలు, హాస్టల్ తెరిచేదాక మిడుకు మిడుకుమంటూ బతికేదాన్ని.

ఓరోజు అటువంటి సెలవుల్లోనే.. నాయిన అడివిలో పాము కరిచి చనిపోయిండు. పాము కాటుకు ముఖం నల్లగా మారిన నాయినను చూసి.. నాకు మాట రాలేదు. జనం కోసమైనా ఏడ్వడానికి ఎంత తన్నుకున్నా దుఃఖం రాలేదు. నాయిన చనిపోయిడన్న బాధకంటే.. ఇక నన్ను నాయిన కొట్టడన్న సంగతే సంతోషంగా అనిపించింది.

నా చదువు గురించి చెప్పాలంటే అదో పెద్ద కథ. బాగ చదువుకోవాలని మా టీచర్లు చెప్పే ముచ్చట బాగా నచ్చేది. నేను బాగ చదువుకోని ఉద్యోగం సంపాదించి.. పుట్టెడు కష్టాలు పడిన మా అమ్మను సుఖంగా చూసుకోవాలని అనుకునేదాన్ని. కానీ, ఎంత ప్రయత్నించినా మా భాషకు.. టీచర్లు మాట్లాడే భాషకు చాలా తేడా ఉండేది. ఆ సదువు, మా భాష ఒక్కటి కాదు. నానా తిప్పలు పడి తెలుగు భాష పూర్తిగా నేర్చుకునే సరికి.. పిడుగులాగ ఇంగ్లిష్ భాష వచ్చింది. పొట్ట కోసినా ఇంగ్లిష్ పలకడం రాకపోయేది. మా సార్లు కొట్టికొట్టి చేతులు కాయలు కాసినయి కానీ.. ఇంగ్లిషు భాష మాత్రం రాలేదు. అసలు ఏమన్న అర్థమైతే కద.. చెప్పడానికి.

ఏడో తరగతిల ముందో ఎనకో చూసి పరీక్ష రాసి నెట్టుకొచ్చిన. కానీ, పదో తరగతిల మాత్రం ఫెయిలై పోయిన. ఇప్పుడు హాస్టల్ నుంచి ఎల్లిపోవాలె. మల్ల తండాకు పోవాలె. సప్లిమెంటరీ పరీక్ష రాసి పాసు కావాలె. పాసైతేనే ఇంటర్. లేదంటే అంతే.. అన్ని సబ్జెక్టులు పాసైన కానీ అది ఇంగ్లిష్ కాబట్టి ఫెయిలైన.

'అన్నీ పాసైన.. ఒకటే కద సారు ఫెయిలైంది. నన్ను పైక్లాసుకు పంపించండి సారూ!' అని మా సార్లను బతిమాలిన.

'అట్ల కుదరదు' అని చెప్పినరు. ఏం చేయాల్నో అర్థం కాలేదు. ఈ ఇంగ్లిష్ పాడుకానూ.. ఈ ఇంగ్లిష్ నాశనం కాను.. ఇంగ్లిష్ కాబట్టి నా బతుకు అన్యాయం ఐపోయిందని తిట్టుకున్న.

నా ఇనుప సందుక పెట్టె నెత్తిన పెట్టుకొని.. వలవలా ఏడ్సుకుంట మా తండాకు పోయిన. ఒకటే దుఃఖం. పది సంవత్సరాలు చదువుకొని మల్లా తండాకు పోవడం నాకు ఏదో తప్పు చేసినట్లు అనిపించింది. అంత బాధలో కూడా నేను చచ్చిపోదాం అనుకోలేదు. కానీ.. నేను ఇప్పుడు చేసిన తప్పు నాకు చావు తప్ప ఇంకో మార్గం లేకుండా చేసింది.

***

పదో తరగతి ఫెయిలై తండాకు వచ్చిన. మా అమ్మకు తెలిసినా ఏమీ అనలేదు. అసలు పాస్, ఫెయిల్ ఏందో కూడా తనకు అర్థం కాలేదు. నేను 'ఏ పని చేయాలా?' అని ఆలోచిస్తున్నపుడు.. మా తండాలో సారా యాపారం చేసే వసురాం మా ఇంటికి వచ్చినడు. ఆయన మా తండాలో సారా కాచి.. దేవరకొండ టౌనుకు దొంగతనంగా తీసుకొని పోయి యాపారం చేస్తడు. లోపల సారా పాకెట్లు, పైన కూరగాయలు పోసి సైకిల్ మీద తీసుకుపోయేటోడు. కానీ, ఒకసారి పోలీసులకు దొరికిపోయిండు. అట్ల వసురాం మీద నిఘా

పెరిగింది. అందుకని దేవరకొండలో ఉన్న సారా దుకాణం కాడికి.. నేను స్కూలుకు పోయే అమ్మాయిలాగా, బ్యాగులో సారా ప్యాకెట్లు తీసుకుని పోయి ఇవ్వాలి. స్టూడెంట్ కాబట్టి పోలీసులు అనుమానించరని వసురాం తాత ఉపాయం.

ఉదయం పది లీటర్లు, సాయంత్రం పది లీటర్లు.. సీక్రెట్‌గా చేరవేస్తే రోజుకు వంద రూపాయలు కూలీ ఇస్తనన్నడు. నాకది బానే అనిపించింది. వసురాం తాత ఇచ్చిన సైకిల్ తొక్కుతూ, కాలేజీ బ్యాగులో సారా ప్యాకెట్లు పెట్టుకొని పోయేదాన్ని. కాలేజీ అమ్మాయి అనుకొని ఎవరూ అనుమానించేవాళ్లు కాదు.

ఆరు నెలలు బానే గడిచింది. కాలం ఎప్పుడూ మన చేతుల్లో ఉండదు కద. ఎవరో ఎక్సైజ్ పోలీసులకు ఉప్పందించారు. నన్ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని స్టేషన్‌లో పెట్టారు. రెండు రోజులైనా వసురాం తాత కానీ, ఎవ్వరు కానీ జామీను ఇవ్వడానికి రాలేదు. పోలీసులు నేనే సొంతంగా సారా కాసి యాపారం చేస్తున్న అనుకొని పదివేలు లంచం అడిగినరు. రోజుకు వంద రూపాయల కూలీ చేసే నా దగ్గర పదివేలు ఎక్కడియి. కాళ్లావేళ్లా పడి మొక్కినా వదిలిపెట్టలేదు. ఆడపిల్లనని కూడా చూడకుండా కొట్టినరు. అప్పుడే ఆ స్టేషన్‌లోనే ఉండే కానిస్టేబుల్ సార్ పరశురాములు నా మీద కనికరం చూపించాడు. రెండు వేలు ఎస్సై చేతుల్లో పెట్టి నన్ను ఇంటికి పంపించాడు. పరశురాములు సార్‌కు రెండు చేతులతో కాళ్లు మొక్కి ఇంటికి చేరుకున్న.

ఇక నేనే సొంతంగా సారా కాయడం, అమ్మడం మొదలు పెట్టాను. పోలీసు కానిస్టేబుల్ పరశురాములు కూడా పరిచయం ఉండటంతో నెలనెలా పోలీసోళ్లకు మామూళ్లు ఇచ్చేదాన్ని. పరశురాములు సార్‌కు నా సారా అంటే ఇష్టం. ఘాటుగా, తాగంగనే మత్తుగా ఉంటదని నా సారా కోసం తండాకు వచ్చేవాడు. కొంత కాలానికి.. 'సారా కోసం కాదు.. నీకోసమే' అని మనసులో మాట బైట పెట్టాడు. అట్ల మెల్లగా ఇద్దరి మధ్య సావాసం పెరిగింది. అన్నిరకాలుగా దగ్గరైపోయినం. మా అమ్మకానీ, తండా వాళ్లు కానీ.. వచ్చేది పోలీసు కాబట్టి ఎదురు చెప్పలేకపోయారు. పైగా నాతో పోలీస్ స్టేషన్‌లో పనుల కోసం పైరవీ చేయించుకునే వారు.

కొన్నాళ్లకు ఓరోజు నాలో ఇంకో పానం పెరుగుతున్న సంగతి అర్థమైంది. నేరుగా పోలీస్ స్టేషన్‌కు పోయి పరుశురాములుకి ఆ సంగతి చెప్పాను. సంతోషపడతాడు అనుకుంటే.. ఏమీ మాట్లాడకుండా ఆసుపత్రికి తీసుకొని పోయాడు. 'కడుపు తీసేస్కో!' అన్నడు. నేను ఒప్పుకోలేదు. పెళ్లి చేసుకోమన్నాను.

'సారాయి అమ్ముకొనే బజారు దానివి నువ్వు. నీలాంటి వాళ్లు పదిమందితో పోతాను. వాళ్లందరిని పెళ్లి చేసుకుంటానా లం..' అన్నాడు. 'నాకెప్పుడో పెళ్లయ్యింది. నాకు భార్య, పిల్లలు ఉన్నారు' అని అప్పుడు బయట పెట్టాడు.

నేను మొండికేసేసరికి అక్కడనే అందరి ముందూ కొట్టాడు.

'ఎక్కువ మాట్లాడితే సారా కేసులో మళ్లీ జైల్లో పెడతా' అని బెదిరించి, భయపెట్టి మా తండాకు పంపించాడు.

ఎంత మోసం చేసిండు. వీణ్ని నమ్మి ఎంతపని చేసిన. అదిగో అప్పుడే నాకు జీవితం మీద

విరక్తి పుట్టింది. కన్నకష్టాలు పడి పెంచింది అమ్మ. ఏ ముఖం పెట్టుకొని అమ్మకు మొఖం చూపించను. నేను చేసిన తప్పు తెలిస్తే అమ్మ బతుకుతుందా..? అందుకే ఇంటికి పోయే ధైర్యం చేయలేదు. ఛూ.. నేను బతకడం దండగ. అందుకే చచ్చిపోవాలని అనుకున్నాను. ఇంకాసేపట్లో నేను చచ్చిపోబోతున్నాను.

***

ఎలా చచ్చి పోవడం.. బాయిలో దూకనా..? చెట్టుకు ఉరి పెట్టుకోవడమా..? ఆ క్షణంలో నేను ఏం చేస్తున్నానో గుర్తులేదు. నేను చచ్చిపోవడం ఒకటే నాకు కావాల్సిందని.. పిచ్చి పట్టినట్లు, దయ్యం ఆవహించినట్లు అనిపించింది.

తండా పక్కనే ఉన్న అడివిలోకి నడుచుకుంటూ పోయాను. ఏ చెట్టుకైనా చున్నీతో ఉరి పెట్టుకుందామని చూశాను. దూరంగా పెద్ద మోదుగు చెట్టు కనిపించింది. కొమ్మల నిండా నిప్పుల పూలు పూసినట్లు.. తళతళా మెరిసిపోతున్న మోదుగు చెట్టును చూస్తే ఏదో గుర్తుకు వచ్చింది. అదేంటో గుర్తు చేసుకోవడానికి ప్రయత్నించాను. అప్పుడు తటాలున మెరుపు మెరిసినట్లు.. అమ్మ చిన్నప్పుడు చెప్పిన మాటలు గుర్తువచ్చాయి.

'ఎన్ని కష్టాలు వచ్చినా మోదుగు చెట్టులాగా తట్టుకొని నిలబడాలె బిడ్డా! వానలు వచ్చేదాక ఎదురు చూడాలె. చినుకు పడినంక మొక్కై ఎదగాలె. పెద్ద మానై.. వెయ్యి పూలు పూయాలె'.. అమ్మ చెప్పిన మాటలు మళ్ల మళ్ల యాదికొచ్చినయి.

అప్పుడు ఆలోచించిన.. అసలు మోసం చేసింది వాడు. నమ్మడం నా తప్పు కాదు కదా. నేనెందుకు చావాలి? మోసం చేసినందుకు వాడుకదా చావాలి. పుట్టెడు కష్టాలు పడి సాకింది అమ్మ. ఆమె కోసమైనా బతకాలి అనుకొని సక్కగ ఇంటి దారి పట్టిన.

ఇంటికొచ్చిన నాకు ఊహించని దెబ్బ. ఏం జరిగిందో ఏమో.. అమ్మ చనిపోయింది. నా కోసం ఉదయం నుంచి వెతుకుతున్నరట.

ఐదుగురు బిడ్డలను కన్నా సాదుకొనే అదృష్టం దొరకని తల్లి. ఒక్కదాన్ని నన్ను కంటికి రెప్పలా పెంచుకున్న అమ్మ వెళ్లిపోయింది. ఏం జరుగుతున్నదో అర్థం కాలేదు. కుప్పకూలి పోయాను. అక్క, బావ వాళ్లు, తండా మనుషులు మిగిలిన పనులు పూర్తి చేసి వెళ్లిపోయారు.

***

అమ్మ పోయిన తర్వాత ఒంటరినయ్యాను. నేను పోలీసోడి మడిసిగా ఉన్నంత కాలం అంతా బాగున్నరు. ఎప్పుడైతే వాడితో చెడిపోయిందని తెలిసిందో.. అందరూ మారిపోయారు. నన్ను చూసే చూపు.. పిలిచే పిలుపూ మారిపోయింది. కొన్ని కొండ చిలువలు అర్ధరాత్రుళ్లు వచ్చి చుట్టుకోవడానికి తడకలు తీసేవాళ్లు. వాళ్ల నుంచి తప్పించుకోవడానికి రాత్రుళ్లు అడివిలోకి పారిపోయేదాన్ని. అడవిలో పాములు, మృగాల కన్న తండా మనుషులే ఎక్కవ భయపెట్టేవాళ్లు.

ఎదిగీ ఎదగని వయసు. సరైన తిండి లేక నా ఒళ్లు పిండాన్ని మోయలేక పోయింది. పోలీసోడి పాపం.. రక్తం ముద్దలుగా వెళ్లిపోయింది. చానా రక్తం పోవడంతో ఆరునెలలు

మంచంలో పడిపోయాను. తిండిపెట్టిన నాథుడు లేడు. అప్పుడప్పుడు గవర్నమెంటు స్కూలు దగ్గర పిల్లలకు మధ్యాహ్న భోజనం పెట్టే యాళ్లకు పోయి, వాళ్ల దగ్గర అన్నం అడుక్కునేదాన్ని. అట్ల ఆరునెలలు నరక యాతన పడి మెల్లగా కోలుకున్నాను.

బతకడానికి సారా యాపారం కాకుండా ఏదైనా కష్టపడి పని చేయాలని అనుకున్నాను. అప్పుడే మా తండాలో అంగన్వాడీ సెంటర్ మొదలైంది. తండాలో పదో తరగతి చదివిన ఆడపిల్లను నేను ఒక్కదాన్నే ఉన్నాను. నాకు బతకడానికి కూడా ఏమీ ఆధారం లేదని తండా పెద్దలు ఒక మార్గం చూపించారు.

అలా మెల్లగా నా జీవితం అంగన్‌వాడీ టీచర్‌గా మారింది. మా తండాలోనే ఖాళీ జాగాను బాగు చేసి, చిన్న పాక వేయించాను. నేనే పార తీసుకొని రాళ్లు రప్పలు తొలగించి.. పిల్లలకోసం ఆటస్థలం సిద్ధం చేశాను. చుట్టూ కంచె పాతాను. లోపల బంతి, చామంతి ఇలా చాలా పూలమొక్కలు పెంచాను. పిల్లలను తీసుకురావడం ఆడించడం, పాడించడం. ఇప్పుడు పిల్లలే నా లోకం. ఆ పిల్లలే నా పిల్లలు. అలా మెల్లగా నా గతాన్ని కుబుసంలా వదిలించుకొని కొత్త మనిషిగా తయారయ్యాను. జనాలు కూడా పాత సైదిని మర్చిపోయారు.

ఎన్ని కష్టాలు, ఎన్ని కన్నీళ్లు.. ఎక్కడో పురిట్లో ఆడపిల్లగా చనిపోవాల్సిన నేను. మా నాయిన కొట్టిన దెబ్బలకు ఏ బాయిలోనో దూకి సావాల్సిన నేను.. ప్రేమ పేరుతో మోసపోయిన నేను.. ఏ పేదరికమో, ఏ ఆకలితోనో.. ఏ మగపురుగులో కరిచి ఏనాడో మట్టిలో కలిసిపోవాల్సిన నేను.. అన్నిటినీ తట్టుకొని మోదుగు చెట్టులా నిలబడ్డాను. మోదుగు పువ్వులా నవ్వుతూ తండాలో పిల్లలకు తల్లిగా మారాను. ఒకనాడు గుడుంబా యాపారం చేసిన సైది.. ఇప్పుడు 'సైదమ్మ టీచర్' అయ్యింది.

***

# చంద్రశేఖర్

*చంద్రశేఖర్ స్వస్థలం సూర్యాపేట జిల్లాలోని బండమీది చందుపట్ల. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. వృత్తి రీత్యా ప్రభుత్వ ఉపాధ్యాయుడు. జీవిత సహచరి 'తులసి' పేరుతో కలిపి 'చందు తులసి' కలం పేరుతో కథలు రాస్తుంటారు. సినిమా రంగంలోనూ రచయితగా పనిచేస్తున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, మహిళల జీవితాలే ఈయన కథలకు ప్రధాన ఇతివృత్తాలు. 2015లో తొలికథ 'ఊరవతల ఊడలమర్రి' మంచి గుర్తింపు తీసుకొచ్చింది. 'నమస్తే తెలంగాణ బతుకమ్మ' సంచికలో వచ్చిన 'పాలపిట్టల పాట' కథ, నేషనల్ బుక్‌ట్రస్ట్ యువ కథా సంకలనానికి ఎంపికైంది. వివిధ భారతీయ భాషల్లోకి అనువాదమైంది. 'బతుకమ్మ పుట్టింది' కథ 'గుర్రాల లక్ష్మీప్రసాద్ అవార్డు' గెలుచుకున్నది. 'నీళ్ల బిందె', 'బుక్కెడు బువ్వ', 'తల్లి గారిల్లు' కథలు పలు కథా సంకలనాలకు ఎంపికయ్యాయి. గతంలో 'గడి', 'తక్కెడ' కథలకు నమస్తే తెలంగాణ – ముల్కనూరు ప్రజాగ్రంథాలయం కథల పోటీల్లో బహుమతులు అందుకొన్నారు.*

# దిశ మార్చుకున్న గాలి



నస్రీన్ ఖాన్,
96524 32981

'తప్పు చేసిండు. శిక్ష పడాల్సిందే. అంత హింసను ఖాలీపీలీ నేను అనుభవించలేదా? ఎందుకు క్షమించాలె?'.. కోర్టు ప్రాంగణంలో పార్కు చేసి ఉన్న కారు డోర్ తెరుచుకుంట అన్నది జైనబ్. తాను అనుభవించిన హింస తాలూకు గాయాలు ఇంకా పచ్చిగా సలుపుతనే ఉన్నయి. అట్లా అని ఆమె ఆవేశంగా ఏమీ అనలేదు. గొంతు స్థిరంగానే పలుకుతున్నది. దిశ మారినా.. నావ సరైన గమ్యాన్ని నిర్దేశించుకునేందుకే ముందుకు సాగుతున్నది.

'నిండా పాతికేళ్లు లేని పిల్ల. ఇంత స్పష్టంగా ఎట్ల చెప్పగలుగుతున్నది? నాకా వయసుల బతుకు గురించి ఏమన్న తెల్వకపోయె' మాటా ఒకటోసారి బాధపడుతా ఆశ్చర్యపోయింది జైనబ్ కన్నా పదేళ్లు పెద్దదైన ముంతాజ్ ఆపా.

'ఇట్ల జిద్ చేసి జిందగీ ఏం చేస్కోవాలనుకుంటున్నరో ఏమో!' విచారపడుకుంట మల్లోసారి జైనబ్ నిర్ణయంపై నిరసన వ్యక్తం చేసిండు అబ్బా షరీఫ్.. కారు స్టార్ట్ చేస్తూ.

'జైనబ్ తప్పేం చేయలేదు పప్పా. కేసు పెట్టి మంచిపని చేసింది. చచ్చిపోయుంటే వాడికి ఇంకో పిల్ల దొరుకుతది. కానీ, మనకు మాత్రం మన పిల్లొస్తదా?' అలవాటు ప్రకారం తండ్రిని సముదాయించింది ముంతాజ్.

'క్యా.. హైకీ. జిందగీ అంతా ఉలట్ పలట్ అయింది.

ఇన్నేళ్లు కష్టపడి సంపాదించిన ఇజ్జత్ అంత ఇప్పుడీ కోర్టుల పోతున్నది. నెల నెలా వాయిదాలు పడుతనే ఉంటయ్. మనమే తప్పు చేసినట్లున్నది కత' దిగులు పడ్డడు షరీఫ్. కారు రవీంద్రభారతివైపు దూసుకుపోయింది. తెలుగుతల్లి ఫ్లైఓవర్ మీదుగా కారును తీసుకుపోవడం అలవాటు.

'వాళ్లదే తప్పయినా ఇట్ల మాట్లాడతవేంది పప్పా? మరిప్పుడు ఊకోవాల్నా ఏంది?' కంట్రోల్ రూమ్ వెనుక ఉన్న పోలీసు స్టేషన్ వైపు తొంగి చూసుకుంట ప్రశ్నించింది జైనబ్. తను 498ఏ, డీవీసీ కేసులు పెట్టినప్పుడు ఆ రోడ్డుపైన, దానికి పక్కనున్న నౌబత్ పహాడ్ రోడ్లపైన పడ్డ పడిగాపులు కండ్ల ముందు మెదిలినయ్.

మూడు నెలలైనా నిండని గర్భం ఆమెది. వేవిళ్లతోటి కిందామీదా అయితుంటే కడుపుల మెతుకు నిలుస్తలేదు. అట్లాంటి రోజుల్ల ఒకరోజు పొద్దున్నే లేచి బాత్రూమ్‌కు పోవాల్నని మంచం దిగి నిలబడంగనే.. నిండు కుండ పగిలినట్టు తెల్లటి టైల్స్ ఉన్న ఫ్లోర్ మొత్తం ఎర్రటి రక్తం. బట్టల నిండా రక్తం. ఏనాడూ అంతటి రక్తాన్ని చూడని జైనబ్‌కు నీరసం తోడైంది. కండ్లు తిరిగి పడిపోయింది. స్పృహ లేనేలేదు. అబార్షన్ అయిపోతుందని డాక్టర్లు చెబితే అంతటి నీరసంలోనూ విలవిలలాడుకుంట ఎట్లనన్న కాపాడమని ప్రాధేయపడింది తను. ఎట్లనోకట్ల మూడు రోజులు హాస్పిటల్ల ఐసీయూల ఉంచి, ఖరీదైన మందులతోటి కాపాడిర్రు డాక్టర్లు.

'గాజు లెక్క సున్నితంగ ఉన్న నా పరిస్థితిని వాడు ఏమన్నడు? ప్రెగ్నెన్సీ సాకుతోటి లాభపడుతున్న అని..' నిర్లిప్తంగ అన్నది జైనబ్. తన ప్రమేయం లేకుండనే కండ్లు నిండుకున్నయ్.

భుజాలపైన చేయేసింది ముంతాజ్. రవీంద్రభారతి సిగ్నల్ దగ్గర ఆగింది కారు.

'ఏ.. జానేదో మా! వాడికి నిన్ను పొందే అర్హతే లేదు. దురదృష్టవంతుడు. అందుకనే అట్ల మాట్లాడి యీడిదాంక తెచ్చుకున్నడు. మూర్ఖుడు. వదిలెయ్..' ఓదార్చుతున్నది ముంతాజ్.

ఏడాదైన సజావుగా సాగని చెల్లెలి వైవాహిక జీవితం ఆ కుటుంబానికి తలవని తలంపు. అయితే తనలెక్క కుంగిపోయి రోగాలు తెచ్చుకోలేదు చెల్లెలు. లీగల్‌గ పోరాడుతున్నది. ఆమె చేయలేకపోయిన పని చెల్లెలు చేస్తున్నందుకు చానా సంతోష పడుతున్నది. అందుకనే ఎప్పుడు కోర్టు పేషీ ఉందన్నా చెల్లెలుకు తోడు వస్తనే ఉన్నది.

'పైసలు నష్టం. పరువు నష్టం. క్యా జిందగీ ఆగయి!' మనసులనే విరక్తిగ అనుకున్నడు షరీఫ్. కానీ, వెనుక సీట్ల కూసోనున్న అక్కాచెల్లెళ్ల చెవుల్ల పడనే పడ్డయి ఈ మాటలు.

'ఇజ్జత్ పోతదని నన్ను నేను చంపుకోవాల్నా పప్పా? అయినా నాదేం తప్పుందని నీ పరువు పోతుంది చెప్పు?'.. ఫ్లై ఓవర్ మీదుగా కనిపిస్తున్న ట్యాంక్‌బండ్‌ను చూసుకుంట అడిగింది జైనబ్. ఆమె కండ్ల నుంచి ధారగ కురుస్తున్నయి కన్నీళ్లు. ముంతాజ్ కండ్లూ నిండుకున్నయి.

'కేసు పెడితే పరువు పోతదా?' అన్న సందేహం అక్కాచెల్లెళ్లను తొలుస్తున్నది. అసలు కేసు

పెట్టడమే తప్పంటే.. మరి జైనబ్ చేయాల్సిందేందో స్పష్టంగా చెప్పనైనా చెప్పడు.

'వాడు నిద్ర లేచిండో ఏమో. పాల కోసం ఏడుస్తున్నడంటవా?' టాపిక్ మార్చింది ముంతాజ్.

'లేవకపోవచ్చు. అమ్మీ కాల్ చేసేదిగా?' అంచనా వేసుకుంట, పది నెలల కొడుకు కండ్లముందల తిరుగుతుండంగ అన్నది జైనబ్ జవాబుగా.

నిలుస్తుందో, నిలవదో తెలియని గర్భాన్ని అతి జాగ్రత్తగా మోసుకుంట పోలీసు స్టేషన్లు, లాయర్లు, కోర్టుల చుట్టూ తిరిగింది జైనబ్. ఎట్లాగూ పోయే గర్భమే. మందులతోటి నిలిపినా పిండంల లోపాలు ఉండొచ్చని, అబార్షన్ చేయించుకోమని రకరకాలుగ సలహాలు ఇచ్చిర్రు జైనబ్ సంగతి తెలిసిన ప్రతిఒక్కరూ. అట్లున్నప్పుడే జైనబ్ ఫ్రెండ్ ద్వారా తెలిసిన లాయర్ కాడికి పోయిన్రు అందరు. ఆమె చెప్పిన మాటలు విన్న జైనబ్‌కు అసలు దుఃఖమే ఆగలేదు.

'అసలే విడాకులు తీసుకోవాలని అనుకుంటున్నప్పుడు ఆడపిల్ల ఫ్యూచర్ బాగుండాలంటే అబార్షన్ చేయించడమే మంచిది' అని ఆ లాయర్ సలహా ఇచ్చింది. ఆ సలహా నచ్చింది షరీఫ్‌కు. అయితే ఇచ్చిన కట్నం డబ్బుల్ల పది శాతం ఫీజుగ ఇయ్యాలనేసరికి కోపమొచ్చింది.

లాయర్ ఇంట్ల నుంచి బయటికొచ్చి మాట్లాడుకుంటుంటే వాళ్ల చూపు.. ఆ లాయర్ నేమ్‌ప్లేట్‌పై రాసి ఉన్న అక్షరాలపై పడింది.

'బాలల హక్కుల ఉద్యమకర్త' అన్న ఆ అక్షరాలు చదివి అసహ్యించుకున్నది జైనబ్. చీమకు కూడా హాని చేయడం తెల్వని జైనబ్.. తన కడుపుల పిండానికి ఏ నెలల ఏయే అవయవాలు రూపుదిద్దుకుంటున్నయో గూగుల్ చూస్కుంట తన్మయత్వం చెందుతున్నది. అట్లాంటి జైనబ్ బిడ్డను కనాలనే తీర్మానించుకున్నది. దాంతోటి అబార్షన్ గురించిన చర్చలకు అడ్డుకట్ట పడింది. ఇప్పుడు కొడుకు కండ్ల ముందల కనబడుతుంటే ఏ దుఃఖాలు కనబడ్తలేవు. వినబడ్తలేవు. కేసు వాయిదా తారీఖున హాజరైతున్నది. మామూలు రోజుల్ల సాఫ్ట్‌వేర్ డెవలపర్ జాబ్‌ను కంటిన్యూ చేసుకుంటున్నది.

'ఆడపిల్ల అంటే తరీఖాల మాటున ఎదగాలె. తల్లిదండ్రులు చూపినోడి చేయి పట్టుకొనే నడవాలె. అత్తామామలు, మొగుడు దయాదాక్షిణ్యాల నీడన పడుండాలె. అట్ల చేస్తెనే నిన్ను కన్నోళ్ల రుణం నువ్వు తీర్చుకున్నట్లు. వాళ్ల అడుగుజాడల్ల నడిస్తెనే పుట్టింటి పరువు ప్రతిష్టలు అంతస్తుల కొద్దీ పెరుగుతయి. ఈ ముచ్చట్లేగా మాకు చెప్పి పెంచేది'..

విరక్తిగ వంకర నవ్వు మొలిచింది ముంతాజ్ పెదవుల్ల. ఇయ్యాల చెల్లెలుతోటి కోర్టుకు పోయేటందుకు మూడురోజుల ముందుగాల నుంచే పర్మిషన్లు అడిగిన సంగతి గుర్తుకొచ్చింది.

***

'ముందుగాల మా అమ్మీ అబ్బాకు చెప్పినవా? వాళ్లు పొమ్మంటే ఆలోచిద్దాంలే' అని తన మెకానిక్ జాబ్‌కు ఎల్లిపోయిండు ముంతాజ్ భర్త.

తప్పదనుకొని అహ్మదాబాద్‌ల ఉన్న ఆమె అత్తకు ఫోన్ చేసింది హైదరాబాద్‌ల ఉన్న

ముంతాజ్. 'నాట్ రీచబుల్' వచ్చింది. మల్ల మామగారి ఫోన్‌కు రింగ్ చేసింది. 'ఔటాఫ్ కవరేజ్ ఏరియా' అని వచ్చింది. నాలుగైదు సార్లు ప్రయత్నించి, సాయంత్రం ఇంటికి చేరిన భర్తకు ఆ ముక్కే చెప్పింది.

'ఏడాది నుంచి ఇదే గోల. మన గురించి పట్టించుకునేదేమన్న ఉందా?' చిరాకు పడి కసురుకున్నడు.

'చెల్లెలుకు తోడు నిలబడాల్నంటే భర్తను బతిమిలాడాల్నా? ఒప్పించాల్నా?' మనసంత చేదు నిండుకున్నది ముంతాజ్‌కు.

'పిల్లలను బడికి పంపిన తర్వాత నేను ఇంట్ల ఖాళీగనే ఉంటున్న కదా! నా చెల్లెలు ఒంటరి కాదన్న భరోసా ఈయడానికి నేను పోకపోతే ఎట్లా? ఒక్కపూట మా అమ్మీ ఇంటికి పోయేటందుకు యాడనో ఉన్న అత్తామామలకు చెప్పాల్నా? ఎవరిదన్న షాదీ పిలుపొచ్చినా ముందుగాల ఆల్లకు వెడ్డింగ్ కార్డ్ పోస్ట్ చేయాలె? ఇంటి పనితోటి ఎంత చావొస్తున్నదో, ఈ తరీఖాలతోటి అంతచావు. మెసలాయితీకాని జిందగీ అయింది' చానాసార్లు ఇట్లనే అనుకుంటది గానీ భర్తను నిలదీయలేకపోయింది. అందుకనే ఒక్క ముంతాజ్ ఇటు పుట్టింటి పరువు, అటు అత్తింటి పరువును అప్రతిహతంగా కాపాడుతుందని అనుకుంటున్నరు. ఆమె మనసు చదవకుండా ఈ భ్రమలేందో జనాలకి.

'నేనేమనుకుంటున్ననో యీల్లకు అవసరమే లేదనుకుంట. యీల్లందరి పరువులు కాపాడుకునేటందుకు పుట్టిన ఆదర్శ వీర వనితను'.. మల్ల వంకర నవ్వు విరిసింది ముంతాజ్ ముఖంల.

'ఈ బానిస బతుకు నాకొద్దు' అనిపించింది ఆమెకు షాదీ అయిన కొత్తలనే. ససురాల్‌ల ఇమడలేక పుట్టింటికి వచ్చింది.

'తెలవక వచ్చింది బేటా! మేం సంఝాయించినం. మల్ల ఇట్ల చేయదు. నేను మాటిస్తున్న' అల్లుడికి హామీ ఇచ్చి, ముంతాజ్‌ను తోడిచ్చి పంపించిండు షరీఫ్.

'బతికినంత కాలం ఒంటరినే!' అనే నిర్ణయానికి వచ్చింది. ఏదన్నా సమస్య వచ్చినా కన్నోల్లకు చెప్పుకొనే ఖిస్మత్ చేసుకోలేదని ఆమె బతుకుపై ఆమెకే జాలి పుట్టుకొచ్చింది. రాజీ పడక తప్పదని భావించింది. అత్తింటి తరీఖాలను పొల్లుపోకుండా పాటించుకుంట సంతోష పెడుతున్నది. కానీ, చెల్లెలు 'తప్పు' అనిపించిన చోట అడుగుతది. తండ్రి గుడ్లురిమి చూస్కుంట బెదిరించినా తనలెక్క బెదిరిపోదు. గట్టిగ జవాబ్ చెప్తది.

జైనబ్ ఐదో తరగతి చదువుతున్నప్పటి సంగతి. పదో తరగతి పాసై ఇంట్లనే ఎంబ్రాయిడరీ, మెహందీ డిజైన్స్ నేర్చుకుంటున్న ముంతాజ్‌కు పైగాంలు సూడబట్టిర్రు. ఏదో పైగాం గురించి మాట్లాడుకుంటున్న అమ్మీ, పప్పా మద్దెన మాటామాటా పెరిగింది. అంతే! కోపంతోటి పిల్లలు చూస్తున్నరన్న సంగతి గూడా మరిచి అమ్మీని విపరీతంగా కొట్టిండు పప్పా. వణికిపోయిన ముంతాజ్ గప్‌చుప్‌గ లోపలికి పోయింది. జైనబ్ మాత్రం అమ్మీకాడికి పోయింది.

'పప్పాను నువ్వెందుకు కొట్టలేదు?' అని అడిగింది.

అది విన్న షరీఫ్ మరింత రెచ్చిపోయిండు. తల్లీబిడ్డలిద్దర్నీ చితకబాదిండు. అట్లాంటి పప్పా.. 'కొడతవో, తిడతవో, సంపుకుంటవో.. నీ ఇష్టం' అని అల్లుడిని సమర్థించకపోతే నిందిస్తడా? ఆ తాను ముక్కేగా అనుకుంట పెదవి విరిచింది ముంతాజ్. చేదు గతంల నానుతున్న సంగతులు గుర్తుకొస్తున్న కొద్దీ దాష్టీకాలను ఎదురిస్తున్న చెల్లెలిపై గౌరవం, ప్రేమ పుట్టుకొచ్చినయి. జైనబ్ వెన్నంటే ఉండాల్నని మల్లోసారి అనుకున్నది.

***

'పెద్దోళ్లు షాదీ చేసిగ్రని ఫెయిల్ కాకుండ ఉంటయా? ఫెయిల్ అయితే ఆమె లైఫంతా పోయినట్లేనా?'.. ఇంటికి చేరి బుర్ఖా విప్పేసి, కాళ్లూ చేతులూ కడుక్కొని కొడుకును చూసి మురిసిపోతున్న జైనబ్‌ను చూస్కుంట అనుకున్నది ముంతాజ్.

'కష్టాలు వచ్చినయ్. అయితేనేం? మానసికంగా బలంగా ఉంది కాబట్టే ఫైట్ చేస్తున్నది జైనబ్. అదే నేనైతే నా గురించి అమ్మీ, పప్పా ఏడుస్తున్నప్పుడే వెన్కకు మళ్లిపోయేదాన్ని. పీజీ చదవబట్టే జెరంత బయటిలోకం తెలిసింది జైనబ్‌కు. జాబ్ చేస్తుండబట్కే లోకజ్ఞానం అబ్బింది. నాలెక్క ఒకళ్లమీద ఆధారపడాల్సిన పనేలేదు. అబార్షన్ కావాల్సిన పిలగాడ్ని కాపాడుకున్నదంటే.. ధైర్యం, మానవత్వం ఉండబట్టే కదా! అందమైన మనసు జైనబ్‌ది'.. అనుకున్న ముంతాజ్, ఆ మాటే జైనబ్‌తోటి అన్నది. జైనబ్ ముస్కురాయించింది.

'ఆపీ! భాయ్‌జాన్ నిన్నిడిచి ఉండలేకనే కదా ఎంటనే పరుగెత్తుకొస్తడు. ఈ ఎదవ జూడు. నెల తప్పినప్పుడు పంచాయితీ పెట్టుకొని, పోనన్నదాన్ని తీస్కపోమని పప్పాకు ఫోన్ల మీద ఫోన్లు చేసి పంపినోడు. ఇప్పుడు వీడు పుట్టే పది నెలలు దాటింది'.. కొడుకును చూపించుకుంట అన్నది.

'కనీసం కొడుకునన్న తొంగిచూడని కఠినాత్ముడి నీడ నా కొడుకు మీద పడొద్దు. కోపతాపాలు ఎవ్వరికైన వస్తయనే అనుకుందాం. భాయ్ జాన్ చూడు పిల్లలను పువ్వుల్లెక్క చూసుకుంటడు. ఈడు పాలు మర్సినంక నీకాడనే ఉంచుత. నీ పిల్లల్ల వాడు ఒంటరికాడు. ఏమంటవ్?'. అడుగుతున్న జైనబ్‌ను చూసి ముంతాజ్ కదిలిపోయింది.

జైనబ్ ఎప్పుడూ ఇంతే. పరిణతితోటి ఆలోచిస్తది. ప్రేమగ మాట్లాడతది. అమాయకంగ ఈ లోకంలకు అడుగుపెట్టిన ఆ పసికూన తన ఒడిల వెలుగులు నింపాల్సి ఉంటే కాదనుకుంటుందా?

'సరే!' అన్నది చెల్లెలు నుదుట ముద్దు పెట్టుకుంట.

'మరి జెరంత ధైర్యం నేర్పాలె పిల్లలందరికీ..' అని అల్లరిగ నవ్వింది జైనబ్.

'అదే ట్రై చేయాలె. జిందగీ అంటే ఏందో ఇప్పుడిప్పుడే అర్థమైతుంది' అన్నది ముంతాజ్ సీరియస్‌గా.

'మేము కావాలనుకుంటేనే వాడు కడుపున పడ్డడు. బాధ్యత లేకుండా మొఖం

చాటేసినోడితోపాటు నేను వదులుకుంటనా నా ప్రాణాన్ని'.. అబార్షన్ గురించి చర్చ అయినప్పుడు చెల్లెలు అన్న మాటలు గుర్తుకు వచ్చినయి ముంతాజ్‌కు.

'మంచోడో చెడ్డోడో. కలిసి ఉంటే గౌరవం'.. గొడవలు అయిన కొత్తల జైనబ్ తోటి ముంతాజ్ అన్నప్పుడు ఇచ్చిన జవాబ్ అది.

'సమాజం మొత్తం పప్పా లెక్క, భాయ్‌జాన్ లెక్కనే ఉన్నరు. ఇట్లాంటోల్లు మారాల్నంటే చదువుతోపాటు సమాజం మీద అవగాహన పెరగాలె. ఇది ఒక్కసారికే జరగదనుకో. మనం మన పిల్లలకు నేర్పుతుండాలె' అన్నది జైనబ్.

'బాగ చదువుకున్నోడికేగా నిన్నిచ్చింది' దిగులు పడింది ముంతాజ్.

'ఆపీ! చదువుకుంటెనే సంస్కారం వస్తదా? మనస్తత్వాలు, పరిస్థితులు అని కొన్ని ఉంటయి కదా? నాకొచ్చిన అత్త మన నానీమా బ్యాచ్. లేట్ గ పిల్లలు పుట్టిన్రంట. నాకంటే ఆరేళ్లు పెద్దోడు. అయినా చదువుకుంటున్న నేను షాదీ వద్దంటుంటే విన్నరా? షాదీ అయిన ఆరు నెల్లకేగా కరోనా వచ్చి పడ్డది. లాక్‌డౌన్ ఉండబట్టి ఆల్ల నిజస్వరూపం బయటపడింది. లేకుంటే నా జిందగీ మొత్తం ఎట్లుండేదో? బయటపడినకదా! వర్క్ ఫ్రం హోమ్ చేస్తుండంగనే కంపెనీ మూసేయడంతోటి జాబ్ పోయింది. అతనిది కూడా పోయిందన్నడు. ఇంట్ల ఉన్నప్పుడు గమనిస్తే ఆర్నెల్ల నుంచి నా జీతమే ఆల్ల ఇల్లు నడిపిందని అర్థమైంది. పెద్ద కొడుకు జీతమంత చిట్టీలకు, చిన్నకొడుకు పైసలేమో కొనుక్కున్న సొంతజాగ ఈఎమ్ఐలకు కట్టుకుంటున్నడంట. ముసలాయన పెన్షన్ పైసలుగూడ కొడుకులే గుంజుకుంటరంట. ఇగ మిగిలింది మా ఇద్దరి జీతం. అసలు అతనికి సాలరీ పడంగ ఆ ఆర్నెలల్ల చూడలే. ఆడబిడ్డ రెండో డెలివరీకి ఈడికే వచ్చింది. ఆమె ఏడాదిన్నర బిడ్డ బాగోగులన్నీ నామీదనే ఏసిన్రు. డెలివరీ అయినంక ఈ పిల్లను నేనే చూస్కోవాలని అంటుండేది ఆమె. ఇగ అల్లుడి మర్యాదలకు పైసలు, ఇంటికి సరుకులు, ముసలోల్ల మందులు అన్నీటికి నా ఏటీఎం కార్డే. మొదట్ల నా భర్త, నా ఇల్లే కదా అని ఇచ్చిన. నలభై రూపాయల బ్యాలెన్స్ తోటి నా కార్డు నా చేతిల పెట్టిండు. పైసల గురించి ఒక్కమాట అడగలేదు. నా ఉద్యోగం పోయినంక ఇంట్ల పనిచేస్తున్న పనిమనిషిని తీసేసిన్రు. ఆ ఇంటెడు పని నా ఒక్కదాని మీదనే. నాకు రాకపోయినా ఆడబిడ్డ బిడ్డకు తిండీ తిప్పలు నేనే చూసిన. వీటికి తోడు వేవిళ్లు మొదలైనయ్. నాకు బ్లడ్‌టెస్ట్‌లు చేయించాల్సి వస్తే మాత్రం వేలకు వేలు ఖర్చయిపోతున్నయనీ నెత్తీనోరు బాదుకున్నరు'.. చెప్పుకుంటపోతున్న చెల్లెలిని చూస్తుండిపోయింది ముంతాజ్.

'అంతేనా! యాభై లక్షలతోటి పప్పా షాదీ చేసిండా! ఆల్లకు తృప్తే లేదు. ఎనిమిది లక్షలు అడగమని మా ఆయన, అత్త నన్ను వెంటాడిన్రు. పొద్దున్నా సాయంత్రం.. 'మీ పప్పాకు కాల్ చేసినవా? పైసలు అడిగినవా?' అని ఒకటే బ్లాక్ మెయిలింగ్.. నేను కాల్ చేయకపోయే సరికి పగబట్టిన్రు. నా కొలీగ్స్‌తోటి మాట్లాడితే చాలు. ఆ మాటలు వినుకుంట నాకు బాయ్ ఫ్రెండ్స్ ఉన్నరని రకరకాలుగ నా క్యారెక్టర్‌నే అవమానించిండు. నమ్ముతవా ఆపీ? కనీసం ఇరవై

మందితోటన్న నాకు సంబంధాలు అంటగట్టిండు. నాకంటూ వ్యక్తిత్వం లేదా? నలుగురిచేత ఒప్పించుకుని కాపురం చేయాల్నా నేను? నా నజర్‌ల క్యారెక్టర్ లేనోడిగ దిగజారిపోయిండు. అట్లాంటోడిని నా భర్తగ భరించలేను అసలు. నేను పప్పాకు కూడా భారం కావాల్ననుకోవట్లేదు. నా జిందగీని సరైన దారిలకు నడిపించుకునే కెపాసిటీ నాకుంది. మీరందరు ఉన్నరుగా నాకు సపోర్టుకు. అతడు నాకు స్పెర్మ్ డోనర్ తప్ప మరేమీ కాడు'.. స్థిరంగా ఉన్న జైనబ్ మాటలకు నిర్ఘాంతపోయింది ముంతాజ్.

'ఉద్యోగం చేస్తున్న పిల్ల కావాల్నంటున్నడు మా కొడుకు'.. అన్న జైనబ్ అత్తగారి మాటలు గుర్తుకొచ్చినయి ముంతాజ్‌కు.

'నిజమే! వెన్నెముక లేనోడికి ఉద్యోగం చేసుకుంట కట్నం తెచ్చే పిల్లొస్తే తప్ప ఆ కుటుంబం గట్టెక్కదేమో!'.. నిట్టూర్చింది ముంతాజ్.

గారాబంగా పెరిగిన చెల్లెలు జిందగీ ఇట్ల మలుపు తిరుగుతుందనుకోలేదని కళ్లనీళ్లు పెట్టుకుంది. ఇంత అయినా బతుకు మీద ఆశ పోగొట్టుకోని జైనబ్.. మారిన ఈనాటి ఆడపిల్లలకు ప్రతీకగా అనిపించింది ఆమెకు. ఒకే రక్తం పంచుకుని, ఒకేచోట పెరిగినా ఇద్దరిలోని తేడాకు ఆశ్చర్యపడింది.

'ఇది మారుతున్న జమానాకు నిశాని. హవా కా రూఖ్ బదల్ గయా'.. ఏదో అర్థమైనట్టుగా ముంతాజ్ ముఖంపై కొత్త వెలుగు కనబడింది.

'బతుకు మీద మంచి నమ్మకం ఉందిలే! నేనే భయపడకుండా చెల్లెలి వెనుక నడిస్తే సరి. చిన్నబాబును సంబాళిస్తే చాలు తనే తన బతుకును దిద్దుకుంటది. ఇంక నలుగురికి ధైర్యం నూరిపోస్తది. ముందున్నది నేనే!' నమ్మకంగా అనుకున్నది ముంతాజ్.

***

**నస్రీన్ ఖాన్ స్వస్థలం హైదరాబాద్. జర్నలిజంలో మాస్టర్స్ చేశారు. ప్రస్తుతం 'సమీక్ష' మాసపత్రిక, 'తెలంగాణ పవర్' దినపత్రిక ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2006లో తొలి కవిత 'అతడు X ఆమె', 2012లో తొలికథ 'హీనా' రాశారు. ఇప్పటివరకు 20కి పైగా కథలు రాశారు. 2019లో 'జఖ్మీ' కవితా సంకలనం వెలువరించారు. లాపతా, కొత్త పొద్దు, భరోసా కథలు పాఠకుల మన్ననలు పొందాయి. 2020లో డాక్టర్ పుట్ల హేమలత అవార్డు, హుస్నాబాద్ వారి ఉదయ సాహితీ అవార్డు, 2021లో కవితా భూషణ్, 2022లో వెంకటసుబ్బు స్మారక పురస్కారం అందుకొన్నారు. తెలంగాణ సాహితి సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా పనిచేస్తూ, కవి సమ్మేళనాలు, పుస్తకావిష్కరణలు, కవి పరిచయాలు, కవులు, కథకుల వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఒక సామాన్య కుటుంబంలో 'విడాకులు' సృష్టించే సంక్షోభాన్ని నేటితరం అమ్మాయిలు ఎంత నిబ్బరంగా ఎదుర్కొంటున్నారో, వారికి పదేళ్ల ముందు పుట్టిన మహిళలు చూస్తున్న తీరును ప్రతిబింబించే ప్రయత్నమే ఈ 'దిశ మార్చుకున్న గాలి'.**

# పొద్దు గుంకక ముందే



రమాదేవి నెల్లుట్ల,
94406 22781

ఇంటికి వస్తూనే అరుగుమీద కూర్చున్న పెద్ద కొడుకును చూసి..'ఎప్పుడొచ్చినవ్ కొడుకా? వొస్తున్ననని చెప్పకపోతివి?' అన్నది సుగుణ.. వీరేష్‌తో.

'మా ఫ్రెండ్‌గాన్ని కలువనీకి పొద్దున ఆలేర్ వొచ్చిన. గప్పుడు నువ్వెట్లయిన బాయికాడ ఉంటవు గద! పొద్దుమూకి కలుస్తనని రిటన్ల ఇటొచ్చిన' అన్నాడు వీరేష్.

'కోడలు, పిల్లలు గిట్ల మంచిగున్నరా? తీస్కరాక పోయినవ్!' అంటూ ఇంటి తాళం తీసింది సుగుణ.

చిన్న సంచీలో పెట్టుకున్న స్టీల్ డబ్బా, నీళ్ల బాటిల్ తీసి, ఇంకో దర్వాజా నుంచి పెరట్లోకి వెళ్లి.. గోలెం దగ్గర వేసింది.

గోలెంలోని నీళ్లతో కాళ్లూ, చేతులు కడుక్కొని లోపలికి వచ్చింది. ఇంటినానుకొని చుట్టూ తడికెలతో, పైన తాటాకుల కమ్మలతో కప్పిన దడిలో పొయ్యి వెలిగించి, ఎసరుకు నీళ్లు పడేసింది. ఓ మూల రేకు డబ్బాలోంచి కొన్ని బియ్యం చాట్లో పోసుకొని, చెరిగి పక్కన పెట్టింది.

రెండే గదుల గుడిసెలాంటి పెంకుటిల్లు అది. ఒక గది మరీ చిన్నది. దాన్నానుకొని ఉన్నది కొంచెం పెద్దది, ఉండటానికి కాస్త అనుకూలంగా ఉన్నది. ఓ నులక మంచం, ఓ చెక్క బల్ల వేసి ఉన్నాయి. గూట్లో ఎక్క దీపం, అగ్గిపెట్టె ఉన్నాయి. ఎనుగర్రకు కిందున్న దూలానికి బట్టల

మూట వేలాడగట్టి ఉంది. అందులో కూరగాయల విత్తనాలు ఉంటాయని వీరేష్‌కి తెలుసు.

'ఇప్పుడే వొస్త కొడుకా!' అంటూనే బయటికి వెళ్లి, వెంటనే వచ్చింది.. చేతిలో రెండు కోడిగుడ్లతో! అప్పటిదాకా వీరేష్ అలాగే కూర్చొని ఉన్నాడు. గదిలో లైట్ వేయగానే ఇల్లంతా కొద్దిపాటి వెలుతురు పరుచుకుంది.

'కాళ్లేతులు కడుక్కోరాదు బిడ్డా! తిందాం. ఎప్పుడనంగ తిన్నవో ఏందో!' అంటూ వంట కాగానే కొడుకును పిలిచింది.

'ఏం అర్జెంటులే! తిందాం తియ్యి. మా ఇంట్ల రాత్రికి పొద్దుపోయినంకనే తింటం!' అన్నాడు వీరేష్.

'మీ బస్తీలోళ్లు గట్లనే ఉంటరు. పగలు నాత్రి లెక్క.. నాత్రి పగలు లెక్క. గీడ మీమైతే దిగూట్లె దీపం – కడుపుల మెతుకు అన్నట్టె పొద్దుమూకె యాల్లకే తినాలె.. పండాలె! మల్ల ఎగిలిబారంగనే లేవాలె!' అన్నది సుగుణ.

వీరేష్ ఏమీ మాట్లాడకుండా లేచాడు. అప్పుడే బయట కూడా చీకటి చిక్కపడుతున్నది. బజారు లైట్ పడుతున్నంత మేరా.. ఇంటివెనుక కొద్దిపాటి స్థలంలో వెలుగు నిండింది. దొండ, చిక్కుడు, ఆనప లాంటి ఐదారు పాదులున్నాయి. తీగలు పాకడానికి కర్రలతో పందిళ్లు వేసి ఉన్నాయి. కాళ్లు కడుక్కొని లోపలికి వచ్చాడు వీరేష్.

'పొద్దున రాజమ్మత్త తెచ్చుకున్నదట. నాకింతిస్తె వొండిన. నేను తెచ్చుకున్నప్పుడు గామెకు ఇస్త' అంటూ కోడి కూర వడ్డించింది.

'నువ్వు కోడి కూర మస్తు చేస్తవ్!' అంటూ తల్లిని మెచ్చుకున్నాడు వీరేష్. ఆ తరువాత పొడిపొడిగా మాట్లాడుతూ తల్లీకొడుకులిద్దరూ భోజనం ముగించారు.

'ఈ ఇంట్ల గింత తిప్పలబడుకుంట ఎన్ని దినాలుంటవ్ అమ్మా?' నిద్రలోకి జారుకుంటుండగా, వీరేష్ ప్రశ్నకు కళ్లు విప్పిన సుగుణకు ముందు అర్థంకాలేదు. అర్థమయ్యాక అన్నది..

'నేను పట్నం వొచ్చి ఏం జేస్త కొడుకా? నీ ఇల్లు గూడ శిన్నదే గద! నేనేడ ఉందు?'.

'గట్ల గాదమ్మ, గీ ఇల్లు పడగొట్టి స్లాబ్ బోసి ఇల్లు గడదాం! మేమొచ్చినా, నీ మనుమలు, మనుమరాండ్లొచ్చినా తిప్పలుండది'.

'ఇల్లు శిన్నదనేనార.. వాళ్లు గీడికి వొస్తలేరు!'. 'ఏ..గట్లగాదుగని, నువ్వుమటుకు ఎన్ని దినాలు తిప్పలబడ్తవ్? కట్టుకుంటె మంచిగుంటదని!'.

'ఏమన్న పైసలు కూడబెట్టుకుంటె మీరు బస్తిల ఒగ ఇల్లు వొనరు జేసుకోండి. గీడ నాకు కొత్తిల్లు ఎందుకురా? గీ ఇల్లు నాకు నడువదా బిడ్డా!'.

తడబడ్డాడు వీరేష్... 'గట్ల గాదమ్మా! నాకాడ గన్ని పైసలేడున్నయ్? మన శెల్క అమ్ముదామని!' అన్నాడు మెల్లగా.

ఆ మాటకు సుగుణ నిద్ర ఎగిరిపోయింది.

'ఏందిరా.. శెల్క అమ్ముతావ్? అమ్మి ఇల్లు గడ్తవా? ఇల్లు కాలబెట్టి పేలాలు ఏంచినట్టు

ఉన్నది నీ కత! గీ బుద్ధి నీకే పుట్టిందా? ఎవలన్న జెప్పిన్లా?' అన్నది కోపంగా.

'గట్ల గాదమ్మా! మా దోస్తుగాడు జెప్పిండు. వాళ్లకు ఎరుకున్నోళ్లు బాగ పైసలిచ్చి కొంటమన్నరట! గంత రేటు మల్ల కావాల్నంటె వొస్తదా? ఒగ చిన్న ఇల్లు ఏసుకోవచ్చు. కడుమ పైసలు నేను పనిజేసే చిట్‌ఫండ్ కంపెనీల పెట్టుకుంటె మస్తు వడ్డీ ఇస్తరు. నీకీ కష్టం లేకుండ ఇంట్ల ఉండొచ్చు'. నచ్చజెప్ప చూశాడు వీరేష్.

'వడ్డీ ఇచ్చుడేమో గాని, వాడు అసలుకే ముంచుతె ఏం జేస్తవ్‌రా?' సూటిగా కొడుకును అడిగింది సుగుణ.

ఏమీ చెప్పలేకపోయాడు వీరేష్.. 'గట్లుండదమ్మా! ఎందుకు ముంచుతరు?' అన్నాడు చివరికి. సుగుణకు కోపం, బాధ, ఉక్రోషం ఒకేసారి తన్నుకొచ్చాయి.

'మీ నాయిన తాగితాగి వాళ్ల అమ్మ – నాయిన ఇచ్చిన రెండెకరాలు అప్పులకింద అమ్మినంక రోగానబడితె.. ఉన్న గాయిన్ని పైసలు, నేను కూలినాలి జేసి కూడబెట్టిన పైసలు, నా గంటెపుస్తెలు కతం అయినయి. నేనెంత కష్టపడ్డనో, ఏం పని చేసిన్నో, తినీతినక బతికి మీ పెండ్లిల్లు జేసిన. కోడండ్లకు గంతో గింతో బంగారం పెట్టిన. నా బతుకు నేను బతుకుతున్న. గా ఎకురం శెల్క మీ నాయినది గాదు. మా అవ్వగారోల్లు ఇచ్చింది. నేను పోయేటప్పుడు కొంచపోతనా? నా మనుమరాండ్లకు ఇస్త! గిప్పుడు అమ్మేటిదే లేదు'.. అన్నది నిక్కచ్చిగా.

'గదే పైసలు భూమి అమ్మి నీ మనుమరాండ్లకే ఇయ్యరాదు! నాకో బిడ్డ, తమ్మునికో బిడ్డ ఉండిరి. భూమిల ఏమొస్తున్నది.. దుక్కమే గద!' అన్నాడు వీరేష్.

సుగుణ మాట్లాడలేదు. ఆలోచిస్తున్నది.. తల్లి మెత్తబడుతున్నదని మళ్లీ అన్నాడు వీరేష్..

'ఎకరానికి లక్షగూడ పల్కని కాడ నలభై లక్షలిస్తరట! మనం ఇంకింత గుంజితే యాభై పడొచ్చు.. ఏమంటవమ్మా?'.

సుగుణ నుంచి జవాబు లేదు. అప్పటికే నిద్రలోకి జారుకుంది. మర్నాడు తెల్లారగానే తల్లి ఇచ్చిన చాయ్ తాగి బయల్దేరుతూ.. 'ఎప్పుడు తీసుకరాను వాళ్లను?' అనడిగాడు వీరేష్.

'ఎవల్లను?' అన్నది మళ్లీ కొత్తగా సుగుణ.

'ఇంకెవల్లను? భూమి కొనేటోల్లను!' అన్నాడు వీరేష్ అసహనం అణుచుకొని.

'అయితే మొదలే వాళ్లను కనుక్కొని ఇటొచ్చినవా? అయినా తమ్మున్ని సుత అడుగాలె గద!' అన్నది సుగుణ. 'మరి నిన్న మా దోస్తు దగ్గరికి ఎందుకు పోయిన అనుకున్నవ్? వాడే నడిమిట్ల బ్రోకర్ అన్నట్టు! మనకు మంచి రేట్ ఇప్పిస్తడు. తమ్ముడు మటుకు వొద్దంటడా? ఈ తాప వాన్ని తీసుకొనే వొస్త!' అన్నాడు వీరేష్.

'ఇప్పుడే ఏం జెప్పకు! ఎందుకో భూమి అమ్మేటందుకు నా మనసుకొస్తలేదు!' అన్నది సుగుణ. 'సరే తియ్యి. ఫోన్ జేసి వొస్త!' అంటూ వెళ్లిపోయాడు వీరేష్.

సుగుణ పత్తి చేనులో కూలీకి బయల్దేరింది.

***

మూడ్రోజుల తరువాత..

పొద్దంతా పత్తి ఏరి కుప్పపోసి జోకించుకొని కూలి తీసుకొని బయల్దేరారు సుగుణ, పద్మ. పొలాల నుంచి ఇంటి బాట పట్టంగానే దారిలోనే బైక్ మీద ఎదురయ్యాడు మల్లేష్.

'ఎక్కు.. ఇంటికి బోదాం!' అన్నాడు.

'ఎప్పుడొచ్చినవ్ రా! గీడికెట్ల వొచ్చినవ్?' అన్నది సుగుణ చిన్న కొడుకుతో.

'ఇంటికి పోతే తాళం బెట్టి ఉన్నది. వాళ్లను, వీళ్లను అడుక్కుంట వొచ్చిన!' అన్నాడు మల్లేష్.

'నువ్వు పా! మేం నడుసుకుంట ఎంతెల్లం వొస్తం. గీ చిన్నమ్మ ఉన్నది గద!' అన్నది సుగుణ.

'నువ్వు పో అక్కా ! నీ కొడుకు పిలుస్తున్నడు. నేను నడిశి వొస్తలే!' అన్నది పద్మ.

'ఏ.. గట్లుంటదా! ఏం గాదు. ఇద్దరం కల్సే పోదాం. నువ్వు పోరా!' అన్నది సుగుణ.

ఇంటికి పోగానే తొందరగా వంట చేసి పెట్టింది సుగుణ. ఇద్దరూ కింద కూర్చుని తింటున్నారు.

'మన శెల్కల ఏం పండుతున్నదే! ఎంతొస్తున్నది?' అడిగాడు మల్లేష్ సడన్‌గా.

సుగుణ ఈసారి కంగారు పడలేదు.

'గిన్ని దినాలకు 'శెల్కల ఏం పండుతున్నది? ఏమొస్తున్నది?' అని అడుగుతున్నావురా?' అన్నది నవ్వుతూ. 'ఎహె.. చెప్పరాదు!' అన్నాడు మల్లేష్.

'ఉన్న ఒక్క ఎకురంల ఏమేస్త? మక్కజొన్న, కందులు, పల్లికాయ, పత్తి.. గివే ఏస్త!'.

'ఎంతొస్తది ఏడాదికి?'.

'ఏమొస్తదిరా? ఖర్చులన్నీ పోను.. పదిహేను – ఇరువై వేలొస్తయి. ఒక్కొక్కసారి గవ్వి గూడ రావు'. 'మరెందుకా ఎవుసం చేసుడు? పెట్టుబడి దండుగ. పని దండుగ!'.

'గదొక్క దానిమీన బతుకుతనా రా? అన్నొద్దులు ఆడనే కూసుంటనా? మన శెల్కల పనిలేనప్పుడు బయటోళ్లకు కూలికి పోతగాదుర!'.

'గిట్ల తిప్పలబడే కన్న గా శెల్క అమ్మరాదే! పైసలొస్తే కాలు మీన కాలేసుకొని సుకంగ ఉండొచ్చు'. 'పని చేయకుండ సుకంగ ఎట్లుంటం కొడుకా? లేని రోగాలస్తయి. అట్లుండే పైసలు ఎన్ని దినాలుంటయి? అయిన సుత ఒగ సర్వ ఉంటె అండ్ల ఒండుక తినాలె గని.. గా సర్వ అమ్ముకొని సొదలు తెచ్చుక తింటె తెల్లారి ఎండ్ల తింటం? భూమి ఉంటెనే ఊర్లె గింత విలువుంటది. భూమి లేకుంటె ఎవడు దేకుతడురా? గడికి శెల్క అమ్ముతనంటరేంది?' అన్నది సుగుణ విసుగ్గా.

'మన శెల్క పక్కన పెద్ద హోటల్ కడ్తాన్రు. ఉండేటందుకు రూములు, తినేటందుకు అన్ని తీర్ల పెద్ద పెద్ద హాళ్లు, బాగ పైసలు పెట్టేటోల్ల గురించి! వాండ్లే మన భూమి కొంటరంట. అటుదిక్కు ఇద్దరి ముగ్గురివి కొన్నరట. ఇగ మనదే ఉన్నదంట! వాండ్ల కంటె ఎక్వ ఇస్తమంటున్రు. నువ్వు ఒప్పుకొంటే మాట్లాడుదం' అన్నాడు మల్లేష్.

'యాదగిరి గుట్టకు పొయ్యే.. గదేందో ఔటర్ రోడ్డు వొస్తుందట గద! మన శెల్క రోడ్డుకు తాక్కుంట ముంగటికి ఉన్నది. వాండ్లు కొన్న భూమి జర ఎన్కకు ఉన్నది. మనది కొంటెనే

వాండ్లకు రోడ్డు మొకాన తొవ్వ అయితది. గందుకే మన ఎన్క పడ్తున్ను' నెమ్మదిగా చెప్పింది సుగుణ. 'ఇంకేంది? నీకన్నీ ఎరికే! ఎవలు చెప్పిన్లు?' అన్నాడు ఉక్రోషంగా మల్లేష్.

'ఎవలు జెప్తె ఏంది? నేనైతె భూమి అమ్మ!' నిక్కచ్చిగా చెప్పింది.

'నీకు దండం పెడ్తనే! నాకు శాన తిప్పలున్నది. బగ్గ అప్పులైనయ్. ఇజ్జత్ పోయెటట్టు ఉన్నది. ఒక్క పది లక్షలు గావాల్నే.. పానం మీదికి వొచ్చేటట్టు ఉన్నది..' ఏడుపొక్కటే తక్కువన్నట్టు ఉన్నాడు మల్లేష్.

'అప్పులెందుకు అయినయ్? నీ కొడుకు పుట్టిన్రోజుకు అప్పు జేయాల్నా? నీ బిడ్డ పెద్ద మనిషి ఐతే అప్పు జేసి, గంత పెద్ద ఓటల్‌ల ఫంక్షన్ జేయాల్నా? నీ ఆమ్‌దానికి అప్పు జేసి.. కారు కొనాల్నా? కప్పు ఎంతో కాలు గంతే సాపుకోవాలె.. లేకుంటే అప్పులు ఎక్వయి కుతికె మీదికి ఒస్తది!'.

'టాక్సీ నడుపుతనని కారు కొన్న గాదె!'.

'గండ్ల నువ్వు, నీ పెండ్లం, పిల్లలు తిరుగుడే ఎక్వ ఆయె! గీ వయిసుల అప్పులయినయని భూమి అమ్మితే గా పైసలుంటాయిర? రేపు గింతకన్న పెద్ద తిప్పలొస్తె ఏం జేస్తవ్? బతుకు కొసదానుక ఎల్లొద్దా?'.

'అమ్మా! నువ్ తిట్టినా పడ్తగని, భూమి అమ్మకుంటే దిక్కు లేదే! నేను ఉరి బెట్టుకోవాలె, లేకుంటె బండికింద తలకాయ బెట్టాలె!'.

'నన్ను బెదిరిస్తున్నావుర? నీకు గంత తిప్పలుంటె మా గ్రూపుల లోను ఎత్తి రెండు లక్షలిస్త! నువ్వు ఇచ్చినా, ఇయ్యకున్నా నేనే ఏదో కష్టం చేసుకొని కిస్తు కట్టుకుంట. ఇగ గా ముచ్చట తియ్యకు'.

**రెండు నిమిషాల్లో నిద్రపోయింది సుగుణ.**

***

హైవే మీద పది కిలోమీటర్ల దూరం నుంచే.. 'హోటల్ సంతోషం' వాళ్ల వెల్కమ్ బోర్డులు చూస్తూ వస్తున్నారు వీరేష్, మల్లేష్.

పెట్రోల్ బంక్‌లూ, ఫ్రూట్ జ్యూస్ పాయింట్లూ, పండ్ల బండ్లూ దారికి ఇరుపక్కలా వెలిశాయి. సడన్‌గా వాళ్ల దృష్టి రోడ్ పక్కగా ఉన్న టిఫిన్ సెంటర్ పైన పడింది. కారును ఆపి దిగారు వాళ్లు.

అందమైన చిన్న గుడిసె. ఎర్రమట్టి గోడలపై తెల్లని ముగ్గులు వేసి ఉన్నాయి. బయట పొడుగ్గా పందిరి వేసి ఉంది. దాని కింద పొడుగాటి చెక్క బెంచీలు, టేబుల్స్, కొన్ని ప్లాస్టిక్ కుర్చీలు వేసి ఉన్నాయి. వాటిలో కొందరు మనుషులు కూర్చుని ఉన్నారు. వెనకాలే మక్కజొన్న చేను ఏపుగా పెరిగి కంకి తొడిగి ఉంది. కొందరు అక్కడ ఫొటోలు దిగుతున్నారు. ఒకరిద్దరు ఆ పక్కనే పంపులోంచి చేనుకు నీళ్లు వెళ్తుంటే అక్కడ కాళ్లూ, చేతులూ కడుక్కుంటూ ఫొటోలకు ఫోజులిస్తున్నారు. రోడ్డు పక్కన ఉన్న చెట్ల నీడకు రెండు కార్లు, నాలుగైదు బైకులు

ఆగి ఉన్నాయి.

రెండు పొయ్యిలు పక్కపక్కనే వెలిగించి ఉన్నాయి. ఒకదాని మీద పెనంపై జొన్నరొట్టెలు కాల్చి వేడిగా ప్లేట్లలో వేస్తున్నది పద్మ. ఇంకో  పొయ్యిమీద టీనీళ్లు మరుగుతున్నట్టు ఉన్నాయి. దాని పక్కనే అరుగు మీద కూర్చుని కుంపట్లో మక్కజొన్న కంకులు కాలుస్తున్నది సుగుణ.

సుమారు ఇరవై ఏళ్లున్న ఓ యువకుడు ప్లేట్లలో అందరికీ అడిగినవి తెచ్చి ఇస్తున్నాడు.

కొడుకులనూ, వాళ్ల వెంట కొత్త వ్యక్తినీ చూసిన సుగుణ..

'కూసోండి బిడ్డా! గిప్పుడే వొస్తాన్రా!' అన్నది కంకిని నిప్పుల్లో తిప్పుతూనే.

ఏమీ మాట్లాడకుండా బెంచీ మీద కూర్చున్నారు వాళ్లు.

'మంచినీళ్లు ఉత్తయా సర్! బాటిల్ ఇయ్యమంటారా?' వినయంగా అడిగాడు ఆ యువకుడు.

'అరేయ్ రవీ! వాళ్లు నా కొడుకులేరా!' అన్నది సుగుణ నవ్వుతూ.

'అయ్యో పెద్దమ్మా! నాకు తెల్వదు.. సారీ అన్నా! ఏం తింటరు?' అడిగాడు రవి.

'ఏమున్నయ్?' అన్నాడు వీరేష్.

'మిర్చి బజ్జి, జొన్నరొట్టె, మక్క గారెలు, సర్వపిండి, చికెన్ కర్రీ, పప్పు.. లేకుంటే మక్క కంకులు, చాయ్.. ఇంక కూల్ డ్రింక్స్ కావాల్నంటె కూడ ఉన్నయి' అన్నాడు రవి గబగబా.

'మేం జర సేపు వెయిట్ చేస్తంలే! నీ గిరాకీ చూసుకో!' అన్నాడు మల్లేష్.

'మీ అమ్మను ఒప్పిస్తామన్నారు. ఆవిడేమో ఇక్కడ ఓ ఎస్టాబ్లిష్‌మెంట్ స్టార్ట్ చేసింది!' అన్నాడు వెంట వచ్చిన దోస్తు.

కొద్దిగా రద్దీ తగ్గగానే, తల్లి దగ్గరికి చేరారు కొడుకులిద్దరూ.

'అన్నం కాంగనే తిందాం. కాళ్లూజేతులు కడుక్కొమ్మను మీ దోస్తును!' అన్నది సుగుణ.

అక్కడే అన్నం తింటూ.. 'గింత జల్దిన.. గిదంత ఎట్ల జేసినవమ్మా!' అన్నాడు ఆశ్చర్యంగా వీరేష్.

'ఎంత మిగుల్తాంది రోజుకు? ఇంక గూడ డెవలప్ జెయ్యొచ్చు' అన్నాడు చిన్న కొడుకు.

'ఊర్లె ఉండే దానికన్న ఈడ్నే గుడిసె ఏస్కోని ఉంటె మంచిగుంది. గుట్టమీద దేవుని కాడికి రోజు వొచ్చేటోల్లు, పొయ్యేటోల్లు శానమంది ఉంటరు. వాళ్లు ఆకలి మీన ఉన్నప్పుడు మన కాడ ఉండేటిది మనం జేసి అమ్మితె మంచిగుంటది గదా అనుకున్న. పద్మ మొగడు గూడ తాగితాగి సచ్చిపోయిండు. గామెకు ఒక్కడే కొడుకు. జర సదువుకున్నడు గానీ, ఊరు వొదిలిపెట్టి పోనంటండు. 'నేను గూడ కలుస్త అక్కా!' అన్నది. పెట్టుబడి, కష్టం ఇద్దరిది. గీ రవి ఎట్లయినా ఉంటడు. ఇప్పటికైతే మంచిగనే ఉన్నది' అన్నది సుగుణ.

'వంటలు బాగా రుచిగా ఉన్నాయి. మీ టిఫిన్ సెంటర్ బాగానే నడుస్తుంది. లొకేషన్ అడ్వాంటేజ్ మీకు' అన్నాడు దోస్తు.

'ఇప్పుడు మంచిగనే ఉండొచ్చు గని, ముందుముందు గా హోటల్ ఓపెన్ అయితే ఎట్లుంటదో?!' అన్నాడు మల్లేష్.

వీరేష్ అవుననలేదు.. కాదనలేదు.

సుగుణ వెంటనే జవాబిచ్చింది.. 'గట్ల ఎందుకు అనుకోవాలె కొడుకా? ఎవల గిరాకీ వాళ్లది. అగ్వకు తినాలె, జల్ది తినాలె, గివ్వే తినాలె అనేటోల్లే గీడికి ఒస్తరు. వాళ్ల ముంగట్నే ఉడుకు ఉడుగ్గ జేసి పెడుతం. గట్లకావాల్ననేటోళ్లు కూడ ఉంటరు. అందరు పైసలు బగ్గ ఉన్నోళ్లే ఉంటరా? మీరు గిప్పుడు వొచ్చే తొవ్వల రోడ్డు మీన కార్లు, సైకిళ్లు, ఆటోలు, లారీలు, బస్సులు, సైకిల్ మోటర్లు, ట్రాలీబండ్లు.. ఎన్ని పోతలేవు? ఎవని జాగ వానిదే! 'నువ్వు గిట్ల రావొద్దు' అని ఒకడు ఇంకోన్ని అంటడా? టక్కర్ పెట్టకుండ నడుపుకుంటె బాయే. గిది గంతే!'

సాయంత్రం అవుతున్న సూచనగా మెల్లమెల్లగా నీడలు పరుచుకుంటున్నాయి. మళ్లీ జనం రావడం మొదలయింది.

'ఇగ పోండ్రి బిడ్డా! పొద్దు గుంకుతున్నది. చీకటయితె తొవ్వ కనబడది. ఎదురుంగొచ్చే బండ్ల లైట్లు కండ్లల్లకొడ్తయ్.. సరిగ్గ నడుపరాదు. పయిలం!' అంటూ కొన్ని జొన్నరొట్టెలు, గారెలు, మిర్చీ బజ్జీలు పిల్లల కోసం పొట్లంకట్టి ఇచ్చింది.

పద్మ మళ్లీ పొయ్యి వెలిగించింది.

***

రమాదేవి నెల్లుట్ల స్వస్థలం ఉమ్మడి వరంగల్ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్. ఎంఏ చేశారు. వృత్తిరీత్యా ఆంధ్రాబ్యాంక్‌లో సీనియర్ మేనేజర్‌గా పనిచేసి విరమణ పొందారు. కార్టూన్లు గీయడం, కథలు, కవిత్వం రాయడాన్ని ప్రవృత్తిగా ఎంచుకొన్నారు. ఇప్పటివరకూ మనసు భాష (కవిత్వం), రమణీయం (కార్టూన్లు), మనసు మనసుకూ మధ్య (కథలు), చినుకులు (నానీలు), తల్లి వేరు (కథలు) పుస్తకాలను వెలువరించారు. 2004లో సుశీలా నారాయణ రెడ్డి పురస్కారం, 2014లో అపురూప అవార్డు అందుకొన్నారు. 2015లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా వరంగల్ జిల్లా స్థాయిలో ఉత్తమ రచయిత్రి పురస్కారాన్ని దక్కించుకొన్నారు. అదే ఏడాది పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి కీర్తి పురస్కారం, జాతీయ సాహిత్య పరిషత్తు, సిద్దిపేట వారి ఐతా భారతి – చంద్రయ్య సంప్రదాయ కథా సాహితీ పురస్కారం అందుకొన్నారు. గిడుగు రామమూర్తి పంతులు ఫౌండేషన్ అవార్డు, పర్చా రంగారావు స్మారక పురస్కారం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి ప్రతిభా పురస్కారం, వెంకటసుబ్బు స్మారక అవార్డు, తిరుమల స్వరాజ్యలక్ష్మి సాహితీ పురస్కారం దక్కించుకున్నారు. ఉత్తమ కార్టూనిస్టుగా బాపు – రమణ అకాడమీ నుంచి రాగతి పండరి స్మారక పురస్కారం అందుకొన్నారు.

# కాటుక కన్నుల సాక్షిగా



వేణు మరీదు,
85550 53547

మా ఊళ్లో ఆ రోజుల్లో కాకులు, కోకిలలు కూడా కాటుక పెట్టుకున్నట్లే కనపడేవి నాకు. పూర్తిగా కూలిపోయి నల్లతుమ్మలు, రేగుపొదలతో చిట్టడివిలా మారిన దొర గడీ వెనుక ఎప్పుడో ఒకసారి కనపడే నెమలీ, పటేలు మామింట్లో నెమలి పుంజు కూడా! అలా అని నాకనింపించేవా? లేక నిజంగానే వాటికీ కాటుకేమైనా ఉండేదా?

ఊరిలో ఆడవారంతా మహా కళాత్మకంగా కాటుక దిద్దుకునేవారు. రేచీకటి రమణక్కతో సహా! ఒకటో తరగతి వరకూ నాకూ మా అమ్మ కాటుకద్ది బడికి పంపేది. ఒకరోజు బళ్లో రామయ్య సారు..

'అరేయ్! ఈడు రోజూ కాటుక పెట్టుకుని వస్తున్నాడు. అమ్మాయిల మద్దెలో కూసోబెట్టండ్రా'.. అనేసరికి, మా పోర్లు పోరగాళ్లంతా ఒక్కపెట్టున నవ్వారు. అప్పుడు నాకు తెలిసింది.. ఆడ, మగను 'వేరుచేసేది' కాటుక అని!

ఎర్ర దమయంతి కాటుక ఎంతో ఇష్టంగా, అందంగా పెట్టుకునేది. ఆమె 'నలుడు' పోయి చాలా యేళ్లవుతున్నా, ఆమె ముత్తయిదువలకుండే ఐదుతనాల్ని వదిలేసినా.. ఎందుకో కాటుకను మాత్రం వదల్లేదు. కాటుకద్దుకున్న ఆమె కళ్లు రెక్కలు తొడుక్కున్న గండు చీమల్లా కనిపించేవి. ఊళ్లో ఎక్కడైనా 'చక్కెర' దొరుకుతుందా? అని అవి వెతుక్కుంటున్నట్లుగా అనిపించేవి! ఎంత ఇంపుగా కాటుక దిద్దుకున్నా ఆమె కన్నుల్లో పొద్దుజారుతున్న వేళ నారింజ రంగు మబ్బుల గీతల్లా ఎరుపు జీరలు కదలాడుతుండేవి. వాటిల్లో ఆమె కన్నీరంతా దాచుకున్నట్లు అనిపించేది.

నల్ల శ్రీదేవి కాటుకను దిద్దుకునేది, అద్దుకునేది, ఇంకా.. రాసుకునేది, పూసుకునేది అనేకంటే పొద్దున్నే లేచి కళ్లకు కాటుక 'తినిపించేది' అంటే బాగుంటదేమో! ఆ అమ్మాయి ఎంత మందంగా కాటుక దిద్దుకునేదంటే.. ఆమె అప్పట్లో

అమెరికాలో పుట్టి ఉంటే 'థామస్ విలియమ్స్' అనే ఆయన ఎగిరి గంతేసేవాడు. ఒకరోజు తన చెల్లెలు మెత్తని బొగ్గుపొడి, వేజలైన్‌లాంటి జెల్లీతో కలిపి కాటుకలా పెట్టుకుంటుంటే చూసిన అతను ఆ ఫార్ములాతో మొట్టమొదటి కమర్షియల్ కాజల్‌ను తయారుచేసి, ఆమె పేరుతోనే 'మేబిలీన్ కాస్మోటిక్స్' సంస్థను ప్రారంభించాడట. అదే మెల్లగా ఒక మల్టీనేషనల్ కాస్మటిక్ కంపెనీగా ఎదిగింది. మా ఊరి శ్రీదేవి అక్కడ పుట్టి ఉంటే.. వాళ్లు తమ సంస్థకు బ్రాండ్ ఐకన్‌గా ఆమెను పెట్టుకునేవాళ్లేమో! కన్నయ్య మేనిఛాయ తనది. తన నలుపు ముఖానికి తెల్లని మధ్యహద్దులుగా ఉన్న ఆ కన్నులకు శ్రీదేవి తన చూపుడు వేలితో చాలా బారుగా కాటుక రాసుకునేది. మధ్యలో ఆమె ఎప్పుడైనా ఓసారి లిప్తపాటు రెప్పలు మూస్తే ఒక గుండ్రని నీలి తటాకంలో ఉన్న రెండే రెండు పెద్ద కలువల్ని చటుక్కున ఎవడో వచ్చి తెంపుకెళ్లినట్టు ఉండేది. పక్క టౌన్‌లో కాలేజీ నుంచి సాయంత్రానికల్లా ఇంటికొచ్చిన శ్రీదేవి జడలోని కనకాంబరాలు వాడిపోయి మ్యాచింగ్‌గా వేసిన ఆ పూలరంగు ఓణీతోపాటు ఆమె కన్నుల కాటుక కూడా చెదిరిపోయి ఉండేది!

సాలోళ్ల రుక్కమ్మక్క కళ్ల కాటుక గురించి చెప్పకపోతే కాటుక్కాయ అలిగి ఆత్మహత్య చేసుకుంటదేమో! నిండార తలంటుపోసుకుని అమ్మవారికి దీపారాధన చేసొచ్చి, మగ్గం ఆడిస్తూ కూర్చున్న రుక్కమ్మ పండరీపురంలో ఆషాఢ ఏకాదశి రోజున ఎంతో శోభతో మెరుస్తున్న రుక్మిణీదేవిలానే ఉండేది. రుక్కమ్మ కన్నులు బంగారు చేపలే! గాజుతొట్టెలోవి కావు.. పాల సంద్రంలోవి! తెలతెల్లని ఆమె మోముపై చుట్టూ వలయంగా కాపలా కాస్తున్నట్లుండే నల్లని భటుల్లాంటి ఆమె మందపాటి కనురెప్పలు.. అసలా కన్నులకు కాటుకే అవసరం లేదు! ఐనా శివమ్మత్త చెప్పిందట.. కాటుక సైతాను పీడలేకుండా చేస్తుందని! ఆ నమ్మకంతోనే ఏ రోజూ మర్చిపోకుండా కాటుక ధరిస్తుంది రుక్కమ్మ. రుక్కమ్మ కళ్లు ఎంత బంగారు చేపల్లా ఉన్నా.. ఆమె పెనిమిటి వాటిని చూసుకోకుండా సానికొంపల్లో పిత్తపరిగెల పులుసులకు మరిగాడు. రుక్కమ్మకున్న సైతాను పీడ అదొక్కటే. భర్త తమను పట్టించుకోకున్నా తన ఇద్దరు ఆడపిల్లల రేపటికోసం రేయింబవళ్లూ మగ్గం తొక్కే రుక్కమ్మ.. కాళ్లు బలహీనమవుతున్నా ఆమె కాటుక కళ్లు మాత్రం ఎప్పటికీ వెలుతురు నదులే! మగ్గంపై జరీదారాల కాంతులు ఆ కళ్లల్లోపడి ప్రతిఫలించి ఇంద్రచాపాలయ్యేవి! మా రుక్కమ్మక్క కాటుక కళ్లు చేయి తిరిగిన చిత్ర లేఖకులు పాలరాతి ఫలకాలపై అద్దిన తెలుగక్షరాలలోని స్వర్ణాల వృత్తాలు.

నూర్ పర్వీన్ కాటుక కళ్లను దగ్గరగా చూస్తే అంతే మరి. నూర్ పూర్వీకులు నవాబులంట. నిమ్మపండు రంగు మేనిఛాయతో పందిరెత్తుండే నూర్‌కు ఊరిలో మిగతా ముస్లిం అమ్మాయిలంటే కొంచెం చులకన. వాళ్లంతా దూదేకులోళ్లనీ, తమది మాత్రం పూర్వం నుంచీ గొప్ప నవాబుల 'జనానా' సంప్రదాయమని ముక్కుపుటాలెగరేస్తూ గర్వంగా చెప్పుకొచ్చేది. వాళ్ల జమానా నాటి వైభవపు రోజుల్లో వాళ్లిళ్లల్లో మూలికలు, ముత్యాల పొడులతో ఇంకేవో

కలిపి 'సుర్మా' తయారు చేసేవారని, దానిని ఎంతో ఇష్టంగా తమ కుటుంబాల్లో స్త్రీలు, రంజాన్ మాసంలో పురుషులు కూడా చక్కగా దిద్దుకునేవారని కథాకథనంగా చెప్పేది. ఇప్పుడు మాత్రం వాళ్లు సిబ్బిరేకు మీద దీపం మసితోనే కాటుక చేస్తున్నారు. తల, ముఖానికి ఆమె హిజాబ్ చుట్టుకున్నా.. నేత్రభాగం వదలాలి కాబట్టి నూర్ పర్వీన్ కాటుక కళ్లు ఆ హిజాబ్ వస్త్రం అనబడే నల్లని దిక్చక్రంపై రెండు చిరుముత్యాల్లా మెరుస్తూ కనిపించేవి. పర్వీన్‌వి కొంచెం చిన్నగా ఏనుగు కన్నుల్లా ఉన్నా.. తెలుగు మాస్టారు గారి అబ్బాయి రంగనాథను చూస్తే మాత్రం పొంగడాల్లా పొంగేవి. 'మియ్యాలకు అయ్యోర్లకు సెట్ కాదులేండ్రా.. ఈ లేత బాపన శరీరంపై మటన్ కత్తుల థిల్లానా ఆడిస్తారా ఏంట్రోయ్..' అంటూ నవ్విస్తూ తప్పుకునేవాడు రంగనాథ. వాడిప్పుడు ఎస్పీ. మా దోస్తుల్లో సివిల్ సర్వీసెస్ సాధించిన ఏకైక వ్యక్తి.

ఏ మగాడైనా సాధారణంగా ఓ సౌందర్యరాశిని నిండారా నఖశిఖం చూస్తే చలిస్తాడు.. జ్వలిస్తాడు.. ఉద్రేకాలు తట్టుకోలేనోడయితే స్ఖలిస్తాడు! ఒకటి కాదు.. రెండు దాల్ లేక్‌లను పక్కనుంచి కాటుక సింగారిస్తే ఎలా ఉంటుందో అలా చక్కగా ఉంటాయి దయామణి కాటుక పెట్టుకున్న కన్నులు. ఆమె కన్నులు చూస్తే పాషాండుడైనా రసిక పిపాసి అవ్వాల్సిందే! మా ఊళ్లో కమ్మోళ్ల, కాపోళ్ల పిల్లగాళ్లు 'కాలనీ'లోకి వెళ్లారంటే కూలీకి మనుషుల్ని పిల్చుకురావడానికి, లేదంటే దయామణి నేత్రజ్యోతులను దర్శించి రావడానికే! దేవాలయాల్లో స్త్రీమూర్తుల ప్రతిమల ముఖాలలో కొన్నిచోట్ల కళ్లను ముఖానికి ఇరువైపులా మించి ఆర్చీ వంపుల్లా, పూరేకుల కొసల్లా మిగులు కనురెప్పలు బయటకు చెక్కి ఉన్నట్లు దయామణి కన్నులు వైభవంగా మెరిసేవి. ఆ అమ్మాయి వాళ్లది ఆర్‌సీఎమ్ విశ్వాసుల కుటుంబం. పసుపు కుంకుమలు పెట్టకపోయినా కాటుక మాత్రం దిద్దుకునేది. అప్పట్లో నీలం రంగు లంగా జాకెట్టుపై తెల్ల జార్జెట్ ఓణీ యూనిఫాంతో సగం తెల్లని మేఘాలొకవైపు సగం నీలి మేఘాలొకవైపు ప్రతిబింబించే తేట ఊట చెరువులా గంభీరంగా అగుపించేది దయామణి.

అసలు మా ఊరే ఒక పెద్ద కాటుక కన్ను. నల్లటి రేగడి మట్టి రోడ్లు.. పేడ, నల్ల బంకమన్నుతో అలికిన గోడలు, అరుగులు, వాకిళ్లు! ఎండీ తడిసీ వెలిసిపోయి నల్ల అట్టల్లా కనిపించే జమ్మిగడ్డితో వేసిన పై కప్పులు. గట్టున నల్ల తుమ్మల నీడల్ని వాటేసుకుని పడుకున్న పెద్ద చెరువు. కొండప్రాంతం కాబట్టి పిలిస్తే వస్తాయి అన్నట్లు ముసురుకునే వానమబ్బుల్తో, శివుని జటాజూటాల్లా వీధి వీధినా పెరిగిన నల్లవేప మానులు. ఊరంతా చెట్లపై కాకుల గుంపుల్తో, కాకుల్లాంటి ఎందరో మనుషుల గుంపుల్తో మా ఊరే దట్టంగా కాటుకద్దుకున్న చక్కని కన్నులా ఉండేది.

తెల్లవారు జాముకల్లా కోనేట్లో విడిచిన కార్తీక దీపాల్లా.. మా ఊరి ఆడవాళ్ల కాటుక కళ్లన్నీ ఇప్పుడు నా జ్ఞాపకాల్లో కొండెక్కాయి. కానీ నా 'ఆరా'లో అంతర్భాగంగా ఉంటూ, నా చుట్టూ లక్షల దివ్వెల్లా ఇప్పటికీ వెలుగుతూనే ఉన్నాయి.. 'కార్తీక' కన్నులు.

***

కార్తీక కన్నడిగ. ఆమె తండ్రి రామకృష్ణ షాజీ ఇంజినీర్. మా ప్రాంతంలో నాగార్జునసాగర్ కాలువల తవ్వకం జరిగే సమయంలో పాలమూరు కార్మికులకు బిస్తర్ మా ఊరి పొలిమేరలోనే. వాళ్ల బట్వాడా, బాగోగులు చూసుకునే పనిని కాంట్రాక్టర్లు షాజీకే అప్పగించారు. అందుకే ఆ కార్మికుల గుడారాలకు దగ్గరగా ఉండాలని మా ఊళ్లోనే ఉండేది వాళ్ల కుటుంబం. దానితో కార్తీక మాతోనే, మా ఊరి బడిలోనే చదివింది. తెలుగు బాగా నేర్చుకుంది. కానీ, ఆమె తండ్రికి కన్నడ సంస్కృతి, కర్నాటక అంటే మితిమీరిన స్వాభిమానం.. తెలుగును, తెలుగోళ్లనూ విమర్శించేవాడు!

ఆ రోజుల్లో కాటుకను ఇళ్లలోనే చేసుకునేవారు. కార్తీక తల్లి స్వచ్ఛమైన గానుగ నూనెతో కోడిగుడ్డు దీపం వెలిగించి, తాంబూలంపై ఆ మసి పట్టించి, అందులో రవ్వంత కేరళ కర్పూరం కలిపి, సంపంగి పూల రేకులు నానబెట్టిన స్వచ్ఛమైన రెండు కొబ్బరినూనె చుక్కలేసి కాటుక వండేది. ఆ కాటుకను మొదటి రోజు దిద్దుకున్న కార్తీక బడికి రాగానే మా అక్క దగ్గరికి వచ్చేది.

'అమ్మ నిన్ననే చేసింది చూడు!'.. అని మా అక్క ముఖానికి, నా ముఖానికి దగ్గరగా తన ముఖాన్ని ఉంచేది. భరతనాట్యంలో 'ఆలోకిత' అనే దృష్టిభేదాన్ని ప్రదర్శించేటప్పుడు నృత్యకారిణి తన కళ్లను టపటపమని వర్తులంగా ఎలా ఆడిస్తుందో అలా కళ్లను కదిల్చేది ఆ క్షణంలో.. చక్కని కాటుక కళ్లు దృశ్యమానం.. కానీ, కార్తీక కళ్లు అప్పుడు 'ఘ్రాణమానం'.. 'అరోమా ఆఫ్ ది ఐ'.. పరిమళ నేత్రాలు! ఒక అందగత్తె ఏ మగపిల్లవాడి ముఖానికైనా తన ముఖాన్ని అతి దగ్గరగా తీసుకొచ్చి, అతడి చెక్కిళ్లపై తన పెద్ద గుండ్రని కళ్లను ప్రతిబింబిస్తే.. వాడు నిలువగలడా?

ప్రతి ఉదయం లేవగానే అమ్మ ముఖం చూసేవాడిని. అది మర్చిపోయి లేపాక్షి నోట్‌బుక్ నిండా రేనాల్డ్స్ బ్లాక్ పెన్నుతో జీవకళ ఉట్టిపడేలా గీసుకున్న కార్తీక కాటుక కన్నులు చూసుకోవడం మొదలుపెట్టా. నా చుట్టూ ప్రతి పరిసరంలోకి కార్తీక కన్నులు పరకాయ ప్రవేశం చేసేవి. నేలకు చూస్తే ప్రతిమొక్క, ప్రతి మొగ్గ.. పైకి చూస్తే ప్రతి మేఘం, ప్రతి మెరుపూ, ప్రతి చుక్క, ప్రతి ఉల్క, ప్రతి నెలపొడుపు నాటి జాబిలి కూడా కాటుక ధరించినట్లు దర్శనమిచ్చేవి. అవన్నీ నావైపే చూస్తూ నవ్వుతున్నట్లు అనిపించి, విశ్రాంతి లేని భ్రాంతిలోకి నన్ను నెట్టివేసేవి. 'సితార' ఇరవై రోజులాడితే ప్రతిరోజూ ఫస్ట్‌షో చూశా. భానుప్రియ కన్నుల్లో నా కార్తీక కన్నులు! అవే ఇవి.. ఇవే అవి.. ఇప్పటికీ కాటుక దిద్దుకున్న ప్రతి కన్నుల్లో కార్తీక కన్నులే కనిపిస్తాయి నాకు.

పదిలో 'ఫీలింగ్' మొదలైంది. డిగ్రీ ఫైనలియర్లో 'మ్యాటర్' ఫైనల్‌కొచ్చింది! ఒకరోజు ఆ మ్యాటర్ సీదా బైటపెట్టేశా!

'కార్తీకా.. లవ్ యువర్ ఐజ్ సోమచ్'..

'కళ్లనేనా?'..

'అవును!'..

'ఐతే నే భక్తకన్నప్పలా ఈ కన్నులు తీసివ్వనా?'..

'నేనేమీ శివుణ్ని కాదులే!'..

'నేను మాత్రం నీ పార్వతినే..!'..

ఈ మాట అంటూ కొంచెం కొంచెంగా కాకుండా ఒక్కసారే ఒక్క నిమిషంలోనే బ్రహ్మ కమలం వికసిస్తే ఎలా ఉంటుందో అలా విప్పారింది ఆమె ముఖం.. ఎలా తట్టుకోగలను? లిప్తపాటులో కదిలి ఆమెను గట్టిగా హత్తుకుని, నా వెచ్చని పెదాలు ఆమె చల్లని కాటుక కన్నులపై ఉంచి గట్టిగా అదిమి ముద్దుల సునామీ సృష్టించాను. ఆమె శరీరంలో చక్కిలిగింతలకు మొత్తం కేంద్రక స్థానం కళ్ల చుట్టూతా ఉన్నట్లు ఆమె ఒకటే గిలిగింతలతో ఉక్కిరిబిక్కిరై నవ్వుతోంది. పైన కనుబొమ్మల నుంచి కింద చెంపలపై అంచుల వరకూ చెల్లాచెదురైన ఆమె ఆ కాటుక రేఖల మోము అలలు.. అప్పుడే వేగంగా మోసుకొచ్చి చెల్లాచెదురుగా విసిరేసిన నల్లని గవ్వలు నిండిన తీరంలా అయిపోయింది. ఇక కాటుక, నా నోటితడి కలగలిసి అంటుకుపోయిన నా పెదాలు మాత్రం మిగలపండి రసాలూరుతున్న నేరేడు పళ్లలా అయ్యాయి.

'అబ్బో! ఎన్నాళ్లు నడిచిందలా?'.

'కొన్నాళ్లే!'.

'పెళ్లెందుకు చేసుకోలే మరి?'.

'గంగతో రాసిపెట్టుందిగా!'.

గంగ నా భార్య! ఇప్పటివరకూ పై ముచ్చట్లన్నీ తనకే చెపుతూ ఉన్నా.. ఆ పూట!

'శివుడు గంగమ్మని వదులుకున్నాడు. పార్వతిని కాదుగా! ఆ కార్తీకే నీకు పార్వతిలా ఇంకా గుండెల్లో ఉందన్నమాట.. నేను కాదు!'.

'అమ్మో అట్లా అనకే! నా హృదయం పెద్ద హైరైజ్ ఆకాశహర్మ్యం లేవోయ్. అందులో హై ఎండ్ లగ్జరీ ఫ్లాట్‌వి నువ్వేనోయ్!'.

'చాల్లెండి మీ బడాయి బిల్డర్ మాటలు'.

'బిల్డర్లకు మాటలే సగం పెట్టుబడి'.

'సర్లే.. అన్ని మాటలూ చెప్పారు. ఇన్నేళ్లూ ఈ ముచ్చటెలా దాచారు?'.

'వయసులో ఉన్నపుడు రహస్యం దాచుకోవాల్సి ఉంటుంది. వయసు దాటేకొద్దీ ఏదీ దాయబుద్ధవ్వదు!'.

'ఇదేమీ రహస్యం కాదులెండి!'.

'రహస్యం కాదా!?'.

'అవును. నాకెప్పుడో తెలుసు శ్రీవారూ!'.

దిమ్మ తిరిగిపోయింది నాకు.

'నిజంగానా ! ఎలానే గంగా?'.

'కార్తీక డిగ్రీ వరకు నీకు క్లాస్‌మేట్. నాకు తను మైసూర్ ఆర్.ఐ.ఈ.లో క్లాస్‌మేట్. అక్కడ మేం ఎడ్యుకేషన్‌లో మాస్టర్స్ డిగ్రీ కలిసి చదువుకున్నాం. అప్పుడు తెలియదు మీ లవ్ ముచ్చట. ఆ మధ్య మా బ్యాచ్ గెట్ టుగెదర్ జరిగింది. గుర్తుందా మీకు. ఆర్నెల్లక్రితం నేను మైసూర్ వెళ్లొచ్చా!'.

'హా.. ఔనౌను. టికెట్స్ నేనే కదా బుక్ చేసింది!'.

'మేమిద్దరం కలిసి చదువుకునేప్పుడు తన లవ్‌స్టోరీ గురించి ఎప్పుడూ చెప్పలేదు కార్తీక. మా గెట్ టుగెదర్ పార్టీలో నేను ఈ టౌన్‌లో ఉంటున్నానని, ఫలానా కుటుంబం వాళ్లు నా అత్తిల్లనీ చెబితే.. ఇంకా వివరాలడిగింది. మా వారని మీ పేరు చెప్పగానే.. ముందు చిగురాకులా కంపించింది. భళ్లున ఏడ్చింది. మన టౌన్ ఒకప్పుడు చిన్న పల్లెటూరనీ, వాళ్ల నాన్న ఇక్కడ చాలాకాలం ఇరిగేషన్ ఇంజినీర్‌గా చేశాడనీ, ఇక్కడ తాము చాలా యేళ్లు ఉన్నామనీ చెప్పింది. మెల్లిగా మీ విషయమూ చెప్పింది! మీ ప్రేమ ముదిరి పాకానబడుతుందని గమనించి, కార్తీక తండ్రి రాత్రికి రాత్రే కుటుంబాన్ని ఇక్కడినుంచి తరలించాడంట. తర్వాత ట్రాన్స్‌ఫర్ పెట్టుకున్నాడు. తను కనిపించక నువ్వు పిచ్చోడివి అయ్యుంటావని అనుకుంటూ ఉందట.. కానీ, నువ్వు కుదుటపడ్డావనీ, పెళ్లాడావనీ, పిల్లల్ని కూడా కన్నావని తెలిసి సంతోషించిందిలే!'.

'మరి నువ్వేమనుకుంటున్నావు గంగా?'.. చాలా గిల్టీ కాన్షస్‌గా అడిగా.

'ఇన్నాళ్లూ మనిద్దరి మధ్య రహస్యాలు లేవనుకుంటూ ఉన్నా! అయినా పెద్దవాళ్లమై పోతున్నాం. పిల్లలూ సెటిలయ్యారు. ఇంకా గత జల సేతుబంధనాలు ఎందుకులెండి! మన పెళ్లికి ముందుకదా అది జరిగింది'.

'జోహార్లు.. నీ పెద్దమనసుకి గంగా! అది సరే.. అసలు విషయం చెప్పవా.. కార్తీక ఇంకా కాటుక పెట్టుకుంటూనే ఉందా?'.

'అవును.. అబ్బ! ఏం కళ్లండీ దానివి!'.

'తననోసారి చూడాలి!'.

'మైసూరెళ్లి చూద్దురులే.. పర్మిషనిస్తా! అందాక ఈ ఫొటో చూసుకోండి'.

తన ఫోన్‌లో గూగుల్ ఫొటోస్ ఓపెన్ చేసి, ఒక ఫొటోను జూమ్ చేసి చూపించింది గంగ.

'ఈ కాటుకలద్దిన కళ్లే నన్ను ఇన్నేళ్లూ బాధిస్తున్నాయి గంగా!'.

'నాకర్థమైందిలెండి. నాతో తమరు గొడవ పడ్డప్పుడల్లా ఈ కాటుక కళ్లే వందలు వేలుగా మీ ముందు మెదిలేవని!'.

'ఎప్పుడు బయల్దేరమంటావు?'.

'మీ ఇష్టం. వాళ్ల ఇంటిదైవం చాముండీ అమ్మవారు. ఈ శరవన్నవరాత్రులూ ప్రతి ఉదయం, సాయంత్రం తను చాముండీ హిల్స్ గుడికెళ్తుంది. అక్కడ కచ్చితంగా కనిపిస్తుంది. చూసి రండి!'.

'శ్రీమతీ.. జిందాబాద్!'.

'ఆగండాగండి శ్రీవారు.. షరతులు వర్తిస్తాయి'.

'చెప్పండి మేమ్!'.

'కార్తీక కలిసినా మీరు ఆమెతో ఏమీ మాట్లాడొద్దు. నో రికాలింగ్స్. నో రెమినిసెన్సెస్ ప్లీజ్. పూర్వ పరిచయాలు, పురానీ ప్యార్ కహానీలొద్దు. కార్తీక తండ్రి ఇప్పుడు లేడు. కానీ, దాని భర్త పెద్ద మూర్ఖుడంట. అదీగాక వాళ్ల ఒక్కతే కూతురికి మొన్నీమధ్యనే పెళ్లయిందట. పెద్దరికం రెండువైపులా ఏపుగా పెరిగిపోయి ఉంది. కాపాడండి.. కాపాడుకోండి!'.

'ఐ స్వేర్ ఇట్.. హండ్రెడ్ పర్సెంట్ గంగా! ఒకే ఒక్కసారి తన కాటుక కళ్లని చూసొస్తా!'.

'ఒకే.. ఐతే జర్నీ టికెట్స్ బుక్ చేసుకోవచ్చు !'.

తనను దగ్గరికి తీసుకొని, నుదిటిపై పెదాలుంచి చాలాసేపు అలాగే ఉండిపోయా. నన్ను పొదివి పట్టుకుని తనూ అలాగే ఉండిపోయింది.

హిమాద్రి శిఖరాల మధ్య సమున్నతంగా ప్రవహించే ఆ గంగనే.. నా ఈ గంగ!

***

శరవన్నవరాత్రుల వేడుకలు. చాముండీ హిల్స్‌పై ప్రతి అణువూ అమ్మవారి ఆరాధనలో మునిగితేలుతున్నట్లు అనిపిస్తున్నది నాకు. ఆశ్వయుజ సప్తమి. దుర్గాదేవి అలంకరణలోని అమ్మవారిని దర్శించుకుని, అంతరాలయ మంటపాన్ని దాటగానే ఉత్తరాభిముఖంగా ఉన్న ఆంజనేయుస్వామి విగ్రహం పక్కనే ఉన్న మెట్లపై కూర్చొని ఎదురుచూడసాగాను. ఈ శరవన్నవరాత్రులు ప్రతిరోజూ కార్తీక అమ్మవారిని దర్శించుకుని వచ్చి తను ఆ దగ్గరలోనే కూర్చుంటుందట.. గంగ చెప్పింది! కానీ, ఈ రోజు వస్తుందో లేదో మరి? నన్ను చూస్తే గుర్తుపడుతుందా? నేను మాత్రం గుర్తుపట్టగలను. ఫోన్ స్క్రీన్‌పై తన ఫొటోను జూమ్ చేస్తూ చాలా సేపు కూర్చున్నాను. ఒకవేళ రాకపోతే తనకు ఫోన్‌చేస్తే? గంగ ఫోన్‌లో కార్తీక నెంబర్‌ని తస్కరించా! తప్పే కదా.. తప్పని తప్పు!

కొంచెం దూరంలో.. ప్రాకారం పక్కనే ఉన్న ఒక స్త్రీ మూర్తి కార్తీకలా అనిపించింది. లేచి నాలుగడుగులు ముందుకేసి చూస్తే.. తను కార్తీకే! ఫొటోలో ఉన్న రూపునకు కొంచెం మార్పు.. మరో స్త్రీ కాదు. తనే.. అదిగో ఆ కన్నులు.. ఆ కాటుక కన్నులే ఆమె ఉనికి! ఆ కాటుక దిద్దుకునే తీరే ఆమె ఆచూకీ! స్త్రీ మూర్తులు తాము ధరించిన దేహాల కాన్వాస్‌లపై గీసుకునే కళాకృతులే కన్నులు! కార్తీక ముఖంపై రెండు నీలి చిత్తరువుల్ని గుర్తుపట్టకుండా ఎలా ఉండగలను?

దగ్గరికెళ్లి నవ్వుతూ.. 'ఇంకా ఇంకులేని రీఫిల్‌తో, నెమలీకతోనే కాటుక అద్దుకుంటున్నావా కార్తీకా?' అని అడుగుదాం అనుకున్నాను. నాలుగడుగులు ముందుకేశా.. కానీ, రెండడుగులు వెనక్కు. మళ్లీ నాలుగడుగులు ముందుకు.. రెండడుగులు వెనక్కు. ఆమె కన్నులు ఆ సమయంలో కొద్ది సమయం క్రితం తాను చూసిన అమ్మవారి కళ్లలానే ఉన్నాయి. స్పెషల్ దర్శనం టికెట్‌తో ఆ ఉదయం అమ్మవారిని దగ్గరగా చూడగలిగా! అమ్మవారు ఒక్కసారి తనవైపు పెద్ద కళ్లతో చూసినట్లనిపించింది. ఉలిక్కిపడ్డాను ఆ క్షణంలో! ఇప్పుడు నా ఎదురుగా

అటువంటి దివ్య నేత్రాలే! కార్తీక కళ్లు.. వయసుతోపాటు పెద్దగా మారని కన్నులు. అయితే ఆ కళ్లల్లో ఇప్పుడు ఎర్రజీరలు మాత్రం ఎక్కువగా కనిపిస్తున్నాయి. వయసు ప్రభావమేమో.. నల్లగుడ్డు కొంచెం కళ కోల్పోయింది. ఇంకో రెండడుగులు ముందుకేశా. అంతలో ఒకసారి టపటపమని కళ్లాడించింది తను. కనురెప్పలు చిరు వింజామరల్లా కదిలాయి. ఇప్పుడు ఆ కళ్లు నన్నే చూస్తున్నాయి. ఆ సుందర చక్షువులు.. ఎన్నో సాయంత్రాలు ఏటి ఒడ్డున తనకై ఎదురుచూసిన చకోరాలు.. తను మౌనముద్రలో అలానే కూర్చొనుంది. తను కదలకుండా తన కళ్లు నన్నే చూస్తున్నాయి. ఆమె కనుపాపల, నా కనుపాపల చివర్లను బిందువులుగా కలుపుతూ, ఎవరైనా ఓ బారు రెక్టాంగిల్‌ను గీస్తే ఎంత బాగుండు! తలను అలాగే కదపకుండా నిలిపి నావైపే ఇంకా చూస్తున్నది. మరెందుకు గుర్తుపట్టడం లేదు నన్ను? గుర్తుపట్టినా పట్టనట్లు నటిస్తున్నదా? ఒక్కోసారి అది ఆడవాళ్లకు అవసరమే కదా! మరొక్క మూడడుగులు ముందుకేశా. ఒకడుగు వెనక్కి! ఇదేం న్యాయం? కార్తీక కూడా చాలా మంది ఆడోళ్ల మాదిరేనా? నేను ప్రొసీడ్ కాలేను.. గంగకు మాటిచ్చాను! తప్పే.. అయినా తప్పేలా లేదు. ఒక్కసారి.. ఒక్కసారంటే ఒక్కసారి.. నా ఆ పాత ఆస్తులు.. ఆ కాటుక కన్నులను ఒక్కసారే బాగా దగ్గరగా.. ఇంకా దగ్గరగా చూసుకుంటూ.. ఒక్కసారి తనను పలకరిస్తేనో! నో ప్రాబ్లం.. ఒట్టుతీసి గట్టునపడేయ్.. ఊం.. పద.. కదులు.. ఇంకో రెండడుగులు ముందుకు..

'కా.. కా.. కార్తీ.. కా..'.

మా ఇద్దరి మధ్యకు చిలుక పిల్లలా ఒక పాప తుర్రున పరుగెత్తుకొచ్చింది.

'సారీ తాయీ.. అక్కడ ప్రసాదం తీసుకునేటప్పుడూ పక్కనబెట్టి మర్చిపోయా! ఇదిగో అక్కడే దొరికిందిలే! పదండి తాయీ పోదాం'.. అంటూ చెంగున కార్తీక ముందుకు దూకి, ఒక తెల్లటి పొడవాటి బ్లైండ్ స్టిక్‌ను ఆమె ఒడిలో ఉంచింది ఆ పాప.

అచేతనుడినయ్యాను. నా తలలో వందల డ్రోన్‌ల రొదలా అలజడి రేగింది. మాట పడిపోయింది. ఆ క్షణమే నన్నెవరో విగ్రహంగా మార్చి ఒక రాతి పీఠానికి నన్ను అతికించి పోయినట్లుగా నిలబడ్డా. మైగాడ్.. కార్తీక కన్నులున్నాయి.. కాటుక ఉంది.. చూపులేదా?

కార్తీకకు సహాయకురాలిగా వచ్చిన ఆ పాప..

'కింద పార్కింగ్‌లోనే డ్రైవరన్నయ్య వెయిట్ చేస్తున్నాడంట తాయీ.. ఫోన్ చేశాడు' అని అంటూ, కార్తీకకు పెద్ద గాగుల్స్ పెడుతూ, ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుని.. ఒక్కో మెట్టూ చాలా జాగ్రత్తగా నెమ్మదిగా దింపుతూ గుడి బయటికి తీసుకెళ్తున్నది.

'మిన్నూ.. అక్కడిందాక నన్నెవరైనా పిలిచినట్లుందా?'.. కుడిచేతిలో బ్లైండ్‌స్టిక్, ఎడమచేతితో ఆ పాప ఆసరాతో ముందుకు నడుస్తూ అడుగుతున్నది కార్తీక.

'లేదు తాయీ.. ఎవరూ పిల్చినట్టు లేదే!'.. ముద్దుగా బదులిచ్చింది పాప.

దృశ్యంగా చూపలేనివాటిని మనసు నాదంగా వినిపిస్తుందంటారు. కార్తీక విన్నదా? విని ఉంటే.. విన్నది నా అర్ధ పిలుపునా? వ్యర్థ తలపునా?

***

కార్తీక వెళ్లిపోగానే శ్రీమతికి కాల్ చేశా.

'గంగా.. నాకెందుకు చెప్పలేదు?'.

'తట్టుకోలేవని!'.

'ఎలా జరిగిందట?'.

'గ్లకోమా.. టైంకి తెలుసుకోలేదట. క్రానిక్ అయ్యింది'.

'అయినా తనింకా కాటుక దిద్దుకుంటూనే..!'.

'నీ గురించే!'.

'నా గురించా.. ఎందుకు?'.

'ఎప్పుడో మాట తీసుకున్నావటగా'.

'ఏమని?'.

'తన ఆ కన్నుల జ్యోతులు కొండెక్కే వరకూ కాటుకను వదలొద్దని !'.

'ఆ.. అవును.. అవును..'.

'అయితే మరెందుకు అడిగావు?'.

'మర్చిపోయానులే!'.

'మగాడివి గదా!'.

***

***వేణు మరీదు స్వస్థలం ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం వంగా ముత్యాల బంజర్ గ్రామం. ఉద్యోగ రీత్యా ప్రస్తుతం ఖమ్మంలో నివసిస్తున్నారు. తల్లిదండ్రులు రాధ – రుక్మాంగద. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలలో ఎంఏ. ఇంగ్లిష్ లిటరేచర్, నల్లగొండ గోకుల్ కళాశాలలో బీఈడీ చేశారు. 27 సంవత్సరాలుగా పాఠశాల, కళాశాల స్థాయిల్లో ఆంగ్ల భాషోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. భార్య శివలక్ష్మి, బిడ్డలు మధుమిత గౌడ్, నాగమ వైష్ణవీ గౌడ్ ప్రోత్సాహంతో సాహితీ సేవలో ముందుకెళ్తున్నారు. చిన్నప్పటి నుంచీ కవితా రచన చేస్తున్నారు. ఇప్పుడిప్పుడే కథలు రాయడంపై ఆసక్తి పెంచుకొన్నారు. ఇప్పటిదాకా 15 కథలు రాశారు. 'నాక్కొంచెం ఇంగ్లీషు కావాలి', 'ప్రెజెంటెడ్ బై వసుధ', 'నలుగురూ లేనినాడు', 'బొమ్మ' కథలు పాఠకుల మన్ననలు పొందాయి. ఇంగ్లిష్‌లో రాసిన కవిత్వం, చిరువ్యాసాలు ప్రముఖ ఆంగ్ల దినపత్రికలు, వెబ్ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. నమస్తే తెలంగాణ – ముల్కనూరు ప్రజా గ్రంథాలయం నిర్వహించిన కథల పోటీ 2021లో 'కాటుక కన్నుల సాక్షిగా' కథకు తృతీయ బహుమతి అందుకున్నారు. పేదరికంలో పుట్టిన తనకు అక్షరాలే ఆస్తులని వేణు చెబుతున్నారు.***

# బోన్గిరి టూ లష్కర్



డాక్టర్ ప్రభాకర్ జైనీ,
79898 25420

ఇయ్యాల నాకు చానా సంతోషంగ ఉన్నది. ఇంటర్మీడియట్ పరీక్షల ఫస్ట్ క్లాసుల పాసయిన. ఇంటర్నెట్ సెంటర్ల ఇచ్చిన కాగితాన్ని తీసుకొని బయటకొచ్చి.. ఇంటి ముఖం పట్టిన. కనీ, దూరం పంటి కూలిపోయేటట్టున్న మా ఇల్లు చూసెటాళ్లకు, నాకు నా భవిష్యత్తు ఎట్లుంటదో కండ్లల్ల మెదిలింది. పై చదువులు చదివించే స్తోమత మా ఇంట్లోల్లకు లేదని నాకర్థమైంది. మనసు చంపుకొన్న. పై చదువులు చదువాలనే ఆశను మొగ్గల్నే తుంచేసుకున్న.

మా ఊరు.. పట్నానికి గదే.. హైద్రాబాదుకు నలభై రెండు కిలోమీటర్ల దూరంల ఉండే బోన్గిరి. గందుకె అభివృద్ధికి నోచుకోనేలే. మా ఊర్లె జనాలకు ఏ వస్తువు కావాలన్నా పట్నం బోయి కొనుక్కొచ్చుకుంటరు. కాబట్టే, మా ఊర్లె ఏ వ్యాపారమూ పెద్దగా జరగదు. చిన్న చిన్న కిరాణా దుకాన్లు, చిన్న మడిగెలల్ల చీరెలు, లోపటి లంగాలు అమ్మే బట్టల దుకాన్లు, బోన్గిరి నుంచి చుట్టుపక్కల పల్లెటూర్లకు పోయేటోల్ల కోసం ఛాయ్ బండ్లు, టిక్కీ హోటల్లు తప్ప ఇంకో పెద్ద వ్యాపారమే లేదు. పోరగాండ్లకు ఏ నౌకరీ దొరికే చాన్సే లేదు.

మా ఊర్లె పనిచేసే సర్కార్ నౌకరోల్లు, బ్యాంకు సార్లు, పంతుల్లు కూడా మా ఊర్లె ఉండరు. పట్నం నుంచే ప్రతిరోజూ అప్ అండ్ డౌన్ చేస్తుంటరు. మా ఊర్లుండె సగం కంటె ఎక్కువ మంది పడుచు పోరగాల్లు, ఆడోల్లు,

మగోల్లు నౌకరీల కోసం పట్నం మీదనే ఆధారపడి జీవిస్తున్నరు. చానామంది రకరకాల దుకాన్లల్ల హెల్పర్ల లెక్క, సేల్స్ బాయిల లెక్క, డెలివరీ బాయిల లెక్క, కొరియర్ సెంటర్లల్ల పనిచేస్తుంటరు. అమ్మాయిలు చానామంది బట్టల దుకాన్లల్ల, షాపింగ్ మాళ్లల్ల అరకొర జీతాలకు పనిచేసేందుకు, ప్రతిరోజూ పొద్దున్నే పట్నానికి బయల్దేరుతరు.

నిత్యం పొద్దుగాల అందరి ఇండ్లల్ల నుంచి పొట్ట చేతబట్టుకొని, వలస పోయే పక్షుల్లెక్క.. చిన్నచిన్న పిల్లలంత, మా ఊర్లె సందులల్ల ఉరుక్కుంట పోయి రైల్వేస్టేషనుకు చేరుకుంటరు. గా పోరగాల్లంత పోయినంక, మా ఊరు.. బోన్గిరి, బిక్కుబిక్కుమంటున్న వృద్ధాశ్రమం లెక్క నిర్మానుష్యమైతది. గా జనమే లేని సందులల్ల నేను దయ్యం లెక్క తిరుగుతుంట.

***

మా ఊరి మీది నుంచి పొద్దున్నె పట్నానికి పోయెటందుకు చానా రైళ్లుంటయి. పట్నం నుంచి నూటా యాభై కిలోమీటర్ల దూరంల ఉన్న మరో పెద్ద నగరం.. వరంగల్. అక్కడి నుంచి పట్నం పోవడానికి కాకతీయ ఫాస్ట్‌ప్యాసెంజర్, పుష్ పుల్ రైళ్లుంటయి. ఇంక చానా ఎక్స్‌ప్రెస్ రైళ్లు గూడ మా బోన్గిరిల ఆగుతయి. కనీ కాలే కడుపు నింపుకొనేటందుకు వందల కిలోమీటర్ల దూరంలోని వరంగల్లు నుంచి పట్నానికి, ఈ మహా కార్మిక లోకం.. ప్రతిరోజూ తరలి వస్తుంటరు. కాబట్టి రైళ్లన్నీ కిటకిటలాడుతుంటయి. బోన్గిరికి రైలొచ్చే టయానికి, రైల్ల సరిగ్గా నిల్చోవడానికి కూడా జాగా దొరకది. కానీ, ఎట్లనో గట్ల వేలాడుకుంటనో, నిలబడో, కూసున్న ప్యాసింజర్లను బతిమిలాడో.. సీటు సంపాయించుకొని పట్నానికి పరుగు పెట్టాలె. సీటు దొరికి కూర్చున్న రోజు మాత్రం.. పానం హాయిగుంటది. ఏదో.. సింహాసనం దొరికినట్టనిపిస్తది.

గీ రైళ్లు సికింద్రాబాద్ స్టేషనుల ఆగంగనే, నేల ఈనిందా అన్నట్టుగ.. వర్షాకాలంల పుట్టలల్ల నుంచి మూకుమ్మడిగా చీమలు బయటికి వొచ్చినట్టు వేలాది మంది పిల్లలు రైళ్లు దిగి పరుగులు తీస్తుంటరు. చానా వరకు జల్దీజల్దీ నడిచి, రెండు మూడు మైళ్ల దూరంల ఉన్న తమ గమ్యస్థానాలకు చేరుకుంటరు. ఇంకా ఎక్కువ దూరం ఉంటే ఆర్టీసీ బస్సుల్లోనో, మెట్రోలనో ప్రయాణం సాగిస్తరు. గిదే మా బోన్గిరి యువత జీవనపోరాటం.

ఈ హైద్రాబాదు పట్నపు మహా వాణిజ్య యంత్రాన్ని నిరంతరం నడిపే చోదకశక్తే మా కార్మికలోకం. కనీ, వాళ్లకు ఏ హక్కులూ, గౌరవాలూ, చట్టాలూ వర్తించవు. ఇంటర్మీడియట్ పాసయిన తర్వాత కొన్ని దినాలు బేకారుగ గడిపిన నేను.. సోమరిగ ఉండలేక, మా అన్న, అక్క లెక్క నేనూ పట్నానికి పొయ్యే దినం వచ్చింది. ఆనాడు మా అమ్మ నన్ను పోవొద్దని ఏడ్చుకుంట..

'మీరంతా ప్రతిరోజూ పొద్దున్నే ఇల్లొదిలి పోతే ఇల్లంత చిన్నబోతాందే! ఇగ గిప్పుడు నువ్వు గూడ పోతనంటున్నవు. మీ అక్క చూడు! ఏం సంపాయిస్తాంది? అందులో ఎంత మిగుల్తాంది? రక్తమాంసాలు ఆ పట్నానికి ధారపోసి నా బిడ్డ, అందాల రాశి ఎట్ల తయారయిందో చూసినవ! ఎముకల గూడులెక్క అయింది' అని శోకాండాలు పెట్టుకున్నది.

గది గూడ నిజమే! మా అక్క ప్రణీత. మూడేళ్ల క్రితం వరకు, చక్కని చుక్క లెక్క ఉండేటిది! చానా అందంగ ఉండేది. ఏ రాజకుమారుడో వచ్చి ఎగరేసుకొని పోతాడనుకున్నం. కానీ, గిట్ల గీ

మహానగరం హైద్రాబాదు పట్నపు పదఘట్టనల కిందబడి, వసివాడిపోతదని అనుకోలే.

పాపం, రోజూ పొద్దున్నే ఉరుకుతున్నట్టె పోయి రైలు, బస్సులెక్కి ప్రయాణం. దుకాన్లల్ల పెట్టే అనేక ఆంక్షల మధ్యన ఉద్యోగం. మల్ల రాత్రికి బస్సు, రైలు ప్రయాణం. కన్ను మూస్కోని పంటదో లేదో.. భళ్లున తెల్లార్తది. సరిగ్గా తినీ తినకపోవడంతోటి, మల్ల ప్రయాణం మొదలు కావడంతోటి నవయవ్వనవతైన మా అక్కకు జవసత్వాలుడిగినయి. మూడేండ్లల్ల బక్కచిక్కిపోయింది, మా అక్క – సక్కదనాల సుక్క.

గందుకే, కంటికి మంటికి ఏడుస్తున్న మా అమ్మను ఊరడించి..

'అమ్మా! మరి నన్నేం చేయమంటవే? నువ్వే చెప్పు! వాళ్లు సంపాదించి తెచ్చింది తక్కువనే అయిన.. గా పైసలతోనే కాదే మనం కడుపులు నింపుకుంటున్నది. అన్న, అక్కా.. గా పట్నంల రెక్కలు ముక్కలు జేసుకుంటాంటె నేను తిండిపోతు లెక్క ఇంట్ల కూర్చోని తింటె బాగుంటదా? నువ్వు మా అందరికి గూడ అమ్మవే గద? నీ మనసు అందుకు అంగీకరిస్తదా? చెప్పు?' అని అడిగితే.. మా అమ్మ కండ్ల నీళ్లు తుడుచుకుంట,

'నేనేం సమాధానం చెప్పగలనే? నువ్వంటె సదువుకున్నదానివి! నీకు చెప్పేటంత తెలివి నాకే ఉంటే, మీ అయ్యను ఒక దారిల పెట్టుకునేటి దాన్ని కాదా? నిన్ను పైకి చదివించేటి దాన్ని కాదా?' అని అడిగింది.

నేను మా అమ్మను ఓదార్చిన. ఒప్పించిన. మహానగరం వైపు నా మహాప్రస్థానాన్ని ప్రారంభించిన.

కానీ, ఆ రోజున భవిష్యత్తుల నేనొక చరిత్ర సృష్టించబోతున్ననని నేనప్పుడు అనుకోలే! మా అమ్మయితే అస్సలు ఊహించలే!

***

రెండు మూడు రోజులు ప్రయత్నించంగ ఒక మంచి షాపింగ్ మాల్‌ల నౌకరీ దొరికింది. నెలకు ఎనిమిది వేల జీతం. గా నౌకరీ దొరకంగనే నేను ఊహల లోకంల తేలిపోయిన. రంగురంగుల లైట్ల వెలుతుర్ల, ఏసీల నౌకరీ అనంగనె మురిసిపోయింది నా మనసు. కానీ, నెల రోజులు గడిచేటప్పటికె నాకు నీరసం వొచ్చింది. దుకాణం పది గంటలకే తెరిచినా, మా సేల్స్ గర్ల్స్ మాత్రం తొమ్మిది కొట్టేసరికే అక్కడ ఉండాలె. గంట సేపట్ల షో రూమంత ఊడ్చి శుభ్రం చేయాలె. ఏసీ షోరూం కాబట్టి కొత్త బట్టల్లో నుంచి రాలే సన్నటి దుమ్మూ, ధూళితోటి షోరూం అంతా నిండి ఉంటది. దాన్నంతా తడి, పొడి గుడ్డలతోటి తూడ్వాలె. అద్దాలను రుద్దిరుద్ది తళతళా మెరిసేటట్టు చేయాలె. మానెక్విన్స్, రబ్బరు బొమ్మలకు, ప్రతిరోజూ కొత్త చీరెలు కట్టి ముస్తాబు చేయాలె. బొమ్మలను ముస్తాబు చేయడం అయ్యేటిసరికి, మా సేల్ గర్ల్స్ అందాల ముఖాలన్నీ చెమటలు కక్కుకుంట జిడ్డు కారుతుంటయి. అది అంతా సిద్ధం చేసి, పది గంట గొట్టేసరికి మేం దుకాణం తలుపులు తెరవాలె.

గప్పుడు.. గా పది గంటలకు కౌంటర్ల నిలబడుడు షురువు చేస్తే, మధ్యాహ్నం రెండింటి దాక మాకు నిలువు కాళ్ల జీతమే. కూర్చోనీకి పర్మిషన్ లేదు. అసలు కూర్చునేటందుకు కుర్చీలు, స్టూళ్లు గిన మాకు అందుబాటుల ఉండయి. పై అరల్లోని చీరెలు సర్దేటప్పుడు గిన, కస్టమర్లకు పై అరలల్ల

ఉన్న ఎక్కువ ధర చీరెలు చూపించడానికి గిన తెచ్చిన స్టూళ్లను, బల్లలను.. ఆ పని కాగానే యాజమాన్యం వెంటనే తీసేయిస్తుంది. ఇటువంటి దుకాండ్లల్ల సేల్స్ గర్ల్స్ పని గంటల సమయంలో కూర్చోగూడదని ఒక అన్ రిటెన్ రూల్ ఉంది. అన్ని షాపుల్ల గూడ గంతే! షాపుల కస్టమర్లు లేనప్పుడు కూడ సేల్స్ గర్ల్స్ కూర్చోనీకి పర్మిషన్ లేదు. కూర్చుంటే బద్ధకం పెరుగుతదని యాజమాన్యం భావిస్తది. కౌంటరు ముందు అందంగ, ముద్దుగ, లేత కుందేలు పిల్లల లెక్కున్న సోఫాలను చూస్తుంటే.. నాకు కాళ్ల నొప్పులు మరింత ఎక్కువయ్యేటివి. అప్పుడప్పుడు కాళ్లు పట్టుదప్పి కూలబడిపోయేటిదాన్ని. ఒక రోజు గట్ల కౌంటరు పక్కన కూలబడిపోయిన నన్ను సూపర్‌వైజర్ చూసి మందలించిండు. నేను జల్దీ లేచి నిలబడి 'సారీ' చెప్పిన.

ఓ పదిహేను రోజుల తర్వాత నాకు మంత్లీ పీరియడ్ రావడం తోటి, ఋతుస్రావం ఎక్కువయితాంటె.. మర్నాటికి సెలవు పెడ్తనని చెప్పిన. దానికి యజమాని కొట్టినంత పని చేసిండు. 'పండుగ రోజులల్ల సెలవూ గిలవూ జాన్తా నై' అనడంతో.. తప్పనిసరై డ్యూటీకి వచ్చిన. కనీ, మధ్యలనే బాత్రూంకి పోయి, కౌంటర్ దిక్కు నడుస్తాంటె శోషొచ్చినట్టయి గోదాముల గట్టాలపై పడిపోయిన. అప్పుడే, అక్కడికి వచ్చిన సూపర్‌వైజర్, యజమానిని పిల్చుకోని వచ్చి నన్ను చూపించాడు. యజమాని కోపంతో దుర్భాషలాడుతూ తిట్టడంతో.. నేను లేచి నీరసంగనే కౌంటర్లకు వచ్చి నిలబడ్డ. సేటు.. ఆ నెల జీతం ఏడు వేలే ఇచ్చిండు. నేను కోపంగ.. 'ఎందుకు?' అని ప్రశ్నించిన.

'నువ్వు గా రోజునాడు గోదాంలకు పోయి పండుకున్నవు. గందుకే పెనాల్టీ కింద వేయి రూపాయలు కట్ చేసిన' అని చెప్పడంతో, నేను ఖిన్నురాలునయిన.

'గింత అన్యాయమా?' అని నా మనసు ఆక్రోశించింది.

అసలైతే, గా మూడు నెలల ఉద్యోగంలనే నేను బాగా డస్సిపోయిన. ఒక పెద్ద కారాగారంలో బందీగ ఇరుక్కపోయినట్టు ఫీలింగ్. ఊపిరాడనట్టనిపించేది. ఒక పెద్ద రాక్షసి నన్ను నిరంతరం గమనిస్తుందన్న భయంతోటి బతకాలంటే నాకు అస్సలే నచ్చుడం లేదు. చచ్చీ చెడీ రోజుకు పది గంటలు నిలబడీ, నిలబడీ.. ఒక్క పది నిమిషాలు కూర్చుంటనే వెయ్యి రూపాయల పెనాల్టీ అంటే నాకు దారుణం అనిపించింది. నా తోటి సేల్స్ గర్ల్స్ కష్టాలు చూసి నేను కన్నీరు మున్నీరయ్యేటిదాన్ని. ఏ వయసుల ఉన్న వాండ్లయినా సరే, కాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు వచ్చినా సరే.. ఆడోల్లకొచ్చే మరే ఆరోగ్య సమస్య అయినా సరే నిలబడి ఉండాల్సిందే! గా సమస్యనే ఇప్పుడు నేనూ స్వయంగ అనుభవిస్తున్న. అసలు మాకు ఇస్తున్న జీతమే, రోజుకింత అని లెక్కగడితే.. మూడు వందలు కూడ గిట్టడం లేదు. గీ మహానగరంల అడ్డా మీద కూలీకే రోజుకు ఐదారు వందలు లభిస్తున్నయి. మేము అంతకంటె నాలుగు గంటలు ఎక్కువ పని చేసిన గూడ, వారికి ఇచ్చే కూలీల సగం గూడ మాకు గిట్టుత లేదు. మేము, గింత సదువుకోని గా మోటు కూలీ పని చేయలేక, గింత తక్కువ జీతానికి కూడా సిద్ధపడి పని చేస్తుంటే గూడ.. మమ్మల్ని పశువుల్లెక్క, మల్ల ఇంకా మాట్లాడితే పశువుల కంటే హీనంగా.. పశువులకన్నా విరామం, విశ్రాంతి ఉంటయి. లేకపోతే అవి తిరగబడి కొమ్ములతో పొడుస్తాయి. తమ నిరసనను తెలియచేస్తాయి. ఒక్క నిమిషం కూడా

కూర్చోనియ్యకుండ పని చేయించే గీ దాష్టీకానికి చరమగీతం పాడాలని, నేను నిర్ణయించుకున్న!

నేను చదువుకున్న గా కొద్దిపాటి చదువే నాకా ధైర్యాన్నిచ్చింది.

***

మరుసటి దినం నేను ఒక దృఢ సంకల్పంతోటి బోన్గిరి నుంచి మహానగరానికి బయల్దేరిన. కనీ, నేను పనిచేసే దుకాణంకు పోలేదు. నా బాధనంతా వెళ్లగక్కుకుంట, క్రితం రాత్రంత కూసోని రాసిన కరపత్రాన్ని పదివేల కాపీలు ప్రింటు తీయించిన. మహిళా సంఘాలను, కార్మిక నాయకులను, వాళ్ల సహాయం తోటి కార్మిక సంక్షేమ శాఖ అధికారులను కలిసిన. నా గోడును వెళ్లబోసుకున్న.

తెల్లారి.. ఆపై రోజు నుంచి నిత్యం మహానగరంలోని ప్రతి దుకాణానికి పోయి, అక్కడ పనిచేసే మహిళా ఉద్యోగులను కలిసి వారి సమస్యలను పరిష్కరించేటందుకు నడుం బిగించాల్నని చెప్పిన.

చిన్నచిన్నగనే అయినా ఉద్యోగులల్ల అసంతృప్తి రాజుకుంటున్న టైముకు, మా ఊర్లె నుంచి రోజూ మా తోటి సిటీకి వచ్చే ఒక టీవీ చానెల్ల పనిచేసే చిన్నపాటి ఉద్యోగి సహాయంతోటి ఒక టీవీల ఇంటర్వ్యూ ఇచ్చిన.

నాలుగైదు నెలల హైద్రాబాద్ నగర జీవితం నాకు ఎన్నో నేర్పించింది. అందుల, కష్టమర్లతోటి అద్భుతంగ మాట్లాడే విద్య కూడ అబ్బడంతోటి, టీవీ షోలో కన్నీళ్ల తోటి, హావభావాలతోటి.. నా మనసులోని భావాలను స్పష్టంగ చెప్పి అదరగొట్టిన.

'మేడమ్! నేను కూర్చోకూడదా?' అని.. ఇంటర్వ్యూ ప్రారంభం కాంగనే యాంకరును ప్రశ్నించిన. ఆ మేడమ్ ముందుగాల బిత్తరపోయి, తరువాత నా మాటల్లోని శ్లేష అర్థమయి ఫక్కున నవ్వింది. ఆ కార్యక్రమానికి గా పేరే పెట్టి ప్రసారం చేసిన్రు. ఆ కార్యక్రమం బాగా పాపులర్ అయింది. హైద్రాబాద్ మహానగరంల పనిచేసే లక్షల మంది సేల్స్ గర్ల్స్ గొంతుకను నేనై.. 'రైట్ టూ సిట్' అనే ఉద్యమానికి నాంది పలికిన.

ఒక టీవీ నుంచి మరో టీవీకి ఈ న్యూస్ పాకడంతోటి.. 'రైట్ టూ సిట్' అనే సమస్యపై నా పోరాటం మస్తు వైరల్ అయింది.

సేల్స్ గర్ల్స్‌ను పది గంటలపాటు కూర్చోనివ్వక పోవడమన్న యాజమాన్యపు అమానవీయ ప్రవర్తనను ప్రజలు ఈసడించుకున్నరు. ఒక సామాజిక సమస్యల మానవీయ కోణం ఉంటే, అది అందరి దృష్టినీ ఆకర్షిస్తదని నాకర్థమైంది. సమాజం సానుభూతి చూపిస్తది. ప్రస్తుత సమాజంల సోషల్ మీడియా ప్రభావం వల్ల ఇటువంటి కొన్ని సమస్యలకు ప్రాధాన్యత బాగా లభించి, వైరల్ అయిపోయి ప్రభుత్వాలను సైతం గడగడలాడిస్తున్నయి.

రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇటువంటి సున్నితమైన సమస్యను, నేను వాళ్ల దృష్టికి తీసుకు వచ్చినందుకు మెచ్చుకొని వెంటనే స్పందించింది. ఇది రాజకీయంగా కూడా వారికి లాభదాయకంగ ఉంటది కాబట్టి, ప్రభుత్వం కూడ వెంటనే రంగంలోకి దిగింది.

కార్మిక సంక్షేమ శాఖ అధికారులతోటి నన్ను కూడా సభ్యురాలిగా చేర్చి, ఒక కమిటీని ఏర్పాటు చేసింది. మూడు నెలలల్ల మా కమిటీ ఇచ్చిన రిపోర్టు ఆధారంగా ఒక బిల్లును తయారు చేసి అసెంబ్లీల ప్రవేశపెట్టింది. గా బిల్లు ఏకగ్రీవంగా ఆమోదించబడింది.

అందరి హర్షధ్వానాల మధ్య ఆ బిల్లుకు నా పేరు మీదనే.. 'సునీత బిల్ ఆఫ్ రైట్ టూ సిట్' అని నామకరణం చేసిన్రు. గా రోజు నుంచి సేల్స్ గర్ల్స్ పని లేనప్పుడు, కూర్చునేటందుకు హక్కుతోపాటుగ పనిచేసే చోట మహిళా ఉద్యోగులకు అనేక వసతులు కల్పించాల్నన్న ప్రభుత్వ చట్టం అమల్లకు వొచ్చింది.

నా ఆరు నెలల కృషి ఫలితంగనే.. నా పేరు మీదనే ఒక చట్టం అమల్లకు వొచ్చింది.

***

ఆ రోజు సాయంత్రం, నేను గా బిల్లు కాపీ పట్టుకోని సికింద్రాబాద్.. గదే లష్కర్ నుంచి మా ఊరు బోన్గిరికి పోయేటందుకు 'కాకతీయ' ప్యాసెంజర్ రైలెక్కినప్పుడు నాకు ఘనస్వాగతం లభించింది.

అందరూ 'కూర్చోమని' చెప్పి, తమ సీట్లల్ల నుంచి లేచి నిలబడి నన్ను ఆహ్వానించిన్రు.

గంతే.. ఇగోనుల్ల నేను, 'సునీత బిల్ ఆఫ్ రైట్ టూ సిట్' జీవో కాపీని పట్టుకొని గర్వంగ కూర్చున్న!

***

(యథార్థ సంఘటన ఆధారంగా రాసిన కథ. ఇటువంటి చట్టాన్ని సెప్టెంబర్ 13, 2021న తమిళనాడు శాసనసభ ఆమోదించింది. అంతకు ముందే కేరళ ప్రభుత్వం చట్టం చేసింది

డాక్టర్ ప్రభాకర్ జైనీ స్వస్థలం వరంగల్. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. సాహితీవేత్తగా, సినీ దర్శకుడిగా సుపరిచితులు. వాణిజ్య పన్నుల శాఖలో సీటీవోగా పనిచేసి, ఉద్యోగ విరమణ పొందారు. సామాజిక కోణంలో కథా రచన చేస్తుంటారు. 1981లో 'ఎదను ధర్మం' ఈయన మొదటి కథ. ఇప్పటివరకూ వందల సంఖ్యలో కథలు, 24 నవలలు వెలువరించారు. 2013లో కథ, మాటలు, పాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం వహిస్తూ 'అమ్మా! నీకు వందనం', 'ప్రణయ వీధుల్లో.. పోరాడే ప్రిన్స్' సినిమాలను నిర్మించారు. 2021లో యథార్థ సంఘటనల ఆధారంగా 'గర్భశోకం' అనే చిత్రాన్ని ప్రారంభించారు. ఒక్క దశాబ్దంలోనే (2012 నుండి 2021 వరకు) 17 నవలలు, రెండు కథా సంపుటాలు, రెండు కవితా సంపుటాలు వెలువరించారు. ఐదు ఫీచర్ ఫిల్మ్స్ నిర్మించారు. ఈయన రాసిన 'క్షమాభిక్ష దొరికింది' కథ ఇంగ్లీషులోకి అనువాదం కాగా, 'టెలీస్కోప్' అనే ప్రముఖ ఆంగ్ల పత్రికలో ప్రచురితమైంది. సాహిత్య సేవతోపాటు సమాజసేవలోనూ ప్రభాకర్ జైనీ పాలుపంచుకొంటున్నారు. తన అక్షర సేద్యం వెనుక భార్య విజయలక్ష్మి జైనీ సహకారం, తోడ్పాటు, శ్రమ, సూచన ఉన్నాయని ప్రభాకర్ జైనీ చెబుతున్నారు.

# కీడు గుడిసె



బొడ్డేడ
బలరామస్వామి,
89197 07141

తూర్పు కనుమలు ఆ చలికాలపు ఉదయాన మంచు ముసుగు కప్పుకొన్నాయి. చెట్టూపుట్టా, పశుపక్ష్యాదులూ మంచులో తడిసిముద్దయి చలికి వణుకుతున్నాయి. గోదావరి పరీవాహక ప్రాంతంలో, దట్టమైన కీకారణ్యంలో.. ఎత్తయిన కొండలమీదుంది ఆ గూడెం. నాగరికతకు చాలా దూరంగా ఉన్న ఆ గూడెంలో ఓ ఆటవిక తెగకు చెందిన ఇరవైమూడు కుటుంబాలు.. మాయామర్మం లేకుండా జీవిస్తున్నాయి. అనాదిగా వస్తున్న ఆచారాలను, కట్టుబాట్లను గౌరవిస్తూ ప్రశాంతజీవనం సాగిస్తున్నాయి. పోడు వ్యవసాయం, వేట, బుట్టల అల్లిక వీరి ప్రధాన జీవనాధారం!

గూడేనికి కాస్త ఎడంగా, చుట్టూ రక్షణగోడలా ఉన్న వెదురు తడికల మధ్య ఉంది ఆ గుడిసె. అందులో వెదురు బొంగులతో కట్టిన అటకమీద ముడుచుకుని పడుకున్న సోము.. చలికి గజగజా వణికిపోతున్నాడు. పక్కన అతని భార్య సిసిరి ఉండుంటే.. ఆమె కౌగిలిలో వెచ్చగా నిద్రపోయేవాడు. ఆమె లేకపోవడంతో రాత్రంతా సరిగ్గా నిద్రపట్టలేదు. చలిపులి గుండెల్లోకి దూరి గిలిగింతలు పెడుతుంటే.. సిసిరి గురించి ఆలోచనలు ముసురుతుంటే.. అతనికి నిద్రెలా పడుతుంది?

హఠాత్తుగా ఏదో ఆక్రందన చెవికి సోగ్గానే దిగ్గునలేచి,

అటక దిగాడు సోము. బయట మంచు తప్ప ఏమీ కనిపించలేదు, వినిపించలేదు. అతడు చలికి వణుకుతూ.. 'అంతా నా బెమ' అనుకున్నాడు. గుడిసెలో ఓ మూలనున్న పొయ్యి దగ్గరికెళ్లి, ముట్టించాడు. చిన్న మంట వెచ్చగా తగిలి ప్రాణం లేచొచ్చింది. చలి కాగుతుంటే అతనికి సిసిరి గుర్తుకొచ్చింది. 'ఈ సలిలో అదెట్టా ఉందో ఏటో?' అనుకుని బాధగా నిట్టూర్చాడు.

'ఒగ రేత్రి ఎట్టాగో గడిసింది. ఇట్టాంటి రేత్రులు ఇంకెన్నో గడవాల! ఆలూమగలను ఇడదీసే ఈ ఆసారమేటి? దాన్నట్టుకుని గూడెం పెద్ద యాలాడ్డమేటి?' అనుకుంటూ మొహం చిరాగ్గా పెట్టాడు.

పక్క పక్క గూడేలకు చెందిన సోము, సిసిరి ఒకరినొకరు ఇష్టపడ్డారు. రెండు గూడేల పెద్దలను తమ మనువుకు ఒప్పించారు. ఆచారం ప్రకారం మనువుకు ముందు గుడిసె కట్టి, ఆనక మనువాడారు. ఆ కొత్తగుడిసెలో కాపురం పెట్టి ఏడాదిన్నరయింది.

సోము చలాకీతనంతోనూ, సిసిరి కలివిడితనంతోనూ గూడెం ప్రజలకు ఇష్టులైపోయారు. పండుగల సమయంలో తుండి, మోరి, డప్పువంటి సంప్రదాయ వాద్యాలు మోగుతుంటే.. వారిద్దరూ హుషారుగా నృత్యంచేసి అందర్నీ అబ్బుర పరిచేవారు. ఇప్పసారా తాగుతూ విందులు ఆరగిస్తున్నప్పుడు ఉత్సాహపరిచే కబుర్లు చెప్పేవారు. సిసిరి రాత్రుళ్లు గంగమ్మతల్లి, ముత్యాలమ్మతల్లి, కొండదేవతల పాటలు పాడుతుంటే విన్నవాళ్లు పూనకంతో ఊగిపోయేవారు. 'సోము సిసిరితో జోడి కట్టినాకే గూడేనికి సందడొచ్చింది' అని అంతా అనుకునేవారు.

సిసిరిని విడిచి క్షణం కూడా ఉండలేక పోయేవాడు సోము. వారిద్దరూ కలిసి అడవిలో తిరుగుతూ తేనె, ఇప్పపువ్వు, నల్ల జీడిగింజలు, కుంకుడుకాయలు వంటివి సేకరించేవారు. దుంపలను తవ్వేవారు. విల్లుకు తుందురు ఎక్కుపెట్టి పిట్టలను, ఉడుతలను కొట్టేవారు. వేటకుక్కల సాయంతో ఉడుములను, అడవి పందులను పట్టేవారు. డొంకలను చాటు చేసుకుని సరసాలాడుకునేవారు. అడవిలో స్వేచ్ఛగా, దర్జాగా తిరిగి ఏ సాయంత్రమో గుడిసెకు చేరుకునేవారు.

***

నిరంతరం ఒకరినొకరు అంటిపెట్టుకునుండే వారిద్దరినీ, సిసిరి నెలసరి సమయంలో తమ కీడు ఆచారం విడదీసేది. దాంతో ఆ ఆచారం పట్ల సోముకు ఎక్కడలేని కోపమూ వచ్చేది. సిసిరిని ఆచారం తప్పమనేవాడు.

'గూడెం కట్టుబాటు దప్పితే తొప్పు గట్టాలి గద మావ' అని నచ్చచెప్పేది సిసిరి. కీడు గుడిసెకు వెళ్లి, అక్కడ మూణ్రోజులుండి వచ్చేది.

ప్రస్తుతం సిసిరి నిండు చూలాలు! దాంతో ఆమె మకాం కొద్దిరోజుల క్రితం కీడు గుడిసెకు మారింది. రెండునెలలు అక్కడే ఉంటుంది. దాంతో 'అన్నిరోజులు ఆమెను విడిచి

ఉండగలనా?' అని తెగ గింజుకుంటున్నాడు సోము.

కొన్ని ఆటవిక తెగల్లో ఉండే ఆచారం, ఆ ఆటవిక తెగలోనూ ఉంది. స్త్రీలు నెలసరి అయితే మూడ్రోజులు, గర్భిణులు, రజస్వలైన వాళ్లూ రెండునెలలు గూడేనికి కాస్త దూరంలో ఉండే కీడు గుడిసెలో ఉండాలి. వారు గూడెంలో ఉంటే వారి కీడు (మైల) గూడేనికి అశుభం కలిగిస్తుందని భావిస్తారు. వారు ఆ కీడు గుడిసెలోనే ఉంటూ, వారికి కేటాయించిన దారుల్లోనే బయటికెళ్లి రావాలి. వారికి వారి బంధువులైన స్త్రీలు తినడానికి పట్టుకెళ్లిస్తారు. ఎవరైనా ఆచారం తప్పితే శిక్షలు కఠినంగా ఉంటాయి. గూడెం నుంచి నిర్దాక్షిణ్యంగా వెలివేస్తారు.

పురుడుకోసం కీడు గుడిసెలోకి వెళ్లిన వాళ్లు క్షేమంగా గూడేనికి తిరిగొస్తారన్నది సందేహమే! కీడు గుడిసెలో మంత్రసాని పురుళ్లు పోస్తుంది. ఒక్కోసారి కాన్పు కష్టమై ప్రాణాల మీదికి వచ్చినా సరే.. ఆసుపత్రికి తీసుకెళ్లరు. బలవంతంగా మోటుపద్ధతులలో కాన్పు చేయడానికి ప్రయత్నిస్తారు. ఆ ప్రయత్నంలో కీడు గుడిసెలోనే కన్నుమూసిన అభాగ్యులెందరో?

సోము అలాంటి సంఘటనలు ఎన్నో చూశాడు. మరెన్నో విన్నాడు. అందుకే అతను భయపడుతున్నాడు. చలి కాగుతూ సిసిరికి ఏం కాకూడదని కొండదేవతను వేడుకుంటున్నాడు.

తమ ఆచారాల్లో కొన్నిటిని మూఢాచారాలుగా భావిస్తాడు సోము. అడవిలో తాము సేకరించినవి అమ్మి, కావలసిన సరుకులు తెచ్చుకోవడం కోసం.. అప్పుడప్పుడూ ఆ దట్టమైన అడవిలోంచి, ఎత్తయిన కొండల్లోంచి తమ సమీప పట్టణంలోకి వెళ్లేవాడు. వెళ్లినప్పుడల్లా పట్టణ ప్రజల జీవనవిధానాన్ని పరిశీలించేవాడు. అక్కడ కీడు గుడిసె ఆచారంతోపాటు తాము పాటిస్తున్న మరికొన్ని ఆచారాలు కూడా లేవని తెలుసుకునేవాడు. ఆ విషయమే తన నేస్తాలతో చెప్పి బాధపడేవాడు.

ఓ రోజు గూడెం పెద్ద గుర్రప్ప, కీడు గుడిసెకు మరమ్మతులు చేయడానికి మనుషులను పురమాయిస్తుంటే సోము ధైర్యంచేసి..

'పట్నంల యాడ ఇట్టాంటి కీడు ఆసారం నేదు. మనంగూడ మానుకుందాం' అన్నాడు.

గుర్రప్ప గుర్రుగా చూసి.. 'నక్కబుట్టి నాలుగు వోరాలు గానేదు, ఈ గాలీవోన యెన్నడు సూడనేదన్నదంట. అట్టాగుంది నీ యెవ్వారం. మూతిమీద మీసమే సక్కంగ రానేదు. పెద్దకొబుర్లు ఆడేత్తున్నవు' వెటకారంగా అన్నాడు.

'ఆడోల్ని ఇబ్బందెట్టే.. ఆల్ల పేనంమ్మీదకు దెచ్చే ఆసారం యెంతసెడ్డదో తెల్డానికి మీసమే రానొవసరం నేదు' అన్నాడు సోము ఆవేశంగా.

గుర్రప్ప అగ్గిమీద గుగ్గిలమైపోయాడు.

'ఏట్రా.. ఇప్పసారా తలకెక్కేసినదేటి? ఏటేటో వోగుతున్నవు. గూడెం బాగుకోసరం మన పెద్దోల్లెట్టిన ఆసారం మనం పాటించాల. మానుకుంతే కొండదేవతకు కోపమొస్తది. ఆసారం

దప్పినప్పుడల్ల గూడెంల పీనుగులెగుతున్న ఇసయం నీకుతెల్ద? మల్ల ఇట్టాగ ఆసారాన్ని ఎటకారం సేత్తే గూడెంపెద్దగ ఏటి సేయాల్నో అదే సేస్తను' అంటూ హెచ్చరించాడు.

గుర్రప్పకు యాభై యేళ్లకు పైనే ఉంటాయి. మొరటు మనిషి! ఆయనకు ఎదురుచెప్పి ఆ గూడెంలో ఎవరూ బతకలేరు. ఆ విషయం సోముకు తెలుసు. దాంతో ఆ మాట మళ్లా ఎత్తలేదు.

'ఒరే సోముగే! లెగిసినవ.. గుర్రెట్టుకొని నిద్రోతున్నవ?' అంటూ గుడిసెలోకి దూరాడు సోము అయ్య కన్నప్ప.

చలి కాగుతున్న సోము..

'నిద్రడితేనే కదర నిద్రోడనీకి! సిసిరికి ఎట్టుందో తెలిసినాదేటి?' ఆత్రుతగా అడిగాడు.

'అది సెప్పడానికే వొచ్చినను. సిసిరి పెరిస్తితి ఏం బాగోనేదంట. కాన్పు సేయడం కట్టమని మంత్రసాని అందంట. కోడలికేటి అవుతాదోనని మీయమ్మ రాగాలుదీత్తు నెత్తి బాదుకుంతున్నది' చెప్పాడు కన్నప్ప.

అది విని సోము భయంతో వణికిపోయాడు. సిసిరికి ఏం కాకూడదని తమ దేవతలకు మొరపెట్టుకుని..

'ఒరే అయ్యా.. మరిప్పుడేటి సేయడం?' అన్నాడు బేలగా.

'సేసేదేటుందిర. సిసిరికి ఏటిగాకుండ కాన్పయితే కొండదేవతకు అడవిపందిని బలిత్తమని మొక్కీసుకోడమే! అంతకుమించి మనం సేసేది ఏటినేదు' అన్నాడు కన్నప్ప విచారంగా.

'ఒరే అయ్యా.. అలాగనకుర. సిసిరి నా పేనం! అది సావగూడదు. ఆలిస్యెం సెయ్యకుండ ఆసుపెత్రికి దీస్కుపోదం. దాన్ని బతికించుకుందం' అన్నాడు సోము ఏడుస్తూ.

'నీకేటి మతి పోనదేటిర? గూడెం ఆసారం నీకు తెల్దేటి? పోనేడు కాసమ్మ కాన్పుజెరక్క గిలగిల కొట్టుకుంతుంటే, దాని పెనిమిటి కొండప్ప ఆసుపెత్రికి దీస్కుపోతన్నడు. గుర్రప్ప ఒప్పుకున్నడేటి? 'ఆసారం దప్పుతావేట్ర ఎదవ నాయాల' అంటు.. గయ్యిన లేసినడు గద!'.

'పేనంకంటే ఆసారం గొప్పదేటి? నాకు సిసిరికంటే మరేటి గొప్పది గాదు. దాన్ని బతికించుకుందానికి నాను ఆసారం దప్పుతను. గుర్రప్ప ఏటిసేస్తడో సేసుకోమను'.. తెగింపుగా అన్నాడు సోము.

'గుర్రప్ప దయాదాచ్చన్యం నేనోడు. గూడెం కట్టుబాటు దప్పితే సిచ్చేసి, ఎలేస్తడు. గూడెం ఇడిసి మనం బతకలేం. దేవతమీద బారమేసి వొల్లకుండుడే మంచిది' నచ్చజెప్తూ అన్నాడు కన్నప్ప.

'ఎలేస్తడని బయిపడితే సిసిరి సస్తది. అది సచ్చినాక నానుమాత్రం బతికి నాబమేటి? సిసిరికి ఉసురుంతే ఈడగాకబోతే ఏడన్న బతుకుతం. ఒరే అయ్యా.. నా మాటిని సాయం సెయ్యి. సిసిరిని డోలీ గట్టుకుని ఆసుపెత్రికి దీస్కుపోదం' దీనంగా బతిమాలాడు సోము.

గూడెం కట్టుబాటు తప్పడమంటే గుర్రప్పకు ఎదురు తిరగడమే! ఆయన ఆగ్రహానికి

గురికావడమే! గూడెం ప్రజల సహాయాన్ని కోల్పోవడమే! అయితే కన్నప్ప కొడుకు బాధను చూడలేకపోయాడు. ఆచారం కోసం కోడల్ని చంపుకోవడం ఆయనకూ ఇష్టం లేదు. దాంతో ఆయనలోనూ తెగింపు పొడచూపింది.

'సరే బయిలెల్లయితే!' అంటూ డోలీ కట్టడానికి దుప్పట్లు, పొడవైన వెదురుబొంగు అందుకున్నాడు. సోము గాబరాగా అటకెక్కి పెట్టెలో దాచుకున్న డబ్బులను మొల్లో దోపుకున్నాడు.

***

మంచుతెరలు ఇంకా తొలగిపోలేదు. డోలీ ముందు కొమ్ము కన్నప్ప, వెనుక కొమ్ము సోము భుజాలమీద ఉంచుకుని మోసుకుపోతున్నారు. మంచును చీల్చుకుంటూ, రాయిూరప్పను దాటుకుంటూ, తుప్పలు డొంకలను తప్పించుకుంటూ దూసుకుపోతున్నారు. డోలీకి పక్కగా సోము అమ్మ నారమ్మ కంగారుగా నడుస్తున్నది. ఏ క్షణంలో గుర్రప్పొచ్చి తమను అడ్డుకుంటాడోనని ఆమె భయపడుతున్నది. మరోపక్క సిసిరిని ఆపదనుంచి గట్టెక్కించమని కొండదేవతకు పదేపదే మొరపెట్టుకుంటున్నది.

కీడు గుడిసెలో పురిటినొప్పులతో లుంగలు చుట్టుకుపోతున్న సిసిరిని, డోలీలోకి చేరుస్తుంటే మంత్రసాని అడ్డుచెప్పింది. ఆమెను సోము పక్కకు తోసేశాడు. చేసేదిలేక గుర్రప్పతో చెప్పడానికి ఆమె పరుగుతీసింది. అదే అదనుగా సోము, కన్నప్ప డోలీని భుజాలకెత్తుకొని కీడు గుడిసెలోంచి వేగంగా ముందుకురికారు.

గంటపాటు ఆగకుండా ప్రయాణించి చాలా దూరమొచ్చేశారు. గుర్రప్ప తమనిక చేరుకోలేడని నమ్మకం కుదిరాక, అలుపు తీర్చుకోవడం కోసం ఆగారు. అయితే కొన్ని క్షణాలు మాత్రమే! నొప్పులకు తాళలేక సిసిరి చేస్తున్న ఆక్రందనలను చూడలేక, అలసటగానే డోలీనెత్తుకుని ముందుకు కదిలారు.

సిసిరి రోదన తప్ప మరే శబ్దమూ లేని ఆ అడవిలో ఒక్కసారిగా అలజడి రేగింది. ఆయాసపడుతూ అడుగులేస్తున్న కన్నప్ప, సోము హఠాత్తుగా ఆగిపోయారు. ఓ అమ్ము వారిపక్కనుంచి రివ్వున దూసుకొచ్చి ఎదురుగా ఉన్న జువ్విచెట్టుకు గుచ్చుకుంది. వెనక్కి తిరిగి చూసి హడలిపోయారు. ముంచుకొస్తున్న విపత్తును చూసి నారమ్మ గుండెలు బాదుకుంటూ కూలబడిపోయింది.

అల్లంత దూరంలో గుర్రప్ప. విల్లంబులు పట్టుకుని, గూడెం ప్రజలను వెంటేసుకుని వడివడిగా అడుగులేస్తూ వస్తున్నాడు. ప్రాణాలు తోడేసే యమకింకరుడిలా ఉన్న ఆయన్ను చూసి.. కన్నప్ప, సోము జడుసుకుని డోలీని కిందికి దించారు.

గుర్రప్ప వస్తూనే కన్నప్పను మెడపట్టుకొని పక్కనున్న డొంకలోకి తోసేశాడు. నారమ్మవైపు కొరకొర చూసి బండబూతులు తిట్టాడు. సోమును పట్టుకొని చెంపలు వాయించేశాడు.

'ఏరా గుంట నాయాల.. గూడెం కట్టుబాటును దప్పే దయిర్నం వొచ్చేసినాదన్న మాట

నీకు' అంటూ నిప్పులు కక్కాడు.

సోము గుర్రప్ప కాళ్లమీద పడిపోయాడు.

'నీకు దన్నం పెడత గుర్రప్ప. సిసిరికి వయిద్యమందకబోతే సచ్చిపోద్ది. అది సస్తే నాను బతకనేను. ఈ పాలికి మా తొప్పుకాసి ఒగ్గియ్యి' అంటూ ఏడుస్తూ ప్రాధేయపడ్డాడు.

'ఒగ్గియ్యిడానికేట్రా.. మామంత పరుగు పరుగునొచ్చింది. ఆసారాన్ని కాపాడుకోనీకి. కట్టుబాటు దప్పినోల్లను అట్టుకుని సిచ్చించనీకి!' గుర్రప్ప కోపంగా అన్నాడు.

సోము ధైర్యం కూడగట్టుకొని..

'ఆసారం కోసరం సిసిరిని బలిదీసుకోడం నాకిట్టంనేదు. మడిసి పేనాలు తీసే ఆసారం మాకొద్దు. కాలం మారినది గుర్రప్ప! దిగువున సాన గూడేలు మార్నయి. మనము మారదం. పాత సింతకాయిల్లాంటి ఆసారాలను ఇడిసేద్దం' అన్నాడు.

'గుంటడు సెప్పే కొబుర్లు ఇనీడానికి నానేమి ఎర్రిమేకను గాదు. మేకల్ని నమిలేసే పెద్దపులిని! గూడెం పెద్దగ ఆసారాన్ని రచ్చించడం కోసరం ఎంతకైన తెగిత్తను'.

డొంకలో పడ్డ కన్నప్ప నెమ్మదిగా లేచి, గుర్రప్పవైపు దీనంగా చూశాడు.

'గుర్రప్ప.. కోపమిడిసి సాంతంగ ఆలోసించు. ఇంతవొరకు ఆసారం కోసరం అన్నెంపున్నెం ఎరగని ఎందరో ఆడకూతుర్ల ఉసురోసుకున్నం. ఇంతటితో యీ బలిని ఆపుదం. పురుడు రాక గిలగిలకొట్టుకుంతున్న సిసిరిని బతికించుకుందం. కూస్త పెద్దమనుసు సేసుకుని మమ్ము ఆసుపెత్రికి అంపు' బతిమాలుతూ అన్నాడు.

'అరే కన్నప్ప.. ఉప్పుడువొరకు కట్టుబాట్లకు అడ్డుసెప్పని నువ్వు, నీవొరకు వొచ్చేసరికి ఆటిని దప్పమంతన్నవు. నీకో నాయం, మరోల్లకింకో నాయం సేయమంతున్నవు? ఇదేమన్న బావుంద? ఇలగయితే రేపు మరోడు మరో ఆసారం దప్పుతడు. అప్పుడు గూడ నాను సూస్తు కూకోవాలా? ఈల్లేదు. గూడెం ఆసారాలు, కట్టుబాట్లు అందరు ఆచెరించాల్సిందే! ఆట్ని దప్పినోల్లని సిచ్చించాల్సిందే!' అన్నాడు గుర్రప్ప కళ్లెర్రజేసి.

మంచు క్రమంగా తొలగిపోతున్నది. సూర్యకిరణాలు చెట్ల మధ్యనుంచి విచ్చుకుంటున్నాయి. సిసిరి ప్రసవవేదనతో గింజుకుంటున్నది. కాళ్లు తన్నిపెట్టి పిడికిలి బిగించి, గుండెలవిసేలా గగ్గోలుపెడుతున్నది. అక్కడికి దగ్గరలో ఏ క్రూరజంతువుకు అడవిపంది చిక్కిందోగాని.. సిసిరి రోదనతో శ్రుతి కలుపుతున్నది. అడవి ఏకకాలంలో రెండు విషాద సంఘటనలను మౌనంగా తిలకిస్తున్నది.

గుర్రప్ప సిసిరిని సమీపించి..

'నొప్పులోర్సుకుని కులదేవతకు మొక్కుకోయే.. నీకేటిగాదు!' అంటూ ధైర్యం చెప్పి, డోలీని కీడు గుడిసెకు చేర్చమని ఓ ఇద్దరు యువకులకు పురమాయించాడు. వారు డోలీని భుజాలకు ఎత్తుకుంటుంటే సోము, కన్నప్ప.. ఆచారానికి సిసిరిని బలివ్వొద్దని ఏడుస్తూ అడ్డుపడ్డారు. వారిని అక్కడున్న మగోళ్లు తలోమాటతో దూషిస్తూ పక్కకు లాగారు. ఆడోళ్లు చోద్యం చూస్తూ

నిల్చున్నారు.

అంతలో ఆ ఆడోళ్ల మధ్యనున్న గుర్రప్ప పెళ్లాం చుక్కమ్మ.. జుట్టు విరబోసుకుని గట్టిగా అరుస్తూ పూనకంతో ఊగిపోతున్నది. ఆమెకు తమ కులదేవత పూనిందని, ఎవరో వేపకొమ్మలు విరిచి ఆమె చేతిలో పెట్టారు. ఆమె తల గుండ్రంగా ఊపుతూ, రాగాలు తీస్తూ..

'నాను కొండదేవతన్రో గుర్రప్ప! నువ్వు తొప్పు సేత్తున్నవ్రో.. తొప్పు సేత్తున్నవు' అంటూ గుర్రప్పను వేపకొమ్మలతో కొడుతున్నది. ఆడోళ్లు చుక్కమ్మను గట్టిగా పట్టుకుని..

'తల్లీ.. అమ్మా! తప్పేటో సెప్పు తల్లీ.. సెప్పు!' అని అడుగుతున్నారు.

చుక్కమ్మ రౌద్రంగా మొహంపెట్టి..

'సిసిరి నా బిడ్డరో బిడ్డ! అది పాపంపున్నెం దెలీని పిల్లరో.. అది గూడేనికి ఎలుగురో! దాని కడుపులో బిడ్డ అడ్డం దిరిగినదిరో.. దాన్ని ఆసుపెత్రికి దీసుకుబోనివ్వండ్రో! అది సస్తే గూడేనికి సేటు కాలమొస్తదిరో.. గూడెం వొల్లకాడవుద్దిరో! నా మాటినికోండ్రో!' అంటూ రాగాలు తీసి చెబుతూ, హఠాత్తుగా సొమ్మసిల్లి కింద పడిపోయింది.

అది విని గుర్రప్పతో సహా అంతా కొయ్యబారిపోయారు. ఏనాడూ చుక్కమ్మ మీదికి రాని కులదేవత, ఇప్పుడిలా వచ్చి చెప్పడంతో అంతా ఆశ్చర్యపోయారు. చుక్కమ్మ చెప్పింది నిజమని గట్టిగా నమ్మారు. సిసిరి చచ్చిపోతే గూడేనికి అరిష్టమని అంతా ఊసులెట్టుకున్నారు.

గుర్రప్ప తన పెళ్లాం మీదికి కులదేవత రావడంతో తెగ భయపడిపోయాడు. ఆకాశంలోకి చూసి దండం పెడుతూ..

'తప్పయిపోనాది.. సెమించు తల్లీ! గూడెమ్మీద గుర్రెట్టుకోకు. దయిసూపు తల్లీ! నువ్వు సెప్పినట్టే సిసిరిని ఆసుపెత్రికి దీస్కుబోతం' అని లెంపలేసుకున్నాడు. సిసిరిని ఆసుపత్రికి తీసుకుపొమ్మని ఆజ్ఞాపించాడు.

అంతే.. సోము, కన్నప్ప వేగంగా కదిలి డోలీని భుజాలకెత్తుకున్నారు. నారమ్మతోపాటు కొందరు యువతీయువకులు సాయంగా డోలీవెంట నడిచారు. మధ్యాహ్నానికి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి సిసిరిని చేర్చారు. డాక్టర్లు వెంటనే స్పందించి, వైద్యం అందించారు. ఆపరేషన్ చేసి తల్లీబిడ్డలను కాపాడారు.

***

చలికాలం గడిచి, ఎండాకాలం ఆఖరుకొచ్చింది. గుర్రప్పలో నెమ్మదిగా మార్పు మొదలైంది. కట్టుబాట్లను కొద్దిగా సడలిస్తున్నాడు. ఓ నిండు చూలాలును తానే దగ్గరుండి కాన్పుకోసం ఆసుపత్రికి పంపించాడు.

ఆ రోజు ఉదయం సోము గుడిసెలో ఒంటరిగా కూర్చుని, మూడ్రోజుల కిందట కీడు గుడిసెకెళ్లిన సిసిరి కోసం ఎదురుచూస్తున్నాడు. కాసేపటికి గెడ్డలో తలారా స్నానంచేసి బిడ్డను చంకనేసుకుని వచ్చింది సిసిరి. సోము పక్కన కూర్చుని..

'ఎవురుతోటి సెప్పనంటే నీకో రహస్యం సెప్పుతను!' అంది నెమ్మదిగా.

'సెప్పనుగనీ ఏటా రహస్యెం?' అడిగాడు ఆత్రుతగా సోము.

'సుక్కమ్మ నిన్న కీడు గుడిసెకొచ్చినది. ఆసారాన్ని దిట్టుకుంట కూకున్నది. ఎవురుతోటి సెప్పొద్దని రేత్రి ఓ రహస్యెం సెవినేసింది. ఆ రోజున సుక్కమ్మమీదన నిజెంగ కొండదేవత పూన్లేదంట. నా పేనాలు గాపాడానీకి ఇంకో మార్గంనేక దేవతకు సెమాపన సెప్పి.. అట్టా నాటకమాడినదంట. ఇన్నాక నా కల్లమ్మట నీల్లొచ్చిసినయి. సుక్కమ్మ కాల్లమీద పడిపోనను' చెప్పింది ఉద్విగ్నంగా.

అది విని సోము ఆశ్చర్యపోయాడు. చుక్కమ్మ చేసిన సాయానికి అతని మనసు పులకించింది. గూడెం ఆచారాలకు, కట్టుబాట్లకు గుర్రప్ప ఇంటిలోనే వ్యతిరేకత మొదలైంది. ఇక తమ మూఢాచారాలకు త్వరలోనే చెల్లుచీటి పడుతుందని భావించాడు. గూడెం ఆడవాళ్లకు మంచిరోజులు రాబోతున్నాయని సంతోషించాడు.

సిసిరి ఒళ్లోని బిడ్డ హఠాత్తుగా ఏడుపు మొదలెట్టడంతో, సోము ప్రేమగా తన చేతుల్లోకి తీసుకుని..

'సిట్టితల్లీ.. మీయమ్మడుతున్న ఇక్కట్లు సూసి, ఆడబుట్టుక బుట్టినానని బెంగెట్టుకుంతున్నవ? ఇగ బెంగనేదమ్మ! నువ్వు పెద్దయ్యేసెరికి యీ ఆసారాలేం ఉండవునే! గూడెం పెద్దతోనే కీడు గుడిసెకు అగ్గెట్టేసే రోజు తొందర్లోనే వస్తది. ఆ రోజు కోసరం నాను పోరాడతనే ఉంట!' అన్నాడు దృఢంగా.. ఆశగా!

ఆ చంటిబిడ్డకు ఏమర్థమయిందో.. ఏడుపాపి తండ్రివైపు చూస్తూ బోసినవ్వు నవ్వింది.

***

విశాఖపట్నం జిల్లా కశింకోట గ్రామం.. బొడ్డేడ బలరామస్వామి స్వస్థలం. తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే, వ్యవసాయాన్నీ చూసుకుంటున్నారు. సాహిత్యమంటే ఇష్టం. చరిత్ర, గ్రామీణ నేపథ్యంలో కథలు రాస్తున్నారు. ఇప్పటివరకూ 30కి పైగా కథలు, కొన్ని కవితలు వివిధ పత్రికలు, సంకలనాలలో ప్రచురితమయ్యాయి. చతురలో 'ఆకుపచ్చని చంద్రుడు' నవల అచ్చయ్యింది. స్వాతి మాస పత్రిక నుంచి 'సముద్రం' కథకు 2017లో 'అనిల్ అవార్డు' అందుకున్నారు. గౌరీ గ్రంథాలయం, అనకాపల్లి వారు నిర్వహించిన కథలపోటీలో 'ఆడపిల్ల' కథకు డా. సి. నారాయణ రెడ్డి గారి చేతుల మీదుగా ద్వితీయ బహుమతి అందుకున్నారు. 'కళింగ పౌరుషం' చారిత్రక కథకు జాగృతి వార పత్రిక నుంచి, 'పట్టుచీర' కథకు హాస్యానందం పత్రిక నుంచి ప్రత్యేక బహుమతులను గెలుచుకున్నారు. ఈయన రాసిన 'సముద్రం' కథ హిందీలోకి, 'ఒక ప్రయాణం' కథ కన్నడంలోకి అనువాదమయ్యాయి. అశోక్ ఫ్రెండ్స్ క్లబ్ సాంస్కృతిక కళా పరిషత్ సంస్థకు అధ్యక్షుడిగా కళా సేవలో పాలుపంచుకుంటున్నారు.

# విషవలయం




అనిసెట్టి శ్రీధర్,
**98660 97518**


ఒకప్పుడు వేలాది భారీ ట్రక్కులు నడిచి నడ్డి విరిగిన రోడ్డుపై.. వాటినుంచి జారిపడి ఇంకా మిగిలిన ఖనిజాల అవశేషాలను తొక్కుకుంటూ.. దుమ్మో, ధూళీ రేపుతూ భారంగా జోడా నుంచి కియొంజర్ వైపుగా కదులుతున్నది ఓ ముసలి ట్రక్కు. అందులో ఇరవైమంది దాకా కూర్చుని ఉన్నారు. ఎవరి ముఖంలోనూ సంతోషం లేదు. జీవితంలో ఓడిపోయినవాళ్లలా ఉన్నారు.

యుద్ధం ముగిశాక మిగిలిన మరుభూమిలా ఉంది. రోడ్డుకు ఇరువైపులా వదిలేసిన ట్రక్కులు, ఎక్స్కవేటర్లు.. సగం కాలిన కాష్టంలా ఉన్నాయి. దారి పొడుగూతా లాడ్జిలు, మెకానిక్ షెడ్లు, చిన్న చిన్న హోటళ్లు, వాటిని ఆనుకుని కిళ్లీ కొట్లు.. అన్నీ మూతపడినవే! ఈ రోడ్డు అనే కాదు.. ఒరిస్సా రాష్ట్రంలో మూతపడిన గనులు ఉన్న ఏ ప్రాంతంలోనైనా ఇవే దృశ్యాలు. అవన్నీ చూస్తుంటే ట్రక్కులో కూర్చున్నవాళ్లకు తమ గతం, వర్తమానం గుర్తుకు వచ్చి.. తెలియని భవిష్యత్తు గురించి కడుపులో దేవినట్టయింది. మైనింగ్ జరుగుతున్న రోజుల్లో జన సందోహంతో, కేరింతలతో తిరుణాల్లలా ఉండేది ఆ ప్రాంతమంతా. కాసుల, మందుగ్లాసుల, చేతిగాజుల గలగలలూ. బడా కంపెనీలతో సహా అందరూ అనుమతి ఇచ్చినవాటికి ఎన్నోరెట్ల వైశాల్యంలో తవ్వుకుని

తరలించేశారు. గనులు అక్రమంగా తవ్వారని, మైనింగ్ ఆపేయమని కోర్టు ఉత్తర్వులు ఇచ్చి నాలుగేళ్లవుతున్నది. తిరుణాల్లలో వందల బాంబులు పేలినట్టయింది. ట్రక్కులో కూర్చున్నవాళ్ల జీవితాలన్నీ అప్పుడే ఛిన్నాభిన్నమయ్యాయి.

చిన్నగా చినుకులు మొదలై.. ఓ మోస్తరు వర్షం పడుతున్నది. ఎవ్వరూ ఆగుదామని కానీ, ఒంటిపై గుడ్డ కప్పుకొనే ప్రయత్నం కానీ చేయలేదు. చిన్నపాటి వర్షాలకు చెట్టు కిందో, గోడవారో ఆశ్రయం చూసుకునే.. తడిస్తే జలుబు, జ్వరాలు తెచ్చుకునే శరీరాలు కావవి. బతుకుదెరువు కోసం రోజూ పరుగులెత్తవలసిన వాడితో ఎండా, వానా కూడా స్నేహం చేస్తాయి. వారిలో ఎవరిని కదిలించినా ఒక కన్నీటి కథే.

'మా కథలు మేమే చెప్పుకొంటాం!' అంటున్నారు.

***

సాహు :

నా పేరు అశోక్ సాహు. మాది కియొంజర్ జిల్లా. నేను దుబాయిలో సూపర్‌వైజర్‌గా కొన్నేళ్లు పనిచేశాను. కొంత డబ్బు వెనకేసుకున్నాక కుటుంబానికి దూరంగా ఉండలేక, 2009లో మా రాష్ట్రానికి తిరిగొచ్చేశాను. మా ప్రాంతమంతా మైనింగ్ కార్యకలాపాలతో చాలా సందడిగా ఉండేది. ఎటు చూసినా డబ్బే!

ఒకటి, రెండు ట్రక్కులు ఉన్నవాళ్లు ఖనిజం తోలడానికి తమ బండ్లను కాంట్రాక్టర్లకు అప్పజెప్పేవాళ్లు. నా స్నేహితుడు పట్నాయక్ జీతానికి పనిచేసే ట్రక్కు డ్రైవర్. ఒక కాంట్రాక్టర్ దగ్గర నమ్మకంగా పనిచేసేవాడు. రాబడి చూసి కాంట్రాక్టర్ సలహా మీద వాడు అప్పుచేసి రెండు బండ్లు కొనుక్కుని, ఒక డ్రైవర్‌ను పెట్టుకున్నాడు.

దుబాయి నుంచి వచ్చి.. 'ఏం చెయ్యాలా?' అని ఆలోచిస్తున్న నేను కూడా.. మూడు ఎక్స్‌కవేటర్లు కొని అద్దెకిచ్చాను. సరిగ్గా సంవత్సరానికి అక్రమ మైనింగ్ అంటూ కోర్టు రాష్ట్రంలోని అన్ని గనులపైనా నిషేధం విధించింది. ఇవ్వాల్సిన డబ్బులో కొంత కాంట్రాక్టర్లూ ఎగ్గొట్టారు. ఇలాంటి వందలాది ట్రక్కులు, ఎక్స్‌కవేటర్లకు పనిలేక, వేలంలో అమ్ముడుపోక ఇలా రోడ్డు పక్కన అనాథ శవాల్లా పడి ఉన్నాయి.

నేనూ నా ఎక్స్‌కవేటర్లను ఎక్కడో అక్రమంగా పుట్టిన బిడ్డల్లా ఇక్కడే వదిలేశాను. అప్పు ఇచ్చిన బ్యాంక్ వాళ్లు స్వాధీనం చేసుకుని వేలం వేసినా సగం బాకీ కూడా తీరలేదట. మిగిలిన మొత్తం వసూలుకు కోర్టులో కేసు వేశారు.

'బడా కంపెనీలకైతే వేలకోట్లు రుణాలు తీసుకొని.. వ్యాపారం దెబ్బతిన్నా, కంపెనీ వాడు దెబ్బేసినా బ్యాంకుల వాళ్లు అంతగా పట్టించుకోరు. కొంత మొత్తం వసూలు చేసి.. మిగిలిన మొత్తం మాఫీ చేస్తారు' అని దాస్‌బాబు చెప్పాడు. అలా ఎగ్గొట్టినవాళ్లు ఇప్పటికీ విలాసవంతమైన భవనాల్లో జీవిస్తూ, ఖరీదైన కార్లలోనే తిరుగుతున్నారు. ఇదెలా సాధ్యం?

నా పరిస్థితే కొంత మెరుగు. పట్నాయక్‌కు అన్నీ అప్పులే. బండ్లన్నీ అప్పులవాళ్ల

పరమైపోయాయి. కానీ, అవి కొనేవాళ్లే లేక రోజూ వచ్చి బండబూతులు తిడుతూ, ఇంట్లో చేతికందిన సామాను పట్టుకుపోయారు. వాడి కథ నేనెందుకు చెబుతున్నానంటే.. వాడే చెప్పుకోవడానికి ఇప్పుడు లేడు. 'ఈత కొట్టడానికి బైతరిణీ నదికి వెళ్లి ప్రమాదవశాత్తూ మునిగిపోయాడు' అంటారు ఇంట్లోవాళ్లు. అలా చెప్పకపోతే ఇన్సూరెన్స్ రాదు కదా! వాడు రాసిపెట్టిన ఉత్తరం దాచిపెట్టేశారు. కొందరు తెలివితక్కువ వాళ్లు ఉరేసుకున్నారు. పురుగుల మందు తాగారు.

విత్తనాల్లాంటి మమ్మల్ని మా ప్రమేయం లేకుండానే బడా కంపెనీలు అనబడే కలుపు మొక్కల మధ్యకు ఎవరు విసిరారు? బతుకుదామని ఆశపడి చిగురించి లేత కొమ్మలైన మా మనుగడ పరిస్థితి ఏమిటి?

***

మాఝి :

నా పేరు నారాయణచంద్ర మాఝి. నేను గనుల్లో పనిచేసేటోడిని. గనులు మూతపడి చాలా రోజులు పని లేకపోవడంతో, మా యజమానిని బామాలి ఆయనదే మూతపడిన స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీలో సెక్యూరిటీగా కుదురుకున్నాను. నేను చేసిన అప్పులు, నా అవసరాలు మీనవడి ఇరవైవేల కోసం ఫ్యాక్టరీలో బిల్లెట్లు దొంగతనం సేసి దొరికిపోయినాను. ఆర్నెల్లు జైలు సిచ్చ అనుభవించి, ఈ మధ్యే బైటికొచ్చినాను.

'ఇన్ని వేల కోట్ల ఖనిజం అక్కరమంగా తరలిపోనాది కదా! కోరటు ఏం సెప్పింది బాబూ!' అని దాస్‌బాబును అడిగినాను.

'దండిగా జరిమానాలు ఏసారు.. అదంతా ప్రభుత్వానికి జమ అయ్యి, ఆపై ప్రజలకు చేరతాది' అని అన్నాడు దాస్‌బాబు. జరిమానాలు ఏసారే తప్ప.. ఒక్క యజమానికి కానీ, పెబుత్వ అధికారికి కానీ జైలు సిచ్చ పడలేదే! అని ఆశ్చర్యమేసినాది. అంటే దొంగతనం సేసిన సొమ్ము ఎనక్కి ఇచ్చేత్తే.. జైలుకు ఎల్లక్కర్లేదన్నమాట. 'నా దగ్గరా సొమ్మంత వసూలు సేసినా.. మరి నాతో ఊచలు ఎందుకు లెక్కెట్టించినారు?' అనేది నా ప్రశ్న. సదూకున్నోడు కదాని సాహుబాబుని అడిగినాను. 'నువ్వో వ్యక్తి సొమ్ము దొంగతనం చేశావు. వాళ్లు ప్రజల సొమ్ము దిగమింగారు.. అదే తేడా!' అన్నాడు.

***

బారిక్ :

నా పేరు గోపాల్ బారిక్. మా ఊళ్ల చుట్టూ గనులు వెలిశాక దేవతలకు మొక్కినట్టు మేమూ వాటికి మొక్కినాం. మా చేతి వృత్తులు, మా తెలివితేటలు, మేం చేసేటి ప్రయోగాలు.. అన్నీ ఈ కొత్త ఉద్యోగాలతో మట్టికొట్టుకు పోయినాయి. వచ్చిన డబ్బుతో జలసాలు, నేరాలు, అక్రమ సంబంధాలు, విడాకులు పెరిగినాయి. మా జిల్లానుంచి లక్షల కోట్ల ఖనిజం తవ్వుతారు. మా ఊళ్లను ముంచెత్తిన దుమ్మూ, ధూళీ మా ఊపిరితిత్తుల్ని, ఒంటిని తినేసినాయి. మా పొలాలు

పండవు. మంచినీళ్లు దొరకవు. మందు దొరుకుతాది. గనులు తవ్వితే కలిగే నస్టాలను పూడ్సడానికి కంపెనీలు ఏం చెయ్యాల్నో కాయితాల మీన ఉంటై. గమనించాల్సిన ప్రభుత్వం నిదరోతా ఉంటది. మైనింగ్ కోసరం కొంపా, గోడూ లాకున్నవాల్ల గోస యేరే! గనులుంటేనే పనులు. బడా కంపెనీలు తప్పుడు లెక్కలు చూపించినాయని, ఎక్కువ తవ్వకెళ్లి పోయినారని గనులు మొత్తంగా మూసేసి.. మా ఊరి జనాల నోట్లో మళ్లీ మట్టికొట్టినారు.

మా తమ్ముడిదీ నాలాంటి బతుకే. తను మాత్రం బేవార్సుగా తిరుగుతూ ఏ చింతా లేకుండా కాలం యెల్లమారుస్తున్నడు. కనీసం నా భార్య నాలుగిళ్లలో పనులు చేస్తాది. మా మరదలు అయితే రోగిష్టిది. ఏ పనీ చెయ్యలేదు పాపం! మరి సంపాదన ఎలా అంటారా? ఎదిగిన వాడి కూతురు సంపాయిస్తంది. ఏం చేస్తందని మాత్రం అడగమాకండి. నా నోటితో సెప్పలేను. నాకూ కూతురే కదా అయ్యేది. తనే కాదు. మా ఊళ్లో చాలామంది అమ్మాయిలు అదే చేస్తారు. 'బతకాలి కదా!' అంటారు.

కలి పురుషుడు నాలుకను ఒక చేత్తో, పురుషాంగాన్ని రెండో చేత్తో పట్టుకుని వచ్చినాడని చెబుతారు కదా! నాలుక రుచి తీరగానే మగాడికి రెండో చేత్తో పట్టుకున్నదాని ఆకలి మొదలవుతాది. పాపం ఆడదానికి కడుపు నిండాలంటే.. ఆ ఆకలి తీర్చేదానికి మగాడి పక్కన పండాలి. మాకీ దుస్థితి ఎందుకు కలిగినాది? మా ఉద్యోగాలు ఎందుకు పోయినయి? కష్టపడి పనిచేసే చేతులకు ఆదరువు చూపించే బాద్యత ఎవురిది?

***

నాయుడు :

నా పేరు అప్పల్నాయుడు. మాది సికాకుళం జిల్లా. ట్రాక్టర్‌తో మట్టి తోలే పని. మా ఊరు ఒరిస్సా రాష్ట్రానికి సరిహద్దులో ఉంటది. మా అత్తోరిది ఒరిస్సా రాష్ట్రమే! అంచేత రాకపోకలూ ఎక్కువే. మావోడొకడు అక్కడ గనుల్లో జేసీబీ తిప్పుతా.. బాగా సంపాయించాడు. వాడి సలహామీదనే మేమూ ఇక్కడ చేరాం. మాలాంటి తెలుగు వాళ్లూ బాగానే ఎగబడ్డారు. నేను డ్రైవర్‌గా పనిసేస్తానే.. అప్పులు సేసి మరీ మాయావిడతో హొటేలు పెట్టించిన. మా బామ్మర్ది పక్కనే కిళ్లీకొట్టు పెట్టేడు. గనులతోపాటు మా బతుకుదారీ మూసుకుపోనాది. ఇదే మా తెలుగు సిన్మా హీరో అయితే అక్రమ గనుల్ని బాంబులేసి పేల్చేసి, యజమానుల్ని సంపేసి వాళ్ల ఆస్తులన్నీ మాకు రాసిచ్చేటోడు. నా పెళ్లాం సాహుబాబుతో ఆళ్ల బాసలో సెప్పుకొని ఏడ్సింది.

'అన్నా! నాకు నలభై ఐదు దాట్నాదా? మా ఆంధ్రాలో మా కులపు ఆడోళ్లకు పదేనేలు ఇత్తన్నారా? మా ముసిలోల్లిద్దరికీ కలిపి నెలకి నాలుగేలు పెన్సనా? నా పెనిమిటి ఆటో తోలతా ఉండుంటే పదేలా. మా బొట్టిలిద్దర్నీ ఇస్కూలికి పంపతా ఉంటే ముప్పై ఏలా? పని సెయ్యకుండా తిని తొంగున్నా సమ్మచ్చరానికి లచ్చ రూపాయలు వచ్చి పడేటియి. ఈ ముదనట్టపోడు ఈడ్నేదో నొల్లేసుకుందావని తెచ్చి పడేసిండు. ఇక్కడ ఇంటిల్లిపాదీ రెక్కలు ముక్కలు సేసుకున్నవేగానీ.. ఊరక వచ్చిపడే సొమ్ము ఆసించలే. మరి మా బతుకులు ఇలా

ఎందుకు కాలినయ్?'..

***

బేరాలు బాగున్నాయని స్థలం లీజుకు తీసుకుని, పెద్ద షెడ్డు వేసి భారీగా అడ్వాన్సులు ఇచ్చి కుర్రాళ్లను పెట్టుకుని.. నష్టపోయిన ట్రక్కుల మెకానిక్ రత్నాకర్ ముదులి, గనుల మూసివేతతో మూతపడిన పరిశ్రమల్లో ఉద్యోగాలు కోల్పోయిన కార్మికులు.. ఇలా ట్రక్కులో ఉన్న మిగిలిన అందరిదీ తలా ఒక కథ, అదే వ్యథ.

'మనమెందుకు నష్టపోవాల? మనమేమైనా గంజాయి పండించినామా? సరుకు నల్లబజారులో అమ్ముకున్నమా? గనులు అక్రమంగా తొవ్వినమా? పుకార్లు నమ్మి అత్యాశతో రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు పెట్టి నష్టపోయిన జనాలు కాము మనం. మన నష్టాన్ని ఎవరు పూడుస్తారు?' ఈ ప్రశ్నలు వాళ్లను తొలిచేస్తున్నాయి.'దీనికంతటికీ కారణం ఏట్రా? మన బతుకులిలా ఎందుకు తగలడ్డాయ్?' అని అడిగాడు ఒకడు.

'దాస్‌బాబునే నిలదీయాల్రా!' అన్నాడు మరొకడు.

అందుకే మూకుమ్మడిగా బయలుదేరారు.

ఉపాధి పోయి, వ్యాపారాలు నష్టపోయి జీవితాలు అగమ్యగోచరంగా తయారైనపుడు.. వీళ్లంతా ఏ గమ్యం వైపు వెళ్తున్నారు? ఏ ప్రశ్నను సంధించడానికి వెళ్తున్నారు? తమ జీవితాలు గాడిన పడటానికి ఏం సమాధానం కోరుకుంటున్నారు?

తమ ప్రశ్నకు సమాధానం దాస్‌బాబు చెప్పాలని వాళ్ల మొండిపట్టు. దాస్ బాబు అంటే.. బిశ్వజిత్ దాస్.

ఎవరీ బిశ్వజిత్ దాస్?

***

దాస్ బాబు :

నమస్కారం. నా పేరు బిశ్వజిత్ దాస్. కియొంజర్ జిల్లా కేంద్రంలో నేనొక పాత్రికేయుడిని.

దోపిడీ, దొంగతనాలు, ఆక్రమణలకు గురికాకుండా డబ్బు బ్యాంకుల్లో, బంగారం, దస్తావేజులు లాకర్లలో. ఖాళీ స్థలానికి ప్రహరీ. వస్తువులకు ఇన్సూరెన్స్. ఇంటికి సీసీ కెమెరాలు, సెక్యూరిటీ అలారాలు.. మనిషికి తనది అనేసరికి ఎన్ని జాగ్రత్తలో! అదే ప్రభుత్వ సొమ్మును ప్రజలు తమ సొమ్ముగా భావించరు. తమదిగా తాదాత్మ్యం చెందరు. వాటివల్ల నేరుగా, ఇప్పటికిప్పుడు తమకు వచ్చే, కనిపించే రాబడి ఏమీ ఉండదు. భవిష్యత్ తరాల గురించి చింత ఉండదు. ఇలాంటి ఆస్తులు, సంపద అన్యాక్రాంతం కావడం సులభం. వీటిని నిత్యం పహరా కాస్తూ, కంట కనిపెట్టుకునుండే కాపలాదారులు కొంతమంది ఉంటారు. బతుకుపోరాటంలో ఎవరికివారు తలమునకలై ఉంటే.. సమాజం కోసం శంఖారావం పూరించేవాడు ఒకడుంటాడు. అలాంటి వాళ్లల్లో నేనూ ఒకడిడని అందరూ అంటారు.

రాజకీయ నాయకుల అండదండలతో నిబంధనల్ని అతిక్రమించి, తుంగలో తొక్కి,

ప్రభుత్వాధికార్లను బాగా మేపి.. ఒడిశా రాష్ట్రమంతటా ఒక దశాబ్దం పాటు అడ్డంగా, అక్రమంగా మైనింగ్ చేసి, కొన్ని కంపెనీలు వేల కోట్లకు పడగలెత్తాయి. ఇదే మేము బయటపెట్టాం. తవ్వినకొద్దీ ఖనిజం అయినా అయిపోతుంది కానీ.. నిజాలు బయటపడుతూనే ఉన్నాయి. ఆ రాశి ఎత్తు, వైశాల్యం మానవమాత్రుడు కొలవలేనంతగా ఉన్నాయి. న్యాయస్థానం ఉత్తర్వులతో మైనింగ్ చాలా సంవత్సరాలు దాదాపు పూర్తిగా స్తంభించిపోయింది.

మానసిక, శారీరక ఉద్వేగాల్లాగే.. ఆర్థిక ఉద్వేగం అని ఒకటుంటుంది. అది ఉత్తేజంలానే కనిపిస్తుంది. రియల్ ఎస్టేట్, షేర్లు.. అలాగే మైనింగ్. ప్రగతిరథం పరుగులెడుతున్నట్టే కనిపిస్తుంది. అది వాలులో అదుపు లేకుండా జారిపోతోందనీ, తమను ఎక్కడో కింద పడేసి తొక్కుకుంటూ వెళ్లి ఆగిపోతుందనే ఎరుక సామాన్య ప్రజలకు కలగదు. అవకాశాలు ఎలా వస్తున్నాయనేది అసంగతం. సామాన్య ప్రజలతో సహా అందరూ పెట్టుబడులు పెడుతూనే ఉంటారు. అనుమతి ఇచ్చిన దానికన్నా ఇన్ని రెట్ల అక్రమ మైనింగ్ జరగకుండా చర్యలు తీసుకుని ఉంటే.. పాపం వాళ్లీ పెట్టుబడులు పెట్టేవాళ్లే కాదు.

మనం, మన పిల్లలు బాగుంటే సరిపోతుందా? ముని మనవళ్లు, వాళ్ల ముని మనవళ్లు బతకొద్దా? మన ముత్తాతలు, మన పూర్వికులు ఇలానే స్వార్థంతో ఆలోచించి ఉంటే పరిస్థితులు ఎలా ఉండేవి? మనం సంపాదించిన దాంట్లో అంతా ఖర్చు పెట్టెయ్యం కదా! దాచిపెట్టుకుంటాం కదా! మరి ఇది కూడా ప్రకృతి ఇచ్చిన సంపద కాదా? కనీసం మనం సంపాదించింది కూడా కాదని వాళ్లకు చెప్పేవాడిని. 'అధర్మయుద్ధం చేస్తున్నవాడికి కాకుండా క్షతగాత్రులకు నీతి బోధిస్తున్నానా?' అనిపించేది నాకు. విచ్చలవిడి మైనింగ్ వల్ల దెబ్బతినే ప్రకృతి సమతుల్యత, మానవ సంబంధాలు.. వీటి గురించి చెప్పినా వాళ్లకు అర్థం కాదు.

ప్రభుత్వపరంగా తీసుకునే అరకొర చర్యలు, న్యాయస్థానాల్లో జరిగే జాప్యం, అహేతుకమైన నిర్ణయాలు మీకు తెలియంది కాదు. మైనింగ్ ఆగిపోవడంతో పరిశ్రమలు మూతపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేకమంది జీవితాల్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేసింది. మొదటి రెండు, మూడేళ్లలోనే ఉపాధి కోల్పోయి, వ్యాపారాల్లో పెట్టిన పెట్టుబడులు నష్టపోయి, చేసిన అప్పులు తీర్చలేక చితికిపోయిన వాళ్లు వేలల్లో ఉన్నారు. 'ఎవరు చేసిన తప్పు.. ఎవరు బలయ్యారు?' అది తల్చుకుంటేనే వేదనగా ఉంటుంది.

అలా నష్టపోయిన సాహులాంటి వాళ్లు..

'మీతో పని ఉంది సార్! వస్తున్నాం..' అని ఫోన్ చేస్తే, వాళ్లకోసం ఇంటి దగ్గర ఎదురు చూస్తున్నాను.

***

జోరున వర్షం కురుస్తున్నది. గమ్యస్థానం చేరిన ట్రక్కునుంచి వాళ్లంతా కిందికి దిగారు. అప్పటికే ఆ చుట్టుపక్కల నివసించే ఓ పదిమంది అక్కడ వేచి ఉన్నారు. దాస్‌బాబు ఇంటి

తలుపు తట్టారు.

దాస్‌బాబు ఆశ్చర్యపోయాడు.

'ఇంత వర్షంలో ఇంతమంది కలిసి ఎందుకు వచ్చారో? ఏమైనా జరిగిందా?' అనుకున్నాడు. వాళ్లల్లో చాలామంది తనకు తెలిసినవాళ్లే.

'ఏంటి సాహూ? ఇలా వచ్చారు?' అడిగాడు దాస్‌బాబు. 'మిమ్మల్ని ఒకటడగాలని వచ్చాం దాస్‌బాబు!'. 'అడగండి!'. ముప్పై కంఠాలు ఒక్కటై.. సాహు గొంతు నుంచి బాణంలా సూటిగా.. గాలి హోరును అధిగమించి, వర్షపుధారను చీల్చుకుంటూ వెలువడిందో ప్రశ్న!

ఆశ్రయమిస్తున్న చెట్టుపైనే పడిన పిడుగులా ఉందా ప్రశ్న. 'కాళీయమర్దనం ఎందుకు చేశావ్?' అని కృష్ణుడిని ఆబాల గోపాలం నిలదీసినట్టుందా ప్రశ్న!

దాస్‌బాబుకు కాళ్ల కింద భూమి కంపించినట్టయింది. తాము పోరాటాలు చేస్తూ సమన్యాయం, పారదర్శకత అనే సామగ్రితో కడుతున్న ప్రజాసౌధం కుప్పకూలినట్టయింది.

ప్రజల ఉమ్మడి సంపదను దోచేస్తూ, అవినీతి సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటున్న రాజకీయ నాయకుల, బడాబాబుల, అధికారుల చర్యలకు వత్తాసు పలుకుతూ, న్యాయాన్ని ప్రశ్నించే గొంతుకలుగా ఎందుకు మారాయి? 'మాకు బతుకుదెరువు ముఖ్యం. ఏ దారైతేనేంటి' అనే నిస్సహాయత వాళ్లను ఆ ప్రశ్న వేయడానికి ఉసిగొల్పింది. ఇంతకూ ఏమిటా ప్రశ్న?

'గనులు అక్రమంగా తవ్వితే తప్పేంటి దాస్‌బాబూ?'.

**అనిసెట్టి శ్రీధర్ స్వస్థలం పశ్చిమ గోదావరి జిల్లా నరసరావుపేట. బి.ఎస్సీ చేశారు. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లో చీఫ్ మేనేజర్‌గా ఉద్యోగ విరమణ పొందారు. 1990 నుంచీ కథలు రాయడం మొదలుపెట్టారు. ఇప్పటి వరకూ 32 కథలు రాశారు. 15 కథలతో 2008లో తీసుకొచ్చిన 'కొత్త బంగారులోకం' కథా సంపుటిని కారా మాస్టారు ఆవిష్కరించారు. మరో 16 కథలతో సరికొత్త సంపుటిని ఈ ఏడాది తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. 2011లో 'నివేదన' కవితా సంపుటిని తీసుకొచ్చారు. పలు ప్రముఖ పత్రికలు నిర్వహించిన కథల పోటీల్లో ఈయన 'పాతసామాను', 'మద్దతు', 'జనజీవన స్రవంతి', 'శాహో వర్సెస్ మాహో' కథలకు బహుమతులు అందుకున్నారు. 'కొత్తబంగారు లోకం' కథకు సి.పి.బ్రౌన్ అకాడమీ నుంచి బహుమతి దక్కించుకున్నారు. 1993లో వచ్చిన ఇరవై ఉత్తమ కథల్లో ఒకటిగా ఈయన రాసిన 'నెత్తురు కూడు' కథ ఎంపికైంది. 'జాతి సమష్టి సంపదను బలవంతులు, ధనవంతులు దోపిడీ చేయడాన్ని బలహీనులు సమర్థించవలసిన అగత్యం ఎందుకు వచ్చింది?' అనే కథా వస్తువుకు.. రచయిత స్వయంగా గమనించిన పరిస్థితుల్ని జోడించి రాసిన కథ.. 'విషవలయం'!**

# ఉల్టాబాజా



సయ్యద్ గఫార్,
**81432 53116**

అప్పటిదాక ఉరుములు మెరుపులతో దంచికొట్టిన వాన.. జరంత తగ్గి సన్నటి ముసురువట్టింది.

మట్టిగాడు పెంచుకుంటున్న ఊర కుక్కపిల్ల.. 'కూం.. కుంయ్.. కుంయ్..' అన్కుంట గుడిసె బయటికీ లోపట్కి ఒకటే తిరగవట్టింది. దాని కాళ్లు ఒక్కాడ నిలుస్తలేవ్.

అది వీర్లపూడి ఊరికి దూరంగా ఉన్న మాదిగ్గూడెంలోని డప్పు మట్టిగాని గుడిసె. ఊరోల్ల భయానికి గూడెపోల్లందరూ గూడెం ఇడ్సివెట్టి పారిపోంగ.. మిగిలిన గుడిసె అదొక్కటే. పుట్టి భూమ్మీద కాలు మోపిన కాన్నుంచి గీ గుడిసెల్నే బతుకీడ్సిన మట్టిగానికి యాభైఏండ్లు దాటినయి. ఇయ్యాల పొద్దుగాల్నే.. నూరేండ్లు నిండినయి.

కాళ్ల పాదాల కాన్నుంచి ముఖంపైదాంక నిండుగా దుప్పటి కప్పి.. ఒక నిట్టూర్పు ఇడ్సి, కండ్లు తుడ్సుకుంటా గుడిసె బైటికొచ్చిండు మట్టిగాని దోస్తు గోరేమియా. మట్టిగానికి గోరేమియా తప్ప నా అనేవాల్లెవ్వరూ లేరు.

గోరేమియాది కూరగాయల యాపారమైతే, మట్టిగాడు ఊర్లె పండగలకూ పబ్బాలకూ డప్పు కొట్టి.. వచ్చే డబ్బుల్తోనే కాలం ఎల్లదీసేటోడు.

ఎప్పుడో ఓపాలి మందు తాగుడు అలవాటున్న మట్టిగానికి ఊరోళ్లు డప్పు కొట్టడానికి పిల్సకవొయి, వాణ్ని సంతోష వెట్టడానికని గింత మందు తాపించేటోళ్లు. వానికేమైందో ఏమో.. ఆర్నెల్లవట్టి ఇపరీతంగ తాగవట్టిండు. ఆరోగ్యం చెడివోద్దని మట్టిగానికి అప్పుడప్పుడు గోరేమియా ఎచ్చరిస్తనే ఉన్నడు. ఆ మాటల్ని పెడచెవినవెట్టి బిర్రుగ తాగుతనే ఉండు మట్టిగాడు. పది రోజుల కిందట మట్టిగానికి కడుపు ఉబ్బుకొచ్చింది. ఏం తినవోతలేదు. గోరేమియా ఎంటవెట్కవొయి దవాఖానల సూవెట్టిండు. తాగి తాగీ కార్జెం

చెడిపోయిందని, బతుకుడు కష్టమని చెప్పిండు డాక్టరు. ఏవో మందులైతే రాసిచ్చిండు. అయి మింగుతనే ఉండు. మూడు రోజుల కిందటన్నే కోమాలకు వొయిన మట్టిగాడు.. ఇయ్యాల తెల్లార్జామున పానమొదిలిండు.

వానికి లగ్గం కాలే. వాని శవం మీదవడి ఏడ్సేటోళ్లు లేరు. ఊర్లే అయినోళ్లు గని, కులపోళ్లు గని ఎవలూ లేరు.

'మట్టిగాని శవం ఎట్లా లేవాలే?' అనే ప్రశ్న.. గోరేమియా దిమాఖ్‌ల పెద్ద సవాలయి కూకుంది. అట్లా ఆలోచిస్తున్న గోరేమియా చూపులు, గూడెంల సగం కూలిన గుడిసెల మొండిగోడల మీదవడ్డయి.

'నిజమో.. అబద్ధమో గని.. కూలిన రాజుల కోట గోడలకు వీరగాథల చరిత్రలున్నట్లే.. దళిత వాడల్లో కూలిన గుడిసెల మొండిగోడలకు విషాద కథలుంటయ్యేమో!' అనుకున్నడు గోరేమియా.

సుమారు నలభై ఏండ్ల కిందట గూడెపోల్లకు జరిగిన అన్యాయం యాదికొచ్చింది.

***

గోరేమియాకు మట్టిగానితో దోస్తి కుదిరిన కొత్తలో, వానితో ఆడుకోనీకి మాదిగ్గూడేనికి వచ్చేటోడు. ఆ రోజుల్లనే గూడేనికి ఎక్కడినుంచో ఓ సాధు సన్నాసి వచ్చిండు. పాపం ఒంటరోడు కదా అనుకొని గూడెపోళ్లు చేరదీసింరు. గా సాధు సన్నాసి కూడా.. తనకు తెల్సిన చిట్కా వైద్యంతో గూడెపోల్లకు సేవలు చేస్తూ, వాళ్లకు దగ్గరయిండు. అట్లా కొన్నాళ్లు గడ్సినంక, ఆ సాధు సన్నాసి ఎవల్లకు చెప్పా పెట్టకుండా ఓ అర్ధరాత్రి గూడెం వదిలి మాయమైండు. అతనెవరో? ఏడికెల్లి వచ్చిండో? ఏడికి వోయిండో? ఎవల్లకు తెల్వదు. అతను గూడెంలో ఉన్నన్నాళ్లు గూడెపోళ్లు గుండెల్ల వెట్కొని సూస్కున్నరు. గదే గూడెపోల్లకు పెద్ద శాపమై కూకుంది.

గూడెపోళ్లు సాధు సన్నాసిని పిలిపించుకొని.. ఆయన దగ్గర 'చేతబడి' నేర్చుకున్నరని ఊర్లే ఎవరో పుకారు లేవదీసింరు. అది ఊరంతా పాకింది. అప్పటికెల్లి.. ఊర్లే ఎవల్లకు సర్ది, జొరం వచ్చినా, బర్రె పాలియ్యకవొయినా, ఆఖరికి కోడిపిల్లను కాకెత్తుకవొయినా.. గూడెపోల్ల చేతబడే కారణమని ఊరోల్లు గుంపులుగా గూడెమ్మీదవడెటోళ్లు. ఆళ్లను బండ బూతులు తిట్టుకుంట.. ముసలోల్లు, ఆడోల్లు, పిల్లలని సూడకుండా, ఒకల్ల మీద ఒకల్లనేసి చావ బాదేటోళ్లు. ఇయ్యాల గాకున్నా, మరి కొన్నాళ్లకైనా తమకే పాపం తెల్వదనే నిజాన్ని ఊరోళ్లు తెల్సుకోకవోతరా.. అనుకొని బాధల్ని భరిస్తూ కాలం గడుపుతుంరు గూడెపోళ్లు.

గా బాధలట్టుండంగనే.. ఓ అమాస అర్ధరాత్రి పండు ముసలి, గూడేనికి పెద్ద దిక్కయిన కాశయ్య తాత సచ్చిండు. అసలు.. గూడెంలో చేతబడి నేర్చుకోనీకి కారణమే కాశయ్య తాత అని, గా ముసలోని శవాన్ని ఊరి పొలిమేర్ల గూడ బొందవెట్టడానికి వీల్లేదని ఊరోళ్లు పట్టువట్టింరు. గూడెపోళ్లు ఓ అర్ధరాత్రి కాశయ్య తాత శవాన్ని తీస్కవొయి, ఊరికి రెండు మైళ్ల దూరంలో, ఎవ్వరూ ఎర్కవట్టని కాడ పారేసొచ్చింరు.

గూడెపోళ్లమీద ఊరోళ్లు వెడ్తున్న అనుమానపు హింసకు అంతులేకుండా వోయింది. గా నరకాన్ని

భరించలేక, తమ బతుకులకు భరోసా ఉన్న ఊర్లకు వలసెల్లిపొయింరు. వాళ్లల్లో కొందరికి మాన్యం భూములున్నప్పటికీ, ఆటిని ఏకాడికంటే ఆకాడికి బైనామాలు రాసిచ్చి ఎల్లిపొయింరు. మట్టిగానోల్ల గుడిసె ఒక్కటే గూడెంల మిగిలింది.

***

మట్టిగాని అయ్య.. కాటయ్య. ఊర్లే గ్రామ పంచాయతీ చాటింపులకు డప్పు కొట్టేటోడు. ఇంకా ఊర్లే శుభకార్యాలకు, పండుగలకు, చావులకు కూడా డప్పు వాయించేటోడు. అస్వంటోడొకడు ఊరికి అవుసరం కాబట్కి, కాటయ్యను ఊరొదిలి పోకుండా ఆపుకున్నరు ఊరోళ్లు. మట్టిగాని అమ్మ ఊర్లే యవసాయ కూలీ పనులల్లకు వోయేది.

అట్టా కాలం నెట్టుకొస్తున్న వాళ్లకు.. గుంటూరులో ఉన్న దూరపు సుట్టాల నుంచి కబురొచ్చింది. అక్కడ మిర్చి తోటలల్ల, మిర్చి ఏర మనుషులు అవుసరముందని, ఒక నెల కష్టవడ్తే నాలుగు పైసలు ఎనకేసుకోవచ్చుని. పదిహేనేండ్లు నిండిన మట్టిగాడు డప్పు వాయించడం బాగనే నేర్సుకున్నడు. వానికి మంచిశెబ్బర చెప్పి, వాడిని ఊర్లే ఇంటికాన్నే ఇడ్సివెట్టి.. మొగుడు పెండ్లాలిద్దరు మిర్చి ఏరనీకి గుంటూరు వొయింరు. వాళ్లు గుంటూరు వోయిన పది దినాలు గడ్సినంక.. వాళ్ల ఆరోగ్యం చెడిందని, వాంతులు, విరేచనాలతో గవర్నమెంటు దవాకానల చేరినట్లు ఫోనొచ్చింది. గుంటూరు బోవటానికి డబ్బుల్లేక మట్టిగాడు ఏడ్సుకుంట కూకుంటే.. ఊరోళ్లు తలా కాసిన్ని డబ్బులు జమ జేసిచ్చి, వాన్ని గుంటూరు తోలింరు.

వాడు గుంటూరు చేరుకొని దవాకానకు ఎల్లేటప్పటికే.. వాడి అయ్యా అమ్మ ఇద్దరూ సచ్చిపొయింరని శవాల గదికి తీస్కపొయి సూపిచ్చింరు దవాఖాన సిబ్బంది. పానం లేకుండా ఉత్త కట్టెపుల్లల్లెక్క పడి ఉన్న అమ్మను, అయ్యను సూసి తట్టుకోలేక మీదవడి బోరున ఏడుస్తూంటే.. వాడిని సంజాయించి దవాఖానల ఏడ్వకూడదని, శవాలు చెడిపోకముందే ఊరికి తీస్కపొమ్మని కూడా చెప్పింరు. వానితాన డబ్బుల్లేవు. ఒకేల ఊర్లెకు తెచ్చినా.. ఊర్లే సుట్టపోళ్లు లేరు. తమ కులపోళ్లు లేరు. యాడ బొందవెట్టాల్నో ఎర్కలేదు. ఈ యవ్వారమంతా ఎట్టయితదో అర్థంకాక, ఏడ్సి ఏడ్సి ఆఖర్కి శవాలను దవాకానల్నే ఇడ్సివెట్టి.. అక్కడ ఎవల్లకు చెప్పకుండ ఏడ్సుకుంటా ఊరికి తిరిగొచ్చిండు.

ఇది జరిగి గూడా శానేండ్లు గడ్సివోయింది. ఇప్పుడు ఊర్లే అసలు మాదిగ కులపోల్లే లేరు. వాళ్లు సచ్చిందీ లేదు.. బొందవెట్టిందీ లేదు. అంతకుముందు ఏం జరిగిందో ఎవల్లకు తెల్వదు.

***

'ఇప్పుడు మట్టిగాని శవం ఎట్టా లేవాలె?'..

ఎంత ఆలోచించినా గోరేమియా బుర్రకు అర్థమైతలేదు. ఊర్లే పెద్ద మనుషుల్ని అడిగితేనే ఓదారి దొరుకుద్దనుకొని.. సర్పంచుకు, మాజీ సర్పంచుకు, ఎంపీటీసీలకు, ఇంకొందరు పెద్దమనుషులకు ఫోన్జేసి చెప్పిండు. వాళ్లు గూడ బాధవడి..

'గ్రామపంచాయితీ దగ్గరికి రా.. మాట్లాడ్దాం' అన్నరు.

కాళ్లల్ల తిర్గుతున్న కుక్కపిల్లను గుడిసె లోపట్కి తోలి.. బయటంగ బేడంవెట్టి, గ్రామపంచాయితీ కాడికొచ్చి కూకుండు గోరేమియా. వాన ముసురు తగ్గినట్టే తగ్గి మల్ల సన్న జల్లుగా ముసురుకుంటంది.

కొద్దిసేపయినంక సర్పంచ్ గొల్ల కిట్టన్న, మాజీ సర్పంచ్ ఎల్లారెడ్డి పటేల్, వార్డు మెంబరు సూరమ్మ, వాళ్ల ఎన్కంగనే ఎంపీటీసీ దూకుడు దుర్గయ్య, ఇంకొంతమంది పెద్ద మనుషులు వచ్చింరు. మాజీ సర్పంచ్ ఎల్లారెడ్డి పటేల్ అందరి వైపు ఓపాలి సూసి..

'మనం ఇప్పుడు ఇక్కడ కూడిన సంగతి అందరికీ ఎర్కయిందే. ఇయ్యాల మన డప్పు మట్టిగాడు సచ్చిపోయి.. మనూల్లె డప్పు కొట్టేటోడు లేకుండ జేసిండు. వాని సావు మనందరికీ శానా బాధాకరం. వాడి కాలం తీరింది.. వాడు వోయిండు. ఇప్పుడు జరగాల్సింది మన చేతులల్ల ఉంది. వాడు సొంతోడంటూ ఎవ్వరూ లేని ఒంటరోడు. ఏంజేద్దాం? ఎట్టా జేద్దామంటరు?' అని చెప్పి, అక్కడున్నోల్లందరి వైపు సూసిండు.

వాల్లెవరూ పెదాలిప్పలే.

'ఎవల్లేం మాట్లాడ్తలేరు గదా!' అనుకొని..

'ఇంగ నువ్వే చెప్పు గోరేమియా.. ఏం చేద్దమంటవ్?' అనడిగిండు ఎల్లారెడ్డి పటేల్.

'పెద్దోళ్లు.. అన్నీ ఎర్కయినోల్లు. మీరందరున్నంక నేను చెప్పేది ఏముంటది పటేల్ సాబ్! మట్టిగాడు మనూర్లనే పుట్టిండు. ఊరిని నమ్ముకొనే బతికిండు. ఈడనే సచ్చిండు. వాని శవాన్ని పాతివెట్టనీకీ, మన హిందువుల బొందల గడ్డల్నే జరంత సోటు సూపిస్తే వాన్నక్కడే బొందవెడ్దాం. గీ సంగతే చెబ్దామనీ.. మిమ్ములను కూడేసిన' అన్నడు గోరేమియా.

ఆడ కూకున్నోల్లందరూ ఒకళ్ల మొకాల్లొకరు సూస్కున్నరు.

'నీ దగ్గర దాచేదేముంది గోరేమియా! జరిగిన సంగతి పొద్దుగాల్నే ఊర్లె అందరి చెవులల్ల ఏసిన. వాల్లేమన్నరంటే.. 'ఎన్కటి కాలంకెల్లి గూడ.. మాదిగల శవాలను హిందువుల బొందలగడ్డల బొంద వెట్టిన దాఖలాల్లేవు. ఇప్పుడు గూడ అదే పద్ధతిల నడ్సుకుంటెనే మంచిగుంటది' అని అంటుంరు. ఏంజేద్దామంటవ్?' అన్నడు ఎల్లారెడ్డి పటేల్.

'అదేంది పటేలా అట్లంటరు? వాడు ఊర్లె శుభకార్యాలకు, ఊరుమ్మడి పండుగలకు, చావులకు, జాతర్లకు డప్పు కొట్టుకుంటనే బతికిండు. వాడు మాదిగ కులపోడనే గని.. హిందువే కదా! జాతర్ల దేవుని ఊరేగింపులో వాడు డప్పుకొడ్తే దేవునికి లేని అంటు.. బొందలగడ్డల మట్టికుంటదా! నాకెర్కలేక అడుగుతా? మట్టిగాడు మాతో కల్సి తిరిగేటోడెగని, ఏనాడైనా మాతో మసీదుకు వచ్చి నమాజు సద్వెండా, చర్చిలల్లకు వోయి కిరిస్తానల్ల కల్సిండా? వాడు అందరు హిందువుల్లాగనే బతికిండు. వాడు నూరుబాల్ల హిందువే పటేల! అందరూ మంచి మనసుతో జర ఆలోచించురి' అన్నడు గోరేమియా.

అప్పటిదాంక జరుగుతున్న చర్చనంతా ఇంటున్న సర్పంచ్ కిట్టన్న.. మాటల్ని పక్కతోవ వట్టిస్తూ..

'మన మట్టిగాడు సచ్చి, వాడి ఆత్మ ఏడుందోగని.. వానోతిగా డప్పు కట్టేటోడు ఈ సుట్టుపక్కల్నే ఇంకెవ్వరూ లేరంటే నమ్మురి. మా గొల్లోల్ల ఈర్ల పండగనాడు, పిల్లలకు పెద్దలకూ ఉషారంతా వాని డప్పు మోతదే. రేపొచ్చే ఈర్ల పండక్కి డప్పు కొట్టేటోన్ని యాడంగ తోల్కరావాల్నో ఏమో?' అన్నడు.

'ఒక ఈర్ల పండక్కే కాదు.. పీర్ల పండక్కి మాత్రం? వాడి డప్పు మోగందే పీర్లు అలావ గుండంల దుంకేటియా? వాడు పులి దెబ్బ కొట్టాలె, మా గోరేమియా కాక పులి చిందేసి దుంకుతూంటే సూడాలే.. రెండు కండ్లు సరివొయ్యేటియా? అస్వంటిది మల్ల సూత్తమా మనం?' అన్నడు దుర్గయ్య.

ఇస్వంటి మీటింగులల్ల మద్దెన వచ్చి మద్దెన దూరే సాలె సాంబయ్య, వచ్చి చర్చల దూరనే దూరిండు.

'మీకెర్కనా? ఇయ్యాల మంగళారం. మట్టిగాడు గీ పొద్దున్నే సచ్చిండు. ఉన్న ఊర్లే మంగళారం పీనుగ లేస్తే, మల్లొచ్చే మంగళారానికల్లా మారు పీనుగ లేస్తదని ఊర్లే జనం భయంతో గజగజ వణికి సస్తుంరు' అన్నడు.

'మరేం జేద్దమంటవ్ సాంబయ్య? సచ్చినోన్ని లేపి రెండు చెంపలు వాయించి.. హౌలేగా! నీకేమైనా బుద్ధి గ్నానం ఉందా? ఇయ్యాల మంగళారమని ఎర్కలేదా? ఓ సెలవు దినం సూస్కోని సరదాగా సావకవొయినవా అన్సెప్దమా? పాపం వాడు ఒంటరోడై తాగితాగీ, యాలకింత తినీతినక పేగులెండి.. కార్జెం చెడి.. వాడి సావు వాడు సచ్చిండు. ఇంకా నయం ఏ కరోనా వచ్చో సచ్చుంటే.. ఈపాటికే ఊరు ఊరంత ఎవరి కొంపల్లో వాళ్లు, ఎప్పుడు సస్తమో తెల్వక బిక్కుబిక్కుమన్కుంట కోరంటైన్ల దినాలు లెక్కవెట్కుంట ఉండాల్సి వచ్చేది నీకెర్కనా?' అన్నడు ఎల్లారెడ్డి పటేల్.

సాలె సాంబయ్య చిన్నబుచ్చుకొని అక్కడంగ జారుకున్నడు.

ఎవల్లేం మాటాడ్తుంరో సూస్కుంట కూకున్న వార్డు మెంబర్ సూరమ్మ మాటందుకుంది.

'డప్పు మట్టయ్య ఎంత మంచోడంటే.. ఎవరైనా పల్కరిస్తేనే పల్కేటోడు. తనకంటే చిన్నోల్లని గూడ 'అక్కా.. అన్నా' అని, పెద్దోల్లను 'పెద్దమ్మా పెద్దయ్య, చిన్నమ్మా.. కాకయ్యా' అని నోరారా పిల్సేటోడు. ఏ చిన్న కార్యమైనా పిల్వంగనే వచ్చి డప్పు కొట్టి వోయేటోడు. పెట్టిందే తిని ఇచ్చినంతే తీస్కవోయేటోడు. తాగేటోడె గని ఎంత తాగినా మాట తూలి మాటాడేటోడు కాదు. పాపం.. చిన్న వయసుల్నే సచ్చిండు. ఎన్కట పెద్దోళ్లు అనేటోళ్లు.. మంచోల్లను దేవుడు జల్ది తీస్కవోతడని!' అంది మట్టిగాని యాదిల బాధవడ్తూ.

'అంతేనంటవా సూరమ్మా? అట్టయితే సర్పంచ్ కిట్టన్నకు అరవైయ్యేండ్లుంటయి. నాకేమో ఇంకో ఐదేండ్లు ఎక్కువుంటయి. ఈ లెక్కన మేం వానికంటే పెద్దోల్లం. మేమింకా సావలేదు కాబట్టి.. మేం పాపులం, దుష్టులం, దుర్మార్గులం అన్నట్లేనా సూరమ్మా?' అనడిగిండు ఎల్లారెడ్డి పటేల్ ఆమెను ఉడికించడానికి.

సూరమ్మ ఖంగుతిని..

'వాల్లో.. గిదేం పాపమల్ల? నేనొకటంటే ఇంకో అర్థం తీస్తరేందుల్లా! ఇదెక్కడి కతల్లా! సచ్చినోని గురించి మంచి మాటాడ్తే తప్పు వడ్తరేందుల్లా! వామ్మో ఇదెక్కడి సిత్రమల్లా! ఇంగ నే వోతున్నగని మీరే గోరేమియా అన్నకు ఏదో ఒకటి చెప్పి పంపుర్రి. ఇంటి కాడ బిడ్డా, అల్లుడు వచ్చి ఉన్నరు. నేవోతున్న!' అనుకుంట లేసి ఎల్లివోయింది సూరమ్మ.

'ఇంక నువ్వు చెప్పు దుర్గయ్యా.. ఏం జేద్దమంటవ్?' అడిగిండు ఎల్లారెడ్డి పటేల్.

'నేను రెండు మార్గాలు చెప్త పటేల. ఒకటి మాదిగ్గూడెంల ఎవ్వరూ కాపురముంటలేరు కాబట్టి, మట్టిగాని శవాన్ని వాని గుడిసెల్నే పెట్టి దహనం జేస్తే సరిపోద్ది. లేకపోతే.. రెండో తరీక ఏందంటే, వాని గుడిసెల్నే బొంద తవ్వి పూడ్సిపెడ్తే కిస్స ఖతమైతది. నాకు తోచింది నేను చెప్పిన. పెద్దోళ్లు మంచీ చెడూ ఆలోచించడం మీ వంతు' అన్నడు ఎంపీటీసీ దుర్గయ్యా.

'నీమాట కాదంటున్నందుకు ఏమనుకోకు దుర్గయ్యా. మట్టిగాన్ని వాని గుడిసెల్నే దహనం చేయడం అనేది మహా పాపం, అపరాధం కూడా. రెండోది.. వాని గుడిసెల్నే పాతి పెట్టడమంటే.. సర్పంచ్ చెప్తెనే బాగుంటది. నూ చెప్పు సర్పంచు. నీ అభిప్రాయం ఏంది?' అనడిగిండు ఎల్లారెడ్డి పటేల్.

'లోతుగా ఆలోచిస్తే వాని గుడిసెల్నే బొందవెట్టుడు ఊరికి మంచిది కాదన్పిస్తుంది. ఎందుకంటే.. మనూరి పిల్లలు మాదిగ్గూడెం పక్క బాటలంగనే హైస్కూలు సదువులకు పక్కూరికి బోవాల. గతంలో మాదిగ్గూడెపోల్లకు చేతబడి వస్తదని ఎవరో పుకారు లేవదీస్తే, గూడెపోల్లను సావగొట్టి తరిమేసిన చరిత్ర మనూరోల్లకుంది. ఇంగ ఇప్పుడు మట్టిగాని శవాన్ని వాని గుడిసెల్నె బొందవెడ్తే.. వాడు దెయ్యమై తిరుగుతుండని ఎవరైన పుకారు లేవదీస్తే.. ఆ బాటంగా పిలగాళ్లు బడికి వోతరా? ఆల్ల సద్వులు చెక్క బండలైతయి. అట్టా వద్దుగని, నేనో మాట చెప్త ఇను గోరేమియా!'.. అని గోరేమియా వైపు సూసిండు సర్పంచ్ కిట్టన్న.

'ఇంటనే ఉన్నగని చెప్పే!' అన్నడు గోరేమియా.

'మన పక్కూరు సకినాలపల్లిలో మాదిగ కులపోళ్లు శానామంది ఉన్నరు. ఎట్టనో ఓగట్టా.. మట్టిగాని శవాన్ని గా ఊరికి తీస్కపోర్రి. అక్కడున్నోళ్లతో మాట్లాడి ఈసారికి పని కానియ్యురి!' అన్నడు సర్పంచ్ కిట్టన్న.

'అబ్బో.. మా గొప్పగ చెప్తివి కిట్టన్న. మక్కెలిరగ దన్నించుకునే సలహా మంచిగనే ఇస్తవ్ గద! ఒక ఊరి శవాన్ని, ఇంకో ఊరి పొలిమేర దాటి వచ్చి బొందవెడ్తే.. ఆ ఊరి జనం ఊకుంటరనుకుంటున్నవా? బడ్తెలు వట్టుకొని ఉరికించి కొడ్తరు ఎర్కేనా?' అన్నడు ఎల్లారెడ్డి పటేల్.

'ఓరెక్క అట్టనా? గా సంగతి నాకెర్కలే పటేల. ఇంగ ఏదో ఒకటి గోరేమియాకు మీరే చెప్పి పంపుర్రి!' అనిజెప్పి.. జేబులంగ సెల్‌ఫోన్ తీసి, ఎవరికో కలిపి మాట్లాడుకుంటా అక్కడంగ ఎల్లిపోయిండు సర్పంచ్ కిట్టన్న.

తన సలహాను పట్టించుకోలేదని, ముఖం మాడ్చుకొని అంతకు ముందుగాల్నే ఎల్లివోయిండు ఎంపీటీసీ దుర్గయ్యా.

'సూస్తున్నవ్ గదా గోరేమియా! మనూరోళ్ల తమాషాలు. సరే పగటేలప్పుడు ఇంకోసారి అందర్నీ అడిగి సూద్దాం.. ఏమంటరో? వాల్లేమన్నది నీకు ఫోన్ జేసి చెప్త సరేనా! నూ గూడ ఇంటికి వోయి కాసింత తిను పో!' అని చెప్పి, ఎల్లారెడ్డి పటేల్ గూడ ఎల్లివోయిండు.

అక్కడ గోరేమియా ఒక్కడే మిగిలిండు. సమస్య మొదటికొచ్చింది. అయినా ఎల్లారెడ్డి పటేల్, ఊరోల్లని ఇంకోపాలి అడిగి ఫోన్ చేస్తనన్నడనే ఆశ. 'ఏమో చెప్పలేం.. పెద్ద మనుషులందరు ఒప్పుకొని, తలా ఓ చెయ్యేసి వాని అంతిమ సంస్కారం చేస్తరేమో!' అనుకున్నడు గోరేమియా. మల్ల మట్టిగాడు యాదికొచ్చిండు. ఎప్పుడో తెల్లారగట్ట పానమొదిలిన మట్టిగాని శవాన్ని తానం చేపించడం ఆలిస్యమయి కుళ్లిపోతే? అట్లా కాకూడదు. ముందుగాల్నే వాడికి తానం చేపించాలే అనుకొని.. ఆడి నుంచి లేసి గూడెం బాటవట్టిండు గోరేమియా.

***

ఊరికి – గూడేనికి మద్దిన బాటకానుకొని చింత తోపుంటది. గోరేమియా గా చింత తోపు కాడికి రాంగనే కాళ్లు ఆగినయి. అక్కడున్న గూని చింతచెట్టు మీదికి చూపులు వోయినయి. గా చింతచెట్టే మట్టిగాన్ని తనను దోస్తులను చేసింది అనుకున్నడు.

అప్పుడు గోరేమియాకు పన్నెండేండ్లుంటయి. ఊరి పిలగాల్లతో కల్సి చిగురు కోయనీకి గూని చింత చెట్టెక్కిండు గోరేమియా. గూని చెట్టని పేరేగని, బాగా ఎత్తుగుంటది. గోరేమియా చిగురు తెంపే ధ్యాసలో, చిటారు కొమ్మలకు వోయిండు. అది జరంత తెగి పెడుసుబారి ఉంది. సూస్కోకుండా దాని మీద కాలువెట్టిండు. అంతే.. అది పుటుక్కుమని ఇరిగింది. పదిహేను అడుగుల ఎత్తునుంచి దబ్బుమని పడిపోయి, సోయి తప్పిండు గోరేమియా. అది సూసి ఆడున్న పిల్లలందరూ భయంతో ఇండ్లకు పారిపోయింరు.

అప్పుడే బాటెమ్మటి వోతున్న మట్టిగానికి, చెట్టుకింద సోయి తప్పి పడున్న గోరేమియా అగుపడ్డడు. వానికేదో అనుమానమొచ్చి దగ్గరికివోయి సూసిండు. ఎంటనే గోరేమియాను ఉప్పుబస్త లెక్క ఈపునేసుకొని వాల్లింటికి తీస్కవోయిండు. ఇంట్లే వాళ్ల నాయిన లేడు. వాళ్లమ్మ ఒక్కతే ఉంది. సోయి తప్పిన కొడుకును సూసి వాళ్లమ్మ ఏడ్వబట్టింది. ఆమె ఏడ్పు ఇని సుట్టుపక్కలున్నోళ్లు వచ్చింరు. అప్పటికే గోరేమియా కుడికాలు మోకాలి కింద జరంత వాపు వచ్చింది. వాళ్లల్లెవరో పసరు కట్టుకట్టే డాక్టర్ ఆచారి గారిని పిల్సుక రమ్మంటే.. మట్టిగాడే ఉరికివోయి ఆచారి గారిని పిల్సుకొచ్చిండు. ఆయన గోరేమియాను అటూఇటూ తిప్పి సూసి, ప్రమాదకరమైన దెబ్బలేమి తగల్లేదని, కుడికాలి మోకాలికింది బొక్క జరంత చిట్లిందని చెప్పి.. పసరుకట్టు కట్టి ఎల్లివోయిండు. గోరేమియా సక్కంగ నడ్వనీకి నాలుగు నెలలువట్టింది. అప్పటి నుంచే ఇద్దరికీ మంచి దోస్తీ కుదిరింది.

గోరేమియా దోస్తీ, వాళ్లమ్మ సూపించిన ప్రేమతోని.. అమ్మ, అయ్య సచ్చిపోయిన బాధను గూడ మర్సివోయిండు మట్టయ్య.

గోరేమియాకు పాతికేండ్లప్పుడు, వాళ్ల చుట్టాలమ్మాయితో పెండ్లయ్యింది. మట్టిగాడు,

గోరేమియా కంటే మూడేళ్లు పెద్దోడు. అయినా లగ్గం జేస్కోలే. ఊర్లే పెద్ద మనుషులెవరైనా.. 'పెండ్లెప్పుడు జేస్కుంటవురా మట్టయ్యా?' అనడిగితే.. వేదాంతిలా నవ్వి ఊర్కునేటోడు.

గోరేమియాకు పెండ్లయిన రెండేండ్లకు ఆడపిల్ల పుట్టింది. ఆ పిల్ల తప్పటడుగులు ఏసేటప్పుడు ఏదో.. ఎర్కపట్టని జబ్బుతో గోరేమియా అమ్మా, నాయినలిద్దరూ ఏడాది తేడాతో సచ్చివోయింరు. అప్పటిదాంక 'అమ్మా' అంటూ చనువుగా అన్నం పెట్టించుకొని తిన్న మట్టిగాడు.. ఆమె సచ్చినంక అంత చనువుగా ఆ ఇంటికి వోయేటోడు కాదు.

గోరేమియా బిడ్డకు పద్దెనిమిదేండ్లు నిండంగనే పెండ్లి చేసి అత్తారింటికి పంపిండు.

ఇంటికొచ్చి తినిపోవడానికి మొఖమాటవడ్తున్న మట్టిగానితో.. 'ఎప్పటితీర్గనే ఇంటికొచ్చి తినిపో మట్టన్న!' అని గోరేమియా భార్యా భర్తలిద్దరు ఎన్నిసార్లు చెప్పినా.. 'వస్తతీ!' అనేటోడుగని పోక పోయేటోడు. ఊర్లే ఎవరు మందు తాపిస్తే వాళ్లతో మందు తాగి, యాళ్లకు తినీ తినక అట్లనే పడుకునేటోడు. అట్లా వాడి ఒంటరితనానికి మందు నిషాను తోడుజేస్కొని బతికిండు.

***

అట్లా ఆలోచించుకుంటనే మట్టిగాని గుడిసె కాడికొచ్చిండు గోరేమియా. తలుపు బేడెం తీసి లోపలికి వోయిండు. మట్టిగాని కుక్కపిల్ల గోరేమియాను సూడంగనే 'కూంయ్ కూంయ్' అన్కుంట కాళ్లల్లకొచ్చింది. దాని ఈపు నిమిరి గుడిసె మూలన కూకోవెట్టిండు.

అది బుద్దిగ కూకుంది. కట్టెలపొయి రాజేసి నీల్ల బిందె వెట్టిండు. నీళ్లు మంచిగ కాగినంక నులక మంచంమ్మీదున్న మట్టిగాని కాయాన్ని అట్లనే మంచం మీదుంచి, తానం జేపించిండు.

మట్టిగాడు కోమాలకు వోయినప్పుడు.. వాడు బతకడం కష్టమని డాక్టర్ చెప్పింది యాదుంచుకొని, వానికి తెల్వకుండనే వాని శవ సంస్కారానికి కావల్సినయి అన్ని తెచ్చివెట్టిండు గోరేమియా. అందులంగనే కొత్త పాడిగుడ్డ తీసి సుబ్బరంగ తుడిసి, కొత్త బట్టసుట్టి కింద సాప మీద పడుకోవెట్టిండు. నుదుట పెద్ద కుంకుమ బొట్టు దిద్దిండు. రోజ్ వాటర్ సల్లిండు. కొత్తగ తెచ్చిన పూలదండ మెడలేసిండు. పెండ్లిగాని మట్టిగాన్ని పెండ్లికొడుకులా తయారుజేసిండు. గుడిసె సూరులంగా, సర్వేబార్లు గడెబొంగులు గుంజి పాడె తయారుజేసిండు. లేసి నిలబడి ఊపిరి పీల్చుకున్నడు గోరేమియా.

తిరిగి పాత ప్రశ్నలే పీకుతున్నయి దిమాక్ల. 'పాడె మోస్కపోయేదెవలు? పాతివెట్టేదెక్కడ?'..

మల్లొక్కపాలి ఊరోళ్లను అడిగి సూద్దమన్న ఎల్లారెడ్డి పటేల్‌కు ఫోన్ కలిపిండు. 'స్విచ్ఛాఫ్' వచ్చింది. ఇంకొందరికి కలిపి సూసిండు. రింగ్ అయితుంది గని ఫోన్ ఎత్తి మాట్లాడ్తలేరు. అర్థమైంది గోరేమియాకు. 'గిదేం ఊరు? ఈల్లేం మనుషులు?' అనుకున్నడు. ఏం తోస్తలేదు. గుడిసెలంగ బయటికొచ్చిండు. వాన తుంపర తగ్గిందిగని సలివెడ్తాంది.. లోపటంగా ఉక్కవోసి వల్లు చిటపటలాడ్తుంది. టైం రెండు గావస్తుంది. 'ఇంటికివోయి తానం జెయ్యాల.. ముందుగాల!' అనుకున్నడు. గుడిసె బయటంగ బేడం వెట్టి ఇంటికొచ్చిండు గోరేమియా.

నీరసంగ కూకున్న భర్తను సూసి..

'ఊర్లే పెద్ద మనుషుల్ని అడిగి సూస్తనంటివి గదా.. అడిగినవా? ఏమన్నరు?' అన్నది గోరేమియా భార్య ఖతీజ.

'హిందువుల బొందలగడ్డల మాదిగోల్ల శవాలను బొందవెట్టే ఆచారం లేదంట. ఊరోల్లెవరూ ఒప్పుకుంటలేరు..' అన్నడు గోరేమియా.

భర్త మాటలల్ల బాధను కనిపెట్టింది ఖతీజ.

'బాధపడకు. నీ గుబులు అర్థమైతుందిగని.. అక్కడ బొందవెట్టనీకుంటే, ఇంత పెద్ద ఊర్లే.. మట్టన్న శవాన్ని బొందవెట్టనీకి సోటే దొర్కదా ఏంది?' అన్నది.

'ఖాళీ సోటు యాడుంది? ఊరి సుట్టూ రైతుల పట్టా భూములు, పంట పొలాలేనాయే! ఎవరి భూమిల బొందవెడ్తే ఎవరూకుంటరు చెప్పు?' అన్నడు గోరేమియా ముఖం యాలాడేసి.

'ఎవల్ల భూమిల ఎందుకు పాతివెట్టాలే! వాల్లందరికున్నట్లే.. మనక్కూడ రెండెకరాల చెలక భూమి ఉంది కదా! మన చెలకల్నే బొందవెట్టు. మట్టన్న దెయ్యమై మనల్ని పీక్కు తింటడా? తింటే తిన్నీ. అందరం ఏదో ఒకరోజు పోయేటోల్లమే కదా!' అన్నది ఖతీజ.

భార్య సలహాతో గోరేమియాకు ధైర్యమొచ్చింది. మల్లంతల్నే ముఖం పాలివోయింది.

భర్త ముఖంల వచ్చిన మార్పుల్ని గమనించిన ఖతీజ..

'మల్లేమైంది.. అట్లా దిగాలు వడ్తివి?' అనడిగింది.

'నూ చెప్పింది బాగనే ఉందిగని.. మన చెలక ఊరికి కిలోమీటర్ దూరంల ఉంటది. అంత దూరం పాడెను తీస్కబోవుడెట్లా?' అన్నడు.

'ఎవల్లనన్నా అడిగి సూడు. వత్తరేమో!'.

'అడిగి సూసిన. మందు వోయిస్త, డబ్బులిస్తనన్న.. ఏమన్నరో ఎర్కనా! 'మాదిగోని శవాన్ని మోయ.. మంచి ముత్యాలిచ్చినా ఎవల్లు రారు' అన్నరు. నాకు చాలా బాధేసింది ఖతీజ. ఈల్లేం మనుషులో? ఈల్లయి ఏం నమ్మకాలో? పట్టణాలు, నగరాలే కాస్త నయం ఇస్వంటి ఇషయాల్ల.. ఏ పట్టింపులుండవు. పల్లెటూర్లల్నే గీ అర్థం పర్థం లేని పట్టింపులు' అన్నడు గోరేమియా.

'పోనీతీ.. ఎవళ్లు రాట్లేరని మట్టన్న శవాన్ని అట్లనే వెట్కోని కూకుంటమా ఏంది?'.

ఖతీజ దగ్గర ఏదో మార్గం లేకవోతె అట్ల మాట్లాడదనుకొని..

'నేనేం జెయ్యాల్నో తోస్తలేదు ఖతీజ' అన్నడు దిగాలుగా ఆమె వైపే చూస్తూ.

మట్టయ్య పాడెను తమ చెల్కదాంక ఎట్ల తీస్కబోవాలో ఇవరంగ చెప్పింది ఖతీజ.

భార్య చెప్పింది ఇన్నంక.. రాత్రికెల్లి మోస్తున్న బరువేదో దిగివోయినట్లయింది. కొత్త హుషారొచ్చింది గోరేమియాకు. భార్య ఖతీజకు చాయ్ వోయమని చెప్పి, పలుగు, పార టెంకె సర్దుకున్నడు. ఇంతల్నే భార్య చాయ్ తెచ్చిస్తే తాగిండు. గోరేమియాకు టీవీఎస్ బండి ఉంది గని, పెట్రోలు ధరలు పెరిగినంక మండికివోయి కూరగాయలు తేనీకి మాత్రమే వాడుతుండే. ఇప్పుడు.. బొంద తవ్వనీకి సర్దుకున్న పనిముట్లను మోపెడ్ పైన వెట్టుకొని చెల్క కాడికి వోయిండు.

వాన ముసురుకు నేల తడిసి నాని ఉంటాన.. బొంద తవ్వుడు రెండు గంటలల్ల అయిపుచ్చుకొని ఇంటికొచ్చిండు గోరేమియా.

ఖతీజ వేడి నీళ్లు తోడి వెడ్తే తానం జేసిండు. పాత ట్రంకు పెట్టలంగ తన పెండ్లికి కుట్టించుకున్న బులుగు రంగు షేర్వానీ పైజామా తీసి తొడుక్కున్నడు. ఎర్రటి పున్నా టోపీ పెట్టుకున్నడు. దుమ్ము పట్టిన బూట్లను దులిపి తొడుక్కుని నవాబు లెక్క తయారైండు.

అప్పటికే తాము కూరగాయలమ్మే నాలుగ్గీరల బండిని సుబ్బరంగ కడిగి, పూలదండలు కట్టి సింగారించి వెట్టింది ఖతీజ.

పది బార్ల ప్లాస్టిక్ తాడు, క్యాన్ల నీళ్లు నింపి బండి మీద వెట్టి గోరేమియాతో బండి తీస్కవొమ్మని చెప్పింది.

గోరేమియా బండి నెట్టుకుంటా మట్టిగాని గుడిసెకాడికొచ్చి బేడం దీసిండు. ముందుగాల్నే తయారుజేసి పెట్టిన పాడెను పట్టుకొచ్చి నాలుగ్గీరల బండి మీదవెట్టిండు. నౌశి అలకంగా ఉన్న మట్టిగాని కాయాన్ని ఎత్తుకొచ్చి పాడెమీద పడుకోవెట్టిడు. ఎత్తుపల్లాల్లో పాడె పడిపోకుండా తాళ్లతో కట్టిండు. గుడిసె లోపటంగ జమ్ము పీకి మంటవెట్టిండు. మట్టిగాని డప్పు పట్కొచ్చి.. బాగ 'ఖణ్ ఖణ్' అని మోగేటట్టు కాపిండు. చిడతలు దీస్కున్నడు. కుక్కపిల్లను బయటికి తోలి గుడిసె బయటంగ బేడం వెట్టిండు. భార్య ఖతీజ ఇచ్చిన ప్లాస్టిక్ తాడును ఒక కొసను బండికి కట్టి, మరో కొసను తన నడుముకు కట్టుకున్నడు. ఎనకంగ కుక్కపిల్ల నడుస్తుంటే, మట్టిగాని దోస్తీల నేర్చుకున్న.. 'ఉల్టాబాజా' వాయించుకుంట నడి ఊర్లంగ మట్టిగాని శవయాత్ర దీసిండు. గోరేమియా వాళ్ల చెలకకు బోవాలంటే ఊర్లంగనే బోవాలె. ఏరే బాట లేదు.

షేర్వానీ పైజామా, నెత్తిన ఎర్రని పున్నావాలా రూమీ టోపి, కాళ్లకు మహారాజా బూట్లేసుకొని.. మట్టిగాని శవమున్న నాలుగ్గీరల బండిని నడుముకు కట్టుకొని ఊరేగింపుగా తీస్కవోతున్న గోరేమియాను సిత్రంగ సూస్తుంరు ఊర్లే జనం. కొందరు భయపడి లోపటంగ తలుపులేస్కొని తలుపు సందులల్లంగ సూడవట్టింరు. ఆల్లను గమనిస్తూనే అట్టా ఊరి బయటిదాంక వచ్చి, నడుముకు బండికి కట్టిన తాడు ఇప్పి, బండిని నెట్టుకుంటా తమ చెలక కాడికొచ్చిండు.

బట్టలిప్పి లుంగీ కట్టుకున్నడు. బొందను తవ్వేటప్పుడే వెడల్పుగా మెట్లుగా చెక్కిండు. పాడెకు బండికి కట్టిన తాళ్లు ఇప్పి, మట్టిగాని కాయాన్ని చేతులల్ల అడ్డంగా ఎత్తుకొని మెల్లిగ బొందలోనికి దింపిండు. ఆఖరిసారిగా దోస్తు ముఖం సూసిండు. గోరేమియా కండ్లల్ల రెండు కన్నీటి బొట్లు మట్టిగాని ముఖం మీదవడ్డయి. ఇంకా పొంగి వస్తున్న దుఃఖాన్ని ఆపుకొంటా.. మట్టిగాని ముఖం మీద బట్ట కప్పి కట్టేసిండు. వాడు బతికినన్నాల్లు ఆధారం చేసుకొని బతికిన డప్పును, చిడతల్ని వాని తల పక్కనేవెట్టి, ముందుగాల దోశిల్లతోని మట్టిపెడ్డలేసిండు. అటెన్క పారతో మట్టి లాగి బొంద పూడ్సిండు. క్యాన్ల తెచ్చిన నీళ్లతో బొందను అలికిండు.

కాళ్లు, చేతులు, ముఖం కడుక్కొని.. లుంగి ఇప్పి బట్టలేస్కుండు. టోపి వెట్టుకుండు. ఆకాశంకెల్లి రెండు దోశిల్లు సాచి, తల పైకెత్తి..

'యా అల్లాహ్ దయామయుడా! అపార కృపాశీలుడా, నా దోస్తు.. ఏ కులపోడో, ఏ మతపోడో నీకెర్కే! వాడు అందరిలాగే పుట్టిండు. బతికినన్నాల్లు పది మందికోసమే బతికిండు. వాడు నీవు సృష్టించిన ఈ మానవ సమూహంలోని మనిషే! తెలిసీ తెలియక వాడు ఏవైనా తప్పులు చేసి ఉంటే

మాఫ్ జెయి.. సకల లోక రక్షకుడా! చావు పుట్టుకల జన్నత్.. దోజఖ్‌ల నిర్ణయాధికారివి నువ్వు. ప్రేమమయుడా! అనంత దయాశీలుడా.. యా అల్లాహ్! నా దోస్తు ఉత్త అమాయకుడు. వానికి జన్నత్ ప్రాప్తింపజెయ్యి' అని అల్లాహ్‌ను ప్రార్థించుకొని.. రెండు అరిచేతులను ముఖం పైన తిప్పుకున్నడు.

అక్కడినుంచి కదిలి తిరిగి బండి నెట్టుకుంటూ.. భారమైన మనసుతో ఇంటి దారివట్టిండు. పది అడుగులు ఏసినంక ఏదో మరిచినట్లు అనిపించి ఎనక్కి తిరిగి సూసిండు.

మట్టిగాని కుక్కపిల్ల వాని బొందకాన్నే కూకొని.. 'కుంయ్.. కుంయ్..' అంటున్నది. దానినట్లా సూడంగనే గోరేమియా కండ్లు చెమర్చినయి. దాని దగ్గరికి వోయి.. దాన్నెత్తుకొచ్చి బండిమీద కూకోవెట్టుకొని బండి నెట్టుకుంట ఊరి బాట వట్టిండు. కుక్కపిల్ల మట్టిగాని బొంద కనుమరుగయ్యేంతవరకు అటువైపు సూస్తూనే ఉంది. 'ఈ జాతికున్నంత ఇస్వాసంలో ఈసమెత్తయినా మనిషిజాతికుంటే ఎంత బాగుండు!' అనుకుంట ఊళ్లెకొచ్చిండు.

ఊళ్లె ఎదురువడ్డ ప్రతి మనిషి గోరేమియాను సూసి భయంతోనో, సిగ్గుతోనో.. తలలు దించుకొని వోతుంరు. గోరేమియా ఒక్కడే మనిషిలా తలెత్తుకొని తమ ఇంటి వైపు అడుగులేసుకుంటూ...!

***

జన్నత్ – స్వర్గం

దోజఖ్ – నరకం

ఉల్టాబాజా – తిరగల డప్పు, చావు డప్పు.

***

సయ్యద్ గఫార్ స్వస్థలం నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వాడపల్లి. ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. 'పంచాయతీ రాజ్ లీడర్' స్థానిక సంస్థల విశ్లేషణ మాస పత్రికను ఎనిమిదేళ్లు నడిపించారు. స్టేజీ నాటకాల్లో నటన, దర్శకత్వ బాధ్యతలు నిర్వహించారు. 1973 నుంచీ రచనా వ్యాసంగంలో ఉన్నారు. ఈయన రాసిన మొదటి కథ.. 'పాపం పండిన రాత్రి'. 2018లో 'జనన వాంగ్మూలం' కవితా సంపుటిని వెలువరించారు. నమస్తే తెలంగాణ – ముల్కనూరు ప్రజా గ్రంథాలయం నిర్వహించిన కథల పోటీల్లో.. ఖుర్బానీ (2020), నషా (2021), ఉల్టాబాజా (2022) కథలకు ప్రత్యేక బహుమతులు దక్కించుకున్నారు. తెలుగు నాటక కళా పరిషత్తు వైజాగ్ వారు నిర్వహించిన తెలుగు కథా, నాటక పోటీల్లో 'మౌనధ్వని' నాటికకు ప్రత్యేక బహుమతి లభించింది. నవతెలంగాణ పత్రిక నిర్వహించిన బండారు అచ్చమాంబ స్మారక కథలపోటీలో 'హంస' కథకు మొదటి బహుమతి వచ్చింది. ఈ కథను 'హంస' పేరుతో స్వీయ దర్శకత్వంలో లఘుచిత్రంగా నిర్మించారు. 'ఖుర్బానీ' కథల సంపుటి, 'మౌనధ్వని' నాటికను త్వరలోనే పుస్తకం రూపంలో తీసుకురానున్నారు.

# పడగ నీడ (కథ)



**సయ్యద్ సలీం,**
**95886 30243**

ఓ చేతిలో సుత్తి, మరో చేతిలో శానం పట్టుకుని.. గొయ్యిలోకి దిగడానికి తయారుగా నిలబడి ఉన్న పదేళ్ల తన కొడుకు శీను వైపు దిగులుగా చూస్తూ..

'జాగర్త బాబూ!' అన్నది అచ్చమ్మ. వాడు మెత్తగా నవ్వుతూ..

'రోజూ ఇదే మాట.. ఎందుకమ్మా బయపడ్తావు? నేను జాగర్తగానే ఉంటాలే!' అన్నాడు. మొహం మీద పడుతున్న ఎండకు వాడి మొహం మెరుస్తున్న బూడిద రంగు అబ్రకపు పలకలా కనిపించింది.

వాడి పక్కనే నిలబడి ఉన్న పన్నెండేళ్ల ఎంకడి చేతిలో కూడా అవే పనిముట్లు ఉన్నాయి. వాటితోపాటు ప్లాస్టిక్ బుట్ట కూడా ఉంది.

'మా అమ్మ కూడా ఇంతేరా. ఇంటినుంచి బయల్దేరేముందే వంద జాగర్తలు చెప్తుంది తెలుసా!' అన్నాడు.

'పిల్లల మీద తల్లికుండే కడుపు తీపి మీకర్థం కాదులే! ఆ మాయదారి అబ్రకం కోసం నువ్వూ, శీనుగాడు గొయ్యిలోకి దిగిన ఛణం నుంచి బైటికొచ్చేవరకు గుండె దడదడలాడ్తూనే ఉంటుంది తెలుసా?' అన్నది వాడి అమ్మ మంగమ్మ.

'మాకేం కాదులేమ్మా!' అంటూ ఎంకడు గొయ్యిలోకి మెల్లగా దిగి, శీనుకు చేయందించి దింపుకొన్నాడు.

ఇద్దరూ జాగ్రత్తగా లోపలికి దిగసాగారు. గొయ్యిలోకి కిందికి దిగేకొద్దీ చీకటి నీటి ఊటలా ఊరసాగింది.

'లోతుకు తవ్వింది చాలు. ఇక పక్కలనుంచి తవ్వుదాం!' అన్నాడు ఎంకడు.

ఇద్దరూ తమ చేతుల్లో ఉన్న పనిముట్లతో అభ్రకం కలిసిన రాళ్లను పెకిలించి, ప్లాస్టిక్ బుట్టలో వేయసాగారు. బుట్ట నిండగానే..

'నేను పైకెళ్లి వీటిని ఇచ్చొస్తాను' అన్నాడు ఎంకడు. రాళ్లతో నిండి ఉన్న బుట్టను నెత్తిమీద మోసుకుంటూ పైకితెచ్చి వేశాడు. మళ్లీ వెంటనే కలుగులోకి ఎలుక దూరినట్టు.. ఆ బిలంలోకి దూరి మాయమైపోయాడు.

అచ్చమ్మ, మంగమ్మ ఆ రాళ్లలోంచి అభ్రకపు ముక్కల్ని వేరు చేసి తమ పక్కన పెట్టుకున్న ప్లాస్టిక్ బుట్టలో వేయసాగారు.

మధ్యాహ్నం దాటింది. ఎండ తెల్లటి అభ్రకపు పొరలా నేలంతా పరుచుకుని, ఎర్రటి నిప్పులా కాలుస్తున్నది. భూమి తన కుహరంలో దాచుకున్న ఖనిజాల్ని తవ్వి తీసే గని కార్మికుల్లా పనిచేస్తున్న శీను, ఎంకడు అప్పటికే స్వేద నదుల్లా మారిపోయారు.

'ఆకలేస్తంది. బువ్వ తిని కొద్దిసేపు కూసుంటే గానీ పనిచేసే ఓపిక రాదు' అన్నాడు ఎంకడు.

రెండు మట్టి రంగు కుందేళ్లు బొరియలోంచి బైటికొస్తున్నట్టు ఇద్దరూ బైటికొచ్చి చేతులు కడుక్కుని అన్నాల కోసం కూర్చున్నారు. అచ్చమ్మ శీను కంచంలో అన్నం, గోంగూర పచ్చడి వడ్డించాక.. వాడు తింటున్నప్పుడు గోరింటాకు పూసినట్టు ఎర్రగా కందిన వాడి అరచేతుల వైపు చూసి పక్కకు తిరిగి కళ్లొత్తుకుంది. దుఃఖం ఉండలా మారి అడ్డుపడటంతో ఆమెకు ముద్ద గొంతులోకి దిగలేదు.

పిల్లలు తినేసి, మళ్లా గొయ్యి లోపలికి దిగాక అచ్చమ్మను ఊరడిస్తూ..

'ఎన్ని కన్నీళ్లు కార్సినా మన బతుకులు మారవు వదినా. నా మొగుడు సచ్చిపోయే నాటికి ఎంకడికి ఆరేండ్లు. ఇల్లు గడవడం కోసం ఆ పసోణ్ని కూడా పన్లో పెట్టక తప్పలేదు. బొబ్బలెక్కిన వాడి లేత సేతులు సూసి.. ఎన్ని రాత్రుళ్లు ఏడ్సానో నాకే తెలుసు. ఇప్పుడు ఏడుద్దామన్నా కన్నీళ్లు రావడం లేదొదినా. ఎప్పుడో ఇంకిపోయినయి' అన్నది మంగమ్మ.

మంగమ్మ జీవితంలో జరిగిన విషాదాలన్నీ అచ్చమ్మకు తెలుసు. వాళ్లవి పక్క పక్క గుడిసెలే.

'నా బతుకు నీ బతుక్కన్నా మెరుగేం కాదులే మంగమ్మా!' అని మనసులోనే అనుకుంది అచ్చమ్మ. తనూ తన మొగుడు పన్లోకెళ్తున్న రోజుల్లో ఇల్లు గడవడం కష్టమయ్యేది కాదు. ఓ కొడుకు పుట్టిన ఏడాదిన్నరకు కూతురు పుడ్తే ఎంత సంతోషపడ్డారో! పిల్లల్ని అల్లారుముద్దుగా పెంచుకోవాలనీ, బాగా చదివించి ప్రయోజకుల్ని చేయాలనీ ఎన్ని కలలు కన్నారో..

ఓ రోజు రాత్రి గొంతుదాకా తాగున్న ఎదవెవడో బైకును రోడ్డుమీద కాకుండా తన మొగుడి వీపు మీదనుంచి పోనివ్వడంతో అతని వెన్నెముక దెబ్బతిన్నది. అప్పటినుంచి మంచానికే పరిమితమై పోయాడు. నాలుగు పొట్టలు నిండాలంటే.. ఎనిమిదేళ్ల శీనును పనిలో పెట్టక తప్పలేదు.

ఆ రోజు తన మొగుడు వెక్కి వెక్కి ఎలా ఏడ్చాడో తనకింకా గుర్తుంది. శీనును చదువు మానిపించి, నోరు తెరుచుకుని ఉన్న కొండచిలువల్లాంటి అభ్రకపు గోతుల్లోకి పంపడం అతనికి సుతరామూ ఇష్టం లేదు. తనకూ ఇష్టం లేదు. కానీ, తప్పని పరిస్థితి.

'కనీసం మన బిడ్డనైనా సదివిద్దాం' అన్నాడు కండ్లనిండా నీళ్లు నింపుకొని.

'నువ్వు ఏడ్వబాకయ్యా! ఎంత కట్టమైనా పర్లేదు. మన బిడ్డను సదివిద్దాం'.. అతనికి భరోసా ఇస్తూ అన్నది తను.

ఒక మగ మనిషి, ఒక ఆడ మనిషి తమ దిక్కే రావడం చూసి.. ఆలోచనల్లోంచి బైటపడి మంగమ్మ వైపు చూస్తూ..

'ఎవరై ఉంటారు?' అన్నది.

మంగమ్మ కూడా వాళ్లవైపు ఆశ్చర్యంగా చూసింది. వస్తున్నామెకు పాతికేళ్లకు మించి వయసుండదు. బ్లూ జీన్స్ ప్యాంట్‌లో చెక్స్ షర్ట్‌ను టక్ చేసి ఉంది. భుజానికి హ్యాండ్‌బ్యాగ్ వేలాడుతున్నది. ఆమె పక్కన ఉన్న వ్యక్తికి ముప్పై ఏళ్లు ఉంటాయి. బాగా చదువుకున్న వాడిలా ఉన్నాడు.

ఆమె నేరుగా వాళ్ల ముందుకొచ్చి నిలబడి.. స్నేహపూర్వకంగా నవ్వింది.

'నా పేరు ఆద్య. ఇతను మోహన్. ఇద్దరం ఓ ఎన్జీవోలో పనిచేస్తున్నాం. ఇక్కడ కూచోవచ్చా' అంటూనే.. వాళ్లేదో అనేలోపల గొంతుక్కూర్చుంటూ..

'ఈ పని ఎన్నాళ్ల నుంచి చేస్తున్నారు?' అని అడిగింది.

అదే సమయంలో రాళ్లను మోసుకొచ్చిన ఎంకణ్ని చూస్తూ..

'లోపల ఇంకా ఎంతమంది పిల్లలు పనిచేస్తున్నారు?' అని ప్రశ్నించింది.

అచ్చమ్మ చెప్పిన సమాధానం విన్నాక..

'పద్దెనిమిదేళ్లు నిండని పిల్లల చేత పని చేయించడం నేరమని మీకు తెలుసా? ప్రభుత్వ అనుమతి లేకుండా మైకాను తవ్వి తీయడం చట్ట వ్యతిరేకమని తెలుసా? రెండు వేల ఒకటి తర్వాత ఇక్కడి మైకా గనుల లీజులను ప్రభుత్వం రద్దు చేసిన విషయం తెలుసా?' అని అడిగింది.

వాళ్లనుంచి సమాధానం రాకపోవడంతో..

'పిల్లల చేత మీరు చేయిస్తున్న పనివల్ల వాళ్లకెంత ప్రమాదమో ఆలోచించారా? కాళ్లకూ, చేతులకూ గాయాలు కావొచ్చు. చర్మ వ్యాధులు, ఉబ్బసంలాంటి రోగాలు రావొచ్చు. కొన్ని సందర్భాల్లో ప్రాణాలు కూడా పోవచ్చు' అన్నది.

'ఈ పని సేయకపోతే మా కడుపులెలా నిండుతాయమ్మా? అప్పుడు ఆకలితో పేనాలు పోతాయి కదమ్మా!' అన్నది అచ్చమ్మ.

'మీరు రోజుకు ఎంత సంపాదిస్తారు?' అని అడిగాడు మోహన్.

'పది కేజీల వరకు తవ్వి తీస్తే గుడివాడ నుంచి ఓ ఆసామి వచ్చి నాలుగు వందలిచ్చి తీసుకెళ్తాడయ్యా. చెరో రెండొందలు తీసుకుంటాం..' ఈసారి మంగమ్మ సమాధానమిచ్చింది.

'ఎవరా ఆసామి? అతని పేరేంటి? మీరెంత మోసపోతున్నారో తెలుసా? మార్కెట్లో కేజీ అభ్రకం ధర ఎన్ని వేలు పలుకుతుందో తెలుసా?'అన్నాడు మోహన్.

అచ్చమ్మ ఏదో చెప్పబోయే లోపల రెండు స్కూటర్లమీద నలుగురు మనుషులు వచ్చారు. వాళ్లలో మైకా స్క్రాప్ కొనే సుబ్బయ్య కూడా ఉన్నాడు.

వాళ్లు రావడంతోటే..

'మీరీ చుట్టుపక్కల కనిపించారో మర్యాద దక్కదు. వెంటనే వెళ్లిపొండి..' అంటూ ఆద్యనూ, మోహన్‌నూ తరిమేశారు.

అచ్చమ్మ, మంగమ్మల వైపు కోపంగా చూస్తూ..

'ఎవరేం అడిగినా చెప్పేయడమేనా? వాళ్లెవరో.. ఏమిటో.. తెలుసుకోవద్దా? వాళ్లతో మీరేం చెప్పారు? నా పేరు చెప్పారా?' అంటూ హూంకరించాడు సుబ్బయ్య.

వాళ్లిద్దరూ వణికిపోతూ..

'మేమేమీ సెప్పలేదయ్యా! మీ పేరు అసలు సెప్పనే లేదయ్యా!' అన్నారు.

'జాగర్తగా ఉండండి. ఎవరేం అడిగినా తెలియదని చెప్పండి. తెలిసిందా?' అంటూ మరోసారి గద్దించి, మిగతావాళ్లను తీసుకుని వెళ్లిపోయాడు సుబ్బయ్య.

***

మట్టితో చివరి స్నానం చేయించినట్టు ఉంది.. గుడిసె ముందు పెట్టి ఉన్న శీను శరీరం. కోసుగా ఉన్న రాళ్లు చీరుకుపోవడం వల్ల కారిన రక్తం గడ్డకట్టి, శరీరంమీద అక్కడక్కడా కుంకుమ చల్లినట్టుంది.

శీను శరీరాన్ని ఇంటికి మోసుకొచ్చి అప్పటికి అరగంట కావస్తున్నది. అచ్చమ్మ కన్నీటి వరదలా ఉంది. ఎనిమిది నెలలనుంచి గొయ్యిలోపల అడ్డంగా తవ్వడంవల్ల ఏర్పడిన సొరంగం పైకప్పు.. 'ధడేల్' మంటూ కూలిపోయిన శబ్దంతోపాటు.. శీను 'అమ్మా' అంటూ అరిచిన హృదయ విదారకమైన అరుపు ఆమె చెవుల్లో ఇంకా గింగురుమంటూనే ఉంది.

జరగాల్సిన ఘోరమంతా క్షణాల్లో జరిగిపోయింది. ఎప్పటి మాదిరే తనూ, మంగమ్మ కబుర్లు చెప్పుకొంటూ.. రాళ్ల నుంచి అభ్రకపు ముక్కల్ని వేరుచేసే పనిలో ఉన్నారు. గంటక్రితమే ఎంకడు బుట్టనిండా రాళ్లను తెచ్చి, వాళ్లముందు వేసి వెళ్లాడు. మరి కొద్దిసేపట్లో ఎంకడు పైకొస్తాడని ఎదురు చూస్తున్నంతలో.. భూమి కంపించినట్టు శబ్దం వచ్చింది. దాంతోపాటు శీను పెట్టిన కేక.. ఆమె గుండె ఆ క్షణమే డైనమైట్ పెట్టి పేల్చినట్టు వేయి

ముక్కలుగా బద్దలైంది. అదే సమయంలో ఎంకడు పెద్దగా ఏడుస్తున్న శబ్దం కూడా వినొచ్చింది.

తనతోపాటు మంగమ్మ కూడా లేచి, గొయ్యి దిక్కు పరుగెత్తింది. ఆరడుగుల లోతు వరకు వెళ్లాక.. దారి చాలా సన్నగా ఉండటంతో ఇద్దరూ లోపలికి వెళ్లలేక పెద్దగా కేకలు పెడుతూ.. గుండెల్ని బాదుకుంటూ ఏడవసాగారు. పోగైన వాళ్లలో పద్నాలుగేళ్ల పిల్లలిద్దరు గొయ్యిలోకి దిగి, ఎంకణ్ని పైకి మోసుకొచ్చారు.

'సొరంగం మొత్తం రాళ్లు, మట్టితో కూరుకుపోయింది. ఎంకడి కాళ్లు, వీపు మీద బాగా దెబ్బలు తాకినయి. శీను కనిపించలేదు. రాళ్ల కింద ఇరుక్కున్నడు కావచ్చు. మొత్తం రాళ్లూ, మట్టినీ తీస్తే కానీ.. శీనును బయటికి తీయలేం!' అన్నారు.

'ఎంకడికి దెబ్బలు తగిలాయి సరే! మరి నా బిడ్డో! వాడికేమైంది? పదేళ్లు కూడా పూర్తిగా నిండని పసివాడు.. నా పాణం! వాడేమైపోయిండు? అసలు కనిపించనేలేదా? మూలుగుతున్న శబ్దం కూడా ఇనిపించలేదా?'..

ఆ మాటే వాళ్లతో అంటే.. 'ఇనిపించనే లేదు!' అని చెప్పారు వాళ్లు.

'అంటే వాడి శరీరం పూర్తిగా రాళ్లు, మట్టిలో కూరుకుపోయిందా? అయ్యో.. నా తండ్రికి ఊపిరెలా ఆడుతుంది? ఆ రాళ్లు ఎంత బరువున్నయో? అసలే బక్క పాణం! ఎంత బరువని మోస్తయి? భూమంత బరువు!'..

ఎవరో సుబ్బయ్యకు ఫోన్ చేశారు. అరగంట లోపలే సుబ్బయ్య ముగ్గురు పనివాళ్లను వెంటబెట్టుకుని వచ్చాడు. వెంటనే ఎంకణ్ని ప్రభుత్వాసుపత్రికి పంపించే ఏర్పాటుచేశాడు. మంగమ్మ శోకాలు పెట్టి ఏడుస్తూ వాడితోపాటు వెళ్లింది.

ఆరు గంటలు శ్రమిస్తేనే కానీ.. శీను శరీరం బైటికి రాలేదు. పైకప్పు కూలి మీదపడిన కొన్ని నిమిషాలకే పిల్లాడు చచ్చిపోయి ఉంటాడని తీర్మానించారు.

ప్రాణంలేని శీను శరీరంతోపాటు, ప్రాణమున్న శవంలా మారిన తన శరీరాన్ని కూడా గుడిసెకు చేర్చారు. తన మొగుడు ఏడుస్తున్నాడు. ఎనిమిదేళ్ల కూతురు కూడా ఏడుస్తున్నది. ఇంక జీవితంలో ఏడుపు తప్ప ఏం మిగిలిందని?

ఏడ్చి ఏడ్చి అచ్చమ్మ సొమ్మసిల్లినట్టు పడిపోయింది.

'మొదట జరగాల్సిన కార్యక్రమం చూడండి. బాబుకు చివరి స్నానం చేయించండి' అన్నాడు సుబ్బయ్య.

'నా కొడుక్కు చివరి స్నానం చేయిస్తారా? చనిపోయినవాళ్ల శరీరాన్ని మొదట నీళ్లతో కడిగాక.. మట్టిలో పడుకోబెడ్తారు. నా కొడుకు మొదట మట్టిలో కొన్ని గంటలు పడుకున్నాక.. ఇప్పుడు నీళ్లతో ఒంటిని కడుగుతామంటున్నారు. వాడికి ఆ మట్టిస్నానం చాలు కదా! ఇక ముందంతా వాడికి మట్టి స్నానమేగా!'..

అచ్చమ్మ హృదయంలో వాడి గురించి తను కన్న వేల కలల సమాధులు మొలిచాయి.

***

శీను చనిపోయి పద్నాలుగు రోజులు. అచ్చమ్మకు దిగులుగా ఉంది. పోలీసులకు సమాచారం ఇవ్వకుండా ఉండటం కోసం ఆమె చేతిలో సుబ్బయ్య పెట్టిన డబ్బులు రెండ్రోజుల క్రితమే అయిపోయాయి. కొద్దికొద్దిగా కడుపుని నమిలి తినేస్తున్న ఆకలిని తనూ తన మొగుడు ఎలాగో ఓర్చుకుంటున్నారు. కానీ, కూతురు ఆకలని ఏడుస్తుంటే కడుపు తరుక్కుపోతున్నది.

ఏం పని చేసి తన కుటుంబాన్ని పోషించుకోవాలో ఆమెకు అర్థం కావడం లేదు. శీను చనిపోయిన రోజే నిర్ణయించుకుంది.. ప్రాణం పోయినా సరే మొసలి నోళ్లలా తెరుచుకుని ఉండే అభ్రకపు గోతుల దరిదాపులకు కూడా పోకూడదని. కానీ, చేయడానికి ఆ ఊళ్లో మరేమీ పని లేదు. ఊరంటే ఊరు కూడా కాదు. గూడూరుకు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ప్రాంతంలో అభ్రకం దొరుకుతుందని తెలియడంతో ఎక్కడెక్కడినుంచో దాదాపు యాభై కుటుంబాల వాళ్లు వచ్చి గుడిసెలు ఏసుకున్నారు అంతే! ఈ యాభై కుటుంబాలకు జీవనాధారం.. నేలను తవ్వి తీసే అభ్రకపు ముక్కలే!

పోనీ తన మొగుడికి ఆరోగ్యం బాగుంటే గూడూరు వెళ్లి ఏదో ఓ పనిచేసి నాలుగు డబ్బులు సంపాదించుకుని వచ్చేవాడు. తనకా అదృష్టం కూడా లేదు. తన కూతురితోపాటు మొగుణ్ని కూడా తనే సాకాలి.

శీను చనిపోయాక ఎన్ని పీడకలలో! ఓ కలలో అభ్రకం కోసం తవ్విన గొయ్యి అగాధంలా మారి చుట్టుపక్కల ఉన్న మనుషులందర్నీ తనలోకి లాక్కుంటున్నట్టు! మరో కలలో అది రెండు బారల నాగుపాములా మారి ఊళ్లో అందర్నీ కాటేస్తున్నట్టు! ఎన్నిసార్లు నిద్రలోంచి పెద్దగా అరుస్తూ లేచి కూర్చుందో!

ఎలాగో మరో రోజు గడిచింది. ఆకలికి తాళలేక తన మొగుడు, కూతురు శోషొచ్చినట్టు పడిపోయారు. తన పరిస్థితి కూడా అంతే! ఇలానే మరో రెండ్రోజులు పస్తులుంటే.. చచ్చిపోతారేమో అని భయమేస్తున్నది. పాము పడగ నీడలో బతికే తమలాంటి వాళ్లు.. పాము నుంచి ఎక్కడికని పారిపోగలరు?

మంగమ్మ పరిస్థితి కూడా అలానే ఉంది. ఎంకడికైన గాయాలు ఇప్పుడిప్పుడే మాను పడ్తున్నాయి. వాడు గాయపడిన రోజే ఒట్టేసుకుంది.. ఎట్టి పరిస్థితుల్లోనూ తన కొడుకుని ప్రమాదాల అంచుల్లోకి పంపనని. తనకు భర్త ఎలాగూ లేడు. మిగిలింది వాడొక్కడే! ఆ రోజు అదృష్టం కొద్దీ గాయాలతో బైటపడ్డాడు గానీ.. ఏ కాలో, చెయ్యో విరిగుంటే ఏమయ్యేది? ప్రాణాలే పోయుంటే! ఆ ఆలోచనకే ఆమె ఒళ్లు భయంతో జలదరించింది.

కానీ, రోజులు గడిచేకొద్దీ ఆమె మెత్తబడసాగింది. పనిలోకి వెళ్లకపోతే ఆకలి క్షమించేలా లేదు. ఎంకడు నడవడానికి ఇప్పటికీ ఇబ్బంది పడుతున్నాడు. అయినా.. 'మూడు పొట్టలు నిండాలంటే రేపటినుంచి పనిలోకి వెళ్లక తప్పదు!' అనుకుంది.

***

అచ్చుమ్మ ఆ రాత్రంతా ఆలోచిస్తూనే ఉంది.

'ఎంకడు గొయ్యిలోకి దిగి రాళ్లను పగలకొడ్తే.. వాటిని పైకెవరు మోసుకొస్తారు? ఆ పని కూడా ఎంకడు చేస్తే వచ్చే నాలుగొందల్లో మూడొందలు మంగమ్మకే ఇవ్వాల్సి వస్తుంది. నా వాటాకొచ్చే వంద రూపాయల్తో ఇల్లెలా గడుస్తుంది?'..

ఆమె తన పక్కన పడుకుని నిద్రపోతున్న కూతురి అమాయకమైన మొహం వైపు చూసింది. అనాయాసంగానే ఆమెకు కన్నీళ్లు పొంగుకొచ్చాయి. 'ఎంత కట్టమైనా సరే.. నిన్ను సదివిత్తనని మీ అయ్యకు మాటిచ్చిన. అన్ని కట్టాలకన్నా ఆకలిని తట్టుకోడం శానా కట్టం తెలుసా తల్లీ! కట్టాలకు లొంగిపోయి.. మాట నిలుపుకోలేక పోతున్న ఈ తల్లిని ఛమిస్తావు కదూ!' అనుకుంది.

మరునాడు ఉదయం అచ్చుమ్మ తన కూతురి చేయి పట్టుకొని పనికి బయల్దేరింది.

ఎంకడితోపాటు తన కూతురు కూడా గొయ్యిలోకి దిగుతుంటే.. ఆకలితో నోరు తెరుచుకుని ఎదురుచూస్తున్న రాక్షసుడి నోట్లోకి పిల్లల్ని పంపిస్తున్నట్టు అనిపించింది అచ్చుమ్మకు. నేలను రెండు చేతుల్తో బాదుతూ గుండెలవిసేలా ఏడ్చింది!

***

**సయ్యద్ సలీం స్వస్థలం.. ప్రకాశం జిల్లా, త్రోవగుంట గ్రామం.. . ఎమ్మెస్సీ (టెక్) చేశారు. ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్‌లో అడిషనల్ కమిషనర్‌గా ఉద్యోగ విరమణ పొందారు. కాలేజీ రోజుల నుంచే కవితలు రాయడం మొదలుపెట్టారు. ఇప్పటి వరకూ మూడు కవితా సంపుటాలు, పది కథా సంపుటాలు, 27 నవలలను వెలువరించారు. ఈయన రాసిన మొదటి కథ 'మనీషి'.. 1980లో ఆంధ్రభూమి పత్రికలో ప్రచురితమైంది. 150కిపైగా కవితలు, 50కి పైగా కథలు.. వివిధ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. ఈయన రచనలు ఇంగ్లిష్, హిందీ, మరాఠీ, ఒరియా, కన్నడ, మలయాళం, తమిళ భాషల్లోకి అనువాదం అయ్యాయి. 'కాలుతున్న పూలతోట' నవలకు 2010లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్నారు. 'వెండి మేఘం' నవల, 'తలాక్', 'లాకులు', 'నూకలు' కథలను పలు విశ్వవిద్యాలయాలు పాఠ్యాంశాలుగా చేర్చాయి. వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన 10మంది విద్యార్థులు ఈయన రచనల మీద పీహెచ్‌డీ/ఎంఫిల్ చేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారంతోపాటు ఎన్నో అవార్డులు, పురస్కారాలు అందుకున్నారు.**

# తండ్లాట



**అరుణ్ కుమార్ ఆలూరి,**

**63058 16242**

ఇంటి ముంగటున్న సౌతరి మీద కూసొని మల్లా ఓల్లకో ఫోన్ జేశింది అమ్మ.. స్పీకర్ చాల్ జేస్కొని.

'యాడైతదక్క! నాకే శిన్న బాదైతలేదు. ఆకు సక్కగస్తలేదు. దొడ్డు, ముక్క ముక్క అస్తున్నది. మల్ల అవి జోకెటప్పుడు ఆ ముండకొడుకు దండె కొడ్తున్నడు. అజార్ బీడీలకు ఐదునూర్లే ఎల్తున్నయి. బైట దొర్కక ఆడి దగ్గర్నే వంద వెట్టి కొనుడైతున్నది'.. అని ఫోన్లకెంచి మాటలు ఇన్పిచ్చినయి.

'అయ్.. గా ఆకుకు వందనా? యే కంపిన్ల లేదిట్ల. లవ్కడ్లు జమైంద్రు ఈ దాదలు' అనుకుంట, తోడెంసేపు మాట్లాడి ఫోన్ పెట్టేశింది.

ఈ ఐదు రోజులల్ల ఇది పదోసారో ఇర్వయ్యోసారో.. తనతోటి కార్ఖాన్ల పన్జేస్తున్న ఓల్లకో ఒకల్లకు ఫోన్ జేశి అడుగవట్టె! కారణం తెల్వదిగని, ఎవ్వలు గుడ ముందటికస్తలేరు.

అమ్మ దగ్గరికివొయి..

'అమ్మా! ఇడ్సవెట్టు. ఈ పరిస్తితులల్ల ఈ నెత్తినొప్పి ఎందుకు వెట్టుకునుడు? అన్ని మనం అనుకున్నట్టు ఐతయా?' అని, బుడ్డదానికి ఎండ తగ్లాలని అమ్మ పక్కన కూసున్న.

అమ్మ సప్పుడు జెయ్యలేదు. శేతికున్న పట్టిని

సూస్కుంట సోంచాయిస్తున్నది. ఇంకో రెండేండ్లు ఐనంక రాజీనామ వెడ్తె, నెలకు కమస్కం మూడెయిల పించను అస్తదట! అదే ఇప్పుడు వెడ్తె పద్నాలు వందలు అస్తున్నదట. దీని ఎన్క ఉన్నలెక్కలు నాకు, అమ్మకు గుడ తెల్వయి. బీడీల రేటు, పించను ఎక్వజెయ్యాలని కంపినిని గట్టిగ అడుగుతున్నరట యూనియన్ లీడర్లు. అయ్యి పెరిగితె రాజీనామ వెట్టొచ్చని సూస్తున్నది.

ఇంతట్లనే మామ ఎంబట అత్త బైటికి అచ్చి బుడ్డదాన్ని సూస్కుంట..

'ఓయ్.. ఏం జేత్తున్నవ్? పొలానికి వొయత్తం. మంచిగ ఆడుకో!' అని చెప్పి, ఉరుక్కుంట వొయి మామను అందుకున్నది.

ఆళ్లు పొయిన దిక్కే సూస్కుంట..

'నేను బీడీల్ జేసుడు మొదలువెట్టినప్పుడు తొమ్మిదేండ్లు ఉండె. అప్పుడు అజార్ బీడీలకు నాల్గు రూపాల్ ఇస్తుండె. అర్తాల్లు జేశి, కార్ఖాన్లు బందు వెట్టి, రోడ్ల మీదికెక్కి కొట్లాడుకుంట ఉంటె.. పెంచుకుంట అచ్చింద్రు. ఇప్పుడు రెన్నూర్లయ్యింది!' అన్నది అమ్మ.

'అప్పుడే గంత కట్టవడ్డప్పుడు.. ఇప్పుడెట్ల ఇడ్సవెడ్తది?' అన్పిచ్చింది నాకు.

***

ఇంటి మైశవ్వకు దీపాలు ముట్టిస్తుండంగ అత్తామామ అచ్చింద్రు.. చేతుల రవాట వట్టుకొని. ఏటి కాల్వలకెంచి పొలాలకు కొట్టుకచ్చిందట. మేం పొయి దగ్గరుంటె మామ బుడ్డదాని పక్కకు కూసున్నడు. సన్నం శెద్దరి దాని కాళ్ల మీద ఏశిండు. అదేమొ దాన్ని తండేసుకుంట నవ్వుతంది. తినేటిదాక అదొక ఆట ఆళ్లకు.

రాత్రికి బుడ్డదాని బాపు వీడియో కాల్ చేశిండు. బిడ్డెతోని కొంచెం సేపు ముచ్చట వెట్టి..

'మల్లా పొద్దున లెవ్వాల!' అని పెట్టేశిండు. ఇప్పుడంటె ఇంత సౌలత్ ఉన్నదిగని, శిన్నప్పుడు మా ఇంటిపక్కకు ఉండె కర్రెన్న తాత దుబాయ్ వోతె, భూలచ్చిమాయి ఒక కాసెట్ కొనుక్కచ్చి టేప్‌రికార్డుల మాట్లాడి నింపి పంపిస్తె.. అది ముట్టేసరికి నెలైతుండె. రోజులెంత గమ్మతుగ మారుతున్నయో!

***

అత్తామామ పొలానికి వోంగనె.. బుడ్డదాని మాడమీద నూనె సుక్కలేశి, రాస్కుంట అర్రల కూసున్న. అమ్మ ఆకిట్ల నిలవడి మల్లా ఓల్లకో ఫోన్ జేశి, ఫస్టుకెంచి చెప్పుకస్తున్నది.

'ఇగో.. నా బిడ్డె నిండు మనిషుండె. పిల్లగాడేమో మస్కట్ల ఉన్నడు. 'కాన్పుకోసం తీస్కవోతా' అంటే.. నా ఒక్కదాంతోని యాడైతదని నన్నే ఇటు రమ్మన్నరు. నా అంతుకు బీడీల్ వెట్టుమని నా కారటి నర్సవ్వకు ఇచ్చచ్చిన. మంచిగ ఆడివిల్ల పుట్టి నాన్నెల్లు దాటింది. ఓరోజు గాచారం మంచిగ లేక ఆకిట్ల నడంగ కాల్ జారి కింద వడవేన. ఆపుకొందమని శేతిని అడ్డం వెడితె పుటుక్కుమని ఇరిగింది. అప్పట్సంది ఊరి మొకం సూసుడైతలేదు. గిసుంటి టైంల.. అది నా కారటి బందువెట్టి, వేరోల్ల కారటి మీద జేస్తున్నదట.. గిదేమన్న నియ్యతేనా? అడుగుదమంటె ఫోను లేప్తలేదు' అని అంటున్నది.

అవతలోళ్లు ఏమన్నరో తెల్వది. శెవులల్ల రొద వెట్టినట్టు అనిపించిందో ఏమో.. ఫోన్ల స్పీకర్ చాల్ జేశి మల్లా అమ్మనే..

'అదే గద.. ఆ నల్లికుట్ల మొకందానికి కారటే లేదు. ఇప్పుడు వేరోళ్లదైన, నాదైన గదే కారటి. గవ్వే పైసలు. మరి శెప్పకశెయ్యక నాదేంటికి ఆపాల? ఇప్పటికి నెల పదిగేను రోజులాయెనట. వేరోళ్లు శెప్తె తెలిశింది. మూడు నెల్లు కాడలైతె రాజీనామ వెట్టుమంటరు. అట్లయితె పించను దగ్గర నుక్సానయితది. అదొక్కసారి చాల్ అయ్యిందంటె.. మల్ల పదేండ్ల దాక ముట్టుకోరు. బయటెంత పెరిగినా సంబంధం ఉండది' అన్నది.

'ఇసాబ్ ఎట్ల కట్టిత్తున్నవ్ నర్సవ్వకు..' అన్నది అవతలామె.

'మాపులు వెట్టిన కాడికి ఆడ్నే కార్ఖాన్ల తీస్కుంటది. దాంట్ల కట్ అయిన పించను పైసలు, దావకాన కోసం కట్ అయిన యాభై రూపాలు, మీటింగులకు నిజాంబాద్ వోతె కైకిలి, బస్ కిరాయిలు, యూనియనోళ్లకు యాడాదికి వంద ఇవన్ని నేనే కట్టిత్తున్న' అన్నది అమ్మ.

'మరి దాదలకిచ్చే పది రూపాలు ఇత్తున్నవా?' అన్నది అవతలామె.

అమ్మ సల్లవడ్డది. అవతలామె ఇంట్లకు ఓల్లో సుట్టాలు అచ్చినట్టు ఉన్నరు..

'ఆ.. ఉన్న! అత్తున్న' అనుకుంట పోను వెట్టేశిందామె.

లంగోట తడ్సిందని బైటికచ్చి దండెం మీదికెంచి కొత్తది తీస్కోని.. బుడ్డదాన్ని కాళ్లమీద పండవెట్టుకొని మారుస్తున్న. నన్ను సూశి..

'అయ్.. ఇదేం నసీబై పాయె! మన్మరాలికి తానం గుడ జేపిచ్చుడు ఐతలేదు' అన్నది.

'పట్టి తీశేశినంక జేపిద్దువు తియ్!' అన్న.

అమ్మని జూస్తె ఇప్పట్ల రాజీనామ వెట్టెటట్టు కొడ్తలేదు. అమ్మ.. ఆల్ల అమ్మని యాజ్జేస్కున్నది. అమ్మమ్మ రెండు వేల రెండుల రాజీనామ వెడ్తె.. అప్పుడు అజార్ బీడీలకు తొంబై రూపాలున్న టైంల.. రెన్నూర్ల యాభై రూపాల పించను కూసున్నది. రోజురోజుకు రేట్లు పెరుగుతుంటె, అంత తక్వ పించనుతోని ఎట్ల ఎల్లదియ్యాల్నో అమ్మకు సమజైతలేదు.

నాకు ఐదేండ్లప్పుడు బాపును ఏదో బండి టక్కరిచ్చి తీస్కవోతె, బీడీలు చేస్కుంటనే కడ్పుల వెట్టుకొని సాదింది. రోజుండేటి ఇంట్ల పనులు శేస్కుంటనే, పద్నాల్గు పదిగేను గంటలు బీడీల మీద కూసుంటుండె. అమ్మ నాయంత ఉన్నప్పుడు రోజుకు మూడు శేర్లు శేస్తుండెనట. ఒక శేరు బీడీలు తన కార్డు మీద మాపు వెట్టుకుంటె, కడుమయి తక్వ వడ్డోల్లకు కట్టల సొప్పున ఇస్తుండెనట.

ఎన్కటి ముచ్చట.. అప్పట్ల పొలం పనికి కైకిలి మొగోళ్లకు రూపాయి, ఆడోళ్లకు ఆఠాన ఉండెనట. శేరు బీడీలగ్గుడ గంతేనట. అప్పుడు మా అమ్మ రోజుకు రెండు శేర్లు శేస్తుండెనట, దాంతోని మొగోళ్ల కైకిలి వడ్తున్నదని బీడీల మీదనే ఉంచిందట మా అమ్మమ్మ.

'అదే ఆడోళ్లకు, మొగోళ్లకు సమానం కైకిలి ఇస్తె.. గీ బీడీలు ఓల్లు జేస్తుండే!' అన్నది అమ్మ.

అమ్మమ్మతోని కలిపి ఊరు మొత్తానికి బీడీలు జేశెటోళ్లు ఐదుగురే ఉండెనట. పక్కకున్న మండలంల కార్ఖాన ఉంటుండెనట. తర్వాత ఈళ్లను సూశి, ఒకటి తెచ్చి ఊళ్లె పెట్టింద్రట.

ఇప్పుడు ఇదే ఊర్ల ఆరువందల మంది బీడీలు జేశెటోళ్లు, ఐదు కార్కాన్లు అయినయి. 'వానలు పడని కరువు కాలంల ఎవుసం లేక.. గీ బీడీలే ఆదుకున్నయి' అని నెమరేసుకున్నది అమ్మ.

***

అమ్మ పట్టి తీపిచ్చుకుందమని ఇందూరు వోయింది. ఎక్స్‌రే తీపిచ్చి సూశి..

'నీ బొక్కలు గట్టిగ లేవు! ఇంకొక నెలరోజులు ఉంచుకో!' అన్నడట డాక్టరు.

ఇంటికచ్చి.. 'ఇదేం కతైపాయె!' అనుకుంట ముచ్చటంత శెప్పింది.

ఒక నిమిషం కూసున్నదో లేదో, ఫోన్ తీసుకొని మల్లా ఓల్లకో జేశింది.

'దాదకు ఇచ్చే గా పది రూపాల్ నేనే ఇస్త. ఏమంటవు?' అన్నది.

'లేదక్క. నాకు జేసుడు ఐతలేదని రాజీనామ వెడ్దమని సూశిన కని నాపేరు తప్పు వడ్డదట. నా బ్యాంకు పాసుబుక్కు, ఆదారు కారటి ఇచ్చినంక ఎట్ల తప్పు వడ్తది శెప్పు? ఆపీసుల గా కంపూటరి ముంగట కూసుండెటోడు కావలనే అందరియి తప్పు గొట్టినట్టు అన్పిస్తున్నది. ఇప్పుడు సరి జెయ్యాలంటే రెండువేలు ఐతయంటున్నడు' అన్నది అవతలామె.

'రెండు వేలేంటికియ్యాల ఆ మూతగండ్ల మొకపోనికి. ఆంత జమైంద్రు మనల్ను దోస్కునదల్గి. నువ్వు గదేదో నెట్టు సెంటర్కు ఓల్లనన్న పట్కవోయి ఆనులైన్ల మార్పిచ్చుకో! నాకట్లనే అయితే మా అల్లుడు ఆల్ల దోస్తుకు శెప్పి జేపిచ్చిండు. యాభయ్యో వందనో తీస్కుంటరు గంతే. అది మారిందాక బీడీలు బందువెట్టకు!' అని ఇగురం శెప్పి వెట్టేశింది.

నేను అడిగిన.. 'ఈ పది రూపాల సంగతేంది?' అని.

'ఏ.. ఏంలే! బీడీలు ఇచ్చెటప్పుడు కారట్ ఉన్నోళ్లు ఉండాల గద. ఆల్లు లేకుండ వేరేటోళ్లు మాపులు వెట్టవోతె, ఆ దాదలు అజార్ బీడీలకు ఐదు రూపాల్ అడుగుతుండె పాపం. కొత్త దాదలచ్చింద్రట. దాన్నిప్పుడు పది రూపాల్ జేశింద్రట!' అన్నది.

'నువ్వు లేకున్నా మాపులు తీస్కుంటున్నందుకు పాపం ఐపోయింద్రు కద?' అన్న నవ్వుకుంట. 'తక్వ జీతానికి పెండ్లాం పిల్లల్ని ఇడ్సవెట్టి పడమటకెంచి అచ్చి ఉంటరు. మామీద వడి బత్కుడికి సై మరిగింద్రు. ఏం జేద్దం మరి!' అనుకుంట లోపట్లకు వోయింది.

***

మాపటికి చాయ తాగినంక, అమ్మ నర్సవ్వకు మల్లా ఫోన్ జేస్తె.. ఈసారి ఎట్లెట్లనో లేపింది.

'గిట్లెట్ల జేస్తివే? గిదేమన్న పద్ధతేనా?' అన్నది అమ్మ.

'నేనెమన్న రెండేండ్లు జేత్తనని నీకు మాటిచ్చిన్నా అక్క? నువ్వు ఎప్పుడు రాజినామ వెడ్తవో అని నా భయం నాకుంటది కదా? ఇంకో కారటి దొర్కింది.. మూడేండ్లు జేసుకోమన్నరు. అందుకే నీదిడ్సవెట్టిన' అని శెప్పింది.

'అట్లంటప్పుడు ఒక నెల ముందు జెప్తె నేను వేరోళ్లని సూస్కుంట గద? ఇదేం లెక్క అన్నట్టు?'. 'ఏమన్ననుకో.. నాకైతె జేసుడు కాదు' అని కట్ చేసింది నర్సవ్వ.

'బౌరూపుల మొకంది' అని గునుక్కుంట, నా దిక్కు తిరిగి..

'ఒక పన్జేస్తె?' అన్నది.

'ఏందమ్మ?'.

'నేను ఇంటికి వొయి కొన్ని రోజులు ఆడ్నె ఉండి, ఓల్లకన్న కారటిచ్చి అస్త. ఏమంటవ్?'.

నాకు కోపం పాము పడగోలె సర్రున లేశింది.

'అమ్మా ఏం మాట్లాడుతున్నవే? నువ్వసలే క్యాన్సర్ పేషెంటువి. గా బీడీలతోనే రొమ్ముకచ్చింది. అదృట్టం మంచిగుండి గా ఆరోగ్యశ్రీ స్కీము ఉండవట్టి ఆపరేషన్ జేశింద్రు. లేకపోతె ఉన్న పొలం అమ్ముడైతుండె. గప్పుడు చేశ్న రేడియేషన్‌కు బొక్కలన్ని పల్సవడి, గిట్ల కిందవడంగనె శెయ్యిరిగె. అంతకుముందు ఎన్నిసార్ల వడలే.. ఎప్పుడన్న ఇరిగింద?' అన్న నేను.

అమ్మ అటీటు సూస్తున్నది.

'అదిగాక బీడీలకోసం గంటలు గంటలు కూసుండుడుకు బీపీ, షుగర్ ఎప్పుడో అచ్చినయి. నువ్వు ఈ పరిస్తితిల ఇంటికి వోయి, తుంటి శేత్తోని వంట జేస్కుంట, బీడీలు పెట్టేటామెని లెంకుకుంట కూసుంటవ? అసలే కేసులెక్వ అయితున్నయి. అందరు మల్లా లాకుడౌను వెట్టమంటున్నరు. నువ్వు అటు పోంగనె ఇటు వెట్టింద్రనుకో.. ఎట్ల జేద్దం' అన్న.

ఉలుకులేదు పలుకులేదు.

లోపట్లకు వొయి కొంచెం నీళ్లుతాగచ్చి..

'నేను నీ అల్లునితోని మాట్లడిపెట్టిన. నువ్వు రాజినామ జేశినంక మాతోని ఈడ్నే ఉంటవు. అత్తమ్మ నువ్వు ఓల్లకోల్లు సోపతి లెక్క ఉంటరు' అన్న నిమ్మలంగ.

అమ్మ నమ్మనట్టె సూశింది.

'పిల్లగాడు మంచోడె కని.. కూతురింట్ల ఉండుడు, అల్లుడు సంపాదించుకస్తె తినుడు మంచిగుండది. నాకు నెలకు మూడువేలు పించని అస్తె నా పొట్టకు, నెలనెల మందులకు పనికొస్తయి!' అని అంటుండగనే.. అత్త, మామ అచ్చింద్రు.

అమ్మ మాటలను మామ ఇన్నట్టున్నడు..

'బిడ్డె, కొడుకు అందరూ సమానమే! ఆస్తిపాస్తులు అందరికీ సమానంగ పంచియ్యాల. అట్లనే ఆళ్లు గుడ అయ్యవ్వల్ని ముసలోల్లైనంక సమానంగ సూస్కోవాల. నీకున్నది ఒకతే బిడ్డ. మాకున్నది ఒక్కడే కొడుకు. ఇగ నువ్వో జాగల, మేమో జాగల ఏంది శెల్లె? జేశినకాడికి సాలు, రాజినామ వెట్టెయ్యి' అన్నడు.

అమ్మ కండ్లల్ల నీళ్లు తిరిగినయి.

'నిన్ను ఉండదల్గి అల్లుడు ఒప్పుకొన్నడు' అంటె.. అంత నమ్మకం కనిపియ్యలె. ఇప్పుడు ఇంటి పెద్ద శెప్పంగనె నమ్మింది.

'నా బిడ్డె కిస్మత్ మంచిగున్నది. మారాజులున్న ఇంట్ల వడ్డది. నేను ఒక్కదాణ్ని ఆడ ఉండుడెందుకు అంటున్నరు. మరి పిల్లగాడు ఆడ, పిల్ల ఈడ ఉంటె ఏం మంచిగుంటదన్న?

అల్లుణ్ని గుడ రమ్మందం. పెట్టువడికి పైసలు ఇస్తున్నది సర్కారు. కాల్వల నీళ్లు మొక్కల్ల అస్తున్నయి. ఆడున్న రెండెకరాల పొలం అమ్మేద్దం. ఆ పైసల్తోని ఈడ్నే తీస్కుందం. అందరం ఒక జాగలుండి నూనె కారం తిన్నా.. కమ్మగనే ఉంటది!' అన్నది.

'భూమిని అమ్ముడద్దు. అదట్లనె ఉండని. కౌలుకియ్యచ్చు లేకపోతె ఇంకేమన్న జెయ్యచ్చు. నువ్వన్న మాట కుడ కరెక్టె. బిడ్డె పుట్టినంక గుడ ఆడు ఆడెందుకు ఉండాల? మాట్లాడ్త ఒకసారి' అన్నడు మామ.

రాత్రి తినుడు అయినంక మామ, అయినెకు ఫోన్ చేసుకుంట బైటికి నడిశిండు. అద్దగంటకు ఇంట్లకు అచ్చి..

'ఇంక నాల్గు నెల్లు ఐతె దసరత్తది గద.. ఆ టైంకు అచ్చేత్తడట. ఇప్పుడు రాజీనామ వెడ్తె అచ్చేటి పైసలు అప్పటికి కరెక్ట్ అస్తయట. టికెట్ అయితె ఇప్పుడే బుక్ చేసుకుంటనన్నడు' అని శెప్పిండు మామ.

నాకన్న ఎక్వ అమ్మకు సంతోషం అయ్యింది. బాపు లేకున్న ఒంటరిగ ఉండి, వేరే ఆలోచన లేకుండ బీడీల పనిమీదనే పెయ్యి పిండి పిండి జేస్కోని నన్ను వెంచింది. అసలు నేను ఎట్ల పెరిగిన అని గుడ అమ్మకు సక్కగ గుర్తు లేదు. ఇప్పుడన్న మా బుడ్డదాని పెరుగుడు సూస్కుంటనన్న సంతోష పడ్తది అనుకున్న.

* * *

పొద్దుగూకినంక అమ్మకు ఫోన్ అచ్చింది. మీది వాడకట్టుకు ఉండే సాయమ్మ దగ్గర్నుంచి. మస్తు సేపు మాట్లాడింది.

'అవ్.. అవన్ని పైసలిస్త, మీదికెంచి దాదలకు ఇచ్చె పది రూపాలు కుడ ఇస్త' అన్నది.

ఆమె ఏమన్నదో తెల్వది గని, ఫోన్ వెట్టేశి నాబిడ్డె దగ్గరికచ్చి..

'ఆమె నా కారటి మీద శెయ్యదల్గి ఒప్పుకున్నది. రాజినామ వెట్టినంక అచ్చిన పైసలతోని నీకు బంగారు గొలుసు జేపిత్త. ఇదంత నీతోనె అయ్యిందే నా లచ్చిమితల్లి' అని బుగ్గమీద ముద్దు వెట్టుకున్నది.

బుడ్డది అమ్మను సూస్కుంట కిలకిల నవ్వింది. అమ్మకున్న టెన్షన్ పోయినందుకు నాగ్గూడ మంచిగనిపిచ్చింది. ఇంతట్లనే యాదికచ్చి..

'నువ్వు రాజినామ వెడ్తలేవానె?' అని అడిగిన.

'లేదు.. నా సోపతిది గా సాయమ్మ నా కారటి మీద శెయ్యదల్గి ఒప్పుకొన్నది'.

'ఎట్లొప్పుకొన్నదే?'.

'ఐదు రూపాలకు శేరు జేశినోళ్లం. దాదలకు ఇచ్చే పదిరూపాలు గుడ ఇస్త అనేసరికి ఒప్పుకొన్నది. మీకు పది రూపాలంటె లెక్క లేదుగని, మాకు ఎన్మై కట్టల బీడీలతోని సమానం. పాపం దానిగ్గూడ వేరే ఆదారం లేకుంట వోయింది. సర్కార్ ఇస్తున్న గా దోఅజార్‌లకెంచి ఓల్లకు తెల్వకుండ ఎన్నో కొన్ని శేతిల వెట్టస్త' అన్నది.

'ఇస్తె మంచిదే కని.. మామకు 'రాజినామ వెడ్తా!' అని చెప్తివి గదనే!'.

'ఆడికి వొయి జేత్తలేను కద!'.

'మంచిగుండదే!'.

'ఊకో.. ఏం తెల్వది నీకు. అది అయిన కాడికి జేత్తది. కానిరోజు రాజినామ వెడ్త. పైసలేమన్న పుక్కానికి అస్తున్నయా? నేను మింగే మందులకు శిన్న పైసల్ అయితున్నయా? నువ్వు సప్పుడుదాక కూసో! అన్న అడిగితె నేను సంజాయిస్తా' అన్నది.

'ఇదింతే! శెప్తె అస్సలు ఇనది. మల్లొక కత వెట్టింది' అనుకున్న మనసుల.

నా బిడ్డెకు ఏమర్థమయ్యిందో ఏమో.. నన్ను సూస్కుంట నవ్వింది. నవ్వుతుంటె.. ఒక పన్ను అచ్చినట్టు కనిపిచ్చింది.

'అమ్మా.. నీ మన్మరాలికి పన్నచ్చిందే!' అన్న.

'నిజంగనా?' అనుకుంట అచ్చి సూశింది.

మమ్మల్ని సూస్కుంట కాల్లు ఎగిరేసుకుంట ముస్కురాయిస్తున్నది. ఆనంద్ కలర్ కుల్ల కట్టుకున్న బుడ్డది ఒక పన్నుతోని నవ్వితె.. ఇంకింత మంచిగ కనిపిస్తున్నది.

'పారపూస కట్టాల.. జిట్టి కాకుండ!' అన్నం ఇద్దరం ఒకటేసారి.

* * *

అరుణ్ కుమార్ ఆలూరి స్వస్థలం నిజామాబాద్ జిల్లా అభంగపట్నం. ప్రస్తుత నివాసం జోగిపేట. బీటెక్ చేశారు. ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ.. సినిమాలపై ఆసక్తితో స్క్రిప్ట్ రైటర్‌గా అడుగులు వేస్తున్నారు. ఒక సినిమాకు రచనా సహకారం అందించారు. రెండు సినిమాలకు స్క్రిప్ట్ ఎడిటింగ్ చేశారు. 80వ దశకంలో సంచలనం సృష్టించిన ఒక నవలను స్క్రీన్‌ప్లే రూపంలోకి మార్చే పనిలో ఉన్నారు. ఈయన రాసిన మొదటి కథ 'పిల్లి పోయి ఎలుక వచ్చె డాం డాం డాం'. మేడిపండు, మిణుకుమనే ఆశలు, సుబ్బయ్యతాత పెళ్లి, సూపర్ ఫాస్ట్ రైటర్ కథలు మంచి గుర్తింపు పొందాయి. వివిధ పత్రికల్లో 19 కథలు, మరికొన్ని నానీలు ప్రచురితం అయ్యాయి. కలర్స్ ఆఫ్ లవ్, కొత్తకథ 2022 సంకలనాల్లోనూ చోటు సంపాదించుకున్నాయి. 2008 ఆటా కథల పోటీల్లో వంద డాలర్లను బహుమతిగా గెలుచుకొన్నారు. కణిక, వాసా ఫౌండేషన్ – సాహితీ కిరణం, తెలుగు తల్లి కెనడా, విశాలాక్షి పత్రికలు నిర్వహించిన పోటీల్లో బహుమతులు గెలుపొందారు. నవ సాహితీ ఇంటర్నేషనల్ వారి ముళ్లపూడి ఉత్తమ హాస్య కథ పురస్కారం అందుకున్నారు.

# అద్దంలో మూట

'వసుమతీ! అన్నం తిందువురా!' అని పిలిచింది ఎంకటమ్మ. సమాధానం రాలేదు. టైమ్ చూసింది. రాత్రి ఎనిమిదైంది.


'ఏందిమే! మెత్తగుండావే? జరమేమన్నా వచ్చిందా?'.. బడి నుంచొచ్చి కాళ్లయినా కడుక్కోకుండా, అంతసేపూ ఒదుక్కొని పడుకున్న కూతుర్ని చూసి అడిగింది.

పలక్క పోయేసరికి దగ్గరికొచ్చి చెయ్యి పట్టుకుని చూసింది. వేడిగా తగిలింది.

'జరమొచ్చినట్టుంది. రోంత శారన్నం మెత్తంగ పిసికిస్చా.. తిను! ఈలోపల మాత్తర దెచ్చిస్చా. ఏసుకోని దుప్పటి గప్పుకోని గమ్మున పనుకో! వొల్లంతా సెమట పట్టిందంటే అదే తగ్గిపోతాది. రేపు బడికేం బోవద్దులే!'.. అన్నది.

అన్నం తినే గిన్నెలో అప్పటికే వేసిపెట్టిన ఊరిమిండి, కొంత అన్నం తీసేసి, మిగిలిన అన్నంలో చారు వేసి బాగా మెత్తగా పిసికిచ్చి, తినమని చెప్పి బయలుదేరింది. ఆర్ఎంపీ వాళ్లింటికి పోయి జ్వరం మాత్ర తీసుకుని వచ్చేసరికి అర్ధగంటైంది. వసుమతికి అన్నం సహించలేదు కాబోలు.. ఇంకా చారన్నం కెలుకుతూనే ఉంది.

పక్కింట్లో నుంచి టీవీలో ప్రధానమంత్రి ప్రసంగం వినిపిస్తున్నది. కొన్ని నిమిషాలు గడిచేసరికి కాస్త బిగ్గరగా మాటలు వినిపించాయి. ఏమైందోనని అటు కదలబోయిందల్లా ఆగి.. ముందు పాపతో మాత్ర మింగించి



**త్రివిక్రమ్,**
**99010 65406**

పడుకోబెట్టిన తర్వాత, నిదానంగా కనుక్కోవచ్చు లెమ్మనుకుంది. చారన్నం తినిపించి, మాత్రను సగానికి తుంచి చేతిలో పెట్టి, గ్లాసుతో నీళ్లు అందించింది. పాప నీళ్లు తాగి పడుకున్నాక తన పనిలో పడి పక్కింటి నుంచి వినిపించిన గోల విషయమే మర్చిపోయింది. ఆ రోజు 2016 నవంబర్ 8. అప్పుడు సమయం దాదాపు ఎనిమిదిన్నర.

మరుసటి రోజుకల్లా తగ్గిపోతుందని అనుకున్న జ్వరం రెండు రోజులైనా తగ్గలేదు. ఆలోచిస్తూ కూర్చుంది. మూడు పూటలా వెయ్యమని రెండు రోజులకూ పారాసిటమాల్ మాత్రలిచ్చిన ఆర్ఎంపీ కూడా.. ఇది మాత్రలతో తగ్గేటట్టుగా లేదని, టౌనుకు తీసుకుపోయి ఆసుపత్రిలో చూపించమని చెప్పాడు.

'ఆసుపత్రికి తోడ్కబొవ్వాలంటే రొండు మూడు నూర్లన్నా గావాల. ఏమన్నా పరీచ్చలు రాపిస్చే అయి జేపియ్యడానికి ఇంగొక యెయ్యి రూపాలన్నా గావాల. యాడుంది అంత లెక్క? యాన్నించి దేవాల?' అని దిగులుపడుతూ కూర్చుంది.

ఎవరిని చేబదులు అడగబోయినా.. అందరూ లేదనే అన్నారు. వాళ్లు, వీళ్లు అని లేకుండా అందరినీ అడిగి చూసింది. ఎవరి దగ్గరా సమయానికి డబ్బు లేదు. ఒక్క రూపాయి అప్పు పుట్టలేదు.

'ఏమి ఉపద్రమొచ్చిందర్రా! ఎవరికాడా లెక్క లేకండా పొయ్యేదాన్కి? నాకిచ్చేదాన్కే ఎవురికి సేతులాడ్డం లేదే?' అని నడివీధిలో అంగలార్చింది.

ఆమె మాటలిన్న ఒకాయన..

'మ్మోవ్.. ఎంకటమ్మా! నిజంగానే దేశంలో ఉపద్రమే వొచ్చినట్టుండాది రొండ్రోజుల నుంచీ. ఎయ్యి, ఐదు నూర్ల నోట్లు ఎవురికాడ ఉన్నా చెల్లవని, అయ్యన్నీ దెచ్చి బ్యాంకీల్లో ఇచ్చి కొత్తనోట్లు దెచ్చుకోమనీ ఆర్డరేసింది గవుర్మెంటు. ఇంగ మిగిలిండేది చిల్లర నోట్లే. ఎవురికి వాళ్లు పెద్దనోట్లు బ్యాంకీల్లో కట్టేసి, చిన్ననోట్లు తెచ్చుకుండేదాంట్లో తలమునకలై ఉండారు. నీకిచ్చేదానికి చేతుల్రాగ్గాదు ఇయ్యింది. ఎవురికాడా లెక్క లేకనే. ఎవురికి వాళ్లు వాళ్ల దగ్గరుండే చిన్ననోట్లు వాళ్ల అవసరాల కోసం పెట్టుకోనుండారు. ఉండే ఆ రోంత లెక్కా నీకిస్చే రేప్పొద్దున వాళ్ల అవసరాలకెట్టా?' అని చెప్పి వెళ్లిపోయాడు.

అది ఆమెకు అర్థం కాలేదు. 'ఒకేరోజులో లెక్క చెల్లకుండా పొయ్యేదేందబ్బా? యాడా ఇన్లేదే!' అని విచిత్రపడుతూ నిలబడిపోయింది.

ప్రతి కరెన్సీ నోటూ 'గ్యారంటీడ్ బై ద గవర్నమెంట్ ఆఫ్ ఇండియా' అని, ఆ గ్యారంటీని ఆ ప్రభుత్వమే తూచ్ అనేసి వెనక్కి తీసేసుకున్నదని ఆమెకు తెలియదు. ప్రస్తుతం ఆమె ఆలోచనల్లా ఒకటే..

'అమ్మిని ఆసుపత్రిలో జూపియ్యాలంటే ఎయ్యి, పదైదు నూర్లన్నా గావాల. అంత లెక్క నా కాడ యాడుంది? ఏ బ్యాంకీలో అన్నా దొంగతనానికి బోవాల్సిందే!'.. మనసులో మాటనే బయటికి అనేసింది.

'దొంగతనానికెందుకూ? బ్యాంకీలో నీ అకౌంటే ఉంది గదా?'.. ఆ దారిన పోతూ, ఆమె

మాటలు విన్న జన్మభూమి కమిటీ మెంబరు గుర్తుచేశాడు.

అప్పుడు గుర్తొచ్చింది రెండేండ్ల కింద తన పేరుమీద బ్యాంకులో అకౌంటు తెరిచిన సంగతి. దానిపేరు 'జన్ ధన్' అకౌంట్.

* * *

'నాకెందుకు బ్యాంకకౌంటు?'.. ఊర్లో బ్యాంక్ అకౌంట్లు లేనోళ్లందరికీ అకౌంట్లు తెరిపించాలని వచ్చిన జన్మభూమి కార్యకర్తను అడిగింది.

'ఇప్పుడు నువ్వు ఉపాధి హామీ పనికి పోయినప్పుడు అదేరోజు నీకు లెక్క ముట్టలేదనుకో.. నువ్వు రోజూ పని మానుకొని కోఆర్డినేటరు చుట్టూ ఎప్పుడిస్తాడోనని తిరగనవసరం ల్యాకండా జీతం పడినట్టే నేరుగా నీ అకౌంట్లో వచ్చి పడతాది'.

'ఆ నా బట్ట ఏసిందీ లేన్దీ నాకెట్టా తెలుస్తాది?'.

'నీ ఫోనుకు మెసేజొస్తాది. ఎవురన్నా నీ అకౌంట్లో లెక్క ఏసినా తీసినా.. టింగు టింగుమని బెల్లు కొడ్తాది'.

'అది రోజుకు ముప్పైసార్లు ఒకటే మొఖాన కొడ్తానే ఉంటాది. ఎన్నిసార్లని జూసుకునేది?'.

'చూసుకోవాల. 'డీఎన్డీ' అని ఒకటుందిలే! అది బెట్టుకుంటే అన్ని ఫోన్లూ, మెసేజీలూ రావు. నీగ్గావాలంటే నేను సెట్ జేసిస్తా'.

'ముందాపని జేసిబెట్టు నాయనా! నీకు పున్నెముంటాది'.

'సరే.. సేస్తాలేగానీ నీ ఆధార్ కార్డు తీసకరా'.

'అద్దేనికి?'.

'రామాన్నెమంతా యిని నీ యట్టాట్దే అడిగిందంట.. రామునికి సీతేమైతాదని. ఇంగెందుకు నేనొచ్చింది? బ్యాంకీలో నీకు అకౌంటు తెరిసేదానికి'.

'నాకు రావాల్సిన లెక్కంతా బొయ్యి బ్యాంకీలో గూచ్చుంటే నేను దెచ్చుకుండేదెట్టా?'.

'నీకు అకౌంటుతో బాటే ఏటీఎం కార్డు గుడకా ఇస్తారు. అదుంటే నువ్వు బ్యాంకీకి బొవ్వాల్సిన పన్లా. టౌన్లో ఈదికొకటుండాయి ఏటీఎం మిసన్లు. అయ్యి ఇరవై నాలుగ్గంటలూ తెరిసే ఉంటాయి. నీకెప్పుడు గావాలంటే అప్పుడు బొయ్యి ఆ కార్డు ఆ మిసన్లో బెట్టి.. నాకింత లెక్కగావాలని బటన్లు వొత్తుతే నోట్లు మిసన్లోనుంచి వస్తాయి'.

'యా బటనొత్తాలో నాకెట్ట దెలుస్తాది?'.

'ఒక్కసారి జూస్తే అన్నీ నీకే దెలుస్తాయి. ఒకటి మాత్రం బాగ గుర్తుబెట్టుకో! ఎవురికే గానీ.. ఆకిరికి ఆ బ్యాంకీవోడే అడిగినా గానీ నీ కార్డు మీదుండే నంబర్లు గానీ, నీకు మెసేజ్లో వొచ్చే నంబర్లు గానీ చెప్పనేవొద్దు'.

'ఆ నంబర్లేమన్నా బాగ్గెమా? సెప్తే ఏమైతాది?'.

'నీ అకౌంట్లో ఉండే లెక్క మొత్తం ఊడ్సుకోని బోతాది'.

'ఓయమ్మా! ఈ అకౌంటు జేసియ్యమని నేన్నిన్ను అడిగినానా? ఇప్పుడు నాకెందుకియ్యన్నీ?'.

'కేంద్రంలో ప్రభుత్వం మారిపోయిండ్లా? ఇంతకు ముందున్నె కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి మనిషికీ ఆధార్ కార్డ్ ఇచ్చింటే తీసుకున్నారా లేదా? పనికి ఆహార పథకం అని రోజు కూలీకి ఉపాధి హామీ పనులు ఇస్చే సేస్చుండారా లేదా? ఇప్పుడు మోడీ ప్రభుత్వమొచ్చింది. ఇన్నేండ్లూ పెద్దపెద్దోళ్లు విదేశాల్లో దాసిపెట్టుకోనుండే లప్పలన్నీ తీసుకచ్చి అందరికీ పంచుతారంట. తర్వాత ఎవరికీ పనికి ఆహార పథకాలు పెట్టాల్సిన పన్లే!'.

'అయ్యన్నీ అయ్యే పనులు గావులేగానీ.. ఇదో ఆదార్ కారటు'.

'ఇదో ఈ ఫారమ్మింద సంతకంబెట్టు!'.

'ఎంకటమ్మ' అని సంతకాలు పెట్టించి, తీసుకుపోయి రెండ్రోజుల తర్వాత పాసుబుక్కు, ఏటీఎం కార్డు తెచ్చి ఇచ్చాడు.

'నీకు రోజూ ఏదో ఒకదానికి లెక్క అవసరమైతానే ఉంటాది. కానీ, ఎప్పుడో ఒకసారి మాత్రం పానం మిందికొస్చాది. అది అత్యవసరం. అప్పుడు వాడుకోవడానికి నీ చేతిలో లెక్కలేకుండా పోయే పరిస్థితి తెచ్చుకోకుండా అప్పుడప్పుడూ రోంత లెక్క ఈ అకౌంట్లో ఏసుకుంటా ఉండు. అది అత్యవసరమైన పరిస్తితుల్లో నీకు అక్కరకొస్చాది'.. అని అతడు చెప్పిన మాట వంటబట్టించుకుని, మొదట్లో చేతికి డబ్బు వచ్చినప్పుడల్లా ఎంత వీలైతే అంత అతనికే ఇచ్చి.. అకౌంట్లో వెయ్యమని చెప్పింది. ఆ అకౌంట్‌లో దాదాపు రూ.1,500/- జమజేసి పెట్టింది. తర్వాత మెల్లగా దాని గురించి మర్చిపోయింది.

* * *

'ఈ రొండేండ్లల్లో దాని మిందొచ్చిన వొడ్డీ దగ్గర దగ్గర నూర్రూపాయలైనా అయ్యింటాది. రేబ్బొయ్యి అద్దెచ్చుకోవాల!' అనుకుంది.

అప్పుడట్లా అనుకుని ధైర్యం తెచ్చుకుంది గానీ, మరుసటిరోజు టౌనుకు పోయి అక్కడి పరిస్థితి చూసేసరికి ఆమెకు దిమ్మ తిరిగిపోయింది.

బస్టాండుకు దగ్గరగా ఉండి, తనకు బాగా తెలిసిన ఏటీఎం దగ్గరికి పోయి చూసింది. ఎవ్వరూ లేరు. కాసేపు అక్కడే నిలబడింది. ఈలోపు ఆ దారెంట ఎవరో పోతూ ఉంటే దగ్గరికి పోయి పిలిచింది.

'అన్నా! అకౌంటులో నుంచి లెక్క దీసుకోవాల'.. ఆమె చెప్పేది ఇంకా పూర్తికాక ముందే అతను సమాధానం ఇచ్చాడు..

'ఏ ఏటీఎంలో గానీ లెక్క లేదు మ్మో! దాని గురించే మూడ్రోజుల్నించి దేశమంతా అగ్గయితా ఉంది. నీకు తెలియదా?'.

'ఏందీ? ఈ మిసన్లలో గుడకా లెక్క లేదా? అయితే ఇప్పుడెట్ట జెయ్యాలన్నా? లెక్క బ్యాంకీకి బొయ్యి దెచ్చుకోవాల్నా?'..

ఒకవేళ అవునంటే బ్యాంకులో ఎట్లా తెచ్చుకోవాలో తెలియకపోయినా అయోమయంగా అడిగింది. అతను విసుక్కోకుండా పెద్దనోట్ల రద్దు గురించి వివరంగా చెప్పాడు.

అక్కడినుంచి మొదలుపెట్టి టౌన్లో ఉండే ఏటీఎం సెంటర్లన్నీ చుట్టబెడుతూ కాలుగాలిన

పిల్లిలా రోజంతా తిరుగుతూనే ఉంది. యర్రముక్కపల్లెలో ఎక్కడో ఏటీఎంలో డబ్బు నింపారని విని ఆపసోపాలు పడుతూ అక్కడికి పరుగెత్తింది. అక్కడ చేంతాడంత క్యూ ఉంది. ఇద్దరు ముగ్గురి వంతు కాగానే ఏటీఎం ఖాళీ. ఉసూరుమని కూలబడగానే ఇంకెక్కడో ఏటీఎంలో డబ్బు నింపుతున్నారని విని అక్కడికి పరుగు.

ఎండాకాలంలో నీళ్లకోసం పడిన కష్టాలు గుర్తొచ్చినాయి.

ఊర్లోని బావులు, చేతి పంపులన్నీ ఎండిపోయిన కాలంలోనే వ్యవసాయ భూముల్లో సాగునీళ్లకు కరెంటు మోటార్ల వాడకం మొదలైంది. అప్పట్లో మోటార్లకు కరెంటు రాగానే పొలాలకు నీళ్లకోసం మోటారు వేసి ఉంటారు కాబట్టి.. ఊరివాళ్లంతా పొలోమని బిందెలు చేతబట్టుకుని పడుతూ లేస్తూ కిలోమీటరు దూరం పరుగెత్తి, ఉరుకులు పరుగుల మీద నీళ్లు తెచ్చుకునేవాళ్లు. ఒక మోటార్ ఆడకపోతే అక్కడికి దగ్గర్లో ఉండే ఇంకొక మోటర్ దగ్గరికి, అక్కడా లేదంటే మరొక మోటార్ దగ్గరికి.. నడుస్తున్న మోటార్ ఆఫ్ కాకముందే చేరుకోవాలని బిందెలు పట్టుకుని పోటీల మీద పరుగెత్తేవాళ్లు.

ఇప్పుడు తన లెక్క (డబ్బు) తను తీసుకోవడానికి ఊరంతా పరుగులు తియ్యాల్సి రావడంతో ఏడుపొచ్చింది. మూడు రోజులు అదే విధంగా గడిచింది. రోజురోజుకూ గంటగంటకూ ధైర్యం దిగజారిపోతూ ఉంది. నాలుగో రోజు.. ఏ దేవుడో తన మొర ఆలకించినట్లు నగదు నిల్వలున్న ఏటీఎంలోకి ప్రవేశం లభించింది. దేవుడిని మొక్కుకుని ఏటీఎం కార్డు బయటికి తీసి తన వెనకున్న అతనికి ఇచ్చి..

'ఇది ఎట్ట వాడాల్నో నాకు తెలవదు! ఎప్పుడూ వాడిన్దాన్ని గాదు. ఇప్పుడంటే పానమ్మిందికొచ్చి ఇట్టొచ్చినా. రోంత లెక్క తీసిస్చావా సారూ?' అని అడిగింది.

అతను పిన్ అడిగి, ఏటీఎం కార్డును స్లాట్‌లో పెట్టాడు.

పిన్ వెరిఫికేషన్ తర్వాత..

'ఎంత గావాల?' అని అడిగాడు.

'పదైదు నూర్లు!' అని చెప్పింది. అతను వింతగా చూశాడు. మాట్లాడకుండా 1500 ఎంటర్ చెయ్యగానే, స్క్రీన్ మీద ఏదో మెసేజ్ కనిపించింది. ఇంగ్లీషు కాబట్టి.. అదేమిటో ఆమెకు అర్థం కాలేదు.

అతను వివరించాడు..

'అమ్మా! ఇప్పుడు ఐదు నూర్ల నోట్లు, వెయ్యి రూపాయల నోట్లు లేవుగదా? నూర్రూపాయల నోట్లకు దేశంలో కొరతొచ్చింది. ఇందులో రెండువేల నోట్లే ఉండాయి. కాబట్టి రెండువేల రూపాయలకు తక్కువైతే రావు'..

నాలుగు రోజులనుంచి ఎదురవుతున్న పరిణామాల వల్ల మెదడు మొద్దుబారిపోయి, బాహ్యస్మృతి కోల్పోయినదానిలా ఆమె రెండువేల రూపాయలే తియ్యమని చెప్పింది. అతను అమె చెప్పినట్లే 2000 ఎంటర్ చేసి..

'ఇన్‌సఫీషియంట్ బ్యాలన్స్!' అని చదివాడు.

'ఏమ్మా! నీ అకౌంట్లో ఎంతుంది?' అని అడిగాడు.

'ఉంటే ఒక పద్దైదు.. పదారు నూర్లుంటాది నాయనా!' అని చెప్పింది.

'ఇప్పుడు ఏటీఎంలో రెండువేల కంటే తక్కువ తీసుకోవడానికి లేదు. నీ అకౌంట్లోనేమో అంత డబ్బు లేదు. బ్యాంకుకు పోయి అడిగి చూడు' అని సలహా ఇచ్చాడు.

బ్యాంకుకు పోయి చూస్తే అదొక పెద్ద తిరునాళ్లలా ఉంది. రద్దయిన నోట్లు డిపాజిట్ చెయ్యడానికి కౌంటర్ల చుట్టూ గోలగోలగా ఫోన్లలోనూ, ఎదుటి మనుషులతోనూ మాట్లాడుతూ.. ఇసుకేస్తే రాలనట్లు కిక్కిరిసిపోయిన జనం. అక్కడ ఒకరిద్దరిని అడగబోయినా పట్టించుకునే స్థితిలో ఎవరూ లేరు. ఇంకెవరిని ఏమడగాలో తెలియక తిరిగి వెనక్కి వచ్చేసింది.

దిగులుగా ఇల్లు చేరుకుంది. మగతగా పడుకుని ఉన్న కూతురికి, ఆమె వచ్చినట్లయినా తెలుసో లేదో అర్థం కావడం లేదు. బలవంతంగా లేపి కూర్చోబెట్టి గంజి తాగించింది. కూతురి పరిస్థితి చూస్తూంటే దిగులుగా ఉంది. ఇంకా ఆలస్యం చేస్తే ఏమవుతుందోనని భయం కూడా వేసింది.

మరుసటిరోజు పొద్దున్నే ఏమైతే అదైందని కూతుర్ని వెంటబెట్టుకుని ఆసుపత్రికి బయల్దేరింది. అప్పటికి జ్వరం మొదలై వారం రోజులు దాటింది. తనవంతు రాగానే కన్సల్టేషన్ రూములో డాక్టర్‌కు రెండు చేతులెత్తి నమస్కారం చేసి.. పరిస్థితి వివరించింది. డాక్టర్ సానుభూతితో విన్నాడు.

'నగదు లేకపోతే పోయింది.. పేటీఎం ఉందా?' అని అడిగాడు.

'ఏటీఎం కారటుంది'.

'ఏటీఎం గాదు. పేటీఎం!'.

'అదేందో తెల్దు సారూ. నా కాడ ఏటీఎం కారటు, ఆదార్ కారటు ఇయ్యే ఉండాయి'.

'పేటీఎం అనేది కార్డు గాదు. ఫోన్లో ఉంటాది. అదుంటే అకౌంట్లో నుంచి ఎవురికైనా లెక్క పంపియ్యచ్చు'.

'అదేందో కూడా నాకు దెలియదు. ఇప్పుడు ఏటీఎంలో ఇరక్కపోయినట్లు దాంట్లో కూడా లెక్క ఇరక్కపోతే?'. డాక్టరు నవ్వాడు. 'అది నా పోన్లో బెట్టను ఐతాదా?'.. అంటూ ఫోన్ తీసి చూపించింది. 'నీది స్మార్ట్‌ఫోన్ కాదే? దీంట్లో పేటీఎం కుదరదు. ఏం చేద్దాం..? సరే! నా ఫీజు సంగతి తర్వాత చూసుకోవచ్చు. పాపను బెంచి మీద పడుకోబెట్టు' అని పరీక్ష చేసి చూశాడు. టైఫాయిడ్, మరికొన్ని రోగనిర్ధారణ రక్త పరీక్షలు రాసిచ్చాడు.

పరీక్షలు రాసిచ్చిన చీటీ తీసుకుని, కూతుర్ని ఎత్తుకుని ల్యాబ్‌కు బయల్దేరింది. ల్యాబ్ కౌంటర్లోని వ్యక్తికి చీటీ అందిస్తూ..

'డాక్టరు ఈ పరీచ్చలు రాసిచ్చినాడు. గానీ నా డబ్బంతా బ్యాంకీలోనే ఉండాది. బిల్లెట్లా కట్టాలో తెల్డం లేదు' అని చెప్పింది.

వాళ్ల దగ్గర స్వైపింగ్ మెషీన్ లేదు. వాళ్ల దగ్గరే కాదు, ఒక మాదిరి పేరున్న ఆసుపత్రుల్లో, ల్యాబుల్లో, ఇతర షాపుల్లో ఎక్కడా ఇంకా కార్డు పేమెంట్లకు మారలేదు.

బిల్లు కట్టకపోతే టెస్టులు చెయ్యడం కుదరదని చెప్పారు. వాళ్లకు సాయపడాలనే ఉన్నా.. టెస్టులకయ్యే ఖర్చు చేతినుంచి పెట్టుకోవడానికి సిద్ధంగా లేరు. అదైనా పదో ఇరవయ్యో కాదు కాబట్టి. మళ్లా ఈసురోమని ఆసుపత్రికి తిరుగుముఖం పట్టింది.

'ఈ పరీచ్చలు నా పానం మిందికొచ్చినాయి సారూ! అయ్యి లేకుండా మాత్తర్లు, మందులు రాసియ్యలేవా?' అని దీనంగా అడిగింది.

'టెస్టుల్లేకుండా మందులివ్వగలిగితే ఏ డాక్టరైనా ఈ ఖరీదైన పరీక్షలెందుకు రాయిస్తారమ్మా? ఈ జ్వరం ఎందుకొచ్చిందో, మామూలు పారాసిటమాల్ మాత్రలకు ఎందుకు తగ్గడం లేదో తెలుసుకుంటే తప్ప సరైన మందు ఇవ్వలేం. ఏం జ్వరమో కేవలం లక్షణాలను బట్టి కనుక్కోలేనప్పుడే పరీక్షలు రాయిస్తాం. అవసరమైన మందుకు బదులు వేరే మందులు వాడటమంటే.. ఏ ఊరికి పోతుందో తెలియని బస్సెక్కి మీ ఊరికి పోవాలనుకున్నట్లే! అన్ని మందులూ ఇచ్చి చూద్దామంటే.. అన్ని మందులు ఒకేసారి వాడితే శరీరం తట్టుకోలేదు. వాటిలో కొన్ని మందులు రోగం లేనప్పుడు వాడటం ప్రమాదం కూడా!' అని చెప్పాడు డాక్టర్.

ఇంకేమనాలో తెలియక చివరిసారి గట్టిగా నిట్టూర్చి.. అప్పటికే కొనప్రాణంతో ఈడిగిలపడి ఉన్న కూతుర్ని భుజాన వేసుకుని ఊరి దారిపట్టింది. కూతురి ఒళ్లు మెల్లగా చల్లబడటం.. ఇల్లు చేరేవరకూ ఆమె గమనించనే లేదు.

* * *

**త్రివిక్రమ్ స్వస్థలం కడప జిల్లా పడిగెలపల్లె. ఎంసీఏ చేసి, సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడ్డారు. ఇంటర్‌నెట్‌లో యూనికోడ్ తెలుగువ్యాప్తికి విశేషంగా కృషిచేసిన తొలితరం తెలుగు బ్లాగర్లలో ఈయన ఒకరు. అదే లక్ష్యంతో ఏర్పడిన 'ఈ–తెలుగు' సంస్థకు వ్యవస్థాపక ఉపాధ్యక్షుడిగా, తెలుగు వికీపీడియా నిర్వాహకుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 'పొద్దు' తెలుగు వెబ్ మాగజైన్‌కు వ్యవస్థాపక సంపాదకుడిగా, 'ఈమాట' సహ సంపాదకుడిగా వ్యవహరించారు. ఇంటర్‌నెట్‌లో సొంత పేరుతోనూ, 'సుగాత్రి' కలం పేరుతోనూ విభిన్న అంశాల గురించి విస్తృతంగా వ్యాసాలు రాశారు. కథకుడిగా 'అద్దంలో మూట' కథే.. మొదటిది. అంతకుముందు చందమామలో శాస్త్ర జ్ఞానం – లోక జ్ఞానం సింగిల్ పేజీ కథ, చతురలో మినీ కథల రూపంలో కొన్ని హాస్య సన్నివేశాలు ప్రచురితమయ్యాయి. పెద్దనోట్ల రద్దు సమయంలో జరిగిన ఒక యథార్థ సంఘటనను స్ఫూర్తిగా తీసుకొని 'అద్దంలో మూట' కథను రాశారు.**

# వ్యత్యాసం




**నామని సుజనాదేవి,**

**77993 05575**


'మీరెన్నన్నా అనండి! కానీ, పాపం నోరులేని ఆ జీవాలను ఎవరైనా ఏమైనా అంటే మాత్రం నేను ఊరుకోను! అది మామయ్యే కానీ.. మీరే కానీ!'.

'అదికాదే! మొన్ననే కదా అమ్మ చనిపోయింది. అమ్మతో నాన్నకు ఎంతలేదన్నా యాభై ఏళ్ల అనుబంధం. అలాంటిది.. అంత బాధలో ఉన్న ఆయన మనసు బాలేక ఏమైనా అన్నా నువ్వు ఊర్కో.. ఏమీ అనకు'.

'అరె! నేనేమన్నానని?.. 'మీరు మమ్మల్ని ఏమైనా అనండి మామయ్యగారు! కానీ, నోరులేని ఈ మూగజీవాలను మాత్రం ఏమీ అనకండి' అన్నాను. అంతే కదా! అయినా నాకు మాత్రం అత్తయ్య లేని ఆయన ఎంతో బాధలో ఉన్నాడని తెలీదా ఏం? అందుకే కదా.. అత్తయ్య కార్యక్రమాలన్నీ కాగానే.. గుళ్లో, వాళ్ల అత్తగారింట్లో నిద్ర అయ్యాక, ముందుగా మనమే మన ఇంటికి తీసుకొద్దామని అన్నది'.

'నిజమే మధూ! నేను కాదన్నానా? ఆయన మనసు చాలా సున్నితం. మొదటినుంచీ మా అమ్మకూడా ఆయన్ని అలాగే చూసుకుంది. ఏదో ఆయన మన టామీని పట్టుకుని.. 'ఛీ! వెధవ సంత' అన్నాడే అనుకో.. దానికి వెంటనే ఆయన మొహంపై కొట్టినట్లు అలా.. 'మామయ్యా! నన్నేమైనా అనండి కానీ, వాటిని ఏమైనా అంటే నేను ఊరుకోను' అంటూ అల్టిమేటం ఇవ్వాలా?.. 'ఏదో నోరులేని జంతువు

కదా మామయ్యా! ఏదో ఇంత పడేసినా జీవితాంతం విశ్వాసంగా ఉంటుంది' అంటూ సున్నితంగా మాట్లాడితే అయిపోయేది కదా అనీ!'.

'ఛీ! ఛీ! వెధవ బతుకు! ఈ ఇంట్లో ఎంత చేసినా ఇంతే! ఆయన బాధలో ఉన్నాడని నేనెత మంచిగా చూసుకుంటున్నాను. అదేం కనిపించదు మీకు. నేను ఒక్కమాట కొంచెం కటువుగా అన్నదే కనిపిస్తుంది. పొద్దున లేవగానే ఎప్పటిలా హడావుడి అయినా.. గుర్తుపెట్టుకుని ఆయనకు కాఫీ కలుపుతున్నానా? మళ్లీ వేడివేడిగా టిఫిన్ చేసి.. 'తినండి మామయ్య గారూ!' అంటున్నానా? 'మీకు ఏ కూరలు ఇష్టమో చెప్పండి.. అవే వండుతాను' అంటూ అడుగుతున్నానా? ఇలా ఎప్పటికీ ఆయన బాగోగులు చూస్తూనే ఉన్నాను కదా! ఏ కోడలైనా ఇంతకన్నా బాగా చేస్తుందా?'.. ముక్కు చీదింది మాధవి.

'అబ్బా! నీకో నమస్కారం తల్లీ! కుళాయి కట్టేయి. పొరపాటున అన్నాలే కానీ. ఇక ఊర్కో!'.

'అదిగో! ఎంత వెటకారమో! అప్పటికీ అందరూ మంచివాళ్లు.. నేనే ఏదో రాద్ధాంతం చేస్తున్నట్లు!'.. ఇంకా ఏదో అనబోతుంటే, అప్పటికే వాకింగ్ నుంచి ఇంట్లో అడుగుపెట్టి, అంతా విన్న సీతారామయ్య.. ఆ వివాదం తప్పించడానికి, దగ్గుతూ తన ఉనికి తెలియజేస్తూ..

'ఏంట్రా! ఏంటీ గొడవ?' అన్నాడు.

'అబ్బే! ఏంలేదు నాన్నా! మన టామీకి ఆరోగ్యం బాలేదట. 'ఈవేళ సాయంత్రం త్వరగా రండి. డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లాలి. అలానే రేష్మీని కూడా చెకప్ చేయించినట్లు ఉంటుంది' అంటున్నది మధు'.

టామీ, రేష్మీ.. రెండూ వాళ్లు పెంచుకునే కుక్కలు.

'కాసిన్ని మంచినీళ్లు వేడిచేసి ఇవ్వరా నాన్నా!' దగ్గుతూ అన్నాడు సీతారామయ్య.

'ఏమయ్యింది నాన్నా! దగ్గుతున్నారు?'.

'నిన్నటినుంచి కొంచెం బాలేదురా. చల్లగాలిలో నడిచినందుకేమో జలుబు, దగ్గు'.

'అయ్యో! అలాగా నాన్నా! కాస్తంత ఎండ వచ్చాక వాకింగ్‌కు వెళ్లు. చెవుల చుట్టూ మఫ్లర్ చుట్టుకో! ఆగు నా దగ్గర ట్యాబ్లెట్స్ ఉన్నాయి. ఇవి వేసుకుని టీ తాగు నాన్నా!'.

'బీపీ ట్యాబ్లెట్స్ అయిపోయాయి రా! అలాగే జండూబామ్ లేకపొతే రోజు గడవదు'.

'అలాగే లే నాన్నా! ఈవేళ ఆఫీసు నుంచి వచ్చేప్పుడు తెస్తాలే! మరి వెళ్లొస్తాను'.

'ఏమండీ! అలాగే మన టామీ బిస్కెట్లు.. దాని టానిక్ అయిపోయింది. వచ్చేప్పుడు తెండి!'.

'అలాగే!'.. అంటూ వెళ్లిపోయాడు రామకృష్ణ.

సాయంత్రం వస్తూనే..

'త్వరగా టామీని, రేష్మీని తీసుకుని వచ్చేయి మధూ! లేటయితే డాక్టర్ వెళ్లిపోతాడు'.. అంటూ తొందరపెట్టగానే, ఉన్నపళాన టామీతో కారెక్కేసింది మాధవి. వచ్చేసరికి చాలా

పొద్దుపోయింది.

ఆ తెల్లవారి రెండో కొడుకు రాఘవ వచ్చి రమ్మనగానే.. ఆయనకున్న ఆస్తి అయిన బట్టలు, మందుగోళీలు అన్నీ సర్దుకుని రాఘవతో బయల్దేరాడు సీతారామయ్య.

* * *

'భౌ! భౌ!'..

గేటు తెరవడంతోనే గయ్యిమంటూ మీదికొచ్చిన కుక్కను చూసేసరికి.. సీతారామయ్య పై ప్రాణాలు పైనే పోయాయి. వెంటనే భయంతో రాఘవ వెనక్కి వచ్చేశాడు.

'హే స్వీటీ! యూ నాటీ! గో ఇన్‌సైడ్.. అదేమనదు నాన్నా!'.. నవ్వుతూ అంటూ, తండ్రి చేయి పట్టుకుని లోపలికి నడిపించుకెళ్లాడు. కోడలు పలకరించి మంచినీళ్లు అందించింది. తాగుతూ ఉంటే.. ఎదురుగా కనిపించిన రెండు అల్మారాలలో ఉన్న మందులను చూసి ఆశ్చర్యపోయాడు.

'ఏమిట్రా ఇవి! ఇన్ని మందులు ఏంటి?' అడిగాడు కొడుకును.

'అయ్యో నాన్నా! కంగారు పడకు. అవి మావికావు. మన స్వీటీవి. ఇటీవల దానికి ఆరోగ్యం బాగా ఖరాబైందని డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లాం. అప్పుడు కొన్నవి. అంతకుముందువి. దాని ఆహారం, బిస్కెట్లు వగైరా అన్నమాట! ఆ డబ్బాలపై రాసి ఉంది చదువు' అన్నాడు.

'కళ్లద్దాలు అంతగా అగుపడటం లేదురా! అక్కడ అన్నయ్యతో అన్నా గానీ.. పాపం వాడికి తీరలేదు'.

'ఇక్కడ ఒకసారి వెళ్దాంలే నాన్నా!'.

'షుగర్, బీపీకూడా చెక్ చేయించుకుని చాలా రోజులయ్యింది రా!'.

'వీలు చూసుకుని ఒకరోజు వెళ్దాంలే నాన్నా!'.. అంటూ హడావుడిగా బయటికి వెళ్లిపోయాడు.

'మామయ్యా! స్వీటీకి ఇవ్వాళ ఆలస్యం అయిందని ఒకటే గునుస్తుంది. పిచ్చిముండ! దానికి కొన్ని పాలు, బిస్కెట్స్ వేసి.. మీకు టిఫిన్ తెస్తాను. టీవీ చూస్తుండండి మామయ్యా!..' అంటూ లోనికెళ్లింది కోడలు శ్రావణి.

ఉదయం తొమ్మిదే అయినా.. లోపల ఆకలి నకనకలాడుతున్నది. అదే తన స్వరాజ్యం ఉంటేనా!

'అసలే షుగర్! ఇంతసేపు ఎలా ఉంటారు?' అంటూ ముందు ఏదో ఒకటి తినడానికి ఇస్తుంది. ఆమెకు పూజలో ఆలస్యమైనా తనే వంట గదిలోకి వెళ్లేవాడు. తనకోసం ఇలా అర్జెంట్‌గా పనికొస్తాయని, ఎక్కువ నూనెలేని వస్తువులు, అటుకుల చుడువా, పేలాలు, మొలకలు లాంటివేవో తనకోసం సిద్ధంగా ఉంచేది. ఇప్పుడు అలా వంటింట్లోకి చనువుగా వెళ్లలేడు. అలా అని.. నోరు తెరిచి చనువుగా ఆకలంటూ అడగనూ లేడు.

తన భార్యను తలుచుకొంటూ.. ఉస్సురని నిట్టూర్చాడు.

అరగంటలో ఉప్మా తీసుకొచ్చింది శ్రావణి. అది చూడగానే నీరసం ముంచుకొచ్చింది ఆయనకు. నిజానికి ఆయనకు మొదటి నుంచీ ఉప్మా అంటే అస్సలు ఇష్టం ఉండదు. భార్యకు ఆయన ఇష్టాయిష్టాలు తెలుసు కాబట్టి.. ఆయనకు ఎప్పుడూ ఉప్మా పెట్టేది కాదు. కానీ, ఇప్పుడు ఆమెలేని తాను ఏకాకి అయ్యాడు. ఆత్మీయులందరూ ఉన్నా.. ఎవరూ లేని ఒంటరిలా మిగిలాడు. భార్య గుర్తుకురాగానే కళ్లు చెమర్చాయి ఆయనకు.

ఇక్కడ రాఘవ, శ్రావణి ఇద్దరూ బిజీగానే ఉంటారు. ఇద్దరు పిల్లలు. వాళ్లూ.. పెద్దబ్బాయి పిల్లల్లాగే పొద్దున స్కూల్, సాయంత్రం ట్యూషన్, సంగీతం క్లాసులతో బిజీగానే ఉంటారు. ఖాళీగా ఉండేది సీతారామయ్య మాత్రమే. పొద్దున లేవగానే రాఘవ కుక్కను పట్టుకుని అలా కాలనీలో దాని కాలకృత్యాలకు తీసుకెళ్తాడు. ఒక్కోసారి అరగంట పైనే అవుతుంది. రాగానే ఫోన్లు అటెండ్ అవుతూ, ఆఫీసుకు తయారయ్యే బిజీలో ఉంటాడు. కోడలు శ్రావణి పనిమనిషికి పనులు పురమాయిస్తూ, వంట చేస్తూ.. బిజీగా ఉంటుంది.

పొద్దునే అలా పెరట్లోకెళ్లి మొక్కలను పరామర్శిస్తూ, అవి తలలూపుతూ పలికే స్వాగతాన్ని ఆస్వాదిస్తూ, అర్ధాంగితో చెప్పాలని అనుకున్నవన్నీ వాటితో పంచుకుంటూ.. కాలం గడపడం అలవాటు చేసుకున్నాడు సీతారామయ్య. కళ్లద్దాలు ఇంకా మార్చకపోవడంతో తనకు ఇష్టమైన.. 'చదవడం' అనే వ్యాసంగాన్ని కొనసాగించలేక పోతున్నాడు. పొద్దున మొక్కలతో ముచ్చట్లు అయిపోయాక.. స్నానం, పూజ ముగించుకునేసరికి కాఫీ, టిఫిన్ సిద్ధంగా ఉంటుంది.

ఆయనకు ముందునుంచే కుక్కలంటే చాలా భయం. చాలా ఏళ్లకింద ఒకసారి కుక్క కరిస్తే.. ఆయనపడ్డ నరకం అంతా ఇంతా కాదు. ఆ ఇంజక్షన్ల బాధ ఒకెత్తయితే.. పథ్యం అంటూ కడుపు మాడ్చుకోవడం, పొరపాటున ఏ రేబిస్ వ్యాధో వస్తుందని భయపడి చావడం.. ఇదంతా మరో ఎత్తు. ఆయనెంత భయపడతాడో అందుకు తగ్గట్లు కొడుకులిద్దరి ఇళ్లలో కుక్కలు ఉండటం ఆయనకింకా చిరాకు తెప్పించింది. అందుకే చిన్నవాడు రమణ వచ్చి, తన ఇంటికి తీసుకెళ్తానంటే ఆనందంగా బయల్దేరాడు.

* * *

ఇంటికి వెళ్లిన ఆయనను కోడలు, మనవళ్లు ఆప్యాయంగా పలకరించారు. అయితే ఒకరోజు పొద్దునే మనవడు అన్న మాటలు.. ఆయనకు పక్కన బాంబు పడ్డట్లు ఉలిక్కిపడేలా చేశాయి. ఇంతకీ మనవడు హర్ష ఏమన్నాడంటే..

'నాన్నా! మరే.. పెద్దనాన్నల అందరి ఇళ్లలో ఎంచక్కా మంచి కుక్కలు ఉన్నాయి. మా ఫ్రెండ్స్ ఇళ్లలో కూడా ఉన్నాయి. మనంకూడా కుక్కను పెంచుకుందాం నాన్నా!' అని.

'అవునండీ! ఇప్పుడు అది మంచి స్టేటస్ సింబల్ కూడా! అంతేనా! ఇవ్వాళ రేపు దొంగల భయం కూడా ఉంది కదా! అది ఇంట్లో ఉంటే.. ఏ భయమూ ఉండదు' అన్నది చిన్న కోడలు.

'అలాగే తెచ్చుకుందాం లెద్దూ!'.. అన్న చిన్న కొడుకు మాటలతో ఉలిక్కిపడి..

'వద్దు! ఎంతమాత్రం వద్దు..' గట్టిగా అన్నాడు సీతారామయ్య.

'ఏం నాన్నా? ఎందుకు వద్దు?' అన్నాడు చిన్నోడు. ఆయనేమీ మాట్లాడలేదు.

'తాతయ్యా! చాలా బావుంటుంది కదా! నీతో ఎంచక్కా వాకింగ్‌కి కూడా వస్తుంది. ఎందుకు వద్దంటున్నావు?'.. ఒకింత సందేహంగానే అడిగాడు మనవడు.

మౌనం వహించాడు ఆయన. అప్పటికి ఎవరో రావడంతో ఆ ప్రసక్తి అక్కడితోనే ఆగిపోయింది.

'నాన్నా! నీతో ఎన్నిసార్లు అన్నాను.. కుక్కను పెంచుకుందామని. ఆ బన్నీగాడు! పేద్ద.. తనకే ఆల్సేషన్ డాగ్ ఉన్నట్లు నా వంక చూస్తూ, వాడి కుక్కతో ఆటలు ఆడుతూ, నాపైకి ఉసిగొలిపి నవ్వుతున్నాడు. వాడి పొగరు అణచాల్సిందే! ఈ రోజు నువ్వు కుక్కను తీసుకురాకపోతే నేను అన్నం ముట్టను అంతే!'..

మనవడి అలకతో గుండెల్లో రాయి పడ్డట్లు అయ్యింది సీతారామయ్యకు.

'వద్దు! ఎట్టి పరిస్థితుల్లోనూ వద్దు..' తనకు తెలియకుండానే వణుకుతున్న గొంతుతో గట్టిగా అరిచాడు మళ్లీ.

ఉలిక్కిపడ్డాడు రమణ. తండ్రిలో ఇంతటి భయం ఇంతకుముందు ఎప్పుడూ చూసి ఉండలేదు అతను.

'పిల్లవాడు ఏదో సంబరపడుతున్నాడు. పోనీ లే నాన్నా! నువ్వెందుకు అంతగా 'వద్దు' అంటున్నావు?'.

మౌనంగా ఉన్న ఆయన్ను చూసి..

'పోనీలే నాన్నా.. వాడి సంతోషం కోసం కొన్నిరోజులు ఉంచుకుని పంపుదాం లెద్దూ!' అన్నాడు మళ్లీ తనే.

'వద్దు. వద్దంటే వద్దు! ఒకవేళ తీసుకురావాలని అనుకుంటే.. నేను ఇక్కడ ఉండను. వృద్ధాశ్రమానికి వెళ్తాను' గంభీరంగా, స్థిరంగా అన్నాడు.

నివ్వెరపోయాడు రమణ. వెంటనే లేచి..

'అదేంటి నాన్నా! ఒకేసారి అంతమాట అన్నావు. ఎందుకో చెప్పు నాన్నా!' అన్నాడు తండ్రి దగ్గరికి వచ్చి, ఆయన చేయిని తన చేతిలోకి తీసుకుంటూ.

కోడలు, మనవళ్లు కూడా అదే అడిగారు.. రెట్టిస్తూ!

'ఎందుకంటే.. ఎందుకంటే.. వాటిని చూస్తే నాకు చాలా అసూయగా ఉంటుంది కాబట్టి!'.

'ఏంటీ?'.. అంతా ఒకేసారి ఆశ్చర్యంగా అడిగారు. వాళ్లకు ఆయన అన్నది అర్థం కాలేదు.

'అసలు వాటిని చూస్తే నీకు అసూయ ఎందుకు నాన్నా? పాపం నోరులేని జీవాలు. ఏదో మిగిలింది ఇంత పెడితే ఎంతో విశ్వాసంగా జీవితాంతం పడి ఉంటాయి. వాటిపై అంత కోపం ఎందుకు నాన్నా? నువ్వే చిన్నప్పటి నుంచి మూగజీవాల పట్ల దయతో ఉండాలని చెప్పావు కదా! చెప్పు నాన్నా..' రెట్టించాడు రమణ.

‘ఎందుకంటే.. అవి నన్ను చూసి వెక్కిరిస్తున్నట్లు అనిపిస్తుంది!’.

‘అవి వెక్కిరించడం ఏంటి నాన్నా?’.

‘పొద్దున్నే వాటిని కాలకృత్యాలకు తీసుకెళ్తారు. కనీసం వాటితో గడిపే ఆ అరగంటైనా నాతో గడపడానికి ఇష్టపడరు. వాటి ఆహారం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. ప్రతిరోజూ సమయం ప్రకారం వాటికి పాలు, తినుబండారాలు.. క్రమం తప్పకుండా ఇస్తారు. ఎందుకంటే మూగజీవి.. అడగలేదు కాబట్టి. నాకు మాత్రం ఆకలి నకనకలాడుతున్నా, నోరున్నా అడగలేను. దానికి ఆరోగ్యం బాగాలేకపోతే వెంటనే డాక్టర్ దగ్గరికి తీసుకెళ్తారు. కానీ, అదే నాకు ఆరోగ్యం బాగాలేక పోతే మాత్రం పట్టించుకోరు. బీపీ, షుగర్ ఉన్నప్పటికీ డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లకుండా, ఇంట్లో ఉన్న ఏవో మందులు వేసుకోమంటారు. ఎందుకంటే.. అందుకు మీ దగ్గర సమయం ఉండదు. ఆహారం దగ్గర.. దానికి పాటించే సమయపాలన నాకు ఉండదు. దానిని హాస్పిటల్‌కి తీసుకెళ్తూ.. అదే దారిలో నన్ను కూడా హాస్పిటల్‌లో చూపించవచ్చు. కానీ, మీకెవరికీ ఆ విషయమే అర్థంకాదు. దానికి ఆహారం అయిపోయినా, మందులు కావాల్సి వచ్చినా.. గుర్తు పెట్టుకుని తెస్తారు. నాకు ట్యాబ్లెట్లు అయిపోయినా, కళ్లద్దాలు విరిగిపోయినా, ఏవి ఎంత అత్యవసరం అయినా.. నేను చెప్పినవి ఏవీ మీకు గుర్తుండవు. కనీసం కుక్కకు ఇచ్చే గౌరవం కూడా నాకు ఇవ్వడం లేదని, అవి నన్ను వెక్కిరిస్తున్నట్లుగా అనిపిస్తుంది. అది నేను భరించలేను!’ ఏడుస్తూ అంటున్న ఆయనను.. అక్కున చేర్చుకున్నాడు చిన్నోడు కూడా ఏడుస్తూ!

* * *

**నామని సుజనాదేవి స్వస్థలం హనుమకొండ. ఎంఏ (తెలుగు) చేశారు. భారతీయ జీవిత బీమా సంస్థలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. మూడు దశాబ్దాలుగా రచనా వ్యాసంగంలో ఉన్నారు. ఇప్పటివరకు 250కి పైగా కథలు, 125పైగా కవితలు, 3 నవలలు రాశారు. 4 కథా సంపుటాలు, 2 కవితా సంపుటాలు వెలువరించారు. వీరి మొదటి కథ ‘ప్రేమ తపన’. 1991లో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన ఈ కథకు ఎంతోమంది ప్రముఖుల ప్రశంసలు అందుకున్నారు. సాహిత్య సేవలో భాగంగా వందకు పైగా పురస్కారాలు, నగదు బహుమతులు, సన్మానాలు పొందారు. అనేక కథల పోటీల్లో బహుమతులు గెలుచుకున్నారు. వీరి ‘స్పందించే హృదయం’ కథా సంపుటికి.. ఇప్పటివరకూ ఆరు జాతీయ పురస్కారాలు వచ్చాయి. దాదాపు అన్ని ప్రముఖ పత్రికల్లో వీరి కథలు ప్రచురితమయ్యాయి. వివిధ సంస్థలతో కలిసి సాహిత్యాభివృద్ధికి కృషి చేస్తున్నారు.**

# అంబేద్కర్ మనవాడు



మంచికంటి

ఎన్నో అద్భుతమైన నాటకాలు రాసిన రచయిత డాక్టర్ రామారావు. 'అంబేద్కర్ మనవాడు' నాటకాన్ని కూడా ఆయనే రాశాడు. ఈ మధ్యకాలంలో టికెట్టు పెట్టి ఆడించిన నాటకాలన్నీ ఆయనవే. ఈ నాటకం ద్వారా అంబేద్కర్ ఖ్యాతిని దేశ, విదేశాలలో ప్రచారం చేయాలని సంకల్పించాడు.

అంబేద్కర్ భవన్‌లో ఆరోజు సిట్టింగ్ రిహార్సల్స్ మొదలు పెడుతున్నారు. నటులందరూ సమావేశమయ్యారు. ఆదిమూలం డేవిడ్ రాజు.. ప్రధాన పాత్ర అయిన అంబేద్కర్ పాత్రను పోషిస్తున్నాడు. నాటకంలో వివిధ పాత్రలను అనేక కులాలు, మతాలకు చెందినవాళ్లు పోషిస్తున్నారు. స్టేజీ మీదున్న అంబేద్కర్ చిత్రపటానికి ఎదురుగా నాటకం ప్రతిని ఉంచారు. నటులందరూ వేదిక మీదికి వెళ్లి.. అంబేద్కర్ పటానికి పూలు జల్లి, నమస్కరించి వచ్చి కుర్చీల మీద కూర్చుంటున్నారు.

డాక్టర్ రామారావు స్టేజీపైకి వెళ్లి, అంబేద్కర్ పటానికి నమస్కరించి వచ్చి కూర్చున్నాడు. ఒక్కక్షణం ధ్యానంలోకి వెళ్లాడు. అంబేద్కర్‌ను మనసులోనే స్మరించుకున్నాడు. కళ్లు తెరిచి.. నాటకం పుస్తకాన్ని తెరిచాడు. మొదటి డైలాగ్ తానే చెప్పాడు. తరువాత ఒక్కొక్కరి పేరు చదువుతుంటే ఆ పాత్రధారులు తమతమ డైలాగులు చెప్పసాగారు.

అంబేద్కర్ పాత్రధారి డేవిడ్ రాజు రిహార్సల్స్ జరుగుతున్నంత సేపు ఎంతో ఉద్వేగంగా కనిపించాడు. ఆయన మనసులో కొత్త అలజడి చెలరేగ సాగింది. అయినా చాలా నిగ్రహంతో కూర్చున్నాడు.

ఎవరి తరువాత ఎవరు డైలాగులు చెప్పాలో.. రామారావు చెబుతుంటే, నటులు డైలాగులు చదువుతున్నారు.

ఆరోజు రిహార్సల్స్ అయిపోయే సరికి రాత్రి పన్నెండు గంటలైంది. అందరి హృదయాలూ ఎంతో సంతోషంతో బరువెక్కాయి.

డేవిడ్ రాజు రామారావు దగ్గరికి వచ్చి, ఆయన చేతులు పట్టుకున్నాడు.

'అంబేద్కర్ డైలాగులు నా నోటివెంట పలకడం.. నిజంగా నా పూర్వజన్మ సుకృతం. ఏదో పుణ్యం చేసుకోకపోతే ఈ పాత్ర నన్ను వరించేది కాదు' అంటూ తలవంచి నమస్కరించాడు.

రామారావు ఆయన భుజం తట్టాడు.

'నువ్వు బాగా నటిస్తావు. నీ ఆకారం కూడా డాక్టర్ అంబేద్కర్ రూపానికి సరిగ్గా సరిపోతుంది' అని చెప్పాడు రామారావు.

డేవిడ్ రాజు కళ్లు చెమ్మగిల్లాయి.

డాక్టర్ రామారావుకు ధన్యవాదాలు చెప్పి.. తడి కళ్లతోనే ఇంటికి బయలుదేరాడు డేవిడ్ రాజు.

ఇంటికి వచ్చిన తరువాత కూడా ఉద్వేగాన్ని ఆపుకోలేక సతమతమై పోతున్నాడు.

ఆయన పరిస్థితి చూసి..

'ఏం జరిగింది?' అని అడిగింది భార్య.

'ఏమీలేదు! నువ్వు పడుకో' అని చెప్పాడు.

రాత్రంతా ఆయనకు నిద్రలేదు. తెల్లవార్లూ అంబేద్కర్ కలలోనే ఉన్నాడు. తన గతాన్నంతా తవ్వి పోస్తున్నాడు.

'నువ్వు చేస్తున్న పని ఏమిటి?' అని నిలదీసి అడుగుతున్నాడు.

'నీలాంటి పిల్లలు ఎందరు మీ హాస్టల్‌లో చదువుకుంటున్నారు? వాళ్లకు నువ్వు చేస్తున్న మేలు ఏమిటి? ఇప్పుడు నా పాత్ర వేయడానికి కూడా తయారయ్యావా?' అని ప్రశ్నిస్తూ ఉన్నాడు.

ఆ రాత్రి ఆయనకు కాళరాత్రిగా మారింది.

అప్పుడే ఒక నిర్ణయానికి వచ్చాడు.

ఉదయాన్నే తన బ్యాగులో బట్టలు సర్దుతున్నాడు డేవిడ్ రాజు.

'ఎక్కడికి వెళ్తున్నారు?' ఆశ్చర్యంగా అడిగింది భార్య.

అతను సమాధానం చెప్పలేదు.

మళ్లీ ఆందోళనగా అడిగింది.

'కొన్నిరోజులు నేను పనిచేసే హాస్టల్‌లోనే ఉందామని వెళ్తున్నాను' అన్నాడు.

'ఏందయ్యా.. ఏమైంది నీకు?'.

మౌనమే సమాధానం.

బ్యాగ్ తీసుకొని నేరుగా హాస్టల్‌కు పోయాడు.

ఆ సమయంలో ఎప్పుడూ వార్డెన్‌ను అక్కడ చూడని పిల్లలు బిత్తరపోయారు.

కొందరికి ఒంటిమీద చొక్కాలు లేవు. స్కూలుకు సిద్ధం కావాల్సిన పిల్లలు ఎగురుతున్నారు. ఆటలు ఆడుతున్నారు. కొట్టుకుంటున్నారు.

వార్డెన్‌ను చూసి ఎక్కడివాళ్లు అక్కడ పరుగులు తీశారు.

డేవిడ్ రాజు బ్యాగు లోపలపెట్టి బయటికి వచ్చాడు. ఒక్కసారి చుట్టూ చూశాడు.

రాత్రి అన్నం తిన్న పళ్లాలు.. నీటి పంపుల దగ్గర గుట్టలుగా పడున్నాయి.

'రేయ్! ఇటు రండి' పిల్లల్ని కేకవేశాడు డేవిడ్ రాజు.

పరుగెత్తుకుంటూ కొంతమంది పిల్లలు బయటికి వచ్చారు.

'ఈ పళ్లాలేంది?' అనడంతో పిల్లలందరూ మౌనంగా తలవంచుకుని నిలబడ్డారు.

అందరూ ఎంతో మురికిగా ఉన్నారు. నిద్రలేచి ముఖాలు కూడా కడగలేదు. జుట్టు చిందరవందరగా ఉంది.

వాళ్లను చూసిన డేవిడ్ రాజుకు భోరున ఏడవాలనిపించింది.

'అంతా నావల్లే!'..

'నా పని నేను సక్రమంగా నిర్వహించక పోవడం వల్లే!'..

'నేను ఉద్యోగం సరిగ్గా చేయకపోవడం వల్లే!'..

'నా స్వార్థం వల్లే!'..

'నా అపరాధం వల్లే వీళ్లంతా ఈవిధంగా తయారయ్యారు!'..

'నా అవినీతి వల్లే ఈ హాస్టల్ ఈ విధంగా ఉంది'..

'ఈరోజు నుంచి నన్ను నేను సరి చేసుకుంటా!'..

'ఈ హాస్టల్‌ను సరిచేస్తా!'.. అనుకున్నాడు.

అప్పటికి ఆయన మనసు కాస్త కుదుటపడింది.

* * *

మరుసటి రోజు నుంచే హాస్టల్‌ను సమూలంగా మార్చాలనే కృతనిశ్చయంతో పని చేయసాగాడు.

అదేరోజు హాస్టల్ సంస్కరణను ప్రారంభించాడు. ఉదయాన్నే ఐదు గంటలకు పిల్లల్ని నిద్ర లేపసాగాడు.

అలవాటు లేని పనికావడం వల్ల పిల్లలు నిద్ర లేవడంలేదు. స్టడీ అవర్‌లో కూర్చున్న పిల్లలు నిద్రలో జోగుతున్నారు.

వాళ్లను చూసి... 'అలవాటు లేని పని కదా!' అనుకున్నాడు

'అదే అలవాటు అవుతుందిలే! కాదు.. అలవాటు చేయాల్సిందే!' అనుకున్నాడు డేవిడ్ రాజు.

వంటవాళ్లను పిలిచాడు.

'ఇవాల్టి నుంచి బియ్యంలో పురుగులు, రాళ్లు ఏరి.. బాగా చెరిగించి వంట చేయాలి.

బియ్యాన్ని రెండుమూడు సార్లు కడిగి, వాసన లేకుండా వండాలి' అని చెప్పాడు.

'అలాగేనయ్యా!' అంటూ.. తలలు ఊపుతూ వెళ్లిపోయారు వాళ్లు.

ఆ తరువాత డేవిడ్ రాజు కూరగాయల దుకాణానికి వెళ్లాడు.

డేవిడ్ రాజును చూడటంతోనే..

'అయ్యా నమస్కారం!' అంటూ నిలబడి నమస్కారం చేశాడు సుబ్బారావు.

'ఈరోజు నుంచి కూరగాయల్లో పుచ్చిపోయినవి గానీ, కుళ్లిపోయినవి గానీ కనిపించొద్దు..' అన్నాడు.

'అదేంటి సార్! మీరిచ్చే రేటుకు ఎలా గిట్టుబాటు అవుతుంది?' అన్నాడు.

'గిట్టుబాటు రేటే వేసుకో!' అన్నాడు.

'అవునా!?..' ఆశ్చర్యంగా కళ్లు పెద్దవి చేసి, అనుమానంగా చూశాడు.

'అవును!'.. గట్టిగానే సమాధానం చెప్పి, వెనుదిరిగాడు డేవిడ్ రాజు.

అక్కడినుంచి బడికి వెళ్లాడు.

హెడ్‌మాస్టర్ గదిలో ప్రవేశించి..

'నమస్కారం సార్!' అంటూ రెండు చేతులూ జోడించాడు.

ఫైల్‌లో తలమునకలైన హెడ్‌మాస్టర్.. తల పైకెత్తి, కళ్లజోడు నుంచి ఓరకంటితో చూస్తూ..

'ఓ.. మీరా సార్! రండి రండి. చాలా కాలానికి తమ దర్శనం!' అన్నాడు.

ఆ మాటల్లో వ్యంగ్యం డేవిడ్ రాజుకు అర్థమైంది.

ఆ పక్కనే ఉన్న తెలుగు మాస్టారు..

'బాగున్నారా?' అని అడిగాడు.

'ఆ బాగానే ఉన్నాను!' అంటూ కుర్చీలో కూర్చున్నాడు డేవిడ్ రాజు.

తెలుగు మాస్టారు తన కుర్చీని కొంచెం దూరంగా జరుపుకొన్నాడు.

'ఏంటి సార్ విశేషాలు?' అన్నాడు హెడ్‌మాస్టర్.. వెటకారాన్ని పెదవుల మీద చూపిస్తూ.

'ఏమీ లేదు సార్! హాస్టల్‌ను బాగు చేద్దాం అనుకుంటున్నాం'.. నేరుగా విషయంలోకి వచ్చేశాడు.

'పిల్లల చదువులు కూడా.. దారిలో పెట్టాలి' అన్నాడు.

పక్కలో బాంబు పడ్డట్టు అదిరిపడ్డాడు హెడ్‌మాస్టర్.

'హాస్టల్ పిల్లల్నా!? మీరు దారిలో పెడతారా!? చూడయ్యా మాస్టారూ.. చోద్యం కాకపోతే! హాస్టల్ పిల్లల్ని ఈయన గాడిలో పెడతాడంట!' అన్నాడు.

'వాళ్లు డెకాయిట్లు సార్.. డెకాయిట్లు!' అన్నాడు తెలుగు మాస్టారు.

డేవిడ్ రాజు తలవంచుకున్నాడు.

'కానీయండి సార్! ప్రయత్నం చేస్తే పోయేదేం లేదుగా! ఒక ప్రయత్నం చేద్దాం అనుకుంటున్నాను' చెప్పాడు.. పైకి లేస్తూ.

'అవునా!?' నోరు తెరిచి అనుమానంగా చూశాడు హెడ్‌మాస్టర్.

'అవును.. అప్పుడప్పుడూ స్కూలుకు కూడా వస్తూ ఉంటాను' అని చెప్పి, నమస్కరించి వెనుదిరిగాడు.

'బియ్యం అమ్ముకొని బిల్డింగ్ కట్టాడు. హాస్టల్ పిల్లల్ని ఏదో చేస్తాడంట!' గుసగుసగా అన్నాడు తెలుగు మాస్టారు.

అతడి గుసగుసలు వినిపిస్తూనే ఉన్నాయి.

'నిజమే! నాకు జరగాల్సిన శాస్తే!' అనుకున్నాడు డేవిడ్ రాజు.

ఆ ఆలోచనలతోనే హాస్టల్ దారిపట్టాడు.

ఆ వెంటనే పెయింటర్‌ను పిలిపించి..

'మొత్తం భవనానికి, ప్రహరీకి రంగులు వేయాలి' అన్నాడు.

'ఎందుకు సార్? ఈ బిల్డింగ్‌కు రంగులు వేయడం దండగ. పోయినసారి లాగా బిల్లు పెట్టేద్దాం సార్! బిల్లులు నేను తెస్తాగా!' అన్నాడు పెయింటర్.

అతనివంక తీక్షణంగా చూశాడు డేవిడ్ రాజు.

'ఈసారి నా జేబులో డబ్బుతో ఈ పెయింటింగ్ వేయిస్తున్నాను. వెంటనే పని మొదలుపెట్టు. పెయింట్లు తీసుకురా! ఇదుగో అడ్వాన్స్!' అంటూ డబ్బులు తీసి ఇచ్చాడు.

అతను అనుమానంగా చూస్తూ వెళ్లాడు..

* * *

మిత్రుడు శేషగిరితో కలిసి డేవిడ్ రాజు సంగతి కనుక్కోవడానికి హాస్టల్‌కు వచ్చాడు డాక్టర్ రామారావు.

బొడ్డు కాడికి లుంగీ ఎగగట్టి.. పనిచేస్తూ కనిపించాడు రాజు.

ఆయన పక్కనే మామిడి, ఉసిరి, జామ, నేరేడు మొక్కలు కనిపించాయి. కూలీవాళ్లు గోతులు తవ్వుతూ ఉంటే.. తానూ, వాచ్‌మన్ కలిసి మొక్కలు నాటుతున్నారు.

'రాజు గారూ.. నమస్తే!' అన్నాడు రామారావు.

పనిచేస్తున్న డేవిడ్ రాజు, తల పైకెత్తి 'ఎవరా?' అని చూశాడు.

ఎదురుగా డాక్టర్ రావు, శేషగిరి కనిపించారు.

'అయ్యయ్యో.. మీరేమిటి ఇక్కడ!?' అంటూ లుంగీని కిందికి దించేసి, చేతిలో మొక్కను పక్కన పెట్టి..

'రావుగారూ.. రండి రండి! మీకు శ్రమ కలిగించినట్టు ఉన్నాను' అన్నాడు డేవిడ్ రాజు.

'ఇవాళ గొప్ప సుదినం మాకు. ఎంత గొప్పకార్యం చూసే భాగ్యాన్ని కలిగించారు. ఆహాహా! ఏమిటీ వింత!? హాస్టల్ రూపురేఖలను మార్చేస్తున్నారే!' అన్నాడు రామారావు.

పంపు దగ్గరికి వెళ్లి చేతులు కడుక్కొని, తుడుచుకుంటూ వరండాలోకి వచ్చాడు డేవిడ్ రాజు.

ఆయనను డాక్టర్ రావు, శేషగిరి అనుసరించారు. టేబుల్ ముందున్న కుర్చీలలో ముగ్గురూ కూర్చున్నారు.

'ఏమిటి.. ఆరోజు చెప్పాపెట్టకుండా కన్నీళ్లు కారుస్తూ వచ్చేశారు. ఆ తర్వాత అంతేలేరు! ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్విచ్ ఆఫ్ వస్తున్నది. ఒకరోజు మీరు లేకుండానే రిహార్సల్స్ కానిచ్చాం. అంబేద్కర్ పాత్రధారి లేకుండా రిహార్సల్స్ అనవసరమని అర్థమైంది. 'అంబేద్కర్ పాత్రధారి వచ్చేంతవరకు రిహార్సల్స్ వద్దు' అన్నారు అందరూ. అందుకే, మీ ఇంటికి వెళ్లి వాకబు చేశాం. 'సార్ హాస్టల్‌లోనే ఉంటున్నారు!' అని చెప్పారు. ఇక్కడికి వస్తేగానీ విషయం అర్థం కాదని వచ్చాం. మీ ఇంట్లో వాళ్లతోకూడా మాట్లాడటం లేదని చెప్పారు. ఏంటీ? అంత సీరియస్ విషయం' అడిగాడు డాక్టర్ రామారావు.

తల పైకీ.. కిందికి ఊపాడు డేవిడ్ రాజు.

వెంటనే సమాధానం చెప్పలేకపోయాడు. ఎక్కడో లోతుల్లో ఆలోచిస్తున్న వాడిలా కనిపించాడు. పురాతనకాలాన్ని తవ్వుకుంటున్న మనిషిలా కనిపించాడు.

'ఏదో చెప్పరాని మార్పు మీలో కనిపిస్తున్నది. ఇక్కడ ఈ గవర్నమెంట్ హాస్టల్‌ను ఇంతగా ముస్తాబు చేయడానికి కారణం ఏమిటి?' మళ్లీ అడిగాడు డాక్టర్ రామారావు.

చాలాసేపటి మౌనం తరువాత గొంతు సవరించుకున్నాడు డేవిడ్ రాజు.

'ఆరోజు అంబేద్కర్ నాటకం మొత్తం వినడమే.. నాలో ఈ మార్పునకు ప్రధాన కారణం. దాని ప్రభావంతో ఒక్కసారిగా నా గతంలోకి తొంగిచూశాను' చెప్పాడు డేవిడ్ రాజు.

'నీ గతమా!?' ఆసక్తిగా అడిగాడు రామారావు.

'అవును!' అంటూ.. చెప్పసాగాడు డేవిడ్ రాజు.

* * *

'మాది చాలా పేద కుటుంబం. ఒక నిట్రాడి గుడిసెలో ముసలీ ముతకా అందరూ కలిసి పదిమందిమి ఉండేవాళ్లం. ఊరి బడిలో ఐదో తరగతి దాకా ఉండేది. మా ఇంట్లో పిల్లలందర్నీ ఐదో తరగతి దాకా చదివించి, తరవాత మానిపించి పనులకు పంపేవాడు మా నాన్న. నన్ను కూడా ఐదో తరగతి తర్వాత బడి మానేసి పనిలోకి వెళ్లమన్నాడు.

'కాదు.. నేను చదువుకుంటాను' అన్నాను.

'యాడ్రా నువ్వు చదివేది! అందరూ చేస్తేనే నాలుగు వేళ్లూ నోట్లోకి పోయేది!' అన్నాడు నాన్న.

'కాదు.. నేను చదువుకోవాల్సిందే!' అని మొండికేశాను.

'ఎక్కడ్రా!? చదువు ఊర్లో లేదుగా!' అన్నాడు నాన్న.

'ఒక్క రూపాయి కూడా లేకుండా, ఉద్యోగం వచ్చేదాకా ఫ్రీగా చదువుకోవచ్చని అంబేద్కర్ మీటింగులో చెప్పారు' అని చెప్పాను.

'ఓరి.. చెప్పేరు లేరా! వాళ్లు చాలా మాటలు చెబుతారు గానీ..' అన్నాడు నాన్న.

ఎలాగూ నాన్న ఒప్పుకొనేటట్లు లేదని.. స్కూల్లో మాస్టర్‌ను అడిగి, వివరాలు తెలుసుకున్నా. సర్టిఫికెట్ ఇప్పించుకుని, ఎవరికీ తెలియకుండా ఒంగోలు హాస్టల్‌కి వెళ్లి చేరా. నన్ను వెతుక్కుంటూ వచ్చాడు నాన్న.

కోపంతో కొట్టబోయాడు. అయితే అక్కడే ఉన్న హాస్టల్ వార్డెన్ జోసెఫ్ సార్ నన్ను పక్కకు తీశాడు.

'చూడండి.. మీవాడు చాలా ఇష్టంగా చదువుకోవడానికి వచ్చాడు. వాడి సంగతి నేను చూసుకుంటా. మీరు వెళ్లండి!' అని మా నాన్నను సాగనంపాడు.

అప్పటినుంచి చదువు మీద శ్రద్ధ పెట్టాను. హాస్టల్‌లో అన్నం ఎలా ఉండేదో తెలుసుగా!? రాళ్లూరప్పలు.. పురుగుల అన్నం. నీళ్ల సాంబారు. వీటితోపాటే కదా పెరిగి పెద్దవాడిని అయ్యింది. చివరికి ఈ హాస్టల్ వార్డెన్ ఉద్యోగానికి వచ్చింది. అయితే అందరిలాగా నేనుకూడా.. నా గతాన్ని మర్చిపోయి అనేకరకాలుగా అవినీతికి పాల్పడ్డాను. మీరు అంబేద్కర్ నాటకాన్ని రాసి నా కళ్లు తెరిపించారు'.. కళ్లు తుడుచుకుంటూ చెప్పాడు.

* * *

'అంతకుముందు అంబేద్కర్ గురించి ఎక్కడా చదవలేదా!?'.. అడిగాడు రామారావు.

'ఏదో జయంతి, వర్ధంతి నాడు అందరూ చెప్పిన నాలుగు మాటలు వినడమే తప్ప, అంబేద్కర్ గురించి ఎప్పుడూ కూలంకషంగా చదివింది లేదు. నాటకం మొత్తం మీరు చదివి వినిపించడంతో నేను చేస్తున్న తప్పేమిటో తెలిసింది. అంబేద్కర్ నన్ను చదివించి, కూలివాడిని కాకుండా చేశాడు. కానీ, నేనేం చేస్తున్నాను. మనవాళ్లను మర్చిపోయి, వాళ్లకు చెందాల్సిన వాటిని నేనే స్వాహా చేస్తున్నాను. మీ నాటకంతో నా కళ్లు తెరుచుకున్నాయి. అందుకని వెంటనే నిర్ణయం తీసుకున్నాను. అందుకే చెప్పాపెట్టకుండా వచ్చేశాను. ఇక్కడికి వచ్చి ఈ మార్పులు చేశాను..' కళ్లలో వెలుతురు పూలు కనిపిస్తుండగా, డేవిడ్ రాజు చెప్పాడు.

'ఎక్సలెంట్ రాజు! తప్పులు ఎవరైనా చేస్తారు. వాటిని దిద్దుకోవడంలోనే గొప్పతనం ఉంది. మనం నాటకం వేయకుండానే ఒక గొప్ప మార్పును చూశాను. ఇక నాటకం వేస్తే ఎంత మార్పు వస్తుందో!' అన్నాడు డాక్టర్ రావు ఆనందంగా.

'అవును.. చాలా మార్పు వస్తుంది' అన్నాడు డేవిడ్ రాజు.

'మరి రిహార్సల్స్‌కు ఎప్పుడు వస్తావు?' అడిగాడు డాక్టర్ రావు.

తల అడ్డంగా ఊపుతూ.. 'రాలేను సార్' అన్నాడు డేవిడ్ రాజు.

'అదేంటి.. నీ ఆకారం అంబేద్కర్‌కు సరిగ్గా సరిపోతుందని కదా నిన్ను సెలెక్ట్ చేసింది' అన్నాడు డాక్టర్ రావు.

మళ్లీ తల అడ్డంగా ఊపుతూ..

'నేను కాకుంటే మీరు ఇంకొకర్ని సెలెక్ట్ చేసుకోవచ్చు. కానీ, ఇక్కడ నేను ఉంటేనే పిల్లల్లో మార్పు సాధ్యమవుతుంది. ఎక్కడెక్కడినుంచో దిక్కూ దివాణం లేకుండా వస్తారు సార్ వీళ్లంతా. అందరూ నాలాంటి వాళ్లే! వాళ్లకు ఒక మంచి భవిష్యత్తు ఇవ్వాలని నిర్ణయించుకున్నా' అని దృఢంగా చెప్పాడు డేవిడ్ రాజు.

'చాలా గొప్పపని రాజూ. అయితే నేను ఒక మంచి నటుణ్ని మిస్ అవుతున్నాను' అన్నాడు డాక్టర్ రావు.

తల నిలువుగా ఊపాడు రాజు.

'ఇదే నీ నిర్ణయమా!' కొంచెం ముభావంగా పైకిలేచాడు డాక్టర్ రావు.

'దయచేసి నన్ను అపార్థం చేసుకోవద్దు. మీవల్ల నా జీవితానికి ఒక లక్ష్యం ఏర్పడింది'.. రెండు చేతులూ పైకెత్తి నమస్కరించాడు డేవిడ్ రాజు.

'అరెరె.. ఏంటిది?' అంటూ ఆయన చేతులు పట్టుకొని..

'మళ్లీ అంబేద్కర్‌ను వెతుక్కునే పనిపెట్టావ్ నాకు' అన్నాడు డాక్టర్ రావు.

'దయచేసి నన్ను మన్నించండి సార్! నేను ఆ పాత్రకు అర్హుడిని కాదు. నన్ను క్షమించండి' మళ్లీ నమస్కారం చేశాడు డేవిడ్ రాజు.

'అబ్బే! అలాగ అనకు' అంటూ డేవిడ్ రాజును ఆప్యాయంగా కౌగిలించుకున్నాడు డాక్టర్ రావు.

'నేను ఈ నాటకం రాసినందుకు చాలా సంతోష పడుతున్నాను. కాదుకాదు.. గర్వపడుతున్నాను. నాటకం వేయకుండానే ఒక గొప్ప మార్పును చూశాను. ఈ విషయాన్ని నాటకం వేసే ప్రతిచోటా చెబుతాను. అంతేకాదు దళితుల్లో మనం కోరుకుంటున్న మార్పునకు ఇది ప్రస్థానం కావాలి. మీరు చేస్తున్న పని ఒక ప్రయోగం కావాలి. ఈ హాస్టల్ ఒక ప్రయోగశాల కావాలి. చేస్తూనే ఉండండి. మేం కూడా మీ వెంటే ఉన్నాం! ఉంటాం! జై భీమ్!' అన్నాడు డాక్టర్ రావు.

'జై భీమ్!' అన్నాడు డేవిడ్ రాజు కూడా..

* * *

మంచికంటి స్వస్థలం ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలంలోని కలికివాయ గ్రామం. తల్లిదండ్రులు: కీ.శే. నరసారెడ్డి, వెంకటరత్నమ్మ

విద్యలో ప్రయోగాలు చేస్తున్న శాంతివనం ఫౌండేషన్ ఊరు: నాయుడుపాలెం, చీమకుర్తి మండలం. ఉద్యోగం: ఉపాధ్యాయవృత్తి, కథా సంకలనాలు.. మిత్తవ ,మారాజులు, చదువు చదువు చదువు, గబ్బ గీము—— నవల. కవిత్వం.. వసంతా ఊసెత్తకు, నీటి పొద్దు, మేం పావురాలను ప్రేమిస్తాం, జీవితము–యుద్ధము–శాంతి, నా సైకిల్ యాత్రాదర్శనం– సైకిల్ యాత్ర పుస్తకం, విద్యలో నా ప్రయోగాలు..శాంతివనం –పిల్లల అనుభవాలు– ప్రయోగాలు పుస్తకం, చదువు బి ఎస్ సి బి ఎడ్ ,రెండు దశాబ్దాల నుండి రచనలు,యాభై కథలు వరకు రాశాను. తానా బహుమతి అజోవిభో బహుమతి, పలు కథలకు పలు బహుమతులు, అనేక ప్రాంతాలలో పలు సన్మానాలు.

# జీవిత పాఠం



**కశిఒజ్జల భాస్కరా చారి,**

**73960 16164**

డాక్టర్ రామారావు ఎదుట కూర్చున్నాను. ఆయన ఈ సిటీలోనే పెద్ద డాక్టర్. నాకు ఆయనతో పూర్వపరిచయం ఉంది.

'అసలు నాకేమైంది డాక్టర్ గారు? ఎందుకు నాకు ఆకలి వేయదు. నిద్ర రాదు! ఎప్పుడూ ఏవో ఆలోచనలు కందిరీగల్లా చుట్టుముడుతాయి. జీవితంమీద విరక్తి లాంటిది కలుగుతున్నది. నన్ను చూడండి.. రోజురోజుకూ ఎలా చిక్కిపోతున్నానో!? నా ఆరోగ్యం గురించి చాలా ఆందోళనగా ఉందండి' అన్నాను దిగులుగా.

డాక్టర్ నాకు ధైర్యం చెప్పి, అన్నిరకాల పరీక్షలు చేశారు. రిపోర్టులన్నీ పదినిమిషాల పాటు క్షుణ్ణంగా పరిశీలించి..

'శివప్రసాద్ గారూ.. కంగారు పడకండి. మీ రిపోర్టులన్ని నార్మల్‌గా ఉన్నాయి. సో.. మీకు శారీరకంగా ఏ జబ్బూ లేదు' అంటూ తేల్చేశారు డాక్టర్.

ఏ జబ్బూ లేదంటే ఎవరైనా వెంటనే ఎగిరి గంతేస్తారు. కానీ, నాకుమాత్రం ఆయన మాటలు సంతృప్తిని కలిగించలేదు. కుర్చీలో ముందుకు జరిగి ఆయన టేబుల్‌పై చేతులుంచి..

'లేదు డాక్టర్ గారు! చాలారోజుల నుంచి నాకేదో

అయ్యిందండీ! ఇదిగో నాకళ్ల కింద నల్లచారలు చూశారా!? సరిగా నిద్రపోక ఎన్నో రోజులైంది..' అన్నాను బాధగా.

కానీ, ఆయన శాంతంగా.. 'శివప్రసాద్ గారూ! మీ వయసు యాభైలో పడినా, మీకు ఇంకా బీపీ, షుగర్ వంటి సమస్యలు లేవు. అదృష్టవంతులే కదండీ మరి! కాకపోతే కొన్నిరోజులుగా నిద్ర సరిగా లేదంటున్నారు. కాబట్టి ఒత్తిడికి గురై ఉంటారు. దేని గురించైనా బాగా ఆలోచిస్తున్నారా? చెప్పండి' అన్నాడు ఆరాతీస్తూ.

'బ్యాంక్ మేనేజర్‌గా వృత్తిపరమైన ఒత్తిళ్లు ఎప్పుడూ ఉండేవే! వాటిని పెద్దగా ఖాతరు చేయను. కానీ, ఇప్పుడు నా సమస్య అది కాదండీ! డాక్టర్ దగ్గర ఏదీ దాచకూడదంటారు. కాబట్టి మీతో అంతా ఉన్నదున్నట్టు చెబుతాను. అసలు సమస్య నా మనసు, ఆలోచనలేనండి. జీవితం పట్ల నాలో నిరాసక్తత, నిర్లిప్తతా చోటుచేసుకొన్నది'.. అంటూ మొదలుపెట్టాను.

నా మాటలకు డాక్టర్ రామారావు తన మెడలోని స్టెతస్కోప్ పక్కన పెట్టేసి.. అటెన్షన్ అయ్యారు.

'ఓ సాయంత్రం బ్యాంక్ నుంచి ఇంటికొస్తుంటే హైవే మీద ఘోరమైన యాక్సిడెంట్ జరిగిందండి. ఓ లారీ, బైక్‌ను గుద్దేసింది. ఒక మహిళ స్వల్ప గాయాలతో బయట పడింది. కానీ, తన కళ్లముందే భర్త, కూతురు ఆ లారీకింద ఇరుక్కుపోయి చనిపోయారు. ఆమె వాళ్ల శవాలపైపడి ఏడ్చే తీరుంది చూశారూ! అది చూస్తే ఎంత కఠినాత్ముడైన కంటనీరు పెట్టాల్సిందేనండి. ఎంత పాషాణ హృదయమైనా.. కరిగి తీరాల్సిందే! కానీ, అదేం చిత్రమో నాకు కొంచెంకూడా బాధ వేయలేదు. అక్కడ గుమిగూడిన అందరిలాగే నేనుకూడా ఊరికే అలా చూస్తుండి పోయాను. అదలా ఉంచండి. మరోరోజు ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర నా కారు ఆపాను. ఇంతలో ఒక పచ్చిబాలింతరాలు తన చంటిబిడ్డతో నా కారు వద్దకు పరిగెత్తుకొచ్చి, చెయ్యి చాచి.. 'బాబయ్యా! ధర్మం!' అన్నది. ఓ వైపు మిట్టమధ్యాహ్నం ఎండ మండిపోతున్నది. మరోవైపు కేర్ కేర్‌మంటు ఆ పసిపాప పాలకోసం కాబోలు.. గుక్క తిప్పుకోకుండా ఏడుస్తున్నది. అప్పుడు మీరైతే ఏం చేస్తారండీ!? అయ్యో పాపం! అనుకొని జేబులోంచి పదో, పరకో తీసి ఆమె చేతిలో పెడతారు కదా! కానీ, నేను మాత్రం ఆమెవంక చూడనేలేదండి! ఇలా యాక్సిడెంట్లు, అడుక్కోవడాలు.. మనం పట్టించుకోకపోవడాలు ఈ రోజుల్లో ఇదంతా కామన్ అంటారా!? నిజమే! డాక్టర్ గారూ.. నేను కూడా ఇంతకాలం అలా అనుకొనే సరిపెట్టుకున్నాను. కానీ.. కానీ.. మీతో సిగ్గువిడిచి అసలు విషయం ఇప్పుడు చెబుతున్నాను. టుబీ ఫ్రాంక్ అండీ.. రామారావు గారు! మా నాన్న డెభ్బై ఏళ్ల మనుషండి. పెరాలసిస్ పేషెంట్. సరిగా మాట్లాడలేడు. తన పనులు తాను చేసుకోలేడు. అమ్మ ఉన్నన్ని రోజులూ అన్నీ తానై చూసుకున్నది. ఆమె ఈమధ్యనే చనిపోయింది. ఇప్పుడు అమ్మతోడు కూడా లేని అలాంటి నిస్సహాయున్ని నా భార్య మాటలు విని మారు మాట్లాడకుండా నిర్ధాక్షిణ్యంగా వృద్ధాశ్రమంలో వదిలేసి వచ్చానండి. నెలకు కొంత డబ్బు చెల్లిస్తే ఇక వాళ్లే చూసుకుంటారని చేతులు దులుపుకున్నానండి. లంకంత కొంప నాది. ఇంట్లనే నాన్నను నా

కళ్ల ముందే ఉంచుకొని, ఎవరితోనైనా శుభ్రంగా అన్ని పనులూ చేయించుకోవచ్చన్న స్ఫృహే రాలేదు నాకు. ఇది కూడా కామన్ అనగలరా చెప్పండి?'.

'యాక్సిడెంట్ దగ్గరి మహిళ, ఆ పసిపాప తల్లి.. ఇద్దరూ బయటివాళ్లు. నాతో ఎలాంటి రక్తసంబంధ బాంధవ్యాలు లేనివాళ్లు. వాళ్లపట్ల నేనలా ప్రవర్తించానంటే కొంత అర్థం ఉంది. కానీ, మా నాన్న అలా కాదు కదా! నా రక్త సంబంధం. నన్ను కని, పెంచి, పోషించి.. ఎన్నో కష్టాలకు ఓర్చి చదివించి.. నేను బ్యాంక్ మేనేజర్‌గా ఈ స్థాయిలో ఉండటానికి కారణమైన వ్యక్తి. నన్ను తీర్చిదిద్దిన రూపశిల్పి. అలాంటి నాన్నకోసం ఒక్కసారి కూడా నా ప్రాణం కొట్టుకోదే! ఆలోచించదే!! ఆవేదన చెందదే!!! నా భార్యను బతిమిలాడో, భయపెట్టో నాన్నను నా కళ్లముందు ఉంచుకోవాలన్న ఆరాటంలేదే నాలో! ఇక నేను ఆయనకు కొడుకునని ఎలా చెప్పుకోగలను? అసలు మనిషిననే ఎలా అనుకోగలను? పూర్తిగా మనఃశాంతికి దూరమైన నేను.. మనిషిలో ఉండాల్సిన ఏదో ముఖ్యమైన లక్షణం కోల్పోయి ఇలా తయారయ్యానని అనిపిస్తున్నది' అంటూ చెప్పడం ముగించాను.

డాక్టర్ రామారావు అంతా ఓపిగ్గా విన్నారు. బహుశా నా మాటలు ఎలా తోచాయోమో.. కొద్దిసేపు ఏమీ మాట్లాడలేదు. తర్వాత నెమ్మదిగా అన్నారు.

'శివప్రసాద్ గారు.. మీరు పదేళ్లుగా నాకు తెలుసు. మీరెంతో సెన్సిటివ్! మంచివారు. మీరిలా మారారు అంటే నమ్మశక్యంగా లేదు. మీ భార్య ప్రవర్తనతో మీరెంత విసిగి పోతుండేవారో తరుచూ నాతో చెబుతుండేవారు. గుర్తుందా? మీ నాన్నను వృద్ధాశ్రమంలో వదిలేసి రావడం నిజంగా దురదృష్టకరం! మీలో ఆందోళనకు అదే కారణం కావచ్చు. ఇటు మీ భార్యకు నచ్చజెప్పలేక అటు మీ నాన్నగారిని మీ వద్ద ఉంచుకోలేక లోలోపల నలిగిపోతున్నట్టు ఉన్నారు. సమాజంలో ఒక హోదాలో ఉన్న మీకు ఈ పరిస్థితి రావడం నిజంగా బాధాకరం! శివప్రసాద్ గారూ.. ఓ పని చేద్దాం! మీ సమస్య మానసికమైనది కాబట్టి నా మిత్రుడు సైకియాట్రిస్ట్ కమ్ సైకాలజిస్ట్ డా.నిపున్‌ను కలవండి. ఆయన మీకు తప్పక ఈ విషయంలో సాయం చేయగలరు..' అన్నారు డాక్టర్ రామారావు.

నేను 'సరే' అనడంతో.. నా ముందే ఆయనతో ఫోన్‌లో మాట్లాడారు.

* * *

తర్వాతి రోజు నేను వెళ్లి డాక్టర్ నిపున్‌ను కలిశాను. నా సమస్యను మొదటి నుంచి అంతా వివరించాను. నా భార్య రమణి ప్రవర్తన గురించి కూడా చెప్పాను. ఆయన అంతా కూల్‌గా విన్నారు.

'ఎంతకాలం నుంచి మీకు ఇలా అనిపిస్తున్నది?' అంటూ.. నన్ను కొన్ని ప్రశ్నలడిగి, నోట్స్ రాసుకున్నాడు. తర్వాత అన్నాడు కదా..

'మీకు వచ్చింది మేజర్ డిప్రెష్ అండీ! ఇలా నిద్రపట్టక పోవడం, కళ్లు లోతుకు పోవడం, దిగులు, మనుషుల పొడ గిట్టకపోవడం, తన వల్ల ఏమీ కాదని ఒంటరిగా, విషాదంగా గడపటం దీని లక్షణాలు. ఏ మనిషి అయితే తనకు ఎదురైన సమస్యను ఎదుర్కోలేక డీలా

పడతాడో.. అతను ఆటోమేటిక్‌గా ఒత్తిడి బారిన పడతాడు. అది చాలాకాలం కొనసాగితే.. మేజర్ డిప్రెషన్‌లోకి వెళ్లిపోతాడు. మీ విషయంలోనూ అదే జరిగింది. ఇప్పుడు మీ సమస్య.. మీ నాన్నగారిని ఒంటరిగా వదిలివేయలేరు. అలాగని మీ భార్య వల్ల మీదగ్గర ఉంచుకోలేరు. కానీ, మీరిప్పుడు చెయ్యాల్సింది.. ఫైట్ ఆర్ ఫ్లయిట్! అంటే ఈ సమస్యను ఎదిరించడం లేదా సమస్యకు లొంగిపోవడం. అంటే దాని నుంచి పారిపోవడం! ఈరెండిటిలో మీరు ఏదో ఒకటి ఎన్నుకోవాలి. చేయాలి. మీరు ఇంతకాలం ఈ రెండిటిలో ఏదీ తేల్చుకోలేక సతమవుతున్నారు. కానీ, తప్పదు ప్రయత్నించండి. అప్పటిదాకా మీలో డిప్రెషన్ పోదండి. మెడికల్ సపోర్ట్‌కోసం కొన్ని మందులు అయితే రాస్తాను. వాడుకోండి' అన్నారు.

నా మనసులోని బాధనంత చదివేసినట్టు చెప్పిన ఆయన మాటలు.. నాకు కొంత ఊరట, ఉత్తేజాన్ని ఇచ్చాయి. మందులు తీసుకొని ఇంటికి బయలు దేరాను. కొంతదూరం వెళ్లానో లేదో.. హఠాత్తుగా ఓ పంది, మూడు కుక్కలు కొట్లాడుకుంటూ నా కారుకు అడ్డంగా వచ్చాయి. సడెన్ బ్రేక్ వేసి కారు ఆపాను. కారు గ్లాస్ దించి వాటిని అదిలించబోయాను. అక్కడి దృశ్యం చూసి, టక్కున ఆగిపోయాను. అక్కడి వాతావరణం ఓ యుద్ధరంగాన్నే తలపిస్తున్నది. పక్కన చెత్త కుండీ ఉన్నది. ఆ పంది తన పిల్లల్ని కబళించాలని చూస్తున్న ఆ మూడు కుక్కలతో భీకర పోరు సలుపుతున్నది. తమ నాలుకల్ని బైటపెట్టి, చొంగ కారుస్తు.. భయంకరంగా అరుస్తూ మూడు వైపులనుంచీ దానిపై దాడి చేస్తూ.. పిల్లల్ని ఎత్తుకెల్లాలని చూస్తున్నాయి ఆ కుక్కలు. ఇక ఆ పంది తన బుజ్జి పిల్లలపై ఆశ వదులుకోవాల్సిందే! అనిపించింది నాకు. ఆ మూడు బలమైన కుక్కల నుంచి ఒక్కత్తే తన పిల్లల్ని ఎలా రక్షించుకోగలదు? అసాధ్యమే! కానీ, కన్నపేగు మమకారం, తీపి దానిలో పోరాట పటిమను తట్టి లేపింది. అది కోపంతో అరుస్తూ, పరిగెడుతూ వాటిని తరుముతున్నది. ఐదు, పది నిమిషాలు కాదు. ఏకంగా గంటన్నరసేపు వాటితో అలుపెరగకుండా పోరాడింది. అవి కుయుక్తులతో దానిని ఏమర్చాలని చూసినా.. వాటి ఆటలు సాగనివ్వలేదు. ఎట్టకేలకు అలసి సొలసి గాయాలతో ఆ కుక్కలే తోకముడిచి పారిపోయాయి. పంది.. తన పిల్లల్ని కాపాడుకున్న ఆనందంలో గాయాల్ని సైతం మరచిపోయి, వాటిని సంతోషంతో నాకుతున్నది. అంతసేపూ కనురెప్ప వేయకుండా అదంతా చూసిన నేను.. నిజంగా షాక్ తిన్నాను. నేను అసాధ్యం అనుకున్న దాన్ని.. ఆ పంది సుసాధ్యం చేసి చూపింది. డాక్టర్ నిపున్ చెప్పిన ఫైట్ ఆర్ ఫ్లయిట్‌ను ఇప్పుడు ప్రత్యక్షంగా చూశాను. దాని పిల్లల్ని కాపాడుకోవడం కోసం ఆ పంది ఫైట్ (ఎదిరించడం) చేసింది. తన ప్రాణాలను పణంగా పెట్టి పోరాడి గెలిచింది. కానీ, నేను చేసింది ఏమిటి? 'అనారోగ్యంతో బాధపడుతున్న తండ్రిని ఆదరించి, అక్కున చేర్చుకోవాల్సింది పోయి.. భార్య మాటలకు జడిసి, తలొగ్గి అనాథగా ఆశ్రమంలో వదిలేసి వచ్చాను. మలివయసులోని తల్లితండ్రులు పిల్లలతో సమానం అంటారే!? ఐతే అప్పుడు నా తండ్రి నాకు పెద్ద కొడుకేగా! మరి నా ఇంటి పెద్దదిక్కును ఎలా ఒంటరిని చేశాను?'.. గట్టు తెగిన నీటి ప్రవాహంలా ఆలోచనలు ఒక్కసారిగా నన్ను నిండా ముంచెత్తాయి. ఎవరు దీనికి కారణం.. నా భార్య రమణినే కదా?!

* * *

తను నా మేనమామ కూతురు. కాలు కింద పెట్టకుండా గారాబంగా పెరిగింది. కోటీశ్వరుల సంబంధాలు కాదని, తమ్ముడి కూతురని చెప్పి అమ్మ ప్రేమతో నాకు కట్టబెట్టింది. ఆ కృతజ్ఞతా భావం రమణిలో ఏనాడూ అణువంత కూడా చూడలేదు. ఆమెకు తన అందం పట్ల మిడిసిపాటు. ఎవరినీ లెక్కచేయని పెంకితనంతో అందరినీ బాధపెట్టడం ఒక్కటే తెలుసు. ఆమె కోరితే కొండమీద కోతినైన పట్టి తేవాలి. లేదంటే అలకపాన్పు! అరిచి గీ పెట్టేది. ఏడ్చేది. నచ్చిన నగలు, బట్టలు, ఇల్లు, చుట్టాలు.. అన్నీ ఆమె కోరుకున్నట్టే జరగాలి. జరిగాయి కూడా! మొదట్లో అమ్మకోసం చూసీ చూడనట్టు ఉన్నాను. ఏదో చిన్నపిల్లల మనస్తత్వం.. తనే నెమ్మదిగా అర్థం చేసుకొని మారుతుందిలే.. అనుకున్నాను. కానీ, నన్నే తనకు అనుకూలంగా మార్చుకుంటుందని ఆలస్యంగా గ్రహించాను. ఓ రోజు తన ప్రవర్తనతో చిరాకేసి ఎదురుతిరిగాను. అంతే! అరచి గోలగోల చేసింది. చస్తానని బెదిరించింది. ఉత్తి బెదిరింసే కదా! అనుకున్నా.. నిజంగానే నిద్ర మాత్రలు మింగింది. ఇక ఆ దెబ్బతో ఒక్కగానొక్క కొడుకు సమిత్‌ను తల్లిలేని వాడిగా చేయడం ఇష్టంలేక.. వాడికోసం ఆమెకు లొంగిపోయాను. పూర్తిగా రాజీపడిపోయి తను ఆడమన్నట్లు ఆడుతున్నాను. నా చదువు, తెలివితేటలు, అనుభవం.. రమణి ముందు తేలిపోయాయి. ఎందుకూ కొరగాకుండా పోయాయి.

'మొన్నటిదాకా మీ అమ్మకు సేవలు చేసిచేసి నా చేతులు పడిపోయాయి. ఇప్పుడిక మీ నాన్నవంతా? నావల్ల కాదు. పైగా ఆయన రోగిష్టి మనిషి. మల మూత్రాలతో ఇల్లంతా రొచ్చురొచ్చు. వెంటనే ఏదైనా వృద్ధాశ్రమంలో చేర్పించండి'.. అన్నది రమణి ముక్కు మూసుకుంటూ.

ఆ మాటలకు నాలోని కోపాన్ని అణిచిపెట్టుకున్నాను.

'ఒక్కక్షణం ఆలోచించు రమణి. మా అమ్మకు పనిమనిషితోనే అన్ని పనులూ చేయించాం కదా! ఇప్పుడు కూడా ఒక మేల్ సర్వెంట్‌ను పెట్టుకుందాం. అతనే నాన్నకు అన్ని పనులూ చేసి పెడతాడు. ఈ ఒక్కసారికి నా మాట విను. అసలే నాన్న పేషంట్!' అని బతిమిలాడాలని అనుకున్నాను. వినకపోతే ఆ చెంపా, ఈ చెంపా వాయించాలని అనుకున్నాను. కానీ, ఏదీ చేయలేక పోయాను. ససేమీరా నా మాట వినదు. అది ప్రతిసారీ రుజువు అవుతూనే ఉంది. కాదని ఎదురు తిరిగితే జరిగే పరిణామాలు తెలుసు. అందుకే ఇక చేసేదిలేక, మారు మాట్లాడకుండా.. బేలగా నావైపే చూస్తున్న నాన్నను ఈ చేతులతో ఆశ్రమంలో దిగబెట్టి వచ్చాను.

* * *

కానీ, ఇప్పుడు ఇదంతా చూశాక నాకు అనిపిస్తున్నది. ఒక నోరులేని జీవి తన బిడ్డల్ని కాపాడుకోవడం కోసం ఇంతలా తెగించింది. తెలివి, డబ్బు, హోదా అన్నీ ఉండికూడా నా కన్నతండ్రిని రక్షించుకోలేక పోతున్నానే! కేవలం భార్య బ్లాక్‌మెయిలింగ్‌కు భయపడి, నా రక్తబంధాన్ని చిన్నచూపు చూస్తున్నానే! ఇలా ఎంతకాలం? ఎందుకు భరించాలి? జీవితపు

చివరి అంచున నిల్చిన నాన్నను ఎందుకు క్షోభకు గురిచేయ్యాలి? ఇంతకాలం కొడుకు కోసం, పరువు కోసం రమణి పట్ల ఓర్పు వహించాను. ఇకపై ఆమె ఆటలు నా దగ్గర సాగవు. డాక్టర్ నిపున్ చెప్పిన ఫైట్ ఆర్ ఫ్లయిట్‌కు ఇప్పుడు నా దగ్గర తగిన సమాధానం ఉంది. ఇలా అనుకొనేసరికి ఇన్నాళ్లూ అణచివేసుకున్న ఆవేశం, ఆక్రోశం ఒక్కసారిగా.. లావాలా నాలో ఉప్పొంగింది. నన్ను ఉక్కిరిబిక్కిరి చేసింది. అంతే! మెడిసిన్స్ ఆ చెత్తకుండీలో వేసి, రమణికి ఫోన్ చేశాను.

'ఆ.. చెప్పండి!' అన్నది తను.

'నేను.. నేను నాన్నను తీసుకు వస్తున్నాను!' నా గొంతులో కొంచెం తడబాటు.

'ఎక్కడికి?!' ఆమెలో విస్మయం.

నేను వెంటనే తడబాటు నుంచి తేరుకొని దృఢంగా అన్నాను..

'మన ఇంటికి.. నాన్నను మన ఇంటికి తీసుకు రావాలని అనుకుంటున్నాను!'.

కొద్దిసేపు అటువైపు నిశ్శబ్ధం! ఊహించని నా ధోరణికి బిత్తరపోయి ఉంటుంది.

'అదేమిటి? వారం రోజుల క్రితమే వృద్ధాశ్రమంలో వేశాం కదా!' గట్టిగా అన్నది.

ఆమెలో కోపం, చిరాకు మొదలైంది.

'అవును.. కానీ, ఇక నాన్న మనతోపాటే ఉంటాడు'.

'నిర్ణయం తీసేసుకున్నారా! వచ్చే నెలలో అబ్బాయి సమీత్ అమెరికా నుంచి వస్తాడు. వాడికి పెళ్లి చెయ్యాలని అనుకుంటున్నాం. నట్టింట్లో రోగిష్టి మనిషిని పెట్టుకొని శుభకార్యం ఎలా చేద్దాం అనుకంటున్నారు?'.

నేను ఏమాత్రం తగ్గలేదు.

'మంచిదే! నాన్న తన మనవడి పెళ్లిని కళ్లారా చూసి ఆశీర్వదిస్తారు'.

అంతే! అటువైపు నుంచి భళ్లున ఏదో పగిలిన శబ్దం! ఏదో పింగాణీ పాత్రను నేలకేసి కొట్టి ఉంటుంది. కానీ, నేను అవేం పట్టించుకోకుండా చెప్పాల్సింది అంతా చెప్పాను.

'చూడు రమణి.. ఇన్నాళ్లూ నువ్వు చెప్పిందల్లా చేశాను. ఆడమన్నట్లు ఆడాను. నీ ప్రవర్తనతో నాతోపాటు అందరినీ బాధపెట్టావ్. ఇంతకాలం నీ మాట కాదంటే ఏ అఘాయిత్యం చేసుకుంటావోనని నా వ్యక్తిత్వాన్ని చంపుకొని బతికాను. ఇక చాలు. దేనికైనా ఓ లిమిట్ ఉంటుంది రమణి. నువ్వు అది దాటిపోయావు. అయినా రేపు కొడుకు, కోడలు కూడా నీలాగే చేస్తే ఏం చేస్తావ్. ఆవు చేలో మేస్తే.. దూడ గట్టున మేస్తుందా!?'.

'ఏమో మరి! ఈరోజు కొత్తగా మాట్లాడుతున్నారు. జరుగబోయే పరిణామాలకు సిద్ధంగా ఉండండి'..

'నీతో అన్నిటికీ సిద్ధపడే ఈ నిర్ణయం తీసుకున్నాను'..

వెంటనే కాల్ కట్ చేసింది రమణి. తనతో మాట్లాడాక.. ఎందుకో ఒప్పించగలనన్న ఆశ నాలో చిగురించింది. చాలా రోజుల తర్వాత నా మనసుకు మొదటిసారిగా ప్రశాంతత కలిగింది. నా మానసిక స్థితి నాకు క్రమంగా అర్థం కాసాగింది. రమణి చేష్టలతో ఇంతకాలం

విసిగిపోయి డిప్రెషన్‌లోకి జారుకొని.. మనుషుల మీద నమ్మకం, విశ్వాసం కోల్పోయి.. ఎవరు ఎటుపోతే నాకేంటని నా చుట్టూ ఒక గిరి గీసుకుని బతికాను. నా చుట్టూ జరుగుతున్న వాటిపట్ల స్పందించడం మానేసి.. వివేకం, విచక్షణ మరచిపోయి ఒక జంతువుల బతికిడుస్తున్నందుకే.. ఆ ఘోరమైన యాక్సిడెంట్‌కు చలించలేదు. దయనీయమైన బాలింతపై జాలి కలుగలేదు. నా ప్రియమైన నాన్ననూ ఒంటరిగా, దిక్కులేని అనాథగా ఆశ్రమంలో వదిలేసి రాగలిగాను. హే భగవంతుడా! ఎంత పొరపాటు చేశాను. ఇలా ఆలోచించేసరికి నాన్నతో నాకున్న గత స్మృతులు ఒక్కొక్కటీ గుర్తుకు రాగా.. నాగుండె చెరువైంది. ఆశ్రమంలో వదిలేసి వస్తున్నప్పుడు.. నాన్న నావైపు చూసిన చూపులు ఇప్పుడు గుర్తొస్తున్నాయి.

'ఇదిగో నాన్నా.. ఇప్పుడే నీ దగ్గరికి వచ్చేస్తున్నా!' అంటూ ఫోన్ తీసి, వణికే చేతులతో ఆశ్రమం ఫోన్ నెంబర్ కోసం వెతకసాగాను. కంటికి అద్దాలున్నా కూడా అంతా మసక మసగ్గా కనిపించింది. ఒక్కక్షణం అద్దాలు తీసేసరికి.. జలజలా కన్నీళ్లు ధారాపాతంగా చెంపలపై ఆగకుండా రాలుతునే ఉన్నాయి. రమణి గయ్యాళితనం, నాన్న ఒంటరితనం, అనారోగ్యం మూడు శునకాలై.. ఆయన్ని కబళించాలని చూస్తున్నట్టు అనిపించింది. అంతే.. ఇక ఆగలేకపోయాను. కారును ఆశ్రమం వైపు వేగంగా దూకించాను. జీవితంలో సమస్యలు ఎదురైతే పారిపోవడం, కృంగిపోవడం చేయకూడదు. కన్నవారి కోసం ప్రాణాలు కూడా లెక్కచేయకూడదని ఆ నోరు లేని జీవి నాకు నేర్పిన జీవిత పాఠాన్ని నా మనుసులో పదిలంగా దాచుకున్నాను.

* * *

**కళిఒజ్జల భాస్కరా చారి స్వస్థలం వరంగల్ జిల్లా పైడిపెల్లి గ్రామం. వృత్తిరీత్యా ప్రభుత్వ ఉపాధ్యాయుడు. ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లాలో పనిచేస్తున్నారు. 2012 నుంచి కథలు రాస్తున్నారు. ఈయన రాసిన మొదటి కథ.. 'వేపచెట్టు' ఆంధ్రభూమి వార పత్రి–కలో ప్రచురితమైంది. 2014లో రాసిన 'జీవితార్థం' కథ.. స్వాతి మాస పత్రికలో వచ్చింది. చాలాకాలం విరామం తర్వాత గత ఏడాదిన్నరగా మళ్లీ కథలు రాస్తున్నారు. ఇప్పటివరకు తొమ్మిది కథలు రాశారు. ఇవన్నీ తెలుగు వెలుగు, నమస్తే తెలంగాణ, వెలుగు, నవతెలం–గాణ ఆదివారం అనుబంధంలో ప్రచురితమయ్యాయి. తొమ్మిదో కథ 'జీవిత పాఠం'.. నమస్తే తెలంగాణ, ముల్కనూర్ ప్రజా గ్రంథాలయం నిర్వహించిన 'కథల పోటీ – 2021'లో ప్రత్యేక బహుమతి దక్కించుకున్నది. 'కథ అంటే కదిలించాలి. చదివిన తర్వాత ఈ ప్రపంచం కొత్తగా కనిపించాలి' అని నమ్ముతారు.**

# వారసత్వం

పదవీ విరమణకు నెల రోజుల ముందునుంచే నా సహోద్యోగులు చేసిన హడావుడికి తెరపడే రోజు వచ్చింది. ఎందుకంటే ఈరోజే ఇక్కడ నా ఉద్యోగానికి ఆఖరు రోజు.

అన్ని విభాగాలలో నాతో పనిచేసిన వారంతా నాతో మాట్లాడేముందు కన్నీళ్లు ఆపుకొంటున్నట్టు అనిపించడం.. నా భ్రమే అయ్యుండొచ్చు. కానీ, అదొక అందమైన భ్రమ కదా!

పెద్దసభలా కాకుండా నేను పనిచేసే బల్లముందే వీడ్కోలు సభకు అన్ని ఏర్పాట్లూ చేశారు. నా పని గంటలు పూర్తయ్యి, కంపెనీకి తిరిగి ఇవ్వాల్సిన వస్తువులన్నీ ఇచ్చేసి బరువు తీర్చుకున్నాక.. కార్యక్రమం ప్రారంభమయింది.

దయామోయ్.. తాను ఒక రోజువారీ కూలీగా చేరాక, తనకు చదువుమీద ఉన్న ఉత్సాహం గమనించి.. అతణ్ని ప్రోత్సహించి, అక్కడే ఒక టెక్నీషియన్‌గా పనిచేసే స్థాయికి చేరడానికి నేను చేసిన సహాయం గురించి చెప్పాడు. అలాగే బర్మన్.. తన తోటి ఆపరేటర్ల తరఫున ఎన్నో ఏళ్లుగా ఆపరేటర్లుగా పనిచేస్తున్న ఎంతోమందికి దారిచూపి, పాలిటెక్నిక్ పాస్ చేయించి.. పదిహేను ఇరవై ఏళ్లకుగానీ చేరలేని సూపర్‌వైజర్ స్థాయికి ఎదిగే అవకాశం కల్పించానని నాకు ధన్యవాదాలు చెప్పారు. ఉద్యోగుల్ని ప్రోత్సహించడానికి అధికారులకు ఇచ్చే 'ఇంప్రెస్ మనీ' అని ఒకటి ఉందని కూడా తెలియని పరిస్థితులలో..



**రాజమోహన్**
**ఇవటూరి**

తనకొచ్చిన నిధులన్నీ తన సిబ్బంది కోసమే వినియోగించి ఇంజినీర్, సూపర్‌వైజర్ టెక్నీషియన్, రోజు కూలీ అనే భేదాలు లేకుండా అందరినీ ఒకవర్గంగా పని చేయించినందుకు కమల్ ఝా.. తన జట్టు తరపున నాకు కృతజ్ఞతలు చెప్పారు.

ఇదంతా అయ్యాక ఉద్యోగంలో చేరినప్పటి నుంచీ నాతో ఎంతో సన్నిహితంగా పనిచేసిన సహచరుడు మూర్తి మాట్లాడాడు.

'రాజాగారు నాకు ఈ ఉద్యోగానికి ముందునుంచీ తెలుసు. ఆయన స్వయంకృషితో పైకొచ్చిన మనిషి. వారసత్వ ఆస్తులతో, అధికారాలతో ఎదిగిపోయిన ఎంతోమంది గొప్పవాళ్లు మనకు తెలుసు. కానీ, ఎంతో సామాన్యమైన ఆర్థిక పరిస్థితులతో జీవితం ప్రారంభమైనా స్వయంకృషితో పైకొచ్చి, తనతోపాటు తన సహచరులను కూడా ముందుకు తీసుకువెళ్లిన నాయకుడు రాజాగారు మాత్రమే. ఈయన తండ్రి నిజంగా సామ్యవాదాన్ని ఆచరించాలని ప్రయత్నించిన అతికొద్దిమందిలో ఒకరు. సొంత ఆస్తులకూ, అవసరానికి మించి డబ్బు కూడబెట్టడానికి వ్యతిరేకి. కనుకే తోచిన సాయాలు చేసుకుంటూ తనకోసం కానీ, పిల్లల కోసం కానీ ఏమీ వెనకేసుకోలేదు. ఆ ధోరణితోనే తన భార్యకూ, పిల్లలకూ వారసత్వంగా ఏమీ ఇవ్వకుండా చిన్న వయసులోనే ప్రపంచాన్ని వదిలి వెళ్లిపోయారు. అటువంటి పరిస్థితులలో రాజాగారు అన్ని అడ్డంకులనూ ఎదుర్కొని, ఇంత పైకి రావడానికి కారణం.. ఆయన మనోబలమూ, తెలివితేటలూ అని చెప్పడానికి ఏ సందేహమూ లేదు. ఇటువంటి మనిషితో ఇన్నేళ్లు పనిచేయడం నా అదృష్టం' అన్నాడు.

తర్వాత వీరపరాజు మాట్లాడుతూ..

'తండ్రి బుద్ధులతోనే రాజాగారు కూడా ప్రతిరోజూ ఒక తెలియని వ్యక్తికి సాయం చేసే వ్రతాన్ని చిన్నప్పటి నుంచీ పాటించారు. కానీ, ఆయన తండ్రిలా ఉన్నదంతా అందరికీ పంచి పిల్లలను రోడ్డుమీద పడేయకుండా కొంచెమైనా దాచుకోవాలి' అన్నాడు.

ఇక కర్మాకర్..

'ఆయన ఇంకా చదువుకోవాలని అనుకున్నా పెద్దల బలవంతంతో పెద్ద చదువులు వదిలి ఉద్యోగంలో చేరారు. ఉద్యోగం చేస్తూనే ఉన్నత చదువులు చదివి ఎంతో ఎదిగారు. మనందరికీ ఆదర్శమయ్యారు. ఇక్కడ కిక్కిరిసిన సభలో వారి సాయం తీసుకోని వారు ఒక్కరు కూడా లేరనేది పచ్చినిజం. స్వయంకృషితో పైకొచ్చిన రాజాగారు ఉద్యోగ విరమణ చేసినా ఇంకా ఎంతో ఎదుగుతారు' అని కరతాళ ధ్వనుల మధ్య చెప్పాడు.

ఎందరో ఇలా మాట్లాడాక నావంతు వచ్చింది. అందరికీ కృతజ్ఞతలు చెప్పుకొన్నాక నా వైపునుంచి మాట్లాడటం మొదలుపెట్టాను.

'మీరందరూ నాకు కూడా తెలియని ఎన్నో మంచి విషయాలను గుర్తుకుతెచ్చి మరోసారి నా సంతృప్తికరమైన జీవితాన్ని గుర్తుచేశారు. నిజానికి మీరందరూ కూడా సంస్కారవంతులు కనుక నన్నెంతో పొగిడారు తప్ప.. నేను మీరందరూ చెప్పినంత గొప్పవాడిని కాను. మన ఇంటి అరుగు ఒకరికి కూర్చోవడానికి చోటిస్తే.. మన ఇంటి చెట్టు నలుగురికి నీడనిస్తే

సంతోషించడం మనమంతా పాటించే పద్ధతే కదా! నా దృక్పథానికి సరిపోయేలా నా ఆఖరు పనిదినంలో ఆఖరు గంట వరకూ నేను నా బాధ్యత నిర్వహించే వరకూ వేచి ఉండి, నాకు సౌకర్యంగా నా దగ్గరికే మీరొచ్చి ఈ వేడుక ఏర్పాటు చేసినందుకు మీ అందరికీ చాలా కృతజ్ఞతలు' అని చెప్పి ముగించబోయాను.

'రాజాగారూ! ముప్పై ఏళ్లకు పైగా మాతో పనిచేసి, మీరు ఇంత క్లుప్తంగా ముగిస్తే కుదరదు. మీ అనుభవాలను, నేర్చుకున్న విషయాలనూ మీరు చెప్తారనీ.. ఈరోజు కూడా మీనుంచి ఏమైనా తెలుసుకుందామని అనుకునేవాళ్లం ఎందరో ఉన్నాం. దయచేసి మరికొంచెం సేపు మాట్లాడండి' అన్నాడు నూకరాజు.

'మీ సహనానికి చాలా సంతోషం. నాకూ చెప్పుకోవాలనే ఉంది. మీకు ఒక అరగంట ఎక్కువ సమయం కాదనుకుంటే ఇంతవరకూ ఎవరికీ చెప్పని ఎన్నో విషయాలు ఈరోజు చెప్పాలని అనుకుంటున్నాను'.. అని మొదలుపెట్టాను.

* * *

మాది ఒక దిగువ మధ్య తరగతి కుటుంబం.

నాన్నకు మాతోపాటు తన తమ్ములతోనూ, చెల్లెళ్లతోనూ ఉన్న బాధ్యతల వల్ల నాకు ఆయనతో ఎక్కువ సమయం గడిపే అవకాశం ఉండేది కాదు.

ఆ రోజుల్లో ఎందరో ఇంటికి వచ్చేవారు. వచ్చినది ఎవరైనా నాన్న తలుపు వరకూ వచ్చి స్వాగతం చెప్పడం, ఆ అతిథుల్ని ఒక్కక్షణం కూడా నిర్లక్ష్యం చేయకుండా వారితో గడిపి.. వారు వచ్చినప్పుడు ఎంత మర్యాద చూపారో అదే స్థాయిలో వెళ్లేవారికి వీడ్కోలు ఇచ్చేవారు. వచ్చినవారికి జరిగే మధ్యతరగతి స్థాయి మర్యాదలు కూడా అందరికీ సమానమే. ప్రెసిడెంట్ రాధాకృష్ణగారు వచ్చారు.. ఆరుద్రగారు వచ్చారు, యువ రాజకీయ నాయకుడిగా ఉన్న వెంకయ్య నాయుడు గారూ వచ్చారు. ఎప్పుడో మా ఇంట్లో పనిచేసిన గోవిందమ్మ వచ్చేవారు. ఆయన దగ్గరికి సందేహాలతో విద్యార్థులు వచ్చేవారు. మా కాలేజీలో వడ్రంగి పనిచేసే జోగారావు వచ్చేవారు. మా వీధిలో దొంగతనం చేసి దెబ్బలు తింటుంటే, నాన్న రక్షించిన పాషా వచ్చేవారు. అందరికీ ఒకే మర్యాద.

దీపావళికి సరుకులు కొన్నప్పుడు మా ఇంట్లో పనిచేసే ఆవిడ పిల్లలకు కూడా మాతో సమానంగా సరుకులు తీసుకొస్తే మేము అలిగేవాళ్లం. మేము తినే ఫలహారాలు వారికి కూడా పెడితే కోపగించుకునే వాళ్లం. నెమ్మదిగా మాలో ఆయన కోరుకున్న మార్పు వచ్చింది. అందువల్ల మాలో జీవితం పట్ల ఇంకా ఉత్సాహం పెరిగింది. మనవారు అనుకున్న వారి దగ్గర ఎంతో సర్దుకుని బతికే మనం.. ఎక్కువమందిని మనవారు అనుకుంటే మరింత సంతోషంగా బతకగలం కదా!

నేను కొంచెం ఆలోచించే స్థాయికి ఎదుగుతున్న రోజుల్లో.. ఒకరోజు ఓ యువకుడు జంకుతూ ఇంటి ముందుకు వచ్చి..

'నాన్నగారు ఉన్నారా బాబూ?!' అని అడిగాడు.

నాన్న శిక్షణ పొందిన నేను ఎంతో మర్యాదగా..

'ఉన్నారు. లోపలికి వచ్చి కూర్చోండి' అని మాదగ్గర ఉన్న ఏకైక రేకుల కుర్చీ తెరిచి వేశాను.

ఇంతలో నాన్న రానే వచ్చారు.

'నమస్కారమండీ. నా పేరు బాబూరావు. ఇక్కడే ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ చదువుకోవడానికి సీట్ దొరికింది సార్. మీకు కుదిరితే మీరు వారంలో ఏదో ఒకపూట చెప్తే ఆరోజు భోజనానికి వస్తాను' అన్నాడతను.

'అలాగే బాబూ. ఈరోజు తిన్నావా?' అని అడిగింది మా అమ్మ.

'ఇంకా లేదండీ!'.

'నీకు మిగతా వారాలు కుదిరేవరకూ మా దగ్గరే ఉండు' అన్నారు నాన్న.

(అలా చేరిన బాబూరావు వారంలో అన్నిరోజులూ మా దగ్గరే భోజనం చేస్తూ పూర్తిగా చదువుకున్నాడు. అలాగే మరెందరో.. అతను ఇప్పటికీ మమ్మల్ని మరిచిపోలేదు)

అప్పుడప్పుడే ఎదుగుతున్న నేను మొదటిసారి నాన్న గురించి తెలుసుకోవడానికి దోహదం చేసిన సంఘటన అది.

తర్వాత ఇలాంటివి మా జీవితంలో భాగమని అర్థం చేసుకున్నాను.

ఎలాంటి సాయమైనా నాన్న చేయగలరా లేదా అనే సంకోచం లేకుండా ఎవరో ఒకరు వస్తూనే ఉన్నారు. అంతేకాదు నాన్నకేవో తరతరాల ఆస్తులు ఉన్నాయనీ, అందుకే సులువుగా ఎవరికైనా సాయం చేసేస్తున్నారనీ కొంతమంది అనుకోవడం విన్నాను. ఆయనకు జీతం తప్ప మరే సంపాదన లేదనీ, ఆఖరికి తన దగ్గర ప్రతిరోజూ సందేహాలు తీర్చుకునే విద్యార్థుల నుంచి కూడా ఏమీ తీసుకోరనీ చెప్పినా వారు నమ్మరు. ఎందుకంటే ఈ లోకంలో తెగబలిసిన వారు తప్ప ఊరికే సాయం ఎవరూ చేయరని లోకం నమ్ముతుంది కాబట్టి.

నేను ఉన్నత విద్యలో ఆఖరు సంవత్సరం పరీక్షలకు ప్రతిరోజూ నలుగురు స్నేహితులతో కలిసి చదువుకుంటూ ఉండేవాడిని. అలాగే నా స్నేహితుడి ఇంటికే వెళ్తున్నపుడు ఓ రోజు నాన్న..

'ఏరా ఈ రోజు వెళ్లకపోతే ఏమైనా నష్టమా?' అని అడిగారు.

'మేమందరం ఒక్కొక్క అంశం చదువుకుని ఒకరికొకరం వివరించుకుంటున్నాం. నేనీరోజు వెళ్లకపోతే మిగిలిన వారికి కూడా కొంచెం ఇబ్బంది అవుతుంది' అని నేను బయల్దేరాను. అదేరోజు నా తమ్ముడు రాత్రి ఆటకు సినిమాకు వెళ్లాడు. ఎప్పుడూ లేనిది బస్సు ఎక్కేవరకూ టార్చ్‌లైట్ సాయంతో వాడిని దింపి వచ్చారు నాన్న. ఆ అర్ధరాత్రే.. గుండెపోటుతో ఈ లోకాన్ని వదిలి వెళ్లిపోయారు. ఆ రోజే నాన్న శాశ్వతంగా మమ్మల్ని వదిలి వెళ్లిపోతున్నారని తెలిసి ఉంటే ఇద్దరం ఇంట్లోనే ఉండే వాళ్లమేమో!

జరిగిన నష్టం నాకు తెలియడానికి, అందువల్ల కలిగిన అపారమైన నష్టం అర్థం చేసుకోవడానికి కొంత సమయం పట్టింది.

పరీక్షలు మానెయ్యాలనుకున్నా.. అన్నయ్య బలవంతంగా రాయించాడు.

ఏ రోజుకారోజు చదువుకునేలా మాకు దినచర్య అలవాటు చేయించి, వర్షాలు వచ్చినా, బందులు జరిగినా కుంగకుండా కళాశాలకు వచ్చి పాఠాలు చెప్పిన గురువుల ఆశీస్సులతో, ఎన్ని కష్టాలలోనైనా పక్కన నిలబడి చదువులో సాయం చేసిన మిత్రుల సహకారంతో నేను పాసయ్యాను. బంగారు పతకం కూడా దక్కించుకున్నాను.

కానీ, ఆ ఆనందం పంచుకోవడానికి నాన్న లేరు. ఆ విషాదంలో ఉన్న మిగిలినవారు కూడా నిర్లిప్తంగా ఉండిపోయారు.

ఈ వాతావరణంలోనే నేను పెద్ద చదువు కోసం ఖరగ్‌పూర్ బయల్దేరాను.

* * *

నాన్నకు రావాల్సిన పించన్ కోసం తిరుగుతున్నాను. నేను ఏ ఆఫీస్‌కు వెళ్లినా అందరూ లేచి నిల్చొని, నాన్నలేని లోటును గుర్తు చేసుకొని నాకు వీలైనంత త్వరగా సహాయం చేశారు.

మా నాన్న డిపార్ట్‌మెంట్ హెడ్ గణపతిరావు గారు. ఆయన చెడ్డవాడు కాదుగానీ అదోరకం.

'మీ నాన్న పేరుమీద ఒక కాలిక్యులేటర్ వెనక్కి రావాలి. అది మీరు తెచ్చి జమ చేసేస్తే.. నేను ఏ బకాయిలూ లేవని రాసి ఇస్తాను' అన్నారు.

'ఇల్లంతా వెతికాం సర్. ఎక్కడా కనిపించలేదు. అసలు ఆయన వాడుతుండగా ఎప్పుడూ చూడలేదండీ!' అన్నాను.

'అదంతా నాకు తెలియదు. మరొకసారి వెతికి చూడండి' అన్నారాయన.

ముక్కుసూటిగా పోయే మనిషి. వేరే విషయాలలో అంతవరకూ ఆయన నాకు సాయంగానే ఉన్నారు.

నాకేం చెయ్యాలో తెలియలేదు. ఆ రోజుల్లో కాలిక్యులేటర్ అనేది ప్రదర్శనలో మాత్రమే కనిపించే ఒక వింతవస్తువు. అది ఎక్కడ దొరుకుతుందో, ఒకవేళ నేనే కొంటే ఎంత ఖర్చవుతుందో కూడా తెలియదు. అయోమయంగా నేను నడుచుకుంటూ పోతుంటే..

'బాబూ ఆగండి!' అని వినిపించి, వెనక్కి తిరిగాను.

అతను హరగోపాల్. రొప్పుతూ నా దగ్గరికి వచ్చారు. కళాశాల వర్క్‌షాప్‌లో వడ్రంగి పనులు నేర్పిస్తారు. మా ఇంటికి అప్పుడప్పుడూ వచ్చేవారు.

'ఈ కాలిక్యులేటర్ తీసుకుని గణపతిరావు గారికి ఇచ్చేయండి' అన్నారు.. ఒక కాలిక్యులేటర్ నా చేతిలో పెడుతూ.

'అయ్యో ఇది జమ చేసేస్తే మరి మీరెలా..?' అని నేను అడుగుతుంటే..

'నేను చూసుకుంటా లెండి. నాకింకా చాలా ఏళ్ల సర్వీస్ ఉంది కదా!' అన్నాడు.

నేను ఇంకా తటపటాయిస్తుంటే..

'పరవాలేదు. వెళ్లండి' అన్నాడతను.

'ఇక అంతా అయ్యింది కదా!' అని పించను ఆఫీస్‌కు వెళ్లాను.

ఆ సమయంలోనే పర్వతాలరావు అని నాన్న సహోద్యోగి కొడుకు గిరి కూడా అదే పనిమీద వచ్చాడు. వాళ్ల నాన్న కూడా ఇంచుమించు అదే సమయంలో పోయారు. అతణ్ని చూడగానే

గుమస్తా కళ్ళెర్రజేసి..

'నిన్ను ఈవారం రావద్దని చెప్పాను కదా! మళ్లీ మళ్లీ వచ్చి ఎందుకిలా విసిగిస్తావ్?' అని గట్టిగా అరిచాడు.

'నాకుకూడా అదే గౌరవం పడుతుందేమో?!' అని నా గుండె గతుక్కుమని పోయింది.

'నేనింకా మొదటిసారే వచ్చాను కదా!' అనుకుంటూ, భయం భయంగా అతని దగ్గరికి వెళ్లి, అన్ని కాగితాలూ అతని ముందుపెట్టాను.

గిరి వెళ్లాక కూడా అవే ముఖ కవళికలతో, కోపంగా ఉన్న అతని ముఖంలో.. నన్ను చూడగానే ఒక్కసారిగా మార్పు వచ్చింది.

'మీరా బాబూ! మీకు చాలా అన్యాయం జరిగిపోయింది. ఇప్పుడు చేయగలిగింది చేద్దాం! రిటైర్ అయ్యి పించనుకోసం వచ్చేవారయితే వాళ్లే తిరుగుతారు గానీ, పుట్టెడు దుఃఖంలో ఉన్న మీరిలా రాకూడదు. నేను అన్ని కాగితాలూ చూసి పని పూర్తయ్యాక మీ ఇంటికే వస్తాను' అన్నారు.

ఊహించని ఆ మంచితనానికి నేను ఆశ్చర్యపోయాను. ఏమిటీ విచిత్రం? అనుకున్నాను.

'నేను వారంలో ఖరగ్‌పూర్ వెళ్లిపోవాలండీ' అన్నాను దుఃఖం అణచుకుంటూ.

'అలాగా! పరవాలేదు బాబూ. ఈ లోపలే పనైపోతుంది. కాకపోయినా నేను ఇంటికి వచ్చి ఇస్తాను లెండి' అన్నారతను.

మనస్ఫూర్తిగా ఆయనకు నమస్కరించి ఇంటికి వెళ్లాను.

* * *

మొదటిసారి ఒక్కడినీ వేరే ఊరికి వెళ్లాల్సిరావడం వలన చాలా దిగులుగా ఉంది. నన్ను స్టేషన్ వరకూ సాగనంపటానికి వచ్చే సందర్భం కాదు కనుక.. బంధువులంతా అమ్మ దగ్గరే ఉండిపోయారు.

ఒంటరిగా రైలెక్కాక బెంగ ఇంకా పెరిగింది. ఇంతలోనే పదిమంది కుర్రాళ్లు వచ్చారు.

'నువ్వు ఖరగ్‌పూర్‌కే కదా! పద మనవాళ్లంతా ఎస్-ఫోర్ కోచ్‌లో ఉన్నారు' అని నన్ను తీసుకుపోయారు. వాళ్లతో కబుర్లు చెప్పుకొంటూ బాధను మరిచిపోయాను.

బెంగను మరిచిపోవడానికి అందరితో స్నేహం చేసుకుని, నాకు ఏమాత్రం సమయం మిగలకుండా ఏదో ఒక వ్యాపకంలో పడిపోయాను.

నా స్నేహితులు కేవలం నా వయసువారే కాదు. రీసెర్చ్ స్కాలర్స్, ఉద్యోగంలో సెలవు తీసుకుని నాలాంటి చదువులు చదివేవారు, కొత్తగా చేరిన కుర్ర గురువులు, మెస్ ఉద్యోగులు, మా కళాశాల ఉద్యోగులు అందరూ స్నేహితులే.

ఇంత హడావుడిలో కూడా బాధ్యత మరిచిపోలేదు. ఇంత పెద్దచదువు చదువుకుంటూ సంపాదన లేకుండా ఉండకూడదని తెలుసు కనుక నా డిగ్రీ అర్హతలతో ఉద్యోగాలకు దరఖాస్తులు పెట్టుకున్నాను.

వరుసగా ఇంటర్వ్యూలకు ఉత్తరాలు వచ్చాయి. అందులో మొదటిది.. రాష్ట్రీయ విద్యుత్

కేంద్రం నుంచి వచ్చింది. ఢిల్లీకి మొదటిసారి ప్రయాణం చేశాను. మొదటిసారి ముఖాముఖి సమావేశానికి వెళ్లేటప్పుడు భయం వేసింది.

ఆ పెద్దగదిలో అయిదుగురు పెద్దవారు కూర్చుని ఉన్నారు. మధ్యలో ఉన్నాయన వాళ్లకు నాయకుడిలా ఉన్నారు.

నన్నేవో ప్రశ్నలు వేశారు. అడిగిన నాలుగైదు ప్రశ్నలకు సమాధానం బాగానే చెప్పాను. నేను జవాబులు చెప్తున్నపుడే ఆయన నా దరఖాస్తు పరిశీలిస్తున్నారు. మరేమీ ప్రశ్నలు అడగకుండా.. నన్నిక వెళ్లవచ్చని అన్నారు.

ఆయన పక్కనున్నతను..

'ఇంకా బొగ్గు నిర్వహణ, ఓడల్లో విద్యుత్తు ఉత్పత్తి చేయడం అవన్నీ అడగలేదు కదా!' అంటుంటే..

'చాలు.. మనకు వచ్చిన జవాబులను బట్టి నిర్ణయం తీసుకోవచ్చు' అంటూ ముందుకు వంగి ఏదో రాసుకున్నారాయన.

నేను అయోమయంగా ఖరగ్‌పూర్ వచ్చేశాను. నెల రోజుల తర్వాత ఆ సంస్థలో నియామకం అయినట్టు తెలియజేస్తూ ఉత్తరం వచ్చింది.

ఆరోజు సంతోషంతో ఉప్పొంగిపోయాను.

చేరడానికి ఏమేమి కావాలో వారు పంపిన పెద్ద కాగితాల కట్టలో ఉన్నాయి. వారు జమ చేసిన పూచీకత్తు పత్రం మీద నేను రెండేళ్లు ఉద్యోగం వదలకుండా ఉంటానని నిర్ధారిస్తూ ఒకరి సంతకం అవసరం.

'అరే! ఇక్కడ నీకెవరు సంతకం పెడతారురా!?' అన్నాడు మిత్రుడు సాయి.

'ఒరేయ్! ఇక్కడ నాకున్న వందల మిత్రులలో ఆదాయపు పన్ను కడుతూ చదువుకుంటున్న వారు చాలామంది ఉన్నారు. ఎవరో ఒకరు కచ్చితంగా సాయం చేస్తారు' అన్నాను నిశ్చింతగా.

'అదీ నిజమే!' అన్నాడు సాయి.

అందరిలో మంచి స్నేహితుడైన యోగీంద్రనాథ్ దగ్గరికి వెళ్లాను.

'నాకు ఉద్యోగం వచ్చిందండీ!' అని చెప్పాను.

'ఆహా! ఎంత సంతోషకరమైన వార్త. ఇంత సులువుగా చెప్తే ఎలా? మిఠాయిలేవీ?' అన్నారతను.

'అవి కూడా ఉన్నాయండీ' అంటూ అతని చేతికి రెండు మిఠాయిలు ఇచ్చాను.

'ఇది కరెక్ట్!' అని అతను తింటుంటే..

'ఒక చిన్న చిక్కొచ్చిందండీ. మీకేం కష్టం కాదనుకోండి! నేను రెండేళ్లు ఉద్యోగం వదలనని పూచీకత్తు పత్రం మీద మీరొక సంతకం పెట్టాలి' అని ఎంతో నమ్మకంగా అతని చేతిలో కాగితాలు ఉంచి కలాన్ని చేతికిచ్చాను.

యోగీంద్ర ఆ కాగితాలను అటూ ఇటూ తిరగేస్తున్నాడు. పది నిమిషాలైనా.. మళ్లీమళ్లీ కాగితాలను తిరగేస్తాడు తప్ప.. సంతకం పెట్టడేమిటి?

అలాగే అటూ ఇటూ చూసి కాగితాలు వెనక్కి ఇచ్చేస్తూ..

'నా దగ్గర ఆదాయపు పన్ను అంకె లేదయ్యా! గుర్తు లేదు. అది లేకుండా నేను సంతకం పెట్టినా చెల్లదు' అన్నారు.

'మీరు పనిచేస్తున్న సంస్థ పేరు రాస్తే సరిపోతుందేమోనండీ!'.

'అబ్బెబ్బే అలా కాదు. మీకే ప్రమాదం. ఇంకెవరినైనా అడగండి' అన్నారు.

నాకు ఒళ్లు మండింది.

'అతని థీసిస్ కోసం నేను ఎంతో సాయం చేశాను. ఇప్పుడు నాకు సాయం చెయ్యాల్సి వచ్చేసరికి అర్థం లేని కారణాలు చెప్తున్నారు' అనుకున్నాను.

ఇంతలో నాన్న చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి.

'మనం చేసిన సాయం నుంచి ఏదైనా ఆశిస్తే.. అది సాయం కాదు. వ్యాపారం. ఎవరికి ఏం కుదిరితే అంతే సాయం చెయ్యగలరు'..

'నిజమే! నాకు రూమ్‌లో వంట చేసుకోవడానికి ఇతనే సాయం చేశారు. నడిచివెళ్తున్న నాకు మంచి బేరంతో సైకిల్ ఇప్పించి, నాకు చదువుకోవడానికి ఇంకాస్త సమయం మిగిలేలా చేశారు. ఇప్పుడు నేనడిగిన సాయం.. ఆయన వల్ల కాదేమో లే. అయినా ఇంకా ఎందరో మిత్రులున్నారు కదా!' అనుకొని అతని గదిలోంచి బయటికి వచ్చాను.

'ఏమయ్యా బావున్నావా' అన్నారు రామకృష్ణ.

రామకృష్ణగారు మా కాలేజీలో అధ్యాపకుడు. ఇక్కడ రీసెర్చ్‌స్కాలర్. ఆయన ముక్కు పొడవుగా వంపులు తిరిగి ఉంటుందని అందరూ 'చిలక మాస్టారు' అని చెప్పుకొనేవారు.

'బాగానే ఉన్నానండీ' అంటూ ముందుకు నడిచాను.

ఈ సారి చిన్మయి బెనర్జీ దగ్గరికి వెళ్లాను. ముందు ఉద్యోగం వచ్చిందని చెప్పి, మిఠాయిలు ఇచ్చి నెమ్మదిగా విషయం చెప్పాను.

'అయ్యో! మా జ్యోతిష్కుడు ఈ ఏడాది ఏ పత్రం మీదా సంతకాలు చేయవద్దన్నాడే!' అన్నారు బెనర్జీ.

'ఇది ఆస్తుల లావాదేవీల వంటిది కాదు కదా!?'.

'ఏమో! ఆయన 'సంతకం వద్దు' అన్నాడంటే వద్దనుకోవడమే మంచిది కదా!'.

'నిజమేనండి!' అని గది బయటికి వచ్చాను.

మరో రెండురోజుల్లో నాకు అర్థమయ్యింది. ఒక్కరు కూడా నాకు సహాయం చెయ్యడానికి ముందుకు రావడం లేదు. మా ప్రొఫెసర్లను కూడా అడిగి లేదనిపించుకున్నాను. ఒక్కొక్కరూ వారి నిస్సహాయతకు చెప్పిన కారణాలు వినూత్నంగా, వైవిధ్యంగా.. కథలు రాసుకోవడానికి ఎంతో అనువుగా ఉన్నాయి. నేను ఉద్యోగంలో చేరడానికి ఆఖరు రోజు దగ్గర పడుతున్న కొద్దీ.. నాలో ఆందోళన పెరుగుతున్నది.

వేసవికాలం ఎండల్లో నేను పిచ్చోడిలా తిరుగుతుంటే.. మళ్లీ చిలక మాస్టారు (రామకృష్ణ గారు) నాకు ఎదురొచ్చారు.

'ఏమయ్యా బావున్నావా?' అని పలకరించారు.

అసలే నా పని ఏమవుతుందో అనే ఆందోళనతో తిరుగుతున్న స్థితిలో ఆయనకు ప్రతినమస్కారం కూడా చేసే ప్రయత్నం చేయకుండా ముందుకు వెళ్తూంటే..

'ఏమయ్యా రాజా! చాలారోజుల నుంచి చూస్తున్నాను. చేతిలో ఫైల్ పట్టుకుని తిరుగుతున్నావు. ఏమిటి విషయం?' అన్నారతను.

ఇక తప్పదని విషయం చెప్పాను.

'ఉద్యోగం వచ్చిందా! చాలా మంచిది. ఫామ్ నింపుకొని రా.. సంతకం పెట్టేస్తాను' అన్నారాయన.

ఊహించని ఆ మాటకు ఆశ్చర్యపోతూ, అయినా ఒకింత అనుమానంతోనే..

'చాలా థాంక్స్ సర్. అందులో ఏమి రాసుందో ఒకసారి చదివితే మంచిదేమో' అన్నాను.

'అవసరం లేదు. బసవరాజు గారి కొడుకువి. నువ్వేమీ మోసం చెయ్యవులే. చెయ్యలేవు. రేప్పొద్దున్నే మా ఇంటికి వచ్చేయ్. భోజనం చేసి వెళ్దువు గాని. ఇలా ఎండలో తిరగకు' అన్నారు.

ఆయనకు కృతజ్ఞత ఎలా చెప్పాలో తెలియక ఇబ్బందిగా నుంచుంటే..

'మీ నాన్న అయితే ఒక్క ప్రశ్న కూడా అడగకుండా ఎంతోమందిని నమ్మి సహాయం చెయ్యలేదూ. మరి ఆయన శిష్యుడిగా నేను మరోలా ఉండలేను కదా! రేపు ఇంటికి వచ్చేయ్' అని నన్నింకా ఇబ్బంది పెట్టకుండా, అక్కడినుంచి కదిలారు చిలక మాస్టారు. కాదుకాదు.. రామకృష్ణ మాస్టారు.

నాన్న మరో సందర్భంలో చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి.

'మనం ఒకరికి అప్పు ఇస్తే వారు తీర్చేయడం మన వ్యావహారికం. కానీ, దేవుడి లెక్కలు చాలా సంక్లిష్టమైనవి. నీకు సాయం చేసే వారు నీనుంచి సాయం పొందిన వారే కానక్కరలేదు!'.

సమస్య ఆ విధంగా పరిష్కారం అయ్యింది కనుక అన్ని డాక్యుమెంట్లు తీసుకుని ఢిల్లీ వెళ్లాను.

ఇరవై అంతస్తుల భవనంలో వెతుక్కుని మానవ వనరుల అధికారి రాధాకృష్ణ గారి దగ్గరికి వెళ్లాను.

నేను వెళ్లేసరికి అతను ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడుతున్నారు.

'కష్టం శాస్త్రిగారూ ! రోజుకు వందమంది పైగా చేరుతున్నారు. అప్పుడప్పుడూ నేను ఉండను' అంటున్నారు రాధాకృష్ణ.

అవతలి నుంచి ఎవరో మాట్లాడుతుంటే.. మళ్లీ సమాధానంగా..

'సరే నా ప్రయత్నం చేస్తాను' అని అతను చెప్తుంటే.. నా అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఆయన ముందు ఉంచాను.

ఆ ఆర్డర్‌పైనే కనిపిస్తున్న నా పేరు చూడగానే అతను..

‘ఒక్కసారి ఆగండి శాస్త్రిగారూ! అతను ఇప్పుడే వచ్చాడు’ అని చెప్పి, ‘మిస్టర్ రాజా! సీతారామశాస్త్రి గారు మీతో మాట్లాడాలని అనుకుంటున్నారు’ అన్నారు.

‘ఆయనెవరు?’ అన్నాను అయోమయంగా.

‘ఆయనకు మీరు తెలుసు. ఒకసారి మాట్లాడండి’ అంటూ ఫోన్ అందించారు.

నేను అయోమయంగా ఫోన్ తీసుకుంటే.. అవతల నుంచి,

‘నేను సీతారామశాస్త్రిని మాట్లాడుతున్నాను’ అన్నారు ఎవరో.

ఆయనెవరో తెలియక నేను మౌనంగా ఉంటే..

‘మీ నాన్న, నేనూ స్నేహితులం. సాయంత్రం మా ఇంటికి రా’ అని ఇంటిదారి చెప్పారు.

నేను వెతుక్కుంటూ ఆయన ఇంటికి వెళ్లేసరికి.. నన్ను ఇంటర్వ్యూ చేసిన జట్టుకు నాయకుడే సీతారామశాస్త్రి గారని అర్థమయ్యింది. నాలో నాన్న పోలికలు గమనించగానే, ఆయన నా దరఖాస్తు పరిశీలించి మరెక్కువ ప్రశ్నలు వేయకుండా ఉద్యోగానికి ఎంపిక చేసి ఉండొచ్చని నాకు అర్థమయ్యింది. ఆ మాటే అంటే ఆయన నవ్వేసి..

‘చదువులో బంగారు పతకం కూడా సంపాదించుకుని ఉత్తీర్ణుడివైన నిన్ను ఎన్నుకుంటే ఎవరూ ప్రశ్నించలేరు’ అన్నారు.

కానీ.. నిజం నిజమే. ఈ ఉద్యోగం నాన్న చలవే!

వాళ్ల పిల్లలను పరిచయం చేశాక.. వాళ్లు లోపలికి వెళ్తే, ఎందుకో వాళ్ల రెండో అమ్మాయి అక్కడే ఉండి నాతో చాలాసేపు మాట్లాడింది. తను బొద్దుగా ఉన్నా కొన్నాళ్లు సరదాలు వదులుకోకూడదనే ప్రస్తుతం ఎటువంటి వ్యాయామాలు చెయ్యడం లేదనీ, ఒక్కసారి తలుచుకుంటే అవన్నీ పెద్దకష్టం కాదనీ ఇంకా ఏమేమో మాట్లాడింది. తర్వాత మా అన్నయ్యకు ఇంకా పెళ్లి కాలేదనే విషయం కూడా పెద్దవాళ్లు తెలుసుకున్నారు. అప్పుడు వారి ముఖంలో కొంచెం నిరాశ కనిపించింది. ఆ వయసులో నాకు అర్థం కాకపోయినా.. వారు నాకు పిల్లను ఇవ్వాలనుకున్నారని తర్వాత తెలిసింది. ఏ ఆస్తీలేని నన్ను అల్లుడిగా చేసుకోవాలనుకుంటే అందులో నా గొప్పతనం కన్నా నాన్న మంచితనమే కారణమని త్వరలోనే అర్థమయ్యింది.

ఆ తర్వాత నాకు ఫరక్కాలో పోస్టింగ్ వచ్చినప్పుడు ఊరుకాని ఊరిలో భాషరాక కొట్టుమిట్టాడుతున్న నన్ను ఆదుకున్నది.. నాన్న శిష్యులు చంద్రశేఖర్ గారే! ఇలా చెప్పుకొంటూ పోతే చాలానే ఉంది. కానీ, అనుక్షణం నాతోపాటు నాన్న మంచితనం దన్నుగా వస్తూనే ఉంది. అవసరానికి ఆదుకుంటూనే ఉంది.

* * *

‘నామీద ఎంతో ప్రేమతో కొందరు మా తండ్రి మాకు వారసత్వంగా ఏ ఆస్తీ ఇవ్వకుండా వెళ్లిపోయారని అన్నారు. వారి ఆప్యాయతకు సంతోషించినా.. వారి మాటను మాత్రం ఒప్పుకోలేను. పదవీ విరమణ రోజు ప్రతివారూ వారెంత స్వయంశక్తితో పైకొచ్చారో, ఎంతో కొంత కల్పించి కూడా చెప్తారు. నేను కూడ అంతేనేమో.. కానీ, నేను నిజాయితీగా

చెప్పాలనుకున్నది ఒకటే. నేను సంపాదించింది ఏమిటంటే.. నాన్న ఆశీర్వాదం. ఆయనిచ్చిన జన్మ. మా నాన్న నేనెప్పటికీ కోల్పోని వారసత్వాన్ని ఇచ్చారు. ఆయన మంచితనమే నాకు తరగని ఆస్తిగా మిగిలింది. ఆయన బాటలోనే నడిచి నేను కూడా మీలాంటి ఎందరో ఆప్తులను సంపాదించుకున్నాను. ఈ ఆస్తినే నేను నా పిల్లలకు వదిలివెళ్తాను. అలా అని మీరందరూ నాకేదో ప్రతిఫలంగా మా పిల్లలకు సాయం చేస్తారని నా ఉద్దేశం కానే కాదు. నాన్న చెప్పినట్టు దేవుడి లెక్కలు వేరే ఉంటాయి' అని ముగించాను. నా ఉపన్యాసానికి ఎలా స్పందించాలో తెలియక నిశ్శబ్దంగా ఉన్న ఆ సభకు నమస్కరించి, నెమ్మదిగా వేదిక నుంచి దిగుతుంటే.. నాన్న నా పక్కనే నడుస్తూ ఇంకా నా వెనకే ఒక దన్నుగా వస్తున్నట్టు అనిపించింది.

* * *

**రాజమోహన్ ఇవటూరి స్వస్థలం విశాఖపట్నం. ఆంధ్ర విశ్వ విద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ చేశారు. టెక్ మహీంద్రాలో వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేసి, 2021 నుంచి సొంత సంస్థను నడుపుతున్నారు. 1994 నుంచి కథలు రాస్తున్నారు. మొదటి కథ 'ఓ తమ్ముడి కథ'.. రచనలో ప్రచురితమయింది. ఇప్పటివరకూ యాభైకి పైగా కథలు రాశారు. తిక్క శంకరయ్య కథ.. విమర్శకుల ప్రశంసలు పొందడంతోపాటు 'మిసిమి' పత్రికలో అచ్చయ్యింది. ఓ తమ్ముడి కథ, అవ్వగారు కథలకు బహుమతులు దక్కాయి. వీరి తండ్రి జ్యేష్ఠ పేరిట ఏర్పాటుచేసిన 'జ్యేష్ఠ లిటరరీ ట్రస్ట్' ఆధ్వర్యంలో 1990 నుంచి ఏటా ఉత్తమ కథ, ఉత్తమ కథా సంకలనాలకు పురస్కారాలు అందిస్తున్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో పుస్తకాలను ప్రచురిస్తున్నారు. తన స్వీయ అనుభవాల నుంచే.. 'వారసత్వం' కథకు ప్రాణం పోశారు రచయిత రాజమోహన్.**

# సహనశీలి




**ఎం.టి. స్వర్ణలత**


'గీతా.. గీతా.. ఎక్కడున్నావు?'.

'ఆ.. వస్తున్నానత్తయ్యా!'.

'తల నొప్పిగా ఉంది. ఓ కప్పు కాఫీ ఇస్తావేమోనని పిలుస్తుంటే పలకవేం.. ఇంట్లో పెద్దవాళ్లను పట్టించుకోవాలన్న జ్ఞానం ఉండాలి కదా! అయినా నిన్నని ఏం లాభం.. అది మా తలరాత..' అన్నది జానకమ్మ.

'ఇంతకుముందు మీ అత్తగారింట్లో ఇలాగే వెలగబెట్టావా కాపురం? ఎప్పుడూ ఏడుపు మొహం వేసుకుని ఇంట్లో తిరుగుతావు. చచ్చినవాడిని ఇంకా మర్చిపోలేదా!? ఇలా అయితే నా కొడుకు సుఖపడినట్టే!' అన్నది మళ్లీ తానే.

'అబ్బే అదేం లేదత్తయ్యా.. బాబు ఏడుస్తుంటే వాణ్ని సముదాయిస్తున్నా..' తన వెనుక నక్కి, భయంగా తొంగిచూస్తున్న మూడేళ్ల బాబును చేతితో తాకుతూ అన్నది గీత.

'వేలెడు లేడు వీడు ఎప్పుడూ.. 'అమ్మా .. అమ్మా' అని కొంగుపట్టుకు వేలాడుతాడు. చక్కగా బొమ్మలతో ఆడుకోవచ్చు. మేమూ కన్నాం పెంచాం.. కానీ, మా పిల్లలు ఎప్పుడూ ఇలా అమ్మకూచీలా పనులకు అడ్డం పడలేదు. పాపం ఏమాట కామాటే చెప్పుకోవాలి.. అది ఉన్నప్పుడు అన్ని పనులూ చక్కబెట్టి, మమ్మల్ని కూడా

చక్కగా చూసుకునేది. అల్పాయుష్షుది.. మధ్యలోనే పోయింది'.. చనిపోయిన కోడల్ని గుర్తు చేసుకుంటూ అన్నది జానకమ్మ.

కళ్లనుంచి ఉబికి వచ్చే నీటిని పంటిబిగువున ఆపుతూ.. వంటింట్లోకి నడిచింది గీత.

పాలు మరుగుతున్నట్లే.. ఆమె ఆలోచనలూ కదులుతున్నాయి.

* * *

ఎంత చిత్రమైన జీవితం తనది. చిన్నతనంలోనే అమ్మానాన్నలు చనిపోతే.. అన్నయ్యా వదిన అమ్మనాన్నలై ఆ లోటు తెలియకుండా పెంచారు. ఎంతగానో ప్రేమించి పెళ్లిచేసుకున్నాడు యశ్వంత్. తనను ఎంతో అపురూపంగా చూసుకునేవాడు. అత్తయ్య, మామయ్య.. తనను సొంత కూతురిలా ఆదరించేవారు. ఏడాది తిరిగే సరికల్లా తను నెలతప్పడంతో ఎంతో ఆనందపడ్డారు. అమ్మాయి పుట్టాలని ఆశపడ్డారు. బాబు పుట్టాడనీ, అచ్చు వాళ్ల నాన్నలా ఉన్నాడని తెలియగానే.. చూడాలని బయల్దేరిన ముగ్గురూ.. బాబును చూడకుండానే కారు ఆక్సిడెంట్‌లో చనిపోయారు. తన జీవితం తల్లకిందులైంది. బాబుతోడిదే లోకంగా కన్నీళ్లతో కాపురం చేస్తున్న తనను..

'తండ్రిలేని పిల్లాడిలా పెరగడం.. బాబుకు మంచిది కాదు. వాడికి ఊహ తెలియకముందే నువ్వు మరో పెళ్లి చేసుకోవాలి'.. అంటూ శతవిధాలా ప్రయత్నం చేసి సుధీర్‌తో మరోపెళ్లికి ఒప్పించారు అన్నయ్య వాళ్లు. జీవితాంతం వారికి భారంగా ఉండకూడదని ఈ పెళ్లికి ఒప్పుకున్నది.

అన్నయ్య వాళ్ల కోలిగ్ ఫ్రెండ్ సుధీర్. చాలా మంచివాడు. భార్య క్యాన్సర్‌తో చనిపోయిందని చెప్పారు.

* * *

'గీతా!'.. హాల్ లోంచి అత్తయ్య అరుపులకు ఈ లోకంలోకి వచ్చింది.

కాఫీ కప్పుతో హడావుడిగా హాల్‌లోకి వెళ్లి కాఫీ అందించింది.

ఎప్పుడు వచ్చిందో అత్త పక్కనే కూర్చుని చూస్తున్నది.. ఆడపడుచు సునీత. ఆవిడ భర్తకు విడాకులు ఇచ్చింది. ఇంట్లోనే ఉంటుంది. ప్రతీ విషయానికి వాళ్లమ్మకు వంత పాడుతూ ఉంటుంది.

వెళ్లి ఆవిడకుకూడా కాఫీ తెచ్చి ఇచ్చింది గీత.

'వదినా ఇక్కడికి దగ్గరలోనే ఓ క్రెష్ ఉంది. అందులో చేర్పించు బాబును. ఎంతసేపూ నిన్ను వదలడం లేదు. పిల్లలను స్వేచ్ఛగా పెంచాలి'.. సలహా ఇచ్చింది సునీత.

'నేనేం ఉద్యోగం చేయడం లేదు కదా.. బాబును వదిలి ఉండటానికి. ఉద్యోగస్థులు తప్పనిసరి పరిస్థితుల్లో అక్కడ ఉంచుతారు. అయినా వాడిని దూరం పెట్టే అవసరం ఏముంది? నా యశ్వంత్ ప్రతిరూపం వాడు.. అచ్చం వాళ్ల నాన్న పోలికలను పుణికి పుచ్చుకున్నాడు. వాణ్ని చూస్తూనే జీవితం గడిపేయొచ్చు. అయినా అన్ని పనులూ చేస్తున్నా

కదా! చేసిన పనులలో తప్పులు వెతకడం తల్లీ కూతుళ్లకు అలవాటైంది!' మనసులో అనుకుంది గీత.

* * *

సోఫాలో కోసి పెట్టిఉన్న ఆపిల్ ముక్కలను బాబు రెశ్వంత్ తినడం మొదలుపెట్టాడు. లోపలినుంచి వచ్చిన సునీత మండిపడింది. తాను తినాలని కోసి పెట్టుకున్న ముక్కలు తినేసాడని వాడిని ఈడ్చేసింది. ఆ ఊపుతో వాడు దూరంగా పడి, ఏడుపు మొదలు పెట్టాడు.

'దరిద్రపు వెధవ.. దరిద్రపు వెధవ.. శనిలా దాపురించాడు! ఎవడికి పుట్టాడో ఏంటో?' అంటూ ఈసడించుకుంది.

గీత రావడం చూసి..

'పిల్లాడు ఎక్కడికి వెళ్లాడో చూసుకోవాలి కదా..' అన్నది

'నేను టాయిలెట్‌కి వెళ్లి వచ్చేలోగా వీడు బయటికి వచ్చాడు' అన్నది గీత.

'పిల్లలంటే ఎక్కడ ఉండమంటే అక్కడ ఉండాలి. ఇలాంటి అల్లరి పిల్లాడిని ఎక్కడా చూడలేదమ్మా!' అన్నది జానకమ్మ.

సుధీర్ రాగానే ఇద్దరూ ఆ విషయాన్ని చిలువలు వలువలు చేసి చెప్పారు.

గదిలోకి వచ్చిన సుధీర్..

'చూడూ నువ్వు తెలివైన దానివి అనుకున్నాను. నాకు చాలా సమస్యలు ఉన్నాయి. నువ్వూ సమస్యగా మారొద్దు..' కటువుగా చెప్పి, బయటికి వెళ్లిపోయాడు.

పెళ్లయ్యాక తనతో మాట్లాడిన మొదటి మాట అది. తన తప్పు లేకపోయినా.. తననే అనేసరికి తనను ప్రాణంగా చూసే భర్త.. కూతురిలా చూసే

అత్తామామలు గుర్తొచ్చి.. ఏడుస్తూ కూర్చుంది.

మరుసటి రోజు ఉదయం సుధీర్ ఆఫీస్‌కు వెళ్తున్నాడు. అప్పుడే రెశ్వంత్ బయటి నుంచి లోపలికి వస్తున్నాడు.

అప్పుడే వచ్చిన జానకమ్మ..

'ఈ వెధవ పుట్టగానే అందరినీ పొట్టన పెట్టుకున్న నష్టజాతకుడు. నా కొడుక్కు ఎదురువెళ్తుంటే ఆపేది లేదా!?'.. అంటూ అరిచింది.

'ఆ పసివాడి తప్పు ఏముంది? అంతా వీళ్ల మనసులలోనే ఉంది!' అనుకుంది గీత.

'ఆపవే.. అవేం మాటలు' అన్నాడు మామ వెంకట్.

'మహాతల్లి కొడుకును వాళ్లవాళ్ల దగ్గరే వదిలేసి వస్తుంది అనుకుంటే.. వాడితో మాట్లాడి ఇక్కడికీ తెచ్చింది' అన్నది జానకమ్మ.

'అంత చిన్నపిల్లవాడిని వదిలి ఎలా వస్తుంది అనుకున్నావే!'.

'మన కర్మ.. మన కర్మ ఇలా తగలబడింది. ఏం చేస్తాం!' అన్నది జానకమ్మ.

రోజూ ఏదో ఓ విషయంలో.. బాబును గీతను తిట్టడమే పనిగా పెట్టుకున్నారు తల్లీ

కూతుళ్లు.

'ఏం చేయాలా!?' అని ఆలోచించడం మొదలుపెట్టింది గీత.

'అవును.. వీళ్లంతా ఇలా ఖాళీగా ఉండటం వల్లే ఇటువంటి చెత్త ఆలోచనలు వస్తున్నాయి. వీళ్లను ఏదైనా పనిలో బిజీగా ఉండేలా చూడాలి!'

అనుకుంది మనసులో..

ఇంట్లో మార్పు తనే తీసుకురావాలని నిర్ణయించుకుంది.

'యశ్వంత్.. నాకా శక్తిని ఇవ్వు! మన బిడ్డకు మంచి కుటుంబాన్ని ఇవ్వాలని కోరుకుంటున్నాను. ఎక్కడ ఉన్నా నాకు సహకరించు!' అనుకుంటూ, కన్నీటిని తుడుచుకున్నది.

* * *

సమయం రాత్రి తొమ్మిది గంటలు. సుధీర్ ల్యాప్‌టాప్‌లో ఏదో వర్క్ చేసుకుంటున్నాడు. బాబును తీసుకుని పాలున్న ఫ్లాస్క్‌తో గదిలోకి అడుగు పెట్టింది గీత. పాలను గ్లాస్‌లో పోసి సుధీర్‌కు ఇవ్వబోయింది..

'అక్కడ పెట్టు..' అన్నాడు.. తనవైపు చూడకుండానే!

గ్లాస్ టేబుల్‌పై ఉంచి.. మరో గ్లాస్‌లో పాలు పోసి బాబుకు తాగించబోయింది.

'అమ్మా.. నాన్న ఏం చేస్తున్నారు' అన్నాడు వాడు.

'నాన్న పని చేసుకుంటున్నారు.. అల్లరి చేయొద్దు' అన్నది.

'మరి నేను నాన్నతో ఎప్పుడు ఆడుకోవాలి?'.. చక్రాల్లాంటి కళ్లు తిప్పుతూ అడిగాడు.

'ష్.. ఇప్పుడు కాదు! సెలవురోజు ఆడుకోవాలి. ఇక పడుకో!' అని చెప్పింది.. సుధీర్ వైపు చూస్తూ!

ఇదేమీ పట్టనట్టు తన పనిలో మునిగిపోయాడు అతను.

'అయితే నాకు కథ చెప్పు..' అన్నాడు వాడు.

'సరే.. అల్లరి చేయొద్దు. కళ్లు మూసుకో నేను కథ చెబుతాను'.

కాసేపటికి నిద్రలోకి జారిన ఆ పిల్లాణ్ని.. పక్కనే ఉన్న చిన్న మంచంపై పడుకోబెట్టింది.

'ఏమండీ! మీకు బాబుతో ఏమైనా ప్రాబ్లమ్‌గా ఉందా..?' అని అడిగింది.

'అదేంలేదు! నువ్వు పడుకో!'.. మంచానికి ఆ చివరన, అటు తిరిగి పడుకుని చెప్పాడు సుధీర్

అటువైపు.. చనిపోయిన ఆయన భార్య ఫొటో ఉంది.

సుధీర్ కూడా భార్యను మరిచిపోలేక ఇంట్లో వాళ్ల ఒత్తిడి తట్టుకోలేక పెళ్లికి ఒప్పుకొన్నాడు. తనకూ పదేళ్ల పాప ఉంది. హైదరాబాద్‌లో హాస్టల్లో ఉండి చదువుకుంటుంది. పాపను సవతి తల్లిలా చూస్తే తను భరించగలడా?! అందుకే హాస్టల్లో ఉంచాడు.

కన్నుల్లో నింపుకొన్న యశ్వంత్ రూపం.. బాధతో కళ్లు గట్టిగా మూసుకుంది గీత.

మరుసటి రోజు రాత్రి పడుకున్నాక.. కాసేపటికి గీతపై చెయ్యి వేశాడు సుధీర్.

ఒక్కసారిగా ప్రాణం పోయినట్టుగా అనిపించింది ఆమెకు. ఆ స్పర్శకు ఒళ్లంతా గొంగళి పురుగు పాకినట్టుగా అనిపించింది.

ఇంతలో..

'సారీ.. నాకు కొంతకాలం సమయం కావాలి. నేను తనను మర్చిపోలేక పోతున్నాను' అంటూ చేయి తీసి, అటు తిరిగి పడుకున్నాడు.

బతుకు జీవుడా! అని హాయిగా ఊపిరి పీల్చుకుంది గీత.

యశ్వంత్ సొంతమైన తాను మరొకరి సొంతం కాగలదా!? కళ్లవెంట కన్నీళ్లు ధారలా కారుతున్నాయి.

బాబుకోసం.. వాడి ఉన్నతికోసం.. తప్పదేమో! పెళ్లికి ఒప్పుకొన్నదంటేనే.. అన్నిటికీ సిద్ధమైనట్టు కదా!?.

ఏడుస్తూనే ఉంది రాత్రంతా.. ఏ తెల్లవారుజామునో నిద్రపోయింది.

* * *

ఉదయం గీత లేచేసరికి.. వాకింగ్‌కు వెళ్లొచ్చిన మామయ్య వెంకట్, చెట్లకు పాదులు చేస్తూ కనిపించాడు.

ఆ ఇంట్లో తనను అందరికంటే ఆదరంగా చూసేది ఆయనే.

ఆయన దగ్గరికి వెళ్లింది..

'మామయ్యా! మనం మిద్దెతోట పెంచుదాం. మన కూరగాయలు మనమే పండించుకోవచ్చు' సాయం చేస్తూ చెప్పింది.

'అంత ఓపిక ఎక్కడుందమ్మా! ఏదో ఈ నాలుగు మొక్కలనైతే చూడగలను కానీ..' అన్నాడాయన.

'నేనున్నాను కదా మామయ్యా! ఆయన ఆఫీస్‌కు వెళ్లాక.. పనులన్నీ అయ్యాక.. ఆ పని చూద్దాం' అన్నది.

ఆ ఆలోచన నచ్చింది ఆయనకు.

'ఏం చేస్తున్నారు అక్కడ! పొద్దున్నే పనులన్నీ వదిలేసి'.. అత్తగారి అరుపు.

'పచ్చడి కోసం ఉసిరికాయలు తెమ్మన్నాను.. తెచ్చారా?'.. మళ్లీ అన్నది.

'హాల్లో ఉన్నాయి చూడు.. ' చెప్పాడు వెంకట్.

లోపలికి వెళ్లి పనులలో మునిగిపోయింది గీత.

బాబు నిద్రలేచిన అలికిడితో హడావుడిగా గదిలోకి వెళ్లింది. బయటికి వస్తున్న సుధీర్‌ను ఢీ కొట్టడంతో పడిపోబోయాడు. పట్టుకుని ఆపింది. ఇద్దరిలోనూ ఏదో తడబాటు..

తనను వదిలేసి బాబు దగ్గరికి వెళ్లింది.

'ఇక వాడు లేచాడు కదా! ఈ మహాతల్లి వాడితోనే ఉంటుంది. ఎవరైనా కన్నారో లేదో..

తనకు ఒక్కదానికే కొడుకు ఉన్నట్టు!'..

లోపల్నుంచి సునీత అంటున్న మాటలు వినిపిస్తున్నాయి.

అప్పుడే వచ్చిన సుధీర్..

'మాట కటువు కానీ.. అక్క చాలా మంచిది. తన జీవితం అలా అవడం వల్ల ఆ బాధతో అలా మాట్లాడుతుంది'.. సంజాయిషీ ఇచ్చినట్టు చెప్పాడు.

మళ్లీ తనే..

'రేపు పాప వస్తుంది.. నేను ఉదయాన్నే హైదరాబాద్ వెళ్లి తీసుకొస్తాను' చెప్పాడు.

'నాన్నా.. నాకు చాక్లెట్ తెస్తావా!?' అడిగాడు రెశ్వంత్.

మాట్లాడకుండా వెళ్లిపోయాడు సుధీర్.. ఆఫీస్‌కు.

'ఏం.. మహారాణి! మాకు టిఫిన్ పెట్టేది ఉందా లేదా!?' అని పిలిచింది సునీత.

'అత్తయ్యా! ఉసిరికాయ పచ్చడి చాలా బాగుంది..' చెప్పింది గీత, భోజనాల దగ్గర.

'అమ్మా గీతా.. ఏమాట కామాటే చెప్పుకోవాలి. మీ అత్తయ్య పచ్చళ్లు బ్రహ్మాండగా పెడుతుంది..' అన్నాడు మామయ్య వెంకట్.

'అయితే అత్తయ్య పెట్టినప్పుడు నేర్చుకోవాల్సిందే!' అన్నది గీత.

* * *

'పాపను తీసుకు రావడానికి వెళ్తున్నాను..' చెప్పాడు సుధీర్.

'ఒక్క నిమిషం ఆగండి!' అంటూ లోపలికి వెళ్లి, మంచి డ్రెస్ తీసుకుని వచ్చింది గీత.

'ఇది పాపకు ఇవ్వండి..' అన్నది.

'ఎక్కడిది ఇది!?' ఆశ్చర్యంగా అడిగాడు.

'నాకు పెళ్లికి వచ్చిన కొత్త చీరలు చాలా ఉన్నాయి. అందులో ఒకటి పాపకు డ్రెస్ కైతే బాగుంటుందని అనిపించింది.. అందుకే కుట్టాను' అని చెప్పింది.

'అయితే పాప వచ్చాక నువ్వే ఇద్దువుగానీ.. లోపల పెట్టు' అన్నాడు.

ఇంతలో అక్కడికి వచ్చిన రెశ్వంత్..

'నాన్నా.. నా చాక్లెట్!' అన్నాడు.

జేబులోంచి చాక్లెట్ తీసి, వాడి చేతిలో పెట్టాడు సుధీర్.

ఆనందంగా సుధీర్ బుగ్గన ముద్దు పెట్టి పరిగెత్తాడు వాడు.

అది చూసి నవ్వింది గీత.

అప్రయత్నంగా సుధీర్ పెదవులపైనా నవ్వు ఉదయించింది.

* * *

'అత్తయ్య.. అత్తయ్యా..' పిలిచింది గీత.

'ఏమైందే! ఎందుకలా అరుస్తున్నావు!?' అన్నది జానకమ్మ.

'ఇది చూడండి.. మీరు చేసే పచ్చడి వీడియో యూ ట్యూబ్‌లో తెగ వైరల్ అయ్యింది.

'మాకు పచ్చడి పంపించగలరా?' అని అడుగుతున్నారు' అన్నది.

'అవునా! నా పచ్చడిని ఇంతమంది మెచ్చుకున్నారా'.. ఆశ్చర్యపోతూ అడిగింది జానకమ్మ.

'అవును అత్తయ్యా! కొంతమంది మీతో కలిసి పచ్చళ్ల బిజినెస్ చేయాలని అనుకుంటున్నారు. కొందరైతే 'మా హోటళ్లకు సప్లయి చేస్తారా?' అని అడుగుతున్నారు. ఇది మంచి అవకాశం అత్తయ్యా! నలుగురు మనుషులను పనిలో పెట్టుకుని మీరు ఈ బిజినెస్ చెయ్యవచ్చు!'..

గీత చెబుతూ ఉంటే.. విప్పారిన మొహంతో వింటున్నది జానకమ్మ.

'అత్తయ్యా.. మనం మరో వీడియో చేద్దాం! మీరు పార్లర్‌కి వెళ్లి ఫేషియల్ చేయించుకోండి బాగుంటుంది' అని చెప్పింది.

'మా అమ్మకు ఫేషియల్ నేనే చేస్తాను!' అన్నది సునీత.

'నువ్వెలా చేస్తావు!?' అడిగింది గీత.

'నేను పెళ్లి కాకముందు బ్యూటీషియన్ కోర్స్ చేశాను..' చెప్పింది సునీత.

'అయితే పార్లర్ ఓపెన్ చెయ్యచ్చు కదా!'.

'దానికి డబ్బు ఎవరిస్తారు? నా పెళ్లికి, వదిన క్యాన్సర్‌కు చాలా డబ్బు ఖర్చయ్యింది. అప్పు కూడా అయ్యింది'.

'అయితే గవర్నమెంట్ లోన్ అప్లయి చేద్దాం! మీ దగ్గర కోర్స్ సర్టిఫికెట్ ఉందా?'.

'ఉంది'.

'అయితే రేపే మనం బ్యాంకుకు వెళ్దాం'..

అన్నది గీత, సునీత మొహంలో వెలుగును గమనిస్తూ!

సునీతతో బ్యూటీపార్లర్ పెట్టించాలని దృఢంగా నిశ్చయించుకుంది.

* * *

ఇప్పుడు మిద్దెతోటలతో మామగారు. పచ్చళ్లతో అత్తగారు. బ్యూటీపార్లర్‌తో ఆడపడుచు.. అందరూ బిజీ అయ్యారు.

సెలవులు పూర్తయ్యేలోగా.. పాప రోషిణి కూడా గీతకు బాగా దగ్గరైంది. ఆమెకు తల్లిలేని లోటు తెలియకుండా.. తానే తల్లిగా మారింది గీత.

ఆ అభిమానంతో రోషిణి చిన్ని మనసు.. తొందరగానే గీతవైపు మళ్లింది.

పాపా, బాబూ కలిసి ఆడుకోవడం చూసిన సుధీర్.. హాయిగా నిట్టూర్చాడు.

'ఏమండీ. పాపను ఇక్కడే స్కూల్‌లో వేద్దామండీ! హాస్టల్‌కు పంపించొద్దు' బతిమాలినట్టే అడిగింది గీత.

'గీతా! నువ్వు నా భార్యగా రావడం.. నా అదృష్టం! ప్రతికూలంగా ఉన్న పరిస్థితులను అనుకూలంగా మార్చుకున్నావు. అందరి మనసులనూ గెలుచుకున్నావు' అన్నాడు.. గీతను

దగ్గరికి తీసుకుంటూ.

ఇప్పుడు.. ఇప్పుడు.. ఈ స్పర్శ యశ్వంత్ స్పర్శలాగే ఉంది.

'నా యశ్వంత్ సుధీర్‌లో పరకాయ ప్రవేశం చేశాడా!?' అనుకుంటూ.. మనస్ఫూర్తిగా అతని భుజంపై తలవాల్చింది గీత.

'ఇంకో పని మిగిలి ఉందండీ! సునీతకు కూడా మళ్లీ పెళ్లి చేయాలి' అని అన్నది.

'తప్పకుండా.. అర్థం చేసుకునే వాడు దొరికితే చేద్దాం' అన్నాడు సుధీర్.

'అవును! ఇప్పుడు ఇది నా ఇల్లు. నా పిల్లలు. అన్నీ చక్కదిద్దాల్సిన బాధ్యత కూడా నాదే కదా!' అనుకుంది గీత.

తన కొడుకు భవిష్యత్తుకు బంగారు బాటలు వేసింది.

* * *

**ఎం.టి. స్వర్ణలత స్వస్థలం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని. ఇక్కడి సింగరేణి ఉన్నత పాఠశాలలో జీవశాస్త్రం ఉపాధ్యాయురాలిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నాలుగేళ్ల కిందే.. సాహిత్యం వైపు అడుగులు వేశారు. ఇప్పటివరకూ రెండు వేలకు పైగా.. కవితలు, గజల్స్, రుబాయీలు, కైతిక శతకం, నానీలు, ఇష్టపదులు, కవితా మాలికలు, ఆటవెలదులు, తేటగీతులు రాశారు. సోషల్ మీడియా వేదికగా పదుల సంఖ్యలో సింగిల్ పేజీ కథలు రాశారు. 'మా నాన్న మంచోడే', 'వంటల వల్లభుడు'.. కథలకు సోషల్ మీడియాలో బహుమతులు అందుకున్నారు. ఇటీవల సాహితీ కిరణం పత్రిక ఆధ్వర్యంలో నిర్వహించిన కథల పోటీలో 'నిర్ణయం' బహుమతి గెలుచుకున్నది. నమస్తే తెలంగాణ – ముల్కనూరు ప్రజా గ్రంథాలయం సంయుక్తంగా నిర్వహించిన కథల పోటీ (కథ–2021)లో 'సహనశీలి' కథ.. రూ.5 వేల నగదు బహుమతికి ఎంపికైంది.**

# బతుకమ్మ



డాక్టర్ శ్రీదేవీ శ్రీకాంత్
+26776279761

నేను పుట్టినప్పుడు నాకు ఏం పేరు పెట్టింద్రో నాకు ఎరుకలే. అమ్మ.. 'తల్లీ' అని, అయ్య.. 'బొమ్మా!' అని, అయ్యమ్మ 'బుడ్డదానా!' అని, మొగిలయ్య 'బతుకమ్మా!' అని, ముగ్గురు అన్నలు 'సెల్లి' అని పిలిచేటోళ్లు.

మా అమ్మ, అయ్య బంగారం దుకాన్ల దగ్గర కాలువలో రజను తీసేటోళ్లు. చెత్త ఏరుకుని అమ్మేటోళ్లు. ఒక్కొక్కసారి.. "జుట్టుకు బదులు ఉల్లిగడ్డలు, మిఠాయి ఇస్తం!" అని ఇండ్లెంబడి తిరిగేటోళ్లు. రోజు గడవడానికి రకరకాల పనులు జేసేటోళ్లు.

ఒక్కోపాలి అయ్య బురదలో దిగి చేపలు పట్టి, వాటాలు బెట్టి అమ్మేటోడు. ఎన్ని జేసినా మాకు తిండి, బట్టా ఉండేటివి కాకుండే.మా అయ్యమ్మ మాతోనే ఉండేటిది. ఆమె ఎప్పుడూ అమ్మ మీద అయ్యకు ఏదోటి పితూరీలు జెప్పి, అమ్మను కొట్టించేటిది.

దెబ్బలు తిని అమ్మ ఏడుస్తాంటే.. అయ్యమ్మకు మస్తు ఖుషీ. అయ్యమ్మ నన్ను తన దగ్గిర పడుకో బెట్టుకుంటుండే. రాత్రిగాల అయ్యమ్మ చేసే పనులకు నిద్ర వచ్చేటిది లేకుండే నాకు. గందుకే.. అయ్యమ్మ దగ్గిర పండుకోవడం నాకు ఇష్టం లే.

అమ్మ పాలి గుడిసెలో పండుకోవాల్నని ఉండేటిది.

"అయ్యమ్మ దగ్గరికి పో!" అని తోసేటోడు అయ్య.

అమ్మ నాకు పొద్దుటే తల దువ్వి, పూలు పెట్టేటిది. అమ్మ, అయ్యా.. పనిలోకి బయటికి పోంగానే, అయ్యమ్మ మా పక్కటాల గుడిసెల ఆళ్లతో దాడి, సింత పిక్కలు ఆడేటానికి కూర్చుండేటిది.

నాకూ ఆ ఆటలు చూడటం మస్తు ఖుషీ.

అయ్యమ్మ నాకు చిరిగిన గౌను తొడిగి, పూలు పీకేసి, దూసిన జుట్టును చింపిరి జేసేటాళ్లకు..

"బతుకమ్మా!".. అంటూ అచ్చేటోడు మొగిలయ్య. అయ్యమ్మ రెండు నువ్వు జీడీలు నా చేతిలో పెట్టి.. "ఇంక బయలుదేరు" అనేటిది. చిరిగిన బట్టలేసుకుంటేనే బిచ్చపోళ్లకు పైసలు ఏస్తరు. అందుకే నా గౌను ఎప్పుడూ చిరిగే ఉండేటిది.

రక్తబంధం గిట్లుంటాది? అసలు కన్నా వడ్డీ

ముద్దంటరే!..

అయ్యమ్మ చేతిలో నేను గుడియానే. అయ్యమ్మ సోపతి నాకు నచ్చేటిది కాదు.

"నేను మొగిలయ్యతో ఎళ్ల.." అని మారాం చేస్తుండే. ఏడ్వబట్టినా.. అయ్యమ్మకు జాలి లేకుండేటిది. మొగిలయ్యతో పంపేటిది.

"బతుకమ్మా! నే సెప్పేటిది ఇను బిడ్డా.. 'రెండు రోజులైనాదమ్మా బువ్వతిని! బాంచన్ నీ కాళ్లు మొక్కుత! పాంచ్ రూపియా ఇయ్యుండ్రి' అని జరంత నీరసంగా ముఖం పెట్టి అనాల!" అని తొడపాశం పెట్టేటోడు.

నే చెప్పింది ఇని..

"ఔ మల్లా! మస్తు జెప్పినావే బిడ్డా! అట్ల అడుక్కోవాలా.." అని నన్ను రైలులో దింపేటోడు.

రైలు కదుల్తాంటే.. నేను నడుస్తూ, తూలి పడిపోతి మొదట్ల. ఒకరైలుల పంపించి.. మరో రైలులో దింపేటోడు. మస్తు పైసలు అచ్చేటియి.

సాయంకాలం నన్ను ఇంటి దగ్గర దింపి.. అయ్యమ్మకు యాభై రూపాయలు ఇచ్చేటోడు.

దినాం రైలు ఎక్కి రకరకాల మనుషలను చూడటం అలవాటయ్యుండే. పేచీ పెట్టకుండనే మొగిలయ్యతో ఎళ్లడం అలవాటు జేసుకున్న.

* * *

ఒక దినం బాగా నీరసంగా ఉండే. మొగిలయ్యతో ఎళ్లనని మారాం జేసిన. అయ్యమ్మ చింత బరికతో వీపు మీద కొట్టుండే. అల్లాడి ఏడ్చుంటి. వీపు బాగా వాచిపోయుండే. పొద్దుగాల్న అమ్మ స్నానం జేయించేప్పుడు..

"తల్లీ! ఈపు మీదట ఈ వాతలేంటే?" అని.. అయ్యమ్మే కొట్టి ఉంటదని సమజయిన

దానిలా, నా వైపు జూసి మస్తు ఏడ్చింది.

ఎప్పటిలాగే అమ్మ, అయ్య బయటికి ఎళ్లంగనే.. మొగిలయ్య అచ్చిండు. ఆ పొద్దు మస్తు వాన పడబట్టే.

"వాన సినుకు సుట్టే తెలంగాణ కోక.. మా తెలంగాణ గడ్డ మీన వాన చినుకు సిత్రం.. తుళ్లిపడే వాన జల్లు.. మా దిల్ లా ఖుషయితాదీ.. ఇచిత్రమే!"

అని హుషారుగా పాట పాడుతుంటి. ఎప్పుడొచ్చిండో.. మొగిలయ్య చప్పట్లు కొట్టబట్టినాడు నా పాట ఇని.

నా దిక్కు జూస్తూ..

"బతుకమ్మా! ఎంత మంచిగా పాడబట్టినావే! నీకు వచ్చిన పాటలు పాడుతూ డబ్బులడుగు! ఎక్కువ డబ్బులు ఏస్తరు!" అన్నడు.

"గీ దినం నేను రాను. వాన నీళ్లల్లో పడవలు ఏసి ఆడుకుంటా!" అంటిని.

"నీకు పాటల పుత్తకోలు కొంట బిడ్డా.." అంటూ నన్ను ఎత్తుకుండు.

రైలు ఎక్కిన. పాట షురూ జేసిన.

అందరూ నా దిక్కు చూడబట్టింద్రు. అందరూ..

"శెభాష్ బిడ్డా! మస్తు టైంపాస్" అంటా డబ్బు ఇస్తున్రు. గా దినంకెల్లి నేను పాడుతా అడుక్కోబట్టిన.

ఏ విషయం అయినా ఒకమారు ఇంటే పట్టుడు నా దిమాక్‌లో ఉండే.

నా పాట రైలుల అందరికీ నచ్చేటిది.

"పోరి గొంతు మస్తు ఉంది.. పెద్ద అయ్యేటాలకు మంగ్లీలా పాడుతది".. అనుకొన బట్టిన్రు.

"ఓ పోరీ! నీ పేరేంది?" అనేటోళ్లు కొందరు. "అడుక్కునే పిల్లా!" అని ఇంకొందరు అందురు.

ఎవరైనా నా పేరు అడిగిన్రనుకోండ్రి.. 'బొమ్మ' అనే చెప్పేటిదాన్ని.

"అవును.. బుట్టబొమ్మలా.. ముద్దుగున్నవు" అనేటోళ్లు వాళ్లు.

"ఈ పోరికి చక్కగా తలదూసి, మంచి బట్టలేసినమా మస్తుగుంటుండే!" అనుకునేటోళ్లు.

వాళ్లకేమెరుక.. మా అమ్మ నాకు సక్కని జడలేసి, ఆ జడలో పూలు పెట్టి తయారుజేస్తదని.

* * *

ఒక దినం ఏసీ బోగీలో అడుక్కుంటున్న. గప్పుడు ఒక పోరడు తెల్ల కాగితాల పుస్తకంలో బొమ్మలు ఏసుకుంటున్నడు. ఆ పోరనికి బరాబర్ నా వయసే ఉండొచ్చు.

నేను ఆ బొమ్మలు జూస్తూ.. గక్కడ్నే ఆగిన. ఆ ఏస్తున్న బొమ్మను జూసిన. ఆ పోరడు నా కెల్లి జూసి..

"నీకు బొమ్మలు గీయడం వచ్చా?" అన్నడు.

"వచ్చు" అన్న.

"గట్లయితే ఎయ్యి" అన్నడు.

పక్కపొంటి వాళ్ల అమ్మ అనుకుంట.. గా పోరన్ని అన్నం తినమని బతిమాలి తినిపిస్తుండే.

"మామ్! ఐ యాం ఫుల్" అంటుండు ఆ పోరడు.

రోజూ ఏసీ బోగీలో అడుక్కోడంతో.. నాకూ ఇంగ్లీషు అబ్బింది.

'గొప్పోళ్ల బిడ్డలు బువ్వ వద్దని మారాం జేసినా.. ఆళ్ల తల్లులు కుక్కి కుక్కి పెడుతరు' అనుకున్న.

ఇంతట్లకే..

"నీ పేరేంది?" అన్నడు ఆ పోరడు.

నన్ను ఎవరెట్ల పిలుస్తరో అన్ని పేర్లూ జెప్పిన.

"పేర్లు రెండే ఉంటాయి. ఒకటి స్కూల్‌లో పేరు. ఇంకోటి ఇంట్లో పిలిచేటిది. నీకు ఇన్ని పేర్లా?" అన్నడు.

"గది సరే! ఫస్టయితే బొమ్మ ఎయ్యి".. అని మళ్లా అన్నడు.

"నిన్ను చూసి ఏస్తాను" అనుంటి.

"నే ఈ కాగితంపై పట్టను గానీ.. ఇదిగో ఈ జామకాయ చూసి ఎయ్యి" అన్నడు.

నేను ఆ పోరని బొమ్మే గీసిన.

పక్కపొంటి ఉన్న ముసలామె వాళ్ల అవ్వ గావచ్చు..

"గమన్! గా పిల్ల అడుక్కోవాలి.. ఆమెను పోనీ" అన్నది.

నేను ఆమె మాటలు పట్టించుకోకుండ.. బొమ్మ గీసిన.

ఆ బొమ్మ చూసిన ఆ పోరడు ఆశ్చర్యంగా ముఖం పెట్టిండు. గాళ్ల అమ్మ, నాయిన ఆ బొమ్మను ఆ బోగీలో ఉన్న ఆళ్ల సోపతోళ్లందరికీ చూపించిండ్రు.

నాకు గమన్ బాబు.. రంగు పెన్సిళ్లు, తెల్ల కాగితాల పుస్తకం ఇచ్చిండు. ఆ బోగీలో అందరూ డబ్బు ఇచ్చి, ఎంతో మెచ్చుకున్నరు. సరస్వతీ దేవి కటాక్షం అన్నరు. అలా నేను ఏసిన గమన్ బొమ్మ.. ఒకరి చేతిలోంచి ఇంకొకరు తీస్కొని జూసుకుంట..

"గింత చిన్న వయసులో బొమ్మ మస్తు ఏసింది. అచ్చు గమన్ లెక్క కొడుతుండె బొమ్మ! అచ్చుగుద్దినట్టు దింపేసింది:" అని అన్నరు.

"నువ్వు పాటలు కూడా మస్తు పాడుతున్నవు. మాతో వస్తావా? బాగా చదివిస్తాం"

అన్నడు గమన్‌వాళ్ల నాయిన.

"అమ్మను సూడకపోతే బుగులైతాది. నేను రాను" అని చెప్పిన.

"ఈ పైసల్ ఎవరికిస్తవు?" అనడిగింది గమన్ వాళ్ల అమ్మ.

"మొగిలయ్య తీస్కుంటడు" అన్న.

"మొగిలయ్య యెవరూ?" అని మళ్లా అడిగింది.

దాంతోని నా ముచ్చట మొత్తం జెప్పిన. అంతా ఇన్నంక..

"అయ్యో పాపం! ఎంత అన్యాయం. మొగిలయ్య లాంటివాళ్లను నిలువునా నరికి పాతేసినా పాపం ఉండదు! ఈ పిల్ల కష్టం ఆడు గుంజుతుండు" అని కోపానికి అచ్చింద్రు.

"నువ్వు ఇయ్యాల అచ్చిన పైసల్ మీ అమ్మకు ఇయ్యి. మస్తు పాడుతున్నవు జరంత మంచి పాటలు నేర్చుకో" అని చెప్పింద్రు.

ఆ రోజు మస్తు పైసల్ వచ్చినయి.

'అవును! ఈ పైసల్ అమ్మకే ఇయ్యాలే. మంచి చీర కొనుక్కుంటది' అనుకొంటి.

నేను ఏసుకున్న లాగుల ఆ పైసల్ దాచిన. మస్తు ఖుషీ అయిన. పాడుకుంట ఇంటికిపోయిన. పుస్తకం, పెన్సిల్ దిక్కు గట్లనే చూడబట్టిన.

ఇన్ని దినాలూ మస్తు పైసల్ సంపాదించి ఉంటి. కానీ, దాచి అమ్మకియ్యాల్ననే ఆలోచన దిమాక్‌ల లేకుండే!

* * *

అమ్మ నా కోసం పూలు తెచ్చింది.

"అమ్మా! పూలు పెట్టు" అని మారాం జేసిన.

'పండుకునేటేల ఎందుకే తల్లీ! నిద్రపోతే నలిగిపోతాయి. బయట గుడిసె మీద పెట్టి పొద్దుగాల పెడతాలే!" అంది.

"సరేలే!" అన్న.

లాంతరు బుడ్డి ఎలిగించి దగ్గర పెట్టుకుని.. అమ్మను చూసుకుంట ఆ పుస్తకంల 'అమ్మ బొమ్మ' గీసిన. దాన్ని చూసి అమ్మ మస్తు సంబురపడ్డది.

"నేనెప్పుడూ పోటో దిగలే! అచ్చు నాలాగే గీసినావు! నా కళ్లల్లో కెల్లి సూసి మాట్లాడుతున్నట్టు గీసినావ్" అన్నది అమ్మ.

'మా అయ్యమ్మ సూడకుండా అమ్మకు పైసలు ఇయ్యాల. ఎట్ల ఇయ్యాల?' అని అనుకున్న.

అయ్యమ్మ కల్లు తాగనీకి బయటికి ఎల్లుండే. గప్పుడు ఎవరూ సూడకుండా అమ్మకు పైసలిచ్చిన.

"అమ్మా! నువ్వు ఆకాశం రంగు చీర కొనుక్కో" అని చెప్పిన.

అమ్మ కళ్లల్లో నీళ్లు నిండినాయ్. వస్తున్న కన్నీళ్లు తుడుసుకుంటూ..

"తల్లీ! గిన్ని పైసల్ ఎట్ల అచ్చినయ్?" అని

అడిగింది.

"అమ్మా! శానాకాలంగా నన్ను అయ్యమ్మ అడుక్కోడానికి పంపి పైసలు తీసుకుంటున్నది" అని చెప్పిన.

దానికి అమ్మ మస్తు ఏడ్చింది.

నన్ను అయ్యమ్మ కొడ్తదని.. అయ్యమ్మను అమ్మ అడగలే. అయ్యకూ చెప్పలే.

* * *

పొద్దుగాల్నే నిద్రలేచి.. బొమ్మలు గీసిన పుస్తకం చూసుకున్న. అమ్మ బొమ్మ, అయ్య బొమ్మ, అన్నల బొమ్మలు.. ఆ పుస్తకంలో ఏసుకుని చాలా సంబురపడ్డా.

అమ్మ నన్ను దగ్గరికి పిలిచి, తలనిమిరి,

ముద్దు పెట్టి..

"నువ్వు అడుక్కోడం నాకు ఇష్టంలే తల్లీ! మీ అయ్యకు సెబుతా. నువ్వు అడుక్కోడానికి ఎల్లకే!" అన్నది ఏడుత్తా.

"అయ్యమ్మ! అయ్యకు తాగనీకి పైసల్ ఇస్తది. తాగినంక నిన్ను కొడ్తడేమో.. నువ్వు ఏడ్వకు అమ్మా!" అన్న.

ఎప్పటిలానే మొగిలయ్య అచ్చిండు.

"నేను అడుక్కోడానికి ఎల్ల" అని మారాం జేసిన.

అయ్యమ్మ నన్ను బాగా కొట్టి, బూతులు తిట్టి..

మొగిలయ్యతో పంపింది. ఆ రోజు ఎప్పటిలానే మొగిలయ్యతో ఎల్లిన.

జరంత పెయ్యి కాలబట్టె. పక్క స్టేషన్‌లో దిగాల్సిన నేను.. రైలులోనే నిద్రపోయిన. రైలు ఎల్లి పోయింది. నాకు మెలుకువ వచ్చేసరికి అక్కడ అందరూ దిగిపోతున్నరు. నేను కూడా అక్కడే దిగిన.

నాకు బాగా జ్వరంగ ఉన్నది. అక్కడే స్టేషన్‌లో పండుకున్న.

'కరోనా కాబట్టి ఇక రైళ్లు తిరగవు' అని అందరూ అంటుండ్రు. గింతల్నే నాకు జ్వరం ఎక్కువాయే. ప్లాట్‌ఫాం పైనే ఒళ్లు తెలియక నిద్రపోయిన.

నాకు మెలుకువ వచ్చేసరికి ఆ స్టేషన్ మాస్టరు ఇంట్లో ఉన్న. కరోనాతో లాక్‌డౌన్ పెట్టిండ్రు. రైళ్ల రాకపోకలు లేవాయే.

'దేవుడు నా పైన జాలితో వాళ్ల ఇంట్లో ఆశ్రయం ఇచ్చిండ్రు' అనుకున్న. వాళ్ల ఇంట్ల నా అంత పాప ఉండె. పేరు రూపసి. నేనంటే చాలా ఇష్టం.

అమ్మ గుర్తొచ్చి రోజూ ఏడ్చేటిదాన్ని.

నా డ్రాయింగు పుస్తకంల అమ్మ బొమ్మను చూసుకునే దాన్ని. వాళ్లింట్లో వాళ్లకు నా బొమ్మలు, నా పాటతోనే లాక్‌డౌన్‌లో మస్తు టైం పాస్. రెండు నెలల లాక్‌డౌన్ సమయంల నేను వాళ్లింట్లో టీవీ చూసి, చాలా పాటలు నేర్చుకున్న. కానీ, నా మనసంతా అమ్మే.

'ఎప్పుడెప్పుడు లాక్‌డౌన్ ఎత్తేస్తరా?! అమ్మను సూద్దామా!' అని ఉండేటిది.

'అమ్మకు నేను నేర్సుకున్న పాటలన్నీ పాడి ఇనిపియ్యాలే!' అని అనుకునేటి దాన్ని.

ఏడుపొస్తే రాత్రి దుప్పటి కప్పుకొని ఏడ్చేటిదాన్ని. లాక్‌డౌన్‌తో పని అమ్మాయి రావడంలే. నేనే గిన్నెలు తోమి, ఇల్లు ఊడ్చి వారికి పనిలో సాయం జేసిన.

లాక్‌డౌన్ ఎత్తేసింద్రు. ఆ రోజు నాకు మస్తు ఖుషీగ ఉండే. ఆ స్టేషన్ మాస్టరు టిక్కెట్టు కొని రైలు ఎక్కించిండు.

"బొమ్మా! వెళ్లగానే మా అమ్మ నంబర్‌కు ఫోన్ చెయ్యి" అన్నది రూపసి.. రైలెక్కే ముందు.

* * *

రైలు మా ఊరిల ఆగింది. నేను రైలు దిగి నడవడం లేదు. లేగ దూడలా చెంగు చెంగున ఉరుకుతూ.. మేము ఉండే గుడారాల దగ్గరికి పోయిన. అక్కడ మా గుడారాలు ఒక్కటి కూడా లేకుండె. కరోనా టెస్టుల కోసం చెక్క గదులు వరసగా కట్టింద్రు. గవ్విటిని చూసిన నాకు ఏడుపు ఆగడం లే. ఆ చుట్టుపక్కల అంతా తిరిగిన. ఎక్కడా నాకు ఎరుక ఉన్నోళ్లు కనిపించలే. తిరిగి తిరిగి యాష్టకొచ్చె. ఎస్టీడీ బూత్‌కు పోయిన. రూపసికి ఫోన్ చేయాల్నని.. ఫోన్ నంబర్ ఉన్న చిన్న కాగితం ముక్క చేత్తో పట్టుకుని చాలాసేపు తిరగడంతో.. చెమటకు ఆ కాగితం తడిసిపోయి నంబర్లు కనిపించలే. అంకెలన్నీ అలుక్కుపోయినయి!

.. జీవితంలో ఒక్కచోట పేరుకున్న కష్టాల్లా ఉంది నా పరిస్థితి.

శూన్యంలకు చూస్తున్న నా దగ్గరికి మొగిలయ్య వచ్చిండు.

"బతుకమ్మా! ఏమైనవే గిన్నాళ్లు?" అన్నడు.

"మా అమ్మావాళ్లు ఎక్కడా?" అని అడిగిన.. ఆశగా.

"నాకు తెల్వది. బతుకమ్మా! పద రైళ్లు వచ్చే సమయం అయింది" అన్నడు.

'బొమ్మా! నీకు మంచి జీవితం ఉంది. నీ చేతిలో మంచి కళ ఉంది. మంచి గాత్రం ఉంది. కష్టపడు. అడుక్కోకు!' అన్న స్టేషన్ మాస్టరు మాటలు యాదికొచ్చినయి.

'అవును నేను గొప్పదాన్ని అవ్వాల. అమ్మకు నేను అడుక్కోడం ఇష్టంలే' అని అనుకున్న.

'కళ అంటే సంపద. కళ మనిషికి గౌరవాన్ని ఇస్తుంది' అని టీవీలో ఇన్నాను. ఆ

మాటలు నా చెవుల్లో మారుమోగుతున్నయ్.

"మన బతుకు మనదే కాదు. మన బతుకు ఎదుటివాళ్లకు ఉపయోగపడాల. ఈ ఊరికి ఉపయోగపడాల. మన దేశానికి ఉపయోగపడాల. ఈ దునియాకే ఉపయోగపడాల. శానామంది అవయవాలు లేకపోయినా కష్టపడి.. గొప్పోళ్లు అవుతుండ్రు. నేనూ కష్టపడాలే. ఈ అడుక్కునే బతుకు నా జీవితాన్ని బర్బాద్ చేస్తది. ఈ బతుకమ్మ ఇక నీతో రాదు మొగిలయ్యా! నేను బతుకమ్మను.. అవును ఎందరికో బతుకునిచ్చే అమ్మను అవుతా!" అని.. అమ్మ బొమ్మ చూస్తా దౌడు తీస్తుండా.

దూరంగా.. 'కృషి ఉంటే మనుషులు రుషులవుతారు.. మహా పురుషులవుతారు!' పాట వస్తున్నది.

**డాక్టర్ శ్రీదేవీ శ్రీకాంత్ స్వస్థలం హైదరాబాద్. ప్రస్తుతం ఆఫ్రికాలోని బోట్స్వానా దేశంలో ఉంటున్నారు. ఐదు పీజీలు, రెండు పీహెచ్‌డీలు (క్లినికల్ సైకాలజీ, ట్రాన్స్‌లేషన్ స్టడీస్) చేశారు. ప్రస్తుతం క్లినికల్ సైకాలజిస్ట్‌గా పనిచేస్తున్నారు. ఇప్పటివరకూ 150కిపైగా కథలు, రెండు వందలకుపైగా గజల్స్, రెండు వందలకుపైగా కవితలు, అనేక నానీలు, భక్తి పాటలు, హైకూలు, జానపద పాటలు రాశారు. ఆంగ్ల కవితలు, సైకాలజీలో నాలుగు పుస్తకాలు (ఆంగ్లంలో) తీసుకొచ్చారు. మానసికతత్త్వానికి సంబంధించి మూడు పుస్తకాలు వెలువరించారు. గజల్స్, కవితలు, ఆంగ్ల కవితల పుస్తకాలను ప్రచురించారు. మరికొన్ని కథల పుస్తకాలు ప్రచురణకు సిద్ధంగా ఉన్నాయి. రేడియోలోనూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. కథలపై లోతైన సమీక్షలు చేస్తుంటారు. సాహిత్యంతోపాటు చిత్ర లేఖనంలోనూ అనేక బహుమతులు, సన్మానాలు అందుకొన్నారు. కూచిపూడి, భరతనాట్యం, వీణ వాద్యంలో ప్రావీణ్యం సాధించారు.**



మంద శ్రీకర్

"అమ్మమ్మా! అటు చూడు. ఆ అంకుల్ చీర కట్టుకుని, చప్పట్లు కొట్టుకుంటూ.. అందరి దగ్గరా డబ్బులు అడుగుతూ ఇటే వస్తున్నాడు. నాకు భయమే–స్తున్నది. వెంటనే కిటికీలు మూయి!" అంటూ.. చటుక్కున నా కొంగు చాటున దాక్కున్నాడు చింటు. అప్పటివరకు ట్రాఫిక్ సిగ్నల్ వైపు చూస్తున్న నా కళ్లు, ఆ అర్ధనారి వైపునకు మళ్లాయి. నా కళ్లకు అడ్డుగా వచ్చిన కన్నీటి చుక్కలను పక్కకు నెట్టేలోపే, కారు చక్రాలు గిర్రున తిరిగాయి. నా ఆలోచనలు, నన్ను గతంలోకి నెట్టాయి.

* * *

"ఏంటీ! చిన్న పిల్లాడని కూడా చూడకుండా అంతలా కొట్టాలా?!" అన్న నా అరుపు వినగానే..

"కొట్టాలా.. కొయ్యాలా?! ఈ నా కొడుకు, నాకున్న కాసింత పరువూ తీసేశాడు. ఈడి ఆడంగేశాలతో ఊళ్లో నా తల ఎక్కడ తాకట్టెట్టాలో, నాకెరుకైతలేదు. రేపటేల ఈడు నా కంటపడ్డాడో.. ఉప్పు పాతరేస్తా!" అంటూ తూగుతూ, మంచానపడ్డాడు నానిగాడి తాగుబోతు తండ్రి.

"ఆడి చేతులిరిగిపోను! పాపం నా చిన్ని తండ్రికెంత కష్టమొచ్చె. తొమ్మిది నెల్లు మోసిన నాకంటే, ఆ దేవుడు

చేసిన గందరగోళంలో చిక్కుకొని తల్లడిల్లిపోతున్న ఆ పసివాడికే తెలుసు.. ఆ బాధెంతో!?.. ఆ బాధేంటో!?".. అంటూ కన్నీరు

మున్నీరయ్యా..

* * *

"అమ్మమ్మా లే! ఇల్లొచ్చింది" అన్న చింటుగాడి అరుపు వినేదాక.. నా మనసు ఆ పాత రోజుల్లోనే చిక్కుకుంది. వెంటనే నన్ను నేను సముదాయించుకొని కారు దిగి, ఇంటి గుమ్మం వైపు అడుగులేశాను. మా అల్లుడు నా పాత బ్యాగు పట్టుకొని, నా ముందు అతి మర్యాదగా నడుస్తున్నాడు.

"ఏంటమ్మమ్మా! ఈ డొక్కు బ్యాగు పట్టుకొచ్చావు" అంటూ చింటుగాడు వెక్కిరించాడు. వాడికేం తెలుసు అది నానిగాడికి ఇష్టమైన బ్యాగని.

కవిత వంట పనుల్లో బిజీగా ఉంది. తనను చూసి..

"బాగున్నావా!" అని అడగలేను. ఎందుకంటే తన వాలిపోయిన ముఖం, పల్చబడిన జుట్టు, ఒంటిపైనున్న గాయాలు, ఆ విషయాన్ని స్పష్టంగా వివరిస్తున్నాయి. నన్ను చూసిన వెంటనే..

"అమ్మా! వంట తయారైంది. కాళ్లూ, చేతులు కడుక్కో!" అని లేని నవ్వును వెంబడేసుకొని చెప్పింది.

'సరే!' అంటూ తలూపడమే నా వంతయింది.

సూర్యుడు తల మీదికొచ్చి గంటయింది. పళ్లెం ముందు కూర్చున్నామో లేదో.. గుమ్మం నుంచి గయ్యిమంటూ కేకలు వినిపించాయి. అప్పులోడు కావచ్చు.. అరుపు వినగానే అల్లుడు అటకెక్కాడు. ఇంట్లో ఉన్న అల్లుడిని లేడని చెప్పి, కంచం ముందుకొచ్చింది కవిత. అప్పులోడేదో అన్నట్టున్నాడు. కవిత ముఖం కళ తప్పింది. అసలు ఇప్పుడు కాదు.. అల్లుడు దారి తప్పినప్పటి నుంచే, దాని జీవితంలో సొంత నవ్వులు దూరమయ్యాయి. ఏదో తిని, మంచం మీద కూర్చున్న నాకు.. నిద్ర ఎప్పుడు పట్టిందో ఆ దేవుడికే ఎరుక.

* * *

"వాని చేతులిరిగిపోను. పుట్టినరోజని కూడ చూడకుండా, వాతలొచ్చేటట్టు కొట్టిండు. వండిన అన్నమంతా చల్లగయ్యింది. నానీ.. లే! అన్నం తిందువ్. పొద్దున్నుంచి ఏం తినలే!"..

"అమ్మా! ఈరోజు నా పుట్టినరోజు కదా. ఏదైనా గౌనేసి నన్ను తయారుచేయవా!?" అంటూ బోరున ఏడ్చాడు.

వాడి బాధ చూసి.. కవిత తన గౌనిచ్చింది. అదేసుకొని, తిట్లతో బాధపడ్డ వాడి మనసుకు వాడే మందు రాసుకున్నాడు. పొద్దున లేచేసరికి వాడు కనిపించలేదు. ఊరంతా వెతికినా.. వాడి ఆచూకీ దొరకలేదు. కొడుకు పోయిన బాధకూడ లేకుండా.. తూగుతూ పన్నడు నా తాగుబోతు మొగడు.

సూర్యుడు మబ్బుల చాటున దాక్కోగానే.. నిద్ర లేవమంటూ గోల చేశాడు చంటిగాడు. ముఖంమీద నీళ్లు పోసుకొని, నా ముడతల ముఖానికి పౌడర్ అద్దుకున్నా. కవితతో బయటికెళ్లి చాలా రోజులయింది. అడగంగ అడగంగ.. అరగంటకు ఒప్పుకొన్నది. అల్లుడికి బయట ముఖం లేదు కాబట్టి.. మేం ముగ్గురమే బయల్దేరాం.

కవితకు ఒకప్పుడు షాపింగ్ అంటే చచ్చేంత ఇష్టం. తను పనిచేసే రోజుల్లో ఇంటికి వింత వింత సామాన్లన్నీ తీసుకొచ్చేది. నా తాగుబోతు భర్త, మందు దుకాణముందని ఈ మాయ మాటలోడికిచ్చి, దాని గొంతు కోసిండు. పెండ్లయిన నాలుగేళ్లకే అప్పులోళ్లకు దుకాణం అమ్మి.. అప్పటినుంచి కవిత కష్టంమీద బతుకుతూ, దాని బతుకును ఆగమాగం చేస్తున్నడు.

భానుడు సెలవంటూ, పడమటి దిక్కుకు పోతున్నడు. ఆటో పొద్దునాగిన ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర ఆగింది. పొద్దున చింటుగాడికి కనిపించిన ఆ అర్ధనారి కోసం నా కళ్లు వెతుకుతున్నాయి.

“అమ్మమ్మా! ఆ అంకుల్ అక్కడే ఉన్నాడు!” అంటూ నా కొంగు చాటున దాక్కున్నాడు చింటు. వెంటనే నా కళ్లు.. ఆ దిక్కుకు మళ్లాయి. ఉండబట్టలేక.. నా పాదాలు ఆ వైపుగా కదిలాయి. సరాసరి వెళ్లి ఆ వ్యక్తి ముందు నిల్చున్నాను. నన్ను చూసిన వెంటనే..

“అమ్మా!” అంటూ.. నా మీద పడి ఏడ్చింది ఆ అర్ధనారి.

‘నాని గాడేనా?!.. అవును వాడే!’.. ఒక్కొక్కటిగా దాచుకున్న నా కన్నీటి చుక్కలు, సంద్రంలా నేలను తాకాయి. చుట్టూ ఉన్న అన్ని కండ్లూ మమ్మల్ని వింతగా చూస్తున్నాయి. అదేదో.. వాళ్ల బిడ్డలను వాళ్లెప్పుడూ కౌగిలించుకోనట్టు. ఆ కండ్ల మధ్యలోంచి కవిత మా దగ్గరికి వచ్చి, తను ఏడుస్తూ మమ్మల్ని ఓదార్చింది. అదంతా చూస్తూ చింటు ఓ పక్కనే ఆగిపోయాడు.

మా కన్నీళ్లకు కరిగిపోయిన ఆకాశం, తన నల్లని మబ్బులను కరిగించి.. ఒక్కసారిగా మాపై నీళ్లు గుమ్మరించింది. ఆ చినుకులు మా కన్నీటి చినుకులను తమలో కలుపుకొన్నాయి. ఆ వర్షంలో తడుస్తున్న మమ్మల్ని, నానిగాడు తన ఇంటికి రమ్మన్నాడు. అలా.. మా గమనం మారింది.

నేను నానిగాడి చేతులు పట్టుకొని ధైర్యంగా ముందు నడుస్తుంటే, మా వెనక చింటుగాడు వాళ్లమ్మను పట్టుకొని భయంగా నడుస్తున్నాడు. “అమ్మా! ఇదే మా ఇల్లు” అంటూ లోపలికి తీసుకెళ్లాడు నాని.

* * *

ఇల్లు చాలా విశాలంగా ఉంది. ఎక్కడ చూసినా పుస్తకాలే. డజనుకుపైగా కుర్చీలు, ఓ దిక్కున సిమెంటు గోడకు వేలాడుతున్న నల్ల బోర్డు, రంగురంగుల పేపర్లు, మరెన్నో ఆట వస్తువులు. ఆ ప్రదేశం విద్యార్థులు లేని పాఠశాలలా ఉంది.

"నానీ! ఇది ఇల్లా? బడా?" అంటున్న నా మాట ముగిసేలోపే..

"అమ్మా! ఈ పాఠశాలే నా ఇల్లు. నాలాంటి వారెందరికో, ఇక్కడే నేను చదువు నేర్పిస్తున్నాను".. అన్న వాడి మాటలు వింటుంటే, గర్వం నా మనసును తాకింది.

"ఎక్కడిదాకా చదువుకున్నావురా?" అంటూ కవిత నా మనసులో మాటనడిగింది.

"అక్కా! ఈ సమాజం నన్ను నాలా ఉండనివ్వలేదు. చదవనివ్వలేదు. అబ్బాయిలా చదువుదామంటే, అవహేళన చేశారు. అమ్మాయిలా చదువుదామంటే అవమానించారు. కూటికి కూడా డబ్బులుండేవి కాదు. పని చేస్తానంటే పనిచ్చేవారు కాదు. అందుకే అడుక్కుంటూ నాలాంటి పిల్లలకు, పెద్దలకు నాకు వచ్చిన చదువు నేర్పిస్తున్నాను".. అంటూ కన్నీరు కారుస్తున్న నాని మాటలు విని..

"మామయ్యా! సారీ! ఏడ్వకు!" అంటూ వాడి చిట్టి చేతులతో నానిగాడి కన్నీరు తుడిచాడు చింటూ. ఆ చిట్టి చేతులు తాకగానే వాడి కన్నీళ్లు.. ఆనందబాష్పాలుగా మారాయి.

'నానిగాడికి పుస్తకాలంటే చచ్చేంత ఇష్టం. ఎంత పెద్ద లెక్కనైనా చిటికెలో చేసేవాడు. అలాంటిది పదహారో ఏటే.. పదో తరగతి మధ్యలోనే ఆపేసి, ఇక్కడికొచ్చి పడరాని పాట్లుపడ్డాడు. అయినా మంచిదే అయింది. లేకుంటే వాడి తాగుబోతు తండ్రి, వాడిని బతకనిచ్చే వాడా?'.. నా మనసులోని ఎన్నో ఇరుకైన ప్రశ్నలు ఒక్కొక్కటిగా నన్ను పలకరించి మాయమవుతున్నాయి.

వచ్చి రెండు గంటలైనా కాలేదు. కవిత కండ్లు మాటిమాటికీ గడియారం వంక చూస్తున్నాయి.

"ఏంటక్కా? అప్పటినుంచి ఆ గడియారం వైపే చూస్తున్నావు" అన్న నాని మాటలు పూర్తికాకముందే.. కవిత ఫోన్ జుమ్మని మోగింది. చింటుగాడు వెంటనే ఫోనెత్తి, స్పీకర్ ఆన్ చేశాడు.

"ఏమేవ్? ఎక్కడున్నవ్? మీ అమ్మ ఏడికి తీసుకెళ్లింది. అరగంటలో ఇంటికాడ లేకుంటే.. కాళ్లి రగ్గొడుతా!" అంటూ మొత్తుకుంటున్నడు. ఆ మాటలు వినగానే.. ఒక్కసారిగా తేరుకొని తొందరగా ఫోన్ ఆఫ్ చేసింది కవిత.

"అమ్మా! నీ చేతి చాయ తాగి ఎన్ని రోజులయింది. ఒక్కసారి చేయవా!?" అంటూ వంటగదిలోకి తీసుకెళ్లి..

"అమ్మా! నిజం చెప్పు. అక్క.. బావగారికి ఎందుకు భయపడుతుంది. అది సంతోషంగా లేదా!?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించాడు నాని. నా కంటికి అలుముకున్న తడిని తుడిచి, కవిత కన్నీటి గాథను వివరించాను. కనీసం ఈ జవాబులతోనైనా తన జీవితానికి సమాధానం దొరుకుతుందని అనుకున్నా.

అప్పటినుంచి కవిత ఫోన్ మోగుతూనే ఉంది. దాని ముఖంలో క్షణక్షణానికి ఆందోళన ఎక్కువైపోతున్నది.

"అక్కా! ఎందుకంత భయం? నా చేయి పట్టుకుని ధైర్యం నేర్పిన రోజులు మరిచిపోయావా? నేను మీతో వచ్చి, బావగారికంతా చెబుతాను" అంటూ కవితకు భరోసా ఇచ్చాడు నాని.

నిజమే! కవిత ఒకప్పుడు ధైర్యవంతురాలే. కానీ, తన బాధను ఇతరులతో పంచుకునే ధైర్యం దానికి లేదు. ప్లాస్టిక్ నవ్వులతో తన కన్నీటి కథలను దాచిపెడుతుంది. పెళ్లి కొడుకు నచ్చలేదని, వాళ్ల నాన్నకు ధైర్యంగా చెబితే.. ఆ తాగుబోతు కుటుంబానికిచ్చి తగవులతో జీవితాన్ని గడపమని పంపాడు ఆ కసాయి తండ్రి. తనవల్ల తన కూతురికి జరిగిన అన్యాయం తెలుసుకునే లోపే.. తన ఊపిరాగిపోయింది.

* * *

మబ్బుల మధ్యనుంచి వెన్నెల దర్శనమిచ్చింది. ఆకాశానికి ఆయాసమొచ్చి వర్షాన్ని వెనక్కి పిలిచినట్టుంది. "అమ్మా! ఇక వెళ్దామా?" అంటూ కవిత తన కంగారులో ముప్పావువంతు నాకిచ్చింది. మా కంగారును చూసి, నాని మా వెంట రావడానికి సిద్ధమయ్యాడు. కండ్లకు కాటుక పెట్టుకొని, ముఖాన్ని స్కార్ఫ్‌తో దాచుకున్నాడు. మా అడుగులు గుమ్మం బయటికి కదిలాయి.

బయట రోడ్డంతా బురదతో నిండిపోయింది. ఆటో ఎక్కిన అరగంటకు ఇంటి ముందర దిగాం. వాకిట్లోనే మందు పరిమళం మా ముక్కునంటుకున్నది. గేటు చప్పుడు కాగానే.. తిట్ల పురాణం మా చెవికంటుకున్నది. ఆ అరుపులు వినగానే కవితకు భయం పట్టుకున్నది. చింటుగాడు నా చేయిని గట్టిగా పట్టుకుని ఏడుస్తున్నాడు.

కవిత చేయి పట్టుకుని గుమ్మం వైపు కదిలాడు నాని. వాడి అడుగుజాడల్లో మా పాదాలు కదిలాయి. గుమ్మంలోకి వెళ్లగానే.. ఆ తాగుబోతు గుర్రుమంటూ దానిమీదికి చేయిలేపాడు.

"ఆపు బావా!" అంటూ తన ముఖానికి ఉన్న స్కార్ఫ్‌ను తీసేశాడు నాని. వాణ్ని చూడగానే తాగిందంతా దిగినట్టుంది. ఒక్కసారిగా బిక్కముఖం వేశాడు చింటుగాడి తండ్రి.

"బావా! నేను నీ బావమరిదిని. చిన్నప్పుడే ఇంటినుంచి పారిపోయాను. ఈరోజు వీళ్లకు కనిపించాను. ఇక మీదట తాగి ఇలా రచ్చ చేస్తే బాగుండదు" అని కాస్త గట్టిగానే చెప్పాడు నాని.

"ఎవడ్రా.. నీకు బావా?! ఇట్లాంటి ఆడ–మొగ కానోణ్ని ఇంటికి తీసుకొచ్చి, నా మీదికే పంపుతావా!" అని నానిగాడిని అనరాని మాటలంటూ, వాడి మీదికి చెయ్యెత్తాడు.

తమ్ముడి మీద చేయి పడగానే.. కవిత మరిచిపోయిన కోపమంతా ఒక్కసారిగా బయటికి తెచ్చి, ఆ నీచుణ్ని ఒక్క తన్ను తన్నింది.

"అరేయ్! నువ్వు నా తమ్ముడిని ఆడ–మొగ కానోడంటావా? మరి పదేండ్ల నుంచి ఆడదాని జీతంమీద ఆధారపడ్డ నిన్నేమనాలి? నువ్వు మారుతావన్న ఆశ.. ఎప్పుడో చచ్చిపోయింది. ఇక ఇప్పటినుంచి నీ బతుకు నీది.. నా బతుకు నాది" అంటూ వీరనారిలా

మమ్మల్ని ఒప్పించి బయటికి కదిలింది.

అవును నిజమే! ఎప్పుడూ తాగుతూ పెళ్లాం బిడ్డలను చూసుకోనోడు.. పదేళ్లుగా ఇంటికి ఒక్క రూపాయి తేనోడు.. దాని బతుకును ఆగమాగం చేసినోడు.. మగాడు ఎలా అవుతాడు? దాని జీవితమంతా గొడవలతోనే గడిచింది. ఇప్పుడు ఆ గొడవల నుంచి బయటపడాలని అనుకుంటున్నది. ఇప్పుడు కూడా నేను వద్దంటే.. దాని జీవితం నాలానే అవుతుంది. సమాజం దాన్ని భర్త వదిలేశాడని అనుకున్నా.. అది భయాన్ని వదిలేసిందని మాకు తెలుసు.

నలుగురం కలిసి నానిగాడి ఇంటికి బయల్దేరాం. నా దగ్గరున్న డబ్బులతో నానిగాడి ఇంటిని బాగుచేశాం. కింద టిఫిన్ బండి పెట్టాం. పైన ఓ తరగతి గదితోపాటు మరెన్నో మంచి మంచి పుస్తకాలను ఏర్పాటుచేశాం. ఇకనుంచి వాడు అడుక్కోవాల్సిన అవసరం లేదు. కవిత తన కాళ్లమీద తాను నిల్చుంది. తను ఎన్నో ఏళ్లుగా సంపాదిస్తున్నా.. ఇప్పుడే తన కాళ్ల మీద తాను నిల్చుంది. తొందరగానే టిఫిన్ బండి, హొటల్‌గా మారింది. నానిలాంటి వారెందరో ఇప్పుడక్కడ పనిచేస్తూ చదువుకుంటున్నారు. వాళ్లందరికీ నేను అమ్మనయ్యాను. వాళ్లు నాకు బిడ్డలయ్యారు. ఇదంతా ఫొటోలోంచి చూస్తూ.. నానిగాడి తండ్రి ఆనందబాష్పాలతో ఆనందపడ్డాడు.

**(ఆనందం + విషాదం = జీవితం)**

**మంద శ్రీకర్ స్వస్థలం వరంగల్ జిల్లా కమలాపూర్ మండలం వంగపల్లి గ్రామం. తల్లి దండ్రులు మంద మంజుల - సాంబయ్య. 21 అగస్టు, 1999న జన్మించిన శ్రీకర్, కరీంనగర్‌లోని ధన్గర్‌వాడి ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నారు. ప్రస్తుతం నర్సంపేట బిట్స్ కళాశాలలో బీటెక్ (సివిల్) చివరి సంవత్సరం చదువుతున్నారు. తొలి రచన 'మరో ప్రపంచం పిలిచింది'.. గతేడాది 'నమస్తే తెలంగాణ - ముల్కనూర్ ప్రజా గ్రంథాలయం' నిర్వహించిన కథల పోటీలో బహుమతి గెలుచుకున్నది. ఇది (అర్థనారి) రెండో రచన. 2016లో ఈనాడు పత్రిక నిర్వహించిన డా. బీఆర్. అంబేద్కర్ వ్యాసరచన పోటీలో (ఉమ్మడి కరీంనగర్) స్థాయిలో ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. పాఠశాల స్థాయిలో అనేక వ్యాసరచన పోటీల్లో పాల్గొని, బహుమతులు అందుకున్నారు. తాను చదువుకున్న కరీంనగర్ మంకమ్మతోటలోని ధన్గర్‌వాడి ప్రభుత్వ పాఠశాలకు ఈ కథ ద్వారా కృతజ్ఞతలు చెబుతున్నారు శ్రీకర్.**

# ప్రేమంటే ఏమిటి?



**బలభద్రపాత్రుని ఉదయ శంకర్**

'అసలు ప్రేమంటే ఏమిటి?'.. ఈ ప్రశ్న నన్ను ఎప్పటినుంచో వేధిస్తున్నది. చిన్నప్పుడు అమ్మను అడిగాను. పెద్ద చదువులు చదువుకోని అమ్మ చిన్నగా నవ్వి.. 'ప్రేమంటే ఇష్టం రా కన్నా!' అన్నది, నా తల నిమురుతూ.

మా మేనత్త పెళ్లప్పుడు బామ్మ సున్నుండలు చేస్తూ, నా చేతిలో రెండు పెట్టింది. 'నాకు సున్నుండలు అంటే ప్రేమ బామ్మా! ఇంకో రెండివ్వు' అన్నాను.. రెండో చెయ్యి చాపి.

బామ్మ నా నెత్తిన చిన్నగా మొట్టి.. 'సున్నుండలంటే ప్రేమ ఏవిఁట్రా పిచ్చి సన్నాసి!? ఇష్టం అనాలి' అన్నది. అంటే.. ప్రేమ వేరు, ఇష్టం వేరు! అన్నమాట. 'మరి అమ్మ అలా ఎందుకు చెప్పింది?' అని బుర్ర గోక్కున్నాను.

హెడ్‌మాస్టర్ గారు స్కూల్ అసెంబ్లీలో.. 'భారతదేశము నా మాతృభూమి, భారతీయులందరూ నా సహోదరులు. నేను నా దేశమును ప్రేమించుచున్నాను..' అని రోజూ మాతో చెప్పిస్తారు.

'దేశాన్ని ప్రేమించడమేంటి? దేశభక్తి అంటారు కానీ.. దేశప్రేమ అనరు కదా!?' అని ఒకసారి మాస్టారును అడిగాను. ఆయన నా భుజం తట్టి..

'చొప్పదంటు ప్రశ్నలు వేయడంలో నువ్వే

ఫస్టురా!' అని నవ్వి.. 'దేశాన్ని ప్రేమించడమే దేశభక్తి!' అన్నారు.

అమ్మ ఎప్పుడైనా బామ్మ మాట వినకపోతే.. 'మొగుడి మీద ప్రేమ ఉంటే సరిపోదు. అత్తగారన్నా కాస్త భయం, భక్తీ ఉండాలి' అనేది.. బామ్మ కోపంగా. అప్పుడు మాస్టారు మాటలు గుర్తొచ్చి.. 'ప్రేమ, భక్తి ఒకటేనా! కాదా?' అని నాలో నేను మధనపడేవాణ్ని.

ఒకరోజు బామ్మ గుళ్లో స్వామీజీ ప్రవచనాలకు వెళ్తూ నన్ను కూడా వెంటబెట్టుకొని వెళ్లింది. ఆయన భక్తులను 'ప్రేమ మూర్తులారా!' అని సంబోధించారు. అసలే ప్రేమకు అర్థం తెలియక కొట్టుమిట్టాడుతుంటే స్వాముల వారి మాటలు నన్ను మరింత తికమకపెట్టాయి.

హైస్కూల్లో చేరిన తర్వాత నాకు స్నేహితులు పెరిగారు. వాళ్లలో కొంతమంది సినిమాలు చూసొచ్చి వాటిమీద చర్చించుకుంటూ.. ప్రేమ గురించి అప్పటివరకూ నేను విన్నది కాకుండా, కొత్త అర్థంలో మాట్లాడుకొనేవారు. 'ప్రేమంటే ఏమిటి?' అని వాళ్లను అడిగితే నాలుగు పచ్చి బూతులు చెప్పి ఎగతాళిగా మాట్లాడేవారు.

నాన్నకు తెలియని విషయం లేదు. అందుకని నాన్నను ప్రేమ గురించి అడిగాను. ఆయన నన్ను కొట్టినంత పనిచేసి.. 'వేలెడంత లేవు. ఇప్పటినుంచే నీకెందుకురా పెద్ద విషయాలు? బుద్ధిగా చదువుకో! లేకపోతే తాటతీస్తా!' అని కన్నెర్ర చేశాడు.

'ప్రేమంటే పిల్లలు తెలుసుకోకూడని పెద్ద విషయమేమో!' అనిపించింది నాకు. మా కాలనీలో ఉంటున్న కాలేజీ కుర్రాళ్ల మాటల్లో ప్రేమ ప్రస్తావన తరచుగా వచ్చేది. ఒకడు.. 'ఆమె అందం నన్ను అయస్కాంతంలా ఆకర్షించిందిరా!' అంటే, మరొకడు.. 'ప్రేమిస్తున్నానని చెప్పేయ్ గురూ!'అనేవాడు. అప్పుడు, 'ప్రేమంటే.. ఆకర్షణ!' అని అర్థమైంది.

బయాలజీ లెక్చరర్‌గా పనిచేస్తున్న మా బాబాయికి ఈ సంగతి చెబితే.. 'వాళ్ల మొహం. అది ప్రేమ కాదురా.. ఆకర్షణ!' అన్నాడు. అయితే ప్రేమ వేరు, ఆకర్షణ వేరు! అన్నమాట. నేను గందరగోళంలో పడిపోయాను. నాకంటే ఆరేళ్లు పెద్దదైన పక్కింటి సునీత పుస్తకాలు బాగా చదివేది. ప్రేమ గురించి ఆమెను అడిగితే..

'నీ అమాయకత్వం చూస్తుంటే ముచ్చటేస్తుందిరా! నాకంటే చిన్నవాడివి అయిపోయావు కానీ, లేకపోతేనా!..' అని నా బుగ్గమీద ముద్దుపెట్టింది. నేను తనకంటే పెద్దయి ఉంటే ఏం చేసేదో మరి?

* * *

పట్టువదలని విక్రమార్కుడిలా ప్రేమకు అర్థం శోధిస్తూనే.. స్కూలు దశ దాటి ఇంటర్లో చేరాను. సీతాకోకచిలుకల్లా రెపరెపలాడుతున్న అమ్మాయిలను చూస్తే నాలో ఏదో అలజడి మొదలయ్యేది. వాళ్లతో మాటలు కలపాలని ఉన్నా మనసులో ఏదో బెరుకుగా ఉండేది.

మా క్లాస్‌మేట్ లత అందరికన్నా భిన్నంగా ఉంటుంది. ఎన్నిసార్లు చూసినా, మళ్లీమళ్లీ చూడాలనిపిస్తుంది. తను కాలేజీకి రాని రోజు, నాకు ఏదో వెలితిగా ఉండేది. 'నేను ఆమెను చూస్తున్నట్లే, తనూ నన్ను చూస్తుందా!?' అనే సందేహం కలిగేది. లత తలపునకు వస్తే చాలు..

ఏదో తెలియని ఆనందం కలిగేది.

ఈ సంగతి సునీతకు చెప్పాను. 'ఇప్పటికి పెద్దమనిషివి అయ్యావన్నమాట!' అని గలగలా నవ్వింది. నేను కోపం నటించి.. 'ఛీ! పాడు.. నేనేం ఆడపిల్లనా? పెద్దమనిషి అవడం ఏంటి?' అన్నాను. ఆమె నవ్వి.. 'ఏదో సరదాగా అన్నాలే. ముందు బాగా చదువుకో! ఆ తర్వాత తీరిగ్గా ప్రేమించుకోవచ్చు' అన్నది భుజం తట్టి.

'అయితే ఇది ప్రేమేనంటావా?' అన్నాను ఆశ్చర్యంగా. సునీత ఎటో చూస్తూ.. 'కావచ్చు! కాకపోవచ్చు. కానీ, బాధ్యతలేని ప్రేమ వాసన లేని పువ్వులాంటిది' అన్నది. కొన్నాళ్లకు సునీత పెళ్లి చేసుకొని అత్తవారింటికి వెళ్లిపోయింది. కానీ ఆమె మాటలు, జ్ఞాపకాలు మాత్రం నన్ను వెంటాడుతూనే ఉన్నాయి. సునీత లేని లోటును లతతో భర్తీ చేయాలని ప్రయత్నం చేశాను. మా ఇద్దరి స్నేహబంధం కాస్త బలపడగానే.. 'నీ దృష్టిలో ప్రేమంటే ఏమిటి?' అన్నాను. ఆమె తీక్షణంగా చూసి.. 'అదొక జడ పదార్థం. మనిషిని ఎదగనివ్వదు' అని విసురుగా వెళ్లిపోయింది. అప్పటినుంచి ఆమె నాతో ముభావంగా ఉండటం గమనించాను.

ప్రేమ.. బంధాలను పెంచుతుందని విన్నాను. కానీ, లత నాతో మాట్లాడటం తగ్గించినప్పుడే తెలిసింది.. స్నేహాన్ని తెంచుతుందని! డిగ్రీ రెండో సంవత్సరంలో లతకు పెళ్లి అయిపోయింది. నా మనోఫలకం నుంచి లత రూపం తొలగించడానికి చాలాకాలమే పట్టింది నాకు.

డిగ్రీ పూర్తి చేసి, పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న నన్ను చూసి, మా మావయ్య.. 'మరీ అంత పుస్తకాల పురుగైతే ఎలారా అబ్బాయ్?' అని ఎగతాళి చేశాడు. అత్తయ్య నవ్వుతూ.. 'ఆనందంగాడు చిన్నప్పటి నుంచీ అంతే! పుస్తకాలను ప్రేమించినంతగా వాడు వాళ్ల అమ్మానాన్నల్ని కూడా ప్రేమించి ఉండడు' అన్నది.

అంటే ఏదైనా ఒక వస్తువును అమితంగా ఇష్టపడితేనో, లేదా దానిని సొంతం చేసుకోవాలని అనుకుంటేనో.. ఆ భావాన్ని ప్రేమ అంటారన్న మాట. అప్పుడే తెలిసింది లోకంలో జీవంలేని వస్తువులను కూడా ప్రేమిస్తారని!

మరి సినిమాల్లోనూ, కథల్లోనూ కేవలం స్త్రీ పురుషుల సంబంధాల్లోనే ప్రేమ ఉన్నట్లు చూపిస్తారెందుకు? అదికూడా ప్రేమ అంతిమ లక్ష్యం పెళ్లే అయినట్లు! 'ఆడా – మగ మధ్య ప్రేమ తప్ప ఇంకేం సంబంధం ఉండే అవకాశం లేదా?' అనే కొత్త ప్రశ్న నాలో ఉదయించింది.

* * *

నాకు ఒక ప్రభుత్వ సంస్థలో ఉద్యోగం వచ్చింది. కొత్తగా ఉద్యోగంలో చేరిన వాళ్లను ఉద్దేశించి.. 'చేస్తున్న పనిని ప్రేమించండి. మీ కెరీర్ బాగుంటుంది. మీవల్ల సంస్థ కూడా అభివృద్ధి చెందుతుంది' అన్నాడు మా బాస్. 'పిడుక్కీ, బియ్యానికి ఒకటే మంత్రం అయినట్లు.. ఈ ప్రపంచంలో ఏ పని చెయ్యాలన్నా ప్రేమ కావల్సిందేనా!' అన్నాను, నాతోపాటే కొత్తగా చేరిన కస్తూరితో. ఆమె నవ్వి.. 'ప్రేమే.. సృష్టికి మూలం. ప్రేమలేని

ప్రపంచం ఎడారి. ప్రేమించలేని మనిషి కసాయి' అన్నది ప్రశాంతంగా.

నేను అడిగిన దానికి సూటిగా చెప్పకుండా మాటలతోనే ఏదో మాయచేసింది కస్తూరి. కస్తూరి, నేనూ ఒకే వయసువాళ్లం కావడంతో, కొద్దిరోజులకే మా మధ్య స్నేహం ఏర్పడింది. ఆమె తన వ్యక్తిగత విషయాలన్నీ నాతో పంచుకునేది. తను వాడే లోదుస్తుల కొలతల దగ్గర నుంచీ నెలసరి తేదీల వరకూ అన్నీ నాకు చెపుతుంటే, మొదట్లో విస్మయం కలిగినా క్రమంగా వాటికి అలవాటుపడ్డాను.

ప్రేమికుల మధ్యా, భార్యాభర్తల మధ్యా రహస్యాలనేవి అడ్డు గోడల్లాంటివని, అవి ఉంటే ఆ బంధం నిలవదని కస్తూరి చాలాసార్లు చెప్పింది. ఆమె నన్ను ప్రేమిస్తుందని అనుకోవడానికి అంతకంటే నిదర్శనం ఏం కావాలి? కానీ, ఒకరోజు నా చేతిలో పెళ్లి శుభలేఖ పెట్టి, నన్ను ఆశ్చర్యపరిచింది కస్తూరి. 'ఇంకా నయం! తొందరపడి ప్రేమిస్తున్నానని చెప్పలేదు' అని ఊపిరి పీల్చుకున్నాను. 'అసలు నీకు ప్రేమంటే తెలుసా?' అని ఆమె నన్ను నిలదీసి ఉంటే, అభాసుపాలు అయ్యేవాణ్ని.

ఏమిటో పాతికేళ్లు దాటుతున్నా నాకు ప్రేమకు అర్థం తెలియట్లేదు. పెళ్లి చేసుకోమని పెద్దవాళ్లు ఒత్తిడి చేస్తున్నారు. చివరికి అమ్మానాన్నలు చూసిన సంబంధం చేసుకోక తప్పలేదు. ప్రేమంటే అర్థం తెలుసుకోకుండానే పూర్ణిమతో నా పెళ్లి జరిగిపోయింది. తొలిరాత్రే నా భార్యను అడిగాను.. 'ప్రేమంటే ఏమిటి?' అని. ఆమె సిగ్గుపడుతూ.. 'ఏమో! నాకేం తెలుసు?' అన్నది అమాయకంగా. ఆమె చుబుకం పట్టుకొని.. 'నువ్వు ఇంతవరకూ ఎవరినీ ప్రేమించలేదా?' అన్నాను. పూర్ణిమ నన్ను ఓ వింత జంతువును చూసినట్లు చూసి.. 'ఇప్పటిదాకా లేదు. ఇక మొదలుపెట్టాలి' అన్నది.

ఆ రాత్రి నేను పూర్ణిమ సాంగత్యంలో స్వర్గ సుఖాలు అనుభవించాను. 'ప్రేమకు పరాకాష్ఠ.. కామం!' అని ఒక సందర్భంలో కస్తూరి అన్న మాటలు గుర్తొచ్చాయి. అంటే, నేను పూర్ణిమను ప్రేమిస్తున్నట్లేగా! మరి ఆమె కూడా నన్ను ప్రేమించాలి కదా! కానీ, నాకు ఆమె మొహంలో ప్రేమకు బదులు భయం, కంగారు కనిపించాయేమిటి? రోజులు గడుస్తున్నకొద్దీ.. 'ప్రేమకు పరాకాష్ఠ శృంగారమే!' అని పూర్ణిమ గ్రహించినట్లుంది. ఆమె కూడా నన్ను ప్రేమించడం మొదలుపెట్టింది. సంధ్యవేళ నుంచే.. నా 'ప్రేమ' కోసం తహతహలాడసాగింది. బహుశా నేను ఒక మెట్టు పైకెక్కి.. ప్రేమించడం నుంచి ప్రేమించబడే స్థితికి చేరుకుని ఉంటాను.

పూర్ణిమ వచ్చిన తర్వాత నాలో బద్ధకం పెరిగిపోయింది. ప్రతి చిన్న అవసరానికి ఆమె మీద ఆధారపడుతుంటే.. 'పెళ్లాం రాకముందు దొరగారు ఏం చేసేవారో!?' అని నవ్వుతూనే అన్నీ అమర్చేది. నాకు మాత్రం 'అది కూడా ప్రేమలో భాగమేనేమో!?' అనిపించేది. అయినా నిర్ధారణ కోసం.. 'నేనంటే నీకు ఎంత ప్రేమ!' అంటూ దగ్గరికి తీసుకోబోతే.. 'మిమ్మల్ని ప్రేమిస్తూ కూర్చుంటే ఇంటెడు చాకిరీ ఎవరు చేస్తారు బాబూ?' అని తప్పించుకునేది. 'నా భార్యది శాశ్వతమైన, నికార్సయిన ప్రేమ కాదేమో!?' అని అనుమానం వచ్చింది. దానికి

కారణం.. ఆమె నామీద కన్నా పిల్లాడి మీద ఎక్కువ శ్రద్ధ పెట్టడం కావచ్చు. పరిపూర్ణమైన స్త్రీత్వం సంతరించుకున్న పూర్ణిమను చూస్తుంటే.. నాలో ప్రేమ మళ్లీ పరాకాష్ఠకు చేరుతుంది. కానీ, పిల్లాడి ఆలనా పాలనలో పడిపోయిన పూర్ణిమ నన్ను ప్రేమించే స్థితిలో లేదు.

* * *

ఒకరోజు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో లత కనిపించింది. పలకరిస్తే వాళ్లాయన ఏమన్నా అనుకుంటాడేమోనని నేను సంశయిస్తుంటే.. తనే చొరవ చేసి మాట్లాడింది. నన్ను తన భర్తకు పరిచయం చేసి.. 'నా క్లాస్‌మేట్ ఆనంద్. నేనంటే పడి చచ్చేవాడని చెప్పానే!' అన్నది నవ్వుతూ. నాకు తల కొట్టేసినట్లయ్యింది. మా ఆవిడ నోటికి అరచెయ్యి అడ్డం పెట్టుకొని నవ్వింది.

నేను దిక్కులు చూస్తుంటే.. 'మీరు అదృష్టవంతులు. ఈ శూర్పణఖని పెళ్లాడి ఉంటే.. 'బలి'చక్రవర్తి అయ్యేవారే!' అన్నాడు లత భర్త దయాకర్ నవ్వుతూ. లత మూతి ముడుచుకుని.. 'ఆయనంతేలే ఆనంద్! మా ఇంటికెళ్దాం రండి. ఇక్కడికి దగ్గరే' అని మా ఆవిడ భుజంమీద చెయ్యి వేసి, ముందుకు నడిచింది. లత వాళ్లింట్లోకి అడుగుపెడుతూ..'మీ పిల్లలేరి?' అన్నాను. ఒక్కక్షణం వారి మొఖాల్లో కళ తప్పింది. వెంటనే సర్దుకుని.. 'మాకు మేమే పిల్లలం!' అంటూ పెద్దగా నవ్వారు ఇద్దరూ. అప్పుడు గుర్తొచ్చింది నాకు. 'ప్రేమంటే జడ పదార్థం!' అని నమ్మిన లతకు పిల్లలెలా పుడతారు? అంటే ఆ దంపతుల మధ్య ప్రేమ లేదన్నమాట. అంతుచిక్కని ఆలోచనలు నా బుర్రను తొలిచేస్తున్నాయి.

పూర్ణిమ బాబును ఎత్తుకొని గోడలకు ఉన్న పెయింటింగ్స్ చూడటంలో మునిగిపోయింది. లత టిఫిన్ చేయడానికి వంట గదిలోకి వెళ్లింది. అప్పుడు దయాకర్ చెప్పిన విషయాలు నన్ను దిగ్భ్రాంతికి గురి చేశాయి. లతకు పుట్టుకతోనే ఉన్న గుండె జబ్బు, ఆమె గర్భం దాల్చిన సమయంలో బయటపడింది. ఆపరేషన్ చేసే స్థాయికూడా దాటిపోవటంతో గర్భస్రావం చేసి, పెద్ద ప్రాణాన్ని మాత్రం కాపాడగలిగారు డాక్టర్లు. ఆమె ఎప్పటికీ గర్భం దాల్చకూడదని, భావోద్వేగాలకు గురికాకూడదని, శారీరక శ్రమ చేయకూడదని గట్టిగా హెచ్చరించారు డాక్టర్లు. ఆమెను ఒక అపురూపమైన గాజుబొమ్మలా చూసుకోవాలి. తనవల్ల దాంపత్య సుఖం కోల్పోయిన భర్తను రెండో పెళ్లి చేసుకోమని లత ఎంత ఒత్తిడి చేసినా అతడు ఒప్పుకోలేదు.

లత టిఫిన్ ప్లేట్లతో వచ్చి.. 'నువ్వే చెప్పు ఆనంద్. తను నా వల్ల ఏం సుఖపడుతున్నారని? ఆయన మళ్లీ పెళ్లి చేసుకుంటే మంచిది కదా!' అన్నది. దయాకర్ మౌనంగా ఉండిపోయాడు. నా మెదడు మొద్దుబారి పోగా, ఎటూ చెప్పలేక నిస్సహాయంగా చూశాను. లతకు ఇంత తీవ్రమైన జబ్బు ఉందని తెలిసినప్పటి నుంచీ నా మనసంతా బాధతో నిండిపోయింది. ఇంటికి వచ్చాక కూడా నేను విచారంగా ఉండటం చూసి.. 'విధి కొందరి జీవితాలతో ఆడుకుంటుంది. వాళ్లమీద సానుభూతి చూపడం కన్నా మనం చేయగలిగింది ఏమీ లేదు' అన్నది పూర్ణిమ.

లత భర్త పరిస్థితి తల్చుకుంటూ.. 'భార్య కోసం తన సుఖాన్ని త్యాగం చేసిన దయాకర్

నిజంగా గొప్పవాడు. సముద్రమంత దుఃఖాన్ని మనసులో దాచుకుని భార్యకు సేవ చేస్తున్నాడు' అన్నాను బాధాతప్త హృదయంతో. పూర్ణిమ తల పంకిస్తూ.. 'అదే ప్రేమకు పరాకాష్ఠ. మనం ఇష్టపడేవారు సుఖంగా ఉండాలని కోరుకోవడం, దాని కోసం ఎంతటి త్యాగమైనా చేయడమే నిజమైన ప్రేమ!' అన్నది ఒక తత్వవేత్తలా.

ఎన్నో ఏళ్లుగా నన్ను వేధిస్తున్న ప్రశ్నకు సమాధానం దొరికినట్టే దొరికి మాయమైంది. 'ఒంటరి అవుతానని తెలిసినా భర్త సుఖం కోరి మళ్లీ పెళ్లి చేసుకోమనడం లత ప్రేమకు నిదర్శనం కాదా? దయాకర్ మళ్లీ పెళ్లి చేసుకొని ఉంటే ఆమె సంతోషించేది కదా! ఇద్దరిలో ఎవరి ప్రేమ గొప్పది?' అన్నాను అమాయకంగా.

'భార్యాభర్తల మధ్య ఉండే దైహిక ప్రేమ ఎంత గొప్పదో.. అలౌకిక ప్రేమ అంతకంటే గొప్పది. 'నాతిచరామి' అని భర్త చేసిన ప్రమాణం ఎన్ని కష్టనష్టాలనైనా భరించే శక్తిని ఇస్తుంది. అప్పుడు జనించే ప్రేమకు ఏ కొలమానాలూ ఉండవు. అది అనుభవం ద్వారా తెలుసుకోవాల్సిందే!' అన్నది పూర్ణిమ.

పూర్ణిమ చెప్పింది నిజమేనేమో! ఈ సృష్టిలో ప్రేమను నిర్వచించడానికి, ప్రేమను కొలవడానికి అనుభవాలను మించిన సాధనాలు ఏం ఉంటాయి? నాకు ఏమీ కాని లత గురించి బాధపడటం, దయాకర్ చేసిన త్యాగం చూసి చలించిపోవడం.. సాటి మనిషి మీద నాకుండే ప్రేమకు తార్కాణం కావచ్చు!

కాలం వేగంగా పరుగెడుతూనే ఉంది. నాకు సందేహ నివృత్తి అయిందో లేదో నేను చెప్పలేను. కానీ నేను మాత్రం.. 'ప్రేమంటే ఏమిటి?' అని ఇప్పుడు ఎవరినీ అడగట్లేదు.

* * *

**బలభద్రపాత్రుని ఉదయ శంకర్**

**ఈయన స్వస్థలం గుంటూరు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో మేనేజర్‌గా పనిచేశారు. ఈయన చాలా చిన్న వయసులోనే రచనా వ్యాసంగం మొదలుపెట్టారు. పది సంవత్సరాల వయసులోనే కథలు రాశారు. అయితే ఇంటర్ చదువుతున్నప్పుడు 1982లో ఈయన రాసిన మొదటి కవిత కళాశాల మ్యాగ్జిన్‌లో అచ్చయింది. ఆ తరువాత 1984లో ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఈయన రాసిన వ్యాసం ప్రచురితమయింది. ఇప్పటి వరకు వందకు పైగానే రచనలు పలు పత్రికల్లో అచ్చయ్యాయి. బలభద్రపాత్రుని ఉదయ శంకర్ కొన్ని ఆంగ్ల కవితలు కూడా రాశారు. అలాగే ఈయన రాసిన కథ "స్వర్ణ మంజీరాలు" కన్నడ భాషలోకి కూడా అనువాదమ-యింది. ప్రస్తుతం ఈయన సాహెూ పత్రికలో "సాహెూ కలం వీరా!" శీర్షిక నిర్వహిస్తున్నారు. బలభద్రపాత్రుని ఉదయ శంకర్‌కు కృష్ణశాస్త్రి కవిత్వమంటే చాలా ఇష్టం. మంచి పుస్తకాలు చదవటం, మంచి సంగీతం వినటం ఈయన అభిరుచులు.**

# శర్వమ్మ మరణం కథ



వాసరచెట్ల జయంతి

రాజయ్యా ..ఓ రాజయ్యా .. అంటూ ఎదురింటి శేఖర్ కేకలేస్తున్నాడు. బుజ్జీ.. ఎవరో చూడమ్మా! ఏందో అడుగు బిడ్డా.. అని గీత కు చెప్పేసరికి భోజనం తింటున్నదల్లా అలాగే ఎంగిలి చెయ్యితోనే లేచి బయటకు వెళ్ళి చూసి ఒక్కింత నిర్ఘాంతపోయి నిలుచుని వెంటనే సర్దుకుంది గీత.

కళ్ళెదుట జరుగుతున్న దృశ్యం చూసి ఒకింత సిగ్గుగా ఒకింత అవమానంగా తోచింది. పరిగెత్తుకుంటూ వెళ్లి 'నాన్నా నాన్నా అంటూ కంగారుగా భయం భయంగా 'తండ్రి దగ్గరగా వెళ్ళి మరే .శారవ్వ నూ..,అంటూ బయట జరుగుతున్న సంఘటన చెప్పింది.

పెరట్లో కట్టెల కుచ్చెన నుండి తడిసిన కట్టెల్ని తీసి ఆరబెడుతున్న రామయ్య ..చేతిలోని కట్టెల్ని కిందపడేసి బయటకు వేగంగా వచ్చాడు. పక్కింటి సూరయ్య కొడుకు శేఖర్ కనిపించాడు. అతనికీ రామయ్య కొడుకు వయసు ఉంటుంది.

ఇదే వీధిలో ఉంటారు కదా!ఈ పిల్లగాడు .మర్యాద లేకుండా పిలుస్తున్నాడు. 'అంత పొరపాటు ఏంజరిగిందబ్బా ' అనుకోసాగారు అక్కడున్న జనాలు. రామయ్య కు ఇంటికెదురుగా సొంత రైస్ మిల్లు,పిండిమర ఉంది. వడ్లు పట్టించుకోవడానికి వచ్చినవాళ్లు, పిండి పట్టించుకోవడానికి వచ్చినవాళ్ళు క్యూ కట్టారు. అందరూ రామయ్య గుమ్మం ముందు గుమ్మి గుడారు. ఆ వీధిలో దాదాపు 20 ఇండ్లు ఉంటాయి అందరూ వ్యవసాయం చేసుకునే వారే .!

పొద్దున సమయం కావడం వల్ల అందరూ ఇళ్ళల్లో నే ఉన్నారు.బయట జరుగుతున్న గొడవకి అందరూ బయటకు వచ్చి ఏందీ! రామయ్య ఇంటిమీదికి ఈపిలగాడు పోయిండు? అని ఆశ్చర్యంగా చూస్తున్నారు. వేరే ఊళ్ళ నుంచి మిల్లుకు వచ్చిన వాళ్ళు ఏం జరుగుతుందో అని చోద్యం చూస్తున్నారు. శేఖర్ చేతిలో ఒక బట్టతో ముడివేసిన మూట కనిపిస్తుంది.

విసురుగా తెచ్చి రామయ్య గుమ్మంలోకి మూటను విసిరాడు. విసిరినప్పుడు ముడి ఊడిపోయి అందులో ఉన్న రొట్టెలు బయటపడ్డాయి. అంతే విసురుగా నాలుగడుగుల్లో వెనక్కి వెళ్ళి వాళ్ళింటిలోంచి శర్వమ్మ ను జుట్టు పట్టుకొని లాక్కొచ్చి రామయ్య వాకిట్లోకి తోసాడు. తూలి క్రింద పడబోయిన శర్వమ్మ ను రామయ్య రెట్టపట్టుకుని ఆపాడు.ఏం శేఖర్ 'నాయనమ్మ ను అట్లెనేనా తోసేదీ! అన్నాడు కోపంగా రామయ్య.ఆమె నాకెందుకు నాయనమ్మ అయితది అన్నాడు విసుగ్గా...శేఖర్.'ఏం పిల్లగా మీ నాయనమ్మ కాదా..!మరి ఎవరామే అన్నారు అక్కడున్న వాళ్ళు.మీరు ఇందుట్ల మాట్లాడకుండి ఇది మాకు మాకు జరిగిన ముచ్చట అన్నాడు శేఖర్.మీకు మీకు జరిగితే మీ ఇండ్లల్ల చూసుకోండి బజార్లకు వచ్చి కొట్లాట ఎందుకయ్యా? ఆముసలామె ను దొబ్బితివి కిందపడి ప్రాణం పోతే? అన్నారక్కడున్నమరొకాయన. ఆమె ప్రాణం పోతే ఎవళ్ళకు అక్కెరా? అన్నాడు.

వేలెడంత లేడు ...పెద్దాయనను పట్టుకొని పేరువెట్టి పిలుస్తున్నవేందయ్యా ! అన్నాడొకాయన. మీకు పెద్దాయన అయితే అయ్యిండు మాకెందుకు అయితడు! 'అసలు గీ పెద్దమనిషి ఏంజేసిండో ఎరుకేనా మీకు!' అన్నాడు శేఖర్.అంత చెడ్డపని ఏంజేసిండయ్యా? అంటూ కోపంగా ముందుకొచ్చి అన్నాడొక పెద్దమనిషి. ' శేఖర్ రామయ్య దిక్కు తిరిగి మేము తిండి లేక బాధపడుతున్నమని మీకు చెప్పినమా! ఈ ముసల్ది చెప్పిందా! బిచ్చమేసినట్లు రొట్టెలు చేసి మూటగట్టి ఇచ్చింద్రు ?అంత మీకు ఎక్కువైతే ఇంకెవరికన్నా దానంజెయ్యుండి. మాకు మీ ముష్టి అవుసరం లేదు అన్నాడు శేఖర్.రామయ్యకు తలతీసేసినట్లు అయ్యింది. ఈ ముసల్ది అని అంటూన్న సమయం లో శర్వమ్మను చూస్తే జాలేసింది. ఏంమాట్లాడవూ ముసల్ది వచ్చి నిన్ను అడిగిందా ? చెప్పు అని నోటికొచ్చినట్లు అంటున్నాడు శేఖర్. శర్వమ్మ దిక్కు చూసిండు రామయ్య. 'భయంభయంగా బిక్కు బిక్కుమంటూ వణుకుతూ బిత్తరపోయి 'రామయ్య నిజం చెప్తాడేమో నని భయపడ్తుంది ఆమె.

' శర్వమ్మ నేనడిగితేనే ఇచ్చిండని చెప్తదేమోనని' రామయ్య భార్య లక్ష్మి శర్వమ్మ దిక్కు చూసింది. ఆమె ఏమీ అంటలేదు. నిన్న ఆకలయితుంది ఏమన్న ఉంటే ఇయ్యమని శారవ్వ బ్రతిమాలితే 'లక్ష్మీ పాపం పెద్దమనిషి మనతో పాటే నాలుగు రొట్టెలు ఎక్కువ చేసియ్యే' అన్నాడు రామయ్య. అక్కడికీ వద్దయ్యా వాళ్ళింటోళ్ళకు తెలిస్తే రాద్దాంతం చేస్తరు అంది. 'ఎవరిపాపం వాళ్ళది పోనీయే 'అన్నడు రామయ్య. ఆబగా ఇచ్చిన రొట్టెను నిముషంలో అక్కడే తిన్నది శర్వమ్మ . పాపం అనిపించింది లక్ష్మీ కి. కడుపునిండినంక మీ కుటుంబం సల్లగుండాలెకొడుకా నాలుగు దినాలైంది తినక కొడుకూ కోడలు పిల్లలను తీసుకుని వాళ్ళ

ఊరుకు పోయింౚ్రు. సౌదలన్నీ తనాభిల పెట్టుకున్నరు. ఆకలికి తట్టుకోలేక అడిగిన. ఎవ్వరికీ చెప్పకుండి కొడుకా ..వాళ్ళకు తెలిస్తే నన్ను బతుకనియ్యరు అంటూ రెండుచేతులూ పట్టుకుని బ్రతిమాలుతున్నట్లు అన్నది శారవ్వ. సరేనవ్వ ఎవ్వరికీ జెప్పంగానీ నీవు ఇంకపో ! అన్నరు వాళ్ళు. ఆమెను చూస్తే రామయ్య భార్య కు కూడా జాలేసింది. అమాయకంగా రామయ్య మొఖం చూసి దండం పెడుతుంది అవ్వ. రామయ్య పిల్లలకు కోపం కట్టలు తెంచుకుంది. పిల్లలు ముందుకొచ్చి శేఖర్ ను నాలుగుతందామన్నంత కోపంగా ఉన్నారు.

తండ్రిని అంతలేసిమాటలంటుంటే ఆయనకూడా ఏమీ అంటలేడని వాళ్ళకు ఉగ్రోషం వస్తుంది. తండ్రి దిక్కు చూసింౚ్రు. వద్దు అనీ కళ్ళతోటే సైగజేసిండు రామయ్య. కాసేపు అంతా మౌనంగా ఊరుకున్నారు. అంతలోనే శేఖర్ తల్లిదండ్రులు వచ్చారక్కడికి. ఏమయ్యా రామయ్యా ...మనం ఒక గేరిలో ఉన్నంత మాత్రాన మీఇంట్లో వండింది మాఇంటికి పంపుతవా..! నీకులం ఏంటిదీ ? మాకులం ఏంటిది? అనుకుంట ఉరుకొచ్చింౚ్రు..

అంతసేపు ఊరుకున్న రామయ్య కు వాళ్ళను చూడంగనే కోపం కట్టలు తెంచుకుంది. అవును వాయ నేనే ఇచ్చిన ఏంది సంగతి ..! 'అన్నాడు ధైర్యం తెచ్చుకుని. ఇచ్చిందే గాక నేనే ఇచ్చిన అని ధైర్యం గ చెప్తున్నవేంది? అది దాని దగ్గరున్న బంగారం గానీ నీకు ఇచ్చిందా ? ఆస్తిపాస్తులు రాస్తందా.అన్నారు వాళ్ళు.

ఇంతసేపు ఊరుకున్ననని నోటికెంతొస్తే అంతా ..ఓ..తెగ ఎగురుతున్నరు.. పిల్లగానితోటి నాప్రతాపం ఎందుకని గమ్మునున్న . సిగ్గు లేదుమీకు? పక్షులసోంటిది మరోపక్షి కి తెచ్చుకున్న ఆహారాన్ని పంచుతయి. సాటి మనిషి ఆకలితోటి ఉంటే మనిషన్నోడికి కడుపుతరుక్కపోతది ! అసోంటిది ఆముసలామె నాలుగు రోజులనుంచి తిండిలేక అల్లాడుతుంది. సౌదలన్నింటికీ తాలాలేసుకొని అందరూ కట్టగట్టుకుని ఊరికి పోతే ఆమె ఏంతినాలే ..! ఆలోచించింౚ్రా.,?కులం మతం అనుకునేటోల్లైతే అన్నీ అందేటట్లు పెట్టి పోయేదుండె సక్కగజూసుకుంటే... మేమెందుకు వస్తాం మీ ఇంటికి . అన్నడు రామయ్య.

ఏమీ అనలేదు వాళ్ళందరూ ! శేఖర్ కల్పించుకుని ఏందీ .! ఈముసల్ది మీదగ్గరికొచ్చి చెప్పిందా .? ఇంట్లో ఏమీలేవని అన్నాడు. చెప్పాల్నా ..తెల్వదా ..? ఈ సుట్టుపక్కల ఉన్న ఇండ్లోల్లనుఎవరిని అడిగినా మీ ఇంటి భాగోతం చెప్తరు. అన్నాడు రామయ్య.

అసలు మీరు మనుషులేనా ? మీ కంటే పెద్దది . ఒంట్లె ప్రాణం లేదు . గొడ్డు చాకిరి చేపిస్తున్నరు. ఆమెకేం కర్మ పట్టిందయ్యా .! కనకపోయినా నిన్ను పెంచి పెద్ద జేసి ఆమె ఆస్తినంతా నీపరంజేస్తే ఈ వయసులో తిండికి గూడా సక్కగ నోచుకుంటలేదు ..! నిన్న రొట్టెల పండుగ ఉండె ఇంట్లో మీరు ఎవరూ లేరని మా లక్ష్మి రొట్టెలు చేస్తే .అవ్వ తింటదని ఇచ్చింౚ్రు .నా తల్లితో పాటు ఆమె అనుకున్న అంతేగానీ ఏంలేదు. అన్నాడు రామయ్య.

' నీ తల్లిని నువ్వు సక్కగ చూసుకో మా ఇంట్లోళ్ళ దగ్గర రాకు . చెప్తున్నా అని వేలు చూపించిండు శేఖర్. మిల్లుకు వచ్చినోళ్ళందరూ అరే ఓ పోరగా మీరు పెద్ద కులపోళ్లు గిస్వంటి

విలువ తక్కువ పనులు ఎందుకు చేస్తున్నవు. ఏమనుకుంటున్నవ్ .ఆ పెద్దమనిషిని ఇంతగనం మాముందలనే తిప్పలపెడుతున్నరు ..ఇంకజెరసేపు ఇక్కడున్నరంటే మీరు పెద్దింటోళ్ళని చిన్నింటోళ్ళని ఏమీ చూడం చెప్తున్నం . ఆమెను ఇంట్లెకు తీసుకుని పోండి అన్నారు అక్కడున్న జనాలు ఏకకంఠంతో..,! అందరూ ఎగబడేసరికి అందరూ వెళ్ళిపోయారు .

***

శర్వమ్మ సుబ్బయ్య దంపతులకు పిల్లలు కలుగలేదు లక్షల ఆస్తి ఉంది. సుబ్బయ్య తన అన్న కొడుకునే తెచ్చి పెంచుకున్నాడు. అంతవరకూ శర్వమ్మ ఊళ్ళోని వాళ్ళకు తలలో నాలుకలా ఉండేది. ఎవరికి ఏకష్టం వచ్చినా సాయం చేసేది. శర్వమ్మది‘ పెట్టే చెయ్యేకానీ పట్టే చెయ్యికాదు‘ సల్లగబ్రతకాలే అనేవాళ్ళు. కొడుకు పెద్దగైనంక పెండ్లి చేశింద్రు.

కొంతకాలానికి శర్వమ్మ భర్త సుబ్బయ్య అనుకోకుండా చనిపోయాడు. భర్త మరణం శర్వమ్మను కృంగదీసింది. చాలా రోజులు ఇంటినుండి బయటకు రాలేదు.భర్త చనిపోయాక బ్యాంకు బ్యాలెన్స్ కొన్ని ఇన్సూరెన్స్ డబ్బులు బాగానే వచ్చాయి. పొలం , డబ్బు లావాదేవీలు కొడుకే చూడసాగాడు. ఆస్తిపాస్తులు మొత్తం నెమ్మదిగా వారి అధీనంలోకి వెళ్ళిపోయాయి. రానురాను కోడలు కొడుకు ఇంటి బాధ్యతలను తీసుకున్నారు. ఉప్పు ,పప్పు ,చింతపండు ,బియ్యం ప్రతీ ఒక్కటీ అల్మారా నుండి తీసి వంట చేసేవారు. ఇంటికి పెద్ద దిక్కు ఆస్తంతా ఆమెదే అనికూడా చూడకుండా శర్వమ్మను పనిమనిషిని చేసింద్రు. రానురాను ఆమె పరిస్థితి దారుణంగా తయారయింది . ఇంటెడు చాకిరీ చేయించి దొడ్లో పశువుల పాక ఊడ్పించి. ఆతర్వాతనే తిండి పెట్టేవాళ్ళు. ఒక రోజు అనారోగ్యం కారణంగా శార్వమ్మ నిద్ర లేవ లేదు. కోడలు కొడుకు నోటికొచ్చినట్లు తిట్టి ఏం సోంగులు పడుతున్నవే.అని కోడలు అనడం... ‘ అమ్మా లేవే ఇంకా... లేవకపోతే ఇంట్లో పని అంతా నా పెళ్ళాం ఒక్కతే ఎట్ల జేస్తది.‘ అని కొడుకు ప్రేమగా అన్నాడు. ‘ఒరేయ్ సూరయ్యా నాకు చేతనైత లేదురా బాగా సుస్తీ చేసినట్టుంది. ‘డాక్టర్ ను పిలిపించి సూదిమందు ఇప్పించురా నీకు పుణ్యం ఉంటది అంది .అంతగనం ఏం సుస్తీ చేసిందే నీకు! డాక్టర్‌ను తోలుకొనిరాణింకె నాకాడ పైసలు లేవు.‘లంకణం పరమౌషధం ‘అంటవ్ గదా అట్లనే పండుకో తగ్గిపోతుంది అన్నాడు చెయ్యి తో ముట్టకుండానే. ఎవరూ పట్టించుకోలేదు శర్వమ్మను. అందరూ చేను కాడికి వెళ్లి పోయింద్రు.

***

పెరటి వైపు తలుపుల దగ్గరకొచ్చి లక్ష్మమ్మా అని కేకలు వేసింది. వంటచేస్తున్న లక్ష్మి ఏమి పెద్దమ్మ అంటూ తలుపు తీసింది. శర్వమ్మ తూలుతూ వచ్చి లక్ష్మి రెండు చేతులు పట్టుకొని బోరున ఏడ్చేసింది. అర్థం కాలేదు లక్ష్మి కి. ఏడవకు ఊకో అని పక్కనే ఉన్న ముక్కాలి పీట జరిపి కూర్చోబెట్టింది. కొన్ని మంచినీళ్లు ఇచ్చి పొయ్యి మీద ఉన్న ఉడుకు రొట్టె పప్పు పెట్టి తిను పెద్దమ్మ అన్నది. ‘ నేను తిననీకి రాలేదు బిడ్డా .ఏమన్న గోలి ఉంటే ఇయ్యవా అని అడిగింది దీనంగా.. ఒళ్ళుపట్టుకుని చూస్తే సలసలా కాలిపోతున్నది . నేను నీ బిడ్డలాంటిదాన్ని

కానా పెద్దమ్మ ఒక్క రొట్టె తిను అని ఇస్తే ఆవురావురుమని తిన్నది . ఒక గోలి ఇచ్చి వేసుకోమని మంచినీళ్ళు ఇచ్చింది. పొద్దుమూకి కొడుకు కోడలు వచ్చేసరికి జ్వరం తగ్గిపోయింది. అది చూసిన కొడుకు నేనుజెప్పలేదానే ఉపాసంఉంటే అదే తగ్గిపోతుందని. పొద్దుమూకేసరికి లేషితిరుగుతుందిజూడు అన్నాడు. 'ఒరేయ్ నాకొచ్చింది ఆకలి జ్వరం రా నాయనా ' నేను చస్తే గొంతులో ఇన్ని తులసి నీళ్ళైనా పోస్తావోలేదో !అని మనసులోనే అనుకుంది. రానురాను తన పరిస్థితి ఏంటో అర్థమవ్వసాగింది ఒక నిర్ణయానికి వచ్చింది.

ఆరోజు లాగే... ఈరోజు కూడా పక్కింటిలో తెచ్చుకుని దాచుకుంటే ఎవ్వరికీ తెల్వదేమో అనుకుంది శర్వమ్మ . కానీ అంతమంది ముందు పంచాయితీ చేసి ఇన్నేండ్లు తను కడుపులపెట్టుకున్నదంతా వెల్లడి చేసింర్రు. నాపరువుమొత్తం పోయింది అనుకుంది. వారంరోజులు గడిచినయ్ .అంతా ఆరోజు జరిగింది మర్చిపోయింర్రు. ఎవరి పనులు వాళ్ళు చేసుకుంటున్నరు. శార్వమ్మ పరిస్థితి మాత్రం ఏమీ మారలేదు.

***

కొన్నిరోజులకు ఒకనాడు పొద్దున్నే 7 గంటలు అవుతుంది. ఆ వీధిలో కి అంబులెన్స్ కూతపెడుతూ వచ్చింది. ఇండ్లల్ల ఉన్నోళ్ళంతా బయటకొచ్చింర్రు. ఇక్కడ సూరయ్య ఎవరయ్యా అని అడింగింర్రు అందులోనుండి దిగిన పోలీసు వాళ్ళు. అందరూ ఇతనే అని బయట నిలబడి వేపపుల్ల నములుతున్న సూరయ్యను చూపింర్రు. ఎందుకడుగుతున్నరు అన్నడు సురయ్య వాళ్ళ దగ్గరికెళ్ళి .! శర్వమ్మ మీ అమ్మనా అన్నడు పోలీసు. అవును పిల్వాల్నా అన్నాడు. ఇంట్లో శర్వమ్మ లేదని తెలియని సూరయ్య. ... మీ దగ్గర కు కూడా అడుక్కోనింకె ఒచ్చిందా .ఏంది? మా అమ్మకు జర మతిస్థిమితం లేదయ్యా .. అన్నాడు సూరయ్యా .!

వచ్చిన పోలీసులు తలపైనుండి టోపీ తీసి ' నిన్న రాత్రి రైలు పట్టాలపై ఒక ముసలామె శవం దొరికింది . ఆరాతీస్తే ఆమె చెక్కుడు సంచిలోని ఆధార్ కార్డు ద్వారా మీ అమ్మగారని తెలిసింది. చేతిపై నీపేరు పచ్చబొట్టు ఉంది అదిచూసి గుర్తుపట్టినం అన్నారు వాళ్ళు. సూరయ్య లేని దుఃఖం నటిస్తూ అమ్మా అంటూ పరుగెత్తాడు. తన తల్లే అని గుర్తించాడు. సూరయ్య భార్యా పిల్లలు పీడా పోయింది. ఆమె చస్తే ఎవరికంటా నష్టం అని మనసులో మురిసిపోతూ బయటకు దుఃఖం నటిస్తూ వచ్చారు. ' దహన సంస్కారాలు చాలా గొప్పగా చేసారు పూలరథాన్ని తయారుచేసారు. పూలతో. నడుస్తున్న తోవంతా నిండిపోయింది. పాలరాతి సమాధి తో గుడి కట్టారు. వచ్చిన బంధువులు సూరయ్య కు తల్లిమీదున్న ప్రేమను పొగిడి ఇంత మంచి కొడుకు ఉండంగ పోయి రైలు పట్టాలమీద ఎందుకు పడింది అనుకున్నరు. నిజంగానే మతితప్పిందేమో అని నసుగుతూ వెళ్ళిపోయారు. ఊర్లోవాళ్ళు మాత్రం బ్రతికున్నప్పుడు ఒక్కపూట తిండి సరిగా పెట్టలేడు పాపాత్ముడు పోయిన తర్వాత పైసలు సల్లుతున్నడు. అనుకున్నరు. నెలరోజులుగడిచిపోయాయి.

***

ఒకరోజు సూరయ్య ఇంటికి ఒక లాయర్ వచ్చాడు. నాపేరు రామనాథం మీ ఫ్యామిలీ లాయర్ ను అన్నాడు. అట్లనా .! ఇంకా ఏమన్నా ఇన్స్యూరెన్స్ డబ్బులు వస్తాయేమో అనుకున్నారు సూరయ్య ఆయన భార్య లోలోపలే. సూరయ్య అంటే నీవేనా ..? హా...ఆ..అవును అన్నాడు ఉలిక్కిపడిన సూరయ్య ! ఈ పత్రాల్లో ఉన్నఆస్తి పాస్తులు ఎక్కడెక్కడున్నాయో చెప్పగలరా ? ఎందుకు చెప్పలేం ఇదంతా మాదే అన్నాడు పత్రాలలో ఉన్న నక్షను చూస్తూ .! అయితే ఇక్కడ సంతకాలు చేయండి అన్నాడు లాయర్. తరువాత జరిగేదేంటి తెలియక సంతోషంగా అందరూ సంతకాలు చేసారు.

''ఇంక నేను వెళ్తాను.' ఒక వారం రోజుల్లో వస్తాం ఈఆస్తులన్నీ స్వాధీనం చేసుకోవడానికి అన్నాడు. ఏమంటున్నారు సారూ అన్నాడు సూరయ్య. మీ తండ్రిగారు పోతుపోతూ శర్వమ్మను మీరు సరిగా చూసుకోకపోతే మీ అమ్మ తన తదనంతరం ఈఆస్తులన్నీ ఎవరికైనా ఇచ్చేసే అధికారం ఆమెకు నచ్చిన విధంగా ఉపయోగించుకోవచ్చు అని వీలునామా లో రాసారు. ఆవిషయం శర్వమ్మ గారికి తెలుసు.

నెలక్రితం నన్ను కలిసి తన ఆస్తినంతా అనాథాశ్రమానికి రాసిచ్చేట్లుగా పత్రాలు రాసి అనుకోకుండా తనకేమయినా జరుగుతే ఆ బాధ్యత నన్ను తీసుకుని పూర్తిచేయమని అంగీకార పత్రం రాసిచ్చారు. మీరు శర్వమ్మకు చూపిన నరకం, చేసిన అన్యాయం మొత్తం రికార్డు చేయించింది. ఆ క్యాసెట్ మిగతా అన్ని పత్రాలు ఇప్పుడు నాదగ్గర భద్రంగా ఉన్నాయి. మీరేమైనా చెప్పాలనుకున్నా .సుదేహాలున్నా కోర్టు ద్వారా తెలుసుకోవచ్చు ! ఇక నేను వెళ్తాను అని వెళ్ళిపోయాడు లాయర్ !

ఈమె బ్రతికి ఇంకా ఎవరిని ఉద్దరిస్తుందంట? చస్తే ఎవరికి నష్టం అని అంతకుముందు అనుకున్న భార్యా భర్తలు ఇద్దరూ ... ఇప్పుడు ఏంచేయాలో తెలియక నిశ్చేష్టులై అలాగే చూస్తూ నిలబడ్డారు.

***

**వాసర చెట్ల జయంతి జన్మస్థలం మహబూబ్‌నగర్ జిల్లా అమిస్తాపురం గ్రామం. (ఎం.ఎ బిఇడి) ఫ్యాషన్ డిజైనింగ్ చేసి హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఈమె రాసిన 80 కి పైగా పుస్తక సమీక్షలు పలు దినపత్రికల్లో ప్రచురితమయ్యాయి. ఇప్పటి వరకు ఈమె 20 కథలు రాసారు. తంగేడు, నేటి నిజం, సంచిక ఆన్లైన్, మయూఖ, బహుళ పత్రికలు మొదలైన పలు పత్రికల్లో ప్రచురితమయ్యాయి. ఈమె రాసిన మొదటి కథ "మోడరన్ భక్తి". అలాగే నవతెలంగాణ పత్రికలో ప్రచురితమయిన ఈమె రాసిన "తండ్రిరుణం" అనే కథ మంచి గుర్తింపునిచ్చింది. వివిధ సంస్థలు నిర్వహించిన కథలు, కవితల పోటీల్లో ఈమె పలుమార్లు బహుమతులు అందుకున్నారు.**

# ధీరవనిత



ఎనుగంటి వేణుగోపాల్

అది.. ఓరుగల్లు. పాలకుర్తి గ్రామ పొలిమేర.

ఊరవతల చెరువొడ్డున చాకలి బండల కాడ రజకుల కుటుంబీకులైన నాలుగైదు జంటలు తమ కులవృత్తిలో నిమగ్నులై ఉన్నారు.

చాకలి ఐలమ్మ.. తనవంతు బట్టలు ఉతుకుడు అయిపోయింది.

ఒక్కటొక్కటి పిండుకుంట మైదానంల, బీడువడ్డ పొలాల ఒడ్లమీద యేడ గొడంత జాగుంటె ఆడ బట్టలు ఆరేత్తంది.

ఆయాస పడుకుంట అచ్చిన మొగుడు చిట్యాల నర్సయ్యను చూసుకుంట..

"నన్ను గీ సాకిరేవు కాడికి వొమ్మని సెప్పి.. 'గిప్పుడే వత్త.. దొర రమ్మన్నడు' అనుకుంట, గుడిసె కాన్నుండటే వోతివి. అవ్! గింత సేపాయె!" నిలదీసింది ఐలమ్మ.

నీళ్లు పిండిన ఆమె సేతిలోని గొన్నన్ని తడి బట్టల్ని తీసుకుని తను ఆరేసుడు షురూ జేసిండు నర్సయ్య.

"పక్కూరుకు దొర వంపిండు గాదె!".

"అయితమాయె తియ్ గని.. ఇగో ముత్తెమన్ని బట్టలున్నయ్! గివి ఆరేసి రా. గింతెసరు వెట్టాలె. నేనింటికి బోత" అన్నది.

"ఆగాగు! దొర్సానవ్వ నిన్ను తోల్క రమ్మన్నది. గడీకి వోవాలె. పనుందట" అన్నడు నర్సయ్య.

"నీకు దొర, గడి.. గివ్విదప్ప మల్లోటి దెల్వదా? మీ తాతల కాన్నుంచి దొరలకు వూడిగం సేయనే వడితిరి.

మల్ల నన్ను గూడ గీ రొంపిలోకి దింపితిరి".

ఆరేసిన బట్టల మీద వాలుతున్న పక్షులను 'ఉష్.. ఉష్..' అని ఎల్లగొట్టుకుంట..

"ఏం జేసుడు మల్ల? మనకు దిక్కేది?" అన్నడు విచారంగ మొకం బెట్టి.

రైక దప్పిన చీరను సరిజేసుకుంట..

"వొకటి జెప్త. యేవనుకోకయ్య!" అన్నదామె.

"ఏందో సెప్పరాదె!".

"గా దొర్సానవ్వ తనను, తన బిడ్డను గూడా 'దొరా!' అని పిల్వమంటంది".

గా మాటలకు పడీ పడీ నవ్విండు.

"దొర్సానవ్వను ఆమె ముందట నేను 'దొరా!' అంటలేనానే!".

"నాకు మంచిగనిపిత్తలేదు.

నేను పిల్వ!".

"ఊరంతా అననే వట్టిరి. దానికి నామోషీ ఎందుకు? అంటె మన సొమ్మేంబాయె!".

"ఆడోళ్లను గూడ 'దొరా' అనుడేంది? ఇసిత్రం గాక పోతె!".

"గట్ల పిల్వని ఎందరో ఆడోళ్లను దగ్గరుండి దొరతోని బలాత్కారం జేయించింది. గయన్ని మనకెందుకే?".

"మనకెందుకంటే ఎట్లయ్యా? మనమీద వొకల్ల పెత్తనం ఏందయ్యా? మన గురించి మనం పట్టించుకోకపోతే ఎట్లయ్యా?!".

"కిష్టాపురం పిల్లవు. నన్ను లగ్గం జేసుకొని గీ పాలకుర్తి ఊరికత్తివి. అన్నిటిని మతికి ఎక్కించుకోకు! గీ ఊర్లె అందరెట్లుంటె గట్లనే మెదల్రాదె!".

"మనం మనుషులమే కదా! పశువులం గాదు కదా! గట్లయితే ఆళ్లకాడ పని బందువెడదం!".

భార్య చివరి మాటకు అదిరిపడ్డడు నర్సయ్య.

చేస్తున్న పనాపి..

"దొరకాడ పని బందువెట్టి గీ ఊల్లె బతికి బట్ట కడుతవా?" అన్నడు భయపడుకుంట.

"బతికి బట్టగట్టుడే గాదు. బందూకు సేతుల వట్టి సూపెడదం.." అన్నదామె కాస్త ఆవేశంగా.

ఎన్నడూ లేంది భార్య ఐలమ్మ నోటివెంట బందూకు ముచ్చట ఇనంగనే.. ముచ్చెమటలు పట్టినయి

నర్సయ్యకు. భార్య తెగింపు చూసి కాసేపు ఏం మాట్లాడాలో తోచక బిర్ర బిగుసుకు పోయిండు.

ఎలాగోలా గొంతు దెచ్చుకొని..

"సెప్తే వినవు! సేసేది సెప్పవు. యేమోనే ఐలవ్వా!" అని మాత్రం అనగలిగిండు.. అరచేతితో నుదురు మీద చరుచుకుంట.

పొద్దు గూకినంక. గుడిసె ముందు ఆకిట్ల.. తాటాకు పందిరి కింద.. నుల్క మంచం మీద కూచున్నడు నర్సయ్య.

ఎదురుంగ కింద కూచున్న ఐలమ్మ దిక్కు చూసుకుంట..

"పొద్దుగాల గడీకి రానందుకు దొరసాని మస్తు కోపంగున్నది" అన్నడు.

భర్త మాటలు పట్టించుకోకుండా..

"మల్లంపల్లికి పోయచ్చిన. గా ఊరి కొండలరావు దొరను భూమి మఖ్తె (కౌలు)కు ఇమ్మంటే.. ఇత్తనన్నడు" అన్నది ఐలమ్మ.

'మొండిది. మతికచ్చిందంటె ఇడ్సివెట్టది' అని మనసుల అనుకుంట..

"గియన్ని మనతోని అయితయా?" అన్నడు పైకి.

"పిలగాండ్లు పెరుగుతున్నరు. ఖర్సులు మోపెడు గావట్టె! దొర గడీల ఎట్టిసేసుకుంట.. ఇంకెన్నేండ్లు గిట్ల జానెడు బతుకు బతుకుడు?".

"రాతెట్లుంటే గట్లయితది. భగమంతుడు మన నుదిటి రాత గట్లనే రాసి వంపిండేమో గీ భూమ్మీదికి!"..

నర్సయ్య నోటి వెంట వేదాంతం ఉరికచ్చింది.

"మనం గిట్లనే సూసుకుంట గూసుంటే.. ఆళ్లు గట్లనే జేత్తరు. మన బతుకును మనమే సక్కగ జేసుకోవాలె. నాకు ఎర్కయ్యింది గంతే!".. తన మనసులోని మాటను నిర్భయంగా జెప్పింది ఐలమ్మ.

"గా ఊరికి వోయి కౌలుకు సేసుడా?".

"గట్లేంగాదు గని.. గా దొరకు మనూర్ల నలభై ఎకురాలు ఉందట".

"గదంత మనతోనేడ అయితది?" నిట్టూర్చిండు నర్సయ్య.

"గదయితదా.. గిదయితదా..? అని కూసుంటే ఏదీ గాదు గని. మనతోని అయినకాడికి, కొన్నెకురాలైతే దున్నుకుందం".

ఇగ చప్పుడు చెయ్యలేదు నర్సయ్య.

పాలకుర్తి పట్వారి శేషగిరిరావు ఇంటి గుమ్మానికి ఎదురుంగ చేతులు కట్టుకుని నిలవడ్డరు ఐలమ్మ, నర్సయ్య.

పాలేరు లోపలికి వోయి ఈళ్లచ్చిండ్రని పట్వారికి చెప్పిండు.

లోపల పనేం లేకపోయినా గీళ్లను బగ్గసేపు గట్లనే నిలవెట్టి.. నింపాదిగ

బయటికచ్చిండు పట్వారి.

"దండాలు..!".. పట్వారి కనవడంగనే రెండు చేతులెత్తి.. వంగి వంగి దండం బెట్టిండు నర్సయ్య.

ఐలమ్మ పట్వారి దిక్కు చూడలేదు.

"రమ్మన్నరట పట్వారి!" అన్నడు నర్సయ్య.

"రేపట్సంది మా పొలాలు కోతలు షురూ జేత్తున్నం. మనుషులు తక్కువ వడ్డరు".

"గట్లనా!?".

"మీ ఇంటోళ్లందరు రేపు మా పొలం పనికి రావాలె!" హుకుం జారీ చేసిండు పట్వారి.

నర్సయ్య కంటే ముందే ఐలమ్మ గొంతు విప్పింది..

"మల్లంపల్లి బూసామి బూమి కౌలుకు తీసుకున్నం. గా పొలం కోతలే ఇంక గాలేదు!" అంటూ..

"గవన్ని జెప్తరా ఐలమ్మ! పట్వారి పిలిత్తె రావాలె గని.." చికాగ్గా అన్నడు పట్వారి.

"కానూనుందా యాడనన్నా!"..

"సంగంల జేరినవు గద.. గాయింత మాట్లాడకుంటెట్ల గని"..

"మామీద నీ జులుం ఏంది పట్వారీ?".

"పనికి రాకపోతే ఏమైతదో ఎర్కేనా?".. కన్నెర్ర జేసిండు.

"ఆ.. ఏం గాదు!".. పట్వారికి బిగ్గరగా జవాబిచ్చి..

భర్త చేయి వట్టుకొని.. "రా అయ్యా!" అనుకుంట ఎన్కకు దిరిగింది.

ఎన్కనుంచి పాము బుస ఇనవడలేదు ఐలమ్మకు.

గడీల ఆరుబయట వాలుకుర్చీల గూసున్నడు విస్నూరు దేశ్‌ముఖ్ రాపాక రామచంద్రారెడ్డి.

ఎదురుంగ చేతులు కట్టుకొని నిలవడ్డడు పట్వారి శేషగిరిరావు.

"గా ఐలమ్మ కుటుంబం మొత్తం ఆంధ్ర మహాసభ సంగంల జేరింద్రట దొరా!".. వినయంగ చెప్పిండు.

"ఇనవడ్డది.. ఇనవడ్డది!".

"గా ఐలమ్మ గూడ బగ్గ ఉషారైతంది దొరా!".

"ఏం జేత్తంది?".. కుడి చేత్తో మీసాలు దువ్వుకుంటూ అడిగిండు రామచంద్రారెడ్డి.

"ఊల్లె అందర్ని మాయ మాటల్తోని ఆకట్టుకుంటంది".

"గీ ఊరికి కోడలుగ అచ్చిన ఐలమ్మ మాయమాటలు గూడ మనోళ్లు ఇంటున్నరా?".. ఆశ్చర్యపోయిండు రామచంద్రారెడ్డి.

"వాళ్లు ఇనేటట్టు చెప్తున్నది. మనసొంటోల్ల మీదికి ఎర్గనట్టు ఉసిగొల్పుతంది

దొరా!".. బాగా నూరి పోసింది పట్వారి.

పండ్లు పటపట కొరుక్కుంట..

"గా సంగం అగ్రనాయకులందరి మీద కోర్టుల కేసేయించు పట్వారీ!" అన్నడు రామచంద్రారెడ్డి.

వినయంగ తల ఊపిండు పట్వారి శేషగిరిరావు.

సాలోచనగా తలపంకిస్తూ..

"పనిలో పని.. గా ఐలమ్మను గూడ గా కేసుల ఇరికించు. ఒక పనైపోతది!".. ఆదేశించిండు

రామచంద్రారెడ్డి.

"గట్లనే దొరా!" తలూపిండు పట్వారి శేషగిరిరావు.. దొర కంటపడకుండా వంకరగా నవ్వుతూ.

ఆంధ్ర మహాసభ సంగం కార్యకలాపాలు చురుగ్గా జరుగుతున్నయి.

సంగపోల్లు ఎప్పుడు సభ జరిపినా ఐలమ్మ గా సభకు పోయేది. తన మాటలతో మహిళలను ఉత్తేజపరిచేది.

"మడిసికి దైర్నం, తెగింపు ఉండాలె! బానిస బతుకులు ఎన్నేండ్లు బతుకుడు? దొరలే మనుషులు గని, మనం మనుషులం గాదా? ఎట్టి సాకిరిని మట్టువెట్టుండ్రి! గొడంత సొంత బూమి కోసం ఆరాట పడుండ్రి. మట్టితోనే మనిషికి బతుకు!" అంటూ జనంలో ఆలోచనలు రేకెత్తించేది. ఆవేశం రగిలించేది. వారిలో పోరాట స్ఫూర్తిని అణువణువునా నింపేది.

గిసువంటి పనులే.. దొరకు మింగుడు పడ్తలేవు.

"కొండా లక్ష్మణ్ బాపూజీ సహకారంతో ఐలమ్మకు అనుకూలంగ తీర్పచ్చింది దొరా!".. రామచంద్రారెడ్డికి ఉప్పందించిండు పట్వారి శేషగిరిరావు.

దేశ్‌ముఖ్ రాపాక రామచంద్రారెడ్డి రగిలిపోతున్నడు.. గీ విషయం ఎరుకైనంక.

తను వేయించిన కేసు ఓడిపోవడంతో అతని అహంమీద దెబ్బ కొట్టినట్టు అయ్యింది.

దొర ఏం మాట్లాడక పోయేసరికి..

"గిది రెండో మల్క దొరా! మనం కేసు ఓడిపోవుడు".. గుర్తుచేసి అగ్నికి ఆజ్యం పోసిండు పట్వారి.

"మనూరికచ్చిన ఒక ఆడ మనిషి నన్ను, నా గడీని సవాల్ జేసుడేంది?".

"గిప్పుడు సవాల్ చేస్తున్నది ఐలమ్మ ఒక్కతే కాదు దొరా! ఆమె ఎనుకాల పెద్ద దండే తయారైంది".

మెలమెల్లగా విసునూరు దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డికి కాక పుట్టిస్తున్నడు పట్వారి శేషగిరిరావు.

"గీ అలగా జనం ఆమె ఎంట నడుసుడేంది?".

"కాలెత్తి నలిపేసే దాకా చీమలదండు కదుల్తనే ఉంటది దొరా!".

భగభగ మండిపోయిండు రామచంద్రారెడ్డి.

మనిషి శివాలెత్తి పోతూ..

"చేతులు కట్టుకుని ఊకునేది లేదు".. అంటూ ఆవేశంతో రగిలి పోయిండు.

పట్వారికి గూడ కావల్సిందదే!

"ఐలమ్మను మెసలకుంట జేయాలె.. సర్వ నాశనం జేయాలె!".

ఒక సరికొత్త పథకం పట్వారి మదిలో ఊపిరి పోసుకుంటుండగా.. దొరకు వంగి వంగి నక్క వినయంతో దండాలు పెడుతూ అక్కడినుంచి వెళ్లిపోయిండు.

"గా రాపాక రామచంద్రారెడ్డి మన కుటుంబం మీద పగవట్టినట్టున్నడు!".. భార్య ఐలమ్మ ముందర వాపోయిండు నర్సయ్య.

"బయమైతందా?" ప్రశ్నించింది ఐలమ్మ.

"గా పెద్దోళ్లతోని పేదోళ్లం మనకెందుకు సెప్పు?".

"మన ఇసయం మనం కాకపోతే మల్లెవలు పట్టించుకోవాలె.. సెప్పు?".. భర్త కండ్లలోకి సూటిగా చూస్తూ ప్రశ్నించింది ఐలమ్మ.

"కేసుల మీద కేసులు వెట్టి బెదరగొట్టాల్నని సూత్తున్నడు. గీ కేసులల్ల వోడిపేయిండు. మల్లేం జేత్తడో అని నా బాధ!".

"ఇంకేం జేత్తడు? తలదీసి గడీకి ఏలాడ దీత్తడా? సూద్దాం! పోరు సంద్రంల దిగినం. మునిగినా.. తేలినా.. జనం కోసమే గద".

బెదురే లేని ఐలమ్మ ఆత్మ స్థయిర్యానికి.. బదులుగా తలూపిండు నర్సయ్య.

"పట్వారీ! ఆంధ్ర మహాసభ సంగం పట్టు కోల్పోవాల్నంటే అందులోని సభ్యులను దొంగదెబ్బ తీయాలె!".. ఓ పన్నాగం పన్నిండు దేశ్‌ముఖ్.

"ఎట్లంటరు?" అమాయకంగ అడిగిండు పట్వారి.

"మనిషి గొడన్ని పైసలు జమైతే ఎగుర్తడు. ముందుగాల ఐలమ్మ కుటుంబాన్ని ఆర్థికంగా పడ గొట్టాలె".

"మీరెట్లంటె గట్లనే!".

"ఐలమ్మ కౌలుకు తీసుకున్న గా బూమినైతే ముందుగాల నా పేరుమీద రాయుంద్రి!".

నసిగిండు పట్వారి.

"నీకందేటియి అందుతయ్ గని. నేను
జెప్పింది చెయ్యి!".
తలూపిండు పట్వారి.

"గీ మల్క మనూరి పొలాలన్నీ మంచిగనే పండినయ్. బగ్గ దినాలకు రైతు మొకం మీద జరంత నవ్వు మొలిసేటట్లు..!".. అన్నడు చిట్యాల నర్సయ్య.

"అవును మల్ల. ఏ పొలం కాడ జూసినా వరి కోతలే కోతలు! మొదాలుకు మొదాలు వరి నాట్లేసినోళ్లు కోతలు మొదలు వెట్టిన్రు. కల్లం పనులు గూడ జరుగుతున్నయ్" బదులిచ్చింది ఐలమ్మ.

చిట్యాల ఐలమ్మ, నర్సయ్య దంపతులు కైకిలోళ్లతోని గల్సి తమ పొలం కాడ వడ్లు తూర్పార బడుతున్నరు.

ఎండ సుర్రు మంటంది.

నెత్తిమీంచి కారి.. కింద వడుతున్న గాల్ల సెమట సుక్కలు తాకుతంటె.. వడ్లగింజలు పరవశించిపోతూ జాతరలోని చిన్నపిల్లల లెక్క సంబురంగ కుప్పలోంచి ఎగిరెగిరి వడుతున్నయ్.

గంభీరమైన మొకం, చింత నిప్పులెక్కున్న కండ్లతోని దొర జీతగాళ్లు.. రౌడీ సమూహంతో కలిసి గప్పుడురికచ్చిండ్రు గా కల్లం కాడికి. పొడవాటి కంకకఱ్ఱలు చేతుల వట్టుకొని నేలను గొట్టుకుంట.

ఎత్తుగ బలంగ ఉన్న పాలేరు దుబ్బడు ఎడ్మ చేత్తోని మీసాలు మెలేసి..

"ఆరి నర్సిగా! గీ బూమి దొరదట. తన పంట బాపతు అడ్లు తీసుకురమ్మని మమ్మల్ని పంపిండు గాదుర!".. వడ్ల కుప్ప కాడ నర్సయ్యకు ఎదురుంగ నిలవడి గట్టిగ కేకలేసిండు.

పారతోని వడ్లు కుప్పదిక్కు లాగుతున్న నర్సయ్య పనాపి ఏదో అనబోయిండు.

చేతిలో ఉన్న చాట కింద పడేసింది ఐలమ్మ.

కొంగు నడుం చుట్టు దిప్పి బొడ్లె దోపుకొంది. పక్కనున్న కొడవలి చేత బట్టింది.

చిరుతపులి లెక్క దుబ్బయ్య దగ్గరికి ఉరికచ్చింది.

నుదుటిన దిద్దిన కుంకుమ లెక్క ముకమంత ఎఱ్రగ జేసుకుని..

"నకరాలు జేత్తున్నరా? బాజాప్త కౌలుకు తీసుకున్నం. కట్టపడ్డం. పంట పండించుకున్నం! పండిన గీ పంట మాది! మద్దెన గా దొరెవ్వలు? పంట గాయినకు ఇచ్చుడేంది?".. అచ్చం పోశవ్వ తల్లే ఎదురుంగ నిలవడ్డట్టు గర్జిస్తున్న ఐలమ్మను జూసిన దుబ్బయ్య.. ఉన్నపళంగ ఒక్కడుగు ఎన్కకేసిండు.

నీళ్లు నములుకుంట..

"నువ్వేమంటవ్? నర్సయ్య బావా!" అని నర్సయ్య దిక్కు చూసిండు.

భార్య ఐలమ్మ మాటలల్ల వేగుచుక్క లెక్క పొడిచిన ధైర్యాన్ని చూసి అబ్బురపడుతున్న నర్సయ్య నోట్లోంచి ఒక్కమాట రాలేదు.

గాడున్న పనోళ్లందరికీ ఇనవడేటట్టు..

"గీ మాటే ఖరారు గద!" అన్నడు దుబ్బయ్య గట్టిగ.

"ఏంది ఖరారు? ఎవల తాత జాగీరు గాదు!"..

శివమెత్తినట్టు ఐలమ్మ ఎత్తిన కొడవలి దిక్కు చూసుకుంట ఎన్కకు మర్లిండు దుబ్బయ్య.. రౌడీమూక తోని.

ఐలమ్మ కష్టపడి పండించిన పంటపై దేశముఖ్ కన్నుపడి, ఐలమ్మ పంటపై దాడి చేయబోయిండని తెలుసుకున్న ఆంధ్ర మహాసభ కార్యకర్తలు దగ్గరుండి తామే కూలీలై మిగిలిన పంట పనులు చేసింద్రు.

భీంరెడ్డి నరసింహారెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి, చకిలం యాదగిరి లాంటి ఆంధ్ర మహాసభ సంఘం ప్రముఖులు స్వయంగా ధాన్యపు బస్తాలను భుజాలపై మోసింద్రు.

"అవ్వా! పట్వారి మన ఇంటిని తగుల
బెట్టించిండట్నే!"..

చాకిరేవు కాడున్న తల్లికి చెప్పిండు ఐలమ్మ కొడుకు, పొలం కాడినుంచి ఉరికచ్చి.

"మనల్నేమీ సేయలేక గిసువంటి పనికి పూనుకుంటడా?"..

కండ్లెమ్మట నీళ్లచ్చినయి ఐలమ్మకు.

"దొర వంపిన రౌడీలు మనింట్ల నుంచి పైసలు, ధాన్యం ముందుగాల్నే ఎత్తుకు పోయింద్రట".

"నన్నిట్ల కట్టాలు వెడితెనన్న సంగం నుంచి బయటికి అత్తననుకున్నరేమో? నేనే నిలువెత్తు ఎర్రజెండను. ఇంక గాల్లేంజేత్తరో సూత్త! నేనే నిలువెత్తు తిరుగుబాటును. జనం కోసం పోరాటం జేత్తున్న నన్ను సంపుతరేమో సూత్త! ఎట్టి సాకిరీ నుంచి జనాన్ని విముక్తి సేసేటందుకు సావుకైనా సిద్ధంగున్న".. చెయ్యెత్తి పిడికిలి బిగించింది ఐలమ్మ.

ఇల్లు కాలి బూడిదైనా ఐలమ్మ కొడుకులు నోరు మెదపలేదు. కానీ, తమ సోదరిపై రజాకార్లు అత్యాచారానికి పాల్పడినప్పుడు ఉడుకునెత్తురుతో ఊగిపోయింద్రు. పోయి గా పట్వారి ఇంటిని కూల్చేసింద్రు. అటెన్క గా జాగల మక్కజొన్న పంటేసింద్రు.

కాలం ఒక్క తరీఖ ఉండదు.

గీ కారణాలతోని ఐలమ్మ ఇద్దరు కొడుకులను, భర్తను జైలుపాలు చేయించింద్రు.

అయినా ఐలమ్మను వదల్లేదు పాలకుర్తి దొర రామచంద్రారెడ్డి.

మెల్లమెల్లగ జనంల తన ఉనికికి భంగం కలిగి, దొరతనం ఉట్టికి ఎక్కుతుండటంతో ఐలమ్మను గడీకి పిలిపించిండు.

"గీడ గిప్పుడే నిన్ను సంపుత! ఎవలత్తరో సూత్త!" అని బెదిరించుకుంట కోపంతో రగిలిపోయిండు ఐలమ్మ కంట వడంగనే.

గా మాటలకు బెదిరిపోలేదు ఐలమ్మ.

"నన్ను సంపితే నా కొడుకులు ఊరుకుంటరా?

సంగపోల్లు నిన్నిడిసి పెడ్తరా? గీ జనం నిన్ను

బతకనిత్తరా?"..

గడీ దద్దరిల్లేటట్టు పులిబిడ్డ లెక్క అరిచింది ఐలమ్మ.

ఆమె ధైర్యానికి రామచంద్రారెడ్డి నిరుత్తరుడు అయ్యిండు.

"నన్నాపినంత మాత్రాన గీ పోరు ఆగది. ఎట్టి నుంచి విముక్తి కోసం జనానికి పోరాటం జేసుడు నేర్పిన! ఎట్టి సాకిరిపై తూటా గురి వెట్టుడెట్లనో బందూకు తర్ఫీదిచ్చిన! ఎప్పటికైనా గీ నిజాం పాలన మట్టి కొట్టుకుపోవుడే! దొరతనం గీ గడీ గోడలల్ల పాతరవుడే!"..

గడీల ప్రతిధ్వనించిన ఐలమ్మ మాటలకు దొరకు గుండెల దడ వుట్టింది.

ఐలమ్మ సవాల్ విసిరి.. ధీర వనిత లెక్క పౌరుషంగ గడి దాటుతుంటె.. రామచంద్రారెడ్డి ఏం చేయలేక నిస్సత్తువగా చతికిలపడి పోయిండు.

కణకణ మండే నిప్పురవ్వ లెక్క ఎగిసిపడుతూ.. జలజల పారే నీటి లెక్కపరుగులు వెడుతూ..

ధీరవనిత చిట్యాల ఐలమ్మ గడీ కంచుకోట దాటుతూ.. వడివడిగా కదిలిపోతున్నది.

తూర్పున పొడిచే పొద్దు సాయంత్రానికి పడమటిన అస్తమిస్తుంది.

అది ప్రకృతి ధర్మం!

తరతరాలకు సరిపడా పోరాట స్ఫూర్తిని ప్రజల గుండెల్లో నింపి.. వార్ధక్య దశలో అనారోగ్య కారణాలతో ఐలమ్మ భౌతికంగా అంతర్ధానమైనా..

ఆమె అమరురాలు! అజేయురాలు!!

మరణానంతరం మార్గదర్శకురాలిగా పాలకుర్తిలో ఆమె స్మారకస్తూపం, స్మారక భవనం నిర్మితమయ్యాయి.

ఆమె చూపిన ఉద్యమబాట నిత్య చైతన్య విప్లవ గీతికై.. తాడిత పీడిత జనం గుండెల్లో పల్లవిస్తుంటుంది.

ఇప్పటికీ.. ఎప్పటికీ..

కిష్టాపురంలో ఓరుగంటి వారింట ఆడబిడ్డగా పుట్టిన ఐలమ్మ.. పాలకుర్తిలో

చిట్యాల వారింట కోడలిగా అడుగుపెట్టి.. తెగింపుతో వెట్టిచాకిరీకి ముగింపు పలికించి.. తన విలక్షణ జీవన ప్రస్థానాన్ని చరిత్రలో ఒక ప్రత్యేక పుటగా చిరస్మరణీయం చేసుకున్నది.

**ఎనుగంటి వేణుగోపాల్**

**ఎనుగంటి వేణుగోపాల్ స్వస్థలం జగిత్యాల. ఎంఏ (తెలుగు), ఎంఏ(సోషియాలజీ) చేశారు. ప్రస్తుతం సారంగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఇప్పటివరకూ 172 పైగా కథలు, నాలుగు నవలలు రాశారు. ఆధ్యాత్మికత, వ్యక్తిత్వ వికాసం, సినిమాలు, సాహిత్యానికి సంబంధించి పలు వ్యాసాలు వెలువరించారు. అమ్మా నాన్న (పేరెంట్స్ కథలు), గోపాలం (హాస్య కథల సంపుటి), నవరసభరితం (నవరసాలపై కథలు), నాలుగు పుటలు (నాలుగు పార్శ్వాల కథలు), బుజ్జిగాడి బెంగ (పిల్లల సాంఘిక కథలు), నాలుగు మెతుకులు పుస్తకాలు పాఠకాదరణ పొందాయి. అమ్మ నాన్న పిల్లలు (పిల్లలపై వ్యాసాలు), విజయానికి అన్నీ మెట్లే (వ్యక్తిత్వ వికాస వ్యాసాలు) శీర్షికలతో వ్యాస సంపుటాలను ప్రచురించారు. ఈయన రచనలను వివిధ సంస్థలు 13 పుస్తకాలుగా ప్రచురించాయి.**

# విశ్వాసపాత్రుడు

– వై. ఎల్.వి.ప్రసాద్

ఆఫీసులో తన హెాడ రమణమూర్తి అనుమతి తీసుకోకుండానే చనిపోయాడు వినయ్ బాబు. ఆత్మ ఇంకా ఇళ్లు దాటలేదు. దాదాపు అరగంట పడరాని పాట్లు పడ్డాక తను చనిపోయానని నిర్ణయానికి వచ్చాడు. విషయం తెలియగానే బాధతో గట్టిగా అరిచి ఏడ్చాడు చచ్చిన వినయ్. ఓదార్చే వాళ్లు ఎవరూ లేరని తెలిసి ఏడుపు త్వరగానే విరమించుకున్నాడు. గడియారం వైపు చూశాడు. సమయం ఒంటిగంట అయింది. ముళ్లు కదులుతున్న కొద్దీ తనలో భయం పెరిగిపోతోంది. దానికి కారణం ప్రతీ రోజు సరిగ్గా 8.30 గంటలకు తను ఆఫీసులో వేలిముద్రతో హాజరు వేయాలి. లేదంటే ఆలస్యానికి కారణం చెబుతూ లెటర్ రాసి హెచ్ ఆర్‌కు సంజాయిషీ ఇచ్చుకోవాలి. ఇదంతా ఒకెత్తయితే ఆ లెటర్ మీద ఖచ్చితంగా తన హెాడ సంతకం ఉండాలి. ఆ సంతకం పెట్టేముందు ఒక తిట్టో లేదా ఒక చిరాకైన చూపో హెాడ రమణమూర్తి నుంచి బహుమతిగా తీసుకోవాల్సి ఉంటుంది. సంస్థ తెచ్చిన కొత్త పాలసీ మూలాన తన

సెలవులన్నీ ఎగిరిపోయాయి. ఇప్పుడు తను పెట్టే ప్రతీ సెలవు 'లాస్ ఆఫ్ పే'నే అవుతుంది. ఈ చావు మూలన తను ఈ రోజు నుంచి ఆఫీసుకి వెళ్ళలేడు. ఈ విషయం తనను ఎంతో బాధకు గురిచేసింది.

తన చావు గురించి తెలిసి బయటికి బాధ నటించినా ఆఫీసుకు అటెండ కానందుకు మనసులో తనను రమణ మూర్తి తప్పక తిట్టుకుంటాడాని వినయ్ బాబుకు తెలుసు. ఆ విషయం గురించి తలుచుకుని మళ్లీ కుమిలిపోయాడు. ఆపిల్ పండు తింటూనో, కాసేపు గురకపెట్టి నిద్రపోతూనో, అందరిచేత పని చేయించగల సమర్థుడు రమణమూర్తి. తాను పనిచేయకపోయినా సంస్థమీద, చైర్మన్ గారి మీద భక్తి చూపించడంలో మూర్తి తనకు తానే సాటి. తన భక్తిని అంటురోగంలా కింది ఉద్యోగులకూ అంటిస్తుంటాడు. వినయ్ కూడా సంస్థాగ్రస్తుడే. సంస్థలో పనిచేసే ప్రతీ మేనేజర్ చైర్మన్ గారి లీలల్ని అవకాశం దొరికినప్పుడల్లా కింది స్థాయి ఉద్యోగులకు వినిపించి మురిసిపోతుంటారు.

'ఛీ అన్నం పెట్టిన సంస్థకు ఎంత అన్యాయం చేశాను. నా కష్టానికి ఇవ్వాల్సిన జీతం కన్నా తక్కువే ఇస్తుండొచ్చు, ప్రతీ సంవత్సరం ఐదు లీటర్లు పెట్రోల్ కొనగలిగేంత జీతమే పెంచుతుండొచ్చు. నాకంటూ సొంత గౌరవం గట్రాలాంటివి ఇవ్వకపోయినా, నాకు ఉద్యోగి హోదా కల్పించింది నా సంస్థ. నేను ఛాతీని పెద్దగా చేసుకుని సమాజంలో తిరుగగలుగుతున్నానంటే అందుకు కారణం ఎవరు మా సంస్థే కదా!

నా చావు విషయం చైర్మన్ గారికి తెలిస్తే 'చెప్పాపెట్టకుండ చనిపోయేవాన్ని పనిలో ఎందుకు పెట్టుకున్నారయ్యా' అని హెచ్. ఆర్‌ని, తనను ఇంటర్వ్యూ చేసిన రమణమూర్తిని ఎన్ని చివాట్లు పెడతాడో?! దానికి తోడు తను పూర్తిచేయాల్సిన పని అంతా అలానే ఉంది. కనీసం ఆ పని పూర్తి చేసైనా చావకపోయానే' అని వినయ్ బాబు ఆత్మ ఆత్మన్యూనతకు లోనయింది.

ఇంతలో బాబుకు తన పక్కడెస్కు అమ్మాయి కామ్రేడ శ్రీవాణి గుర్తుకు వచ్చింది. ఆ అమ్మాయి ఈ మధ్యనే ఆఫీసులో చేరింది. తెలివైన అమ్మాయి. చదువు ఈ మధ్యనే పూర్తిచేసుకుంది. చదువుతో పాటు కాస్త కమ్యునిజం కూడా చదువుకుంది. మాట్లాడిన ప్రతీసారి లెనిన్‌నో, మార్క్స్‌నో స్మరిస్తూనే ఉంటుంది. ఆ పదాలు విన్న ప్రతిసారి డెస్క్‌లో అందరూ ఉలిక్కిపడి ఆ అమ్మాయి వైపు చూసేవాళ్లు. వినయ్ బాబుకు ఆ అమ్మాయంటే ఎనలేని అసహ్యం. తమలో కలవని వారంటే గుంపుకు ఎప్పుడూ అసహ్యమే కదా! అవకాశం దొరికినప్పుడల్లా ఆ అమ్మాయి పనిలో లేని తప్పులెతికి రమణమూర్తి దగ్గర ఆ అమ్మాయికి పనిరాదని నిరూపించేవాడు. ఈ టెక్నిక్ తన సీనియర్ రాజమల్లు దగ్గర ఒంట పట్టించుకున్నాడు.

ఒక రోజు ఆ అమ్మాయి అంతు చూడాలని ''చైర్మన్ గారు గొప్పవారా? లెనిన్ గొప్పవాడా?' అని ప్రశ్నించాడు వినయ్. క్షణం కూడా ఆలోచించకుండా ఆ అమ్మాయి

''లెనినే గొప్ప' అంది. ఈ విషయం నేరుగా అప్పుడే నిద్రలోకి జారుకుంటున్న రమణమూర్తి డెస్కు మీద వాలింది. నిద్రమత్తు విదిలించుకుని కళ్లజోడు పెట్టుకుంటూ ''అమ్మాయి చైర్మన్ సార్ కన్నా లెనిన్ గొప్ప అన్నావా?' అడిగాడు రమణ. ''అవునం'ది శ్రీవాణి. ''మరైతే ఇక్కన్నుంచి వెళ్లిపోమ్మా ఉద్యోగం వేరే చోట చూసుకోపో అన్నం పెట్టేవాన్ని కాకుండా ఎక్కడో పుట్టిన పరదేశీయున్ని గొప్పంటావా! సిగ్గులేదూ?!' గట్టిగా అరిచాడు మూర్తి. వినయ్ లోపల్లోపల భలే నవ్వుకున్నాడు. ఆ అమ్మాయి ఏం మాట్లాకుండా కూర్చుంది. ''ఇంకా కుర్చున్నావేంటి అమ్మాయ్? రష్యాకెళ్లిపో ఇక్కడెందుకున్నావ్!? అయినా నీలాంటోళ్లను ఇంటర్వ్యూ చేసి తీసుకున్నందుకు నాకుండాలి బుద్ధి. పాపం పేదపిల్ల బుద్ధిగా పనిచేసుకుంటుందని ఉద్యోగం ఇస్తే చైర్మన్ సార్నే తక్కువచేసి మాట్లాడతావా?! వెళ్లు' అన్నాడు కోపంగా. ఇంటి పరిస్థితి, ఉద్యోగం అవసరం గుర్తుకొచ్చి తనలోని విప్లవం పోయి ఏడుపు వచ్చింది శ్రీవాణికి. ''సారీ సార్ నన్ను క్షమించండి' కన్నీళ్లు పెట్టుకుంది వాణి. ''ఇప్పుడు చెప్పు ఎవరు గొప్ప?' అడిగాడు రమణమూర్తి. ఆ క్షణం ఉద్యోగ దాత చైర్మన్‌గారి ముందు ప్రపంచ కార్మిక సంక్షేమం కోసం పోరాడిన లెనిన్ పరాయి దేశం వాడై ఓడిపోయాడు.

ఆ సంఘటన తరువాత కామ్రేడ శ్రీవాణి వుత్తి శ్రీవాణి అయింది. 'ఇప్పుడు తను చనిపోయాడు గనుక తన పనికూడా శ్రీవాణే చేసి రమణమూర్తి దగ్గర మంచి మార్కులు కొట్టేస్తుంది. కొన్నాళ్ల తర్వాత రమణమూర్తి గారు వినయ్ బాబు కన్నా నువ్వే చాలా నయం అమ్మాయ్ అన్నా అంటాడేమో' ఈ ఆలోచన వినయ్ బాబు ఆత్మను మరింత అలజడికి గురిచేసింది.

సంస్థలో చేరి ఐడీ కార్డు మెడలో పడగానే ఎలాంటి వారినైనా సరే వారి సొంత భావాలను వదిలిపెట్టేలా చేసి సంపూర్ణ ఉద్యోగిగా మార్చడమే ఇందులోని మేనేజర్ల పని. అవును నిరుద్యోగం తాండవిస్తున్న ఈ భారతావనిలో తమ ఆత్మాభిమానం, వ్యక్తిత్వం కోసం ఎంతమంది నిలబడగలరు!? ఈ సాతంత్ర్య భారతంలో చైర్మన్‌గారి లాంటి వారు బానిసత్వాన్ని చక్కగా సాగు చేస్తున్నారు. ఈ సంస్థలో ఉద్యోగుల ఎంపిక విధానం భలే చిత్రంగా ఉంటుంది. పళ్లు ఎన్నున్నాయి, కాళ్లు చేతులు ఏమైనా విరిగాయా, కండ పుష్టి ఎలా ఉంది అని పరీక్షించి పూర్వం బానిసల్ని కొనేవాళ్లు చూడండి దాదాపు అలానే ఉంటుంది. ఈ సంస్థలో ఉద్యోగి ఎంపికలో ప్రధాన అంశాలు అతడు పేదవాడై ఉండాలి, అతనికి ఈ ఉద్యోగం అత్యవసరమై ఉండాలి, ఎంతో సున్నితస్తుడు, మంచివాడై ఉండాలి. స్పష్టంగా చెప్పాలంటే ఎన్ని ఇబ్బందులు ఎదురైనా చచ్చినట్టు ఇక్కడే పనిచేసే పరిస్థితిలో ఆ వ్యక్తి ఉండాలి. ఈ విధానమే చైర్మన్ గారి విజయ రహస్యం. పై పరీక్షలన్నీ పాసై పదేళ్లనుంచి సంస్థకు విశ్వాసంగా ఉన్నవాడే మన వినయ్ బాబు.

ఇంతలో ఉరుములాంటి శబ్దం విని తల పైకెత్తాడు ఎవరికీ కనిపించని బాబు. ఎలాంటి

దిగులూ లేకుండా హాయిగా నిద్రపోతున్న భార్య రజిత కనిపించింది. భార్యను చూడగానే వినయ్ కి ఎక్కడలేని కోపం వచ్చింది. 'వద్దే మా మేనేజర్ గారి ఇంట్లోనే చిన్న సైజ్ టీవీ ఉంది మనకెందుకే ఇంత పెద్దది అని ఎంత చెప్పినా వినకుండా నన్ను సతాయించి మరీ కొనిపించావ్ కదే ఈ పలక టీవీ. ఇప్పుడు దానికి ఈ ఎం ఐలు ఎలా కట్టాలి. నేను బతికుంటేనే కదా ఉద్యోగం చేయగలను, జీతం తీసుకోగలను, ఈ ఎం ఐ కట్టగలను' అని గట్టి గట్టిగా అరుస్తూ నిట్టూర్పు విడిచాడు బాబు. ఇంతలో తన వెనకాల ఉన్న గూడులో వినయ్ బాబుకు కరెంటు బిల్లు కనిపించింది. తరువాత గ్యాస్ బిల్లు ఇతరాత్ర బిల్లులన్నీ వరసకట్టి వినయ్ ఆత్మ అంతరంగంలో మెదిలాయి. ఇంతలో భార్య పక్కనే ముదురుకుని పడుకున్న కొడుకు కనిపించాడు. అంతే గోడకానుకుని కూలిపోయి కూర్చుండిపోయాడు. సార్ అంటూనే తనకు క్షవరం చేసే కొడుకు స్కూలు, దానికి కట్టాల్సిన ఫీజు గుర్తుకొచ్చింది మరి. ఈ దేశంలో బిల్లులు కట్టడానికి, ప్రభుత్వానికి పన్నులు కట్టడానికే బ్రతికే చాలా మందిలో ఒకడిలాంటోడే వినయ్.

సమయం 2గంటలైంది. ఇంతలో వినయ్ బాబు ఆత్మకి ధర్మసందేహం బయలుదేరింది. 'చచ్చి గంట దాటినా నన్ను స్వర్గానికో, నరకానికో ఎక్కడికో ఏదో ఓ చోటుకి తీసుకెళ్ళిపోవాలిగా!? అంటే అలాంటివేం లేవా? మరి ఎందుకని ఎవరూ నాకోసం రాలేదు?' అని తనలో తాను మధనపడుతుండగా అచ్చం సినిమాల్లోలాగానే ఒక కిరణపుంజం వినయ్ బాబును చేరుకుంది. అంతే కళ్ళు తెరిచి చూసే సరికి ఏదో ఒక కొత్త ప్రపంచంలో ఉన్నాడు. నూనె వేపుడులు, శూలదండనలు ఏమీ కనిపించలేదు. రాక్షసుల వంటి అందవికారమైన ఆకారాలు కూడాలేవు. కాబట్టి నరకమైతే కాదు. కాబట్టి ఖచ్చితంగా స్వర్గమై ఉండాలని నిర్ణయానికి వచ్చాడు. చిన్నప్పుడు వినయ్ బాబుకు స్వర్గం గురించి తన అవ్వ చెప్పినట్టు పాల సెలయేర్లు, వెన్నకొండలుగట్రాలాంటివి ఏమీ కనిపించలేదుగానీ పచ్చని కొండలు, జలపాతాలు, అక్కడక్కడా అందమైన కట్టడాలు, మంచి సువాసన నిచ్చే గాలులతో ఓ మంచి విహారయాత్రా స్థలంలానే ఉంది. అక్కడక్కడా ఉన్న మనుషుల ముందు అందమైన అమ్మాయిలైతే నాట్యం చేస్తున్నారు. అప్సరసలయ్యుంటా రనుకున్నాడు. కనిపించిన మనుషులందరూ తాగి తూగుతూ ఆనందంగా గడుపుతున్నారు. వాళ్లను చూసి 'ఛీ తాగుడుబోతు వెదవలు' అని మనసులోనే తిట్టుకున్నాడు వినయ్ బాబు. ఇంకా చిత్రచిత్రమైన జీవరాశులున్నాయి. కొన్ని భూమ్మీద తను చూడను కూడా చూల్లేదు. బహుశా గ్రహాంతర జీవులై ఉంటాయనుకున్నాడు. చూడటానికి ఆహ్లాదంగా ఉన్నా ఆ వాతావరణం అంతా వినయ్ బాబుకి గందరగోళంగా అనిపిస్తోంది. పండ్ల చెట్లు చాలా ఉన్నాయి. ఒక మామిడి పండు తెంచుకుని తిందామనుకున్నాడు. ఇంతలో ఓ సారి ఇలానే ఆఫీసులో తను మామిడిపండు తెంపడం చూసిన రాజమల్లు రమణమూర్తికి చెప్పి చివాట్లు పెట్టించిన విషయం గుర్తుకు వచ్చి ఆగిపోయాడు.

తన భుజం మీద ఎవరో వెనక నుంచి చెయ్యి వేశారు. తిరిగి చూస్తే ఓ అందమైన

అమ్మాయి. తన చేతిని వినయ్ బాబు ముఖం మీద వేసి సుతారంగా నిమురుతోంది. వినయ్ ఉక్కిరి బిక్కిరయిపోతున్నాడు. కౌగిలించుకోబోయింది. వెంటనే ఆ అమ్మాయిని విదిలించుకుని ''పాపిష్టిదానా నేను పద్ధతిగల కుటుంబం నుంచి వచ్చాను ఏమనుకున్నావో. నేను నీలా భరితెగించలేదు. ఇంకోసారి ఇలా ప్రవర్తించావంటే మీ పై ఆఫీసర్‌కి చెప్పి నిన్ను ఉద్యోగంలోంచి పీకేపిస్తానేమనుకున్నావో' అని గర్జించాడు. ఆ మాటలకు ఆ అప్సరస నోరుపెగలక బెదిరిపోయి నిలుచుని ''సురాపానం' అని గ్లాసు అందించపోయింది. ''ఏం నన్ను తాగుడుబోతు వెదవ అనుకున్నావా ఈ విషయం గనుక మా హెడ్ కు తెలిస్తే నా సంగతంతే వెళ్లు వెళ్లమ్మా మహాతల్లి' అని గదురుకున్నాడు. వెంటనే ఆ అమ్మాయి అక్కడి నుంచి పారిపోయింది.

చూట్టూ అంత ఆనందం ఉన్నా వినయ్ బాబుకు మాత్రం మనసు నిండా దిగులు నిండుకుంది. ఇంతలో కాస్త దూరంలో ఉన్న లోయ దాని గట్టునే ఓ చెట్టు కనిపించింది. అక్కడికి వెళ్లి దాని కింద ఒంటరిగా కూర్చున్నాడు. తనకు ఏడుపు పొంగుకొస్తోంది. కుటుంబం, ఉద్యోగం తప్ప వినయ్ బాబుకు వేరే లోకం తెలీదు. తను ఉద్యోగంలో చేరిన రెండు సంవత్సరాలకే విసుగెత్తి ఊరు వెళ్లిపోవాలనుకున్నాడు. కానీ తన సీనియర్లు ఇక్కడి నుంచి వెళ్లిన వాళ్లు బయటెక్కడా బతకలేరని భయపెట్టెవాళ్లు. సంస్థ నుంచి వెళ్లి ఉద్యోగాలు దొరక్క ఇబ్బందులు పడుతున్న వాళ్లను, ఆత్మహత్య చేసుకున్న వాళ్లను ఉదాహరణగా చూపించే వాళ్లు. సంవత్సరాలు గడిచేకొద్దీ ఆ సంస్థకు, భయపెట్టే ఆ వ్యవస్థకు చచ్చినా తను వేరే లోకంలో బతకలేనంతగా అలవాటు పడిపోయాడు. తనకు అర్థం కానీ, అలవాటులేని ఈ ప్రపంచం స్వర్గమే అయినా తనకు అక్కరలేదనిపిస్తోంది. తల పైకెత్తి దూరంగా ఆకాశంలోకి చూశాడు. గిర గిర తిరుగుతూ నీలిరంగులో భూగోళం వినయ్ బాబు కంటపడింది. పట్టరాని ఆనందంతో బుగ్గల మీద కారిన కన్నీళ్లు తుడుచుకున్నాడు. కానీ అది చాలా దూరంగా ఉంది. 'కాస్త దగ్గరగా అయినా లేదు ఉండుంటే దూకి ఎలాగైనే ఇంటికి చేరుకుని ఈ రోజే ఈ నెల టీవీ ఈ ఎం ఐ కట్టేద్దును లేదంటే రేపటికి ఫైన్ పడుతుంది. నా భార్యకు కోరికలు కోరడమే తప్ప ఇలాంటి విషయాలు అస్సలు తెలీవు. నేను లేకుండా ఎలా బతుకీడుస్తుందో ఏమో' అనుకున్నాడు. ఆలోచనలతో తనకు పిచ్చిపట్టినట్టు అవుతోంది. వినయ్ బాబు ఆత్మకు ఆత్మహత్య చేసుకోవాలనే ఆశ కలిగింది. గట్టు మీద నుంచి లోయలోకి దూకాలని రెండు మూడు సార్లు ప్రయత్నించి ధైర్యం చాలక భయపడి వెనక్కు వచ్చి స్వర్గంలో ఆ చెట్టుకింద చిరాకు పడుతూ కూర్చున్నాడు.

''ఏంటి ఆత్మహత్య చేసుకోడానికి ధైర్యం చాల్లేదు కదూ' వినయ్ బాబుకు ఓ గొంతు వినిపించింది. ''అలా ఏంలేదు లోతెంతుందో చూడటానికే చివరకు వెళ్లాను. అయినా దాక్కుని మాట్లాడుతున్నావ్ నువ్వెవరూ?' అడిగాడు.

''నా గురించెందుకులేగానీ అందరూ అక్కడ హాయిగా ఆడుతూ పడుతూ ఆనందంగా

ఉంటే నువ్వు ఇక్కడ ఒంటరిగా కూర్చున్నావెందుకు?'

''నాకు ఈ లోకం నచ్చలేదు ఇక్కడి నుంచి వెళ్లడానికి నువ్వు సాయం చేయగలవా?' క్షణం వ్యవధి ఇవ్వకుండా సమాధానం చెప్పాడు వినయ్ బాబు.

''తప్పకుండా అయినా ఈ లోకానికేమైంది ఇక్కడ నీకు నచ్చిట్టు ఉండొచ్చు. అందమైన, ఆహ్లాదకరమైన వాతావరణం, సమానత్వం, గౌరవం, హద్దులేలేని ఆనందం ఇంతకన్నా నీకు ఏం కావాలి? ఇక్కడ నువ్వు ఎవరికీ విశ్వాసం చూపించాల్సిన అవసరం ఉండదు. నీకు పూర్తి స్వేచ్ఛ దొరుకుతుంది' అని ఆ గొంతు చెప్పింది.

''నాకు నువ్వు చెప్పినవేవీ వద్దు అయినా స్వేచ్ఛ నేనేంచేసుకోను' కోపంగా అన్నాడు వినయ్ బాబు. కొన్ని క్షణాల నిశ్శబ్దం తరువాత ''నిజమే సొంత నిర్ణయాలు తీసుకోలేనివాడికి స్వేచ్ఛ భారంగా, బానిసత్వం కన్నా దారుణంగానే ఉంటుంది. కానీ దాని విలువ, అది ఇచ్చే ఆనందం అర్థమయితే నువ్వు ఇక్కడి నుంచి వెళ్లమన్నా వెళ్లవు ఒక్క సారి ఆలోచించుకో. మొదట్లో మీ మనుషులందరూ ఇలానే అన్నారు. తరువాత అలవాటు చేసుకుని ఇక్కడే ఆనందంగా ఉంటున్నారు' అంది గొంతు.

''నాకు అర్థం కానీ విషయాలను చెప్పి నన్ను ఇబ్బంది పెట్టకు దయచేసి నేను అడిగేది మాత్రం నాకు ఇవ్వు' బ్రతిమలాడాడు వినయ్ బాబు.

'' నేను సాయం చేస్తానని మాటిచ్చానుగా సరే మరి నీకేంకావాలో చెప్పు' ఆ గొంతు అంది.

''నాకు నా పాత జీవితం కావాలి' అడిగాడు వినయ్ బాబు.

ఆ గొంతు ''తదాస్తు' అంది.

వినయ్ బాబు ఆత్మ తిరిగి శరీరంలోకి చేరుకుంది. 'ఆఫీసుకు టైమయింది లేవండి' అని భార్య పిలిచిన పిలుపుకు ఉలిక్కిపడిలేశాడు. సమయం 7గం.30నిమి. అయింది. ఈ రోజు అరగంట ఆలస్యంగా నిద్రలేచాడు. వినయ్ బాబుకు రాత్రి జరిగిందేదీ గుర్తు లేదు. చకచకా ఆఫీసుకు తయారయ్యాడు. క్యారేజీ సంచి చేతిలోపెట్టుకుని బస్టాండ్‌కు పరుగుతీశాడు. అప్పటికే తన ఆఫీసు బస్సు వెళ్లిపోయింది. సిటీ సర్వీస్ బస్సులో ఎక్కి కూర్చున్నాడు. మనసు మొత్తం భయంతో నిండుకుంది. ఈ మధ్య కాలంలో ఒక్క రోజు కూడ తను ఆఫీసుకు ఆలస్యంగా వెళ్లలేదు. ఈ రోజు ఆలస్యం అయితే మూర్తిగారికి ఏం కారణం చెబితే బాగుండు అని ఆలోచిస్తూ కూర్చున్నాడు. తరువాత కారణలు ఎన్ని చెప్పినా తిట్లయితే తప్పేవి కాదనిపించింది. ఈ రోజు శ్రీవాణి ముందు తనకు పరువుపోవడం కాయం అనుకున్నాడు. 'అయినా ఎందుకింత బండనిద్రపోయాను నాకు కావాల్సిందేలే' అని తనను తాను తిట్టుకున్నాడు. ఆలోచనల్లో ఉండగానే దిగాల్సిన స్టాప్ వచ్చింది. వాచీ చూసుకున్నాడు సమయం 8గం.26నిమి.. ఇక వేలిముద్ర వేయడానికి నాలుగు నిమిషాలే ఉంది. ఆఫీసుగేటు దగ్గరికి వెళ్లాలంటే ఇంకా రెండు వందల మీటర్లు దాకా నడవాలి. పరుగు మొదలెట్టాడు. గేటు

దగ్గరికి చేరే సరికి సమయం 8గం.28నిమి. గేటు దగ్గర సెక్యూరిటీ వాడికి తన ఐడీ కార్డు చూపించి, తన సంచిలో క్యారేజీ తప్ప మారణాయుధాలేమీ లేవని నిరూపించుకుని లోపలికి రావడానికి కనీసం ఒకటిన్నర నిమిషం పట్టింది. ఆగమేఘాల మీద వేలిముద్ర తీసుకునే మోషన్ ని చేరుకున్నాడు. క్యూలో ఇద్దరి వెనక నిలుచుకున్నాడు. ఇంకా ఇరవై సెకన్లు మాత్రమే ఉన్నాయి. ఎదురు ఉన్న వాళ్లలో మొదటి వ్యక్తి తన పనిపూర్తిచేసుకుని వెళ్లాడు. వినయ్ బాబు ముందు ఉన్న వ్యక్తి వేలిముద్రను మోషన్ తీసుకోవడంలేదు. వినయ్ బాబుకు గుండె గుబేళుమన్నట్టయింది. ఇంకా నాలుగు సెకన్లే ఉన్నాయి. ఎదుటి వ్యక్తి వేలిముద్రను స్వీకరిస్తూ మోషన్ 'కుయ్' మని శబ్దం చేసింది. చివరి సెకను పూర్తయ్యేలోపు వినయ్ బాబు తన హాజరు వేసుకున్నాడు. వినయ్ బాబు విజయం సాధించాడు. ఆ విజయ గర్వంతో చెక్కిళ్లను వెడల్పు చేసుకుని చిన్నగా నవ్వాడు. చేతిగుడ్డతో ముఖానికిపట్టిన చెమట తుడుచుకుని, ఛాతిని విచ్చుకుని హుందాగా ఆఫీసులోని తన డెస్కు వైపు అడుగులు వేశాడు.

## వై.ఎల్.వి. ప్రసాద్

**వై.ఎల్.వి. ప్రసాద్ స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా యాడికి గ్రామం. ఎమ్మెస్సీ ఎలక్ట్రానిక్స్ చేశారు. 2018లో చదువు పూర్తయ్యాక, 'విపుల' పత్రికలో సబ్ ఎడిటర్‌గా రెండేండ్లపాటు పనిచేశారు. చిన్నతనం నుంచే పుస్తకాలు చదివే అలవాటు ఉన్న ప్రసాద్.. క్రమంగా రచనల వైపు మళ్లారు. 'నేనెందుకు ఏడ్వాలి?', 'ఏటీఎం', 'తొండచెప్పే ప్రేమ కథ'.. విపుల, తెలుగు వెలుగు పత్రికలలో ప్రచురితం అయ్యాయి. 'హంతకి' కథ ఈనాడు ఎఫ్‌ఎంలో ప్రసారమైంది. 'ఇది రాక్షసుడు రావాల్సిన సమయం', 'అసమర్థుడు' పేర్లతో తెలుగు వెలుగు పత్రికలలో రెండు గల్పికలు ప్రచురితం అయ్యాయి.**

# అపరంజి



తులసి బాలకృష్ణ

ఏదో పిక్నిక్ స్పాట్ లాగా అందంగా ఆహ్లాదంగా ఉంటుందనుకున్న అడవిలోని ఈ కేంపక్వార్టర్స్ చుట్టూ వాతావరణం అంతా.. చికాకు కలిగించేలాగా వుండేసరికి బాగా డీలా పడిపోయాడు రాజారావు. గోపీ చందనం రంగు వెల్ల వేసిన ఇంటి గోడల్లోకి ఇంకి పోయి, కాఫీ ఒలకబోసినట్లు ప్రపంచ మ్యాపులు సృష్టించిన వర్షపు నీళ్ళు.. నేలంతా చిత్తడి... ఎండిన ఆకుల కుప్పలు .. ఆ ఆకుల కుప్పల్లో జరజరా ఏవో భూచరాలు పాకుతూన్న సవ్వడి.. గాలంతా ఏదో నిలవ వాసన.. రొజ్జగాలి...

చా గిట్ల ఏమన్నా తెస్తునా? అంటూన్న నర్సిమ్మ ముఖంలోకి చూసాడు రాజారావు. నల్లగా, పొట్టిగా, ముఖం మీద స్ఫోటకపు మచ్చలతో వున్న అతని ముఖంలోకి చూడడానికి ఇబ్బంది అనిపించింది. ఇన్స్పెక్షన్ పని మీద వచ్చిన తనకి వ్యక్తిగత పనులన్నీ చేసిపెట్టడానికి అతన్ని అప్పగించారు ఇక్కడి ఫారెస్ట్ కార్యాలయం

వాళ్ళు. ఇక్కడుండే ఈ పదిహేను రోజులూ ఈ చికాకు వాతావరణంలో ఈ మొరటు మనిషి సాయం పొందుతూ గడపాల్సిన్దేనన్న మాట!? హతవిధీ! నగర జీవితాన్నీ, సంసార చికాకుల్నీ తప్పించుకుని కొన్నాళ్ళ బాటు ఒంటరిగా స్వేచ్ఛగా హాయిగా కులాసాగా గడపగలను .. అనుకుంటే .. మై గాడ్! ఇట్సె కర్స్!... ఊఁ.. ఏదో కానియ్ అన్నాడు నర్సిమ్మతో అయిష్టంగానే.

గిప్పుడే.. ఒక్క మినట్ల తెస్త అని నర్సిమ్మ వెళ్ళగానే, దిగులుగా సోఫాలో కూలబడ్డాడు రాజారావు..నొసలు రుద్దుకుంటూ. పది నిముషాలు గడిచాయి. 'చాయ్ కి కూడా గంటల తరబడి వెయిట్ చెయ్యాలేమో ఇక్కడ .. ఖర్మ. ఆకలి కూడా వేస్తోంది. తిండి రెండు రోజులకి ఒఖ్కసారే దొరుకుతుందేమో అనుకుంటూండగా నర్సిమ్మ పెద్ద టిఫిన్ బాక్స్, సాసర్ మూత పెట్టిన చాయ్ కప్పు ఓ ట్రేలో పట్టుకుని, ప్రత్యక్షమై, రాజారావు ముందున్న టీపాయ్ మీద పెట్టాడు. టిఫిన్ బాక్స్ మూత తెరిచిన రాజారావు ..అందులో వున్న పొగలు కక్కుతూన్న మసాలా వడలని చూస్తూనే కళ్ళు మిటకరించి.. ఓ వడని అప్రయత్నంగానే నోట్లో పెట్టుకుని కసిక్కున కొరికి నమిలాడు. అద్భుతమయిన రుచి అనిపించి.. ఇవెక్కడివి? దగ్గరలో హోటల్ ఏమయినా ఉందా? లేక నువ్వు చేసుకొచ్చావా? అనడిగాడు మెచ్చుకోలుగా కళ్ళెగరేస్తూ. నర్సిమ్మ తల అడ్డంగా ఆడిస్తూ, గీడ హోటల్ ఏడది? అన్నాడు. నన్నడుగుతావేంటయ్యా? ఆయితే నువ్వు చేసుకొచ్చావా? అయ్.. చెయ్యనీకి నాకొస్తదా సారూ?

పంటిక్రింద మరో వడని చితకగొడ్తూ .. నర్సిమ్మ అమాయకపు స్వభావానికి లోనుండి నవ్వు తన్నుకొస్తూండగా.. మరెక్కడ్నుంచి తెచ్చావో చెప్పవయ్యా బాబూ ఇంత మంచి వడలు? అన్నాడు రాజారావు. అపరంజి సేసింది సారూ. ఒక్కసారిగా రాజారావులో చిన్న కుదుపు వచ్చింది. అపరంజా? అపరంజి ఎవరు?

ఆచిమన్ బిడ్డ. అగో .. గా సెట్టవతల రూమ్ ల వుంటరు అని, నే బోయి ఉడుకు నీల్లు తెస్త మీకు తానమాడనీకి అని బయల్దేరబోయాడు. ఆగాగు అన్న రాజారావు. రెండు వడలు తీసి ఇస్తూ తిను. చాలా బావున్నాయి అన్నాడు .. మొహమాట పడుతూనే తీసుకుని, వెళ్ళాడు నర్సిమ్మ.

అపరంజి! ఎంత మంచి పేరు అనుకున్నాడు రాజారావు. సూట్ కేస్ లోంచి బట్టలు తీసుకుని, మిగిలిన రూములూ, బాత్ రూము ఎలా వున్నాయో ఓసారి చూసుకుని వచ్చాడు. పెద్ద బకెట్ తొ వేడి నీళ్ళు మోసుకొచ్చి, బాత్ రూములో పెట్టిన నర్సిమ్మ అచ్చ సారూ! తమరు తానంజేసి, ఇస్రాంతి తీసుకునుర్రి. నేమల్ల పొద్దుగాల్నే అస్త అన్నాడు వెళ్ళడానికి

సిద్ధపడుతూ. ఉలిక్కిపడ్డ రాజారావు, నువ్వెళ్ళిపోతావా? రాత్రి నాకు భోజనం? అనడిగాడు కంగారుగా.

అపరంజి సేసిపెడ్తది సారూ. నేను గీ మబ్బుల ఆరు కిలో మీటర్లు పోవాల సైకిల్మీద. సరే..పోయిరా. వెళ్ళిపోయాడు నర్సిమ్మ. స్నానం చేసి వచ్చి, మంచం మీద వాలాడు రాజారావు. వాతావరణం క్రమేపీ అలవాటు పడుతూండడంతో ఫర్వాలేదు .. ఇక్కడ బాగానే ఉండొచ్చు అనుకుంటూండగానే ప్రయాణ బడలిక కారణంగా కునుకు పట్టేసింది.

నిద్రలో మంచి తియ్యటి కల... అందమైన అటవీ ప్రాంతం.. లోయలు.. కొండలు గుట్టలు... సుందరమైన తీగలు చుట్టుకున్న పెద్ద పెద్ద వృక్షాలు, చెంగు చెంగున గెంతుతూన్న జింక పిల్లలు, చెట్ల కొమ్మల గుబురుల్లోంచి కోయిలల కుహూరవాలు, పిట్టల కువకువలూ, సెలయేళ్ల గలగలలూ ... తను స్వేచ్ఛగా గొంతు విప్పి పాడుతూ .. ఒడలు మరచి చిందులు వేస్తూ నృత్యం చేస్తూ.. అంతలోనే ఎక్కడ్నుంచో కాలి గజ్జెల రవళులు .. చేతి గాజుల గలగలలు.. ఎవరివవి.. తన చూపుకి అందవేం?....

సారూ ఓ తియ్యని స్వరం. ఎవరో స్త్రీది. ఎక్కడ? ఆ పొదలమాటునా?.. ఆ చెట్ల చాటునా?.. పిలిచి కనబడకుండా ఎందుకు తప్పించుకుంటోంది? ఆట పట్టిస్తోందా?...

సారూ ఈసారి స్వరం స్థాయి పెరిగింది. రాజారావు కల చెదిరింది. ప్రయత్నం మీద అర తెరిచిన కన్నులతో తల తిప్పి చూసాడు. అంతే! ఒఖ్ఖసారిగా పగిలిన పత్తికాయల్లా విచ్చు కున్నాయి కళ్ళు. ఎదురుగా ఓ పోతపోసిన రామప్ప శిల్పం. సారూ..బువ్వ అంటోంది శిల్పం. కనురెప్పలు మూయడం మరచిపోయాడు రాజారావు. అసలు తనని తనే మరచిపోయాడు రాజారావు. బువ్వ. లోపల బెట్టిన. తిన్రని

అలా చూస్తూ వుండడం సభ్యత కాదన్న విషయం మరచిపోయిన రాజారావు... శాపగ్రస్తుడై శిలా ప్రతిమయిపోయిన వాడిలా కదలిక లేకుండా అలా చూస్తూనే వున్నాడు. ఇది కలా నిజమా? ఇంత అందం.. తను దేవాలయ శిల్పాలలో చూసాడు .. మ్యూజియంలలో చూసాడు .. ఆర్ట్ గ్యాలరీలలో చూసాడు .. కానీ .. సజీవంగా .. తన కళ్ళెదుట ... తనతోనే మాట్లాడుతూ ...

రాజారావు అలా చూస్తూంటే .. ఒఖ్ఖసారిగా కొద్దిగా చలించినట్లయి.. బువ్వ సల్లబడిపోద్ది.. జల్ది తిన్రని.. అని ఆమె వెళ్లి పోతూంటే .. స్పృహలోకి వచ్చి గబుక్కున, అప్రయత్నంగా ఇదుగో మాట.. అన్నాడు కంగారుగా.

ఆగి 'ఏమిట'న్నట్లు భ్రుకుటి మడిచి చూసింది. ఒయ్యారంగా సగం తిరిగి నిలబడిన ఆమె భంగిమ లోని ఒంపు సొంపులకి మరింత మతిపోయి చూస్తూండి పోయిన రాజారావు కి ఎందుకు ఆగమన్నాడో చెప్పడానికి ఏమీ తోచలేదు. ఇంకా నిద్దర్లోనే వుండు సారూ అంటూ

ఆమె కిలకిలా నవ్వి, వెళ్లిపోబోయింది. ని..న్నీ పేరూ? అన్నాడు రాజారావు గబుక్కున – తడబడుతూ. అపరంజి అదే నవ్వు సాయంతో అని, మెరుపు తీగలా మాయమయ్యిందామె.

నెమ్మదిగా తేరుకుంటూ 'మనిషే అనుకుంటే పేరు కూడా ఎంత బాగుందీ! లంబాడా పిల్లలా వుంది. ఇంత మంచి పేరు ఎలా తట్టిందో? సినిమా హీరోయిన్లు ఈమె ముందు బలాదూరు. ఈ అడవులలోంచి తీసుకెళ్ళి, ఎండా వానల తాకిడి లేకుండా ఒఖ్ఖ మూడు నెలలు ఉంచితే .. జానపద కథల్లో మనం చదివే రాచకన్యలు ఈమె ముందు దిగదుడుపే.'

రాజారావు గుండెలు ఓ వింత ఆనందంతో రవళించ సాగాయి. ఈ ఇన్స్పెక్షన్ డ్యూటీ ఓ వరం అనిపించ సాగింది. ఆ నర్సిమ్మ గాడు రాకుండా వుంటే.. అపరంజే స్నానానికి నీళ్ళూ, టిఫిను, భోజనం .. అంటూ తరుచూ వచ్చి కనబడుతూంటే... తరుచు తను ఆమెతో మాట్లాడుతూంటే .. అవకాశం వుండి తను ఏదో మిష మీద ఆమెని ముట్టుకో గలిగితే.. తను తీసుకునే ఆ చనువుకి ఆమె అభ్యంతరం చెప్పక పోతే.. తను ఇంకొంచెం చొరవ తీసుకుని... ఆలోచనలతో ఆపాదమస్తకం పులకించిపోయింది రాజారావుకి.

దండాల్దొరా బండరాళ్ళు దొర్లుతూన్నట్లున్న స్వరం. అదిరిపడ్డంత పనయ్యింది రాజారావుకి. చటుక్కున తల తిప్పి చూసాడు. ఎదురుగా చేతిలో పెద్ద దుడ్డు కఱ్ఱతో నల్లగా .. మొరటుగా వున్న చెయ్యెత్తు బుఱ్ఱ మీసాల మనిషి. అపరంజి అయ్యని. 'కొంపదీసి ఇందాక తను ఒళ్ళు తెలియక అపరంజితో అతి చనువుగా ప్రవర్తించాడా ? తండ్రికి కంప్లైంట్ ఇచ్చిందా ?'

ఈడ ఆచ్మన్ని. పేరు కురంగి. తమకేంగావాలన్న నాకయినా, నా బిడ్డకయినా జెప్పుఱ్ని

'హమ్మయ్య! గొడవకి రాలేదు. థాంక్ గాడ్ .. భయం స్థానంలో దర్పం చోటు చేసుకుంది. అట్లానేలే అన్నాడు రాజారావు. ఇంతలో ఎక్కడ్నుంచి వచ్చిందో పెద్ద సింహంలాంటి కుక్క ఒకటి ఎగురుతూ వచ్చి, గుఱ్ఱున చూస్తూ.. రాజారావు మీదకి రాబోయింది. భయంతో కంపించిపోయాడు రాజారావు. కురంగి దాన్ని ఆఁ .. అని గదమాయించి, లంబాడా భాషలో ఏదో అన్నాడు. మరుక్షణం అది అతి సాత్వికంగా మారిపోయి, వెనక రెండు కాళ్ళ మీద నిలబడి, ముందు కాళ్ళని జోడించి నమస్కరించింది రాజారావుకి.

ఇగ మిమ్ముల్నేం సెయ్యదు. దీని పేర బీముడు దొరా అభయమిచ్చాడు కురంగి. రెండు రోజులు గడిచాయి. అపరంజి అందం రాజారావు మెదడుని కుదుపుతోంది.. మనసుని చెదరగొడుతోంది. ముఖ్యంగా ఓరగా సన్నగా నవ్వే ఆమె నవ్వు గుండెలకి గిలిగింతలు పెడ్తోంది. ఆమెతో అలా మాట్లాడుతూనే ఉండాలనీ.. అవకాశం వస్తే లక్ష్మణ రేఖ దాటాలనీ.. తెగ ఉబలాటంగా వుంది. అంతలోనే.. తెలిస్తే కురంగి చంపేస్తాడన్న భయం. పైగా అపరంజి

కూడా అవసరమైనంత మేరకే తన సమక్షంలో ఉంటోంది తప్ప ఆపైన ఒక్క క్షణం కూడా వుండడం లేదు. తన నేర్పంతా చూపిస్తూ మాటలతో పడగొట్టాలంటే అవకాశమే చిక్కడం లేదు.

మరో రెండు రోజులు గడిచాయి. ఈ తండ్రీ కూతుళ్ళకి సంబంధించిన సమాచారాన్ని నర్సిమ్మ నుంచి రాబట్టాడు రాజారావు. అపరంజికి తల్లి లేదు. తండ్రే సర్వస్వం ఆమెకి. ఎంత అమాయకంగా కనిపిస్తుందో అంత సాహసవంతురాలు, ధైర్యవంతురాలు అపరంజి. నిప్పులాంటి మనిషి. కురంగి పెద్ద త్రాగుబోతు. అదే అతని బలహీనత. అంతకి మించిన అవలక్షణాలుగాని, దౌర్జన్య లక్షణాలు గాని ఏమీ లేవు.

కురంగికున్న అవలక్షణమయిన త్రాగుడుని తనకి అనువుగా మార్చుకునే అవకాశం ఏమన్నా ఉంటుందా అన్న ఆశ పొటమరించింది రాజారావులో.

కురంగీ! నువ్వు తాగుతావా? అనడిగాడు .. రాత్రి పడుకునే ముందు కర్ర చప్పుడు చేస్తూ బిల్డింగ్ చుట్టూ ప్రక్కల అంతా అతగాడు చెక్ చేస్తూన్నప్పుడు. జవాబు చెప్పడానికి సిగ్గుపడ్డాడు కురంగి. లోపలి గదిలోకి వెళ్లి, సూట్ కేస్ లోంచి ఫారెన్ విస్కీ బాటిల్ తెచ్చి, ఇదుగో.. ఎవరో బహుమతిగా ఇచ్చారు నాకు. నేను తాగను. నువ్వు తీసుకో అన్నాడు.

సిగ్గుపడ్డ కురంగి, చేతులు జోడించి, నాకెందుకు దొరా గంత ఖరీదైన సీమ సరుకు? అన్నాడు. ఫర్వాలేదులే తీసుకో. బాగుంటుంది అంటూ బలవంతంగా అతని చేతిలో పెట్టాడు రాజారావ్.

ఆ మర్నాటి నుంచీ మరింత వినయంగా ప్రవర్తిస్తూన్నాడు కురంగి. 'నా బహుమానం బాగానే పని చేసిందన్న మాట అనుకుంటూ చిరు గర్వంగా నవ్వుకుని, ఇంక నేనిక్కడ ఉండేది నాలుగు రోజులే. ఈ నాలుగు రోజుల్లోనూ వీడిని మరింత లొంగదీసుకుని, మత్తులో ముంచి, అపరంజిని మాటల్లో పడగొట్టి, ఆరంగేట్రం కానియ్యాలి' అని నిశ్చయించుకున్నాడు రాజారావు. అతని కోరిక నిర్వహణకి బలం చేకూరుస్తూ ఈరోజు ఉదయం మరో శుభవార్త చెప్పాడు కురంగి. అతని దగ్గర బంధువు ఎవరో పొరుగూర్లో చనిపోయాట్ట. అందుకని ఓ రెండ్రోజులపాటు తను వెళ్ళు తూన్నానని.. రాజారావుకి కావాల్సిన పన్లన్నీ అపరంజి చేస్తుందని. రాజారావు మనస్సు ఆనందంతొ త్రుళ్ళి త్రుళ్ళి పడసాగింది. ఇంతకంటే మంచి అవకాశం ఏముంటుంది? పోయిరా. నువ్వు వచ్చాక మరో బుడ్డి ఇస్తాలే అన్నాడు కురంగితో. రెండు చేతులూ జోడించి వెళ్ళాడు కురంగి.

పగలంతా డ్యూటీలో ఉన్నంత సేపూ ఈ రాత్రికి అపరంజిని ఎలా లొంగ దీసుకోవాలనే ఆలోచనే. అల్లరి జరగ కూడదు. తనకి గాని, తన ఉద్యోగానికి గాని, పరువు ప్రతిష్టలకి గాని ఎటువంటి ప్రమాదం రాకూడదు. అపరంజి మనసు గాయ పడకుండా .. ఆనందంగానే ..

తండ్రి వూళ్ళో లేని అవకాశాన్ని వినియోగించుకుని.. తనతో సహకరించాలి. ఏది మార్గం? మాటలతో పడగొట్టడం సాధ్యమేనా? ఆమె బీదరికాన్ని ఎత్తి చూపుతూ డబ్బో, తన మెళ్ళో వున్న బంగారం గొలుసునో ఆశ చూపితే? ఆలోచనలు.. బుర్రని తింటూన్నాయి...

సాయంత్రం డ్యూటీ అయ్యాక క్వార్టర్స్ కి వచ్చాడు రాజారావు.

నర్సిమ్మ ఉన్నాడు అక్కడ. 'వీడు త్వరగా పోతే బాగుండును' గొణుక్కున్నాడు రాజారావు లోలోనే. నర్సిమ్మ త్వరగా పోలేదు సరికదా.. రాజారావు దిమ్మ తిరిగిపోయే వార్తని చెప్పాడు. సారూ! గీ వార్త ఇన్నరా మీరు? అనడిగాడు ముందు. విషయం తను చెప్పకుండా అవతలి మనిషిని ప్రశ్నించే అతని స్వభావం ఈసారి తనున్న పరిస్థితిలో విపరీతంగా కోపం తెప్పించింది రాజారావు కి –. ఏ విషయమయ్యా? అని కసురుకున్నాడు.

మన అపరంజి పోరి లేదా... అంటూ ప్రారంభించి ..జరిగిన సంఘటనని వివరిస్తూ .. వర్ణిస్తూ చెప్పిన విషయం విని, రాజారావు వెన్నులో చలి ప్రారంభమయ్యింది. నర్సిమ్మ చెప్పిన సంఘటన వివరాలు ఏమిటంటే...

'ఈరోజు మధ్యాహ్నం అపరంజి ఇప్ప పూలు ఎరుకు రావడానికి అడవి లోపలికి వెళ్లిందట. జీపులో వస్తూన్న నలుగురు పోతుల్లాంటి యువకులు ఎదురుపడి.. అపరంజిని లైంగికంగా లొంగదీసుకోవడానికి బల ప్రదర్శన చేసారట. అంత నాజూకుగా వుండే అపరంజీ కూడా అపర కాళికా దేవతావతారమెత్తి.. ఓ కట్టె తీసుకుని, నలుగురు పోతులనీ ఎదుర్కొందట. ఆయుధాలు లేకుండా ఆమెని స్వాధీనం చేసుకోవడం సాధ్యం కాదని గ్రహించిన ఆ పోతులు జీపులోంచి మారణాయుధాలు తీసుకుని వచ్చారట. అయినా అపరంజి ధైర్యంగానే నిలబదిందట. ఇంతలో ఆమెకి అత్యంత విశ్వాస పాత్రురాలయిన భీముడు ఎలా పసిగట్టిందో మరి – వాయు వేగంతో ఉరికి ఉరికి వచ్చి .. వాళ్ళ ఆయుధాల దెబ్బలని చాకచక్యంగా తప్పించుకుంటూ.. వాళ్ళ మీద పడి, కండలు పీకేసిందట. దెబ్బకి తోక ముడిచారుట దున్నపోతులు. అపరంజి, భీముడు కలిసి వాళ్ళని అడవి పొలిమేరలవరకూ తరిమి తరిమి కొట్టి తిరిగొచ్చారట.' ఏదో సస్పెన్స్ థ్రిల్లర్

స్టోరీ చెప్పుతూన్నట్లు ఆంగిక సాత్వికాభినయాలతో నర్సిమ్మ వర్ణించి చెప్పుతూన్నకొద్దీ రాజారావు లో ఒణుకు అధికమవ సాగింది. అపరంజి నిప్పులాంటి పోరి సారూ. మంచోల్లకి పాణమిస్తది. ఏసాల్ గిట్లేస్తే పాణం దీస్తది అని ముక్తాయించాడు నర్సిమ్మ.

స్నానానికి వేడి నీళ్ళు, తినడానికి పకోడీలు, చాయ్ తెచ్చి రాజారావు ముందు పెట్టి, ఇంటికి వెళ్ళిపోయాడు నర్సిమ్మ. తిన బుద్ధి కాక, అతి కష్టం మీద రెండు పకోడీలు తిని, చాయ్ తాగాడు రాజారావు. స్నానం చెయ్యడానికి శరీరం, మనస్సూ సహకరించక.. జ్వరం వచ్చిన భావం కూడా కలిగి, మంచం మీద వాలాడు.

తను తొందర పడి వుంటే .. తన పరిస్థితి ఏమయి ఉండేదో తలుచు కుంటూంటే .. ఒణుకు ఎక్కువై.. దానికి జ్వరం కూడా తోడై.. ఒంటిని కుదిపెయ్యసాగింది. హైదరాబాద్ లో తను బయల్దేరినప్పుడు ఎండలు చంపేస్తూండడంతొ అన్నీ పల్చని నూలు బట్టలే తెచ్చుకున్నాడు తను. ఈ చలిని ఆ బట్టలతో తట్టుకోవడం అసాధ్యం అనిపిస్తోంది. కాని చేసేదేముంది? ఉన్నవాటి తోనే సర్దుకుని, దుప్పటీ కప్పుకున్నాడు. కొద్ది సేపట్లోనే చలి, జ్వరం ఎక్కువ అయ్యాయి. ముడుచుకున్నాడు. క్రమేపీ మగత కమ్మేసింది....

నిద్దర్లో .. జ్వర తీవ్రతలో పలవరింతలు కూడా మొదలయ్యాయి.. లోనుండి సెగలు సెగలుగా  వేడి తన్నుకొస్తోంది... మాత్రలు ఏవీ లేవు.. గొంతు ఎండిపోతోంది.. లేచి మంచినీళ్ళు తాగుదామన్నా శక్తీ చాలడం లేదు.. రాత్రి ఎంత టైమయ్యిందో కూడా తెలియదు.. తెల్లారితే తను ప్రాణంతో నిలుస్తానా అన్న కొత్త సంశయం... నిద్దర్లో ఏవేవో పీడ కలలు... అడవిలోని భయంకర క్రూర మృగాలన్నీ తన మీదకి దాడికి వచ్చి పీక్కు తింటూన్నట్లు భయ భ్రాంతులు..అంతలో ఎవరో తన మీద జాలి చూపిస్తూ వచ్చి, తనకి వెచ్చని రగ్గులు కప్పుతూన్నట్లు, తనని అక్కున జేర్చుకుని అభయమిస్తూ తనలో ధైర్యం కలిగిస్తూన్న ఓదార్పు భ్రాంతి...

కొన్ని గంటలు అలా ఆ అవస్థలో గడిచాక కొద్దిగా జ్వరం, చలి తగ్గు ముఖం పట్టుతోందని అనిపిస్తూండగా... కొద్ది పాటి మెలకువ వచ్చి .. అతి నెమ్మదిగా కళ్ళని అర తెరచి .... అత్యంత సంభ్రమాశ్చర్యాలకి లోనయి పోయాడు రాజారావు.

తన ఒంటి మీద ఎంతటి చలిని అయినా కాసే ఓ ముతక కంబళీ వుంది.. అంతకంటే ఆశ్చర్యం .. ఆ కంబళీ మీదుగా .. ఒత్తిగిల్లి పడుకుని వున్న తనని వెనకనుంచి చుట్టుకుని పడుకుని వున్న ఓ స్త్రీ తాలూకు చేతులు. ఇదీ కలలో భాగమేనా అనిపిస్తోంది. కొద్దిగా కదిలినా ఈ 'కల' చెదిరిపోతుందేమోననిపిస్తోంది. అంత చలి జ్వరంతో వున్న తనకి కంబళీ కప్పడమే కాక అంతగా తనని పొదివి కౌగలించుకుని పట్టుకుని పడుకున్న స్త్రీ ఎవరి వుంటారు?! ఇంకేవరుంటారు?.. అపరంజియే అయి వుంటుంది. ఏమిటి ఈ అమ్మాయి ఉద్దేశం?

ఎంత కదలకుండా అలా పడుకునే ఉందామనుకున్నా .. సాధ్యపడక కొద్దిగా కదలక తప్పలేదు రాజారావు కి. అంతే.. తన పట్టుని సడలించి.. చేతుల్ని గబుక్కున వెనక్కి తీసుకుని.. మంచం మీది నుంచి దూకింది ఆమె.

ఓపిక వచ్చి దిగ్గున మంచం మీద లేచి కూర్చుని ఆమె ముఖం లోకి చూసాడు రాజారావు. అపరంజి! ఆమె ముఖంలో విజయం సాధించిన, సంతృప్తితో కూడిన ఓ వింత సంతోషం.. చప్పట్లు కొట్టి, సారుకి బీమార్ తగ్గిపోయిందీ .. అని, అంతలోనే సర్దుకుని, కొంచెం దూరం జరిగి, రేత్రి నుచ్చెల్లి మీకు బూకారుంది. ఒల్లు కొలిమి లెక్క కాలిపోబట్టె. సలిజొరంతో ఊఖే

ఒణికిపోబట్టిన్రు. కంబళి గప్పినా. సలికి సాల్లే. గందుకని.. నువ్వుభీ మా బాపులేక్కేననీ.. అని ఆగి మళ్ళీ మా బాపుకి ఓసార్లే.. గిట్లనే బూకారొొస్తే.. గట్లనే అంటిబెట్టుకు పండిన. తగ్గిబోనాది. నీకుభీ గట్లనే సేస్తే తగ్గుద్దని... అంటూండగా ఆమె గొంతు అనుమతి తీసుకోలేదన్న అపరాధభావంతో సన్నగా ఒణికింది.

రాజారావు కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఇట్లా రా అన్నాడు వేలు ఆడిస్తూ తనవైపుకి చూపిస్తూ.

భయపడుతూనే దగ్గరకొచ్చింది. కూర్చో అన్నాడు. మోకాళ్ళ మీద కూర్చుంది. ఆమె ముఖం చుట్టూ చేతులు వుంచి, ఆత్మీయంగా దగ్గరగా తీసుకుని, నొసట చుంబించి, అరచేతిని తల మీద వుంచి దీర్ఘాయుష్మాన్ భవ. శీఘ్రమే కళ్యాణ ప్రాప్తి రస్తు. నీ పెళ్ళికి మీ బాపూకి నేను కూడా సాయం చేస్తా. నూరేళ్ళూ చక్కటి భర్తతో, పండంటి పిల్లా పాపలతో సుఖంగా జీవించు తల్లీ అని ఆశీర్వదించాడు.

అపరంజి బుగ్గల్లో కెంపులు పూసాయి. అతని పాదాలని కళ్ళకద్దుకుంది.అపరాధ భావంతో కుమిలిపోతూన్న రాజారావు కళ్ళ నుంచి జర్రున జారిన రెండు కన్నీటి బొట్లు .. కృతజ్ఞతా భావంతో ఆమెని ఆశీర్వదిస్తూన్న అక్షింతలుగా .. ఆమె తల మీద వ్రాలాయి.

***

**తులసి బాలకృష్ణ స్వస్థలం హైదరాబాద్. బ్యాంక్ మేనేజర్‌గా పనిచేసి రిటైర్డ్ అయ్యారు. ఈయన నాలుగున్నర దశాబ్దాల నుంచి కథలు రాస్తున్నారు. మొట్టమొదటి కథ నైజం. స్వాతి మాసపత్రికలో ముద్రితమయ్యింది. ఇప్పటికి 400లకు పైగా కథలు రాసారు. ఇవి వివిధ ప్రముఖ పత్రికలలో అచ్చయ్యాయి. నాలుగు నవలలు రాసారు. అలాగే రెండు నాటకాలు, ముప్పై ఆరు నాటికలు, నలభై రేడియో నాటికలు రాసారు. ఆయన తులసీ దళాలు, గిలిగింతలు అనే పుస్తకాలను సైతం వెలువరించారు. చెప్పుకోదగ్గ సంఖ్యలోనే బహుమతులు, సన్మానాలు, పురస్కారాలు పొందారు. రచయి-ంతగా, రంగస్థల నటుడిగా, దర్శకుడిగా, ఉభయ తెలుగు రాష్ట్రాలలోని ప్రముఖ సాహిత్య, సాంస్కృతిక సంస్థలచే పలుమార్లు సన్మానింపబడినారు. గురజాడ పురస్కారం, శ్రీశ్రీ పురస్కారం అందుకున్నారు.**

# ఇంకా తెలవారదేమీ



**ఉమా మహేష్ ఆచాళ్ళ**
**9849303247**

అడుగులేసినంత మేరా ఆక్రమించే అదేదో యాగంలో అశ్వానికి మాత్రం అలుపే మిగిలినట్టు, ప్రగతికి బాట లేసే తాతబ్బాయి మొహానికి పట్టిన  చెమటని చొక్కాతో తుడుచుకుంటూనే మరోచేత్తో రోడ రోలరు స్టీరింగ్ తిప్పుతున్నాడు.

నాతో పోటీయా అన్న ట్టు సాయంత్రం ఆరైనా సూర్యుడు కూడా డ్యూటీ దిగలేదు. వారం రోజులుగా తార్రోడ్డు మెయిన్టైనెన్సు లో భాగంగా  పేచ్ వర్క్ జరుగుతోంది. ఆరోజే ఆఖరు.  గంటకి ఐదు కిలోమీటర్ల వేగంతో నడుపుతున్న రోలరు  కిందనింది ఏభై డిగ్రీల వేడి నేరుగా తగులుతోంది. తారు,  డీజిల్, ఎమల్షన్,  కలిసిన వాసనతో  ముతక గుడ్డ ముక్కులో కుక్కినట్టు ఉక్కిరి బిక్కిరి అవుతున్నాడు తాతబ్బాయి.

ఏడాదిలో ఓ ఆరు నెలల పని.  ఆ ఆరు నెలలూ ఇంటికెళ్ళాక కూడా చేపల పులుసొండినా, చేమదుంపల కూరొండినా ఇదే వాసన వెంటాడుతూ ఉంటుంది.  జీతం మాత్రం పద్దెనిమిది వేలు చొప్పున పన్నెండు నెలలూ ఇస్తాడు కాంట్రాక్టర్.  కాళ్ళ వాపులు కిడ్నీలనీ, ఆయాసం హార్టునీ చెక్ చేయించమని చెబుతున్నా, ఖాళీ జేబు కాలక్షేపం

చేయిస్తోంది. ఇలాంటి వృత్తి పరమైన ఆరోగ్య సమస్యల కారణంగా అతను నలభై ఐదేళ్ళ క్రితం పుట్టినా ఏభై ఐదేళ్ళ క్రితం పుట్టిన వాడిలా ఉంటాడు.

నోరులేని రోలరుని చల్లార్చటానికి నాజిల్స్ ద్వారా నీటి చుక్కలు పడుతున్నాయి. అలాంటి సదుపాయం లేని తాతబ్బాయి తన సీట్ పక్కనే ఉన్న వాడేసిన కూల్ డ్రింక్ బాటిల్ లో వేడెక్కిన నీళ్ళని తాగలేక, మొహం మీద పోసుకోనూలేక ఉసూరు మంటూ రోలరు దిగాడు.

పనైపోయిందని సూపర్ వైజర్ ఫోన్ చేసినట్టున్నాడు డైలీ వర్కర్స్ కి పేమెంట్ ఇవ్వటానికి కాంట్రాక్టర్ శ్రీపతి వచ్చి కారు దిగి రోడ్డునోసారి పరీక్షించి చూసి ఎవరితోనో ఫోన్లో మాట్లాడి, తాతబ్బాయిని పిలిచాడు. కాళ్ళూ చేతులూ మొహం కడుక్కుని, తుడుచుకుని వచ్చి చేతులు రెండూ దగ్గరగా పెట్టుకుని నించున్నాడు తాతబ్బాయి.

ఏం తాతబ్బాయి ఎలా ఉన్నావు. ఈరోజుతో పనైపోనట్టేనా? అయిపోయింది సర్, ఓ గంటలో ఆరిపోద్ది. రోడ్డు అప్పుజేప్పేయొచ్చు అన్నాడు తాతబ్బాయి వినయంగా. గుడ్ . అవునూ, మీ అబ్బాయి పాలిటెక్నిక్ చదివాడన్నావు కదా. ఇప్పుడేం చేస్తున్నాడు. ఏవో కోర్సులు నేర్చుకున్నాడయ్యా. గల్ఫ్ లో ఏదో ఆఫర్ వచ్చిందట. అమౌంట్ కావాలి. దానికోసం తిరుగుతున్నాడు. అవునా?. నువ్వు కుడా అప్పట్లో ఐ.టి.ఐ పూర్తి చేసుంటే ఈపాటికి ఎక్కడో ఉండేవాడివి అని నవ్వి, మన పరిస్థితి నీకూ తెలుసుగా. ఎక్కడి పేమెంట్లు అక్కడ ఆగిపోయాయి. వడ్డీకి తెచ్చి మరీ పనులు పూర్తి చేస్తున్నా. అవును సర్. పనుల్లేకపోయినా మా జీతాలు కూడా ఆపకుండా ఇస్తున్నారు. అందుకే మిమ్మల్ని అడగటానికి మనసొప్పలేదు . ఏమాత్రం అవకాశం ఉన్నా మీరే ఇచ్చేవారు అన్నాడు తాతబ్బాయి కృతజ్ఞతగా.

అంతలో శ్రీపతి ఫోన్ మోగింది. కొడుకు ఈవెనింగ్ బయటకి వెళ్ళాలట. కారు కావాలని ఫోన్. ఓకే, నాన్నా, వచ్చేస్తున్నా. ఫైవ్ మినిట్స్ అంటూ ఫోన్ పెట్టేసి, సరే చూద్దాంలే, వచ్చే వారం పనెక్కడో సూపర్ వైజర్ చెబుతాడులే. నువ్వెళ్ళు. మళ్ళీ నీకు లేటవుతోంది. ఇంటికెళ్ళి వంట చేసుకోవాలి కాబోలు అంటూ తాతబ్బాయిని పంపేసి, సూపర్ వైజర్ కి పేమెంట్ ఇచ్చేసి కారెక్కి ఇంటికి వెళ్ళిపోయాడు శ్రీపతి.

* * *

ఇంటికొచ్చి స్నానం చేసి ఇండాలియం గిన్నెలో బియ్యం పెట్టి, టమోటాలు, ఉల్లిపాయలు కోసి పక్కన పెట్టుకున్నాడు తాతబ్బాయి. నాన్నా, ఫ్రేండ ఇంటికి వెళ్తున్నా చదువుకోడానికి. రాత్రి అక్కడే పడుకుంటా, త్వరగా అన్నం పెట్టు అన్నాడు మల్లేసు. గుడ్లు ఇంకా రాలేదురా. కాసేపు ఉంటావా లేక మధ్యాన్నం రసం ఉంది దాంతో తినేస్తావా ? ఏదో ఒకటి త్వరగా పెట్టేయ్ అంటూ హడావిడిగా తినేసి వెళ్ళిపోయాడు మల్లేసు.

వళ్ళంతా పులిసిపోయి, కళ్ళు మండుతూ ఉండటంతో ఇంత మజ్జిగా అన్నం తిని పడుకుందామని కంచంలో అన్నం పెట్టుకుని మజ్జిగ పోసుకున్నాడు తాతబ్బాయి.

జ్ఞాపకాల తెరలు తెరుచుకున్నాయి. రోజూ ఉదయాన్నే టీ తో మొదలు, మూడుపూట్లా మూడు ఐటమ్స్ కి తక్కువలేకుండా వేడిగా పెట్టేది. డ్యూటీ లో తన కేరేజీ విప్పగానే అంతా చుట్టూ మూగేవారు. అలాంటిది ఇప్పుడు పొద్దున్నే ఇంత టీ చుక్క కలుపుకుని తాగి, రెండు పూటలా రసమో, పప్పో , కూరో, ఒక్క ఐటెం వండుకుని డ్యూటీ కి వెళ్ళటం కష్టమైపోతోంది. ముద్ద నోట్లో పెట్టుకోబోతూ ఉండగా ఆలోచనలు చెదిరేలా ఫోన్ మోగింది. చూస్తే శ్రీపతి. సర్ నమస్తే , చెప్పండి సర్ అన్నాడు నర్సింగ్. తాతబ్బాయి ఎక్కడున్నావు ? ఇంటిదగ్గరే సర్.. నువ్వు అర్జెంటు గా రావాలి. షేర్ ఆటో గురించి చూడకు, బేరం ఆడకు. దొరికిన ఆటో పట్టుకుని ఇంటికి రా మాట్లాడాలి

* * *

తాతాబ్బాయి వెళ్ళేటప్పటికి శ్రీపతి తన ఇరవై ఏళ్ల కొడుకుని ముద్దుగా తిడుతున్నాడు. సిటీ లో నెమ్మదిగా వెళ్ళాలి కదా నాన్నా. ఏం కాదులే. నువ్వు కంగారు పడకు. నేనున్నాను గా అంటూ బుజ్జగిస్తున్నాడు. సార్, అర్జెంటు గా రమ్మనారు నెమ్మదిగా అడిగాడు తాతాబ్బాయి.

కూర్చో తాతబ్బాయి. పర్లేదయ్యా . ఏంటి సర్ ఏదైనా సమస్యా అడిగాడు కంగారుగా తాతాబ్బాయి . ఓ ప్రాబ్లం వచ్చింది తాతబ్బాయి. చిన్న ఆక్సిడెంట్. మన ఏరియా లోనే ఎవరో కుర్రాడు కారుకి అడ్డుగా వచ్చి పడ్డాడట. అక్కడికీ బాబు నెమ్మదిగానే వెళుతున్నాడట అంటూ నెమ్మదిగా విషయం చెప్పాడు శ్రీపతి. నాలుసార్లు అడిగితే గానీ తండ్రికే చెప్పలేదు స్పీడో మీటర్ నూట ఇరవై దగ్గర స్టక్ అయ్యిందని. అడక్కుండా తాతబ్బాయి కి మాత్రం నిజం ఎలా చెబుతాడు.

అతన్నెందుకు పిలిచాడో తాతబ్బాయి కి చూచాయిగా అర్థం అవుతోంది. దెబ్బ తగిలిన కుర్రాడు ఎలా ఉన్నాడు సర్ అడిగాడు. వెంటనే హాస్పిటల్ లో జాయిన్ చేసాం. చిన్న హెడ్ ఇంజురీ అట. మెడికో లీగల్ కేసు అయ్యేటట్టుంది. ఇంకా పెర్మనెంట్ లైసెన్స్ రాలేదు. అందుకని బాబు భయపడుతున్నాడు. చదువుకి కాస్త ఇబ్బంది అవ్తుందేమో అని కూడా కంగారు పడుతున్నాడు. లక్కీ గా అక్కడ సి.సి కెమేరాలేవీ లేవు. వెహికల్ స్టేషన్ లోనే ఉంది. 'బాబు వెనక సీట్లో ఉన్నాడు, డ్రైవర్ భయపడి పారిపోయాడు, ఫోన్ చేసాము. వచ్చి రిపోర్ట్ చేస్తాడు' అని సేఫ్ సైడ కి చెప్పి ఉంచాము. మన లాయర్ తో కూడా మాట్లాడాను. నువ్వెళ్ళి ఎస్. ఐ ని కలిస్తే చాలు. ఎఫ్ .ఐ. ఆర్ కట్టి స్టేషన్ బెయిల్ ఇస్తాడు. ఇవ్వకపోయినా రేపు కోర్ట్ తెరిచిన వెంటనే బెయిలు తెచ్చేద్దాం. కాంప్రమైజ్ కి వస్తే సరి, లేదంటే కేసు నడుస్తుంది. ఎలాగైనా కొట్టించేద్దాం. నీకేం ఇబ్బంది ఉండదు. ఇలా అంటున్నానని ఏమీ అనుకోకు. మీ అబ్బాయి ఉద్యోగానికి ఏదో అమౌంట్ కావాలన్నావు కదా. అది నేను ఎరేంజ్ చేస్తాను నెమ్మదిగా చెప్పవలసింది చెప్పి ముగించాడు శ్రీపతి.

అతనికి టెన్షన్ గా ఉంది. రాత్రిలోగా ఎవరో ఒకర్ని తీసుకెళ్ళి అప్పజెప్పేస్తే మేనేజ్ చెయ్యొచ్చు. తాతాబ్బాయి ఎంత మంచివాడైనా ఒప్పుకుంటాడో లేదో. ఒప్పుకోకపోతే

ఇప్పటికిప్పుడు మరొకర్ని వెతుక్కోవాలి.

తాతబ్బాయి కి విషయం పూర్తిగా అర్థమైంది. లారీ డ్రైవర్ గా ఉండేటప్పుడు ఇలాంటివి ఒకటి రెండు విని ఉన్నాడు. అతనకి పెద్దగా అభ్యంతరం ఏమీ కనబడలేదు. అయ్యా, పదేళ్లనించి నా మంచి, చెడ్డ మీరే చూస్తున్నారు. స్టేషన్ కి వెళ్ళటం పెద్ద పనేముందయ్యా. మీరు అంతగా చెప్పాలా. బాబూ, నువ్వేం కంగారు పడకు. నేను చూసుకుంటా అంటూ తాతబ్బాయి ఒప్పుకునేసరికి శ్రీపతి తేలిగ్గా ఊపిరి తీసుకుని కొడుకు చేత తాతాబ్బాయి కి థాంక్స్ చెప్పించి లోపలి పంపేసాడు.

తాతాబ్బాయి భుజం మీద చెయ్యేసి గేటు వరకూ తీసికెళ్తూ మరోసారి చెబుతున్నాను తాతబ్బాయి. మీ అబ్బాయి గల్ఫ్ వెళ్ళటానికి కావాల్సిన ఏర్పాట్లన్నీ చేస్తాను. ఈ చిన్న సాయం చేసిపెట్టు అన్నాడు శ్రీపతి అతని చేతులు పట్టుకుని. సర్ మీరు ఇంక ఈ విషయం మర్చిపోండి. దయచేసి డబ్బు మాట మాత్రం ఎత్తకండి సర్. అంతగా అవసరమైతే ష్యూరిటీ ఉండి లోను ఇప్పించండి చాలు. అయినా ఆ విషయం దీంతో ముడిపెట్టకండి సర్. నాకు ఇబ్బందిగా ఉంటుంది. నా కొదిలేయండి అన్నాడు తాతబ్బాయి.

చాలా థాంక్స్ తాతబ్బాయి అంటూ తన ఫ్రెండ కార్లో కూర్చోబెట్టి స్టేషన్ వరకూ దింపి రమ్మన్నాడు. శ్రీపతి స్పర్శతో పునీతమైన తన రెండు భుజాలు చూసుకుని మురిసిపోతూ మొదటి సారి మెత్తటి కారు సీట్ లో కూర్చుని బయలు దేరాడు తాతాబ్బాయి ముస్తాబైన మేకలా.

* * *

అర్థరాత్రి రెండు. తండ్రి మీదున్న నమ్మకంతో శ్రీపతి కొడుకు ధైర్యంగానే ఉన్నా నిద్ర మాత్రం రావటం లేదు. అన్నీ బావుంటే అతనీపాటికి ఫార్మ్ హౌస్ లో పార్టీ లో ఉండేవాడు. అదొక్కటే దిగులు.

పక్కగదిలో ఎవరెవరికో ఫోన్లు చేస్తూ, 'అంతా ఓకే' అని స్టేషన్ నించి సంకేతం కోసం ఎదురు చూస్తూ, అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు శ్రీపతి. ఇవేవీ తెలియని అతని భార్య మేడపైన నిద్రపోతోంది. అంతలో కాలింగ్ బెల్ మోగేటప్పటికి ఒక్క ఉదుటున లేచి తలుపు తీసి చూస్తే ఎదురుగా తాతాబ్బాయి. లోపలికి రా తాతాబ్బాయి ఏం ప్రాబ్లం లేదుగా? ఎఫ్.ఐ.ఆర్ కట్టారా? స్టేషన్ బెయిల్ ఇచ్చారా ? అడిగాడు ఆదుర్దాగా తాతబ్బాయిని లోపలికి తీసుకెళ్తూ.

స్టేషన్ నించి హాస్పిటల్ కి వెళ్లి వస్తున్నాను సర్. ఆ కుర్రాడు పోయాడు సర్ అన్నాడు తాతబ్బాయి. అతని కళ్ళల్లో ఎరుపుకి కారణం రోజూ పీల్చే తారూ, డీజిలే అనుకున్న శ్రీపతి అదేం పట్టించుకోకుండా, నిన్ను స్టేషన్ కి వెళ్ళమంటే హాస్పిటల్ కి ఎందుకెళ్ళావు? నువ్వెళ్ళిన పనేమైందో అది చెప్పు అన్నాడు ఆదుర్దాగా.

నా వల్ల కాదు సర్ క్షమించండి. ఏమైంది తాతాబ్బాయి. నువ్వు ఎలా అంటే అలాగే అన్నానుగా. మీ అబ్బాయి కి డబ్బు సర్దుతానన్నాను. నువ్వే వద్దన్నావు. మళ్ళీ ఇప్పుడేంటి

అడిగాడు విసుగ్గా. లాయర్ కానీ పోలీసులు కానీ ఇతని బుర్ర పాడు చేసారా, మీడియాకి తెలిసిపోయిందా, లాంటి అనుమానాలు మొదలయ్యాయి అతనిలో. అ దే ం లేదు సర్. మా అబ్బాయి ఇకపై గల్ఫ్ వెళ్ళాల్సిన పని లేదు. అదేం ? ఏమైంది ? అనుమానంగా అడిగాడు శ్రీపతి. ఏం లేదు సర్ ఇకపై వాడు నాతోనే ఉంటాడు చెబుతూ ఉంటే తాతబ్బాయి గొంతు వణుకుతోంది. ఏమైంది తాతబ్బాయి, సరిగా చెప్పు. అయ్యా, మీ దగ్గర చేరక ముందు లారీ నడిపేవాడిని. రోజూ డ్యూటీ కి వెళ్లేముందు నెమ్మదిగా తోలమని చెప్పి మరీ పంపేది నా భార్య. నెమ్మదిగా నడుపుతున్నానని, సరుక్కి డెమరేజీలు పడుతున్నాయని తీసేస్తే, రోలరయితే పదికి మించి స్పీడ తొక్కక్కర్లేదని మీ దగ్గర చేరాను.

నా భార్య ఎలా పోయిందో తెలుసా సర్. పక్కింటి వాళ్ళ కోడలు నీళ్ళోసుకుంటే సాయానికి ఈమెని వెళ్లమన్నారు. నేను ఇబ్బంది పడతానని మొదట వెళ్ళనంది. కడుపుతో ఉన్న పిల్లకి సాయం కదా అని బలవంతంగా పంపిస్తే వెళ్ళింది. పురుడయ్యాక తిరుగు ప్రయాణానికి రైల్లో టికెట్ దొరకలేదు. ఏదో బందని ఆర్టీసీ బస్సులు తిరగలేదు. టికెట్ కి రెట్టింపు డబ్బిచ్చి ఓ ప్రైవేట్ బస్సులో బయలుదేరింది. ఆ డ్రైవర్ అర్ధరాత్రి నూట ఇరవై స్పీడ్లో నిద్రమత్తుకి కన్ను జోగి బస్సుని ఓ నదిలో కూలేశాడు. నా భార్యతో సహా ముప్పై మంది చచ్చిపోయారు అంటూ ఒక్క క్షణం ఆగి... నా మాటగా మీ అబ్బాయికి చెప్పండయ్యా, వేగం అంటే త్వరగా చేరుకోవటం కాదు, త్వరగా బయల్దేరటం అని అని లేచి నిలబడ్డాడు వెళ్ళడానికి సిద్ధపడుతూ, కంట్లో ఆపుకున్న ఏడుపు గొంతులో ఆపలేకపోతున్నాడు.

శ్రీపతికి చిర్రెత్తుకొచ్చింది. చూడు, నిన్ను చిన్న సాయం అడిగాను. చేస్తే చేస్తానని చెప్పు. చెయ్యకపోతే చెయ్యనని చెప్పు. అంతే. వాడేం కావాలని చెయ్యలేదు. పొరపాటున జరిగింది. ఆ పోయినవాడు నీ కొడుకైనట్టు ఇంత అర్ధరాత్రి నీ ప్రవచనాలు వినాల్సిన అవసరం నాకు లేదు. ఆ మాత్రం సాయం చేసే మనుషులు లేకపోలేదు నాకు. నువ్వుకాకపోతే ఇంకా చాలా మంది ఉన్నారు. నువ్వంటే చేసిన సాయం మర్చిపోతావేమో కోపంతో ఊగిపోతు అన్నాడు శ్రీపతి.

అంతే, వెళ్ళ బోయే వాడల్లా ఆగి, ఆయాసంగా ఉంటే ఒక్క క్షణం ఊపిరి తీసుకుని నెమ్మదిగా చెప్పాడు తాతబ్బాయి. అయ్యా, మీరు చెప్పినట్టే స్టేషన్ కి వెళ్ళా. అక్కడ మన కారు చూసా. దానిమీద గుడ్డు సొన తాలూకు మరకలు ఎండిపోయి ఉన్నాయి. అనుమానం వచ్చి హాస్పిటల్ కి పరిగెత్తా. బాడీ ని అప్పజెప్పడానికి ఇంకా టైం పడుతుందంటే మీకు విషయం చెప్పి వెళదామని ఇలా వచ్చా. పదహారేళ్ళ పసిగుడ్డయ్యా. కరెంటు పోతే బుడ్డి దీపం వెలుగులో బుద్ధిగా చదువుకుంటున్నవాణ్ణి వాళ్ళ అన్న కోసం గుడ్లు తెమ్మని పాపిష్టోణ్ణి నేనే బైటకి పంపానయ్యా. రోడ్డుని నమ్ముకుని బతికేటోళ్ళం రోడ్డు మీదే చస్తున్నాం.

టి.వి లో పెద్దాయన చెప్పాడయ్యా. తనకి తగిలిన బాణం రాముడిదే అయినా, తన బాధ ఆయనకే చెప్పుకుందట కప్ప. ఈరోజు వరకూ రోజూ భోజనం చేసేటప్పుడు మిమ్మల్నే తలుచుకున్నా. రేపు నా బిడ్డ దినం భోజనాలకి అప్పు చెయ్యాలన్నా మీరు తప్ప నాకింకెవరూ

తెలీదయ్యా .. అయ్యా, నిన్నటివరకు అక్కడ రోడ్డంతా గతుకులు. బళ్ళు పాడవుతాయని అందరు నెమ్మదిగా వెళ్లేవారు. నాబిడ్డని చంపుకోడానికి నేనే రోడ్డేసినట్టయ్యిందయ్యా. ఇకపై ఈ పన్లోకి రాలేను. రేపట్నించి మిగిలిన ఒక్క నలుసునీ రోడ్డెక్కకుండా చూసుకోవటమే నా డ్యూటీ అనుకుంటా. ఉంటాను సర్ అంటూ గేటు దగ్గరకేసి బయిటకొచ్చేసాడు తాతబ్బాయి.

కృష్ణ పక్షం కావటంతో బయటంతా చీకటి. ఎంతకీ తరగని ఆ రాత్రిలో, తెల్లవారుతుందన్న ఆశ కూడా చావగా, దిగులు బరువు మోస్తూ, రోడ్డుకి ఓ వారగా అటూ ఇటూ బెదురూ చూపులు చూస్తూ, భారంగా అడుగులేస్తూ, హాస్పిటల్ దారి పట్టాడు తాతాబ్బాయి. ముద్దుగా పెంచుకున్న కొడుకుని ముద్దగా తెచ్చుకోడానికి.

* * *

**ఉమా మహేష్ ఆచాళ్ళ, స్వస్థలం.. తూర్పు గోదావరి జిల్లా, 'తుని', ఆంధ్ర ప్రదేశ్, ఎం.కాం చదివారు. కేంద్ర ప్రభుత్వ పరోక్ష పన్నుల విభాగమైన కస్టమ్స్ డిపార్టుమెంటులో 27 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారు. 2016 డిసెంబర్ లో 'వార్త' లో ప్రచురితమైన మొదటి కథ 'మా తుఝే సలాం' తో మొదలుపెట్టి ఇప్పటివరకూ 35 కథలు 'నమస్తే తెలంగాణా(బతుకమ్మ) (2), ఈనాడు (8 కథలు) , సాక్షి(9), ఆంధ్రజ్యోతి(3), స్వాతి(6), వార్త(5), 'దర్వాజా', 'కౌముది' , వంటి ప్రముఖ పత్రికల్లో ప్రచురించబడ్డాయి. వీటిలో 21 కథలతో 'సంఘే శక్తి కలియుగే' అనే కథా సంపుటి అతి త్వరలో 'విశాలాంధ్ర పబ్లిషర్స్' ద్వారా వెలువడనుంది. 'వానకారు కోయిల', 'మల్లెల తీరం' 'క్యాచ్ 22', 'ఒక రాత్రి' , ' అన్నదాత', 'ఆదివారం అనుబంధం' వంటి కథలకి పాఠకులనుండి, సాటి రచయితలనుండి, మంచి స్పందన వచ్చింది. ఈనాడు కథా విజయం 2019 లో 'భువి కోరని భ్రమణం' కథకి, ఈనాడు కథా విజయం 2020 లో 'అడ్డుగోడ' కథకి, నమస్తే తెలంగాణా – ముల్కనూర్ ప్రజా గ్రంథాలయం సంయుక్తంగా నిర్వహించిన 2020, 2021 కథల పోటీలలో 'వానకారు కోయిల' మరియు 'ఇంకా తెలవారదేమీ' కథలకి వరుసగా బహుమతులు లభించాయి.**

# భద్రత



**కోపల్లె విజయ ప్రసాద్**

**77948 20104**

వాడికీ, నాకూ చుట్టరికం ఏమీ లేదు. కానీ.. చలపతి నన్ను 'బాబాయ్' అని పిలుస్తాడు. ఆ పిలుపులోని మాధుర్యమో ఏమో.. నేను ఎప్పుడూ వాడిని అలా పిలవొద్దని చెప్పక పోవడం ఒక కారణమైతే, వాడు నన్ను 'అరే! ఒరే! ప్రసాదూ!' అని పిలిస్తే చూసేవారికీ, వినే నాకూ బాగుండదని భావించడం ఇంకో కారణం. కానీ, ఆ 'బాబాయ్' అన్న పిలుపు వల్ల చాలామంది వాడికీ, నాకూ చుట్టరికం ఉందని భావిస్తూ ఉంటారు.

ఆ రోజు కూడా చలపతి ఆఫీసుకు వచ్చి నా ఎదురుగా కూర్చున్నాడు. అర్జెంటుగా పాతికవేలు కావాలట.. 'చే బదులు!' అన్నాడు. కానీ, గత ఐదేండ్లుగా నా దగ్గర మూడు లక్షలకుపైనే తీసుకున్నాడు.. తొందరలోనే ఇస్తానంటూ. అది చెల్లించమని గట్టిగా అడగడానికి నాకు మొహమాటం. పాత బాకీ గురించి నేను అడిగేలోగా.. ముందరి కాళ్లకు బంధం లాగా ఏవో కథలు వినిపించే వాడు. మానవత్వం ఉన్న మనిషి ఎవడైనా ఆ కథలకు లొంగిపోవాల్సిందే! కానీ, ఈసారి నేను వాడు చెప్పే కథలు వినదల్చుకోలేదు.

"పతీ! నా దగ్గర పైసా దొరకదు. నన్ను ఇబ్బంది పెట్టకు" అని చెప్పాను.

చలపతి మొహంలో నిరాశ, నిస్పృహగోచరించాయి. బతిమాలడం మొదలెట్టాడు. నేను విననట్లు నటిస్తూ ఆఫీసు ఫైలులో తల దూర్చాను. రొద పెడుతూనే ఉన్నాడు పది నిమిషాలు.

“బాబాయ్! ఈ ఒక్కసారికి సర్దు. మళ్లీ నిన్ను అడగను. ఒక్క పాతికవేలు చూడు”.

“పతీ! నా దగ్గర లేవు”.. ఇంకోసారి చెప్పాను.

“అలా అంటే ఎలా బాబాయ్! కష్టాల్లో నువ్వు కాకపోతే నన్ను ఇంకెవరు ఆదుకుంటారు? ఈసారి తప్పకుండా రెండు నెలల్లో ఇచ్చేస్తాను”.. చలపతి మళ్లీ తలమీద చెయ్యి పెట్టి ప్రమాణం చేశాడు. ఐదేండ్లుగా ఇలాంటి ప్రమాణాలు చాలానే చూశాను.

“పతీ! నీ సంపాదన ఏమవుతున్నది? పైగా నాలాగా సంసారివి కాదు.. బ్రహ్మచారివి. వచ్చిందంతా ఏం చేస్తున్నావు?” అసహనంగా అడిగాను.

“పీత కష్టాలు పీతవి.. సీత కష్టాలు సీతవి” నిట్టూరుస్తూ చెప్పాడు.

“ఇంతకీ నీకు అంత అవసరం ఏం వచ్చిపడింది?” మెత్తబడి అడిగాను.వాడేదో కహానీ వినిపించాడు. అది కథో, నిజమో నాకు అర్థం కాలేదు. కానీ, ప్రస్తుతం అతనికి డబ్బుతో చాలా అవసరం పడిందని నాకు అర్థమైంది. చలపతి నుదురు చెమటతో తడిసిపోయి ఉంది. నలభై ఐదు సంవత్సరాలు ఉంటాయి. సాదా సీదా బట్టలు ధరిస్తాడు. అతడు ఓ జాతీయ బ్యాంకులో పని చేస్తున్నాడు. జీతం కూడా తక్కువేమీ కాదు. జుట్టూ, గడ్డం నెరిసింది. బక్క పలుచగా, పొట్టిగా ఉంటాడు. కండ్లకు దళసరి కండ్లద్దాలు ఉన్నాయి.

“రేపు రారా పతీ! పిన్నిని ఒక మాట అడుగుతాను”.. అని చెప్పాను.ఆ మాటలకే వాడి కండ్లు మెరిశాయి.

“రేపు ఇక్కడికే వస్తాను. నన్ను గట్టెక్కించు!” అంటూ చేతులు జోడించి వెళ్లిపోయాడు.ఆ రాత్రి నాకు నిద్ర కరువైంది. అసలు వీడితో నాకు పరిచయం ఎలాగైందంటే..

అవి నేను నెల్లూరులో పనిచేస్తున్న రోజులు. ఒక పెద్ద ఇంటిలో ఒక వాటాలో అద్దెకు ఉండేవాణ్ని. మా కాంపౌండులో నాలుగు కుటుంబాలు ఉండేవి. మా ఎదురు పోర్షనులో రామబ్రహ్మం, జానకి వాళ్లు అద్దెకుండేవాళ్లు. ఆయన గవర్నమెంటు స్కూల్లో పనిచేస్తూ ఉండేవాడు. ఆమె ఒక ప్రైవేటు స్కూలులో పనిచేస్తూ ఉండేది. వాళ్లకు ముగ్గురు ఆడపిల్లలు, ఒక అబ్బాయి. వాడే ఈ చలపతి.

రామబ్రహ్మం చిన్న వయసులోనే ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేసేశాడు. చలపతికి కూడా చేద్దామనుకున్నాడు. కానీ, మంచి ఉద్యోగం వచ్చేదాకా తనను వదిలిపెట్టమని భీష్మించుకు కూర్చున్నాడు. అప్పట్లో వాడు పోస్టల్, ఎల్ఐసీ ఏజెంటుగా పని చేస్తూ.. కాస్తో కూస్తో సంపాదించేవాడు. బీఎస్సీ, బీఈడీ చేసి గవర్నమెంట్ టీచర్ల భర్తీ ప్రకటన కోసం ఎదురు చూస్తూ ఉండేవాడు. నేను ఎల్ఐసీలో మంచి ఉద్యోగం చేస్తున్నాను కాబట్టి.. నన్ను ఆరాధనగా చూసేవాడు. నేనే ఒకసారి వాడికి సలహా ఇచ్చాను.

"చూడబ్బాయి చలపతీ! గవర్నమెంటు జాబుకోసం కాచుకుని కూర్చోవడం మూర□త్వం! ఉద్యోగ ప్రకటన వచ్చినా ఖాళీలు భర్తీ అవుతాయన్న నమ్మకం ఉండదు. ఎవడో ఒకడు కోర్టుకు పోయి రిక్రూట్‌మెంటును ఆపుతాడు. ఒక పోస్టుకు కనీసం వెయ్యిమంది పోటీ పడతారు. నువ్వు మెరిట్‌లో పాసైనా ఇంటర్వ్యూలో ఉత్తర దక్షిణాలు చూస్తారు. కనుక నా మాట విని ఏ బ్యాంకింగో, ఇన్సూరెన్సో కంపెనీల జాబుల కోసం తయారవ్వు. మంచి కోచింగ్ సెంటర్‌లో చేరి పోటీ పరీక్షలకు సిద్ధమవ్వు!"..

నా సలహా వాడికి తారకమంత్రంలా పనిచేసింది. అప్పటిదాకా టీచరు పోస్టుకు అర్రులు చాస్తున్నవాడు.. దాన్ని వదిలి పెట్టి, కోచింగ్ సెంటర్‌లో చేరాడు. రెండు సంవత్సరాలు కష్టపడే సరికి చివరికి ఒక బ్యాంకులో క్లరికల్ జాబ్ దొరికింది.

వాడి తల్లిదండ్రులు రామబ్రహ్మం, జానకి.. పాము %--% ముంగిసల్లా.. రోజూ పోట్లాడుకుంటూ ఉండేవాళ్లు.

జానకమ్మ కూతుళ్లకు బాగానే పెట్టేది. అల్లుళ్లు కూతుళ్లను చిన్నచూపు చూడకూడదని వాళ్లు అడిగినవన్నీ కొనిపించేది. మనవళ్లు, మనవరాళ్లకు ఉంగరాలు, గొలుసులు చేయించడం, మంచిమంచి బహుమతులు ఇవ్వడం చేసేది. రామబ్రహ్మం కొడుకు చలపతికి వచ్చే జీతం కూడా కరిమింగిన వెలగపండు లాగా నెలనెలా ఖర్చయిపోయేది.

బ్యాంకులో కుదురుకోగానే చలపతికి సంబంధాలు రాసాగాయి. రామబ్రహ్మానికి, జానకికి.. కోడలు ఇలా ఉండాలని చాలా కోరికలుండేవి. కోడలు బాగా చదువుకొని అత్తామామల అడుగులకు మడుగులొత్తాలి. ఎన్ని మాటలన్నా పడి ఉండాలి. ఇంటి చాకిరీ అంతా కిమ్మనకుండా చెయ్యాలి. కట్నం కూడా భారీగా తేవాలి.

చలపతికి కూడా కాబోయే భార్య గురించి కొన్ని కలలుండేవి. ఆమె శ్రీదేవిలా అందంగా ఉండాలి. చక్కగా పాడాలి. మంచి ఉద్యోగం చేస్తూ భర్తను దైవంగా భావించి, అతని మాటకు ఎదురు చెప్పకూడదు.

కొన్ని సంబంధాలు అయితే వచ్చాయి కానీ, అమ్మాయి వాళ్లు అతణ్ని విడి కాపురం పెట్టాలని షరతు విధించారు. తల్లిదండ్రులతో ఉండకూడదని, అల్లుడు అమ్మాయి మాటకు ఎదురు చెప్పకూడదని కోరారు. కొందరికి రామబ్రహ్మం, జానకి మధ్య కీచులాటలు తెలిసిపోయి, తమ పిల్లను ఇవ్వడానికి జంకారు. కానీ, కొన్ని సంబంధాలు చివరి దాకా వచ్చి తప్పిపోయాయి. కొన్ని విషయాల్లో రాజీపడమని చాలాసార్లు ముగ్గురికీ చెప్పాను. కానీ, వాళ్లు చెవికి ఎక్కించుకోలేదు.

అలా కొంతకాలం గడిచింది. చలపతికి బుర్ర తిరిగిపోయింది. ఇంట్లో తల్లిదండ్రుల కొట్లాటలు, అక్కడ అక్కాబావల సతాయింపులు ఎక్కువై పోయాయి. సంసార జీవితం అంటే విరక్తి పుట్టింది. పెళ్లి చేసుకుని ఎవరు సుఖపడుతున్నారులే! అన్న వేదాంతంలోకి వెళ్లిపోయాడు.

ఒకరోజు రామబ్రహ్మం హఠాత్తుగా కన్నుమూశాడు. అప్పటికే మొదటి అక్క భర్తతో విడిపోయి పిల్లలతో పుట్టింటికి చేరుకుంది. అక్క సంసార భారం కూడా చలపతిపైన పడింది. జానకమ్మలాగే అతని అక్క కూడా బహు గడసరి. బాగా డిమాండ్ చేసి తమ్ముడితో అన్ని పనులూ చేయించుకునేది. తన ఇద్దరి పిల్లల్ని మంచి కాన్వెంట్‌లో చేర్పించింది. దానికే చలపతికి బోలెడు ఖర్చయింది. తల్లి అనారోగ్యానికి డాక్టర్ల ఫీజులు, మందులకు చేతి చమురు వదులుతున్నది.

మిగతా ఇద్దరి అక్కల కాపురాలకు కూడా చలపతి ధన సహాయం చేయాల్సిన అగత్యం ఏర్పడింది. దాంతో చలపతి ఉన్న రుణ వనరులన్నీ వాడుకునేవాడు. జీతం మీద బ్యాంకులో తీసుకున్న లోన్లు కాక, అవసరానికి బయట రెండు రూపాయల వడ్డీకి కూడా అప్పులు చేయాల్సిన పరిస్థితి దాపురించింది.

ఇంతలో నాకు కర్నూలుకు బదిలీ అయింది. ఒక పదేండ్లు చలపతి నాకు టచ్‌లో లేడు.

ఐదేండ్ల కిందట ఒకసారి మా బాసుకు సర్జరీ అయితే గౌరీ గోపాలు ఆసుపత్రికి పోయి అతణ్ని పలకరించి వస్తూ.. మెట్లు దిగుతూ ఉండగా, ఒక వ్యక్తి వచ్చి

'బాబాయ్!' అంటూ కావలించుకున్నాడు. తేరిపార చూస్తే.. చలపతి. అప్పటికీ ఇప్పటికీ మనిషిలో చాలా మార్పు వచ్చింది. వాళ్ల అక్క కొడుక్కు కాలు విరిగితే ఆపరేషన్ చేయించాడట. ఈ మధ్యనే తనకూ కర్నూలు బదిలీ అయిందని చెప్పాడు. ఇంకేముంది.. ఒకరి చిరునామాలు ఇంకొకరం ఇచ్చి పుచ్చుకున్నాం.

"మీ శ్రీమతిని తీసుకొని ఒకసారి మా ఇంటికి రారా చలపతి!" అని పిలిచాను.

"హహా! నాకున్నది ఒక్క మతే! శ్రీమతి లేదు" అని నవ్వాడు.కొంచెం ఆశ్చర్యపోయి..

"ఏం.. పుట్టింట్లో ఉందా?" అని అడిగాను.

"మీకు తెలుసుగా బాబాయ్! నేను పెళ్లి చేసుకోకూడదని అనుకున్నానని.." అంటూ జవాబిచ్చాడు.

"ఒరే! బెండకాయ ముదిరినా, బ్రహ్మచారి ముదిరినా పనికి రారని తెలియదా? ఎందుకు చేసుకోలేదు పెళ్లి?".. కోప్పడ్డాను.

"నా సంసారభారం మీకు తెలియదా బాబాయ్! అటు అమ్మను, ఇటు అక్కను, ఆమె పిల్లల్ని సాకాలి. ఆపైన ఇద్దరు అక్కలను ఎల్లప్పుడూ ఆదుకుంటూ ఉండాలి. దీనికే నా జీతం సరిపోవడం లేదు. మళ్లీ పెళ్లి చేసుకుని ఇంకొకళ్లను పోషించాలంటే నాకు ఎలా సాధ్యం? పెళ్లికాగానే పిల్లలు, ఈతిబాధలూ ఉంటాయి కదా! అందుకే వద్దనుకున్నాను" అన్నాడు చలపతి.

"నువ్వు అలా అనుకున్నావా? నీకు పిల్ల దొరకలేదా?".. చనువు కొద్దీ నా సందేహం వెలిబుచ్చాను.

దానికి వాడి మొహం కొంచెం నల్లబడింది కూడా. అప్పటినుంచి చలపతి

అడపాదడపా నా ఆఫీసుకు వచ్చి పోతూ ఉండేవాడు. ఒకప్పటి స్నేహితుడు దొరికాడు కదా అని మనసు విప్పి మాట్లాడుకుందాం అనుకుంటే.. వాడు ఎప్పుడూ తన ఆర్థిక బాధలు వెల్లడించేవాడు. కొన్ని బలహీన క్షణాలలో వాడిని నమ్మి నేను వాడికి అప్పులు కూడా ఇచ్చాను. నిజానికి వాడు నా అప్పును రెండు నెలల్లో వెంటనే తీర్చేస్తానని చెబుతూ ఉండేవాడు. ఎప్పుడు అడిగినా అమ్మకు బాగోలేదని, అక్కకు అవసరం అయిందని, ఖర్చు అయిపోయిందని చెప్పేవాడు.

అందుకే ఈ రాత్రి మథనపడుతున్నాను. 'రేపు వాడికి పాతిక వేలు ఇవ్వాలా? వద్దా?' అని. అప్పు ఇస్తే దానిని వాడు ఎప్పుడు తీర్చగలడు? ఇప్పటికే మూడు లక్షలు బాకీ ఉన్నాడు. 'ఇవ్వను' అని గట్టిగా చెప్పవచ్చు కానీ, మానవత్వం అడ్డు వస్తున్నది. 'నిజంగా పాపం వాడు ఎంత అవసరంలో ఉన్నాడో!?' అని జాలి కలుగుతున్నది. నిజానికి మానవ సంబంధాల్ని కలుషితం చేసేది, ఉన్నతీకరించేది డబ్బే! లేనివాడిని సకాలంలో ఆదుకుంటే వాడు చూపించే కృతజ్ఞత జీవితాంతం గుర్తుండిపోతుంది. డబ్బు దగ్గర మోసపోతే ఆ గాయం హృదయాన్ని తొలిచేసి జీవితాంతం వెంటాడుతుంది.

నాకు తెలిసి చలపతికి మోసం చేసే నైజం లేదు. కాకపోతే పరిస్థితుల ప్రాబల్యం వల్ల నాకు ఇవ్వాల్సిన డబ్బులు ఆలస్యం చేస్తున్నాడు. మనం సమాజాన్ని ఉద్ధరించలేం కానీ, మనకు తెలిసిన వారికి సహాయపడితే కొంత ఆత్మ సంతృప్తి కలుగుతుంది. అందుకని మరునాడు పాతికవేలు తీసుకుని ఆఫీస్‌కు వెళ్లి.. వాడి రాకకోసం ఎదురు చూడసాగాను. ఆ రోజు కొంచెం అర్జెంటు ఆఫీస్ పనులు పడ్డాయి. బయటికి వెళ్లి రావాల్సి వచ్చింది. వచ్చిన తరువాత.. 'నా కోసం ఎవరైనా వచ్చి వెళ్లారా!?' అని కూడా విచారించాను. సెల్‌ఫోన్‌లో కూడా ఎక్కడా మిస్డ్ కాల్ పడలేదు చలపతి నుంచి. ఆఫీస్ మూసేసే వేళ అయింది. మళ్లీ రాత్రికి ఇంటికి తయారవుతాడేమోనని భయపడి వాడికి కాల్ చేశాను. 'స్విచ్ఛాఫ్' వచ్చింది. అంతకుమునుపు ఒకటి రెండుసార్లు వాళ్లింటికి వెళ్లాను కూడా. అందుకని ఇంటికి పోయి కలుద్దామని అనిపించింది. ఇంటికి వెళ్లాను. బయటి నుంచి కేక పెట్టాను.

"ఒరే చలపతి!" అని.కాసేపటికి బయటికి వచ్చి.. నన్ను చూసి చేటంత మొహం చేసుకున్నాడు.

"లోనికి రా బాబాయ్!" అంటూ హాల్ లోపలికి పిలుచుకు పోయాడు.

జానకమ్మ, చలపతి పెద్దక్క సుందరమ్మ నన్ను చూసి గుర్తుపట్టి పలకరించారు.

"కాఫీ తీసుకు వస్తా బాబాయ్!" అని లోనికి వెళ్లింది సుందరమ్మ.

"ఏరా పతీ! వస్తానని రాలేదు?".. దబాయించాను.వాడి మొహం పాలిపోయింది. 'చెప్పాలా? వద్దా?' అన్న సందిగ్ధంలో పడినట్లున్నాడు. జానకమ్మ గారు కలుగచేసుకున్నారు.

"పొద్దుటినుంచి ఇంట్లో తుఫాను వాతావరణం! ఆఫీసుకు కూడా వెళ్లలేక పోయాడు నాయినా!"..

"ఎందుకు వదినగారు!?" ఆశ్చర్యంగా అడిగాను.

కొన్ని సెకండ్లు మౌనమే రాజ్యమేలింది. దానిని సుందరమ్మ కాఫీ కప్పులతో వచ్చి ఛేదించింది.

"ఏం చెప్పమంటారు బాబాయ్‌గారు! మా పెద్దాడు భాస్కరాన్ని చూశారుగా.. కిందటి సంవత్సరం బీటెక్ పాసయ్యాడు. వాడికి ఇంకా చదువుకోవాలని ఉంది. మనం పరాయి పంచన ఉన్నామన్న జ్ఞానం వాడికి లేదు. 'మావయ్యా! నన్ను చదివిస్తావా? ఆత్మహత్య చేసుకోమంటావా?' అని మొదలుపెట్టాడు పొద్దున్నే!".. కళ్లు తుడుచుకుంది సుందరమ్మ.నేను నివ్వెరపోయాను. భాస్కరం చదువులో మంచి శ్రద్ధ కనబరుస్తున్నాడని నాకు తెలుసు. బీటెక్ కాగానే ఏదో ఒక జాబులో వాడు సెటిలవుతాడని చలపతి అనుకున్నాడు. ఆ మాట నాతో కూడా అన్నాడు. తన రుణభారం తీరిపోతుందని ఆశించాడు.

"అట్లానా! ఇంకా ఏం చదువుతాడట?".. కొంచెం కోపంగా, నిరసనగా అడిగాను. భాస్కరం పైన నాకు కూడా అధికారం ఉన్నట్లు.

"ఎంబీఏ చేస్తాడట. అది కూడా టాప్ ర్యాంకు ఉన్న కాలేజీల్లో చెయ్యాలట. అప్పుడు కానీ మంచి ప్యాకేజీ ఉన్న ఉద్యోగాలు రావట. అక్కడ మెరిట్‌లో సీట్ రాదు. డొనేషన్లు కట్టి చదివించాలి" బాధగా అన్నాడు చలపతి.

"ఎంత అవుతుందేమిటి?" ఆలోచిస్తూ అడిగాను.

"ఆ చదువు పూర్తయ్యే సరికి ఎంత లేదన్నా పది లక్షలు కావచ్చు".

ఉలిక్కి పడ్డాను. చలపతి స్తోమతకు అంత భారం మోయగలడా? కోరికలే గుర్రాలైతే ఇలానే ఉంటుంది.

"అంత పెట్టగలవా వాడికోసం!?" అడిగాను నమ్మలేనట్లు.

వాడు ఏం చెబితే ఏం తంటా వస్తుందో అన్నట్లు దిక్కులు చూశాడు.

"చూడండి బాబాయ్ గారు! భాస్కరం తండ్రి దగ్గరే ఉంటే వాడి చదువుకు వెనకా ముందూ ఆలోచించేవాడా? మా వాడు బుద్ధిమంతుడు. చదువుకుంటానంటున్నాడు. అదేమీ పిచ్చి కోరిక కాదు. మా చలపతికి పోనీ.. పెళ్లీపెటాకులై, భార్యా పిల్లలు ఉంటే ఆలోచించాలి కానీ, ఒంటిలింగం శొంఠికొమ్ము. వాడు మమ్మల్ని కాకపోతే ఎవరిని ఉద్ధరిస్తాడట? వాడి మనసు కష్టపడి పొద్దున్నే ఉరేసుకోబోయాడు. పసిపిల్లలు వాళ్లకు ఏం తెలుసు? పెద్దలం మనమే వాళ్ల మనసు తెలుసుకుని నడుచుకోవాలి".. సుందరమ్మ సుద్దులు పెట్టింది.

"అది కాదు బాబాయ్! ఆర్థికంగా నేను ఎంత బాధల్లో ఉన్నానో మీకు తెలుసు కదా! ఇంకో సంవత్సరం పోతే మా మేనకోడలు సంధ్య చదువు పూర్తవుతుంది. దానికి పెళ్లి చెయ్యాలి. భాస్కర్ చేతికి అందివస్తాడని ఆశించాను. వాడు మొండి పట్టుదలతో ఉన్నాడు. చదువో చావో తేల్చుకోమని నాకు అల్టిమేటం ఇచ్చాడు".. ఏడుపే తక్కువ.

నాకు పరిస్థితి అర్థమైంది. ఆ ఇంట్లో చివరికి వీడు విలన్‌గా మిగిలి పోయేటట్లున్నాడు. అందులోనూ భాస్కర్‌కు ఆవేశం ఎక్కువ.

"చలపతీ! భాస్కర్‌ను వాడు కోరినట్లే చదివించు. ఎడ్యుకేషన్ లోన్ ఇస్తారుగా. ప్రయత్నించు. వాడు ప్రయోజకుడైతే వాడే ఈ కుటుంబ భారం మోస్తాడులే. అక్కయ్య చెప్పినట్లు వాళ్లు తప్పించి నీకు ఇంకెవరున్నారులే! పిల్లల మనసు నొప్పించకూడదు. అందులోనూ ఈ కాలం పిల్లలు ప్రతి చిన్నదానికీ ఆత్మహత్యలంటారు" అంటూ నచ్చజెప్పాను. వాడిని బయటికి తీసుకొచ్చాను.. ఓదారుద్దామని. పాతిక వేలు వాడి చేతిలో పెట్టి, మొత్తం బాకీ తొందరలో తీర్చేదారి వెతకమని చెప్పి వచ్చేశాను.

అనుకోకుండా నాకు వైజాగ్ ట్రాన్స్‌ఫర్ అయింది. హడావుడిగా ఫ్యామిలీని తీసుకొని వచ్చేశాను. చలపతిని కలుద్దామని ప్రయత్నించాను కానీ వీలు కాలేదు.

నాకు వైజాగ్‌లో తలమునకలయ్యే పనులు పడటంతో కర్నూలు రావడానికి టైమ్ దొరకలేదు. కొన్ని నెలలు సెల్‌ఫోన్‌లో యోగక్షేమాలు కనుక్కున్నాను. ఆ తర్వాత వాడి సెల్ అందుబాటులోకి రాలేదు.

భగవంతుడి మీద భారంవేసి నాకు రావాల్సిన డబ్బుల గురించి ఆలోచించడం మానేశాను. ఎక్కువ వర్రీ అయితే బీపీ పెరుగుతుంది తప్ప.. ఫలితం శూన్యమని సమాధానపడ్డాను.

ఐదేండ్లు గడిచిపోయాయి. చలపతి నుంచి వాడి మేనకోడలు పెళ్లి శుభలేఖ అందింది. వీలు చేసుకుని హైదరాబాద్‌కు వచ్చాను. చలపతి ఇప్పుడు అక్కడ పని చేస్తున్నాడు. సంధ్య పెళ్లి కల్యాణ మంటపంలో బాగా జరిగింది. లక్షల్లో ఖర్చయి ఉంటుంది. వాడి స్థాయికి మించిన సంబంధం తెచ్చి చేశాడు. సంధ్య మామూలు సంబంధాలు ఒప్పుకోలేదట. వరుడు ఫారిన్‌లో జాబ్ చేస్తున్నాడు. పెళ్లి సందడి తగ్గిన తరువాత వాణ్నికలిశాను.

"ఏరా చలపతి! నాకు ఇవ్వాల్సిన డబ్బులు మర్చిపోయావా?" అని అడిగాను.

"బాబాయ్! ఎలా మర్చిపోతాను. తప్పకుండా ఇస్తాను" అని చెప్పాడు.

"ఇంకెప్పుడు? భాస్కరం కూడా బాగా సంపాదిస్తున్నాడు కదా? నా డబ్బులు నాకు ఇవ్వడానికి ఏం రోగం?".. నిష్ఠూరంగా అడిగాను.వాడు నవ్వాడు.

"భాస్కరం సంగతి మర్చిపోవాలి! వాడి సంపాదన మాకు పైసా ఇవ్వడు. లవ్ మ్యారేజ్ చేసుకుని ఇల్లరికం వెళ్లిపోయాడు. ఈ పెళ్లి ఖర్చులన్నీ నావే! అక్క బాధ్యత కూడా నాదే! అమ్మకు సీరియస్ అయినా పట్టించుకోడు. వాడు చాలా స్వార్థపరుడై పోయాడు. నాన్న కట్టించిన ఇల్లు అమ్ముకున్నాను. ఆడపిల్లలకు పోను నా వాటా డబ్బులతో ఈ పెళ్లి చేశాను".. అని చెబుతుండగానే, పెళ్లివారు పిలిస్తే వెళ్లిపోయాడు.

హాల్‌లో ఒంటరిగా కూర్చున్న జానకమ్మగారిని పలకరించాను. ఆమె ఆరోగ్యం బాగా దిగజారిపోయింది. మొహంలో ప్రేతకళ కనిపిస్తున్నది. నన్ను చూసి కన్నీళ్లు పెట్టుకుంది. పరామర్శ తరువాత ఇలా అన్నది.

"ప్రసాద్ బాబూ! నీకో రహస్యం చెప్పాలి. చేసిన పాపం చెబితే పోతుందంటారు. మా చలపతికి పెళ్లి కాకపోవడానికి కారణం నేనే! కోడలు వస్తే మా బతుకులు ఏమవుతాయోనని

భయపడి వచ్చిన సంబంధాలు చెడగొట్టాను. మా భద్రత గురించి ఆలోచించాను కానీ, ఇప్పుడు వాడి పరిస్థితి చూస్తే బాధగా ఉంది. నా తదనంతరం వృద్ధాప్యంలో వాడు ఒంటరిగా ఎలా బతకగలడు? భాస్కర్, సంధ్య మీద నమ్మకం లేదు. ఆడపిల్లలందరూ వాడి సొమ్ము తిన్నారే కానీ, వాణ్ని ఎవరూ చూడరు. సుందరమ్మ కూడా ఎక్కువ కాలం బతకదు. దానికి క్యాన్సర్. ఇప్పుడు మా చలపతికి పెళ్లి చేయాలన్నా ఏ అమ్మాయి ముందుకు వస్తుంది? అంతా చేతులారా చేసుకున్నాను" అంటూ ఏడ్చింది.

నేను నివ్వెరపోయాను. చలపతి మీద జాలి కలిగింది. జానకమ్మ గారి మీద కోపం వచ్చింది. అతణ్ని తమ స్వార్థానికి వాడుకున్న వాడి అక్కల మీద, పిల్లలమీద కోపం వచ్చింది.మర్నాడు బయల్దేరబోతూ, చలపతి దగ్గర వీడ్కోలు తీసుకుంటుండగా..

"బాబాయ్! నీ డబ్బులు పువ్వుల్లో పెట్టి ఇస్తాను. వర్రీ కాకు" అన్నాడు నవ్వుతూ.

"అది సరే! అందరి బాధ్యతలు మోశావు! మరి నిన్ను చూసేవాళ్లు ఎవరున్నారు? ఇప్పటికైనా పెళ్లి చేసుకో!".. సలహా ఇచ్చాను.

"ఈ వయసులోనా?! జోకుకైనా హద్దులుండాలి. బాబాయ్! నా గురించి బెంగపడకు. నాలాంటి వారికోసం వృద్ధాశ్రమాలు స్వాగతం పలుకుతున్నాయి".. వాడు నవ్వుతూ అన్నా, అప్రయత్నంగా వాడి కండ్లవెంట రెండు కన్నీటి చుక్కలు వెలువడ్డాయి.

"ఏమీ అనుకోకు రా.. నీకో సంగతి తెలియదు. మీ వాళ్లు చాలా స్వార్థపరులు. వారి భద్రత వారు చూసుకున్నారు కానీ.. నీ గురించి ఎవరూ ఆలోచించలేదు" సానుభూతి చూపిస్తూ అన్నాను.

"తప్పేముంది బాబాయ్! సొంత తల్లికే కొడుకు గురించి పట్టనప్పుడు.. తోబుట్టువులకు, వారి పిల్లలకు ఏం అవసరం నా గురించి ఆలోచించడానికి? ఎవరి భద్రత వాళ్లు చూసుకుంటున్నారు ఈ లోకంలో".. వేదాంతిలా వాడు చెప్పాడు జీరగొంతుతో. నా గుండె మెలిపెట్టినట్లయింది. నా కంటికి వాడు నిష్కామకర్మ వీరుడిలా గోచరించాడు.

***

# కాముని కంత

బాలంగిరిల్లు ముంగట శిక్కగ సాన్పేశి, అక్కడక్కడ తెల్లటి సున్నంతోని ముగ్గులు వెట్టిన ఆకిట్ల కూసొని ఎల్త బొంగులు నరుకుతున్నడు మేదరి దుర్గయ్య. లావుపాటి బద్దలుగా నరికి అవిటిని కట్టెల మోపు లెక్కట కడుతున్నడు. హాఫారం ఏసుకొని గోచి కట్టుకొని ఉన్నడు. తెల్ల మీసాలను, మొకంల పౌరుషం పొంగినట్టు అడివెట్టిండు. నెత్తికి కాటన్ రుమాలు సుట్టుకొని ఉన్నడు. అర్వై ఏండ్లకు దెగ్గర ఉంటడు గనీ, పనిల శాన శెల్తిగ ఉంటడు దుర్గయ్య. ఆకిట్ల వేపచెట్టు నీడ విశాలంగా, దట్టంగ అలుముకొని ఉన్నది. పండ్లు అయిన వేప పండ్లు కింద రాలినయి వాకిలంత. వాటిని ఏరుకుంట అటుపక్క వాకిట్ల ఎండకు ఏస్తున్నది దుర్గయ్య భార్య నర్సవ్వ. పండుగా ఉన్నయి ఒకదెగ్గర ఎండినవిటిని ఇంకో జాగల ఏస్తున్నది. అటుదిక్కు సగం వాకిలిని ఆవరించుకున్నయి వేపకాయలు. ఇంటి గోడకు ఆనుకొని కట్టె నాగలి, రొప్పు నాగలి లిలవెట్టి ఉన్నయి. ఇటు దిక్కు ఎడ్ల బండి నిలవడి ఉన్నది. ఆ బండి కానికి రెండు ఎడ్లు కట్టేశి ఉన్నయి. కట కట బొంగులను నరుకుతున్న దుర్గయ్య చూపు నర్సవ్వ మీద పడింది. 'లచ్చిమీ.. ఇంత చాబొట్టు తీస్కరా' అని కేకేసిండు. ఆ మాట వినగానే వేపకాయలను అరికాళ్లతో దున్నుతున్న నర్సవ్వ మనసు చివుక్కుమంది. అంతవరకు ఆమె వేపకాయలు దున్నుతుంటే ఎండిన ఆ వేపకాయల్లోంచి గలగలమని విత్తనాల సౌండు వస్తున్నది కాస్త ఆగిపోయింది. ఆమె మొకం ఫికర్ల వడ్డది. మోకాలి మంటి కట్టిన ఆమె కాటన్ చీరకొంగును నడుముకు చెక్కుకున్నది. ఆ కొంగు ఇప్పి కండ్లల్ల దుంకుతున్న కన్నీళ్లను తుడుసుకున్నది.

కండ్లనీళ్లు ఒత్తుకుంటున్న ఆమె దండెకడియం ఎండకు చెక్కున మెరుస్తున్నది. మోకాళ్లకున్న కడియాలు గూడ ఆ నిట్టెండకు మెరుస్తున్నయి. మెడల తులం గుండ్లు ఉన్నయి, ఆ




**హుమాయున్ సంఘీర్,**

sangheers@gmail.com

గుండ్లల్ల పగుడాలు ఏసుకున్నది. ఒక ముత్యాల దండ గూడ ఉన్నది. అన్లనే పుస్తెల తాడు గూడ ఉన్నది. ఆ పుస్తెల తాడుకు శెవుల జివిలి తీసుకునే రాగి పుల్లలు గూడ పోగేసుకున్నది. శెవులకు అద్దులం గుంటీలు యాలాడుతున్నయి. చెవులు తెగి ఆ గెంటీలు కింద వడిపోతయన్నట్టు అంచుకున్నయి. చెవులకు మీద సైడు కమ్మలు, ముక్కుకు అటు ఇటు ముక్కుపుల్లలు ఉన్నయి. అవిటికున్న చిన్న చిన్న రంగు రాళ్లు మెరుస్తున్నయి. నుదురు మీద రూపాయి బిట్టంత ఎలుము ఎఱ్ఱటి కుంకుమ ఆమె నల్లటి మొకాన్కి కళ తీస్కస్తున్నది. తెల్లగైపోయిన ఎంటికెలకు మంచిగ నూనె అంటుకొని దువ్వుకొని శికేసుకున్నది. ఆ శికెల శేతుమీద అల్లుకున్న పసుప్పచ్చ గుర్మాశి పూలు వెట్టుకున్నది. ఆమె నిలువు రూపం జూస్తే.. లచ్చిందేవి భూమ్మీదికచ్చి పల్లె లచ్చిందేవి అవతారం ఎత్తిందేమో అన్నట్టే ఉంటది. 'తెస్తా ఉండు సైసు జర' అన్నది తన కాలును కదుపుకుంట. భార్య నుంచి వచ్చిన సమాధానం ఇనంగనే కొడుకు, కోడలు, మన్మలు, మన్మరాండ్లు ఇల్లు ఇడ్శిపెట్టి పట్నం బత్కవోయిఱ్ఱు అనే మచ్చట యాదికచ్చింది దుర్గయ్యకు. మనసు మార్మానం వోయినట్టైంది. కటకట కొడుతున్న కత్తిని ఆపేశి నెత్తికి సుట్టుకున్న రుమాలు ఇప్పిండు. జరశేపు సుట్టతాగి గావరైతున్న పానం తుర్తి జేస్కుందాం అనుకున్నడు. రుమాల్ల మూలకు ముడివెట్టిన సుట్టాకు కాడను ఒగదాన్ని అరిశేతులకు తీస్కొని నల్శిండు. అట్లనే లేశి పోయి జారాడు దెగ్గర నీళ్ల కుండికాడ బండ కింద వెట్టిన మఱ్ఱి ఆకుల్ల కెల్లి ఒక ఆకును తీసుకున్నడు. మల్ల తను కూసున్న జాగలకు అచ్చిండు.

ఆ ఆకును సుట్ట లెక్కట సుట్టి అన్ల తంబాకు నింపిండు. సుట్ట నోట్లె వెట్టుకొని అగ్గిపెట్టె కోసం తన ముడ్డి కిందున్న జోరసంచి కింద శేతులతోని పునికిండు గనీ అగ్గిపెట్టె దొర్కలే. కూసున్నజాగలనే సుట్టుముట్టు జరుక్కుంట సూశిండు కనీ, అగ్గిపెట్టె కానరాలె. లేశి ఇంట్లెకు వోదామనుకున్నడు. ఇంతట్లనే చేతుల కాలుతున్న పొయిల కట్టెను పట్టుకచ్చి దుర్గయ్య మొకం ముంగట్కి సాపింది. ఆ ఎఱ్ఱటి నిప్పుకను సూడంగనే దుర్గయ్య మొకంల శాంతం కానచ్చింది. కృతజ్ఞతతోని పెండ్లాం మొకంలకు తల్కాయ ఎత్తి సూశిండు. ఆమె తీస్కో అన్నట్టు కండ్లతోని సైగ జేశింది. ఆమె శేతుల కెంచి కట్టెను తీసుకొని సుట్ట అంటిచ్చుకున్నడు. గప్పు గప్పు పొగ వీలుస్కుంట ఇడుస్తున్నడు దుర్గయ్య. జఱ్ఱ శేపట్లనే సుట్ట వాసనంత ఆ సుట్టుపక్కలక పాకింది. పట్నం వోయిన కొడుకు, కోడలు గురించి ఆలోశన్ల వడ్డడు. దుర్గయ్యకు ఒక కొడుకు నలుగురు బిడ్డెలు. ఐదెకరాల ఎవుసం ఉండె. బర్లు, గొర్లు మంచిగనే ఉండె. బిడ్డెలందరు డిగ్రీ దాంక మంచిగనే సదువుకున్నరు గనీ, కొడుకు అడ్వ సోపతులు వట్టి పదోది దాంకనే సదివిండు. అది గూడ పదిల ఫెయిలైండు. ఇద్దరాల్ మొగోళ్లు పిల్లలు ఉన్నరని అటు ఎవుసం, ఇటు బర్లు గొర్లను సూస్కునుడే గాదు కుల వృత్తి అయిన మేదరి పని గూడ శేస్కుంట అచ్చిఱ్ఱు.

సోమారం గోపాల్ పేట్ అంగల్ల అమ్మనీకి గుల్లలు, శాట్లు, శిబ్బీలు అల్లి తయారు వెట్టుకునేటోళ్లు. పిల్లలు పెద్దగైతున్నరు చేసి చేసి వీళ్లకు గూడ పెయిల జిగి లేకుంట అయింది. నలుగురు బిడ్డెల లగ్గాలు జెయ్య ఒక్కొక్కటి అమ్ముకుంట అచ్చిండు దుర్గయ్య. మంచి ఇంట్లకు బిడ్డెలను ఇయ్య వాళ్లు అడిగినంత కట్నం ఇచ్చిండు. కట్నం కింద ఒక్కొక్క బిడ్డెకు ఎక్ర ఎక్ర

పొలం రాశిచ్చిండు. కొడుకుకు ఒక ఎకుర పొలం ఉంచిండు. ఇంత ఇల్లు ఉంచిండు. ఇచ్చిన ఇంటికాడ ఆడివిల్లలు ఖుషీగనే ఉన్నరు. బిడ్డెలయి అందరియి అయినంక కొడుకు లగ్గం గూడ జేశిండు. అందర్కి పిల్లలు అయిర్రు. పండుగులకు, పబ్బాలకు బిడ్డెలు, అల్లుండ్లు, మన్మలు, మన్మరాండ్లు ఇంటికస్తే ఇల్లంత నిండిపొయ్యేది. చిత్తారి పెండ్లి అయిందాంక గూడ ఏ పనిని వట్టిచ్చుకోకుంట మీద మీద రివుట లెక్కట తిరిగిండు. ఎవుసం వచ్చు గనీ, పెయ్యి అంచి పనిజెయ్య శాతగాదు. పెండ్లి అయినంక పెండ్లాం ఊకె ఎంబటవడే సరికి ఎవుసానికి వంగిండు.

ఒకింటికి వోయిన బిడ్డెలకు ఎక్ర ఎక్ర పొలం ఎట్లిస్తడని కోడలు సుగుణ కొడుకు చెవుల ఊదింది. ఆ కాన్నుంచి చిత్తారి శాన మారిపోయిండు. 'అంత ఆడివిల్లలకు ఊడ్శిపెట్టి నాకు శిప్ప మిగిలిచ్చిండు' అని రీకునాలు తీసుడు, అయ్య కొడుకుల నడ్మ కయ్యాలు ముదురుడు దినాం అదే కత అయిపోయింది. ఒగనాడు ముసలోల్లకు ఒక అర్ర అని ఇచ్చి మిగిలిన ఇంట్ల ఏరువడ్డడు. ఉన్న ఒక్క కొడుకు ఏరువడుడుతోని వాళ్లిద్దరు శాన ఫికర్ల వడ్డరు. ఎవుసం జెయ్య మునుపటోలె శాతనైతలేదు. అయినా ఆమరతాన్కి ఇద్దరు కల్శి పొలంను ఏ ఏడు గూడ బీడు ఉంచ వాళ్ల పానాలు దరియ్యలేవు. ఇటు మేదరి పని జేస్కుంట కొడుకు ముంగట చేయి సాపకుంట వాళ్ల బతుకు వాళ్లు బతుకుతున్నరు. ఏరువడ్డంక బిడ్డెలు, అల్లున్లు ఇంటికస్తే వాళ్లకు మర్యాదలు గూడ శెయ్యనంత కాట్కానికి వచ్చిండు చిత్తారి. పొద్దుగాల్ల వచ్చి అయ్యవ్వలున్న ఆ శిన్న అర్రల ఉండి.. కుండల్ల కలిగింది ఏదో తిని పొద్దిమీకెటాకల్ల ఎల్లిపోయేటోళ్లు. 'ఈ వూర్లె ఇట్లనే పడుంటే ఏం ముంగటవడం. యాడేశిన గొంగడి ఆడనే ఉంటది' అని సుగుణ చిత్తారిని పట్నం తొవ్వ వట్టిచ్చింది.

పట్నంల తన అన్నదమ్ములు బిస్కిట్ల కంపిన్ల పని జేస్తున్నరు. అదే కంపిన్ల ఇద్దరాల్ మొగోళ్లం శెరీకైతే ఇన్ని పైసలు ఎన్కేసుకోవచ్చు అనుకున్నది. చిత్తారి గూడ పెండ్లాం మాట ఇనకుంట ఉండలేకపోయిండు. అట్ల మూడేండ్ల కింద హైదరాబాద్కు బత్కవోయిర్రు. ఇంతట్లనే కరోనా రోగం అచ్చె. దీంతోని వాళ్లు పని జేశే కంపిన్ మూత వడ్డది. శేతుల పనులు లేక చిత్తారి ఊర్లున్న ఒక్కొక్కటి అమ్ముడు సురువు జేశిండు.

సప్పుడుదాంక ఆ హైదరాబాద్ నుంచి ఊరికి అచ్చెయ్మంటే అచ్చినట్టే అచ్చిర్రు గనీ ఇక్కడ ఉండలేకపోయిర్రు. కరోనా జర్ర బందుగాంగనే మల్ల అక్కడికే వోయిర్రు. మల్ల రెండో మల్క కరోనా దెబ్బ వెట్టేటాకల్ల ఇంకిన్ని అప్పులు జేశిండు. 'ఇట్ల ఇంతింతగానం అప్పులు జేసుకుంట వోతే పర్షాన్ అయితవురా పోడా' అని నర్సవ్వ ఎంత జెప్పినా ఇనలేదు చిత్తారి. తన రివాయి తనదే. మీదికెల్లి తాగుడుకు గూడ బగ్గ మర్గిండు. 'ఇగ వాడు ఎప్పుడన్న బాగుపడని. శెప్పి శెప్పి యాష్టకు అస్తున్నది. వచ్చి ఇక్కడనే ఎవుసం జేస్కోరా అంటే ఇనడు' అనుకొని దుర్గయ్య గూడ కొడుకుకు ఊకె జెప్పుడు బందు జేస్కున్నడు. ఇట్ల కొడుకు గురించి ఇంకా ఏమేమో ఆలోశిస్తున్నది దుర్గయ్య మైండు. ఇంతట్లనే ఆమె ముంగట్కి గరం గరం చాయి గిలాస అచ్చింది. అన్లకెల్లస్తున్న ఆవిర్లు ఆయన కండ్లల్ల మెరుపులు నింపినయి. ఆ గిలాస వట్టుకున్న శేయి దిక్కు సూశింది. నర్సవ్వ తీస్కో అన్నట్టు కండ్లతోని సైర జేశింది. చాయి గిలాస అందుకొని

తాగుతున్నడు. 'ఇయ్యాల్ల పాలు పల్సగ వోశింది బేగమవ్వ. జర ఏమనుకోకుంట చాయి తాగు' అంటున్న నర్సవ్వ మొకంలకు నిరాశగ సూశిండు దుర్గయ్య. 'ఇయ్యాల్నన్న ఈ యాపకాయలు తీస్కునేటాయిన అచ్చుంటే బాగుండు. దినాం ఎండల ఏస్తున్న మల్ల ఇంట్లకు మోస్తున్న.

ఆ సంచులు లావట్టి లావట్టి నా నడుములు టింగు మంటున్నయి' అంటున్న పెండ్లాం మొకంలకు నగినట్టు సూశిండు. 'ఇయ్యాల్ల అస్తనన్నడే. నాలుగు కింటళ్లు అయితయి గదా యాపకాయలు?' అడిగిండు. 'ఆ, అయితుండచ్చునే' అనుకుంట ఆమె ఇంట్లెకు వోయింది. గరం గరం చాయి తాగుతున్న దుర్గయ్యకు జర పానం శెల్తికచ్చినట్టు అనిపియ్యవట్టింది. శేతులున్న సుట్టల తంబాకు అయిపోయి సల్లారిపోయింది. దాన్ని సూశి అటు ఇస్రేశిండు. చాయి గిలాస పక్కకు వెట్టి యాప శెట్టు మీద తల్లి కాకి పిల్ల కాకి కడుపు నింపుతున్నది సూస్తున్నడు. ఇంతట్లనే దోసపల్లి సాయిలు సైకిల్ మీద అచ్చి గంట గొట్టుకుంట ఆకిట్ల సైకిల్ ఆపిండు. ఆ గంట సప్పుడుకు తల్కాయ తింపి సాయిలు దిక్కు సూశి శిన్నగ మురిశిపోయిండు. 'రారా బావా.. రా ఇట్ల కూసుందాం' అంటున్న దుర్గయ్య మాటలకు సాయిలు ఇంకింత ముర్శిపోకుంట వచ్చి అరుగు మీద కూసున్నడు. 'కూసుంట గనీ, నాకు ముందుగాల్ల సుట్ట ఇయ్ బామ్మర్దీ. పానమంత గావర గావర అయితున్నది' అడిగిండు సాయిలు. 'ఎంతమాటనే గది.. ఇస్త ఉండు. కాకపోతే నేనిప్పుడే సుట్ట ఒగటి తాగిన. నేను ఇప్పుడే మల్ల తాగ. నీకిస్త సరేనా' అన్నడు దుర్గయ్య. 'అట్లైతే జర్రాగుదాం మల్ల. ఇద్దరం ఒకటేపారి తాగుదాం' సాయిలు మాటకు సరే అనకుంట ఉండలేకవోయిండు దుర్గయ్య.

'శెప్పు బావా, ఏమున్నయే ఊరి ముచ్చట్లు?' దుర్గయ్య మాటలకు సాయిలు మొకంల జరంత బాధ కనిపిచ్చింది. 'ఏమున్నయి బామ్మర్దీ.. నలుగురు కొడుకులు అని ఎంత ముర్శిపోయిన గనీ.. ఏ కొడ్కు గూడ కానకుంట అయిపోయిండు' అని కండ్లల్ల నీళ్లు ఒత్తుకున్నడు. 'నాకున్న ఒక్క కొడుకు గూడ గాడికే అచ్చిండే.

గందుకే మన రెక్కలు మంచిగున్నన్ని దినాలు మన కష్టం మనమే శేస్కొని గట్లనే బతుకుదాం. శాతగానప్పుడు సూద్దాం' అంటున్న దుర్గయ్య మొకం జూస్కుంట ఇంకింత బాధవడ్తున్నడు సాయిలు. 'మంచిగ సదివిపిస్తే వాళ్లు మనలను మంచిగ జూస్కుంటరు అనుకున్న గనీ.. ఎవరి బతుకులు వాళ్లు జూస్కొని అవుతల వడ్డరు. నువ్వంటే నువ్వు అనుకుంట అమ్మానాయినలను వంచుకుంటున్నరు. ఏం బతుకే ఇది?' 'ఇగో బావా.. మనం ఏం జెయ్యాల్నో అది జేశినం గంతే. మన బాధ్యతలు, బరువులు గూడ దింపుకున్నం. ఇప్పుడు కొడుకులు కాన్తలేరని ఊకె బాధవడుకుంట ఇంకింత మన పానం కరాబ్ జేస్కోవద్దే. ఇట్లనే కష్టం జేసుకుంట హాయిగ ఉందాం. అస్సలు ఫికర్లు వెట్టుకోవద్దు' అంటూ తంబాకు తీశి, పోయి జారాట్ల బండ కిందున్న మర్రి ఆకులు రెండు తీస్కచ్చిండు. సాయిలు ఆలోశించుకుంట కూసున్నడు.

ఆకు ఈనెలు చీరేశి, తంబాకు నింపి రెండు సుట్టలు తయారుజేశిండు. చెరొక్కటి తీసుకున్నరు. సాయిలు అగ్గిపెట్టె తీశి ముట్టిచ్చిండు. ఇద్దరు సుట్ట పొగ వీల్సుకుంట ఇడుస్తున్నరు.

ఇంతట్లనే నర్సవ్వ ఇంట్లకెల్లి బైటికి వచ్చింది పసగడుగుల లీల్లు వారెయ్యనీకి. సాయిలును సూడంగనే నక్కుంట 'సాయన్నా తిన్నవానె' అని అడిగింది అడుగు ఆపుకుంట. 'ఆఆ.. అప్పుడే యాడ శెల్లే. మీ వదిన ఇంకా పొయి ముట్టియ్యలేదు. పొద్దుగాల్ల పచ్చిగడ్డి కోస్కరాన వోయి అక్కడ పొలంల ఉన్న పుంటికూర తెచ్చిచ్చిన. ఆమె ఎప్పుడు తొక్కు నూరుతే అప్పుడు వోయి తింట' అని చెప్తున్న సాయిలును జూస్కుంట మురుసుకుంట లోపటికి వోయింది. పోయినామె అంతే రువ్వడి మీద బైటికచ్చింది శేతుల చాయి గిలాస వట్టుకొని. 'మీ శెల్లెను సూశినవా బావా.. నువ్వు అస్తవని నీకోసం గూడ చాయి కాశి పెట్టింది' దుర్గయ్య కిసుక్కుమన్నడు. 'అన్న మనసు శెల్లెకే తెల్సు బావా' అనుకుంట ఆ చాయి తీసుకున్నడు సాయిలు. నర్సవ్వ ఇంట్లకు వోయింది మురుసుకుంట. సాయిలు, దుర్గయ్యలు చిన్నప్పటినుంచి మంచి దోస్తులు. అదే వూర్లె వుట్టి అదే ఊర్ల అయ్యవ్వల నుంచి వారసత్వంగ వచ్చిన వ్యవుసంను జేస్కొని అదే ఊరి మట్టిల కలవాల్నని గట్టిగ నిర్ణయించుకున్నోళ్లు. పొద్దుందాంక ఎండకు కష్టవడుడు, పొద్దిమీకంగనే ఇంత కల్లు బొట్టు తాగి ముదురుకుడు. పిల్లలతోని కుషీగ ఉండుడు ఇదే వాళ్లకు తెల్శిన బంగారు బతుకు. సాయిలుకు నలుగురు కొడుకులు. ఆడిబిడ్డెలు లేరని శాన కుదెం వెట్టుకున్నడు సాయిలు. కోడండ్లు అస్తే వాళ్లల్లనే బిడ్డెను జూస్కుందాం అనుకున్నరు గనీ, కోడండ్లు పరాయోళ్ల లెక్కట దూరం ఎల్లిపోయిరి. 'జగితి శిద్దయ్య కొడుకు గూడ పట్నం గడ్డ ఎక్కిండంట బావా' అన్నడు 'ఏమో పో.. ఊరంతా పిల్లలున్న గొడ్డుది అయిపోతున్నది కదా? ఒకోక్కోళ్లు ఇట్ల పట్నం తొవ్వ వట్టినంక మనసుంటి తండ్రులు అనాథల లెక్క మిగుల్తున్నరు' మనసు శిక్కవట్టుకొని అన్నడు దుర్గయ్య.

'ఏమో బావా.. ఊర్ల మన తరం తర్వాత ఎవుసం జేశేటోళ్లు ఇగ ఉండరు. మనమే భూతల్లికి లాష్టు రైతు వారసులం అనుకుంట. ఇగ ఆ తల్లితోని కాదు రైతు బిడ్డలను కనుడీ. మంచిగ సదువుకుంటరనుకుంటే వాళ్లు మనకు అందనంత దూరంకు వోతున్నరు. ఇప్పటికే నాకున్న పదెకరాల పొలం ఆయింత పంచుకొని ఎవన్ది వాడు అమ్ముకొని పట్నం వోయిర్రు. నాకు మిగిలిన గా నాలుగిసాల పొలం జేస్కుంట బతుకుతున్న' అంటున్న సాయిలు ఈసారి సుట్ట పొగ ఛాతి నిండ వీల్శి ఒదిలిండు.

'నాకున్న ఒక్క కొడుకు ఎవుసం జేస్తే సూశి మురిశిపోవాలె అనుకున్న. కనీ, వాడు గూడ మీవోళ్ల లెక్కనే తేలిండు. ఇంత సదువు సదివి గీ ఊర్లె మట్టి పిస్కాల్నా అని మాట్లాడిండే. ఆ పట్నంల వానికి ఏం మజా తల్గిందో ఏమో అక్కన్నుంచి రానంటే రానుంటున్నడే. ఇక్కడిదంత అమ్మేశి మమ్ములనే అక్కడికి రమ్మంటున్నడు' ధీనంగా అన్నడు దుర్గయ్య. 'మావోళ్లు అదే మాటంటున్నరు. ఇంత బతుకు ఊర్ల బతికి గా పట్నంల ఎవలో ఏమో యాడ వోతం? మనకు అక్కడ యాడ మన్నుకు వడ్తది? ఇట్లనే ఒక్కొక్కోళ్లు పెద్ద పెద్ద సదువులు సదువుకుంట పట్నం తొవ్వ వడ్తె ఊరు గొడ్డువోతది' అనుకుంట తుమ్మిండు సాయిలు. 'సచ్చమే.. గొడ్డువోతది ఊరు. మనం గా పట్నం వోయి అక్కడ అస్సలు ఉండలేం. మనసుంటోళ్లకు అక్కడ గాలి ఆడక సచ్చిపోతం. పొద్దిమీకుతే ఇట్ల నీతోని నాతోని నాలుగు ముచ్చట్లు మాట్లాడుకొని, ఎండల,

వానల పనిజేస్కొని పొద్దీకంగనే ఇంత కల్లుబొట్టుతోని కుత్కె తడుపుకొని బతుకు ఎల్లదీశేటోళ్లం. గా పట్నంల యాడ ఇముడుతం?' అన్నడు దుర్గయ్య. 'ఇట్లనే మన కడుపుల వుట్టినోళ్లంత పట్నాలకు, ఏరే దేశాలకు ఎగిరి పోతే ఇక్కడి భూములన్ని బీడువార్తయి గావచ్చు బామ్మర్ది' సాయిలు మాట నిజమౌతుందేమోననే బాధతో మనసు నొచ్చుకున్నడు దుర్గయ్య. 'అవునే ఆలోశిస్తుంటే కామునికంతల మన ఎన్క ఇగ ఎవలు గూడ పంచాదులు తెంపరేమో అనిపిస్తున్నది. ఊరు గొడ్డువోవుడు ఖాయం అనిపిస్తున్నది. కాలం మంచిగైతే అందరం శివారు మీద ఏం పంట ఏద్దాం అని కూసుండి మాట్లాడుకోరేమో? ఏం జేస్తం.. మన పెయిల జిగి సచ్చిపోయింది. వాళ్ల బతుకులు అట్ల బత్కాల్నని వాళ్లు అనుకున్నంక ఇగ మనం వాళ్లకు ఏం జెప్తమే?' కండ్లు తుడ్సుకుంట అన్నడు దుర్గయ్య. 'సదువుకున్నోళ్లు ఎవుసం జేస్తే ఎంత ముద్దుగుంటదో. వాళ్లకు అన్ని తెలుస్తయి గావట్టి.. ఎప్పుడు ఏ పంట ఎయ్యాల్నో ఏస్తరు. అట్లైతే రైతులు ఉరికి బలిగారేమో. ఎవుసం శాన సొక్కమైన పని అని బగ్గ సదువుకుంటున్న వాళ్ల దమాక్కు ఎప్పుడు ఎక్కుతదో? దేశం సరిహద్దుల జవాన్ ఎంతనో దేశంల ఉన్న ప్రజల కడుపు నింపుతున్న రైతు గూడ గంతే ఇలువైనోళ్లు. కనీ, యాడున్నది ఆ ఇల్వ? దేశంలకు శతృవులు రాకుంట సరిహద్దుల లిలవడి కలెవడుతున్న జవాన్ కానస్తే సెల్యూట్ కొడ్తరు. కనీ, మన లోపటున్న ఆకలి దుష్మన్ను సంపుతున్న రైతుకు ఎవలు గూడ ఇల్వ ఇయ్యరు' అనుకుంట సాయిలు ఇంకింత శిన్నవోయిండు.

'ఏమోనే.. మనం గిన్ని మాట్లాడుకుంటున్నం గనీ.. తొల్త నేను నా కొడుకును ఈ మట్టి విసుక్కోకంట ఏ డాక్టరో, పెద్దసారో కావాలనుకున్న. కనీ, కొన్నొద్దులకు అనిపిచ్చింది నా ఆలోశన తప్పు అని. మనలెక్క శానమంది రైతులు వాళ్ల పిల్లలను రైతులు జెయ్యాలనుకుంటలేరు' శూన్యంలకు సూస్కుంట అన్నడు దుర్గయ్య. 'నీకు తెల్సా బామ్మర్దీ గీ ముచ్చట.. మన సంటర్ సర్కార్ రైతులను ముంచే సట్టాలు తెస్తున్నదంట. ఢిల్లీల రైతులంత కల్శి పది నెల్ల సంది ఎండనక, వాననక, సలనక నిరసన జేస్తున్నరట' సాయిలు నోటి నుంచి ఆ మాటలు విని చగావరైతున్నడు దుర్గయ్య. 'రైతులు ఇప్పటికే పండిచ్చిన పంటకు పెట్టిన లాగోడు రాక మునుగుతున్నరు. అసుంటి మనలను సర్కార్ ఆదుకునాలె గనీ, ముంచుడేందే?' కనుబొమ్మలు ముడివడ్డయి దుర్గయ్యయి. 'మన భూమి జాగల మీద ఎన్కట దొరలు, భూసాములు ఎట్ల పెత్తనం జేశిర్రో ఇప్పుడు అదే పని జేస్తున్నది సర్కార్. మన భూముల మీద వాళ్ల పెత్తనం అన్నమాట. మన భూమిల మనం కైకిలోళ్లం అయితం' అంటున్న సాయిలు మాట పూర్తి గానేలేదు దుర్గయ్య అందుకున్నడు.

'అట్లెట్ల అయితది. మన భూమి ఎవలిదో పెత్తనం ఏంది? నేను ఒప్పుకోను. నాకు గింత జరుగుతున్నదని తెల్వది. పా బావా, మనం గూడ ఢిల్లీకి వోయి మన రైతన్నలను సాద్దారి ఇద్దాం ' అంటున్నడు మెడ నరాలు పొంగంగ. 'పోదాం పోదాం.. పోకపోతే మనలను ఐన భూమిలనే బొంద వెడ్తది ఈ సర్కార్' అన్నడు సాయిలు. అట్ల శాన శేపటిదాంక సాగినయి వాళ్ల ముచ్చట్లు. ఒక సుట్ట అయిపోంగనే మల్ల ఒక్కొక్క సుట్ట ముట్టిచ్చిర్రు. ఇంతట్లనే సాయిలు పెండ్లాం రుక్కవ్వ

పిలుస్తున్నది. 'ఓ అయ్యా.. రా బువ్వ తిందువు గనీ' పక్క వీధిల కెంచి అస్తున్న పెండ్లాం పిలుపు వినంగనే సాయిలు లేశి నిలవడ్డడు. 'అస్తున్ననే' అని గట్టిగా అరుస్తూ చెప్పి లేశి నిలవడిండు. 'బామ్మర్దీ.. మీ శెల్లె అండినట్టుంది. ఆమె వెట్టినప్పుడే తినాలె. లేకవోతే ఉపాసం ఉండవల్శి అస్తది. పొలంకాడ కలుద్దాం తియ్' అని లేచి గోశి సదురుకుంట సైకిల్ తీశి ఎల్లిపోయిండు సాయిలు.

* * *

పొద్దుపొద్దుగాల్లనే ఇంటి ముంగట్కి ఒగ తెల్లటి కారు అచ్చి ఆగింది. బైట పొయిల గొట్టంతోని మంట ఊదుతున్న నర్సవ్వ ఆ కారును శిత్రంగ సూశింది. 'కార్ల ఎవలు అచ్చిర్రు మా ఇంటికి' అన్నట్టు అటు దిక్కే జూస్తున్నది. అన్లకెల్లి తెల్ల బట్టలు ఏసుకున్న ఒగ పొడావ్ మన్షి దిగిండు. ఊర్ల ఉన్నయన్ని అమ్ముకొని పట్నం గడ్డెక్కిన లక్ష్మీకాంత రెడ్డి పెద్ద కొడుకు రవికాంత్ రెడ్డి లెక్కటనే కనిపిచ్చిండు నర్సవ్వ కండ్లకు. ఆయిన ఎన్కకెల్లి ఊర్లుండె శింతకాయల రాజయ్య అచ్చిండు. 'నర్సవ్వా.. దుర్గన్న లేడా ?' అని అడిగిండు రాజయ్య. 'ఉన్నడే ఇంకా లెవ్వలేదు' అన్నది గొట్టం పక్కకు వెట్టుకుంట. 'పోయి లేపుపో' అన్నడు. 'ఆఆ' అనుకుంట లోపటికి ఉర్కింది నర్సవ్వ. రాత్రి తాగిన కల్లు మైకం మాంచిగ ఎక్కింది దుర్గయ్యకు. కాళ్లు ఇర్రదన్ని పండుకొని ఉన్నడు. దూలంకు యాలాడుతున్న ఫ్యాను గాలికి సోయి లేకుంట వన్నడు దుర్గయ్య. 'ఓ అయ్య లెవ్వు నువ్వు. ఎవలో దొర అచ్చిండు' అని భూజాలు వట్టి ఊపుకుంట లేపింది నర్సవ్వ. దుర్గయ్య లేశి 'ఏందే, బంగారమసుంటి నిద్ర కరాబ్ జేశినవు' అనుకుంట కండ్లు నులుముకుంట లేశిండు. 'అగో బైట ఎవలో దొర అచ్చిండే' అన్నది. 'దొరనా? ఎవలే ఆయిన?' అనుకుంట లేశి బైటకు నడిశిండు. అక్కడున్న ముంతల లీల్లు తీస్కొని పుక్కలిచ్చి ఉమ్మి, భజంకు ఉన్న తువాలతోని తుడుసుకొని ఆ పెద్దమన్శి ముంగట్కి వోయి నిలవడ్డడు.

'నమస్తే' అన్నడు. ఆయిన గూడ ప్రతి నమస్కారం కింద ఇట్ల శెయ్యి ఊపిండు. 'దుర్గన్నా.. తిన పేరు భుజంగరావు. మన ఎల్లారెడ్డి ప్యాటల ఉంటడు. హైదరవాదులు శాన యాపారాలు ఉన్నయి ఈ సారుకు' అని శెప్పుకస్తున్న రాజయ్యను, ఇటు భుజంగ రావును సూస్కుంట నోరు ఎల్లవెట్టిండు దుర్గయ్య. దుర్గయ్య ఎన్కనే నర్సవ్వ గూడ వచ్చి నిలవడ్డది. అయినా ఇప్పుడు వీళ్లు మా ఇంటికి ఎందుకు వచ్చిర్రు? అనే ప్రశ్న ఇద్దరి మొకాళ్ల శాన క్లియర్గ కానస్తున్నది. 'ఇగో దుర్గన్నా.. ఈ సారు నీ పొలం కొన్నడు' అంటున్న రాజయ్య మాటలకు ఇంకింత షాక్ అయిర్రు దుర్గయ్య, నర్సవ్వలు. ఒకరి మొకాలు జూస్కుంట భీరిపోతున్నరు. 'మీ అబ్బాయి చిత్తారి నాకు మీ ఎకరం పొలం అమ్మాడు. ఇరవై ఐదు లక్షలకు కొన్నాను. రేపటినుంచి మీరు ఆ పొలంలోకి రావొద్దని చెప్పడానికి వచ్చాను. నేను ఆ పొలంలో పూల తోట పెట్టాలనుకుంటున్న. అలాగే మా ఫ్యామిలీ కోసం ఓ గెస్ట్ హౌజ్ కట్టాలనుకుంటున్నా' అంటున్న ఆయిన మొకం జూస్తున్న ఇద్దరి గుండెల్ల ఆటం బాంబు పేలినట్టు అయింది. 'ఏంది నా పొలం అమ్మిండా వాడు?' అడిగిండు దుర్గయ్య. 'నీకు తెల్వదానె? గిసుంటి కతలు ఉంటయనే నీ సంతుకం గూడ తీస్క రమ్మనుంటిమి' రాజయ్య క్లారిటీ ఇచ్చిండు. ఆ మాట ఇనంగనే నెల రోజులు ముందు చిత్తారి

హైదరాబాద్ నుంచి వచ్చి ఏవో కాయిదాల మీద ఇద్దరి సంతకాలు తీస్కున్నది యాదికచ్చింది. ఏంటియి ఆ కాయిదాలు అంటే, ఏదో లోన్ తీస్కుంటున్న అన్న మాటలు గుర్తచ్చి గుండెల అడివట్టినట్టు అయితున్నది దుర్గయ్యకు. అవి పొలం కాయిదాలని సదువురాని తాము తెల్సుకోలేకపోయినం అనుకొని ఇద్దరు ఒకరి మొకాలు ఒకరు జూస్కుంట నోర్లు ఎల్లవెట్టిర్రు. కొడుకు జేశిన మోసం గురించి తల్సుకుంటుంటే వాళ్లకు దుఃఖం ఆగుతలేదు. దుర్గయ్య లోపట లోపట ఉడుకుతున్నడు గనీ, నర్సవ్వ అయితే బరస్ట్ అయిపోయింది. సోకం వెట్టి ఏడుస్తనే ఉన్నది. 'ఎంత పని జేస్తివిరా చిత్తారీ.. ఏవో లోన్ కాయిదాలని తెచ్చి మాతోని సంతకాలు జేపిచ్చుకొని అమ్ముకుంటివారా?' అని ఆరోజు జరిగినదాని గురించి తల్సుకొని కుమిలిపోతున్నది. 'నర్సవ్వా ఏడ్వకు.. మీ కొడుకు మీకంత జెప్పే శేస్తున్నడని అనుకున్నం మేము. అయినా ఇంతకు ముందుగాల్ల నాలుగు ఎక్రాల భూమి అమ్ముకున్నరు గదా మీ బిడ్డెలు. ఇది గూడ కొడుకు అమ్ముకున్నడని అనుకోర్రి' అంటున్న రాజయ్య మాటలకు ఇంకింత కుమిలిపోతున్నది నర్సవ్వ. భుజంగరావు రాజయ్యను జూస్కుంట 'పా ఇక్కణ్నుంచి' అన్నట్టు కండ్లతోని సైగ జేశిండు. ఆ సైగను అర్థం జేస్కున్న రాజయ్య సదరుకుంట 'ఆఆ.. ఏడ్వకుర్రి మీరిట్ల. ఉన్న ఈ ఇల్లు గూడ అమ్ముకొని కొడుకు దెగ్గర ఉండిపోర్రి. ఏముంటరు ఈ ఊల్లె ఒంటి పిట్టెల లెక్కట' అంటున్న రాజయ్య మాటలకు దుర్గయ్యకు కోపం తన్నుకస్తుంటే ఆపుకుంటున్నడు.

దాన్ని గుర్తువట్టిండు రాజయ్య. 'ఈడ ఎక్కశేపు ఉంటే పెద్ద కొట్లాటనే అయితది' అనుకున్నడు. 'సరే పా దొరా పోదాం మల్ల. దుర్గన్నా ఇగ ఆ పొలం ఈ కాన్నుంచి మీది గాదు, ఈనది. పైసలన్నీ ముట్టిపోయినయి. రిజిస్ట్రేషన్ గూడ అయిపోయింది' అనుకుంట కదిలిండు రాజయ్య. భుజంగరావు ఈల్ల దిక్కు జూస్కుంట నమస్కారం వెట్టుకుంట కదిలి కార్ల కూసున్నడు. కారు స్టార్ట్ అయి రుయ్యున వోయింది. కారు వోయింది గూడ సోయి లేకుంట అయింది దుర్గయ్యకు. అట్లనే లిలవడ్డరు మాలాస్క శేపటిదాంక. ఇంతట్లనే దోసపల్లి సాయిలు అచ్చిండు సైకిల్ మీద. సైకిల్ గంట గొట్టంగనే ఈ ప్రపంచంలకు వచ్చిర్రు ఇద్దరాల్ మొగోళ్లు. సాయిలు దిక్కు సూశిర్రు పిచ్చోళ్ల లెక్కట. సాయిలు సైకిల్ను పక్కపొంటి స్టాండ ఏశి లిలవెట్టిండు. ఎంటనే ఇద్దరి భుజాల మీద చెయ్యేశి అరుగు మీదికి తోల్కపోయిండు. 'కాముని పున్నమి పీడ దినంగోలె మంచి పనే జేశిండు మీ కొడుకు' అంటున్న సాయిలును పట్టుకొని బోరున ఏడ్శిండు దుర్గయ్య. నర్సవ్వ గూడ పల్లపల్ల మల్ల ఏడుపు అందుకున్నది. 'ఏడ్వకుర్రి ఏడ్వకుర్రి.. ఇప్పుడు ఏడుస్తే పోయిన పొలం అస్తదా? కడుపుల వుట్టినోళ్లు కడుపు మీద తంతరే. కన్నోళ్లం మనం అసుంటి శేదును మింగ గూడ తయారుండాలె. లేకపోతే అనవసరంగ బాధవడి ఇంకా నాలుగొద్దులు ఎక్క బత్కాల్శినోళ్లం బరాన వోతం బోడిగడ్డకు' అనుకుంట అరుగు మీద కూసుండవెట్టిండు. ఎంటనే ఇంట్లకు ఉర్కి ముంతల తాగేలీల్లు తెచ్చి ఇచ్చిండు. 'ముందుగాల్ల ఈ లీల్లు తాగి దమాక్ సల్లగ జేస్కోర్రి' అన్నడు. ఇద్దరూ చెరిన్ని లీల్లు తాగిర్రు. 'శెల్లె, బావ మీరిట్ల బాధవడకుర్రి. పోతెవాయె తియ్ తొప్పెల పొలం అనుకో. ఇప్పటికే మీకు శాతనైతలేదు. ఇంకా

పేగు పేగు అయికుంట ఎన్నొద్దులు జేస్తరు కష్టం. మనం ఎవుసం జేశి బతికినట్టు మన కడుపుల వుట్టినోళ్లు గూడ గా ఎన్న కష్టం జెయ్యుమంటే ఎందుకు జేస్తరు? బావా... నువ్వు నీ కొడుకును రైతును జెయ్యాలనుకున్నవు గనీ, వాడు పట్నం కంపిన్ల పంచకు బల్లి లెక్కట బతుకుతనంటున్నడు. అసుంటోళ్లను ఇడ్సవెట్టాలె. మనం బతికినన్నొద్దులు ఏం పికర్లు వడకుంట బతకాలె. పోని తియ్. శెల్లే ఊకో నువ్వు.. గట్టిదానివి నువ్వు గుండె దైర్నం జెయ్.. ఏడ్వకుర్రి.. ఇప్పుడు ఏడుస్తే పోయిన పొలం అస్తదా? ఓటు ఏశిన ప్రజలను కాసుకునే సర్కార్ అడ్డమైన సట్టాలతోని రైతులను బలి పశువులను జేస్తున్నది. కడుపుల వుట్టినోళ్లేమో కడుపు మీద తంతున్నరు. ఒగ పక్క రైతులం, ఇంకో పక్క కన్నోళ్లం.' అనుకుంట ఇంట్లకు ఉర్కి ముంతల తాగే లీల్లు తెచ్చి ఇచ్చిండు సాయిలు. 'ముందుగాల్ల ఈ లీల్లు తాగి దమాక్ సల్లగ జేస్కోర్రి' అన్నడు. ఇద్దరూ చెరిన్ని లీల్లు తాగిర్రు. సాయిలు మొకంలకు ధీనంగ జూస్తున్నరు ఇద్దరు. ఆరోజు పొద్దిమీకిందాంక సాయిలు వాళ్లను సంజాకుంట, ధైర్యం జెప్పుకుంట కూసున్నడు.

సాయిలు పెండ్లాం రుక్కవ్వ గూడ వచ్చి ధైర్యం జెప్పింది. అట్ల సాయిలు శానా సేపటిదాంక ఉండి బల్మీట్కి ఇంత తినిపిచ్చిండు. రెండు సీసల కల్లు తాపి పోయిండు. ఏం ఆలోశించకుంట సప్పుదాంక ముదురుకోర్రని కొట్టి కొట్టి శెప్పి పోయిండు. ఈ ముచ్చట తెల్శి ఊర్ల శానమంది వచ్చుకుంట పికర్ జెయ్యద్దని శెప్పుకుంట వోతున్నరు. బిడ్డెలు, అల్లుండ్లు గూడ ఫోన్ల ఎన్క ఫోన్లు జేశి మాట్లాడి మనసు తీరం జేస్తున్నరు. కనీ, కొడుకు చిత్తారి మాత్రం ఒక్కపారి గూడ ఫోన్ జెయ్యలేదు. 'నాయినా, నేను పొలం అమ్ముతున్న అని ఒక్క మాటన్న జెప్పుంటే నేను ఏమంటుంటినో? నన్ను హౌలని జేశి లోన్ కోసమని అవద్దం జెప్పి సంతకాలు వెట్టిపిచ్చుకొని పొలం అమ్ముకొని ఎంత మోసం జేశిండు ' ఇదే ప్రశ్న ఇద్దరాల్ మొగోళ్ల మనుసుల మెరమెర అంటున్నది. అస్సలు మన్నుకు వడ్తలేదు వాళ్లకు. ఉన్న ఒక్క కొడుకు ఇట్ల జేశిండని మనసు మార్మానం వోయినట్టు ఎర్రి సూపులు జూస్కుంట ఉన్నరు ఒకోళ్లనొకోళ్లు. తన తండ్రి నుంచి వచ్చిన ఎవుసంను తరతరాలకు ముంగట్కి తీస్కపోవాల్నని దుర్గయ్య ఎన్నో కలలు కన్నడు. గీ ప్రపంచంల ఎవుసంను మించిన నిస్వార్థమైన, నిజాయితీగల్ల పని ఏదీ లేదని శానా బలంగ నమ్మినోడు దుర్గయ్య. కనీ, తనతోనే ఎవుసం ఆగిపోతుందనే మాట దుర్గయ్యను అస్సలు సైను వట్టనిస్తలేదు. కొడుకుకు ఎవుసం గురించి ఎంత గొప్పగ జెప్పినా నెత్తికెక్కలేదు. పెండ్లాం అచ్చినంక పట్నం యావ ఎక్కి ఎగిరిపోయిండు. అయినా ఇయ్యాల్లనో రేపో పట్నం మీద మొకం మొత్తి ఊరి బాటన వడ్తడు, ఎవుసం జేస్తడు నా కొడుకు అని ఎన్నో నమ్మకాలు వెట్టుకున్నడు. గనీ అవన్నీ అవద్దం జేశిండు చిత్తారి. ఐదు ఎక్రాల్ల నాలుగు ఎక్రాలు బిడ్డెలకు ఇచ్చినా.. ఉన్న ఎక్ర పొలం కొడ్కుకు మాస్తు అయితదని, రేపు రేపు వాడే కష్టం జేశి ఇంకిన్ని ఎక్రాల భూమిని సంపాంచడా? అని అనుకున్నదంతా ఉత్త కతనే జేశిండు??

* * *

ఆ రాత్రి ఇద్దర్కి మచ్చంవోయిన నిద్రనే వడ్తలేదు. కరంటు లేకపోవుడుతోని చిమ్నీ ఎలిగిచ్చి పెట్టిర్రు. దాని ఒత్తి మీద కొడిగట్టుకుపోయి గుడ్డి గుడ్డి కనిపిస్తున్నది ఎలుగు. దోమలు గూడ

మాలాసనే ముసురుకున్నయి. దుర్గయ్య మాటిమాటికి లేశి కూసుంటున్నడు. దుర్గయ్య ఊకె లేస్తున్నడని నర్సవ్వ గూడ లేశి ఆయిననే జూస్తున్నది. 'ఇగ నా మన్సు గట్టిగ జేస్కోకపోతే ఈ పెద్దమన్షి ఆగమైతట్టే ఉన్నడు' అనుకొని అప్పటిదప్పుడే మన్సును రౌతు జేస్కుంటున్నది. 'ఓ పెద్దమన్షీ.. ఎందుకే గంతగానం అర్వర్వ వోతున్నవు? పొలం అమ్ముతే అమ్మిండు తియ్. ఎందుకంత ఆగమైతున్నవు నువ్వు.

వానికి బలం వట్టుకచ్చినప్పుడు మల్ల పొలం కొంటడేమో తియ్' అంటున్న నర్సవ్వ మొకంలకు సూశి తల్కాయ దించుకున్నడు. ఎంటనే తన రుమాల్ పేల్కల కట్టి పెట్టుకున్న సగం కాల్శిన సుట్టను తీశిండు. అగ్గిపెట్టె కోసం అటీటు జూస్తున్నడు. ఎంటనే నర్సవ్వ లేశచ్చి నోట్లె ఉన్న సుట్టను గుంజుకున్నది. 'ఊకె సుట్టలు ఎన్నిగానం తాగుతవు? ఇప్పటికే మాలాస్క తాగినవు. ఇవి తాగి తాగి ఇంకింత పానం కరాబ్ జేస్కుంటవా? ఏది వోయినా నా జాత్ మరే అని, నన్ను సంజాచేటోనివి ఇయ్యాల్ల ఇట్ల మెత్తవడ్తె నాకు సూడబుద్ధి అయితలేదే. నువ్వు ఏం ఆగం గాకు. మనిద్దరి రెక్కలు సలామత్ ఉన్నన్ని దినాలు గిట్లనే కష్టం జేస్కుంట బతుకుదాం. మనకు పిల్లలు వుట్టలేదని అనుకుంటే సాలు ఏ రంది ఉండది' అంటున్న నర్సవ్వ మాటలు దుర్గయ్య మన్సుకు జర ధైర్యం జెప్పినట్టు అనిపిచ్చినయి. అంతట్లనే మల్ల పొలం జట్టన యాదికచ్చి అప్పదప్పుడే గుండెల నిండిన ధైర్యం ఉడ్కు లీల్లు ఆవిరైనట్టు ఆవిరిగావట్టె? 'నువ్విట్ల పండుకో.. ' అని తన పక్కకు మెత్త జూపిచ్చింది. నిద్ర రాకపోయినా మెల్లెగ మెత్త మీద తల్కాయ ఆన్సిండు. కండ్లు మూతలు వడ్తలేవు.

అటు ఇటు బొర్రుతున్నడు. నర్సవ్వ శేయి దుర్గయ్య ఛాతి మీద సరుస్తున్నది. ఆమెకు కన్ను మీద కన్నువడ్డది. దుర్గయ్యకు మాత్రం పొలమే యాదికస్తున్నది. కొడుకుకు ఎట్ల జెయ్యబుద్ధి అయింది ఈ పని? అని మన్సుల ఊకూకె అడుక్కుంటున్నడు. 'నేనిట్ల జెయ్యాలనుకుంటున్నా నాయినా.. అని ఒక్కమాట నన్ను అడుగుంటె అవునంటుంటినో, కాదంటుంటినో గదా? వానికి ఎట్ల జెయ్య బుద్ధి అయిందో ఏమో' అనుకొని కండ్లు నల్సుకుంటున్నడు. బైట కీకెలు, పెద్దపెద్దగ లొల్లి వెట్టుకున్నట్టు సప్పుళ్లు ఇనవడ్తున్నయి. హోళీ పండుగు గదా.. కాముడు కాల్వ ఊరి పోరగాండ్లంత ఒక్కటై తయ్యున ఆడుతున్నరు. వాళ్లిండ్లయి వీళ్లండ్ల ముంగటున్న ఆ సామాన్లు ఈ సామాన్లు గుంజుకచ్చుకుంట మంటల్ల ఏస్తున్నరు. వాళ్ల కీకెలు ఇంటున్న దుర్గయ్య మన్సుల ఏదో మెరమెర అన్నది. ఎంటనే నర్సవ్వ దిక్కు తల్కాయ మల్పి సూశిండు. ఆమెకు మంచిగ నిద్రవట్టింది. తన మీదున్న ఆమె శెయ్యిని మెల్లెగ తీశి పక్కకు వెట్టి లేశిండు. రుమాలు నెత్తికి సుట్టుకున్నడు, గోశి నడుముకు మంచిగ శెక్కుకున్నడు. దర్వాజ తీస్కొని బైటకచ్చిండు. మల్ల దర్వాజ ముంగటికేశి ఆకిట్లకు వోయిండు. అక్కడున్న నాగలి, బండి, పార, కొడవలి, కొంకులను జూస్తున్నడు. అవిటితోని తను పొలంల వడ్డ కష్టాలను తల్సుకొని ఆ సామాన్లిట్నీ ఆఖరిసారి అన్నట్టు కండ్లార జూస్తున్నడు. అన్నిటి మీద శేయితోని ప్రేమగ నిమురుతున్నడు. 'ఇగ మీకు నాకు బాకీ తీరిపోయింది' అనుకున్నడు మనుసుల. నాగలి మొన్నమొన్ననే కొత్తగ కమ్మరి అంజన్నతోని శెక్కిపిచ్చుట్ల ఇంకా కొత్తగా మెరుస్తున్నది.

కండ్లల్ల లీల్లు దుంకుతున్నయి. మనసును ఎవలో వట్టి అడివెట్టినట్లైతున్నది. ఇంక ఏరే ఆలోశించలేదు. శెక్కిలి నరాలు బిగవట్టిండు, నాగలిని లేపి భుజం మీద వెట్టుకున్నడు. కొడవలి, కొంకులున్న సంచిని శేతుల వట్టుకొని కామునికంతలకు నడుస్తున్నడు. తొవ్వ పొర్త రప్పరప్ప వోతున్నడు ఆ శీకట్ల. కరంటు లేక శీకట్ల ఆయిన తెల్లబట్టలు మాత్రమే కానస్తున్నయి. ఇప్పటిదాంక ఒర్లినోళ్ల సప్పుళ్లు బందైనయి. కాముని కంతల మంట వెట్టిన కాముని మంటను జూస్కుంట గుడ్లల్ల లీల్లు తింపుకున్నడు. దుఖ్ఖం పొంగుకస్తున్నది.. పండ్లు నూరుకుంట దుంఖ్ఖం ఆపుకుంట ఆ నాగలిని ఆ మంటల్ల ఏశిండు.

సంచిలున్న సామాన్లను గూడ అన్ల గుమ్మరిచ్చిండు. అప్పుడే మనసు రౌతు అయినట్టే అయితున్నది దుర్గయ్యాల. మల్ల ఆగలేదక్కడ. ఎన్కకు మల్లి ఇంటితొవ్వ వట్టిండు. ఇంటికాడున్న రొప్పు నాగలిని బండ్లె ఏశిండు. ఎడ్లను బండికి కట్టిండు. ఆకిట్ల కెంచి గెదుముతున్నడు. ఎడ్లకు ఏం అర్థం అయితలేదు. అద్దుమరాత్రి యాడికి తీస్కపోతున్నడు అన్నట్టు అవి కల్లివిల్లి జేస్తుంటే.. అవిటి ఈపు మీద మెత్తగ నిమిరిండు. దుర్గయ్య శెయ్యి వడంగనే అవి తాదనకు అచ్చినయి. అట్లనే మెల్లెగ గెదుముకుంట కామునికంతలకు వోయిండు. ఊరంత వండుకొని ఉన్నది. కాముడు కాలుస్తున్న పోరగాండ్లు సప్పుళ్లు రూముల్ల దిక్కు దూరంగ ఇనిపిస్తున్నయి. కుక్కలు బండిని సూశి భౌభౌ అంటున్నయి. కాముని కంతలకు బండి రాంగనే ఎడ్లను ఇడ్శిండు. నాలుగు తొవ్వలు కల్శే జాగ అది.

కాముని పున్నమి రోజు ఆ చౌరస్తలనే కామ దహనం చేస్తరు గావట్టి అక్కడి జాగకు కాముని కంత అని పేరు వడ్డది. గోపాల్పేట్ల కాముని కంత అంటే అక్కడి సుట్టుపక్కల ఊర్లల్ల శానా ఫేమస్. ఆలుమొగల పంచాదులు, అన్నదమ్ముల గెట్టు లొల్లులు, పాలోల్ల తాకులాటలు ఇట్ల ఒకటా రెండా.., శానా పంచాదులు కాముని కంతలనే తెగుతయి. బూర్గుపల్లి రోషయ్య, తుర్క రసూల్, శిల్గెపురం బాగయ్య, పెండ పోషయ్య, కమ్మరి అంజన్న, తిమ్మాయిపల్లి కిష్టయ్య, మాసుల సులేమాన్, కొమటూరు సిద్దిరాములు ఇట్ల శానమంది పెద్ద మన్సులు ఉన్నరు ఇసుంటి పంచాదులు తెంప. కాముని కంతల లిలవెట్టిన అంబేద్కర్ విగ్రహం దిక్కు జరశేపటి దాంక అట్లనే సూశిండు. ఆ విగ్రహం ఎన్కదిక్కు పోషెట్టి కిరాణ దుకుణం ఉంటది. సుట్టుపక్కల ఊరోళ్లయి ఇండ్లు ఉంటయి. దానికి దెగ్గర్లనే పీర్ల చావిడి ఉంటది. అంబేద్కర్ నే సూస్తున్న దుర్గయ్యకు గుండెల బాధ ఎగదన్నుకొని అస్తుంటే కండ్లల్ల లీల్లు కుక్కుకుంటున్నడు.

బండి దెగ్గరికి వోయి దాని మీద చేయితోని నిమిరిండు. ఇంకింత బాధ కలిగింది. కండ్లల్ల లీల్లు ఆగకుంట దుంకి బండి మీద వడ్తున్నయి. టేకు, ఇప్ప కట్టెతోని కమ్మరి అంజన్నతోని చెక్కిపిచ్చుకున్న యాదులను తల్సుకొని బండికి కడసారి వీడ్కోలు అన్నట్టు మల్ల మల్ల నిమిరిండు. గుండె బిగవట్టుకొని అట్లనే నూక్కుంట వోయి ఆ మంటల్ల బండిని నూకిండు. తనెన్క తెచ్చుకున్న గ్యాస్ నూనె డబ్బను తీశి అన్లున్న నూనెనె బండి మీద గుమ్మరిస్తున్నడు. జర్ర శేపట్లనే బండికంత మంట అంటుకున్నది. ఇంత పెద్ద మంట అయితున్నది. ఎడ్లు అటు పక్కకు లిలవడి ధీనంగ జూస్తున్నయి. దుర్గయ్య నెత్తి కొట్టుకుంట ఏడుపు సప్పుడు బైటికి

రాకుంట లోపట లోపట కుమిలి కుమిలి ఏడుస్తున్నడు. కండ్లల్ల లీల్లు మాత్రం ఏరు ధారలు అయినయి. తనెంతో పాయిరంగ జేపిచ్చుకున్న బండి, నాగలి ఇట్ల అన్నీ ఎవుసం సామాన్లు కండ్ల ముంగట కాలి బూడిద అయితుంటే ఆయిన మన్సు గూడ కాలిపోతున్నది. ఎక్కడి కోపం? ఏం రేషం ఇది?? ఎవుసాన్ని నమ్ముకున్న రైతు మనసు మండుతే సర్వం బూడిదనే అయితది అనుకున్నట్టున్నడు?? 'భూమి వోయింది, ఇంక ఆ ఎవుసం సామాన్లను ఇంటి ముంగట వెట్టుకొని ఎందుకు బాధవడాలె? రైతు వారసత్వం నాతోనే అంతమైతున్నది ఇట్ల అగ్గిల కాలుకుంట' అని అనుకొనే తన లోపటున్న రైతును ఇట్ల కాల్చుకున్నడు దుర్గయ్య. అట్లనే ఆ మంటను జూస్కుంట శాన శేపటిదాంక కూసున్నడు. ఎడ్లు అటు పక్కకు లిలవడి జూస్తున్నయి. ఇంతట్లనే అటు పక్కకెల్లి పోరగాండ్ల కీకెలు ఇనవడ్డయి. అంతే సటుక్కున లేశిండు. వాళ్ల కండ్లల్ల వడద్దనుకున్నడు. ఎడ్లను దమాంచుకుంట ఇంటి తొవ్వ వట్టిండు.

ముంగట నడుస్తున్న ఎడ్లకు దుర్గయ్య తర్వాయి అర్తమైనట్టు మెల్లగ నడుస్తున్నయి. 'ఇగ ఈనకు, మాకు గూడ రుణం తీరిపోయెటట్టే ఉన్నది' అన్నట్టు నడక సాగిస్తున్నయి. కాముని మంటలు ఎగిసెగిసి పడుతున్నయి అచ్చం దుర్గయ్య గుండెలు మండుతున్నట్టే?

* * *

అటు కాముని కంతల నాగలి, బండి మండిపోతున్నయి గనీ, ఇటు దుర్గయ్య గుండెల మంట తగ్గుతలేదు. కొడుకు మోసానికి ఇది తన నిరసన అనుకుంటున్నడు. ఇటు కొడుకు జేశిన మోసం గురించి అటు ఢిల్లీల రైతు ఉద్యమం గురించి సాయిలు జెప్పిన మాటలను యాజ్జేసుకుంట మస్తుగ బాధపడ్డడు. 'అయ్యకు కొడుకు ఆదెరువు గాకపోవచ్చు గనీ, రైతుకు రైతే ఆదెరువు గావాలె. గీ సర్కార్ మెడలు వంచవల్శిందే. లేకపోతే భవిష్యత్తుల రైతు జాగల కూలోడే మిగుల్తడు' అని బగ్గ ఆలోశించి ఒగ ఫైస్ల తీసుకొన్నడు. శూన్యంలకు సీరియస్గ సూస్కుంట శాన సేపటికి కండ్లు మూసుకున్నడు.

* * *

ఢిల్లీల జరుగుతున్న రైతు ఉద్యమంలకు వోయి శెరీక్రైరు దుర్గయ్య, సాయిలు. ఎవరు గూడ అడగక ముందే పొలంల దుక్కి దున్ని ఆరుగాలం కష్టవడుతున్న రైతులను రోడ్డెక్కిచ్చి అరార గోస వెడుతున్నరని మనసుల్ల కలుక్కుమన్నది. ఇప్పటికి ఆరు వందల మంది రైతులు జీవిడ్శిరు అని తెల్శి పానమంత కలకల అన్నరు. రైతు ఏడ్శిన రాజ్యం ఎప్పటికి ముంగటవడది అనుకుంటున్నరు. రైతుల మీద ఖలిస్తానీలు అని ముద్ర ఏశిన సర్కార్ మీద వాళ్లకు దయ కలిగింది. రైతుల పోరాటంల న్యాయమున్నది.. సర్కార్ మొండి యవ్వారంల దొంగలకు సద్దులు గట్టే మర్మం ఉన్నదని అర్థమైతున్నది. రోడ్ల మీద సలాకలు దింపుడు, వాళ్లకు మంచినీళ్లు అందకుంట కుట్రజేస్తున్న పోలీసోళ్ల తాత, ముత్తాతలు రైతులే అయ్యుంటరు గదా? సర్కారుకు సపోర్ట్ జేస్తున్న ఆ పార్టీ కార్యకర్తల ఇంట్ల రైతులే లేరా? మన దేశ ముఖ్యమైన వనరు ఎవుసమే గదా.. ఈ తరంల ఎంతమంది సదువుకొని ఎవుసం జెయ్యకున్నా మన మూలాలల్ల ఖచ్చితంగ రైతులు ఉంటరు గదా? మనం నలుగురికి బువ్వ వెట్టే రైతు వారసత్వం నుంచే గదా అచ్చినం??

ఈ సట్టాలతోని రైతు పూరగనే మిగలకుంట సచ్చిపోతడు.. అప్పుడు వీళ్లంత ఏం తింటరు? ఎన్ని కోట్లు సంపాంచినా గా పైసనైతే తినరు గదా.. రైతు పండిచ్చిన గింజలే గదా కొన్క తినాలె? గీ గురాతనం ఎందుకు ఉంటలేదు సర్కార్కు? ఇట్ల శాన ప్రశ్నలు వాళ్లల్ల? 'ఉన్న పొలం అమ్మి కొడుకులు కానకుంట పట్నం తొవ్వ వట్టిగ్రు.. పుట్టినం రైతుగనే, పోతం సాటి రైతు కోసమే..' అని ఇద్దరు గట్టిగ మోరు గుద్దుకున్నరు మనసులల్ల. వీళ్లు అక్కడికి పోవుడుతోని ఇక్కడి శానమంది రైతులు ఆ ఉద్యమంకు మద్దతు పల్క రైలెక్కుతున్నరు ఢిల్లీకి.

* * *

ఆయాల్ల రైతులు రోడ్డ మీద కూసుండి నిరసన జేస్తుంటే అక్కడికచ్చిన కేంద్రమంత్రి కొడుకు రౌడీ లెక్కట వాళ్ల మీదికి కారెక్కిచ్చి తొమ్మిది మంది రైతుల పానాలు తిన్నడు. ఆ తొమ్మిది మందిల దుర్గయ్య గూడ ఉన్నడు?? మంత్రి కొడుకు కావురం పని మీద దేశం మొత్తం అట్టుడికిపోతున్నది. ఆ మంత్రి కొడుకుకు ఉరిశిక్ష ఎయ్యాల్నని దేశం మొత్తంల రైతులంత ఉడికిపోతున్నరు. శానమంది రైతులకు మద్దతు ఇస్తున్నరు. 'న్యాయమైన హక్కుల కోసం పోరాడుతున్న రైతులను సంపుతున్న ఈ సర్కార్ దిగిపోవల్శిందే' అని ఇంకా ఉద్యమంను ఉధృతం జేశిగ్రు.

దేశంలున్న రైతులంత సర్కార్ మీద సైరన్ మోగిచ్చిగ్రు. దీంతోని కేంద్రం దిగచ్చింది. ఆ రైతు వ్యతిరేక సట్టాలను ఎన్కకు తీసుకున్నది.

* * *

దుర్గయ్య మరణం గోపాల్పేట్ల ఎంతో మందిని కదిలిచ్చింది. రెండు తెలుగు రాష్ట్రాల్ల దుర్గయ్యకు శానమంది నివాళులు అర్పిస్తున్నరు. రైతుగ వుట్టిన దుర్గయ్య రైతుల కోసమే తన పానం అర్పిచ్చి చరిత్రల నిలిశిండు. రైతుల కోసం పానం అర్పిచ్చిండని ఆ ఊరోళ్లంత కల్శి సర్పంచ్తోని మాట్లాడి దుర్గయ్య విగ్రహం జేపిచ్చి కాముని కంతల ఉన్న అంబేద్కర్ విగ్రహం పక్కపొంటి లిలవెట్టిగ్రు.

* * *

ఇంట్ల దీపం ముంగట కూసొని గోడకున్న దుర్గయ్య ఫోటో జూస్కుంట బాధ వడుతున్నది నర్సవ్వ. 'ఇగ నేనెందుకు బతకాలె? ఎవర్ని జూస్కోని బతకాలె? పిల్లలు దెగ్గర లేరు? శేస్కున్నాయిన అర్వంద్రం జేశి పోయిండు? పొలంలనన్న ఇంత పని జేస్కుంట పొద్దు ఎల్లదీస్కుందాం అంటే అదీ లేదు? ఇట్ల నర్సవ్వ మనసుల ప్రశ్నలు??? ఇంతట్లనే ఆమె ఎన్కకెల్లి భుజం మీద ఒగ శెయ్యి పడింది. షాక్ అయిన నర్సవ్వ ఎవలని ఎన్కకు మల్లి సూశింది. కొడుకు చిత్తారిని జూశి ఆమె మొకం ఎల్గుతున్న బల్బు బుగ్గ అయిపోయింది. 'కొడుకా' అని అన్నది. చిత్తారి ఎన్కాలె కోడలు లచ్చిమి, మన్మడు మన్మరాలు లిలవడి ఉన్నరు. వాళ్లందర్ని ఎంతో మురిపెంగ జూస్తున్నది. 'నాయినమ్మా' అన్న వాళ్ల మాటలు ఇని పిల్లలిద్దర్ని దెగ్గర్కి తీస్కోని గుండెలకు అదుముకుంట ముద్దాడుతున్నది. 'అమ్మా.. ఈ కాన్నుంచి నేను నీతోనే ఇదే ఇంట్ల ఉంట' అంటున్న కొడుకు జెప్తున్నది నిజమా? అన్నట్టు కోడలు మొకంలకు జూశింది.

‘అవునత్తమ్మా.. ఈడనే బతుకుదామని అచ్చినం’ అన్నది లచ్చిమి. ‘అమ్మా.. నాయిన రైతు ఉత్యమంల పాల్గొని అమరుడైండు. బతుకుతే అట్ల నాయిన లెక్కట బత్కాల్నని డిసైడ్ అయిన అమ్మా. పొలం అమ్మి నేను శాన పెద్ద తప్పు జేశిన్నని నాయిన సచ్చినంక అర్థమైంది నాకు. గందుకే, అమ్మిన పొలంను వాళ్ల పైసలు వాళ్లకు ముట్టజెప్పి మల్ల ఎన్కకు తీసుకున్న. ఇగ ఈ కాన్నుంచి నేను నాయిన లెక్కట ఎవుసం జేస్కొని నిన్ను మంచిగ జూస్కుంట.. నాయిన వారసత్వంను ముంగటికి తీస్కపోత. నాకు నాయిన సచ్చినంకనే బుద్ధి అచ్చిందమ్మా బుద్ధి అచ్చింది..’ అని తల్కాయ కొట్టుకుంట చిన్న పిలగాడు ఏడ్శినట్టు ఏడుస్తున్నడు చిత్తారి. గోడకున్న తండ్రి ఫోటో జూశి ఇంకింత బాధ వడుతున్నడు. ‘నాయినా.. నన్ను మన్నించు. నువ్వుండంగ నీ ఇల్వ, ఎవుసం ఇల్వ తెల్వలేదు నాకు. నువ్వు వోయినంకనే నాకు నువ్వేందో, ఎవుసం ఎసుంటిదో తెల్శి అచ్చిందే’ అనుకుంట లెంపలు ఏసుకున్నడు. కొడుకు మాటలు ఇనుకుంట గోడకున్న దుర్గయ్య ఫోటోను జూస్కుంట శానా మురిశిపోతున్నది నర్సవ్వ. సంబురంతోని ఆమెకు నోటి నుంచి మాటలు అస్తలేవు.. ఆనంద భాష్పాలు కారుస్తున్నది. మల్ల చిత్తారే జెప్తున్నడు. ‘ఈ ఊర్లకెంచి నా అసుంటోళ్లు ఎవలెవలు పోయిన్రో.. వాళ్లందర్ని ఎన్కకు తీస్కచ్చి ఎవుసం గొప్పతనం గురించి వాళ్లకు శెప్త. ఊరి శివారును మల్ల పచ్చగ మెర్శిపోయేటట్టు జేస్తా’ అని ఒట్టు ఏసుకున్నట్టు మాట్లాడుతున్నడు చిత్తారి. ఆ మాటలు ఇంటుంటే.. కొడుకు మొకంల దుర్గయ్యనే కానస్తున్నడు నర్సవ్వకు.

* * *

తెల్లారి లేవంగనే కాముని కంతలకు వోయిండు చిత్తారి. అంబేద్కర్ విగ్రహం పక్కపొంటి లిలవడ్డ నాయిన విగ్రహం జూశి చిత్తారి కండ్లల్ల లీల్లు తిరిగినయి.

శాన శేపటివరకు దుర్గయ్య విగ్రహం జూస్కుంట భీరిపోయిండు. అట్లనే రెండు శేతులు ఎత్తి మొక్కుతున్నడు. ఇంతట్లనే అక్కడికి కమ్మరి రాజయ్య వచ్చిండు. ఆయినతోని మాట్లాడి బండి, నాగలి ఇట్ల ఎవుసం పనిముట్లు ఎవేవి ఉన్నయో అవన్నీ కొత్తగ తయారు జెయ్యుమని చెప్పిండు. కమ్మరి అంజయ్య గూడ ఆ పని ముంగటేస్కున్నడు. కామును కంతలనే దుర్గయ్య విగ్రహం సాక్షిగా ఆ పని మునుము వట్టిండు.

* * *

ఊరు ఇడ్సవెట్టి హైదరాబాదుకు ఎవరెవరు బత్కవోయిన్రో వాళ్లందరి ఫోన్ నంబర్లు తీస్కొని వాళ్లందర్ని ఊరికి రమ్మంటున్నడు చిత్తారి. అందర్ని కాముని కంతల కూసుండవెట్టి ఎవుసం గొప్పతనం గురించి వాళ్లకు జెప్తున్నడు. ‘మనం, మన తండ్రులు ఎవుసం వారసత్వంను ముంగటికి తీస్కపోవాలె. ఎవుసం దిక్కు మనం రాక.. మన రైతులు ఢీల వడిపోతున్నరు. ఢీలవడ్డ రైతుల మీద సర్కార్ అడ్డమైన సట్టాలతోని నడ్మల కార్పోరేట్ శక్తులను తీస్కచ్చి మన రైతన్నలను ఇంకింత తొక్కి పెట్టాలనుకుంటున్నది. గందుకే మనం ఉషార్ గావాలె. ఎవుసంను మించిన మంచి పని ఇంకోటి లేదు. మనం సదువుకున్నోళ్లం.. అసుంటి మనం ఎవుసం జేస్తే పంటల్ల ఇంకా రాబడి, గిగుబడి మాలాస తియ్యచ్చు. మనమంత కల్శి ఎవుసం జేద్దాం.

ఒకోళ్లకు ఒకోళ్లం ఆదెరువు అయిదాం. మనమంతా కల్శి ఈ సుట్టుపక్కల ఊర్రల్ల అందర్ని ఎవుసం దిక్కు మలుపుదాం. అట్ల ఊర్లే గాదు దేశం మొత్తం మనం యువతను మొత్తం ఎవుసం దిక్కు రంఢ్రి అని ఘన స్వాగతం జెప్పుదాం. రైతు బల్గం వెర్గుతే బలవంతులం అయితం. అప్పుడు రైతుల తర్వాయి ఎవలు రారు' అనుకుంట చిత్తారి అందట్ల ఎవుసం మీద పాయిరం నింపుతున్నడు. అక్కడికచ్చిన అందరు నిజమే గదా అని వాళ్లు ఎవుసం జెయ్యనీకి సిద్ధం అయితున్నరు. అక్కడ కూసున్న పెద్దమన్సులంతా ముర్శిపోతున్నరు. 'మన ఊరు ఇగ గొడ్డువోదు.. శివారు శిన్నవోదు' అని ఒకోళ్ల మొకాలు ఒకోళ్లు సూస్కుంట, అటు దుర్గయ్య విగ్రహంను జూస్కుంట ముర్శిపోతున్నరు. వాళ్ల పక్కపొంటే కూసున్న సాయిలు దుర్గయ్య విగ్రహం మీదికెల్లి సూపు దించుతలేడు. అట్లనే జూస్తున్నడు. ఆయాల్ల మంత్రి కొడుకు దుర్గయ్య మీద కారు ఎక్కిచ్చి సంపిన దృశ్యం ఆయిన కండ్లల్ల మెదలవట్టింది. 'కారు పయ్యకింద నేను వడేటోన్ని. అది జూశి నా పక్కకున్న దుర్గయ్య నన్ను ఈడ్శి గుంజిండు. నన్ను గడ్డకేశి వాడు పయ్య కింద వడ్డడ్డు. కారు గొరగొర శాన దూరం దుర్గయ్యను గుంజుకపోయింది. ఆ రైతు ఉద్యమానికి దుర్గడు రక్తం చిందిచ్చి జీవిడ్శిండు. ఎంత పని జేస్తివి బామ్మర్దీ..' అని మనసుల అనుకుంట దుర్గయ్య విగ్రహానికి రెండు చేతులెత్తి మొక్కిండు.

**హుమాయున్ సంఘీర్, స్వస్థలం : గోపాల్ పేట్ గ్రామం, నాగిరెడ్డిపేట్ మండలం, జిల్లా కామారెడ్డి. ప్రస్తుత నివాసం హైదరాబాద్. కొన్ని సినిమాలకు రచనా సహకారం అందించారు. దర్శకత్వ విభాగంలో పలు సినిమాలకు, సీరియళ్ళకు పనిచేశారు. షార్ట్ ఫిల్మ్స్ , వెబ్ సిరీస్ లలో (మూలుగుబొక్క, ఏం బతుకురా నీది, తంగేడుపూలు) నటించారు, దర్శకత్వం వహించాను. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖావారి 'కోలాటం' అనే డాక్యుమెంటరీ చేశారు. 'దొరసాని' సినిమాలో కామ్రేడ్ యాదగిరిగా నటించారు. రచయితగా, నటుడిగా, దర్శకుడిగా రాణిస్తున్నారు. కథలు సిద్ధం చేసుకున్నారు. పూర్తిస్థాయి సినిమా దర్శకుడిగా రాణించాలి అనేది సంఘీర్ కల. 2006లో ఆంధ్రభూమి పత్రికలో 'ఎటుపాయె' అనే కవిత ఫస్ట్ టైం అచ్చయింది. ఆ తర్వాత 2008లో మొదటి కథ 'శ్రేయోభిలాషి' చెన్నై నుంచి వచ్చే స్వప్న మాస పత్రికలో అచ్చయింది. ఇప్పటివరకు 35 కథలు రాశారు. (ఢిల్లీ శివారులో ఏడాది పాటు ఉద్యమం చేసి 700లకు పైగా ప్రాణాలు అర్పించి అమరులైన రైతులకు ఈ కథ అంకితం చేస్తున్నాను. – సంఘీర్)**



మ్యాకం రవికుమార్
ఫోన్: **94929 10065**

# బుడ్డశనగ

'మావ.. ఓ కొంరయ్య మావ' అంటూ పిల్సుకుంట ఆకిట్ల అడుగువెట్టింది లచ్చవ్వ. లోపలి నుంచే 'ఎవలూ' అని కేకేసింది బుచ్చవ్వ. ఎంబడే 'నేనే అత్త. లచ్చవ్వను' అని అనంగనే సాయబాన్ల తోముతున్న బోళ్లను పక్కనపడేసి 'నువ్వేనా కోడలా. మావ చేన్ల నుంచి వచ్చి ఇప్పుడే కల్లుబొొట్టుకని మండువకు వేయిండు' అని అనుకుంటనే బుచ్చవ్వ ముందటర్రలకు వచ్చింది. బుచ్చవ్వను చూడంగనే గలుమ దాటి లోపలికి వచ్చి 'మావ వచ్చేటాళ్లకు ఎంత సేపయితదత్తా' అంటూ అడిగింది లచ్చవ్వ. మూలకున్న పీటలు తను ఒకటి తనేసుకుని, మరొకటి లచ్చవ్వకిస్తూ 'ఎందుకు. ఏం పని' అంటూ అడిగింది బుచ్చవ్వ. 'ఏం లేదత్తా. వారం కిందే మావకు జెప్పిన. నాగళ్లు కట్టాల్నని. శెర్ల బుడ్డశెనగ ఏసేందుంది. మల్లో తేప

యాది జేద్దామనొచ్చిన' అంటూ లచ్చవ్వ అసలు ముచ్చట జెప్పింది. మళ్లీ ఏదో చెప్పవోతుండగనే అడ్డంపడి 'మావ ఏం మరచిపోలె. చేన్ల నుంచి వచ్చుడుతోనే జెప్పిండు. కొడుకు మహేందర్ గాన్ని సుత ఎటుపోవద్దన్నడు. మావ మాటంటే మాటే. వత్తా అన్నడంటే వత్తడు.' అంటూ బుచ్చవ్వ నమ్మకంగా బదులిచ్చింది. ఆ మాటలినంగనే లచ్చవ్వకు పాణం తిరిగచ్చింది. 'సరే అత్త. పొద్దున్నే ఇత్తునాలు దీస్కొని వత్తనన్నదని మావకు జెప్పు. మనవడు ఒక్కడే ఉన్నడు ఇంటికాడ. నేను పోతున్న' అంటూ లచ్చవ్వ లేవంగనే 'ఎప్పుడూ ఇట్లచ్చి అట్ల పోతవ్. రాజిగాడు ఏం జేత్తాండు.' అని అడిగింది బుచ్చవ్వ. ఆ మాటతో గట్టిగా నిట్టూర్చుతూ 'ఏనాడు ఏం పన్జేసిండు గనుక. ఉన్నంత కాలం అయ్యావ్వను గోసపుచ్చుకున్నడు. ఇప్పుడు నన్ను చంపుకుతింటాండు. అడ్డశారగం పన్జేయ్యడు. ఎప్పుడూ అరుగుల మీద కూసునుడు. అచ్చెటోన్ని.. పోయేటోన్ని బీడీలు అడుక్కుంట తాగుడు. యాల్లకు తినుడు. పండుడు. ఆడదాన్ని ఎంతగనం ఏగియ్యాలె. ఏనాడు జేసుకున్న పాపమో. నా గండాన దాపురించిండు' మొగుడు రాజయ్యను తిట్టుకుంటూ గుడ్ల నీళ్లు గుడ్లల్లే ఒత్తుకుంట 'సరే అత్త మావకైతే జెప్పు' అని మల్లోతేప చెప్పి ఇంటిబాట పట్టింది లచ్చవ్వ.

ఇంటికి చేరంగనే రాజయ్యకు, మనవడు రాజుకు అన్నం పెట్టింది. తనూ రెండు ముద్దలు తిని నడుం వాల్చింది. కళ్లు మూసుకున్నదే కని నిద్రవడ్తలేదు. మంచాలనే అటూ ఇటూ బొర్రుతాంది. మరోవైపు గుర్రు కొడుతున్న కొంరయ్యను చూడంగనే ఒక్కసారి పెయ్యిమీద తేళ్లు, జెర్రులు పాకినంత కంపరం పుట్టింది లచ్చవ్వకు కోపంగా 'నిరందిగా ఎట్ల నిద్ర వడుతున్నదో' అని లోలోపలే తిట్టుకుంట మొఖం పక్కకు తిప్పుకున్నది. మల్లా ఆలోచనల వడ్డది. 'నాది ఏం రాత.. ఏం జెట్ట బతుకు. అవ్వయ్యలకు ఒక్కగానొక్క బిడ్డనైతి. అరికాలుకు మట్టంటకుంట చేతుల మీదుగనే పెరిగితి. పెండ్లీడుకు రాంగనే భూమిజాగలు.. డబ్బుదస్కమున్నదని జూసి రాజయ్యకు ఇచ్చి పెండ్లి జేత్తే ఆ సంసారం మూణ్నాళ్ల ముచ్చటాయె. బతుకు అడివిల పడ్డట్టాయె. మొగుడు ఈసంకొత్త పన్జేయడాయె. ఊర్ల రాజకీయాలు చేసుకుంట.. పంచాయతీలు చెప్పుకుంట.. పత్తాలు ఆడుకుంట సాయితగాళ్లతోని గల్సి తిర్గమరిగిండు. బిడ్డ కమల పుట్టినంకా ఇంటిముచ్చట పట్టించుకోకపాయె. ఇంటికి పెద్దదిక్కులెక్క ఉన్నరనుకున్న అత్తమావా నడిమిట్లనే ఆగం జేసిపాయె. చేన్ల పాము కర్సి మామ, ఆ మనాదితో ఏడాది తిరగకముందే అత్తా నన్ను ఒక్కదాన్ని జేసి ఇడ్సిపాయె. అవ్వయ్య పోయినంకైనా మార్తడనుకుంటే మొగుడు పురంగ ఏగిడిశిపాయె. ఇదేందని నోరు మెదిపితే చాలు ఈపు మెదిపే. బిడ్డను జూసుకుంట బతుకుదామంటే అదీ నడమంత్రానే పాయె. పెండ్లి జేసిన ఏడాది తిర్గకముందే మొగపిలగాడాయెనని సంబురపడుతుంటేనే తెల్లకామిండ్ల

రోగం పాడుగాను ఏం దెల్వకుంటనే అల్లుడ్ని కొంటపాయె. బిడ్డన్న ఉన్నదనుకుంటే అదీ మొగుని మనాది పెట్టుకుని బాయిలవడి సచ్చె. కొడుకును, మమ్ముల ఎటుగానోళ్లను జేసె. ఏ జన్మల ఏ పాపం జేసుకున్ననో. నా నొస్ట ఈ రాత రాసిందు. ఇదేం చాకిరి. ఏనాడు తీర్తదో. నన్నెప్పుడు కొంటవోతడో ఆ దేవుడు' అని రందిపడుతూ కనుకొలుకుల్ల నుంచి జారుతున్న కన్నీళ్లను తుడుసుకున్నది. లచ్చవ్వ కండ్లల్ల కమల మొఖం కదలాడ్తంది. మనసంతా బిడ్డ జ్ఞాపకాలు కమ్ముకున్నయ్.

ఉన్నట్టుండి ఒక్కసారిగా లచ్చవ్వ ఆలోచనలు బుడ్డశెనగ మీదికి మళ్లినయ్. శెర్ల నాలుగెకరాల భూమి తప్ప అత్తమావ సంపాయించిన భూమి మొత్తం పదేండ్లు తిరగకముందే హారతికర్పూరం చేసె. అయినా ఓ బర్రెను కొని పాలను, ఇన్ని కోళ్లను పెంచి అమ్ముకుంటూ, ఇంటి చుట్టున్న నాలుగ్గుంటల జాగలనే ఇన్ని కూరగాయాలను పెట్టుకుని పొట్ట గడుపుతున్నా ఆ బుడ్డశెనగలే ఎయ్యకపోతే సంసారం రోడ్డున పడుతుండె. అదేమన్నా అల్కగయితందా. పంట శెనగలు ఇంటికి రాంగనే ఇత్తునం కోసం మంచి గింజలన్నీ ఏరి తీసి పెట్టి, మట్టిపెళ్ల లేకుంట, ఒక్క పుల్ల కనవడకుండా చెరిగి, ఇంత బూడిద కలిపి పురుగు పట్టకుంట అమాసకొకసారి ఎండవోసుకుంట కాపాడాలాయె. అదేమోగానీ శెర్ల నీళ్లు ఇంగుడు మొదలై కొద్దికొద్దిగా భూమి తేలుతుంటే, ఎప్పటికప్పుడు భూమిని పదునారక ముందే దున్నుతూ, సంక్రాంతికి పూతవచ్చేలా అదును చూసుకుని ఇత్తునమేయాలె. ఏమాత్రం అదును తప్పినా, పదునారిపోయినా ఆ ఏడాది గుండుసున్నేనాయె. అట్ల ఇగురం కొద్ది.. అన్ని ముందుగనే తయారుగా పెట్టుకుని, ఎంటబడి జేసుకుంటే తప్ప పంట పండదాయె. తిట్లకు బయపడి బల్మీటికి కల్లం కావాలి పోతడు గనీ ఒక్కచారగం చేయడాయె. ఒక్కదాన్ని ఎంతగనం జేసుడు. పోయినేడు అదును మీదేసినా పంట మంచిగ పండకపాయె. ఏటా 30 బత్తాలు వచ్చేకాడ 20 బత్తాలే వచ్చె. ఈ ఏడు ఎట్లుంటదో' అని గుబులు పట్టుకున్నది లచ్చవ్వకు. అట్లా అట్లా ఏవో ఏవో ఆలోచిస్తూ అదుమరాత్రి నిద్రలోకి జారుకుంది.

తెల్లారి కోడి కూతతోనే లేచింది లచ్చవ్వ. ఆకిలి జారగొట్టింది. బోళ్లు తొమి కూరబువ్వండుకు ఆదరాబాదరా ఇంతతిని సద్దిపెట్టుకుని, మనవన్ని ఎంబడేసుకుని కొంరయ్య ఇంటికి జేరింది. అప్పటికే కొడుకుతోని కల్సి ఎడ్లను నాగలికి కడతాండు కొంరయ్య. అది చూడంగనే లచ్చవ్వ మనసు నిమ్మలమైంది. 'మావ మేం శెర్లకు నడుత్తానం' అంటూ చెప్పి ముందుకు కదలింది లచ్చవ్వ. శెరువుకట్టపైకి జేరింది. కట్టమైసమ్మకు మొక్కి భూమివైపు నడిచింది లచ్చవ్వ. అంత నల్లరేగడి. కాళ్లకు

అతుకుతంటే 'ఇంకా పదునారలె బాంచెన్' అని మనసులోనే అనుకున్నది. లచ్చవ్వ ఎనకనే కొంరయ్య అక్కడికి జేరిండు. ఎంబడి దెచ్చుకున్న కొబ్బరికాయ దీసింది లచ్చవ్వ. చేతుల పట్కోని మంచిగ మొక్కి నాగాలి మీద కొట్టి పక్కకు జరిగింది. కొంరయ్య నాగలి పట్టుకుని ముందుకు కదలగా, ఎన్కనే గింజలు ఏసుకుంట సాలువట్టి సాగింది. వారం రోజుల్లోనే ఇత్తునమేసుడైపోయింది. సంక్రాతి రానే వచ్చింది. శెనగ మస్తు పూతకచ్చింది. గొడ్డుగోదా పడి మేయకుండా పెండ్లా బల్మీటికి రాజయ్య రోజూ కావాలివోతుండు. జూత్తంటనే పంట చేతికచ్చింది. రెండు రోజులు నాలుగురు కూలోళ్లలను దీస్కపోయి శెనగ పీక్కచ్చింది. ఊరవతల పెద్ద బండపైన కల్లంల ఏసింది. బంతి కొట్టించింది. తూర్పార పట్టింది. కుప్ప జేసిన శెనగలను జూసి లచ్చవ్వ మనసు నిండిపోయింది. బత్తాలు నింపేటాళ్లకు ఏటా వచ్చినట్లు కాకుండా ఈసారి 10 బత్తాలు ఎక్కువ పండినయ్. లోలోపల సంబురమైతున్నా బైటికి మాత్రం ఎప్పటితీర్గనే మొఖం పెట్టుకుని ఉన్నది లచ్చవ్వ. ఇగ నాగళ్లు కట్టినందుకు, బంతికొట్టినందుకు కొంరయ్యకు, వచ్చిన కూలోళ్లకు కల్లంలనే శెనగలు కొలిసిచ్చింది. బత్తాలను ఇంటికి దెచ్చుకున్నది. లచ్చవ్వకు మనసు నిమ్మలమైంది.

మొగుడు రాజయ్యను పైసలు ఏడ కమాయిస్తడోనని నమ్మక రెండు రోజుల తరువాత ఎప్పటితీర్గనే పది బత్తాలను ఉంచుకుని, మిగతా శెనగబత్తాలను తనే మార్కెట్టుకు దీస్కపోయింది. లచ్చవ్వ అదృష్టం మంచిగున్నది. పోయినేడుకన్నా ఈ సారి ధర ఎక్కువే పలికింది. 40వేల దాన్క వచ్చినయ్. ఎంబటే ఇంటిముందు సుబ్బయ్య యాదికచ్చిండు. తన పెండ్లిగాక ముందు అత్తమావలు కట్టిన ఇళ్లు. పరాటంతా చీకిపోయి, పెంకులన్నీ ఇరిగిపోయినయ్. వానపడితే చాలు మొత్తం ఉర్సుడే. అయినా ఏ ఏడుకాయేడు ఎల్లదీస్కుంట వచ్చింది. కానీ పోయినేడు వానాకాలంల ఇంటిపైకప్పు మొత్తం కూలిపోయింది. నెలరోజుల పాటు బర్రె కొట్టంల తలదాల్చుకున్నరు. వానకాలం ఎల్లినంక కాళ్లా వేళ్ల పడి సుబయ్య దగ్గర 25వేల అప్పు దీస్కచ్చింది. పాలమ్మి, కోళ్లమ్మి కూడబెట్టిన పైసలు కలిపి మంచిగ రేకులు ఏసుకున్నది. ఇళ్లు మంచిగయింది. కాలం కలిసివచ్చింది. ఇప్పుడు పంట నిరుటికన్నా ఎక్కువే పండింది. సుబ్బన్న బాకి తీరిపోతదని లోలోపల సంబురపడుకుంట.. మనసులనే కోటి దేవుళ్లకు మొక్కుకుంట ఇంటికచ్చింది. పైసలన్నీ బట్టల చుట్టి సందుగడుగున పెట్టింది. సంబురంగా మొగునికి ముచ్చట జెప్పింది. కోటంచ నర్సింహసామికి కోడ్ని కోద్దామన్నది. ఎంబడే 'ఎప్పుడేదగిడినా ఎన్కకు దీయకుంట సాయం జేత్తడు. కొంరయ్య మావను కూడా సాయంత్రం ఈడికే తినేతందుకు రమ్మంట.' అని అనంగనే సరేనన్నడు రాజయ్య. అంతే 'తెల్లకల్లు పట్టుకురాపో'అంటూ పైసలిచ్చి రాజయ్యను

మండువకు తోలింది. బడి నుంచి అప్పుడే వచ్చిన మనవడ్ని సంబురంగా నిమిరి 'ఏటూ తిరగపోకు. నేను అచ్చెదాన్క ఇంట్లనే ఉండు. కొంరయ్య తాత దగ్గరికి పోయివత్త' అని చెప్పి బైటికి నడిచింది లచ్చవ్వ.

కొంరయ్య దగ్గరికి పోయి ఇంటికి వచ్చేటాళ్లకు తలుపులన్నీ తెర్లవెట్టి ఉన్నయ్. మనవడేమో లేడు. ఆదరాబదరాగా సందుగ దగ్గరికి వోయింది. తెరిచి చూసింది. ఒక్కసారి కాళ్ల కింది భూమి కంపించినట్లయింది. పైసల కనవడకపోవడంతో గుండెగిపోయినంత పనైంది. ఆగమాగమైతంది. సందుగులన్న బట్టలన్నీ కిందపడేసి దేవులాడింది. దుఃఖం పొంగుకత్తంది. ఇల్లంత, మూలమూల జూసింది. ఎక్కడ ఏం కనవడపోయేటాళ్లకు గుండెలు బాదుకుంటూ వచ్చి గలుమల కూసోని కంటికి మంటికి ధారగా ఏడుత్తంది. లచ్చవ్వ పెడుతున్న శోకాలు ఊరవతలికి ఇనవడుతున్నయ్. అమ్మమ్మ ఏడుపిని ఎక్కన్నోంచో పరుగుపరుగునా ఉరికచ్చిండు. మనవడ్ని జూసుడు జూసుడే ఒక్క ఉదుటున లేచి మీదపడింది. 'ఇంట్లనే ఉండుమన్న గదా. ఏడవోయినవ్. ఎవలచ్చిన్రు. పైసలెవత్తుకుపోయిన్రు. నీ తాడు తెంప. నా గండాన కని పారేసింది' అని ఇయ్యరమయ్యర కొడుతూ దుఃఖాన్ని వెల్లదీస్తున్నది లచ్చవ్వ. అప్పటికే అక్కడున్న ఇంటెనుక ఈరమ్మ 'పోరన్ని కొట్టిసంపుతవ ఏంది' అంటూ రాజును పక్కగిగ్గిపడేసింది. 'పిలగా ఇంటికాడ ఉండక ఏడ తిర్గవోయినవ్' అంటూ కోపం జేసుకుంటూ వెళ్లి లచ్చవ్వను గుండెలకు అదిమిపట్టుకుంది. 'ఊకో బిడ్డా. ఈ పన్జేసింది బైటోళ్లు ఎవలు కాదు బిడ్డ. తెల్సినోళ్లే ఈ పని జేసిండ్లు. అందరిండ్లు వదిలి నీ ఇంట్లకే వచ్చి పైసలెట్ల ఎత్కపోతరు. నీ ఇంట్ల పైసలున్నయని ఈ వాడోనికి, ఈ సుట్టుపక్కల ఉన్నోనికి దప్ప ఎవనికి దెల్సు. నీ రెక్కల కట్టం దీస్కున్న ఆని చేతులకు జెట్టలుపుట్ట. ఆ పైసలతోని వాడేం పెద్దగయితడు'. ఆంటూ శాపనార్థలు పెట్టింది. 'దుబ్బబుక్కి, ఉప్పిడుపాసముండి, నిద్ర చంపుకుని. రెక్కలు ముక్కలు జేసుకుని సంపాయించుకున్న పైసలు. ఏడ వోవు. ఏం కాదు బిడ్డ' అంటూ లచ్చవ్వకు ధైర్యం చెప్పింది. ఎంబడే 'పంబాల రామయ్యతోని మంత్రబియ్యం పెట్టిద్దాం. పైసలవే బయటపడ్తయ్' అంటూ నమ్మకంగా జెప్పింది ఈరమ్మ. అక్కడున్నందరూ ఈరమ్మకు వంతపాడిన్రు. పైసలు దొర్కతయనే ఆశతో లచ్చవ్వ సుత 'సరే' అన్నది. 'అయితే నువ్ ఊర్ల చాటింపు చేయించు. నేను రామయ్యకు ముచ్చట జెప్పి వత్త' అంటూ ఈరమ్మ పోయింది. ఆ తర్వాత ఎక్కడోళ్లు అక్కడ పోయినంక మెల్లగా లేచింది. కంటికి రెండుధారలు కారంగా, బిక్కుబిక్కుమంటూ దూరంగా కూర్చున్న మనవని దగ్గరికిపోయి నెత్తిమీద చెయ్యేసి నిమిరింది లచ్చవ్వ. 'సపాయి సారయ్యను దీస్కరాపో' అని అమ్మమ్మ చెప్పంగనే మారుమాట్లడకుండ లేచి ఉరికిండు రాజు. అట్ల పోయి ఇట్ల ఎంబడి వెట్టుకుని

దీస్కచ్చిండు. ఏం జేయ్యాల్నో జెప్పి సారయ్య చేతుల 50 రూపాయలు పెట్టింది లచ్చవ్వ. సరే అంటూ ఇంటికి పోయి డప్పు పట్టుకుని వచ్చిండు. వాడకట్టు మొదలు నుంచి చివరి వరకు డప్పుకొట్టుకుంటూ 'లచ్చవ్వ ఇంట్ల పైసలు పోయినయ్. రేప్పొద్దున మంత్రబియ్యం పెట్టిపిత్తాంది. వాడకట్టులున్న చిన్న, పెద్దా అందరూ రేప్పొద్దున లచ్చవ్వ ఇంటికాడికి రావాల్నహో' అని చాటింపు జేసి పోయిండు. లచ్చవ్వ ఏం తినకుంటనే మంచాల ఒరిగింది. కంటికి ధారలు పోతూనే ఉన్నయ్. పైసలున్నయని ఎవలకు దెల్సు? ఎవలు దీసుంటరు? గంటలనే ఎట్ల మాయం జేసిండ్లు.? అని ఒకసారి ప్రశ్నలు వేసుకుని ఆలోచించినా జవాబు దొర్కలె. మొగుడు రాజయ్యను అనుమానించినా 'ఈయన పొద్దున్నే ఎవలిదో పంచాయతీ ఉన్నదని పర్కాల పాయె. ఇప్పుడే వచ్చె.' అని తనే కాదని నిర్ధారించుకున్నది. తికమక , పైసలు దొర్కుతయా? దొర్కయా? దొర్కపోతే ఎట్ల? సుబ్బన్న బాకీ ఎట్ల కట్టాలె. మాటవోతది. మల్లచ్చేటికి ఇద్దామన్న మిత్తి ఎంత గావాలె? అని తనకు తనే ప్రశ్నలు వేసుకుంటున్నది లచ్చవ్వ. మనసంతా వే ఎడతెగని ఆలోచనలు. కంటిమీద రెప్పమూయకుండ అట్లనే తెల్లవార్లు ఆలోచించుకుంట కూసున్నది.

ఏడ్చి ఏడ్చి ముఖం గుంజుకుపోయింది. నిద్రలేక కండ్లు ఎర్రవడ్డయ్. పొద్దున తొమ్మిది గంటలకు పంబాల రామయ్యను ఎంబడేసుకుని వస్తున్న ఈరమ్మను చూడంగనే లచ్చవ్వకు పాణం లేచివచ్చింది. అప్పటికే వాడకట్టోళ్లు కూడా శానా మంది వచ్చి కూసున్నరు ఆడ. ఈరమ్మ, రామయ్య ఇంట్లకు పోయిన్రు. లచ్చవ్వను అడిగి జరిగిన విషయం తెల్సుకున్నడు పంబాల రామయ్య. అంతా విన్నతరువాత 'ఒక కుంచెడు బియ్యం, అట్లనే దేవుని పోట్వ, పీట, పసుపు, కొంచెం నూనె, ఒక పల్లెం, దీపం చెమ్మ దీస్కర తల్లి' అంటూ లచ్చవ్వకు చెప్పిండు. అడిగినయన్ని దీస్కచ్చి లచ్చవ్వ పెట్టంగనే రామయ్య తన పనిల వడ్డడు. గోడకు పీటేసి దేవుని పోట్వ నిలబెట్టి, దీపం ముట్టించిండు. కుంచంలోంచి పల్లెం నిండా బియ్యం దీస్కున్నడు. పసుపు, నూనె కలిపిండు. అరగంటపాటు ఏవో మంత్రాలు చదువుతూ పూజలు జేసి పల్లెం దీస్కుని ఇంట్ల నుంచి బయటకువచ్చిండు రామయ్య. ఇంటోళ్లందరినీ బయటకు రమ్మడు. ఎదురు దర్వాజా తలుపులు మూసి, పక్క దర్వాజ తలుపులు మాత్రమే తెరచిపెట్టమన్నడు. రామయ్య చెప్పినట్టుగనే చేసింది లచ్చవ్వ. తర్వాత వాడకట్టోళ్లందరినీదగ్గరికి పిల్సుకుని ' ఇంటి తలుపులన్నీ పెట్టి ఉన్నయ్. లోపలున్న మనిషి ఎవలికీ కనిపించడు. ఒక్కొక్కలు వచ్చి మంత్రించిన ఈ పసుపు బియ్యం దీస్కోండి. ఆ ఇంట్లకు పోయి దేవుని పటం ముందు వేయండి. ఇక్కడ ఒక్క మాట. లచ్చవ్వ పైసలు ఎవలు దీసిండ్లో మీ అంతట మీరే మంచిగ ఆడ కుంచంల ఉన్న

బియ్యంల పెట్టుండ్రి. లేకుంటే రగతం కక్కుకుని సత్తరు. పాపం ఏడేడు తరాలకు గొడ్డది. మీ గొడ్లు, గోదా సత్తయి. ఆడ మీరు పైసలు పెట్టిండ్లనే సంగతి ఎవలికీ దెల్వదు. ఆ తరువాత మీ ఇష్టం' అంటూ అందరినీ మాటలతోనే హడలగొట్టుకుంటూ ఒక్కొక్కరినీ పిలుచుకుంటూ బియ్యం పెడుతూ ఇంట్లోకి పంపుతున్నడు. మధ్యాహ్నం రెండు గంటల వరకు వాడల ఉన్నోళ్లందరూ వచ్చిపోయిండ్లు. తలుపులు దీస్కొని రామయ్యతోపాటు లచ్చవ్వ, రాజయ్య, ఈరమ్మ అందరూ ఇంట్లకు పోయిండ్లు. రాజయ్యవైపు చూస్తూ కుంచంల ఉన్న బియ్యం కింద పోయమన్నడు రామయ్య. నిదానంగా కుంచం పైకెత్తి చిన్న ధారగా బియ్యం పోస్తున్నడు రాజయ్య. కుంచంల నుంచి వస్తున్న బియ్యం ధారనే కన్నార్పకుండా చూస్తున్నరు అందరూ. లచ్చవ్వ గుండె వేగంగా కొట్టుకుంటున్నది. 'పైసలు దొర్కుతయ? దొర్కయ' ఇదే ఆదుర్ద. ఒక్కసారిగా నాలుగు నోట్ల కట్టలు కిందపడ్డయ్. అందరిలో సంతోషం. సంబురంతో లచ్చవ్వ నోట మాట రావడం లేదు. కండ్లపొంటి నీళ్లు పొంగుకస్తున్నయ్. నోట్ల కట్టలను చేతులకు దీస్కొని వాటినే చూస్తూ నోట మాట రాక అట్లనే చూసున్నది.

**మ్యాకం రవికుమార్ స్వగ్రామం కరీంనగర్ జిల్లా జమ్మికుంట. కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి 'మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్' చేశారు. వృత్తిరీత్యా పాత్రికేయులు. ప్రవృత్తిరీత్యా కథకులు. 2013 నుంచి కథలు రాయడం ప్రారంభించారు. మొదటి కథ 'బలిదానం' తెలుగు వెలుగు మాసపత్రికలో ప్రచురితమైంది. ఇప్పటివరకు 18 కథలు రాశారు. 'ఎదురు చూపులు', 'జిట్టపులి', 'కంటెగోడ', 'గొల్ల మల్లన్న', 'యాపచెట్టు', 'సుక్కబర్రె' కథలు పాఠకుల ప్రశంసలు అందుకున్నాయి. 11 కథలు వివిధ ప్రముఖ దిన, మాస పత్రికల్లో అచ్చయ్యాయి. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ కథలన్నీ.. మట్టి మనుషుల యథార్థ జీవితాలను కండ్లకు కడుతాయి. సాహిత్య సేవలో భాగంగా 2014లో నోముల సాహిత్య పురస్కారం అందుకున్నారు. నమస్తే తెలంగాణ–ముల్కనూర్ ప్రజా గ్రంథాలయం కథల పోటీల్లో.. 2019లో 'సుక్కబర్రె', 2021లో 'బుడ్డ శెనగ' కథలకు బహుమతులు దక్కించుకున్నారు.**

# ఆప్తుడు



కటుకోజ్వల మనోహరాచారి

వేగంగా వస్తున్న కారుకు అడ్డుగా నిలబడి చేయూపుతున్నాడు ఓ వ్యక్తి ఆపండన్నట్టు. నేను కారు స్లోచేసి ఏమిటన్నట్టు చూశాను. నడివయసు వ్యక్తి అతడు. వ్యవసాయదారునిలా ఉన్నాడు. నేను కారు ఆపగానే నావైపుకొచ్చి జర గా గోపాలావుప్యాట దాక గీ ముసలోన్ని తీస్కపోవాలె సారు! గాడ సర్కార్ దవకాన కాడ దించిపోతె సాలు... అన్నాడు రోడ్డుపక్కన ఉన్న కూలబడి ఉన్న వృద్ధునివైపు చూపుతూ.

నేను అతన్నే చూస్తూ ఏ.. బస్సుల్లేవా? నా కార్లనే ఎందుకు ఎక్కించుకోవాలి? అన్నాను. ఈ మధ్యన ప్రతొక్కడికీ కార్లను ఆపి లిఫ్టు అడగడం ఫ్యాషనైపోయింది అనుకుంటూ.

గా బస్సోడే గీడ దించిపోయిండు సారు. పైసల్ తక్కువున్నయని దిగుమని ఆగం బట్టించిండ్రట. కాల్జారి కిందవడ్డడు. కాలు కదిలిత్తలేడు. ఇరిగిందో పాడో..! గీనె కెవ్వలు లేనట్టున్నరు సారు. పాపం గా సర్కారు దవకాన దాక తీస్కపోతే.. గాళ్లు ఏదన్న జేత్తరు.. అతను టకటకా చెప్పుకుపోతున్నడు.

రోడ్డుపక్కన వాలిపోయినట్టుగా పడిఉన్న వృద్ధునివైపు చూశాను. తలతిప్పుకోబోతూ మళ్లీ ఆ వృద్ధునివైపు తిరిగి చూశాను. అరవై ఏండ్లు పైబడి ఉంటాడు. జీవితంలో

చాలా ఒడిదొడుకులు చవిచూసిన వ్యక్తిలా శరీరం శుష్కించి కని పిస్తున్నాడు. ఆదరించేవారు లేని అసహాయుడిలా, లేచి నిలువలేని స్థితిలో అల్లాడి పోతున్నాడు. నా మనసు పొరల్లో ఎక్కడో ఏదో కదలినట్లైంది. వృద్ధున్ని తేరిపార చూసిన నేను కారుదిగాను. ఏం పేరు ఈయనది..? అతనివైపు నడుస్తూ అన్నాను. తెల్వది సార్.. అన్నాడు. ఈ లోపు వృద్ధుడు ఏదో గొణిగాడు. కాని సరిగా అర్థంకాలేదు. నేను దగ్గరగా వెళ్లి పెద్దాయనా..! ఏం పేరు నీది..? అన్నాను గట్టిగా.

ఆతను బాధను పంటిబిగువున భరిస్తున్నట్టు ఇబ్బంది పడుతూ .. వెం.. వెం..కట..రాములు.. అన్నాడు. ఎక్కడుంటారు? మీ వాళ్ల అడ్రసేమైనా చెబుతారా... అతను అసహాయంగా తల వెనక్కివాల్చాడు. తొంటి యెముక బాధిస్తున్నట్టు విలవిల్లాడిపోయాడు. ఏ ఊరోగనీ బతికిసెడిన మనిసి లెక్కనే ఉన్నడు. గీనెకు ఎవలు లేనట్టున్నరు సారూ అన్నాడు ఆ వ్యక్తి. నేను మరో ఆలోచన చేయలేదు. ఏదైతేనేమి? ఎక్కించు అన్నాను. గా దవకాన్ల జైన్ చేసినంక ఆళ్ల మనుసులు ఎవలన్న ఉన్నరేమొ ఆరాతీస్తా సారు. పదండ్రి.. అంటూ పక్కనే ఉన్న మరో వ్యక్తిని పిలిచి ఇద్దరూ అతని భుజాలు పట్టి లేపారు. ప్రాణాలు పోయినట్టుగా అల్లాడిపోయాడు. నేనూ సాయంపట్టి చాలా కష్టంగా కారు వెనుకసీట్లోకి చేర్చాం.

అతడి పేరు సాంబుడని నిర్ధారించుకొన్నాక ముందుకొచ్చి కూర్చో సాంబన్నా! అన్నాను. అతను కూర్చోగానే కారు కదిలింది. గ్రామీణరోడ్డు కావడంతో తారురోడ్డైనా గతుకుల మయంగా ఉంది. మధ్యమధ్యలో వెనక్కి తిరిగి చూసుకుంటూ నిదానంగా పోనిచ్చాను కారును. మీరు దేవునోలె వచ్చిండ్రు సారూ! లేకపోతె గీ ముసలోన్ని ఎవలు పట్టించుకునెటోళ్లు కాదు. మా లింగడు కూడ రమ్మంటె రాకపాయె.. సాంబుడు దారెంట మాట్లాడుతునే ఉన్నాడు. ఈయన వివరాలేవీ నిజంగానే తెలియదా సాంబన్నా..?

లేదు సారూ! ఈనెది గా పెగడపెల్లి అని ఎవలో సెప్పింండ్రు. జెర పదిమందికి తెల్సిన మనిసి అయ్యుంటడు. తెల్పు కునుడు కష్టమేం గాదు. మధ్యమధ్యలో పెద్దాయనకు ధైర్యం చెబుతూ ముందుకు సాగుతుంటే గోపాల్రావుపేట వచ్చింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రోడ్డు పక్కనే ఉంది. కారు అది దాటి వెళ్తుంటే సాంబుడు అరిచాడు అగో.. గదే గదే సారూ... దవకాన. ఆపుండ్రి..

నేను కారును ఆపకుండానే నీకేం పనిలేకపోతే సాంబన్నా! ఈపూట నువ్వు నాతోనే ఉండు. ఈ పెద్దాయన్ను కరీంనగర్ ఆస్పత్రిలో చూపిద్దాం.. అన్నాను నిదానంగా. సాంబుడు కంగారు పడ్డాడు. అయ్యో సారూ! నాకాడ పైసల్లేవు. గంత దూరమచ్చి నేనేం జేయాలె? అయినా మీకెందుకు లొల్లి. గాలికోయె కంప! గీ ఆసుపత్రిలేత్తె పాయె! అన్నాడు. తొందరపడకు సాంబన్నా! ఎట్లాగూ ఓ మంచిపనికి దిగినవ్. పూర్తిగా చేస్తేనేకదా ఫలితం

ఉండేది. పాపం పెద్దా యనకు ఎవరున్నారో లేదో అంటున్నావ్, నువ్వే పెద్దకొడుకనుకో! అన్నాను అతని మనసు మార్చే ప్రయత్నం చేస్తూ. ఏం పెద్దకొడుకో ఏమో! నాకాడైతే పైసల్లేవు. అన్నాడు రెట్టిస్తూ. పైసలెందుకు సాంబన్నా! నేనున్నాగదా! నువ్వు నాతో ఉండు చాలు అంటూ రోడ్డు బాగా ఉండడంతో స్పీడు పెంచాను. పైసల విషయం ఎత్తకపోయేసరికి సాంబుడు కూడా సైలెంటు అయిపోయిండు. నలబై నిముషాలకు కరీంనగర్‌లోని లక్ష్మణ్ ఆర్థోపెడిక్ సెంటర్‌లో అడ్మిట్ చేశాము. డాక్టర్ ఆపరేషన్ థియేటర్‌లో ఉండడంతో రెండుగంటలు నిరీక్షించాల్సి వచ్చింది. అప్పటికే చీకటి పడుతుండడంతో సాంబుడు ఏం చేద్దాం సార్..? అన్నాడు నిరాశగా. అతనికి ఎప్పుడెప్పుడు ఆ బాధ్యత నుండి విముక్తుడైతే బాగుండు అన్నట్టుంది.

అతని స్థితిని అర్థం చేసుకున్నాను. వాళ్లూరికి బస్సులో వెళ్లడానికి గంట పడుతుంది. సాంబన్నా! నా ఫోన్‌నంబర్ తీసుకొని నువ్వెళ్లిపో! నేను ఏరాత్రి వరకైనా పెద్దాయనకు ఎక్సరే తీయించి, అవసరమైన చికిత్స చేయిస్తాను. నువ్వు ఎట్లాగైనా వాళ్ల కుటుంబ సభ్యులు ఎక్కడుంటారో కనుక్కొని వాళ్లకు తెలియజేసి, నాకూ ఫోన్‌చేయి అన్నాను. సాంబుని మొహంలో భారం తొలగిపోయిన భావన కనిపించింది. గట్లనే సారు. నేను ఎట్లనన్న రేపు మాపటేల వరకు గీయన కుటుంబం గురించి తెల్సుకొని ఆళ్లకు, మీకు తెలియజెప్పుత.. మరి నే బోయత్త..

నేను అతని జేబులో ఐదొందల నోటు ఉంచాను. అయ్యో... ఎందుకు సారూ గిన్ని పైసలు? మా ఊరికి బస్కిరాయి యాబై రూపాయలే అన్నాడు. ఉండనీ సాంబన్నా.. బతుకు జీవుడా అంటూ బయటపడ్డాడు సాంబుడు. సాయంత్రం బస్సుకు వాళ్లూరు వెళ్లిపోయాడు. నేను జ్యోతిర్మయికి ఫోన్‌చేసి విషయమంతా వివరించాను.

రెండుగంటల తర్వాత డాక్టర్ వచ్చాడు. నిదానంగా పరీక్షించాడు. ఎక్సరే రిపోర్టు వచ్చింది. కుడివైపు తొడభాగం నుండి తొంటి వరకు పగులు ఏర్పడింది. యాబై రోజులు కదలకుండా పడుకోబెట్టాల్సిందే నన్నాడు డాక్టర్. పాదం నుండి తొంటి వరకు పిఓపి కట్టు కట్టారు. నెలరోజులపాటు వాడాల్సిన మందులు గట్రా రాసిచ్చారు. అన్నీ పూర్తయ్యే సరికి రాత్రి పది గంటలైంది. అప్పటి వరకూ అలసిన శరీరం బెడ్‌మీద ప్రశాంతంగా నిద్రపోతోంది. తెల్లవారితే గాని ఆయన కుటుంబ వివరాలు తెలిసేలా లేవు. సాంబుడు ఏదైనా సమాచారం ఇవ్వొచ్చు. అప్పటివరకూ ఎలా?? పళ్లరసం ఆహారంగా ఇచ్చి, ఆరాత్రికి నేను ఆయనతోనే ఉండిపోవడానికి సిద్ధపడ్డాను.

* * *

ఆఫీసుకు సెలవుపెట్టి తెల్లవారి మధ్యాహ్నం వరకూ వెంకట్రాములుతోనే ఉండిపోయాను. ఈలోపు ఆయన ఏదైనా మాట్లాడతాడేమోనని చూశాను. కానీ ఇంకా నీరసంగానే

ఉండడంతో ఏమీ మాట్లాడలేకపోయాడు. అయినా ఒకటి రెండు ప్రశ్నలు వేసి చూశాను. కానీ అశక్తత వల్లనేమో.. కళ్లనీరు కార్చుతూ పైకి చూస్తూ ఉండిపోయాడు. నేను జాలిగా చూస్తూ ఉండడం తప్ప ఏమీ చేయలేకపోయాను. కొంచెం ఒత్తిడి చేసి పాలు, బ్రెడ్డు మాత్రం తినిపించగలిగాను. ఒంటిగంట సమయంలో సాంబుడు ఫోన్‌చేశాడు. ఎంకట్రాములు గురించి వివరాలు తెల్సుకున్న సారూ! గాయినది మా పక్కూరు పెగడపెల్లే. గిప్పుడు నేను గాయిన ఇంటికాన్నే ఉన్న. అన్నాడు.

నాలో ఆనందం పొంగింది. చెప్పు సాంబన్నా! ఇంట్లో ఎవరున్నారు? ఒవలూ లేరు సారూ! తాళం ఏసుంది. పక్కోళ్లను విచారించిన. గాయిన భార్య ఏడెనిమిదేండ్ల కిందనే కాలం జేసిందట. ఉన్న ఒక్క కొడుకూ యాన్నో దూరదేశాన పెద్దనౌకరే సేత్తుండటగని గీనెను పట్టించుకోడట. లగ్గమైనసంది గంతేనటా! గప్పట్ల ఒకట్రెండు సార్ల ఒచ్చి పోయిండట సారూ! గీ నాలుగైదేండ్ల సంది గిటుమొకాన అత్తలేడట. గిప్పుడు గా ఎంకట్రాములు ఒక్కడే కాలం ఎలదీత్తుండట...

నా మనసు మళ్లీ మౌనంగా మూల్గింది. కొడుకు ఎక్కడుంటాడో సరిగ్గా తెల్సుకోలేక పోయావా? లేదు సారు. పదిరువై మందిని అడిగిన. ఎవలకు తెల్వదట. నేను వెంకట్రాములు వైపు దీనంగా చూస్తుండిపోయాను. భార్య లేదు. కొడుకు ఉన్నా తండ్రి బాగోగులు విస్మరించి తనదారి చూసుకున్నాడు. వృద్ధాప్యం! తొంటి వరకు బ్యాండేజితో దాదాపు రెండునెల్ల వరకూ కదలలేని పరిస్థితి. ఏం చేసేది??

జ్యోతిర్మయికి ఫోన్‌చేసి విషయమంతా వివరించి ఆమె వచ్చేవరకూ ఆలోచిస్తూ ఉండిపోయాను. రెండు గంటల సమయంలో జ్యోతిర్మయి క్యారేజ్ తీసుకొని వచ్చింది. ఇద్దరం కలిసి ముందుగా వెంకట్రాములుకు కాస్త ధైర్యం చెప్పి భోజనం చేయించాం. అప్పటికి ఆయనలో కొంత మార్పు కనిపించింది. పరిసరాల మీద అవగాహన కల్గింది. అప్పుడు మాట్లాడాడు. బాబూ! ఎవరోగానీ దేవుడోలె చూసుకున్నావ్.. ఖర్చుగూడా బాగానే అయినట్టుంది. నాకు తీర్చే స్తోమత లేదు బాబూ! మా పల్లెలో నాకో పాతిల్లు తప్ప ఇంకేమీ లేదు. ఎట్లన్నా నన్ను మా ఇంటిదగ్గర పడేయి బిడ్డా. నీ బాకీలో ఉండిపోవుడు తప్ప ఇంకేం చేయలేను.. అన్నాడు కాస్త ఓపిక తెచ్చుకుంటూ.

మీ కొడుకు ఇప్పుడు ఎక్కడుంటున్నారో చెప్పగలరా... అన్నాను ఆతృతగా. ఆయనేమీ మాట్లాడలేదు. పైకి శూన్యంలోకి చూస్తుండి పోయాడు. మీ కొడుకు గురించి చెప్పండి.. నేను రెట్టించాను. ఆయన్నుండి మౌనమే సమాధానమైంది తప్ప ఎలాంటి జవాబు రాలేదు. కళ్లనుండి మాత్రం సన్నటి నీటి దార కనిపించింది. ఆయన్ను ఇబ్బంది పెట్టడం సరైంది కాదని అర్థమైంది. అప్పటికే జ్యోతిర్మయితో చర్చించి ఓ నిర్ణయానికొచ్చిన నేను ఆయనకు దగ్గరగా కూర్చొని స్థిరంగా అన్నాను. మీరేమీ అనుకోకపోతే... మిమ్మల్ని మా

ఇంటికి తీసుకెల్దా మనుకుంటున్నాను.

వెంకట్రాములు విస్తుబోయి చూశాడు. నేనెవల్ని బాబూ? మీఇంటికి తీసుకపోయేంత గొప్పోన్ని కాదు. ఉద్యోగం సద్యోగం లేక కాలం వెళ్లదీసినవాన్ని. నా భార్య లోకం విడిసిపెట్టి పోయింది. తనతోపాటే కాలు బయటపెట్టిన నా కొడుకే నన్ను పట్టించుకున్న పాపాన పోలేదు. నన్ను భరించడంవల్ల మీకేం వస్తుంది బిడ్డా? ఇప్పటికే మీ బాకీలో పడిపోయిన. నా ఇంటిదాకా తీసుకెళ్లి పడేస్తే ఎట్లో వెళ్లదీస్తా..బతికుంటే నీ రుణంకూడా తీర్చుకునేందుకు ప్రయత్నిస్తా అన్నాడు రెండుచేతులెత్తి మొక్కుతూ. ఆయన ఎత్తిన చేతుల్ని వారిస్తూ లేదండీ! మేం ఆలోచించే నిర్ణయం తీసుకున్నాం. తోడు లేకుండా మీరు ఈ రెన్నెళ్లపాటు ఉండలేరు. కదలలేరు. కదిల్తే పగిలిన భాగం అతకదు. శాశ్వతంగా లేవలేకపోతారు. కనుక మా ఇంటికి తీసుకపోదామంటున్నాం.. అంది జ్యోతిర్మయి. ఆయన తల విధిలించాడు. అయినా సరే బిడ్డా! నేనెవర్నని మీకు భారం కావడానికి? వయసు మళ్లినోన్ని. ఎట్లో అవుతది. నా ఇంటిదాకా చేర్చండి చాలు. అన్నాడు మళ్లీ చేతులెత్తుతూ.

మీరిట్లా మాటిమాటికీ చేతులెత్తడం మానండి. ఇప్పటికి నేనూ మీ కొడుకునే అనుకోండి.. అంటూ ఆయన రెండు చేతుల్నీ కిందికి దించాను. వ్యక్తం చేయలేని భావోద్వేగంతో లేవబోయాడు వెంకట్రాములు. కానీ అశక్తుడయ్యాడు. పక్కనే ఉన్న జ్యోతి వారించింది.

అప్పటికే హాస్పిటల్‌వాళ్లు ఫార్మాలిటీస్‌అన్నీ పూర్తిచేసి బిల్లు సిద్ధం చేశారు. నేను అటువైపు నడిచాను. కావాల్సిన మందులు, అవసరమైన సామగ్రి కొనుగోలు చేసి బిల్లు చెల్లించాను. ఈలోపు ఆసుపత్రి సిబ్బంది సాయంపట్టి వెంకట్రాముల్ని అంబులెన్సు లోకి ఎక్కించారు. అరగంట తర్వాత పెద్దాయన మా ఇంటికి చేర్చబడ్డాడు. స్టైచర్‌సాయంతో ఇంట్లోని గెస్టురూంలోకి తీసుకొచ్చారు వెంటవచ్చిన సిబ్బంది. గదిలోఉన్న బల్లను పేషెంటుకు అనుగుణంగా అమర్చి, దానిమీద పరుపు వేసి పడుకోబెట్టాం.

గెస్టురూం ఆయనకు అనుకూలంగానే ఉంది. అటాచ్డ్ బాత్‌రూం, పెద్దపెద్ద వెంటిలేషన్లు, బయట పూలమొక్కల నుండి వచ్చే గాలితో ఒకరకంగా ఆయనకు హాయి కలిగించే వాతావరణమే. ఇంట్లో కూడా ఎవరూ లేరు. పిల్లలిద్దరు చదువుల కోసం సిటీలో ఉన్నారు. అమ్మ చెల్లెలింటికి వెళ్లింది. ప్రస్తుతానికి మేమిద్దరం, మాతో ఆయన!

అప్పటికి సాయంత్రం ఐదవుతుంది. అన్నీ అమర్చాక పాలు, పళ్లరసం అందించింది మా అవిడ. అప్పటికే వెంకట్రాములు మలమూత్ర విసర్జనకు ఇబ్బంది పడుతున్నాడు. ఆయనకు ఏం మాట్లాడాలో... ఎందుకు తాము ఆయన్ని ఆదరిస్తున్నామో అర్థంకాని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నాడు. నేను ఆయన పక్కనే కూర్చొని ఓపెన్‌గా చెప్పాను.

చూడండీ! మేమెవరము, వీళ్లు నాకెందుకు సేవచేస్తున్నారు అనే ఆలోచన మానండి. మేమిది సేవ అనుకోవడం లేదు. మీరు మీ శరీరాన్ని కనీసం నెలరోజులపాటు కదిలించరాదు.

కనుక మలమూత్ర విసర్జనకు చైరూ, బేషిన్‌తో సహా ఏర్పాటు చేశాం. నేను బయట ఉంటాను. మీరు కానిచ్చేయండి. తర్వాత నేను క్లీన్ చేస్తాను అని తలుపువేసి బయటకొచ్చాను.

పదిహేను నిముషాల తర్వాత ఆయన పిలిచాడు. రెండు నిముషాలు బేషిన్ వాష్‌రూంలోకి తీసుకెళ్లి క్లీన్‌చేసి వచ్చాను. వెంకట్రాములు చలించిపోయాడు. బిడ్డా..! నాలాంటి దౌర్భాగ్యుడికి మలమూత్రాలు తీసే ఖర్మ నీకెందుకు బిడ్డా. నన్ను... వదిలేయ్... నన్ను వదిలేయ్.. ఆతను చిన్నపిల్లాడిలా బావురుమన్నాడు. జీవితంలో ఎన్నో కష్టాలను చవిచూసినా ఎన్నడూ రోదించి ఉండడు. ఇప్పుడు మాత్రం భరించలేని దుఃఖం పొంగుకొస్తుంటే కుమిలి కుమిలి ఏడుస్తున్నాడు. ఒక అనామకున్నైన తాను ఇంతటి సేవకు అర్హున్ని కానేమో అని విలపిస్తున్నాడు.

నేను ఆయన్ను ఓదార్చే ప్రయత్నం చేయలేదు. కడుపులో ఉన్న దుఃఖం మంచుగడ్డలా పూర్తిగా కరిగిపోవాలని చూశాను. ఏడ్చి ఏడ్చి కాస్త ఉపశమించాక నెమ్మదిగా దగ్గరకు జరిగి ఆయన పక్కనే కూర్చున్నాను. మనసులో ఉన్న సందేహాలు, బాధలన్నీ దుఃఖం రూపంలో వెళ్లిపోవాలని ఆగాను. ఇంకా ఏడ్వాలనిపిస్తే ఏడవండి. రేపట్నుండి మళ్లీ మీకు దుఃఖం రావద్దు. మిమ్మల్ని పూర్తిగా ఆరోగ్యవంతులుగా చేశాకే మీ ఇంటికి తీసుకెళ్తాను. ఇక ఏ సందేహాలు లేకుండా హాయిగా నిద్రపోండి. అని లేచాను.

నేను బయటకు వెళ్లిపోబోతుంటే వెనుక నుండి చేయిపట్టి పిలిచాడు. బిడ్డా! ఒక్కటి.. ఈ ఒక్క ప్రశ్నకు జవాబు చెప్పు. లేకుంటే నేను నిద్ర పోలేను అన్నాడు వెంకట్రాములు. నేను క్షణం ఆగి అడగండి. అన్నాను. నువ్వెవరు? ఇంత ఖర్చు, శ్రమను భరిస్తూ నాకెందుకు సేవ చేస్తున్నావు? ఇది మాత్రం చెప్పు బిడ్డా!

నేను నిముషం పాటు మౌనంగా ఉండిపోయాను. మా నాన్న కళ్లముందు మెదిలాడు. మనసు ఉద్విగ్న స్థితిలోకి మారుతుంటే నెమ్మదిగా మనసు విప్పాను. ఇరవైఏళ్ల క్రితం మీరు విద్యార్థి జూనియర్ కళాశాల' నడుపుతున్నప్పుడు నేను ఆ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థిగా మీకు శిష్యున్ని. గణితంలో నా రాతను గీతను మార్చిన మీరు నాకు గురువులు. మీరు లేకుంటే ఈరోజు నేనిట్లా ఉండేవాడిని కాను సార్.. అన్నాను.

వెంకట్రాములు భృకుటి ముడివేసి చూస్తుంటే కొనసాగించాను. మీకు గుర్తుందో లేదో సార్, నాకు ఎంసెట్ పరీక్ష రోజే మా నాన్న చనిపోయాడు. నేను ఆయన శవం దగ్గర ఏడుస్తుంటే నన్ను పక్కకు తీసుకెళ్లారు. నా పేదరికాన్ని గుర్తుచేశారు. మా కుటుంబం పట్ల నా బాధ్యత ఏమిటో గుర్తుచేశారు. 'అనారోగ్యంతో చనిపోయిన మీ నాన్న తిరిగిరాడు, కానీ మీ అమ్మనూ చెల్లెనూ చూడాల్సిన బాధ్యత నీదే'నన్నారు. అందర్నీ ఒప్పించి బలవంతంగా నన్ను మీ బైకు మీద కరీంనగర్ తీసుకెళ్లి ఎంసెట్ ఎంట్రన్స్ రాయించి తీసుకొచ్చారు. ఆ తర్వాతే

అంత్యక్రియలు చేయించారు. దాని ఫలితమే... నేను పంచాయిత్‌రాజ్ శాఖలో ఇంజనీరునయ్యాను. చెల్లెలి పెండ్లి చేయగలిగాను. ఈ రోజు ఈ స్థితిలో ఉన్నాను.

నేను ఇంజనీరింగ్ చేస్తున్నప్పుడు మిమ్మల్ని కలవాలని వస్తే ఆ కాలేజీని మీరు ఇతరులకు దారాదత్తం చేశారని విన్నాను. వేరే ఏదో కాలేజీలో పార్ట్‌టైంగా పనిచేస్తున్నారని తెలిసింది. అయితే అక్కడా దొరకలేదు. ఎక్కడుంటున్నారో ఎవరూ చెప్పలేదు. అప్పట్నుండి ఇప్పటికీ మీరు నా మదిలో మెదలుతూనే ఉన్నారు. నాకు ఉద్యోగం వచ్చాక కూడా చాలా ప్రయత్నించాను. ఎక్కడా మీ వివరాలు తెలియలేదు. నా అదృష్టమో, దురదృష్టమో మీరు ఈ స్టితిలో దొరికారు. ఏదైతేనేం.. ఇన్నాళ్లకు మీరు మా నాన్నలా మా ఇంట్లోకి చేరారు. మీకు సేవ చేయడం మా నాన్నకు చేస్తున్నట్లే భావిస్తున్నాను ఓ క్షణం ఊపిరి పీల్చుకొని నా ఈ జీవితం మీరు పెట్టిన భిక్ష సార్! నా కంఠంలో అదోరకమైన ఉద్విగ్నత.

మొహంలో ప్రసన్నత తాండవిస్తుండగా ఆయన చేతిలోనున్న నా చేయిని మరింత బిగించాడాయన. పక్కనే నిలబడి కొంగుతో కన్నీళ్లద్దుకొంటున్న నాభార్య జ్యోతిర్మయిని దగ్గరకు పిలిచాడు. ఆమె చేయిని తన ఎడంచేతిలోకి తీసుకున్నాడు. ఇద్దరి చేతుల్నీ తన రెండు చేతుల్తో బిగించిపట్టాడు. ఆ బిగింపులో వేనవేల భావాలు... పలుకుతున్నాయి.

* * *

**జగిత్యాల జిల్లా, కోరుట్ల స్వస్థలం.తెలుగులో ఎంఏ చేసి, డా. డింగరి రామాచార్య సాహిత్యంపై పరిశోధనచేసి కాకతీయ విశ్వవిద్యాలయం నుండి ఎంఫిల్ పట్టా పొందారు. కోరుట్ల బాలికల ఉన్నత పాఠశాలలో తెలుగు స్కూల్ అసిస్టెంట్ గా పనిచేస్తున్నారు. 1996లో స్వాతి వీక్లీ సరసమైన కథల పోటీలో ప్రథమ బహుమతి పొందిన 'వర్షంలోవనకన్య' మొదటికథ. ఇప్పటికి 52 కథలు ప్రముఖ దిన,వారపత్రికల్లోప్రచురించబడ్డాయి. 150 కవితలు, 25 నాటికలు, 50 పాటలు రాశారు.'నవ్వుతున్ననేలతల్లి' 'సుదూరతీరాలు' కథాసంపుటులు, 'అక్షరం – అభిమతం' కవితాసంపుటి, 'మందారమాలిక' గేయసంపుటితోపాటు ఏకలవ్య, వినాయకచవితి, సుమమాలవంటి 8 పుస్తకాలువెలువరించారు. తెలుగు పాఠ్య పుస్తక రచయితల బృందంలో సభ్యుడిగా ఉండి తెలుగు పాఠ్యపుస్తకాలరూపకల్పనలో పాలుపంచుకొన్నారు. ప్రపంచ తెలుగు మహా సభల సందర్భంగా రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో రూపొందించబడిన 'తెలంగాణవైభవం' పుస్తక రూపకల్పనలో భాగం పంచుకున్నారు.**

# మట్టి పరిమళం



**బి.వి.రమణమూర్తి,**
**సెల్ : 9848987239**

మిట్ట మధ్యాహ్నం... ఎండ తీక్షణంగా ఉంది. నేల తడిసి నెలలు గడిచిన ఆనవాళ్లు... ఆ మట్టి రోడ్డులో జీవం లేదు. ఆ జీవం లేని రోడ్డుపై జీపు భారంగా కదులుతోంది. ఒత్తిడి భరించలేని నేల తల్లి బెంబేలెత్తుతున్నట్టు ధూళి ఎగసిపడుతోంది. ఎగుడు దిగుడులు కారణంగా జీపు అటూ ఇటూ ఊగుతోంది.

ప్రధాన రహదారిని వదిలి పాము మెలికల్లాంటి ఆ మట్టి రోడ్డు పైకి జీపు వచ్చి చాలా సేపయ్యింది. జీపులో కూర్చున్న రామయ్యకు అయోమయంగా ఉంది. అతని రైతు కళ్లు పరిసరాలను నిశితంగా గమనిస్తున్నాయి. కనుచూపు మేరలో పంట పొలం లేదు. జనావాసాల జాడ కనిపించడం లేదు.

'అసలెవరితను, ఆత్మహత్య చేసుకోబోతున్న తననెందుకు రక్షించాడు. నా మానాన నన్ను వదిలేయక ఎక్కడికి తీసుకువెళ్తున్నాడు. అసలు ఇప్పుడు తానెక్కడ ఉన్నాను. ఇదేదో కొత్త ప్రాంతంలా ఉందే? అసలు ఇతని ఉద్దేశం ఏమిటి?' ఆశ్చర్యం, భయం, ఆందోళన చుట్టుముడుతున్నా ఏమీ చేయలేని నిస్సహాయత.

కాసేపటికి జీపు ఓ ఊరికి దగ్గరయ్యింది.. 'పర్వాలేదు, జనారణ్యంలోనే ఉన్నాను. ఇతగాడిది ఈ ఊరేమో' మనసులోనే అనుకున్నాడు. మలుపుల రోడ్డుపై ఏకాగ్రతతో

జీపు నడుపుతున్న అతని వైపు చూశాడు. అతనిలో ఏ భావం లేదు.

రామయ్యకు ఆస్పత్రిలో జరిగింది గుర్తుకు వచ్చింది. పక్షం రోజుల తర్వాత కళ్లు తెరిచాడు. 'నన్నెందుకు రక్షించారు. నన్ను చనిపోనివ్వండి. నిత్యం ఓడిపోతూ బతకడం నావల్ల కాదు. నేను చావాలి... నేను చావాలి' అరుస్తున్న అతనివైపు డ్యూటీ నర్సు అయోమయంగా చూసింది. తనకు తెలిసింది చెప్పి సముదాయిస్తోంది.

'అలాగే, చనిపో. నీ ప్రాణం నీ యిష్టం. కానీ చనిపోయే ముందు ఒక్కసారి నీవాళ్ల గురించి ఆలోచించావా?' అప్పుడే ఆ గదిలోకి అడుగుపెట్టిన అతను ప్రశ్నించాడు. తానెప్పుడూ చూడని వ్యక్తి, అలా సొంత మనిషిలా ప్రశ్నించే సరికి రామయ్య ఆశ్చర్యంగా అతనివైపు చూశాడు.

'అవన్నీ నీకెందుకు. నా గురించి నీకేం తెలుసు. నా చావు నన్ను చావనివ్వకుండా రక్షించడానికి నువ్వెవరు' రామయ్య మాటల్లో ఆవేదన ధ్వనిస్తోంది. 'తన చావుకు తానే ముహూర్తం పెట్టుకున్న వాడు పిరికివాడు. గెలుపు ఓటములు పట్టించుకోకుండా పోరాడిన వాడు యోధుడు' బాణంలా దూసుకువచ్చాయి అతని నోటి నుంచి మాటలు.

'ఈ మాటలకేం, అన్నీవున్న వాడు ఎన్నయినా చెబుతాడు. వినీ వినీ విసిగిపోయాను. నిత్యం బతుకు పోరాటం చేసే ఓపిక నాకు లేదు. నా మానాన నన్ను వదిలేయ్' 'కష్టాలేవో నీ ఒక్కడినే చుట్టుముట్టినట్టు మాట్లాడుతున్నావే'...అతను వ్యంగ్యంగా అన్నాడు.30

'నా వేదన నీకు నవ్వుతెప్పిస్తోందా? శ్వేదాన్ని ఇంధనంగా మార్చి ఆరుగాలం బతుకు బండి నడిపే మట్టిమనిషిని నేను. నేల తల్లి కరుణించకుంటే బాధపడేవాడిని కాదు. ప్రకృతి ముఖం చాటేస్తే ఇది మామూలే అని సరిపెట్టుకునే వాడిని. మనిషే మనిషిని మోసం చేస్తున్నాడు. స్వార్థంతో అన్నదాత గొంతు కోస్తున్నాడు. ఇటువంటి మనుషుల మధ్య నేను బతకలేను'

'ఏం నువ్వు మనిషివి కాదా, నువ్వు ఈ జనారణ్యంలో బతకడం లేదా'...కోపంగా అన్నాడతను. 'బతక లేకే కదా చావాలనుకున్నాను. నా సాగు భూమిని లాక్కున్నారు. ఏమంటే అభివృద్ధి అన్నారు. ఫ్యాక్టరీ కడతామంటున్నారు. ఆ ముసుగులో చేస్తున్న వ్యాపారం. పెద్దోళ్ల భూములు వదిలేసి నాలాంటి పేదోళ్ల భూములపై పడ్డారు. ఒప్పుకుంటే సరి, నాలా మొండి కేసిన వారిని దారీతెన్నూ లేకుండా చేశారు. ఊరి పెద్దల్నే కాదు అడ్డొచ్చే వారందరినీ కొనేసారు. చట్టాన్ని చుట్టంగా మార్చుకున్నారు. కళ్లముందే న్యాయాన్ని సమాధి చేశారు. ఇస్తామన్నది కూడా సరిగా ఇవ్వలేదు. నాకు, నా కుటుంబానికి ఇంత అన్నంపెట్టే భూమి లేకుండా చేస్తే నేనెలా బతకాలి, ఎవరికోసం బతకాలి'

'అన్నింటికీ చావే శరణ్యమా' ఓదార్పుగా అన్నాడు. 'కాకపోవచ్చు, స్వార్థపరులైన మనుషుల మధ్య న్యాయం జరగనప్పుడు మనశ్శాంతికి ఆదే సరైన దారి' 'నువ్వు చనిపోతే నీ భార్యాబిడ్డల గతేం కాను' 'నేనుండి మాత్రం వారికి ఒరిగింది ఏమిటి, పట్టెడన్నం పెట్టలేని అసమర్థుడిని నేను' 'అంటే... నిన్నే నమ్ముకున్న నీ వాళ్లను వదిలేసి నీ మానాన నువ్వు చనిపోతాననడం స్వార్థం కాదా?'

రామయ్య ఆలోచనలో పడ్డాడు. సమాధానం కోసం తడబడ్డాడు. అతనికి భార్యా, పిల్లలు గుర్తుకు వచ్చారు. అర్ధాకలి జీవితం జ్ఞాపకం వచ్చింది. కళ్లు చెమ్మగిల్లాయి. చిరిగిన చీరలో తన గౌరవాన్ని కాపాడుకునేందుకు తంటాలు పడుతున్న భార్య, అవసరం చెప్పాల్సి ఉన్నా తండ్రిముందు నోరు తెరవొచ్చో, తెరవ కూడదో తెలియని అయోమయంతో చూస్తున్న పిల్లల ముఖాలు గుర్తుకు వచ్చాయి.

'నాది స్వార్థమే. కానీ,. ఏం చేయమంటావు. నాకు మరో దారేదీ కనిపించ లేదు' 'మార్గమేగా, నీకు కావాల్సింది. నాతో వస్తావా? నీకు నచ్చిన మార్గం చూపిస్తాను. అదీ నీకు నచ్చక పోతే ఇక నీ ఇష్టం'...అతను సూటిగా చూస్తూ చెప్పాడు. 'దిగు రామయ్య, ఊరొచ్చింది'... జీపు నడుపుతున్న వ్యక్తి పిలుపుతో ఆస్పత్రి ఆలోచన నుంచి బయటకు వచ్చాడు రామయ్య.

ఎదురుగా పెంకుటిల్లు. దూరం నుంచి కనిపించిన ఊరు అదే అనుకున్నాడు. గట్టిగా వందిళ్లు కూడా లేవు. అవి కూడా విసిరేసినట్టు అక్కడక్కడా ఉన్నాయి. కనుచూపు మేరలో ఖాళీ భూములు. సమీపంలో మరో ఊరు జాడ లేదు.

ఇంట్లోకి అడుగుపెట్టిన రామయ్యకు అదో డబ్బున్న వాళ్ల ఇళ్లనిపించక పోయినా పేదరికం ఛాయలు కనిపించ లేదు. ఇద్దరు ఆడవాళ్లతో సహా నలుగురైదుగురు మనుషులున్నారు. 'రామయ్యా...ఆ మర్చిపోయాను. నీ పేరు రామయ్యే కదా' అడిగాడు అతను ఆశ్చర్యంగా. 'పూర్తి పేరు రామచంద్రయ్య బాబూ, అంతా రామయ్యా అని పిలుస్తుంటారు' 'బాబూ... అని పిలవకు. నేను నీ బిడ్డలాంటి వాడిని, పేరు పెట్టి పిలువు పర్వాలేదు' 'మా పల్లెటూర్లలో అదో గౌరవనీయ సంబోధం బాబూ. నోటి ముందుంటుంది. అంత వేగంగా మార్చుకోలేం'

'సరేలే, నా పేరు కృష్ణమోహన్. ఈ ఊరు కొండవీడు. ఇది నా సొంతూరు. మీ ఊరికి చాలా దూరంలో ఉంది. కంగారు పడకు. నువ్వు వద్దనుకుంటే నీ ఇంటికి నిన్ను చేర్చే బాధ్యత నాది'. 'చావు కోరుకునే వాడిని బాబూ. నాకు ఇల్లయినా, శ్మశానమైనా ఒకటే'. 'అతను నవ్వేశాడు, సరేలే.... భోజనం అయ్యాక విశ్రాంతి తీసుకో. సాయంత్రం అన్ని విషయాలు మాట్లాడుకుందాం. నీకు అవసరమైన పంచె, తువ్వాలు తెచ్చాను. వంటిపై ఉన్నవి ఉతికేందుకు పడేసి, స్నానం చేసి అవి కట్టుకో' చెప్పి అతను వెళ్లిపోయాడు.

భోజనం అయ్యాక పడుకున్న రామయ్యకు ప్రయాణ బడలిక వల్ల బాగా నిద్రపట్టేసింది. కళ్లు తెరిచేసరికి ఎదురుగా కుర్చీలో కృష్ణమోహన్. తననే చూసి నవ్వుతుండడంతో ఉలిక్కిపడి లేచాడు. 'ఏం రామయ్యా, బాగా నిద్రపట్టిందా' అభిమానంగా అడిగాడతను. 'పీడకలలు వెంటాడుతున్నాయి బాబు, అవి నా జీవితాన్ని వదిలి పోవేమో' ఆవేదనగా అన్నాడు.

'అవి పీడకలలు కావు రామయ్యా, నీలోని భయం. ఆ భయం పోవాలంటే నీపై నీకు నమ్మకం పెరగాలి. ఇందుకు చిన్న పిట్ట కథ చెబుతాను, వింటావా?' 'చెప్పు బాబూ' అన్నట్టు చూశాడు. 'అతనో సైనికుడు. సరిహద్దులోని కీలక ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్నాడు.

తోటి సైనికులతో కలిసి డేగ కళ్లతో కాపలా కాస్తున్నాడు. ఊహించని విధంగా శత్రువులు దాడి మొదలు పెట్టారు. వారి సంఖ్యా బలం ఎక్కువ. అయినా భయపడ లేదు. ధైర్యంగా పోరాడారు. శత్రువుకు చావు దెబ్బ తగిలింది. కానీ తోటి సైనికులంతా చనిపోయారు. అతనొక్కడే మిగిలాడు. శత్రువులు సమీపిస్తున్నారు. చావు చెంతనే ఉంది. అయినా ఏదో తెలియని ఆశ. గెలవలగలనన్న నమ్మకం. చివరి ప్రయత్నంగా శత్రు సైనికుల మధ్యకు ఓ గ్రేనేడ విసిరాడు. అదే సమయంలో అటు నుంచి ఓ గ్రెనేడ్ వచ్చి అతని సమీపంలో పడింది. అతను తప్పించుకులోగానే ఇరువైపులా భారీ పేలుళ్లు. శత్రు సైనికులంతా చనిపోయారు. అతను మాత్రం ప్రాణాలతో మిగిలాడు. కళ్లు తెరిచి చూసేసరికి సైనిక ఆస్పత్రి బ్పె ఉన్నాడు. మోకాళ్ల వరకు తొలగించిన కాళ్లు దర్శనమిచ్చాయి'

ఈ కథ విన్నాకా నీకేమనిపిస్తోంది. అతను గెలిచాడా ? ఓడిపోయాడా ? 'వ్యక్తిగతంగా ఓడిపోవచ్చు, కానీ దేశాన్ని గెలిపించాడు'. 'శెభాష్ రామయ్యా. హృదయం ఉప్పొంగే సమాధానం చెప్పావు'. 'ఇంతకీ ఎవరు బాబూ ఆ సైనికుడు'. 'నేనే!.. అవును రామయ్య. ఆ ఓడి గెలిచిన సైనికుడిని నేనే. ఇప్పటి వరకు నువ్వు గమనించలేదేమో. నేను నడవగలుగుతున్నది నా కాళ్లపై కాదు. కృత్రిమ కాళ్లపై'...అంటూ పంచె ఎత్తి చూపాడు.

ఒక్క క్షణం రామయ్య దిగ్భ్రమకు లోనయ్యాడు. కాసేపు నిరుత్తరుడయ్యాడు. ఆశ్చర్యంగా అతనివైపు చూశాడు. అతని ధైర్యం, ఆత్మవిశ్వాసం చూసి ఆశ్చర్యపోయాడు. ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. ఆవేదనగా అతని వైపు చూశాడు.

'యోధుడు ఎప్పుడూ ఓడిపోడు రామయ్యా. ఓటమి అంచుకు చేరినప్పుడే విజయానికి దగ్గరయినట్టు. విజయమో, వీర స్వర్గమో. గెలిస్తే చరిత్రలో నిలిచిపోతాం. ఓడిపోతే ఊహించిందే జరుగుతుంది. అటువంటి సందర్భంలో కావాల్సింది మనోధైర్యం'. నాలుగు పదుల వయసు కూడా లేని అతని మాటలు వింటూ రామయ్య విస్తుపోతున్నాడు.

'చూడు రామయ్యా, నువ్వు కర్షకుడిగా గెలిచావు. నేను సైనికుడిగా గెలిచాను. అనుకోని పరిస్థితుల్లో ఇద్దరం వ్యక్తిగతంగా ఓడిపోయాం. జీవితంలో కాదు. అంతేనంటావా? కాదా'

'నిజమే బాబూ'..'చీకటి ఎంత భయంకరమైనదైనా చిరు దీపం దాన్ని పారద్రోలగలదు. జీవితం కూడా అంతే. కష్టనష్టాలు ఎలాంటివైనా ఆత్మవిశ్వాసం అనే చిరు దీపం మనలో వెలుగుతున్నంత కాలం ఓడిపోయే అవకాశం లేదు. ఇది నా నమ్మకం'. రామయ్యకు ఏం చెప్పాలో తోచ లేదు. మౌనంగా అతనివైపు చూస్తున్నాడు.

'రామయ్యా.... రైతు అసమాన్యుడు. అతనో శాస్త్రవేత్త...ఓ డాక్టర్... ఓ శ్రామికుడు...మరెందరో సమ్మిళితం. రైతే దేశానికి వెన్నెముక. నీలాంటి రైతులు దేశానికి మార్గదర్శకులు కావాలి. నా సైనికుడి భాషలో చెబుతాను విను. ఆత్మస్థైర్యం దెబ్బతింటే చేతిలో ఏకె-47 ఉన్నా శత్రువుని ఓడించలేం. ధైర్యంతో ముందడుగు వేయగలిగితే ఖాళీ చేతుల్తోనూ మట్టి కరిపించగలం. ఇది నేను అనుభవంతో చెబుతున్న మాట. దేశ రక్షణకు సైనికుడు, జనం

రక్షణకు కర్షకుడు అవసరం'

'అవును బాబు. అన్నదాత లేకుంటే కడుపు నిండదు. సైనికుడే లేకపోతే కంటిపై కునుకుండదు'. 'మరి అంతటి విలువ, గొప్పతనం నీలో దాచుకుని బేలగా చనిపోతానంటావేం. అందుకే నిన్ను రక్షించాను' నవ్వుతూ అన్నాడు కృష్ణమోహన్.

ఆ సాయంత్రం కృష్ణమోహన్ ఊరికి కిలోమీటరు దూరంలో ఉన్న కొండవాలు ప్రాంతానికి తీసుకువెళ్లాడు. చిన్నచిన్న కమతాలుగా ఉన్న కొంత భూమి చూపించాడు.

'సరిహద్దు పోరులో కాళ్లు పోగొట్టుకుని నిస్సహాయకుడిగా మారినందుకు ప్రభుత్వం నాకిచ్చిన ఐదెకరాల భూమి ఇది రామయ్యా. గడచిన ఐదేళ్లుగా వృథాగా పడివుంది. పండించాలన్న ఆశవున్నా నాకు వ్యవసాయం రాదు'.

రామయ్య అతనివైపు ఆశ్చర్యంగా చూశాడు. ప్రస్తుతం నా జీవితానికి తోడు నా భార్య, ఇద్దరు పిల్లలు, ఈ రెండు కృత్రిమ కాళ్లు, ఈ వాలు కుర్చీ, ఈ విశాలమైన పెంకుటిల్లు మాత్రమే. ప్రభుత్వం పెన్సన్ ఇస్తోంది. ఓడి గెలిచిన సైనికుడిగా ప్రభుత్వం ఇచ్చిన నగదు సాయం బ్యాంకు డిపాజిట్ రూపంలో ఉంది. ఉద్యోగం చేస్తూ నేను కూడబెట్టిన మొత్తంతో పట్నంలో సమకూర్చుకున్న స్థిరాస్తిపై ఆదాయం వస్తోంది. నా భార్యా, బిడ్డల్ని పోషించుకునేందుకు ఇవి చాలు? కానీ ఓ స్వార్థం నన్ను నడిపిస్తోంది, ఆ స్వార్థమే నిన్ను రక్షించేలా చేసింది'

'ఏమిటి బాబూ ఆ స్వార్థం' 'ఊరికి ఉపకారం చేయాలన్న స్వార్థం. బీడు వారిన ఈ నేల తల్లిని పంట భూమిగా మార్చాలన్న స్వార్థం. ఇది బీడు భూమి కాదు, పంట పండే బంగారు లక్ష్మి అని నిరూపించాలన్న స్వార్థం. కాలం కత్తివేటుకు ఇక్కడి రైతులు బలైపోయినా ప్రత్యామ్నాయం లభిస్తే ఈ నేల తల్లి సిరులు కురిపిస్తుందని నిరూపించాలన్న స్వార్థం' హృదయాన్ని మెలిపెడుతున్న ఆవేదన వల్ల కావచ్చు. అతను కాసేపు ఆగి మొదలు పెట్టాడు.

'కను చూపు మేరలో కనిపించే ఈ భూములన్నీ మా ఊరు, చుట్టుపక్కల మరో రెండూళ్ల రైతులవే రామయ్యా. అంతా సన్నచిన్నకారు రైతులే. భూగర్భ జలాలు లేకున్నా, వానాకాలంలో నీటి తడితోనే ఖరీఫ్, తర్వాత అపరాల పంటలు పండించే వారు. భుక్తికి లోటు లేకుండా జరిగిపోయేది. కాలంతోపాటు వచ్చిన మార్పులు ఈ భూములకు శాపంగా మారాయి. పర్యావరణ మార్పులతో వర్షాలు అదను తప్పాయి. వరుసగా రెండు సీజన్లలో పంటలు పోయాయి. ఆ తర్వాత ఓ ఏడాది పంట పండినా తర్వాత మరో మూడేళ్లు అవే కష్టాలు. రైతులకు ప్రత్యామ్నాయం లేదు. రానురాను అర్ధాకలి బతుకులతో జనంలో విసుగు, కోపం మొదలయ్యాయి. భూమిని నమ్ముకుంటే పస్తులే అన్న నిర్ధారణకు వచ్చేశారు. ప్రత్యామ్నాయం వెతుక్కుంటూ చాలామంది పట్నానికి వెళ్లిపోయారు. ఊరు శ్మశానంలా మారింది. ఉన్నవారు వ్యక్తిగత కారణాలతో నెట్టుకొస్తున్న వారే తప్ప బతుకుపై ఆశతో కాదు'

రామయ్య మనసులోని చాలా సందేహాలకు అప్పుడప్పుడే సమాధానాలు

దొరుకుతున్నాయి. అతను కృష్ణమోహన్ చెబుతున్నది మరింత శ్రద్ధగా వింటున్నాడు. 'ఇవి ఎందుకూ కొరగాని భూములు కావు రామయ్యా. పరిస్థితులు కారణంగా అలా మారాయి. కష్టపడితే సాగుయోగ్యం చేయొచ్చన్నది నా నమ్మకం. చేసి చూపించాలన్న తపన. ఇందుకు నా ఐదెకరాలు నాంది కావాలి. అందుకే నీ సాయం కోరుతున్నాను. ఎంత ఖర్చయినా భరిస్తాను. ఎంత నష్టపోయినా ఆనందంగా స్వీకరిస్తాను. నీ భార్యా, పిల్లల మంచిచెడ్డలన్నీ చూసుకుంటాను. రెండేళ్లయినా, మూడేళ్లయినా ఒక్క ఖరీఫ్ సీజన్లో అయినా నా ఐదెకరాలు పచ్చని పంటతో కళకళలాడాలి. అది మరికొందరిలో స్ఫూర్తి నింపాలి. ప్రభుత్వంలో కదలిక తేవాలి. సాగునీటి సదుపాయంపై దృష్టిసారించాలి. ఈ భూముల్లో బంగారం పండాలి. అదే నా ఆశయం'

అప్పటి వరకు మౌనంగా ఉన్న రామయ్యా నోరు విప్పాడు. 'బాబూ, వ్యవసాయం అంటేే విసుగొచ్చింది. భూమిని నమ్ముకోవడం అంత చెడ్డపని మరొకటి లేదనుకున్నా. కానీ, నీ ఆకాంక్ష విన్నాక నాలో ఏదో తెలియని శక్తి ఆవహిస్తోంది. నాలోని రైతు మేలుకొంటున్నాడు. నా అనుభవాన్నంత రంగరించి నీ భూమిని పచ్చని పైరుతో కళకళలాడిస్తాను' రామయ్యా ఆత్మవిశ్వాసంతో చెప్పాడు. కృష్ణమోహన్ ముఖంలో 'నువ్వు చెయ్యగలవు రామయ్యా' అన్న సంతృప్తి కనిపించింది.

* * *

ఆకాశం మేఘావృతమై వుంది. కొండవాలులోని బండరాయిపై కూర్చున్నాడు రామయ్య. అతని ముఖం దైన్యంతో నిండివుంది. అప్పుడే రెండు ఖరీఫ్ సీజన్లు వెళ్లిపోయాయి. వానల్లేక పంట దక్కలేదు. 'నన్ను, నా కుటుంబాన్ని అప్పనంగా పెంచుతున్నాడు ఆ పిచ్చి మారాజు. నేనేదో సాధిస్తానని అడిగినవన్నీ సమకూర్చుతున్నాడు. నా భార్యా బిడ్డలు బతికేందుకు డబ్బు పంపిస్తున్నాడు. ఆ అవిటి వాడిని నేను మోసం చేస్తున్నాను... నేను మోసం చేస్తున్నాను. అతనికి నా ముఖం ఎలా చూపించగలను' రామయ్య మనసు విలవిల్లాడిపోతోంది.

నిరాశగా ఆకాశం వైపు చూశాడు. కారు మబ్బులు ఢీకొన్న ఆనవాలుగా మెరుపు మెరిసింది. కాసేపటికి ఉరుము ఉరిమింది. విరుచుకుపడే ప్రళయానికి ముందు వినిపించని (నిశ్శబ్ద) గీతంలా అప్పటి వరకు ఉన్న ప్రశాంతతను చీలుస్తూ ఆకాశంలో అలజడి. ఉత్కంఠతో చూస్తున్న రామయ్య నుదుటిపై ఓ చినుకుపడి చెదిరిపోయింది. కాసేపటికి వర్షం జోరందుకుంది.

'లాభం ఏమిటి? ఖైదీని ఉరితీసిన తర్వాత నిజం తెలిసినట్టు... పంట ఎండిపోయాక కురిసిన ఈ వర్షంతో ఏం ప్రయోజనం? పది రోజుల ముందు ఇదే వర్షం కురిస్తే ఎంతబాగున్ను' అసహనంతో తిట్టుకున్నాడు రామయ్య.

జోరు వానలో గంటపాటు తడిసి ముద్దయ్యాడు. అయినా అక్కడి నుంచి కదల్లేదు. ఆవేదనతో ఆలోచిస్తూ కూర్చున్న రామయ్య చెవిని నీటి గలగలల శబ్దం సోకింది. ఏదో

తెలియని ఆశ...చీకటిలో చిరు దీపంలా మనసును పెనవేసుకున్న కుతూహలం. అతనికి తెలియకుండా అడుగులు అటువైపు పడ్డాయి. శబ్దం వస్తున్న కొండపైకి వందడుగులు ఎక్కాక వర్షం నీరు కిందికి జారుతుండడం గమనించాడు.

'గుబురు పొదలు, రాళ్లు, ఎర్రమట్టి నిండిన ఎత్తుపల్లాల కొండ వాలుల్లో వర్షం కురిసిన చాలా రోజుల వరకు నీటి చెమ్మ ఉంటుందని అతనికి తెలుసు. పొదలు, చెట్లు, రాతి నీడల కారణంగా ఆ నీరు అంత వేగంగా ఆవిరి కాదని అనుభవంలో తెలుసుకున్నాడు. కొండ కోనల్లోనే నదీ ముఖద్వారాలు ఉండేందుకు కారణం కూడా ఇదేనని ఎవరో చెప్పగా విన్నాడు'...ఈ విషయం గుర్తుకురాగానే రామయ్యకు కొండంత శక్తి వచ్చినట్టయింది. 'ఈ కొండపై నీటి ఊటలకు ఈ మట్టిలోని ప్రత్యేకత కారణం కావచ్చు. ఈ నీటిని ఒడిసి పడితే నా శ్రమ ఫలిస్తుంది. కృష్ణమోహన్ ఆశయం నెరవేరుతుంది'... ఈ ఆలోచన రాగానే రామయ్య ముఖం విప్పారింది. లక్ష్యం సాధ్యమే అన్న ధైర్యం వచ్చింది. అప్పుడే అతని మనసులో ఓ ప్రణాళిక రూపుదిద్దుకుంది.

* * *

కొండవీడు గ్రామంలో సరికొత్త అధ్యాయం. ఇప్పుడందరి నోట వినిపిస్తున్న మాట రామయ్య, కృష్ణమోహన్లదే. ఎడారి లాంటి భూముల్లో పచ్చ'ధనం' పరవళ్లు తొక్కించిన ఘనత వారిది. 'కాడి' కింద పడేసి ఊరినే వద్దనుకుని సుదూర ప్రాంతాలకు తరలిపోయిన వారిలో తిరిగి ఊరికి రావాలన్న ఆశ మొగ్గ తొడిగిన సందర్భం. 'కృషితో నాస్తి దుర్భిక్షం' అన్న ఆర్యోక్తిని అక్షర సత్యమని నిరూపించిన నేలతల్లి ముద్దుబిడ్డ రామయ్య. ఆత్మహత్యే శరణ్యమనుకునే రైతును రక్షించి అతనిలో ఆత్మవిశ్వాసాన్ని నింపి కర్షక శ్రామికుడిగా మార్చిన ఘనత కృష్ణమోహన్ది. ఈ శ్రమ ఫలితమే ఇద్దరినీ ఆ ప్రాంతంలో ప్రత్యేకంగా నిలబెట్టింది.

బంజరు భూముల్లో పంట పండించేందుకు తాపత్రయ పడుతున్న ఇద్దరినీ కొన్ని నెలల క్రితం చూసి న వాళ్లు పిచ్చోళ్లనుకున్నారు. అలా అనుకున్న వారే ఇప్పుడు పశ్చాత్తాపంతో తలదించుకుని వెళ్తున్నారు. 'వర్షం కురిసాక కొండపై రాళ్ల కింద నిల్వవున్న నీటి ఊటల్ని ఒడిసి పట్టగలిగితే పంట దక్కించుకోవడం పెద్ద కష్టం కాదు' అంటూ ఏడాది క్రితం రామయ్య చెప్పిన మాట విన్న కృష్ణమోహన్ 'అది సాధ్యమేనా' అనుకున్నాడు. రామయ్యలోని పట్టుదల చూసి సరే అన్నాడు. అతను కోరిన సాధన సామగ్రి సమకూర్చాడు. దాదాపు ఆరు నెలలపాటు నిద్రాహారాలు పట్టించుకోకుండా రామయ్య పడ్డ కష్టం కృష్ణమోహన్ కళ్లముందు మెదిలింది. గడ్డి పూచతో కొండను కదిలించాలన్న అతని తాపత్రయం చూసి ఊరివాళ్లు, దారిన పోయిన వాళ్లు, తెలిసిన వాళ్లు హేళన చేస్తున్నా, మౌనంగా తన పని తాను చేసుకుపోయిన రామయ్య పట్టుదల చూస్తే యుద్ధ క్షేత్రంలోని సైనికుడు గుర్తుకు వచ్చాడు.

కృష్ణమోహన్ ఐదెకరాల భూమిని ఒకే కమతంగా మార్చాడు రామయ్య. చుట్టూ బలమైన గట్టు నిర్మించాడు. మధ్యలో అక్కడక్కడా పిల్ల గట్లు వేశాడు. ఆ భూమిని ఆనుకుని ఉన్న

బంజరు భూమిలో చిన్న చెరువు లాంటిది తవ్వాడు. పొలానికి సమీపంలో కొండ పైనుంచి కింది వరకు పలు చోట్ల చెక్ డ్యాంలు నిర్మించాడు. వర్షం కురిసినప్పుడు జాలువారే నీటిని ఒడిసిపట్టి కొండ దిగువన తవ్విన చెరువులోకి చేరేలా సన్నటి కాలువలు నిర్మించాడు. వర్షాకాలంలో కొండవాలు నుంచి జాలువారే ప్రతి నీటి బొట్టును చెరువులోకి మళ్లేలా చేశాడు.

తొలకరి ప్రారంభం నుంచే ఖరీఫ్కు పొలాన్ని సన్నద్ధం చేశాడు. వర్షాలతోపాటు సాగు కొనసాగిస్తూ నీటి తడికోసం ఎదురు చూడాల్సిన సందర్భంలో చెరువు నీటిని పొలంలోకి మళ్లించాడు. అతని కృషి వృథా పోలేదు. కృష్ణమోహన్ ఐదెకరాల పొలం వరిపంటతో కళకళలాడింది. రెండు నెలల్లో పంట చేతికొచ్చింది. ఊరి వాళ్లకు అదో అద్భుతం. వారిలో ఏదో తెలియని కొత్త ఉత్సాహం.

'శభాష్ రామయ్యా....రైతు అసమాన్యుడని నిరూపించావు. నా ఆకాంక్ష నెరవేర్చావు. ఊరి రైతుల జీవన మార్గానికి ఊపిరి పోశావు. ఎడారిలాంటి భూమిని పచ్చని లోగిలిగా మార్చావు. నా నమ్మకం వృథా పోలేదు'... తన ఐదెకరాల పంటపొలం వద్ద నిల్చుని ఉబ్బితబ్బిబ్బయిపోతున్న కృష్ణమోహన్ రామయ్యపై అభినందనల వర్షం కురిపిస్తున్నాడు. భవిష్యత్తులో ఆ ప్రాంతం సస్యశ్యామలమయ్యేందు తాను నాంది పలికినందుకు గర్వంగా ఫీలవుతున్నాడు.

'రామయ్య అడుగు వేశాడు. మిగిలిన రైతులు ఆ అడుగులో అడుగు కలపకుండా ఉంటారా?' అనుకున్నాడు. రామయ్య, కృష్ణమోహన్ల కృషి, బీడు భూమిని సాగు యోగ్యం చేసిన వారి పట్టుదల, శ్రమ కథలు కథలుగా మీడియా ప్రచురించింది. కొండవీడు గ్రామ రైతుల్లో నవోదయం అని ఓ పత్రిక కీర్తిస్తే, 'జై జవాన్...జై కిసాన్' అంటూ శీర్షిక పెట్టి మరో పత్రిక స్ఫూర్తి నింపింది.

**బత్తుల వెంకట రమణమూర్తి స్వస్థలం విశాఖ నగరం మధురవాడ. శ్రీకాకుళం జిల్లాలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. సీనియర్ డెస్క్ జర్నలిస్ట్ గా దాదాపు రెండున్నర దశాబ్దాల పాటు ప్రధాన పత్రికల్లో పనిచేసిన ఆయన ఇటీవలే ఉపాధ్యాయుడిగా ఉద్యోగంలో చేరారు. 2016 నుంచి కథలు రాస్తున్నారు. తొలి కథ గోమాలచ్చిమి, నవ్య వారపత్రికలో 2018లో ప్రచురితమైంది. ఇప్పటివరకు నలభైకి పైగా కథలు రాశారు. 18 కథలు వివిధ పోటీల్లో బహుమతులు గెలుచుకున్నాయి. నమస్తే తెలంగాణ–ముల్కనూరు గ్రంథాలయం సంయుక్తంగా నిర్వహించిన 'కథ–2020' పోటీల్లో ఈయన కథ 'ఆకుపచ్చ తివాచీ'.. పదివేల రూపాయల బహుమతిని గెల్చుకుంది. 2021 పోటీల్లో 'మట్టి పరిమళం' కథ సాధారణ ప్రచురణకు ఎంపికైంది. సామాజిక ప్రయోజనంతోపాటు పాఠకులను ఆలోచింపజేసే కథలు, హాస్య, వ్యంగ్య కథలు రాయడాన్ని రమణమూర్తి ఇష్టపడతారు.**

# అయినా మనిషి మారలేదు



సంగనభట్ల నర్సయ్య
**94400 73124**

"రామేశ్వరరావ్ గారూ! మీ క్వారంటైన్ నేటితో ముగుస్తుంది. రేపు మీ ఇంటికి వెళ్లవచ్చు. ఉదయం పరీక్షలో కరోనా నెగెటివ్ కూడా వచ్చింది. మీకు అభినందనలు".

డాక్టర్ కోటేశ్వర్, రామేశ్వరరావును అభినందించగా మిగతా వారు విని సంతోషించారు. కాని రామేశ్వరరావు సంతోషించలేదు. నిస్తేజమైన చూపులతో ఆయన డాక్టర్ను చూసాడు. డాక్టర్కు కూడా ఆ నీరసానికి అర్థం తెలియలేదు. ఉండబట్టలేక అడిగాడు కూడా. దానికి జవాబుగా రామేశ్వరరావు చెప్పింది.

చుట్టుపక్కలవారికి కూడా షాక్ ఇచ్చింది.

"డాక్టర్గారూ! 14 రోజులు ఐనా, నెలైనా, నా పిల్లలకు నేను తిరిగి ఇంటికి రావాలని లేదు. అంతకుముందు నుంచే నన్ను అనాథాశ్రమంలో జాయిన్ చేయాలని అనుకున్నారు. కాని బంధువులకు, మా సోదరులవైపు వారికి భయపడి ఏం చేద్దాం అని సందేహిస్తూ వచ్చారు. తక్షణం తీసికొనివచ్చి ఇక్కడ క్వారంటైన్లో వేసారు. ఇపుడు తిరిగి ఇంటికెలా తీసుకొని వెళతారు? వారికది యిష్టంలేదు. ముఖ్యంగా మా కోడలికి.

"రావు గారూ! మీ ఆవిడ ఎక్కడ? ఆవిడ పరిస్థితి ఏమిటి?" అడిగాడు డాక్టర్.

"డాక్టర్ గారూ! మా ఆవిడ పోయి ఏడాది ఐంది. అప్పటినుండి నాకు నరకం మొదలైంది. నాకు ప్రత్యేకమైన గది. దాంట్లో పడవేసారు. అందరూ తిన్నాక ఏ ఒంటిగంటకో మా కోడలు పళ్లెంలో ఇంత భోజనం తెచ్చి పడేస్తుంది. అంతవరకు నా ఆకలిదప్పులు అదిమిపెట్టుకోవాలి. తింటుండగా మారు వేసేందుకు ఏం కావాలని అడగరు. పళ్లెం తీసికొనివెళ్లి నా గదిలోని బాత్రూంలో కడుక్కొని వచ్చి పక్కన పెడతాను. మళ్లీ రాత్రికే భోజనం. కరోనాకు ముందు ప్రపంచం, కరోన తరువాతి ప్రపంచం అని మీరు నేటి సమాజాన్ని విశ్లేషిస్తున్నారు. నాకు మాత్రం కరోనాకు ముందూ, వెనుకా ఒకటే. మా ఆవిడ మతికి ముందు, వెనుకా అని మాత్రమే. నా జీవితంలో అదే పెద్ద మార్పు.

రామేశ్వరరావుగార్కి దూరపు బంధువు కూడా ఐన డాక్టర్ కోటేశ్వర్ తాను వాళ్ల ఇంటి సంగతి తెలియక అభినందించాడు. విషయం తెలిసాక నొచ్చుకొని బాధపడ్డాడు. తాను కొడుకుకు చెప్పి చూస్తానని అన్నాడు.

"కోటేశ్వర్ గారూ! అక్కర్లేదు. భయంకర ఏకాంతం భరించాను ఇంట్లో. దానికంటే మీ హాస్పిటలే నయం.

నన్ను చూసుకునే ముగ్గురు, నలుగురు వైద్య సిబ్బంది ఉన్నారు. వేళలకు ఆహారం వచ్చింది. నన్నింకో నెల ఉంచుకోండి, వీలైతే" అని అడిగాడు.

"రావు గారూ! ఇది  అసాధ్యం. నెగెటివ్ వచ్చాక మేం ఉంచుకోలేం. బెడ్ ఖాళీ ఐతే మరొకరి ఇవ్వవలసి ఉంటుంది. మీ అబ్బాయి హాస్పిటల్ ఖర్చు భరించలేదు. ఈ పధ్నాల్గు రోజులకే ఎంతో ఖర్చు ఐందని గొణిగాడు. తగ్గింపుకై నన్ను అడిగాడు. సరే చెప్పి చూస్తానోసారి అన్నాను" అన్నాడు డాక్టర్.

కోటేశ్వర్గారూ! అక్కర్లేదు. మీ మాటతో ఫీజు తగ్గింపు చేస్తారని, డాక్టర్ మీ మాటను గౌరవించినట్టు నా విషయంలో మా వాడు నటిస్తాడు. కాని వానికిష్టం లేదు. కరోనాతో పోతే శ్మశానానికి, కరోనాతో పోకుంటే వద్ధాశ్రమానికి అని వారే రెండు దారులు ఇప్పటికే నిర్ణయించుకున్నారు.

"ఇది ముందే నిర్ణయమా? మీ ఇల్లు, ఆస్తి వాళ్లకు అక్కర్లేదా? ఇంత దారుణమా?"

"డాక్టర్! అది ముందే నిర్ణయం ఐంది. నా ఇల్లు వారికి రాసాను. వేరే ఆస్తి లేదు. కరోనా వచ్చాక తొలిరోజే ఈ నిర్ణయం. ఇపుడైతే తప్పు పట్టరని మా కోడలుఈ సందర్భాన్ని వినియోగించుకొమ్మని పోరింది".

"ఇంత తొందరగా ఇల్లు ఎందుకు రాసివేసారు?"

"తప్పలేదు. అంతకుముందు నుండే పోరు నడుస్తోంది. సరేనన్నాను. కరోనా పాజిటివ్ రాగానే అర్జంటుగా కాగితాలు సిద్ధం చేయించి సంతకం పెట్టించి, హాస్పిటల్లో జాయిన్ చేసారు. సంతకం పెట్టకుంటే దవాఖానాలో చేర్చమని బెదిరించారు. మీద కరోనా కత్తి వేళ్ళాడుతోంది. ఒక నిస్పృహ, ఒక దుఃఖం, ఒక మత్యుభీతి చేత సంతకం చేయించింది".

అతని దీనగాథ వింటుంటే డాక్టర్ నోట మాట రాలేదు. సామాజిక విలువలను కరోనా

ధ్వంసం చేసిందని ఏడుపే కాని విలువలు కరోనాకు ముందే ధ్వంసం అయ్యాయి అని అనుకొన్నాడు.

రామేశ్వరరావు కొడుకు కోరినా డాక్టర్ ఫీజు తగ్గింపుకై సిఫారస్ చేయలేదు. ఈ రాక్షసులకు తాను సాయం చేయడం ఎందుకనుకున్నాడు.

కౌంటర్లో బిల్లు చెల్లింపులు కాగానే రామేశ్వర్రావును కొడుకు డిశ్చార్జి చేయించుకుని ప్రైవేట్ వాహనంలో తరలించాడు. తండ్రిని కనీసం అడగనైనా అడగకుండా నేరుగా వద్ధాశ్రమానికే తీసుకొనిపోయాడు.

"నాన్నా! నీకు తెలియందేముంది? కోడలు నిన్ను సరిగా చూస్తూ లేదు. ఇక్కడ వేళకు చక్కగా తిండి సౌకర్యం ఉంది. నలుగురు వద్దులుంటారు. ఇది మంచి నిర్వహణగల ఆశ్రమం. ఇక్కడి ఖర్చులకు నీ పెన్షన్ డబ్బులు సరిపోగా, కొంత మిగులుతుంది. మేమూ మధ్యమధ్యలో చూసి పోతుంటాం. పట్నం శివార్లలో ఉంది గనుక మేం రావడం సులభం. ధైర్యంగా ఉండు" అన్న కొడుకు ఆఖరి వాక్యాలతో రామేశ్వరరావు కరోనానంతర జీవితం ప్రారంభమైంది.

కొడుకు ఇంట్లో వారికి, చుట్టుపక్కల వారికి నాన్న ఇంకా డిశ్చార్జి కాలేదని చెప్పాడు. ఒక్క కోడలికి మాత్రం అనాథాశ్రమంలో చేర్చినట్టు తెలుసు.

దయానిధి శరణాలయంలో రామేశ్వరరావు గార్కి రోజులు బాగానే సాగుతున్నాయి. ఆ వాతావరణానికి అలవాటైంది. ఈ లోగా ఒక సంఘటన జరిగింది. వాళ్లింటి పెంపుడు కుక్క దారి తెలుసుకుని అనాథ శరణాలయానికి వచ్చింది. తనింట్లో ఈ కుక్క రామేశ్వరరావుగార్కి బాగా దగ్గరగా ఉండేది. దాన్ని తానే వీధిలో అనాధగా ఉంటే తెచ్చి పెంచాడు. మమకారంతో ఇక్కడ రామేశ్వరరావు వద్దకు వచ్చి చేరింది. అనాథ శరణాలయంలో కుక్కలను ఉంచకూడదనే నియమం వల్ల కొడుక్కి ఫోన్ చేసి, కుక్కను తీసుకొని పొమ్మని నిర్వాహకులు చెప్పారు. కొడుకు కారులో భార్య, పిల్లలతో వచ్చాడు. కోడలు మాట వరుసకు "ఇక్కడ ఏర్పాట్లు అన్నీ బాగున్నాయా" అంది. "ఇంటికంటే బాగుందని" రామేశ్వరరావు సమాధానమిచ్చాడు. కుక్క పేరిట మనుమలను చూసే అవకాశం తాతకు లభించింది. కుక్కను వారి వెంబడి తీసుకొని వెళ్ళిపొయ్యారు.

రామేశ్వరరావుకు సన్నిహితంగా ఉండే జోగయ్యగారు "కుక్కను తీసుకొని వెళ్లారు కాని, తండ్రిని వదిలి వెళ్తున్నారని" కరుగ్గా కొడుకుముందే అన్నాడు. ఆయనకు ఇలాంటి సంతానమంటే ద్వేషం. ఆయన సంతానమూ అలాంటివారే.

రామేశ్వరరావుగారికి వచ్చే 40 వేల రూపాయల పెన్షన్లో 20 వేలు వద్ధాశ్రమానికి కట్టగా మిగిలినవి మొదట్లో నీవే ఉంచుకోమని అన్నా, భార్య సలహామేరకు పెద్ద టీవీ కొనడాన్కి బ్యాంక్ అప్పులకు బదులు తండ్రినుండే ఊడ్చుకున్నాడు. ఇది అలవాటుగా మారి ప్రతినెలా ఏదో ఖర్చు చెప్పి తండ్రికి మిగిలిన పెన్షన్ కూడా లాగేసేవాడు. ఇంటిపక్కనేగల

ఆంధ్రాబ్యాంక్ బ్రాంచిలో ఉన్న ఆ ఖాతా డబ్బులు తీయడానికి కనీసం ఇంటివరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా రామేశ్వరరావుకు ఆన్లైన్ బ్యాంకింగ్ ఏర్పాటు చేసి, ఆ అవకాశం పోగొట్టాడు. జోగయ్య "నీకు సౌకర్యం అంటూ నువ్వు ఇంటికి రాకుండా ఆన్లైన్ బ్యాంకింగ్ ఏర్పాటు చేసా"డన్నాడు. నిజమే. ఈ సౌకర్యాలు మనుషుల మధ్య దూరాలను పెంచాయి. ఆ బ్రాంచి మేనేజర్ తన కొలీగ్ కొడుకు.బ్రాంచికి వెళ్లినపుడల్లా ప్రేమగా పలకరించేవాడు. త్వరగా పని చేసిపెట్టేవాడు. ఇపుడు అదీ కరువైంది. ఆన్ లైన్ లో జీతం అందరిసొమ్మైంది.

"నీకేమైనా జబ్బు వస్తే నీ కొడుకు వైద్యం చేయించేలా లేడు. ఆశ్రమం నియమాల ప్రకారం కొడుకు వచ్చి సొమ్ము చెల్లించక ఆసుపత్రిలో చేర్చరు. నీ కొడుకు నిన్ను తీసికొనిపోయి, ఏదైనా హాస్పిటల్లో వైద్యం చేయించాలి. అది జరుగుతుందని నేననుకోను. పెన్షన్లోమందులకు పోను ఒక్క రూపాయి మిగుల్తులేదు.

అంతా కొడుకు ప్రతినెలా ఐదవ తేదీకే ఊడుస్తున్నాడు. నీ గతేమిటని" జోగయ్య ప్రశ్నించాడు. ఈ మధ్య జోగయ్య రామేశ్వరావుకి మరీ సన్నిహితుడైనాడు. ఇద్దరు అన్నదమ్ముల్లా ఉన్నారు. జోగయ్య సాహిత్యం బాగా చదివినవాడు. అనేక విషయాలు విప్పి చెప్పడంలో, తర్కంలో, కథాకథనంలో దిట్ట.

వీరిద్దరినీ ఆశ్రమంలో రామయ్య–జోగయ్య జంట అని పిలువసాగారు.

"నిజమే. దీని గురించి ఆలోచించలేదు" అన్నాడు రామయ్య.

"సాఫీగా సాగితే జీవితం కాదు. మలుపులు తిప్పేదే జీవితం. ఇక మన జీవితాల్లో ఎక్కువ మలుపులు

లేవు. "తీవ్ర అనారోగ్యం, మరణం" రెండే మలుపులు అన్నాడు జోగయ్య.

"మరణం తరువాత మనకక్కరలేదు. ఆలోపు జీవితానికి వద్ధాప్యంలో తీవ్ర అనారోగ్యమే ఓ గుదిబండ, ఏం చేద్దాం?" అన్నాడు రామయ్యగా మారిన రామేశ్వరరావు. రామయ్యకు లంగ్ కాన్సర్. సూచనలను విజిట్కు వచ్చిన డాక్టర్లు అప్పటికే సూచించారు. ఆ విషయం జోగయ్యకు తెలుసు.

"నీ ఇంటి రిజిస్ట్రేషన్ కాగితాలు ఎక్కడ" అని అడిగాడు సాలోచనగా జోగయ్య.

"అవి ఇంట్లోనే నా వద్ద ఫైల్లో భద్రంగా ఉన్నాయి. ఐనా కొడుక్కి ఇల్లు రాసిచ్చానుగా" అన్నాడు.

"ఫర్వాలేదు. ఈసారి వచ్చే ఆదివారం మీ అబ్బాయి నిన్ను ఇంటికి తీసుకొని వెళ్తానన్నాడుగా మనుమరాలి బర్త్ డేకి. అపుడు తీసుకురా" అన్నాడు జోగయ్య.

"అది తెస్తే వాడికి అనుమానం వేస్తుంది ఎలా?" అన్నాడు.

"నీకు పుస్తకాలు చదువుకోవడానికి కావాలని చెప్పి, కొన్ని పుస్తకాలను అట్టపెట్టెలో సర్ది, ఈ కాగితాలు పుస్తకాలతోబాటు పెట్టుకొని రా" అన్నాడు జోగయ్య.

వచ్చే ఆదివారం రానే వచ్చింది. అనుకోకుండా రామేశ్వరరావుతో జోగయ్య కూడా వారింటికి వెళ్ళాడు. ఫంక్షన్ అయ్యాక ఇద్దరూ వస్తూ ఇంటి కాగితాలు, పుస్తకాల మధ్య

పెట్టిన అట్టపెట్టెతో తెచ్చారు.

"ఏం చేద్దాం ఇపుడు" అడిగాడు తెల్లవారి రోజు రామయ్య.

"ఈ ఆస్తి నీది. కాగితాలు నీ వద్ద ఉన్నాయంటే, ఆస్తి మార్పిడి జరుగలేదు. ఇవి బ్యాంక్లో మార్టిగేజ్ చేసి అప్పు తెచ్చుకో. అది నీ ఖాతాలో వెయ్యి. ఆంధ్రాబ్యాంక్ ఖాతాను ఆన్లైన్ నుండి తీసివేసి ఆఫ్లైన్ చెయ్యి. మార్టిగేజ్ డబ్బు అందులో వేసుకో. ఆ డబ్బు నీవు వెళ్ళితేనే ఇస్తారు. అలా చేద్దాం".

"నాకు ఈ వయసులో అప్పా? ఎలా సాధ్యం?" అడిగాడు రామయ్య.

"అలాగే ఇస్తారు. పైగా నువు డబ్బు కట్టనక్కరలేదు. అప్పు తీరిస్తే ఇల్లు నీది, తీర్చకుంటే ఇల్లు బ్యాంక్.

ఇది వద్ధులకో వరం లాంటిది. ఆంధ్రాబ్యాంక్ నుండి మేనేజర్ నీ కొలీగ్ అబ్బాయే కదా! అడుగు" అన్నాడు.

ఇద్దరు ఆటోలో రామయ్య ఇంటి వీధిలోని ఆంధ్రాబ్యాంక్కు వెళ్ళినారు. మేనేజర్ వద్ధులకిచ్చే ఇంటిపై మార్టిగేజ్ (కుదువ పెట్టి ఇచ్చే) అప్పుకై సుముఖత వ్యక్తం చేసాడు. కాగితాలు జిరాక్స్ తీసికొన్నాడు.

.....

రామయ్యకు ఇంకా తాను తప్పు చేస్తున్నానేమో అన్న భావన వదలలేదు. కొడుక్కి రాసిచ్చి మళ్లీ ఆ ఇంటి పైనే అప్పు తీసుకోవడం ఎలా అని. ఆ విషయమే జోగయ్యతో చెప్పాడు.

"నీ అత్యవసర చికిత్స కోసం వద్ధాశ్రమ నిర్వాహకులకు ఓ యాభై వేలు కట్టమని నీవు నీ కుమారుణ్ణి అడుగు. నీకు లంగ్ కాన్సర్ అని కొడుక్కు తెల్సిందిగా. ఏం చెప్తాడో విను. ఆపై నిర్ణయించుకో". కాస్త కటువుగానే జోగయ్య సలహా ఇచ్చాడు. రామయ్య జోగయ్యవైపు బేలగా చూసాడు.

తరువాత ఓ నెలకు కొడుకు రావడం మానేసి, ఫోన్ మీదే "ఎలా ఉన్నావు నాన్నా!" అని అడిగాడు. అప్పటికి విజిటింగ్ డాక్టర్ గారు రామేశ్వరరావుకు లంగ్ కాన్సర్ ట్రీట్మెంట్ గూర్చి తొందరగా నిర్ణయం తీసికొమ్మన్నాడు. ఆ విషయం చెప్పాడు. "నాన్నా! ప్రస్తుతం డబ్బు లేదు. మొన్నే రేట్లు పెరుగుతున్నాయని గోల్డు కొన్నాం. ఇంకో రెట్టెల్లాగి చూద్దాం. ఈసారి నీ పెన్షన్ వచ్చిందా? స్కూల్ ఫీజు కట్టాలి. లాగిన్ ఐతే బ్యాంక్ వెబ్సైట్లో ఏదో ప్రాబ్లం చూపిస్తోంది" అన్నాడు. ఆన్లైన్ బ్యాంకింగ్ సౌకర్యం తాను తీసివేయమని

మేనేజర్తో చెప్పింది కొడుక్కు చెప్పలేదు. మేనేజర్ ఆ సౌకర్యం తీసివేసాడేమో అని అనుకున్నాడు. రామేశ్వరరావు మనసు పూర్తిగా విరిగింది. డాక్టర్ విజిట్లోగా జోగయ్యతో బ్యాంక్కి వెళ్ళి లోన్ తీసుకున్నాడు. ఇంటిపై మార్టిగేజ్ అప్పు పెట్టి, కాగితాలు అన్నీ బ్యాంకు సరెండర్ చేసాడు.

ఇపుడు రామేశ్వర్ మనసులో ఎవరూలేరు. తప్పు భావనా లేదు. నా ఆస్తి నా ఆరోగ్యం

కోసం అనే భావన కలిగింది. ఇల్లు తాకట్టు కూడా కొడుక్కు చెప్పలేదు. రిజిస్ట్రేషన్ వరకు తెలుస్తుంది లే అనుకున్నాడు. ఇపుడు వద్ధాశ్రమమే సర్వం ఐంది. జోగయ్యకు మరీ ఆత్మీయుడైనాడు. డాక్టర్తో డబ్బు సిద్ధమని చెప్పాడు.

కొడుక్కు ఆన్లైన్ బ్యాంకింగ్ ఆగిపోయినట్టు, తండ్రి ఆపాదన్న సంగతి తెలిసిపోయింది. పెన్షన్లో మిగులు ఇవ్వబోదని అర్థం అయింది. ఫోన్ చేస్తే లంగ్ కాన్సర్కు డబ్బు అడుగుతాడని భయం వేసింది.

ఫోన్లు ఆగిపొయ్యాయి.

రామేశ్వరరావు కాన్సర్ హాస్పిట్లో చేరాడు. జోగయ్యకు ఏదో జబ్బు వచ్చి గాంధీ హాస్పిటల్లో చేరి ఒంటరిగా మిగిలాడు. ఇద్దరికి రెండే దారులున్నాయి. బతికితే వద్ధాశ్రమం, బతకకుంటే ఈశ్వరుని నిలయం.

కరోనాతో భూమిపై ప్రజలకు బుద్ధి వస్తుందనుకొన్న దేవునికి ఏమీ తోచలేదు. మనుషులు ఎప్పటిలాగే బతికేస్తున్నారు.

చైనా వాడు దురాక్రమణల తర తేతి బతికేస్తున్నా తండ్రి ప్రణాళికల్లో, అమెరికావాడు ఎన్నికల్లో, ప్రపంచం ఎవరి బాధలో వాళ్లున్నారు.

భారత్లో మంత్రులు, అధికారులు, కరోనా విలయం పట్ల హదయం కలచి వేస్తోందని, కన్నీరు తెప్పిస్తోందని, ప్రజాసేవలో నిమగ్నమైనట్లు పత్రికా ప్రకటనలు గుప్పిస్తున్నారు. కర్మ సిద్ధాంతానికి మంచి ప్రచారం వచ్చింది. ప్రజలు అర్ధ ముఖాలతో, అర్ధ జీవితాలతో భయం భయంగా బతుకీడుస్తున్నారు. భయం లేనివారు హాయిగా బతికేస్తున్నారు. కరోనా చిరునవ్వుతో భూగోళమంతా చిందులు వేస్తూనే ఉంది.

**కవిగా, చరిత్రకారుడిగా, వ్యాకరణవేత్తగా, విమర్శకుడిగా, నాటకరంగ కళాకారుడిగా సంగనభట్ల నర్సయ్య సుపరిచితులు. ప్రస్తుతం హైదరాబాద్లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో విజిటింగ్ ప్రొఫెసర్గా పనిచేస్తున్నారు. ఇంతకుముందు సంస్కృత డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్గా బాధ్యతలు నిర్వర్తించారు. ఉద్యోగ విరమణ తర్వాత.. తెలుగు అకాడమీలో సబ్జెక్ట్ ఎక్స్పర్ట్గా సేవలు అందించారు. రామోజీ ఫౌండేషన్ కోసం డిక్షనరీ ప్రాజెక్ట్లో కన్సల్టెంట్గా పనిచేశారు. నాటకాలు, అనువాదాలు, జీవిత చరిత్రలు, తెలంగాణ చరిత్రకు సంబంధించిన 20కి పైగా పుస్తకాలను వెలువరించారు. వివిధ ప్రాంతీయ, జాతీయ పత్రికలలో 400కు పైగా వ్యాసాలు రాశారు. నాటక, సాహిత్య రంగాల్లో కృషికి తెలంగాణ ప్రభుత్వం, తెలుగు విశ్వవిద్యాలయం, సీపీ బ్రౌన్ అకాడమీ, రంజనీ కుందుర్తి, నమస్తే తెలంగాణ దినపత్రిక.. మొదలైన సంస్థల నుంచి అనేక అవార్డులు, బహుమానాలు అందుకున్నారు.**